రాజేశ్వరరావు, చండ్ర

పార్టీ నిర్మాణం

బెజవాడ, 1944

Record no. 78

Rājēśvararāvu, Caṇḍra

Pārṭī nirmāṇaṃ

Bejavāḍa, 1944

Record no. 78

Bibliographic Record Target

రాజేశ్వరరావు, చండ్ర.
పార్టీ నిర్మాణం / రచయిత చండ్ర రాజేశ్వరరావు. - బెజవాడ : ప్రజాశక్తి కార్యాలయం, 1944.
various pagination ; 16 cm.
Record no. 78

Rājēśvararāvu, Caṇḍra.
Pārṭī nirmāṇaṃ / racayita Caṇḍra Rājēśvararāvu. - Bejavāḍa : Prajāśakti Kāryālayaṃ, 1944.
various pagination ; 16 cm.
Record no. 78

పార్టీనిర్మాణం

కామ్రేడ్

చండ్ర రాజేశ్వరరావు

ప్రజాశక్తి కార్యాలయం
గవర్నర్‌పేట :: బెజవాడ

పార్టీ నిర్మాణం

●

రచయిత
చంద్ర రాజేశ్వరరావు

ప్రజాశక్తి కార్యాలయం
:: బెజవాడ ::

ప్రజాశక్తి ప్రచురణ నెం. 53
మార్చి 1944

రెండు రూపాయలు

ప్రజాశక్తి ప్రెస్
బెజవాడ

విషయసూచిక

ప్రథమ భాగం

ద్వితీయ భాగం

తృతీయ భాగం

1. ప్రజా పార్టీ

"జాతీయరక్షణకోసం జాతీయైక్యతను నిర్మించి, దేశరక్షణను కొనసాగించే జాతీయప్రభుత్వాన్ని సంపాదించాలి; అందుకు కమ్యూనిస్టుపార్టీని ప్రజాపార్టీగా నిర్మించాలి"

పార్టీ నేటి జాతీయ అంతర్జాతీయ పరిస్థితుల్లో. నిర్వహించాలిసిన ప్రధాన రాజకీయ నిర్మాణ కర్తవ్యాలను ఈ ఒక్క వాక్యంలో కామ్రేడ్ జోషీ పార్టీ కాంగ్రెసు రిపోర్టులో ఇమిడ్చాడు. నేడు మన మాతృదేశాన్ని ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించి, జపాను ఫేసిస్టు దుండగీండ్రు మన పవిత్రభూమిమీద అడుగు పెట్టకుండా చెయ్యాలంటే, జాతీయ ఐక్యతను నిర్మించి కాంగ్రెసు ముస్లిమ్‌లీగు మొదలైన అన్నిప్రధాన రాజకీయ పక్షాలతో గూడిన జాతీయ ప్రభుత్వాన్ని సాధించాలి, ఇటువంటి బ్రహ్మాండమైన జాతీయైక్యతను సాధించాలంటే, నేడు మనం నిర్వహించాలిసిన నిర్మాణ కర్తవ్యం కమ్యూనిస్టుపార్టీని కాంగ్రెసు-ముస్లిమ్‌లీగులను ఐక్యపరచే శక్తిగల విశాలమైన ప్రజాపలుకుబడిగల పార్టీనిగా చేయడమే; ఇదే పై నినాదం యొక్క సారాంశం.

నేటి పరిస్థితి :

రెడ్ ఆర్మీ నాజీసేనలను చుట్టుముట్టి హతమారుస్తోంది, కొద్ది కాలంలోనే నాజీ సేనలను సోవియటు భూభాగంనుండి తరిమివేయడం జరుగుతుంది. బ్రిటను అమెరికాలు పశ్చిమ యూరపులో రెండవరంగం ఆరంభించితే, కొద్దినెలలలోనే నాజీజర్మనీనడుం విరగ గొట్టడానికి వీలవుతుంది. కాని మిత్రరాజ్యాలు రెండవరంగం ఆరంభించడానికి జాగుజేస్తున్నాయి. దీనికి మారుగా ఇటలీలో కొద్ది జర్మనుసైన్యాలతో తీరికగా పోరాడుతున్నాయి. దీనికి కారణం హిట్లరు ఆక్రమిత యూరపులో (ఫ్రాన్సు, నార్వే,డెన్మార్కు, యుగోస్లావియా గ్రీసు) కమ్యూనిస్టు పార్టీల నాయకత్వం క్రింద వివిధ ప్రజాస్వామ్యపక్షాలతోగూడిన బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మింపబడటమే. బ్రిటను అమెరికా ప్రభుత్వాలు ఈ ప్రజా ఉద్యమాలంటే భయపడుతున్నాయి. బ్రిటనులో ప్రస్తుతం ఉన్న తమ అదుపు ఆజ్ఞలలో ఉండే నామ మాత్రమైన ప్రభుత్వాలకు పెత్తనం కట్టబెట్టేది ఎలాగాఅని సందిగ్ధావస్థలోపడి ఉన్నాయి, అయినప్పటికీ మిత్ర దేశాలలోని ప్రజాశక్తులు రెండవ రంగం కోసం ఆందోళన నానాటికి తీవ్ర పరుస్తున్నాయి.

జర్మనీ, జపాను ఫేసిస్టు ప్రభుత్వాలు ప్రపంచాధిపత్యం సంపాదించాలనే తమదుష్టాశయాన్ని వదలుకోవలసివచ్చింది, అంతేగాక తమఉనికికే ఇప్పుడు ప్రమాదం వచ్చింది.

అందువల్ల ఈ యుద్ధాన్ని ఇంకాపొడిగించి, సోవియటు యూనియను బ్రిటను అమెరికాల మధ్య చీలికలు కల్గించి బ్రిటను అమెరికాలతో రాజీపడాలని చూస్తున్నాయి. ఈయుద్ధాన్ని సోవియటుకు వ్యతిరేక యుద్ధంగా మార్చ టానికి వీలుగా ఉంటుందేమో అని గూడ ఆశిస్తున్నాయి. కానిమిత్రరాజ్యప్రజలు ఫేసిస్టుల ఈ కుయుక్తులను సాగనీయరు.

మనదేశంలో ఆహారసమస్య చాలక్లిష్టస్థితికి వచ్చింది. బెంగాలు, మలబారు, ఒరిస్సాలలో ప్రజలు తిండికిమాడి రోజూవేలమంది చనిపోతున్నారు. బెంగాలులో వారానికి 10వేల మందిచనిపోతున్నారని యూరపియను పత్రికఅయిన స్టేట్సుమను పత్రికఅంచనా. అక్కడ కుటుంబాలు విచ్ఛిన్నమయిపోయి సామాజిక జీవితమేనాశనమయిపోతుంది. దీనికితోడు కలరా, టైఫాయిడు, మశూచికంమొదలయిన అంటువ్యాధులు ఎన్నోప్రాణాలను బలిగొంటున్నాయి. కలరావల్ల మలబారులో 25000 మంది చనిపోయారు. మిగతా ప్రాంతాలలో గూడ తినుబండారాల ధరలు నానాటికి పెరిగి పోతున్నవి. ఈ ఆహార కరువుకు మూలకారకులైన తిండి దొంగల నరికట్టకపోతే, భారత దేశమంతా బెంగాలు, మలబారులవలె అయిపోతాయనడానికి ఏమీ సందేహంలేదు. ప్రభుత్వం జీతపు రాళ్ళకోసం పనిజేసే తననిరంకుశోద్యోగులద్వారా, తిండి దొంగల దురాశలను అరికట్టలేకుండాఉంది. వారి దేశవినాశనకర చర్యలను అరికట్టుటకు ప్రజలసహకారం తీసుకోడానికి భయపడుతోంది. పంచమాంగదళంవాళ్ళు (ఫార్వర్డుబ్లాకు. కాంగ్రెసు సోషలిస్టులు) ప్రజలను లూటీలకు, అరాజక చర్యలకు పురిగొల్ప ప్రయత్నిస్తున్నారు. సోవియటు రంగంలో జర్మనీ అపజయాలతో ప్రపంచాధిపత్యం సంపాదించాలనే అక్షరాజ్యాల ప్లాను భగ్నమయింది. అందువల్ల జపాను భారత దేశాన్నంతనూ ఆక్రమించుకునే అవకాశం పోయింది. అయినా బర్మా, మలయాల మీద తిరుగుదాడిని భగ్నం చేయడానికి, జపాను సముద్ర తీరప్రాంతాల్లో బాంబులవేసి భీభత్సం చేయడం, తాత్కాలికంగా సైన్యాలను దింపడం, మొదలైన పనులను చేస్తుంది. ఇందుకు నేటి మనదేశ పరిస్థితి చాల అనుకూలంగా ఉంది.

భారతదేశానికి జాతీయ ప్రభుత్వాన్ని ఇవ్వడాన్నిగూర్చి ప్రపంచ ప్రజలు తీవ్రాందోళనచేస్తున్నారు. బ్రిటిషు ట్రేడుయూనియను కాంగ్రెసు (70 లక్షల సభ్యత్వం) ఆస్ట్రేలియను ట్రేడుయూనియను కాంగ్రెసు, కాంగ్రెసు నాయకులను విడుదలచేయమనీ, జాతీయ ప్రభుత్వం ఇవ్వమనీ తీర్మానాలు ప్యాసుచేసినాయి. అమెరికాలో తీవ్రాందోళన జరుగుతోంది. అంతర్జాతీయ పరిస్థితులు ఇంతఅనుకూలంగా ఉన్నప్పటికీ, భారతజాతీయనాయకులు కదలడంలేదు. జైళ్ళబయటనున్న కాంగ్రెసువాదులు విధ్వంసకార్యాలలో నమ్మిక లేకపోయినప్పటికీ, వాటిని ప్రోత్సహించే పంచమాంగదళం వాళ్ళచర్యలను అరికట్టడానికి ముందుకు రావడంలేదు; ఆహారసమస్యను పరిష్కరించి ప్రజలను కరువునుండి కాపాడాలనే ఆవేదన ఉన్నప్పటికీ, ఏమీ చేయలేమని నిస్పృహచెంది మూలగూర్చున్నారు. ముస్లిములీగుయొక్క న్యాయమైన కోర్కెఅయిన స్వయంనిర్ణయహక్కును అంగీకరించి

ముస్లిములీగు మంత్రివర్గాలతో సహకారంచేస్తూ, ముస్లిములీగు కాంగ్రెసు నాయకుల విడుదలకోసం ముందుకు వచ్చేటట్లు చేయడంలేదు. హిందూమహాసభ ముస్లిములీగు మంత్రివర్గాలను వ్యతిరేకించడమే పనిగా పెట్టుకొంది. వానిని రద్దుచేసి, అడ్వయిజర్ల నిరంకుశ ప్రభుత్వాలను వానిస్థానే ఏర్పరచమని కోరుతోంది. గాంధిజీ స్వయంనిర్ణయ సూత్రాన్ని అంగీకరించడం, ఆగస్టుతీర్మానాన్ని ఉపసంహరించడంచేస్తేనేగానిరాజీకుదరదని ముస్లిములీగు నాయకత్వం అంటోంది. పార్టీ పంథావైపుకు కొద్దిమంది కాంగ్రెసువాదులు ముస్లిములీగు ఛోటానాయకులు వస్తున్నారు. కాని, దేశాన్ని ఎదొర్కొన్న కరువుసమస్య పరిష్కారం, కాంగ్రెసు - ముస్లిములీగు దేశభక్తులలో అత్యధిక సంఖ్యాకులను సమీకరిస్తేనేగాని, జరుగదు. కాంగ్రెసు ముస్లిములీగు మొదలైన ముఖ్య ప్రజాసంస్థలు ఇటువంటి ‘ నెగెటివు ’ పంథాను అవలంబిస్తున్నాయి: మనపార్టీ ఒక్కటే ‘ పోజిటివు ’ (ఆచరణసాధ్యమైన) పంథాను చూపిస్తోంది. కాంగ్రెసు ముస్లిములీగులను ఐక్యపరచి జాతీయైక్యత సాధించే బాధ్యత కమ్యూనిస్టుపార్టీమీద పడింది. మనపార్టీ ఇప్పుడు చాల బలపడింది. భారతదేశంలో మూడవపార్టీగా ముందుకు వచ్చింది. అయినప్పటికీ తనమీద చరిత్రఉంచిన ఈబాధ్యతను నెరవేర్చడానికి అవుసరమైనంత శక్తివంతంగాలేదు. ఆబాధ్యత నెరవేర్చాలంటే విశాలమైన ప్రజాపలుకుబడిగల ప్రజాపార్టీగా తయారుగావాలి.

[గమనిక :—ప్రస్తుతం జాతీయ అంతర్జాతీయ పరిస్థితులు త్వరత్వరగా మారిపోతున్నాయి. కనుక ఇప్పటి పరిస్థితుల ననుసరించి పైన వ్రాయబడినది పాతబడి పోవచ్చు. కనుక జాతీయ అంతర్జాతీయ పరిస్థితుల్లో వచ్చిన మార్పులను ఎప్పటికప్పుడు పైజెప్పిన దానికి చేర్చాలి.]

ప్రజాపార్టీ అంటే ఏమిటి ?

మనపార్టీ భారతదేశంలో మూడవపార్టీగా ఉన్నా యింకనూ ప్రజాపార్టీగాదు. మలబారు, బెంగాలులో కొన్ని జిల్లాలు, ఆంధ్రలో కొన్ని ఫిర్కాలు, గ్రామాల్లో మాత్రమే ప్రజలందరికీ పార్టీనాయకత్వం వహిస్తోంది. సంయుక్తరాష్ట్రాలు, బొంబాయిరాజధాని, గుజరాతు, పంజాబు, బీహారు మొదలైన రాజకీయంగా అభివృద్ధిచెందిన రాష్ట్రాలలో పార్టీ పలుకుబడి చాల తక్కువగాఉంది. దేశం మొత్తంమీద చూస్తే మహమ్మదీయులలో పార్టీకి పలుకుబడి తక్కువ. అందువలననే ముస్లిములీగు ఇంతవరకూ గాంధీజీ విడుదలకోసం ముందుకు వచ్చేటట్లు చేయలేకపోయాం.

ఇక ఆంధ్రరాష్ట్రంలో పార్టీకి కృష్ణా, గుంటూరుజిల్లాలలో పార్టీ ఒకప్రధానరాజకీయశక్తి అయింది. కాని రాజకీయంగా అభివృద్ధి అయిన పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలలో పార్టీ యింకనూ ఒక ప్రధానరాజకీయశక్తిగా గూడ గుర్తింపబడలేదు. నెల్లూరు, వైజాగ్, రాయలసీమ, నైజాములలో ఇంకా పార్టీ చాల బలహీనంగా ఉంది. పార్టీ ఒక

ప్రధానశక్తిగా గుర్తింపబడిన కృష్ణాజిల్లాలో సైతం బందరు, కైకలూరు తాలూకాలలో పార్టీ చాల బలహీనంగాఉంది. ఈ తాలూకాలలో రైతులు, కాపుల నాయకుల పలుకుబడిక్రిందనే ఉన్నారు. గుంటూరుజిల్లాలో మాగాణి తాలూకాలలో పార్టీకి పలుకుబడి ఉందిగాని, పల్నాడు, వినుకొండ, నర్సారావుపేట మొదలైన వెనుకబడివున్న మెట్ట తాలూకాలలో పార్టీకి అంతగా పలుకుబడిలేదు. ఆంధ్రరాష్ట్రం మొత్తంమీద చూస్తే పార్టీకి రైతుల్లో యెక్కువగా పలుకుబడివుంది. గ్రామస్థులలో 100 కి 50 మందిగా ఉన్న వ్యవసాయ కూలీలలో దృఢమైన పలుకుబడి లేదు. ఆ వర్గంనుంచి పార్టీసభ్యులు చాల తక్కువ మంది ఉన్నారు. పట్టణాలలో కార్మికులలోనే పార్టీకి పలుకుబడివుంది. ఆంధ్ర ఎక్కువ పారిశ్రామికంగా అభివృద్ధి కాకపోవడం వలన. పట్టణాలలో కార్మికప్రభావం తక్కువ: మధ్యతరగతివాళ్ళ ప్రభావమే హెచ్చు. అందువల్లపట్టణమధ్యతరగతిలో దాదాపుమనకుపలుకుబడి లేదనే చెప్పవచ్చును. ఈ పైకారణాలవల్ల ఆంధ్రరాష్ట్రంలోనూ భారతదేశం మొత్తంమీద పార్టీ నెదుర్కొన్న ఆహారసమస్యలను కాంగ్రెసులీగుఐక్యత, సాధించి ప్రతిష్టంభన నంతమొందించుట మొదలైనవానినిఇంకనూ, పార్టీపరిష్కరించలేకపోయింది. పార్టీ దేశాన్నెదుర్కొన్న సమస్యలను పరిష్కరించాలంటే. అన్ని రాష్ట్రాల్లోనూ అన్ని జిల్లాలలోనూ, అన్ని తాలూకాలలోనూ, అన్ని గ్రామాలలోనూ ప్రజలపై పలుకుబడిని సంపాదించాలి. ప్రతి ప్రాంతంలోనూ అన్నివర్గాల ప్రజలల్లోనూ జొరబడాలి. ప్రతి వర్గంలోనూ అన్ని కులాలకు, మతాలకు చెందినవారిలో పలుకుబడిని సంపాదించాలి: ప్రజలందరినీ రైతు-కూలీ, కార్మిక, విద్యార్థి మొదలయిన సంఘాలలోకి ఆర్గనైజుచెయ్యాలి. అన్నిసంఘాలలో చురుకుగా పనిచేసే దేశసేవకులంతా పార్టీలో చేర్చుకోబడాలి. అన్ని కులాలు, మతాలకు చెందినవారంతా గూడ పార్టీలో ఉండాలి. ఉదాహరణకు ఒక గ్రామంలో పార్టీ ప్రజాపార్టీగా అయిందంటే అర్థం, ప్రజలంతా రైతుకూలీ, యువజన, మహిళా, బాలసంఘాల్లో చేరారన్నమాట. పార్టీలో రైతులు, కూలీలు, యువజనులు, మహిళలనుండి చురుకుగా పనిజేసే ప్రజాసేవకులంతా పార్టీలో ఉన్నారన్నమాట. ప్రతికులానికి చెందినవారు పార్టీలో ఉన్నారన్నమాట. ఇటువంటప్పుడు పార్టీ గ్రామంలో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించ గలుగుతుంది. భారతదేశం మొత్తంమీద పార్టీ పలుకుబడి ఎక్కువ అవుతూవున్నకొలదీ కాంగ్రెసు-లీగులను దగ్గరకు తీసుకురాగలుగుతుంది.

ఈవిధంగా పార్టీ అన్ని ప్రాంతాల్లోకి విస్తరించగల శక్తిఉంది. మనపార్టీకే దేశ సమస్యలను పరిష్కరించగల రాజకీయపంథాఉంది. మనపార్టీ 22 వేలమంది సుశిక్షితులైన సభ్యులను గలిగిఉంది.

పార్టీ అన్ని ప్రాంతాలల్లోను వర్గాలు కులాలు మతాల ప్రజల్లోకివ్యాపించి, సంఖ్యలో అనేక రెట్లు అవడమేగాక, ప్రతిపార్టీసభ్యుడు తనను స్థానికంగా ఎదుర్కొన్న సమస్యలను మార్క్సిస్టుదృష్టితో పరిశీలించి పరిష్కరించగల రాజకీయ సిద్ధాంత పరిజ్ఞానం కల్గిఉండాలి.

ఇందుకు మార్క్సిజంయొక్క సూత్రాలను, ప్రపంచ రాజకీయాలనుగూర్చిన పరిజ్ఞానం కల్గివుండాలి. పార్టీ సభ్యులంతా కష్టపడి పనిచేయడంమాత్రం చాలదు. వారంతా పార్టీ పద్ధతులలో పనిచెయ్యాలి. అంటే ప్రతిపార్టీ సభ్యుడు ఏదోయొక పార్టీయూనిటులో (సెల్లు, కమిటీ, ఫ్రాక్షను)ఉండాలి. ప్రతి విషయాన్ని పార్టీయూనిటులో సమిష్టిగాచర్చించాలి. పార్టీ యూనిటు శక్తినిబట్టి పని తీసుకోవాలి. అలాగే ప్రతి సభ్యునికి శక్తినిబట్టి పని ఇయ్యాలి. పార్టీ చేసిన ఈ నిర్ణయాలను సమిష్టిగా అమలు జరుపాలి. మరల పార్టీ యూనిటు సమావేశంలో చేసిన పనినిగూర్చి పునర్విమర్శన చెయ్యాలి. లోటుపాట్లను చర్చించాలి. ముందు కార్యక్రమం వేసుకోవాలి. ఈవిధంగా ప్రతియూనిటు, మొత్తం పార్టీ, ప్లానుప్రకారం పని చేస్తేనేగాని, పార్టీ తనమీదఉన్న బాధ్యతలను నెరవేర్చజాలదు.

పార్టీ నాయకత్వం (కమిటీలు, ఫ్రాక్షనులు, సెల్లుకార్యదర్శులు) ముందురాబోయే విషయాలను, సూచనలను బట్టి గ్రహించి, పార్టీ సభ్యులకు చక్కని కార్యక్రమం ఇచ్చి నడపగలిగినశక్తి ఉండాలి. పార్టీసభ్యులను టీముగా ముందుకు తీసుకపోగలిగిన ప్రాక్టికలు పరిజ్ఞానం ఉండాలి.

పార్టీ సభ్యులు తమను స్థానికంగా ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించగల రాజకీయ పరిజ్ఞానం కలిగి పార్టీపద్ధతుల్లో పనిచేస్తున్నపుడు, పార్టీ నాయకత్వం పరిస్థితుల కనుగుణ్యమైన కార్యక్రమం ఇచ్చినడుపుతున్నపుడు, పార్టీ తనశక్తినంతను అవుసరమైన సమస్యమీద కేంద్రీకరించ గలుగుతుంది. ఆవిధంగా సమస్యలను పరిష్కరించ గలుగుతుంది.

2. కమ్యూనిస్టు పార్టీ ప్రత్యేక లక్షణాలు

కార్మికవర్గపార్టీ

ప్రస్తుతం లోపభూయిష్టంగాఉన్న పెట్టుబడిదారీ సమాజం స్థానే కమ్యూనిస్టు సమాజాన్ని తీసుకురావడం కార్మిక వర్గంయొక్క ఆశయం. వ్యక్తిగత ఆస్థి విధానంమీద ఆధారపడియున్న పెట్టుబడిదారీ విధానం, నానాటికీ ఎక్కువఅవుతున్న నిరుద్యోగం దాని దుష్ఫలితాలను అరికట్టలేకపోయింది. దోపిడీ ద్వారా (అదనపు విలువ) నిరంతరం పెట్టుబడిని అభివృద్ధిచేసే విధానాన్ని పెట్టుబడిదారీ విధానం కొనసాగించలేక పోయింది. ఒకరి వద్ద నుండి మరొకరు వలసరాజ్యాలను లాక్కోడానికి 1939 లో యుద్ధానికిదిగారు. తర్వాత 1941 లో ఫాసిస్టు పక్షం ప్రపంచాధిపత్యం కోసం సోవియటు యూనియను మీద దాడి సాగించింది.

నిరుద్యోగం, దానికిసంబంధించిన దుష్ఫలితాలు, యుద్ధాలు, పెట్టుబడిదార్లు తమవ్యక్తిగత ఆస్థి విధానాన్ని కాపాడుకోవడం వల్లనే వస్తున్నాయి. ఆధునిక యంత్రాలమీద వేలమంది సమిష్టిగా పనిజేస్తూఉన్న, వ్యక్తి ఆస్థిలేని, కార్మికవర్గమే వ్యక్తిగతఆస్థి విధానాన్ని రద్దుచేయగలుగుతుంది. దానిస్థానే జీవితావుసరాలను ఉత్పత్తిచేసేసాధనాల (భూమి, ఫ్యాక్టరీలు వగైరా) మీద వ్యక్తిపెత్తనం తీసివేసి, సమాజపరంచేసి ప్రజలందరిలాభంకోసం జీవితావుసరాల ఉత్పత్తిని సాగించుతుంది. యంత్రాలను ఇంకనూ అభివృద్ధిచేస్తూ, మనుష్యుల పనిని తేలికచేస్తుంది. కమ్యూనిజం కార్మిక వర్గం యొక్క సహజమైన విధానం. రైతులు, ఇతరచేతి పనులువారుగూడ, వ్యక్తిఆస్థిఉండటం, సమిష్టిగాపనిచేయాలిసిన అవుసరం లేకపోవుటచే, కమ్యూనిజాన్ని సహజంగా అంగీకరించరు. పెట్టుబడిదార్లను, పెద్ద భూస్వాములను తీసివేసి, వారి ఆస్థిని చిన్నచిన్న భాగాలుగా పంచుకోవడమే వీరి సహజ ఉద్దేశం. కాని వీరిని కమ్యూనిజం వైపుకు మరల్చవచ్చు. సోవియటు యూనియనులో కార్మిక వర్గం రైతులను సమిష్టి వ్యవసాయకులుగా మార్చగలిగింది.

ఇప్పుడున్న వర్గాలన్నిటిలోకి ఉత్పత్తిసాధనాలను అభివృద్ధిజేసి, ప్రపంచాన్ని కమ్యూనిజంవైపుకు తీసుకు వెళ్ళడానికి కృషిచేసేది కార్మికవర్గమే. అట్టి కార్మికవర్గం యొక్క పార్టీయే కమ్యూనిస్టుపార్టీ. కమ్యూనిస్టుపార్టీ, కామ్రేడ్ స్టాలిన్ చెప్పినట్లు, కార్మిక వర్గంయొక్క పురోగామియైన సుశిక్షితమైనదళం. అంటే ఈ పార్టీలోకి కార్మికులొక్కరే చేరడానికి అర్హులనిగాదు. కమ్యూనిజాన్ని కార్మికవర్గ దృక్పధాన్ని, అలవాట్లను స్వీకరించి కార్మికవర్గాశయానికి కృషిచేస్తున్నవారెవరైనా ఏవర్గానికి చెందినా పార్టీలో చేరవచ్చు. కాని

పెట్టుబడిదారీ, జమీందారీ వర్గాలవారు వారి వర్గస్వభావాన్ని వదలుకొని, కార్మికవర్గ స్వభావాన్ని స్వీకరించడం సులభమైన పనిగాదు.

కమ్యూనిస్టుపార్టీ కార్మికవర్గపార్టీ అన్నంతమాత్రాన మిగతా ప్రజలమేలుకు పాటుబడదనిగాదు. కష్టజీవులైన రైతులు కూలీలు ఇతర మధ్యతరగతివారందరి కష్టాల నివృత్తికోసం పాటుబడుతూ, సర్వమానవ కల్యాణంగాఉండే కమ్యూనిస్టు సమాజం వైపుకు తీసుకువెళుతుంది. సోవియటు యూనియనే ఇందుకు తార్కాణం. ఇప్పుడు ఫాసిస్టు రాక్షసికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజాయుద్ధంలో ప్రపంచ ప్రజలందరికీ నాయకత్వంవహించి నడుపుతోంది.

కమ్యూనిస్టుపార్టీ కార్మికవర్గ నాయకత్వంక్రిందకు కష్టజీవులైన ప్రజాసామాన్యాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తుంది. అంటే కార్మికవర్గంయొక్కపాలసీ, ఎత్తుగడలు మిగతా ప్రజాసామాన్యం స్వీకరించేలా చేస్తుంది. కార్మికవర్గం ముందు తాను ఆచరణలో చేసిచూపి, మిగతా ప్రజాసామాన్యానికి దారిజూపుతుంది. ఉదాహరణకు, ప్రస్తుతపరిస్థితిలో విధ్వంస కార్యాలకు ప్రజలు దిగినపుడు ఎంత వత్తిడివచ్చిననూ కార్మికవర్గం సమ్మెలలో దిగకుండా రైళ్లు, ఫ్యాక్టరీలు నడిచేటట్లుచేసి, అరాజకచర్యలు దేశస్వాతంత్ర్యానికి మార్గంగాదని కాంగ్రెసులీగు ఐక్యతే మార్గమని ప్రజాసామాన్యానికిచాటుతూ, ప్రజాసామాన్యాన్ని తన పాలసీవైపుకు మరల్చుతోంది. అలాగే సామ్రాజ్యవాదయుద్ధ రోజుల్లో కాంగ్రెసు నాయకత్వం మౌనంవహించి కూర్చున్నప్పుడు, అది సామ్రాజ్యవాద యుద్ధమనీ, ప్రజలు దానిలో పాల్గొనగూడదనీ బ్రహ్మాండమైన సమ్మెలుచేసి ఆచరణలోచూపి, ప్రజాసామాన్యానికి యుద్ధవ్యతిరేక పంధాను చూపింది. ప్రస్తుత యుద్ధానికిపూర్వం జాతీయైక్య సంఘటన రోజుల్లో ఫెడరేషనుకు వ్యతిరేకంగా సమిష్టిసత్యాగ్రహంకోసం ప్రజాసామాన్యాన్ని సమీకరించింది. కార్మికవర్గ నాయకత్వమంటే, కార్మికవర్గం తన పంధాను ఆచరించుటద్వారా, మిగతా ప్రజాసామాన్యం తనను అనుసరించేటట్లు చేయుటయే. కార్మికవర్గం యొక్క సిద్ధాంతం మార్క్సిజం - లెనినిజం అని పిలువబడుతుంది. ఆసిద్ధాంతంఅనే వెలుగుతోనే ప్రపంచంలోని ప్రతిఘటననూ పరిశీలించి, కమ్యూనిస్టుపార్టీ తనకార్యక్రమాన్ని నిర్ణయించుకొంటుంది. ప్రతి కమ్యూనిస్టు, మార్క్సిస్టు దృక్కోణంనుంచే ప్రతిఘటననూ పరిశీలించాలి. కనుక ముందు మనం మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతంలోని ప్రధాన సూత్రాలను తెలుసుకోవాలి.

ప్రపంచంలోని ప్రతిదీ అనుక్షణం మార్పుచెందుతూనేఉంటుంది. ప్రతిదానికి పుట్టుక, పెరుగుదల, చావు ఉన్నది. ప్రపంచానికి మూలం మన ఐదు ఇంద్రియాలతో (కన్ను, ముక్కు, నాలుక, చెవి, చర్మం) కనిపెట్టగలిగిన పదార్థమే. ఈపదార్థం పరిణామంచెంది చెట్లు, జంతువులు, మానవులుగాతయారయింది. పదార్థానికి మార్పు సహజలక్షణం. ప్రపంచంలో ప్రతి వస్తువుకూ మరొకవస్తువుకూ సంబంధముంది. అందువల్ల ఒక వస్తువుమీద

చుట్టుపట్లనున్న వస్తువుల ప్రభావం పడుతుంది. దీనినే గతితార్కిక భౌతికవాదమంటాం. భావవాది పదార్థంయొక్క పరిణామాన్ని అంగీకరించడు. ప్రపంచానికి మూలం పదార్థానికి అతీతమైనది ఏదో మనకు తెలియనిశక్తి ఒకటి ఉందంటాడు. ఒక వస్తువుమీద పరిసర వస్తువుల ప్రభావాన్ని గ్రహించడు.

కమ్యూనిస్టు ప్రతిదాన్నీ పరిశీలించేటప్పుడు దానిమార్పును, దాని చుట్టుపట్ల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొంటాడు. భావవాది దేనినైనా పరిశీలించేటప్పుడు, అది నిశ్చలంగా ఉన్నట్లుగాను దాని పరిసరాలతో సంబంధం లేకుండాను చూస్తాడు.

మానవ సమాజం :

మార్క్సు మహాశయుడు గతితార్కిక భౌతికవాదదృష్టితో సమాజాన్నిగూడ పరిశీలించాడు. మానవులు తమ జీవితావసర వస్తువులను ఉత్పత్తిచేసేటప్పుడు, పనిసాగడంకోసం కొన్ని ఆర్థికపద్ధతులను ఏర్పరచుకొంటారు. వీనినే ఉత్పత్తిసంబంధాలు అంటాం. జీవితావసరాలు ఉత్పత్తిచేసే ఉత్పత్తిసాధనాలను (యంత్రాలు, భూమి వగైరా) స్వాధీనం చేసుకొన్నవర్గం తన పెత్తనం సాగించడంకోసం, అనగా ఉత్పత్తి సంబంధాలను స్థిరంగా ఉంచడంకోసం, ప్రభుత్వ యంత్రాన్ని (పోలీసు, మిలిటరీ, జైళ్ళు, కోర్టులు వగైరా) నిర్మిస్తుంది. అంతేగాక తన కనుగుణ్యమైన సామాజిక నీతిసూత్రాలను వేదాంతాన్నిగూడ సృష్టించుతుంది. ఒక్కవాక్యంలో చెప్పాలంటే ఉత్పత్తిసంబంధాలనే పునాదిమీద, రాజకీయాలు, మానసిక సంబంధమైన వేదాంతం నీతిసూత్రాలుఅనే రెండు పైఅంతస్తులు నిర్మింపబడతాయి. ప్రపంచంలో ప్రతిదీ మారుతున్నట్లుగానే ఈ ఉత్పత్తిసాధనాలుగూడ అభివృద్ధి చెందుతున్నాయి. మానవులు కొత్తకొత్త యంత్రాలను కనిపెట్టుతుంటారు. కాని కొంతకాలానికి ఈ పాతఉత్పత్తి సంబంధాలు కొత్తఉత్పత్తి సాధనాలకు సంకెళ్ళుగా తయారవుతాయి. ఉత్పత్తిసాధనాల అభివృద్ధికి అడ్డుతగులుతాయి. అందువల్ల ఈ ఉత్పత్తి సాధనాల నభివృద్ధిచేసేవర్గం పెత్తనంచేస్తున్న వర్గంమీద తిరుగుబాటుచేసి, పెత్తనంలాక్కొని రాజకీయాధికారం స్థిరపరచుకొని, (కొత్త ప్రభుత్వయంత్రాన్ని నిర్మించి) పాత ఉత్పత్తి సంబంధాలను త్రెంచివేసి, కొత్త ఉత్పత్తిసాధనాలకు అనుగుణ్యంగాఉండే ఆర్థిక విధానాన్ని ఏర్పరుచుతుంది. క్రమంగా నూతన ఆర్థిక రాజకీయ విధానాలకు అనుగుణ్యంగా ఉండే, తనవర్గ నీతిసూత్రాలను, వేదాంతాన్ని స్థిరపరుచుతుంది. దీన్నే మనం విప్లవం అంటాం.

కమ్యూనిస్టులు నేటిసమాజంలోఉన్న ప్రతిలోపానికి (నిరుద్యోగం, త్రాగుడు, వ్యభిచారం వగైరా) మూలం ఆర్థికవిధానం అంటారు. కనుక ఆ లోపాల వెనుకనున్న ఆర్థిక కారణం వెతుకుతారు. అంతేగాక నేటి సమాజం వ్యక్తిఆస్థి విధానంవల్ల వర్గాలుగా చీలిందనీ, ప్రతివర్గానికి ఒక ఆర్థికవిధానం, రాజకీయవిధానం, నీతిసూత్రాలు, వేదాంతం, మతం

మొదలైనవి ఉన్నవనీ అంటారు. అందువల్ల ప్రభుత్వయంత్రం, న్యాయశాస్త్రం, పత్రికలు, మొదలైనవి ఏదో ఒకవర్గానికి చెందిఉంటాయేగాని, అన్నివర్గాలకు చెందిఉండవు అని అంటారు

భావవాదులు వర్గాలు అనాదినుంచీ ఉన్నవనీ, కొందరు పెత్తనంచేసేవారు, కొందరు అణగిఉండేవారు లేకపోతే ప్రపంచం నడవదనీ, మానవసమాజంలో మార్పుకు కొందరు మహాపురుషులే కారణమనీ చెబుతారు. భావవాదులు నేటి సమాజంలోఉన్న లోపాలకు కారణం వ్యక్తులని చెబుతారు; కాని వాని వెనుకనున్న ఆర్థిక కారణాన్ని అంగీకరించరు. ఒకడు ఎందుకు తాగుతున్నాడంటే, వాడు చెడ్డవాడుగనుక అనే సమాధానం చెబుతారు. ప్రభుత్వయంత్రం నీతిసూత్రాలు మొదలైనవి, అన్నివర్గాలను సమంగా లాభం గల్గించేవి ఉండగలవనీ చెబుతారు.

గాంధీజీ భారతదేశానికి పెట్టుబడిదార్లు, కార్మికులు, రైతులు, జమీందార్లు అందరూ కలిసి సుఖంగా వుండే రామరాజ్యాన్ని సృష్టిస్తానని చెబుతారు.

బూర్జువాపార్టీలు

బూర్జువాపార్టీలు తమవి బూర్జువావర్గపార్టీలని చెప్పుకోవు. లిబరలుపార్టీ, పీపుల్సుపార్టీ, జస్టిసుపార్టీ నేషనలుసోషలిస్టుపార్టీ, రాడికలుపార్టీ మొదలైన ఆకర్షణీయమైన పేర్లలో ప్రజాసామాన్యాన్ని మోసగించజూస్తాయి. బూర్జువావర్గం ప్రజలను దోపిడిచేస్తుంది. గనుక, తన దోపిడీవిధానాన్ని కప్పిపుచ్చడానికి తన దోపిడీవిధానానికి వ్యతిరేకంగా తిరుగబడకుండా చేయడానికి, ఈ విధంగా ప్రజలను మోసగించ జూస్తుంది.

పార్టీలో రాజకీయైక్యత

కమ్యూనిస్టుపార్టీ మార్క్సిస్టు-లెనినిస్టు దృష్టికోణంతో ప్రతి ఘటననూ పరిశీలిస్తుంది. ప్రతి ఒక్క సభ్యుడు మార్క్సిజం - లెనినిజం మూలసూత్రాలను అంగీకరించనివారు చేర్చుకోబడరు.

కేంద్రీకృత ప్రజాస్వామ్యం

కమ్యూనిస్టుపార్టీ కేంద్రీకృత ప్రజాస్వామ్యమనే నిర్మాణసూత్రాన్ని పునాదిగా పెట్టుకొని పనిచేస్తుంది. ప్రజాస్వామ్య మనగా పార్టీపాలసీని నిర్ణయించడంలోనూ, పార్టీని నడపడంలోనూ అవకాశముండటం. కేంద్రీకృతమంటే సమిష్టి కృషిద్వారా నిర్ణయింపబడిన పంథాను, పార్టీ సభ్యులంతా తూచాతప్పక అనుసరించడం.

కమ్యూనిస్టుపార్టీలో ప్రతిసభ్యుడు పార్టీపాలసీ నిర్ణయించడంలోనూ నడపడంలోనూ పాల్గొంటాడు. ప్రతిసభ్యుడూ మార్క్సిజం, లెనినిజంయొక్క మూలసూత్రాలను అవగా

హన చేసుకుంటాడు. ఈ సిద్ధాంతం సహాయంతో దినపత్రికలు పార్టీ పత్రికలను శ్రద్ధగా చదువుతూ జాతీయ అంతర్జాతీయ రాజకీయాలను అవగాహన చేసుకుంటూ ఉంటాడు. కనుక ప్రతిపార్టీ సభ్యుడు రాజకీయ పరిజ్ఞానంతోనూ, చైతన్యంతోనూ (తానెందుకు 'ఎలా పని చేస్తున్నాడో తెలుసుకోవడం) పార్టీ కార్యక్రమాన్ని అమలు జరుపుతూ ఉంటాడు. తన యూనిటు చర్చల్లో పూర్తిగా పాల్గొంటాడు. తనయూనిటు నిర్ణయాలు చేయడంలో తన వంతును నిర్వహించుతాడు. ఆ నిర్ణయాలలో దేనినైనా తానంగీకరించకపోయినప్పటికీ, దానిని అమలు జరుపుతాడు. అంటే మెజారిటీ నిర్ణయాన్ని మైనారిటీ తప్పకఅంగీకరించి అమలు జరపాలి. ఆచరణలో తాను ఆ నిర్ణయం సరియైనది అనితేలితేఅంగీకరించుతాడు. లేకపోతే మిగతా కామ్రేడ్సుకు తననిర్ణయం ఎలాసరియైనదో రుజువు చేస్తాడు. తన యూనిటు నిర్ణయం సరియైనదికాదని అనుకొన్నప్పుడు పైకమిటీకి అప్పీలు చేస్తాడు.

పార్టీ పాలసీనిగూర్చి ప్రజాభిప్రాయం ఎలాఉందో ఎప్పటికప్పుడు పైకమిటీకి తెలియపరుస్తాడు. అలాగే పైకమిటీల నిర్ణయాలనుగూర్చి తన యూనిటులో నిర్మొగమాటంగా తన అభిప్రాయాన్ని చెబుతాడు. క్రింది యూనిట్లు తనపై యూనిట్ల నిర్ణయాలను తప్పక అమలు జరుపుతూ ఉంటాయి. తాము వానిని అంగీకరించకపోయినప్పటికీ వానిని అమలు జరుపుతూ, పైకమిటీకి తమ అభిప్రాయాన్ని తెలుపుతవి.

ప్రతికమిటీ, తనకు సంబంధించిన రంగాలలోను, ప్రాంతాలలోను, అచట పరిస్థితులకు పార్టీ నినాదాలకు, పైకమిటీ నిర్ణయాలను అనువర్తింపజేసి, కార్యక్రమాన్ని ఇస్తూ ఉంటాయి. నిర్ణయాలు తీసుకుంటాయి. అలాంటిసమస్యలని గూర్చి, క్రిందికమిటీలతో ముందుగా సలహా తీసుకోవలసిన అవసరంలేదు. రాష్ట్రానికంతటకు సంబంధించిన విషయం రాష్ట్రకమిటీయే ఆలోచించి నిర్ణయిస్తుంది. అలా నిర్ణయం చేయడానికి ముందు ఏదో అసాధారణ పరిస్థితులలో తప్ప క్రింది కమిటీల సలహాలకోసం వేచియుండదు. అలాంటి అసాధారణపరిస్థితు లేమంటే, రాష్ట్రకమిటీలోనే తీవ్రభేదాభిప్రాయాలు వచ్చినప్పుడు, లేదా క్రింది కమిటీల సలహా తీసుకోనిదే సరియైన నిర్ణయాన్ని చేయలేమనుకున్నప్పుడు; వాని సలహాలకోసం వేచియుంటుంది. అయితే ఆ నిర్ణయాలను క్రిందికమిటీలు ఆచరణలో పెట్టుతూ, దానిలో సాధకబాధకాలను, తమ అనుభవాలను పై కమిటీకి తెలియజేయాలి. క్రిందికమిటీల సలహాలకోసం కూర్చోవడం, చొరవతీసుకొని పార్టీకి నాయకత్వం వహించడం కాక, ఘటనాచక్రం యొక్క తోకబట్టుకొని పోవడమవుతుంది. పై కమిటీ నిర్ణయాలలోని లోపాలను, తమ అనుభవాలను, క్రిందికమిటీలు తెలియజేయకపోయినచో పార్టీ నాయకత్వం గ్రుడ్డిది అయి తప్పులు చేయడానికి దారి తీయడం అవుతుంది.

అయితే క్రిందికమిటీలకు సంబంధించిన విషయాలలో పై కమిటీలు సాధ్యమయినంత వరకూ క్రింది యూనిట్లతో సంప్రదించియే, ముఖ్య విషయాలనుగూర్చి నిర్ణయాలు తీసుకొంటాయి. సంప్రదించడానికి అవకాశంలేనపుడు ఆ విషయం అంత ప్రాముఖ్యమైన

దైనపుడు, క్రింది యూనిట్లతో సంప్రదించకుండానే నిర్ణయం తీసుకొంటాయి. అప్పుడు క్రింది యూనిట్లు ఆ నిర్ణయాన్ని అమలుజరుపుతూ పైకమిటీకి తమ అభిప్రాయాన్ని పంపాలి.

పార్టీకి బహిరంగావకాశాలు ఉన్నప్పుడు అన్ని కమిటీలకు ఎన్నికలు జరుగుతాయి. కాని పార్టీ రహస్యపు దినాల్లో ఎన్నికలు జరగడానికి వీలులేకపోతే ఎన్నికలు జరుగవు. మొట్టమొదటిసారిగా కేంద్రకమిటీకి ఎన్నికలు 1943 జూను ప్రథమ కాంగ్రెసులో జరిగినవి. కనుక ప్రజాస్వామ్యమనేది ఎన్నికలు జరగడంలోనే లేదు. ప్రతి సభ్యుడు తన అభిప్రాయం చెప్పడం, పార్టీ పాలసీని నిర్ణయించడంలోనూ, కార్యనిర్వహణలోనూ తనవంతు పూర్తిచేయడంలోనే ఉంది. పై కమిటీలు అవుసరమనుకున్నప్పుడు క్రింది కమిటీల ఎన్నికలు ఆపివేయడం, కమిటీలు తమ బాధ్యతలను సక్రమంగా నెరవేర్చనప్పుడు అందులో వ్యక్తులను తీసివేసి మరికొందరిని నామినేటు చేయడం, కమిటీలను రద్దుచేసినూతన కమిటీలను వేయడం, మొదలైన పనులు చేయవచ్చును.

కేంద్రీకృత ప్రజాస్వామ్యమంటే పైచెప్పబడినదే. ఇది అమలు జరగాలంటే, పార్టీ సభ్యులకు సక్రమమైన కార్యక్రమమిచ్చి దైనందినం నడుపగలిగిన నాయకత్వం (కేంద్రకమిటీనుండి తాలూకా కమిటీ వరకు అన్ని కమిటీలు, ఫ్రాక్షన్లు, సెల్లు కార్యదర్శులు) ఉండాలి. ఇది కేంద్రీకృత ప్రజాస్వామ్యంయొక్క సారం. క్రింద కమిటీల నుండి పైకమిటీలకు రెగ్యులరుగా రిపోర్టులు పంపబడుతూ ఉండాలి. పై కమిటీలనుండి సర్క్యులర్లు, పార్టీలెటర్లు, ఆర్గనైజర్లద్వారా క్రింద కమిటీలతో దగ్గర సంబంధం ఉంచుకోవాలి. ఈవిధమైన రెగ్యులరు సంబంధంగూడ, కేంద్రీకృత ప్రజాస్వామ్యం అమలు జరగడానికి. అవుసరం.

1921 లో జరిగిన మూడవ కమ్యూనిస్టు అంతర్జాతీయ మహాసభచే అంగీకరించబడిన "కమ్యూనిస్టుపార్టీల నిర్మాణంమీద థీసిసు" అనేదానిలో, కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని గూర్చి ఈ క్రిందివిధంగా ఉంది. "కమ్యూనిస్టుపార్టీలోని కేంద్రీకృత ప్రజాస్వామ్యం, కేంద్రీకరణ, కార్మికవర్గ ప్రజాస్వామ్యాలయొక్క వాస్తవికమైన కలయికగా ఉండాలి, పార్టీ నిర్మాణమంతా ఎల్లప్పుడూ సాగించే సమిష్టికృషి సమిష్టిపోరాటంయొక్క ఫలితంగానే ఈ కలయిక సాధ్యమవుతుంది. కమ్యూనిస్టుపార్టీలో కేంద్రీకరణఅంటే, నామమాత్రమైన 'మెకానికల్'గాఉన్న కేంద్రీకరణగాదు. అది కమ్యూనిస్టులందరూ సాగించే కార్యాచరణయొక్క కేంద్రీకరణ. అంటే, ఎల్లప్పుడు పోరాటానికి సిద్ధంగా ఉండేటటువంటి, పరిస్థితులను అవగాహనచేసుకొని కార్యాచరణను నిర్ణయించేటటువంటి, బలమైన నాయకత్వం ఏర్పడటమే. నామమాత్రమైన మెకానికల్'గాఉన్న కేంద్రీకరణ అంటే, "అధికారాన్ని" నిరంకుశ కార్మిక నాయకులచేతుల్లో కేంద్రీకరించడం అవుతుంది. వారు మిగతా పార్టీసభ్యులమీద, పార్టీలోలేని విప్లవకార్మిక ప్రజాసామాన్యంమీద పెత్తనం

చలాయించుతారు. కార్మికవర్గ పోరాటం నడుపుతున్నటువంటి కమ్యూనిస్టు నాయకత్వాన్ని కేంద్రీకరించుతున్నటువంటి (బలమైన కమ్యూనిస్టు నాయకత్వాన్ని నిర్మించుతున్నటు వంటి) కమ్యూనిస్టు పార్టీయొక్క కృషి, విప్లవ కార్మికవర్గంమీద పరిపాలన చేయడానికి ప్రయత్నమని కమ్యూనిస్టు వ్యతిరేకులు మాత్రమే అనగలరు. అవాదన శుద్ధ అబద్ధం. కమ్యూనిస్టు అంతర్జాతీయ మహాసభచే అంగీకరించబడిన కేంద్రీకృత ప్రజాస్వామ్యం యొక్క ప్రధాన సూత్రాలకు, పార్టీలో అధికారంకోసం పెనుగులాట మొదలైనవి విరుద్ధం."

పార్టీ నిబంధనావళిలో కేంద్రీకృత ప్రజాస్వామ్యం ఈ క్రిందివిధంగా నిర్వచించ బడింది.

సెక్షన్ (1) పార్టీయొక్క నిర్మాణం కేంద్రీకృతమైన ప్రజాస్వామ్యం అనే (Democratic Centralism) ప్రధానసూత్రంమీద ఆధారపడిఉంది. అనగా

(క) అన్ని పార్టీకమిటీలు పైనుండి క్రిందివరకు ఎన్నుకోబడతాయి.

(ఖ) ఆయా పార్టీసంస్థలకు ఆయా కమిటీలు తమ పనినిగూర్చి రెగ్యులరుగా రిపోర్టులు పంపుతాయి.

(గ) పార్టీశిక్షణ చాల ఖచ్చితంగా ఉంటుంది. మెజారిటీ నిర్ణయాలను మైనారిటీ అమలుజరపాలి.

(ఘ) కేంద్రకమిటీయొక్క నిర్ణయాలను, పార్టీయొక్క పై సంస్థల నిర్ణయాలను క్రింది సంస్థలు, పార్టీసభ్యులు తప్పక పాటించాలి.

[గమనిక :—పార్టీయొక్క సమిష్టి దినచర్యలో పార్టీని చక్కగా నడుపగలిగిన బలీయమైన నాయకత్వాన్ని నిర్మించడమే కేంద్రీకృతమైన ప్రజాస్వామ్యము.]

అందువల్ల పార్టీ కమిటీలకు-పార్టీసభ్యులకు మధ్య, పార్టీకి-ప్రజలకు మధ్య సజీవ మైన, గాఢమైన సంబంధం ఏర్పడుతుంది.

ఇది ప్రస్తుత బహిరంగపరిస్థితులకు అనుగుణ్యంగా వ్రాయబడినది.

బూర్జువా ప్రజాస్వామ్యం

బూర్జువా పార్టీలలో నామమాత్రమయిన ప్రజాస్వామ్యముంటుంది. బూర్జువా సమా జంలో ఎలాగైతే కాయకష్టం జేసేవారు, పనిచేయకుండా వారిని దోచుకుని సుఖించేవారు, ఉంటారో, అలాగే ఆపార్టీలలోగూడ పెత్తనం చేసేవారు, నాయకుల ఆజ్ఞలను శిరసావ హించే సాధారణ సభ్యులు ఉంటారు. సాధారణ సభ్యులకు రాజకీయ విజ్ఞానం కలుగ జేయడంగాని సాధారణసభ్యులు సలహాలివ్వడంగాని, నాయకులువానినిపాటించడంగాని,

ఉండదు. బూర్జువా పార్టీలలో ఎన్నికలకే ప్రాధాన్యత ఇస్తారు. కార్యక్రమం అమలు జరపడం ప్రధానంగా ఉండకుండా ఒకబూర్జువా ముఠాను పడదోసి రెండవ బూర్జువా ముఠా పదవుల్లో కూర్చోడానికి ఎన్నికలను ఉపయోగించుకొంటారు. పెట్టుబడిదారీ వర్గానికి కార్మిక వర్గానికి మధ్య వైరుధ్యమేగాక, లాభాలు సంపాదించడానికి ఒక పెట్టుబడిదారి ముఠాకు మరొక పెట్టుబడిదారి ముఠాకు, ఒకపెట్టుబడిదారుకు మరొక పెట్టుబడిదారుకు మధ్య వైరుధ్యాలు ఉంటాయి. అందువల్ల బూర్జువా పార్టీలో అధికారంకోసంజరిగే కుట్రలు సహజమయినవే. బూర్జువా పార్టీలలో పైకమిటీల నిర్ణయాలను క్రింది కమిటీలుగాని, ఒక కమిటీ నిర్ణయాన్ని ఆ కమిటీలో సభ్యుడుగాని అమలు జరుపాలని నిబంధన ఉండదు. ఇష్టంలేని కమిటీగాని సభ్యుడుగాని అమలుజరుపకుండా ఊరుకోవచ్చు. కమ్యూనిస్టుపార్టీలో ఇలా అమలు జరుపకుండా ఊరుకోవడం శిక్షణకు వ్యతిరేకం.

ప్రజల శ్రేయస్సు ప్రధానంగా జూచుకొని బూర్జువాపార్టీలు నామమాత్రమైన ప్రజా స్వామిక సూత్రంమీద పనిచేస్తాయిగాని, ప్రజలను ఫేసిజంబారి పడకుండా కాపాడి సర్వమానవ కల్యాణంగాఉండే కమ్యూనిస్టు సమాజాన్ని సాధించడానికి పూనుకొన్న కమ్యూనిస్టుపార్టీ మాత్రం, నామమాత్రమయిన ప్రజాస్వామ్యం సూత్రంమీద పనిచేయ లేదు. కమ్యూనిస్టుపార్టీ విప్లవపార్టీ గనుక, కేంద్రీకృతమయిన ప్రజాస్వామ్యమనే విప్లవ నిర్మాణ సూత్రాన్ననుసరించి పనిచేస్తుంది.

బూర్జువా పార్టీలు కేంద్రీకృత ప్రజాస్వామ్యం నియంతృత్వమనీ, తమ 'నామ మాత్రమైన ప్రజాస్వామ్యమే' నిజమైన ప్రజాస్వామ్యమనీ అంటారు. కమ్యూనిస్టు పార్టీ లోనే నిజమైన ప్రజాస్వామ్యముంది. ప్రతి సాధారణసభ్యుడూ రాజకీయ చైతన్యంతో పార్టీ కార్యక్రమంలో పాల్గొంటాడు. పార్టీ పాలసీని నిర్ణయించడంలో తోడ్పడతాడు. తన అభిప్రాయాలను నిర్మొగమాటంగా చెబుతాడు. బూర్జువా పార్టీలలో సాధారణసభ్యులకు రాజకీయ చైతన్యం కలుగనీయరు. నాయకుల ఆజ్ఞలు శిరసావహించే యంత్రాలుగా తయారుచేస్తారు. సాధారణ సభ్యులను నాయకులవెనుక ముఠాలుగాగట్టి, మభ్యపెట్టి తమకు ఓట్లు వేయించుకొంటారు. సాధారణసభ్యులు చైతన్యంతోఉంటే, ఎన్నికలు జరుగ నీయరు. 1940 లో సామ్రాజ్యవాద యుద్ధరోజులలో నాయకత్వంయొక్క నిస్తబ్దతా కార్య క్రమంయెడల సాధారణ సభ్యులనుంచి వత్తిడి వచ్చేటప్పటికి కాంగ్రెసు నాయకత్వం కమిటీలను రద్దుచేసి ఏజెంట్లను నియమించింది.

కమ్యూనిస్టుపార్టీని నాజీపార్టీతో పోల్చడం తెలివితక్కువ. నాజీపార్టీలో నాయకులు చెప్పినదాన్ని నోరు మెదపకుండా అనుసరించాలి. దానికి వ్యతిరేకించితే, నిర్బంధానికి, చివరకు చావుకుగూడ సిద్ధమవ్వాలి.

ప్రతి సభ్యుడు పనిచెయ్యాలి.

కమ్యూనిస్టుపార్టీలో ప్రతి సభ్యుడు పార్టీలో ఏదో యొక యూనిటులో ఉండి, దాని శిక్షణక్రింద పని చెయ్యాలి. పని చేయకుండా విడిగాఉండే వారు కమ్యూనిస్టుపార్టీలో ఉండటానికి వీలులేదు. పనిచేయనిసభ్యుడు పార్టీ పంథానుగాని సిద్ధాంతాన్నిగాని సరిగా అర్థం చేసుకోలేడు; వానియడల చైతన్యసహితమైన విశ్వాసంగూడ ఉండదు. అనుభవంలేని సభ్యుడు సరియైన నిర్ణయాలుగూడ చేయలేడు. సిద్ధాంతమంటే ఆచరణయొక్క సారాంశమే. సిద్ధాంతం అనే దీపంతో పార్టీ సభ్యుడు పనిలో దిగుతాడు. ఆచరణలో వచ్చిన అనుభవంవల్ల సిద్ధాంతాన్ని ఇంకా అభివృద్ధి చేస్తాడు. ఈవిధంగా మార్క్సిజంలో సిద్ధాంత ఆచరణల అవినాభావ సంబంధమే ప్రధానమైన సూత్రం.

బూర్జువాపార్టీలల్లో పనిచేయని సభ్యులు ఉంటారు. సిద్ధాంత ఆచరణలకు సంబంధం లేనిపార్టీలలో ఇది సహజమే.

3. ఆంధ్రదేశంలో ప్రజాపార్టీ అవడానికి ఆటంక మేమిటి?

కమ్యూనిస్టుపార్టీ ప్రజాపార్టీగా అవ్వాలిసిన అవసరం ఎంతఉందో, ప్రజాపార్టీఅంటే యేమో చర్చించాం. ఇక ప్రజాపార్టీ గావడానికి ఆటంకాలేమి ఉన్నవో చూదాం. మన పార్టీ 1926నుండి1936వరకూ కార్మికరంగంలోను. 1936నుండి జాతీయైక్యసంఘటనకాలంలోను, కాంగ్రెసు మంత్రివర్గాల రోజుల్లోను, సామ్రాజ్యవాద యుద్ధకాలంలోను, ప్రజాయుద్ధకాలంలోనూ, అనేక ప్రజాపోరాటాలను కార్మికులు, రైతులు, విద్యార్థులు ఇతర మధ్యతరగతి ప్రజలల్లో జరిపింది. ముఖ్యంగా బొంబాయి, కాన్పూరు, బెంగాలులలో ఇవి ఎన్నో జరిగినాయి. ఈ పోరాటాలలో ఎంతోమంది మిలిటెంట్లు తేలారు. కాని వీరందరినీ పార్టీలో తర్ఫీదు ఇయ్యడం జరుగలేదు.

ఆంధ్రరాష్ట్రంలో మనపార్టీప్రజాపార్టీగాక పోవడానికికారణం మిలిటెంట్లనుపార్టీలోకి తీసుకోక పోవడంవల్లగాదు. అసలు ప్రజలుఇబ్బందిపడుతున్న దైనందినసమస్యలను మన పార్టీ సభ్యులు తీసుకునేవారుగాదు. ఇప్పుడుమాత్రం వానిని తీసుకుని పని ప్రారంభించారు. కాని అభివృద్ధినిరోధకులు, పార్టీవ్యతిరేకులు, ప్రభుత్వోద్యోగులు ఆటంకాలుపెడితే, అంతటితో ఆగిపోతున్నారు. ప్రజలను సమీకరించి వారివ్యతిరేకతను తుత్తునియలుజేసి ముందుకు పోవడంలేదు. రాజకీయ సమస్యలపరిష్కారంకోసం గాంధీజీ సత్యాగ్రహపద్ధతు లయిననిరశన వ్రతం చేయడం (వ్యక్తిసత్యాగ్రహం, రాజకోట నిరశన వ్రతం) మొదలైన వాటివల్ల, ఏ కొద్దిమంది సత్యాగ్రహులత్యాగం వల్లనో స్వాతంత్ర్యం వస్తుందనీ, తాము మాత్రం తోచిన ధనసహాయంజేస్తూ సానుభూతిని చూపుతూ కూర్చోవడమే అనే అభిప్రాయం గల్గింది. ప్రజలంతా పోరాటంలో పాల్గొంటేనేగాని స్వాతంత్ర్యం రాదనేభావం గలుగలేదు. ప్రజలు మన కామ్రేడ్స్‌ను గూడ అదే దృష్టితో చూస్తున్నారు. మన కామ్రేడ్స్ ప్రజల్లో ఉన్న ఈ ప్రేక్షకదృష్టిని (passive spectator) మన కామ్రేడ్స్ పట్టుదలతో పోగొట్టి, తమ కోర్కెలు తాము అంతా ఏకమై పనిచేస్తేనేగాని నెరవేరవనే భావం ప్రజల్లో కల్పించి ప్రజాసమీకరణ చేయడంలేదు. అంటే మన కామ్రేడ్స్ ప్రజా సమస్యలు తీసుకున్నప్పటికీ, పిటీషన్ల మీద సంతకాలు చేయించడం వరకూ చేస్తున్నారు. ప్రభుత్వోద్యోగుల వద్దకు ప్రజలను సమీకరించడంలేదు. అంటే మన ఉద్యమం దాదాపు ఆందోళనదశలోనే ఆగిపోతోంది. మన కామ్రేడ్స్ స్వాతంత్ర్యదినోత్సవం, నవంబరు దినోత్సవం, బెంగాలు సహాయనిధి, మొదలైన రాజకీయ ఆందోళనా కార్యక్రమంలో

భూస్వామ్య కాశాలను కదుపుతారు. ప్రజా సమస్యలను గూర్చి (పొగాకుబిల్లు, ఇర్రిగేషను బిల్లు మొదలైనవి) ఆందోళన చేయమన్నప్పుడు సైతం, బ్రహ్మాండంగా మీటింగులు పెడతారు; మహజర్లు తయారు చేస్తారు. కాని ఆ ప్రజా సమస్యలను స్థానికంగా అన్వయించి, ప్రజల స్థానిక కష్టాలను పోగొట్టడానికి ప్రజలను సమీకరించడంలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే నేటికీ మన ఉద్యమం చాలవరకు ఆందోళనదశలోనే ఉంది. ఈ దశనుదాటి ప్రజా సమీకరణదశలోకి పోలేదు. దీనికి కారణం తెలుసుకోవాలంటే ఆంధ్రలో పార్టీ చరిత్రను తరిచిచూడాలి.

బొంబాయి, కాన్పూరు, కలకత్తాలలోవలె పార్టీఆంధ్రరాష్ట్రంలోకార్మికవర్గంలో పుట్టలేదు. 1930–34 కాంగ్రెసు సత్యాగ్రహోద్యమాలలో పాల్గొని, గాంధీజీ యెత్తుగడలవల్ల అసంతృప్తి చెందిన యువకులు మార్క్సిస్టు సాహిత్యం జదివి కమ్యూనిస్టుపార్టీ వైపుకు ఆకర్షింపబడ్డారు. అందువల్ల మనలో కాంగ్రెసు బూర్జువా నిర్మాణ పద్ధతులు (రాజకీయాందోళన, ప్రజా సమస్యలకోసం ప్రజలను సమీకరించకపోవడం) మన పార్టీ సభ్యులలో వచ్చినవి. నేటికీ పార్టీ అంతటా బూర్జువా నిర్మాణ సాంప్రదాయాలు ఉన్నవి. బొంబాయి కాన్పూరు, కలకత్తాలలో కమ్యూనిజంవైపుకు ఆకర్షించబడిన మధ్యతరగతి మేధావులు కార్మికుల దైనందిన కోర్కెలను తీసుకొని, వాటి నివారణకొరకు సమ్మెలు చేయించడం, సమీకరించడం చేసేవారు. వీరిమీద కాంగ్రెసు ప్రభావం ఏమీ లేకపోవుటవలన అక్కడ స్థానిక సమస్యలను తీసుకొని పనిచేయడం, వాటి నివారణకోసం ప్రజలు ముందుకు వచ్చేటట్లు చేయడం జరుగుతోంది.

జాతీయైక్య సంఘటన రోజుల్లో పార్టీ సభ్యత్వం రాష్ట్రంలో 200 ఉండేది. సామ్రాజ్య యుద్ధారంభంతో యువకుల్లో పెద్ద సంచలనం కల్గింది. వారు రాజకీయ నాయకత్వంకోసం ఎదురుచూస్తున్నారు. మనపార్టీ ఆ పరిస్థితులకు తగిన పంథానిచ్చింది. మిగతా పార్టీల ఫార్వర్డుబ్లాకు, కాంగ్రెసు సోషలిస్టులు మొదలైన అతివాదముఠాల గుట్టు బట్టబయలయింది. అందుచే ఆంధ్రలో రాజకీయ చైతన్యంగల యువకులందరూ పార్టీ జండాక్రిందికి వచ్చారు. పార్టీ 900 వరకూ పెరిగింది. పార్టీ ఆర్గనైజర్లు ఎందరో అవసరమయ్యారు. విద్యార్థి ఉద్యమంనుంచి వచ్చిన కామ్రేడ్సుకు ప్రజాసమస్యల్లో అనుభవంలేకపోయినప్పటికీ, పార్టీ ఆర్గనైజర్లనుగా నియమించబడ్డారు. వీరుగూడ కాంగ్రెసు సాంప్రదాయాల ప్రభావంఉన్న పార్టీ యంత్రంలో ఇమిడిపోయారు. కాని మార్పు తీసుకురాలేదు. పైగా వీరికి ప్రజాపనిలో (mass work) పాత ఆర్గనైజర్లకున్న అనుభవంగూడలేదు. అందుచే వీరు సామాన్య సభ్యులచే ప్రజా పనిని అసలే చేయించలేక పోయారు. పార్టీ ఆర్గనైజర్లంటే సెల్లులను సమావేశపర్చడం, వారికి రాజకీయాలను చెప్పడం, పార్టీ సర్క్యులర్లను చదివి అర్థం చెప్పడం, ఆచరణయోగ్యమయినది అయినా కాకపోయినా కార్యక్రమం ఇవ్వడం చేసే వాళ్ళుగా తయారయ్యారు. కాని తామిచ్చిన కార్యక్రమాన్ని తాము ముందుండి సాధారణ

సభ్యులకు మార్గంచూపించి, పార్టీ సభ్యులను ఉత్తేజపరచి, వారిలో ఆత్మవిశ్వాసం కల్గించడం లేదు. ఇందువల్ల మనం సామ్రాజ్యవాద యుద్ధకాలంలో యుద్ధానికి వ్యతిరేకంగా జనరలు ప్రచారం మాత్రం చేయగల్గాం గాని, యుద్ధంవల్ల ప్రజలకు వచ్చిన ఇబ్బందులను తీసుకొని వాటి నివారణకు ప్రజలను సమీకరించి, మలబారు, బెంగాలులలో వలె ప్రజా ఉద్యమాన్ని ఆందోళన దశనుండి పోరాటదశకు తీసుకొని పోలేకపోయాం. అందుచేత సామ్రాజ్యవాద యుద్ధదశ ఆఖరుకు పార్టీలో నిస్తబ్ధత వచ్చింది. ప్రజల్లో యుద్ధమువల్ల వచ్చిన ఇబ్బందులమీద స్థానిక ప్రజాపోరాటాలను నడపడం, వీటినన్నిటిని గలిపి సర్వవ్యాపిత సమ్మె (General stike) సాయుధ విప్లవంగా మార్చడం, అనే మన కార్యక్రమం ప్రజలను కదపలేకపోయింది. అందుచే ప్రతిగ్రామంలోను, పట్టణంలోనూ మనమొక ప్రత్యేక ముఠా (Sect) వలె అయిపోయాం. మనం ప్రజలకోసం కష్టపడతామనీ, చెప్పింది చేస్తామనీ ప్రజలకు మనమీద సానుభూతిఉన్నా, మన రాజకీయపాలసీ యెడల నమ్మకం లేదు.

ఇంతలో నాజీ జర్మనీ 1941 జూను 22 న సోవియట్ యూనియన్ మీద దాడిచేసింది. యుద్ధస్వభావంలో మార్పువచ్చింది. అయినప్పటికీ పార్టీ పూర్వపు యుద్ధవ్యతిరేకపంథానే ఆరునెలలు కొనసాగించింది. అందుచే పార్టీలో ఇదివరకు ఏర్పడిననిస్తబ్ధత (Stalemate) ఇంకా తీవ్రమయింది. మన పంథా ప్రజలను ఇంకా కలవరపెట్టింది. మన పంథాను 1941 డిసెంబరులో మార్చుకొన్నాం. దీనితో పార్టీలోఉన్న రాజకీయ నిస్తబ్ధత తొలగిపోయింది. పార్టీ సభ్యులు నూతన పంథాను 1942 స్వాతంత్ర్య దినోత్సవంతో రాష్ట్రమంతటా లక్షమంది ప్రజాసామాన్యాన్ని సమీకరించి వారి ముందు ప్రచారంచేశారు. కాంగ్రెసు-లీగు ఐక్యత దేశానికి స్వాతంత్ర్యాన్ని సంపాదించడానికి ఎలా మార్గమో ప్రచారం చేశారు. ఇంతలో 1942 ఆగస్టులో కాంగ్రెసు నాయకుల అరెస్టులుజరిగాయి. ఈఘటనలలో పార్టీ పోలీసుల - ప్రజల మధ్య నిలబడి ఆంధ్రరాష్ట్రంలో విధ్వంసక కార్యక్రమం విరివిగా జరుగకుండా చేయగలిగింది. కాని దీనినుండి జాతీయైక్యతను నిర్మించలేకపోయింది. కాంగ్రెసు సోషలిస్టులు, ఫార్వర్డుబ్లాకు రంగాముఠా, కాంగ్రెసువాదులు మనం ప్రభుత్వ ఏజెంట్లమనీ, ప్రభుత్వం నుండి లంచాలు తీసుకున్నామనీ, విపరీతమైన దుష్ప్రచారం సాగించారు. పార్టీ దెబ్బ కాచుకునేస్థితిలో పడిపోయింది.

ఈసమయంలో, బొంబాయిలో 1942 సెప్టెంబరులో కేంద్రకమిటీ ప్లీనంసమావేశం జరిగింది. దానిలో కాంగ్రెసు నాయకుల విడుదల, వివిధజాతుల, స్వయంనిర్ణయ సూత్రం, అంగీకరించుట ద్వారా కాంగ్రెసు లీగు ఐక్యత మొదలైన నినాదాలు ఇవ్వబడినాయి. ఈ నినాదాలను తీసుకొని నవంబరు జాతీయైక్యతావారంలో కమ్యూనిస్టు వ్యతిరేకముఠాలమీద దాడిచేశాం. ప్రజలంతా మన పంథాయెడల సానుభూతిచూప మొదలెట్టారు. కాని మనం అధికోత్పత్తి, అధికాహారోత్పత్తి, ఆహారసమస్య మొదలైన దేశరక్షణ కార్యాలమీద ప్రజా

ఐక్యతను, వివిధరాజకీయ గ్రూపులమధ్య ఐక్యతను గ్రామాల్లోను పట్టణాలలోనూ నిర్మించ లేదు. జాతీయైక్యతా ప్రచారం బ్రహ్మాండంగాచేసి ప్రజలను కదిపాముగాని, దాన్ని క్రింద నుంచి నిర్మించడంలో విఫలులమయ్యాం. కారణం ఆంధ్రలో పార్టీకి సాంప్రదాయ సిద్ధంగా వచ్చిన కాంగ్రెసు బూర్జువా నిర్మాణ పద్ధతులు ప్రజావని పద్ధతులనుండి బయటబడి కార్మిక పద్ధతులను అలవరచుకోకపోవడమే.

ఆంధ్రలో పార్టీ అగస్టు ఘటనల తర్వాత సాగించిన కార్యకలాపాన్ని సమీక్షజేసి, ప్రతి ప్రజారంగానికి వివరమైన కార్యక్రమం ఇయ్యడానికి, ఆంధ్రరాష్ట్రకమిటీ విస్తృత సమావేశం 1943 జనవరిలో జరిగింది. ఈ సమావేశం పార్టీయొక్క అభివృద్ధినిగూర్చి ఈ క్రింది విధంగా సమీక్షజేసింది. "ఆంధ్రరాష్ట్ర ప్లీనం సమావేశ నిర్ణయాలలో 5 వ పేజీలో పార్టీ సాధించిన విజయాలు అనే శీర్షిక."

ఇంత పెద్ద విజయాలు సాధించినా, రాష్ట్రంలో ప్రజా పలుకుబడిలో కాంగ్రెసుకు తరువాత రెండవదిగా ఉన్నా, పార్టీ విస్తరించిందేగాని (Quantitative Change), పార్టీ పనిచేసే పద్ధతులలో మార్పు Qualitative Change) రాలేదు. అంటే పార్టీ ప్రచారం ఇంకా చాలచోట్లకు పోయిందిగాని, మన పార్టీ ఇచ్చిన దేశరక్షణ వినాదాలను ఆధారంగా జేసుకొని స్థానికంగా ప్రజాఐక్యతను నిర్మించి, ప్రజా ఉద్యమస్థాయిని ఉన్నత స్థితికి తీసుకుపోయేస్థితిలో లేవు. అంటే మన పార్టీ ప్రచారదశనుంచి, పోరాట నిర్మాణదశ లోకి పోలేదు. పార్టీయొక్కయూ ప్రజాసంస్థలయొక్కయూ అస్థిపంజరాలను మాత్రం ఏర్పరుస్తున్నాం. వాటిలో రక్తమాంసాలను చేర్చలేదు. అంటే, పార్టీ సెల్లులు కమిటీలు, ప్రజాసంస్థల కార్యవర్గాలు, సాధారణ సమావేశాలు రెగ్యులరుగా సమావేశాలు అవడం, ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యక్రమం వేసుకోవడం జరుగుతుంది. కాని అందులో ఏకొద్దిభాగమో అమలుజరుగుతుంది. అంటే పార్టీ ప్రజా సంఘాలయొక్క రూపంమాత్రం ఏర్పరచుతున్నాంగాని, అందులో సరుకు ఉండటంలేదు. మన పార్టీ యొక్క ఈ బలహీన తను రాష్ట్రకమిటీ విస్తృతసమావేశం ఈ క్రింది వాక్యాల్లో సమీక్షచేసింది.

మన పార్టీ పైవిధంగా గావించిన కృషివలన మన పార్టీ రాజకీయ జీవితంలో నూతన అధ్యాయం ప్రారంభమైంది. ఆంధ్ర దేశ రాజకీయరంగములో మనపార్టీ ఒక ప్రధానశక్తిగా తయారైంది. ప్రజల జీవితానికి సంబంధించిన ప్రతి విషయంలోను, మనపార్టీ జోక్యం గలుగజేసికొని, ప్రజలకు మార్గం చూపెట్టగల శక్తి పార్టీకి లభించింది. ఆంధ్రదేశంలో ఏ యితర రాజకీయపక్షానికంటె గూడ పార్టీ రాజకీయంగాను నిర్మాణరీత్యా నేడు బలంగా వుంది. దీని అర్థం కాంగ్రెసుకంటె గూడ ప్రజాపలుకుబడి సంపాదించామని గాదు. కాం గ్రెసుకు భారతదేశం మొత్తంమీద వున్న పలుకుబడినిబట్టే ఇచ్చట కాంగ్రెసుకు ప్రజా పలుకుబడి వుంది. గాని, నిర్మాణరీత్యా మనపార్టీ మన రాష్ట్రంలోని కాంగ్రెసు సంస్థకంటె బలంగావుంది. ఏ కొద్దిమంది యువకులతో గూడిన ముఠాగా గాకుండా, ప్రజలకు అన్ని

రంగాలలోను మార్గదర్శకంగా వుంటూ, నాయకత్వం వహించాల్సిన స్థితిలో పార్టీ ప్రవే శించింది. ఈ బాధ్యతను పార్టీ నిర్వహించగలదు. తప్పక నిర్వహించాలి. ప్రజలకు అన్ని రంగాలలో ధైర్యంగా పార్టీనాయకత్వం వహించి, ఆంధ్రదేశ రాజకీయ జీవితాన్ని అభి వృద్ధి చేయాలి. ఈ బాధ్యతను మన పార్టీ నిర్వహించగల్గితే ప్రజలు రక్షింపబడతారు. స్వాతంత్ర్యవుద్యమము బలపడుతుంది. లేకపోతే ప్రజలను అభివృద్ధినిరోధకుల కౌగిలికి అప్పగించినవారమౌతాం. ప్రజారక్షణ, స్వాతంత్ర్యోద్యమము ధ్వంసమవ్వాల్సి వస్తుంది.

(1) ప్రజారంగాల్లో మనం ఇంతవరకు గావిస్తున్నకృషి, ఆందోళన, ప్రచారస్థాయి దాటలేదు. మనం గావించిన ప్రజాసంస్థల నిర్మాణం గూడ, నిజమైన నిర్మాణము గాదు. కేవలం నిర్మాణముయొక్క అస్థిపంజరము మాత్రమే. ప్రజాసంఘాలు స్థానిక ప్రజా యిబ్బందులను తీసుకొని వాటి నివారణకొరకు, కృషిచేయగల నిర్మాణయుక్తంగా లేవు. ప్రజాయిబ్బందులను నివారించడానికి ప్రస్తుతం మనం నిర్మించిన నామకః ప్రజాసంఘాలు పూనుకోకపోతే మన ప్రజావుద్యమం యింక హెచ్చుస్థాయికి పోజాలకపోవడమే గాకుండా వున్న వుద్యమముగూడ విచ్ఛిన్న మౌతుంది.

ప్రజలయొక్క స్థానికసమస్యలను తీసుకొని పనిచెయ్యాలని రాష్ట్రకమిటీ విస్తృత సమావేశం ఇచ్చిన ఈనిర్ణయాన్ని పార్టీసభ్యులు అమలుజరపడానికి మొదలుపెట్టారు. పార్టీసభ్యులే చొరవచేసి అనేకచోట్ల రైతులు, కూలీలు, మహిళలు, విద్యార్థులు మొదలైన వారి ఇబ్బందులను తీర్చడానికి పని ప్రారంభించారు. దినోత్సవాలు జరపడం, రాష్ట్ర మంతటికీ వచ్చిన ఆర్థికసమస్యలమీద జనరలుఆందోళనచేయడం అనే దశనుండి బయట బడి, ఈవిధంగా సాధారణ పార్టీసభ్యులు స్థానిక ఇబ్బందుల నివారణకు నడుముగట్టారు. తామే ఆ యిబ్బందులను తీర్చడానికి కృషిచేస్తున్నారు గాని, అందుకు ప్రజా డిమాన్‌స్ట్రేష నులు, డెప్యుటేషనులను లేవదీయుటకై ప్రజలను తయారుచేయలేదు. "నాయకులుపాటుబడి మనకు స్వాతంత్ర్యం తెస్తారులే - ధనసహాయంచేయడం, నోరుతెరుచుకొనిచూస్తూ గూర్చో డంమాత్రమే మనవంతు" అని ప్రజల్లో గాంధీవాదం ఏర్పరచినభావాన్ని మనం పోగొట్టలేదు. "ప్రజాసేవకులు పిటీషన్లు ఉద్యోగస్థులవద్దకు తీసుకువెళ్ళారు." మనకష్టాలు ఈదేరతాయి అనేభావం ఇప్పుడు ప్రజల్లోఉంది. మనం ప్రజల్లో ఈ ప్రేక్షకభావం (passive spec-tator) పోగొట్టనంతకాలం, ప్రజాఉద్యమాన్ని ఉన్నతస్థాయికి తీసుకుపోలేం. మన పిటీషన్లవెనుక ప్రజాసమీకరణ ఉన్నప్పుడే నిరంకుశోద్యోగులు లొంగుతారు. ప్రజాసమీ కరణ లేకపోవుటచే మనం స్థానిక విజయాలు సాధించలేకుండా ఉన్నాం. దీనికితోడు గ్రామాల్లోనూ పట్టణాలలోనూ పెత్తనదార్లు మన ఇతర రాజకీయ ప్రతికక్షులు (జాతీయ సంఘాలముఠా, కమ్యూనిస్టు వ్యతిరేక కాంగ్రెసువాదులు) అనేకఆటంకాలు పెడుతున్నారు. వీరిఎత్తులను, రాజకీయనినాదాలను అర్థంజేసుకొని, వీటిని ప్రజలముందు బట్టబయలుజేసి, మన జనరలు నినాదాలను ఆయా స్థానిక పరిస్థితుల కన్వయించి, కార్యక్రమమిచ్చి, ప్రజ

లను సమీకరించి, మన ప్రతికక్షుల, ప్రభుత్వోద్యోగుల ఆటంకాలను బ్రద్దలుచేసుకొంటూ ముందుకు పోగల రాజకీయ పరిజ్ఞానం రాజకీయ చైతన్యం, చొరవ, పట్టుదల, సాధారణ సభ్యులలో లేదు. అందుచే ప్రభుత్వోద్యోగులు, పెత్తనదార్లు, మన రాజకీయ ప్రతికక్షులు పెట్టే ఆటంకాలను బ్రద్దలుచేయలేక, పార్టీ ఆర్గనైజర్లకోసం ఎదురుచూస్తూ ఉన్నారు. పార్టీ ఆర్గనైజర్లకుకూడా స్థానికసమస్యలను పరిష్కరించడానికి అవుసరమైన వ్యావహారిక పరిజ్ఞానం (చట్టాలు, ప్రభుత్వ డిపార్టుమెంటులు, కోర్టులు వగైరా) ప్రపంచానుభవం (స్థానికపార్టీలు, పెత్తనదార్లయెత్తులు వగైరా) గానిలేదు. అందుచే వారు సెల్లును సమావేశపర్చడం, సర్క్యులర్లు: వానిలోఉన్నది ఉన్నట్లుచదివి అర్థంచెప్పడం, స్థానిక పరిస్థితులకు అన్వయించకుండా జనరలు సలహాలు ఇచ్చిపోవడం, జరుగుతోంది. అంతేగాని స్థానిక పరిస్థితులను, స్థానికపార్టీలు మొదలైనవాటిని జాగ్రత్తగా తెలుసుకొని, ఆచరణ యోగ్యమైన కార్యక్రమం నిర్ణయించుకొని, తగాదాలు వచ్చినచోట తానుఉండి స్వయంగా పార్టీసభ్యులను నడపడంలేదు, పైగా పార్టీసభ్యులకు రాజకీయస్థాయి (political level) తక్కువఅనీ, కోటాలు పూర్తిచేయడంలేదనీ, పార్టీసభ్యత్వ రుసుము చెల్లించడంలేదనీ, పార్టీసభ్యులను ఆర్గనైజర్లు దబాయించడం (Bossing) జరుగుతోంది. ఆర్గనైజర్లు చేయలేని పనిని ఇస్తున్నారని కొందరూ, తాము పనికిరానివారమని కొందరూ నిస్పృహచెంది నిస్తబ్దంగా ఉండిపోవడం జరుగుతోంది. అందుచే పార్టీఇచ్చిన జాతీయైక్యత ఆధికాహారోత్పత్తి, అధికోత్పత్తి వినాదాలను అమలు జరుపలేకపోవడం, పార్టీలో నిస్తబ్ధత రావడం జరిగింది.

పార్టీ ఆర్గనైజర్లు - ప్రజాసంఘ ఆర్గనైజర్ల సంఘర్షణ

ఈనిస్తబ్ధతే మరొక రూపంలో గూడబయటబడింది. మన పార్టీలో పార్టీఆర్గనైజర్లు, ప్రజారంగ ఆర్గనైజర్లు అనే రెండు వేరువేరుభాగాలు ఏర్పడినవి. పార్టీఆర్గనైజర్లు చాలమంది ప్రజల్లో దైనందిన సమస్యలు తీసుకొని పనిజేసినవారు కాకపోవుటచే, వీరికి ప్రజా సమస్యలు వాటికి సంబంధించిన వ్యవహార జ్ఞానంలేదు, వీరికి సామాన్య ప్రజలతో సంబంధం లేదు. వీరు పుస్తకాలు, పత్రికలు, పార్టీలెటర్లు, శ్రద్ధగాచదివి, పార్టీసభ్యులకు అందులో ఉన్నది ఉన్నట్లుగా, స్థానిక పరిస్థితులకు అన్వయించకుండా చెబుతారు, కోటాలుపంచడం, ఎంతవరకు కోటాలు పూర్తిచేశారని సాధారణ సభ్యులను దబాయించడం తమ బాధ్యతగా అనుకొనేవారు. వీరిలో కొంతమంది చుట్టుపట్ల బహిరంగసభలు, ప్రజాసంఘాల సాధారణ సమావేశాలు జరుగుతుంటే వెళ్ళేవారుగూడగాదు. కనీసం తమ గ్రామంలోని ప్రజలతో సంబంధం పెట్టుకొని, గ్రామ ప్రజాసమస్యలను తీసుకొని పనిజేయడంగూడ చేసేవారుగాదు. వీరు తమ ఏరియాలలోని ప్రజారంగ ఆర్గనైజర్లతో సంబంధం పెట్టుకొని, సరియైన సూచనలు ఇచ్చేవారుగాదు.

ప్రజారంగ ఆర్గనైజర్లకుకొంచెం వ్యవహార జ్ఞానంఉంది. పిటీషన్లు తీసుకొని ప్రభుత్వోద్యోగులవద్దకు వెళ్ళడం, ఏదోచేతనైనంత వరకు . వ్యక్తిగతంగా పనిచేసేవారు. అంతేగాని ఏదైనా ప్రజాసమస్యవచ్చినప్పుడు, అక్కడ పార్టీ సెల్లును సమావేశ పరచడం, వారితో చర్చించడం, నిర్ణయం తీసుకోవడం, దాన్ని పార్టీసభ్యు లందరిచేత జట్టుగా పనిచేయిస్తూ ప్రజలనుసమీకరించడం, తరువాత తాముచేసినపనిని సెల్లులో పునర్విమర్శించుకొని ముందుమార్గ ఆలోచించడం మొదలైన, పార్టీ పద్ధతులతో పనిచేసేవారుగాదు. తమ పనిలో బయటికి వచ్చిన మిలిటెంట్లను పార్టీకి అప్పజెప్పడంగాని, వారికి రాజకీయ పరిజ్ఞానం కల్పించడంగాని చేసేవారుగాదు. వీరిలో కొందరు పార్టీ పత్రికలను, పుస్తకాలను సరిగా చదివి రాజకీయ విజ్ఞానాన్ని అభివృద్ధిపరచుకొనేవారుగూడ గాదు. వీరు పార్టీసిద్ధాంతాలు, ఎత్తుగడలు అనే దీపంతో ప్రజాసమస్యలను పరిష్కరించకుండా, ఏదో గుడ్డిగా తమకు తోచిన విధానంగా చేస్తూ ఉంటారు.

ప్రజారంగ ఆర్గనైజర్లకు రాజకీయస్థాయి లేదనీ, పార్టీ పద్ధతులలో పనిచేయడం తెలియలేదనీ, గుడ్డిగా పనులు చేసేవారనీ (Blind practicalists) పార్టీ ఆర్గనైజర్లు వారిని విమర్శించేవారు. పార్టీ ఆర్గనైజర్లు తమకన్న పుస్తకాలుబాగుగా చదివి అర్థం చేసుకోగలిగినా, ప్రజాసమస్యలను పరిష్కరించలేరనీ, ప్రజలను గూర్చి వారికేమీ తెలియదనీ, జవాబుచెప్పడం జరిగేది. ఈ విధంగా పార్టీ ఆర్గనైజర్లు ప్రజాసంఘ ఆర్గనైజర్లు అనే అసహజమైన విభజనఏర్పడింది. పార్టీకి ప్రజాసంఘాలకుగూడ మధ్య అసహజమైన విభజన ఏర్పడింది.

పార్టీ ఆర్గనైజర్లు, ప్రజారంగ ఆర్గనైజర్లు అంటే పార్టీదృష్టిలో ఏమీ భేదంలేదు. పార్టీఆర్గనైజర్లు ప్రజాసమస్యలను పరిష్కరించడంలో అనుభవం గలిగివుంటేనేగాని, సాధారణ సభ్యులకు సక్రమమైన సూచనలిచ్చి నడుపలేరు. అలాగే ప్రజాసంఘఆర్గనైజర్లకు రాజకీయ పరిజ్ఞానం ఉంటేనేగాని, పార్టీ పద్ధతులలో పనిచేస్తేనేగాని, ప్రజా సమస్యలను పరిష్కరించలేరు. వారు తమ తమ ప్రజారంగాలలో ప్రజా సమస్యలను పరిష్కరించడమేగాక, మిలిటెంట్లను సెల్లులలో ఆర్గనైజుచేసి, వారికి రాజకీయ పరిజ్ఞానమిచ్చి పార్టీ ఆర్గనైజర్లుగా తయారవ్వాలి. లేకపోతే పార్టీ ఆర్గనైజర్లు సిద్ధాంతాలు వల్లించేవారుగాను (theorisers) ప్రజాసంఘ ఆర్గనైజర్లు గుడ్డి ఆచరణవాదులు (Blind Practicalists) గాను తయారవుతారు. పార్టీ ఆర్గనైజర్లు ప్రజాసమస్యలను పరిష్కరిస్తూ ప్రజలచే నాయకులుగా గుర్తింపబడినప్పుడు, ప్రజాసంఘ ఆర్గనైజర్లు పార్టీ పద్ధతులలో పనిచేస్తూ సాధారణ సభ్యులచే నాయకులుగా పరిగణించబడినప్పుడు, పార్టీ ప్రజాపార్టీగా తయారౌతుంది. అప్పుడు పార్టీ పురోగమనాన్ని ఎవ్వరూ ఆటంక పరచలేరు.

పార్టీ ఆర్గనైజర్లు ప్రజారంగ ఆర్గనైజర్ల మధ్య ఈ సంఘర్షణ మిగతా జిల్లాలో స్పష్టంగా ముందుకు రాలేదుగాని కృష్ణాజిల్లా తాలూకాపార్టీ కాన్ఫరెన్సుల సందర్భంలో

తీవ్రరూపంలో బయటబడింది. కమిటీ సభ్యుల ఎన్నిక విషయంలోగూడ తగాధాలు వచ్చినాయి. ఈసంఘర్షణ గుడివాడ, దివితాలూకాలలో ముఠాలుగట్టడం(Fachtiovalism) వరకూ దిగజారింది.

రాష్ట్ర పార్టీ కాన్ఫరెన్సు (1943 జులై)నాటికి పార్టీలో ఈ ప్రమాదం ఉందని రాష్ట్ర కమిటీ గుర్తించింది. కాని ఈ సమస్యలను సరిగా అప్పుడు పరిశీలించడానికి అవకాశం లేకపోవుటచే, రాష్ట్ర పార్టీ కాన్ఫరెన్సు నిర్మాణ మార్పులను చేయలేకపోయింది. తరువాత రాష్ట్ర కమిటీ దీనిని పరిశీలించి, ఈ క్రింది నిర్మాణమార్పులను తీసుకువచ్చింది.

పొలిటికల్ సర్క్యులర్ 11

పార్టీ ఆర్గనైజర్లు ప్రజానాయకులుగా తయారుగావాలి!

నేడు పార్టీ నిర్మాణములో రెండురకాల ఆర్గనైజర్లు వున్నారు: వీరు పార్టీ ఆర్గనైజర్లు, మాస్‌ఫ్రంటు ఆర్గనైజర్లు. (Mass front organisers) పని సులభంగాను, సక్రమంగాను సాగడానికి ఈ పని విభజన జరిగినప్పటికి, వాస్తవంగా వీరు అందరూ పార్టీ ఆర్గనైజర్లే. అందరూ పార్టీసభ్యులుగా వుండి, పార్టీశిక్షణకు కట్టుబడి, దానిచేతనే నడుపబడుతూ వున్నారు. పార్టీఆర్గనైజర్లందరూ పార్టీక్రింద వున్న యే ప్రజారంగాల్లోనైనా పని చేయగలవారైనప్పుడే వారు నిజమైన పార్టీ ఆర్గనైజర్లుగా పరిగణింపబడుతారు. కాని నేటి పరిస్థితియేమి? పార్టీ ఆర్గనైజర్లకు ప్రజారంగాల పనితో యేమీ నిమిత్తంలేదని, ప్రజలతో నేరుగా సంబంధం వుండనవసరంలేదని, వాటిల్లో పనిజేసే పార్టీ సభ్యులతో మాత్రము సంబంధంపెట్టుకొంటే సరిపోతుందనే తప్పుడభిప్రాయం పార్టీలో వ్యాపించియుంది. వీరు పార్టీని నిర్మించేవారుగాను, ప్రజాసంస్థల్లో పనిజేసే ఆర్గనైజర్లు ప్రజాసంస్థలను నిర్మించేవారుగను చూడబడుచున్నారు. ఈ విధంగా రెండువిధాల ఖచ్చితమైన విభజన జరిగింది. ఈ అసహజమైన విభజనవలన పార్టీలో నేడు కల్గుచున్న ఫలితాలనుగూర్చి విచారించుదాం.

పార్టీ ఆర్గనైజర్లు తమ అధీనములోవున్న సెల్లు సహావేశాలను జరిపి, వాటి పనిని గూర్చి 'తనిఖీ' చేయడం. తమ పైకమిటీలకు తాము గావించిన పనినిగూర్చి రిపోర్టు పంపడం, పైకమిటీలనుండి 'ఇన్‌స్ట్రక్షన్సు' తీసుకోవడం, వాటిని తమ క్రిందవున్న సెల్లులచేత 'అమలుజరిపించడం' యివే తమ బాధ్యతలుగా యెంచుతున్నారు. ఏవైనా ప్రజాసమస్యలు పరిష్కరించవలసివచ్చినా, ప్రజాపోరాటాలు వచ్చినా, వాటినిగూర్చి ఆ రంగాలకు సంబంధించిన మాస్‌ఫ్రంటు ఆర్గనైజర్లకు తెలియపర్చడం, వాళ్లను ఆప్రదేశాలకు రప్పించి 'పర్యవేక్షించడం' మాత్రమే తమ బాధ్యత అని పార్టీఆర్గనైజర్లు తలుస్తున్నారు. తమ కండ్లయెదుట జరిగే ప్రజావుద్యమాలల్లో తాము స్వయంగా పాల్గొనడంగాని, వాటికి నాయకత్వం వహించి నడపడంగాని తమ పనిగాదనియు, ఆ పనులు మాస్‌ఫ్రంటు ఆర్గనైజర్లచేతను, సెల్లు సభ్యులచేతనూ చేయించడమే తమ బాధ్యత అని యెంచుతున్నారు.

కొన్ని ఉదాహరణలు తీసుకుని చూద్దాం: ఒక గ్రామములో ఒక సమస్య వచ్చిందనుకోండి. దాన్ని ఆర్గనైజరు యెలా యెదుర్కొంటాడో చూడండి. ఆ ప్రాంత పార్టీసెల్లును సమావేశపర్చి ఆ సమస్యను చర్చించుతాడు. దాన్ని యెలా పరిష్కరించాలో 'సూచనలు, సలహాలు యిస్తాడు. వాటి ననుసరించి ఆ సెల్లు సభ్యులు పనిజేయమని వెళ్ళిపోతాడు. ఆ సమస్యను పరిష్కరించే బాధ్యత తనదికాదనియు, పార్టీ సభ్యులదేనని భావించుతాడు. తానే ఆ ప్రదేశంలో కొన్ని రోజులుండి పార్టీ సభ్యులందరికీ నాయకత్వం వహించి ఆ సమస్యను పరిష్కరించడానికి ప్రజలతో నేరుగా సంబంధం పెట్టుకోడు. అలా చేయక పోవడంవలన రెండు దుష్ఫలితాలు సంభవిస్తున్నాయి. పార్టీసభ్యులు, సానుభూతిపరులతో తప్ప ప్రజలతో యేమీ సంబంధంలేకుండా వుండిపోతున్నాడు. పార్టీసభ్యులకు నాయకుడుగాని, ప్రజలకు నాయకుడుగా తయారవటంలేదు. అలా పార్టీ ముఖ్యులు ప్రజానాయకులుగా తయారవటంలేదు. రెండో దుష్ఫలితం యేమిటంటే పార్టీ ఆర్గనైజరే పార్టీసభ్యులకు నాయకత్వం వహించి వచ్చిన సమస్యలను పరిష్కరించడానికి పూనుకొన్నప్పుడు పార్టీ సభ్యుల ఆత్మవిశ్వాసం బాగా హెచ్చుతుంది; వచ్చే ఆటంకాలను ఆర్గనైజరు యెలా యెదుర్కొని పరిష్కరించాడో ఆచరణలో చూస్తారు. తాముగూడ ఆ పద్ధతులన్నీ అలవర్చుకొని యెట్టి ఆటంకాలనైనా యెదుర్కొని పనిజేయగలమనే ఆత్మవిశ్వాసం వారికి వస్తుంది. అతి వుత్సాహంతో కార్యచరణకు పూనుకుంటారు.

అలాగాకుండా పార్టీ ఆర్గనైజరు సిద్ధాంతరీత్యా సూచనలు, సలహాలు యిచ్చి ఆచరణలో వచ్చే ఆటంకాలను యెలా యెదుర్కోవాలో దగ్గరవుండి పార్టీసభ్యులను నడిపించకపోతే, ఆటంకాలు రాగానే నిరుత్సాహపడి పార్టీసభ్యులు కూర్చోవడమేగాక, ఆర్గనైజరు యిచ్చే సూచనలు, సలహాలు ఆచరణలో పెట్టడం సాధ్యంగాదని, సిద్ధాంతాలకు, ఆచరణకు చాలా-భేదముందని వగైరా పార్టీ వ్యతిరేక పోకడలు పార్టీ సభ్యులలో తయారవుతాయి. అంతేగాకుండా ఆర్గనైజర్లు సిద్ధాంతాలు వల్లించేవారేగాని, ఆచరణలో వారి సూచనలు సిద్ధాంతాలు యెందుకు పనికిరావని తలవడం ప్రారంభించుతూ ఆర్గనైజర్లపై విశ్వాసం నెమ్మదినెమ్మదిగా పోతుంది. ఆ పరిస్థితుల్లో పార్టీ ఆర్గనైజర్లు ప్రజానాయకులుగా తయారుగాకపోవడమేగాక, పార్టీసభ్యులపై నాయకత్వంగూడకోల్పోతారు; పార్టీఅంతా ఒకటీమ్‌లాగ పనిజేయజాలదు. పార్టీ ఆర్గనైజర్లమధ్య, ప్రజారంగాల్లో పనిజేసే పార్టీ సభ్యులమధ్య నానాటికి అఖాతం యేర్పడుతుంది.

మరొక ఉదాహరణ తీసుకుందాం: విద్యార్థిరంగం తీసుకోండి. విద్యార్థి రంగంలోని పార్టీ ఆర్గనైజర్లు (ఫ్రాక్షన్ సభ్యులు, నాయకులు) విద్యార్థి ఫ్రాక్షన్సుతోను, సెల్లులతో మాత్రమే సంబంధం పెట్టుకొనేవారుగాని విద్యార్థి ప్రజాసామాన్యముతో ఏమీ సంబంధం పెట్టుకునేవారుకారు. పార్టీ సభ్యులకు, పార్టీ దగ్గర సానుభూతిపరులకు తప్ప విద్యార్థి ప్రజాసామాన్యమునకు, విద్యార్థిరంగంలో పనిచేసే పార్టీ ఆర్గనైజర్లకు బాగా తెలియదు

కూడాను; పార్టీ సెల్లులను సమావేశపర్చడంతప్ప. విద్యార్థి ప్రజాసామాన్యముకు ఒక బహిరంగసభనుపెట్టి, స్థానికంగా పార్టీసభ్యులు రోజూ యెదుర్కొనే ప్రశ్నలకు, సందేహాలకు చక్కగా సమాధానాలు చెప్పి, పార్టీ పాలసీని విశదపర్చడం జరగడంలేదు. ఇలా చేస్తే పార్టీ సభ్యులు యింకా ఆత్మవిశ్వాసంతో, వుత్సాహంతో ప్రచారం సాగిస్తారు. ప్రత్యర్థుల వాదనలను ధైర్యంతో యెదుర్కొంటారు. పార్టీ ప్రచారం చేసేటప్పుడు ఆచరణలోవచ్చే ఆటంకాలను యెలా యెదుర్కొవాలో పార్టీ ఆర్గనైజర్లు స్వయంగా చూపెట్టగల్గినప్పుడే పార్టీ సభ్యులు ఆత్మవిశ్వాసంతోను, బోల్షివిక్ పట్టుదలతోను పనిజేస్తారు.

అంతేగాకుండా స్థానికంగా విద్యార్థిసంఘాలు యేవైనా ప్రజాఉద్యమాలు నడుపుతుంటే (కిరసనాయిల్, పేపరు వగైరా వాటికి, డిటెన్షన్ రద్దు వగైరా విద్యార్థి ముఖ్య కోర్కెలకొరకు) వాటిని యెలా నడపాలా అని విద్యార్థి సెల్లులలో చర్చించి, సూచనలివ్వడమే తమ బాధ్యతగా చూస్తున్నారుగాని, వాటికి నాయకత్వం వహించి ఆ వుద్యమాల్లో పనిజేయడం తమ బాధ్యతగాదని, ఆ బాధ్యత స్థానికవిద్యార్థి కామ్రేడ్సుదని భావిస్తున్నారు. అలా నాయకత్వం వహించి నడవగలిగినప్పుడే తాము సరియైన సూచనలు, సలహాలు యివ్వగలమనే సంగతి మరచిపోతున్నారు.

ఈ విధంగా పార్టీ ఆర్గనైజర్లు చాలాచోట్ల చేస్తున్నారు. ఫిర్కా, తాలూకా ఆర్గనైజర్లలే నేగాక యీ పొరపాటు అభిప్రాయములు పైకమిటీలోగూడా వున్నాయి. జిల్లా ప్రజారంగాల జనరల్‌బాడీ మీటింగులకు స్వయంగా హాజరగుటగాని, ఆ చర్చలలో పాల్గొని తగిన సూచనలు, సలహాలు యివ్వడంగాని జరగడంలేదు. జిల్లా ఫ్రాక్షన్‌నాయకుని పార్టీ ఆఫీసుకు పిలిపించి, జిల్లాజనరల్‌బాడీ మీటింగులో యేవిధంగా ప్రవర్తించాలో యిన్‌స్ట్రక్షన్సు యివ్వడం మాత్రమే జరుగుతోంది. మహా చేస్తే ఫ్రాక్షను సమావేశాలకు వెళ్ళి వాళ్ళచర్చలలో పాల్గొంటున్నారు. జనరల్‌బాడీ సమావేశానంతరం యేవైనా తప్పులు జరిగితే, జిల్లా కమిటీ "ఇన్‌స్ట్రక్షన్సు" ఫ్రాక్షను సరిగా అమలుజరుపలేదనీ, అందుచేత ఆతప్పులు జరిగాయని బాధ్యతఅంతా ఫ్రాక్షను సభ్యులమీదకు నెట్టివేస్తారు. దీనివలన పని సక్రమముగా జరగకపోవుచుండుటేగాక, జిల్లాకమిటీనాయకత్వముపై ప్రజారంగాల నాయకులకు అసంతృప్తి కలుగుతోంది. ఆచరణలో సాధ్యంగాని 'ఇన్‌స్ట్రక్షన్సు' యిచ్చి, పార్టీ ఆర్గనైజర్లు అమలు జరుపమంటారనే భావాలు గూడా వారిలో వస్తున్నాయి. జిల్లా జనరల్ బాడీ సమావేశాలకు స్వయంగానే హాజరై, తామే నాయకత్వంవహించి, అప్పటి చర్చలను సాగించి, తాము ఫ్రాక్షన్సుకు యిచ్చే కార్యక్రమాన్ని అమలుజరపడం ఎలా సాధ్యమో ప్రత్యక్షంగా రుజువుచేయగల్గితే పైవేవీ సంభవించవు. పని సక్రమముగా జరుగుతుంది. జిల్లాకమిటీ నాయకత్వం యెడల పూర్తివిశ్వాసం ప్రజారంగాల ఫ్రాక్షన్సుకు వుంటుంది. పార్టీఅంతా ఒక టీములాగ పనిజేయటానికి అవకాశం వుంటుంది.

తొలి పలుకు

తాలూకాఫిర్కా ఆర్గనైజర్లకు పార్టీసెల్లులను, వివిధ స్థానిక ప్రజాసంఘాలను నడపడానికి అవసరమైన సూచనలివ్వడమే ఈ పుస్తకంయొక్క ఉద్దేశ్యం. అయినప్పటికీ ఇది కొంతవరకూ సెల్లు కార్యదర్శులకు, పార్టీసభ్యులకు, జిల్లాకమిటీ సభ్యులకుసైతం ఉపయోగపడుతుంది.

దీనిలో మొదట పార్టీయొక్క ప్రాథమిక నిర్మాణసూత్రాలు, పార్టీ ప్రజాపార్టీగా అవడానికి గ్రామాల్లోనూ, పట్టణాలలోను ఏమిచెయ్యాలి, సెల్లులు ఎలా పనిచేయాలి అనే విషయాలమీద వ్రాయబడింది. తరువాత పార్టీకి ప్రజాసంస్థలకు ఎటువంటి సంబంధముండాలి, వివిధ ప్రజారంగాలలో పార్టీని నేడెదుర్కొన్న ప్రధాన సమస్యలేమిటి, వివిధ స్థానిక ప్రజాసంఘాలను సజీవంగా చేయడానికి ఏమిచెయ్యాలి, మొదలైన విషయాలమీద వ్రాయబడింది.

ఆర్గనైజర్సు గుర్తుంచుకోవాలిసింది ఏమంటే, పార్టీ నిర్మాణసూత్రాలను వివిధ ప్రజా రంగాల సమస్యలను గూర్చి, ఇందులో సూత్రప్రాయంగానే చర్చించబడింది. ఈ సూత్రాలను కామ్రేడ్సు తమతమ కైనందిన పనిలోవచ్చిన అనుభవానికి అన్వయించుకొని అర్థంచేసుకోవాలి. ఇదే వాస్తవికంగా అర్థం చేసుకోవడం (Real under standing) అంటే. కామ్రేడ్సు ఈ విధంగా పైసూత్రాలను తమతమ అనుభవానికి అన్వయించి, ఎంతవరకూ సరిఅయినవో చూడాలి. అప్పుడే ఆసూత్రాలను వాస్తవికంగా అర్థం చేసుకోవడం, వాటిని ఆధారంగా తీసుకొని తమతమ ప్రత్యేక పరిస్థితులలో వచ్చే ప్రత్యేక సమస్యలను పరిష్కరించడం చేయగల్గుతారు. ఈవిధంగాచేస్తేనే ఆర్గనైజర్లకు పైపుస్తకం ఉపయోగపడుతుంది. లేక పైపుస్తకంలోని సూత్రాలను తమతమ అనుభవాలకు అన్వయించకుండా, పుస్తకంలో ఉన్నది ఉన్నట్లుగా బట్టీబట్టడం, వాటిని నామమాత్రంగా అర్థం చేసుకోవడం (formal understanding) అవుతుంది. వాటిని మంత్రాలవలె మెకానికలుగా అన్ని పరిస్థితులకు ఒకేవిధంగా అన్వయించడం జరుగుతుంది. అలాచేస్తే పార్టీ సెల్లులను ముందుకు నడుపుటకుమారుగా, తప్పుదారిని పట్టించి, పార్టీని ధ్వంసం చేయడమవుతుంది.

కనుక పార్టీకామ్రేడ్సు ముందుగా ఆ సూత్రాలను తమతమ అనుభవాలకు అన్వయించి, వాస్తవికంగా అర్థంచేసుకోవాలి. అటుతర్వాత వీటిని ఆధారంగాచేసుకొని, తమకు

వచ్చే సమస్యలను పరిష్కరించాలి. దీనిద్వారా మరల ఈ సూత్రాలను ఆచరణలో పరీక్షించాలి. ఇలాచేస్తే పుస్తకం సహాయకారిగా ఉంటుంది.

ఇతర పుస్తకాలు

పై పుస్తకం పార్టీనిర్మాణాన్ని గూర్చి కామ్రేడ్స్ లెనిన్, స్టాలిన్, జోషీలచే వ్రాయబడిన పుస్తకాలను అర్థంచేసుకోడానికి ప్రాతిపదికగా ఉంటుంది. పై పుస్తకం చదివిన తరువాత, ఆర్గనైజర్లు తమయొక్క విజ్ఞానస్థాయిని పెంచుకోడానికి ఈ క్రింది పుస్తకాలను ఈ క్రిందివరుసలో చదవాలి.

(1) What is to be done ?—లెనిన్

(2) One step forward & two steps back — ఇవి లెనిన్ సెలెక్టెడ్ వర్క్స్ రెండవ వాల్యూములో ఉన్నవి ఈ పుస్తకాలు తెలుగులో ప్రచురింపబడలేదు. 1914 యుద్ధానికిపూర్వం కమ్యూనిస్టులు సోషలిస్టులు అంతా ఒకే సంస్థలో రెండవ ఇంటర్నేషనల్‌లో కలిసి ఉండేవారు. అన్ని దేశాల్లోని పార్టీలు సోషలుడెమోక్రాటు పార్టీలని పిలువబడేవి. ఇప్పటి కమ్యూనిస్టులు తీవ్రవాదులని, సోషలిస్టులు మితవాదులనీ పిలువబడేవారు. మితవాదులు కార్మికవర్గాన్ని బూర్జువాతోకగా జేసే రాజకీయ కార్యక్రమం అవలంబించేవారు. తీవ్రవాదులు బూర్జువావర్గాన్ని పడద్రోసి, అధికారాన్ని లాక్కునే రాజకీయ కార్యక్రమాన్ని అవలంబించేవారు. రాజకీయంగా ఉన్న ఈ భేదమే పార్టీ నిర్మాణవిషయాలలోగూడ ప్రతిబింబించింది. రష్యాలోని మితవాదులు పనిచేయనివారిని గూడ పార్టీలో చేర్చడం, పార్టీలోని కమిటీసెల్లులు ఒకే కేంద్రనాయకత్వం క్రింద శిక్షణతో పనిచెయ్యడానికి (Democratic centralism) అంగీకరించకపోవడం, మొదలైనవి చేస్తూ, సోషలుడెమాక్రాటికుపార్టీని కార్మికవర్గానికి నాయకత్వం వహించేదిగాక, ఒక గుదిబండగా తయారుచేయడానికి ప్రయత్నించారు.

సోషలుడెమోక్రెటిక్ పార్టీ, కార్మికవర్గం అధికారం హస్తగతం చేసుకోవడానికి ముందుండి నడిపే అగ్రగామిగా తయారవాలంటే, మితవాదులు (మెన్షివిక్కులు) సూచించే నిర్మాణసూత్రాలు ఎలా తప్పో పై పుస్తకాలలో అతివాదుల (బోల్షివిక్కుల) నాయకుడు లెనిన్ వివరించాడు. పార్టీలో ప్రతి సభ్యుడు పనిచెయ్యాలి, పార్టీఅంతా కేంద్రనాయకత్వంక్రింద ఐక్యంగా పనిచేయ్యాలి. (Democratic centralism) అనే విప్లవ నిర్మాణసూత్రాలమీద కార్మికవర్గపార్టీ ఎలా నిర్మింపబడాలో నిరూపించాడు.

(3) లెనినిజం — స్టాలిన్ :— ఇది ఇంగ్లీషులో ప్రకటించబడింది. దీనిలోని భాగాలనే ప్రజాశక్తి ప్రచురణలుగా, నిర్మాణసమస్యలు, లెనినిజం అనేరెండు పుస్తకాలు తెలుగులో ప్రచురించబడినవి.

కామ్రేడ్ స్టాలిన్ పై పుస్తకంలో, పార్టీ నిర్మాణసూత్రాలను, పార్టీ తన కార్యాచరణలో అవలంబించాలిసిన విప్లవ ఎత్తుగడలను (Strategy & tactics) గూర్చి వివరించాడు. వీటిని అవలంబించుటద్వారానే, సోవియటుయూనియనులో అక్టోబరు విప్లవంలో కార్మికవర్గం ఎలా అధికారాన్ని సంపాదించిందీ, తరువాత ప్రపంచ పెట్టుబడిదారీ వ్యతిరేక వాతావరణంలో ఎలా సోషలిజాన్ని నిర్మించిందీ, వివరించాడు. అంతేగాక పార్టీ వివిధ దశలలో పార్టీ వ్యతిరేకశక్తులు (antiparty tendencies) ఎలా ఉద్భవించిందీ, వాటిని ఎలా నిర్మూలించి పార్టీని బలమైనకార్మికవర్గ ఆయుధంగా ఎలాచేసిందీ, గూడ వివరించాడు.

(4) సోవియటుయూనియను కమ్యూనిస్టుపార్టీ చరిత్ర — స్టాలిన్ :— దీనిలో కామ్రేడ్ స్టాలిన్ మార్క్స్ లెనినులయొక్క సిద్ధాంతాలను, ఎత్తుగడలను, పార్టీ నిర్మాణ సూత్రాలను సామాన్య ఉదాహరణలతో సులభంగా అర్థమయ్యేటట్లు వివరించాడు. వీటిని సోవియటుయూనియను కమ్యూనిస్టుపార్టీ చరిత్రకు అన్వయించాడు. పైవాటిని ఆధారంగా చేసుకొని, సోవియటుయూనియను కమ్యూనిస్టుపార్టీ ప్రజలను ఎలా సమీకరించిందీ, ఎలా రాజకీయాధికారాన్ని కార్మికవర్గం లాక్కొని సోషలిస్టు సమాజాన్ని నిర్మించిందీ పార్టీ వ్యతిరేకశక్తులు వివిధ దశల్లో ఎలా పుట్టిందీ, వాటిని ఎలా నాశనం చేసిందీ, వివరించాడు. దీన్నిచదివితే ఆచరణలో ఎలా మార్క్సిస్టు - లెనినిస్టు సిద్ధాంతాలను ఎత్తుగడలను నిర్మాణ సూత్రాలను అన్వయించాలో అర్థమవుతుంది. ఈ పుస్తకాన్ని చదివేటప్పుడు కామ్రేడ్స్, మన దేశపరిస్థితులకు మన ప్రత్యేక సమస్యలకు ఎలా వాటిని అన్వయించాలో ఆలోచించాలి.

(5) Principles of party organisation:—ఈపుస్తకాన్ని కేంద్రకమిటీ ఇంగ్లీషులో ప్రకటించింది. దీనినే తెలుగులో 3 సం॥ క్రితం రాష్ట్రకమిటీ 'థీసిస్' అనే పేరుతో ప్రకటించింది.

ఇది 1921 లో జరిగిన కమ్యూనిస్టు అంతర్జాతీయ మహాసభ (Communist International) యొక్క మూడవమహావేశంలో, కమ్యూనిస్టుపార్టీల నిర్మాణ యంత్రం (structure)ను గూర్చినథీసిస్. దీనిలో కమ్యూనిస్టుపార్టీల ప్రాథమిక నిర్మాణసూత్రాలు దైనందిన కార్యకలాపం ఎలా సాగించాలి, మొదలైన విషయాలనుగూర్చి జనరలుగా వ్రాయబడింది. ఆర్గనైజర్లు దీన్ని తప్పక చదవాలి.

(6) భారత కమ్యూనిస్టుపార్టీ నిర్మాణచరిత్ర :—కామ్రేడ్ చలసాని వాసుదేవరావు. దీనిలో పార్టీయొక్క వివిధదశలలో పార్టీపాలసీ, పార్టీ నిర్మాణంలోని లోపాలోపాలు చర్చించబడినాయి. ఇప్పటి మన పార్టీపాలసీ, నిర్మాణపద్ధతులు సరిగా అర్థంచేసుకోవడానికి, ఈపుస్తకం తప్పక చదవాలి.

(7) పార్టీ నిబంధనావళి :—పార్టీ రహస్యంగా ఉండేటప్పుడు ఉన్న నిబంధనావళిని మార్చి, పార్టీయొక్క ప్రస్తుత లీగలుదశకు అన్వయింపబడిన నిబంధనావళి 1943 జూనులో జరిగిన ప్రథమపార్టీ మహాసభలో అంగీకరించబడింది.

(8) కేంద్ర, రాష్ట్రప్లీనంల రిపోర్టులు :—వీటిలో ఆయా పరిస్థితులలో పార్టీ నెదుర్కొన్న రాజకీయనిర్మాణసమస్యల పరిష్కారాన్ని గూర్చి వ్రాయబడింది. వీటిని ఈక్రింది వరుసలో చదవాలి.

(అ) 1942 సెప్టెంబరు కేంద్రప్లీనం రిపోర్టులు, తీర్మానాలు. తీర్మానాలు ప్రజాశక్తిలో ప్రచురింపబడినవి. కామ్రేడ్ అధికారియొక్క రాజకీయ రిపోర్టు, కామ్రేడ్ జోషియొక్క ఆర్గనైజేషనలు రిపోర్టు వేరువేరుగా తెలుగులో ప్రచురించబడినవి.

(ఆ) 1943 రాష్ట్రప్లీనం తీర్మానాలు. వీనిలో ప్రతి రంగంయొక్క ప్రాముఖ్యత, కార్యక్రమంతోగూడిన వివరమైన తీర్మానాలుఉన్నవి. ఇవి పార్టీసభ్యులపనికి ఎప్పుడూ 'గైడు' గా ఉపయోగపడతాయి.

(ఇ) 1943 ఫిబ్రవరి కేంద్రప్లీనంరిపోర్టు. దీనిలో ముఖ్యమైన పార్టీనిర్మాణ మార్పులున్నవి. ప్రస్తుత పార్టీయొక్క లీగలుదశకు అనుగుణ్యంగా పార్టీలో చేయబడిన నిర్మాణ మార్పులనుగూర్చి వివరంగా ఉంది.

(ఈ) 1943 జూన్ పార్టీకాంగ్రెసు రిపోర్టులు, తీర్మానాలు, జోషిరిపోర్టు, రాజకీయ తీర్మానం తెలుగులో ప్రచురించబడినవి.

(ఉ) 3 వ ఆంధ్రరాష్ట్ర కమ్యూనిస్టు మహాసభ (1943 జులై) రిపోర్టు. ఇది చాల ముఖ్యమైనది. దీనిలో ఆంధ్రపార్టీ క్లుప్తచరిత్రనుగూర్చి వ్రాయబడింది. ఇది ప్రతి పార్టీ సభ్యుడు జాగ్రత్తగా చదవాలి. ఇందులో కాన్ఫరెన్సు తీర్మానాలుగూడ ఉన్నవి.

(ఊ) 1944 జనవరిలోజరిగిన ఆంధ్రప్లీనం సమావేశంరిపోర్టు. దానిలో ప్రస్తుతం పార్టీ నెదుర్కొన్న రాజకీయ ఆర్థిక నిర్మాణ సమస్యలనుగూర్చి సూచన లివ్వబడినవి.

పార్టీ నిర్మాణములో వచ్చిన పై ముఖ్య లోపాలను వెంటనే తొలగించుకోందే పార్టీ ముందడుగు వేయజాలదు; పార్టీ ఆర్గనైజర్లు కేవలం పార్టీసూపరువైజర్లుగా మాత్రం పని జేయడం మానివేయాలి; ప్రజానాయకులుగా తయారుగావాలి; ఏ రంగానైనా నిర్వహించడానికి శక్తిసామర్థ్యములు కలిగివుండాలి. అందుకుగాను యీ క్రింది సూచనల ననుసరించి పార్టీ నిర్మాణములో మార్పులు తీసుకురావాలి.

(1) స్థానికంగా యిప్పుడు రెండురకాల ఫిర్కా ఆర్గనైజర్లు యేర్పడ్డారు. (పార్టీ ఆర్గనైజరు, మాస్‌ఫ్రంట్ ఆర్గనైజరు) ఈ అసహజమైన విభజనను తొలగించాలి. స్థానికంగా పనిజేసే ప్రతి ఆర్గనైజరు తన ప్రాంతంలోను, తనకు నియమించిన ఫ్రంటులోను ప్రజారంగాల పనిని, పార్టీ నిర్మాణపు పనిని చూడాల్సివుంటుంది. ఫిర్కా పార్టీ ఆర్గనైజరుగావున్న తాను నిర్వహించగలిగిన యేదో ఒక ప్రజారంగపు బాధ్యతను తీసుకోవాలి. ఆ రంగంలో ప్రజానాయకుడుగా తయారుగావాలి; ఆ రంగానికి సంబంధించినంతవరకు పార్టీ నిర్మాణమునకుగూడ అతనిదే బాధ్యత. అదేవిధంగా ప్రతి ఫిర్కా మాస్‌ఫ్రంటు ఆర్గనైజరు తనకు నియమించిన ప్రజారంగ బాధ్యతతోబాటు ఆ రంగంలోని పార్టీ నిర్మాణపు బాధ్యతను తీసుకోవాలి. ఆ బాధ్యత ఫిర్కా పార్టీ ఆర్గనైజరుదిలే అని యిదివరకు మాదిరిగా వదలివేయరాదు: ఫిర్కా పార్టీ ఆర్గనైజేషన్ పని చూడడానికి ప్రత్యేకంగా యికముందు ఫిర్కా పార్టీ ఆర్గనైజర్లు వుండరు. ప్రజారంగాల ఆర్గనైజర్లే వాళ్ళవాళ్ళ రంగాల పార్టీనిర్మాణమును అభివృద్ధిజేసేబాధ్యత తీసుకుంటారు. ఫిర్కా పార్టీ ఆర్గనైజరు కూడ ఒక మాస్‌ఫ్రంటు ఆర్గనైజరుగా మారి తనరంగంలోను, ప్రాంతంలోను పార్టీ నిర్మాణాన్ని, ప్రజాసంఘ నిర్మాణాన్ని చూచే బాధ్యత తీసుకుంటాడు. ఈవిధంగా ఫిర్కా పార్టీ ఆర్గనైజర్లని, మాస్‌ఫ్రంటు ఆర్గనైజర్లని, రెండురకాల ఆర్గనైజర్లు తొలగింపబడి, యేదో ఒక ప్రజారంగం బాధ్యత, దానిలో పార్టీనిర్మాణాన్ని అభివృద్ధిజేసే బాధ్యత - రెండు బాధ్యతలు నిర్వహించగల ఆర్గనైజర్లుమాత్రమే వుంటారు. వీరు తమ ప్రజారంగాలకు మాత్రమే నాయకులుగా గాక పార్టీనాయకులుగా గూడ తయారవుతారు. ఈ విధంగా మన పార్టీ ఆర్గనైజర్లు నిజమైన ప్రజానాయకులుగను, పార్టీ నాయకులుగను తయారవుతారు. పార్టీ ఆర్గనైజర్లని, మాస్‌ఫ్రంటు ఆర్గనైజర్లని పార్టీలోప్రస్తుతమున్న అసహజమైన విభజన అంతమొందుతుంది.

ఇలా యేర్పడ్డ స్థానిక ఆర్గనైజర్ల పనిని తాలూకా కమిటీ, తాలూకా ఆర్గనైజర్లుగాని, అది లేనిచోట్ల జిల్లాకమిటీ, జిల్లా ఆర్గనైజర్లుగాని, తనిఖీచేయాలి. ఏ ప్రజారంగానికైనా ఆర్గనైజరు ఏర్పడకపోతే, ఆ రంగపుపనిని ఆ ప్రాంతపుపార్టీ నిర్మాణాన్ని అభివృద్ధి చేసే బాధ్యతను ఆ యేరియాలో పనిజేసే ఆర్గనైజరు తాలూకా ఆర్గనైజరు సహాయంతో తీసుకోవాలి. కాని యిది అతని ప్రధానపనిగా వుండదు; అతనుతీసుకున్న ప్రజారంగాన్ని, దానిలో పార్టీనిర్మాణమును అభివృద్ధిచేయడమే ప్రధాన పనిగా వుంటుంది.

ఇలా యేర్పడ్డ ఆర్గనైజర్సు యేయే కేంద్రాలపై కేంద్రీకరించి పనిజేయాల్సింది వాళ్ళ శక్తిసామర్ధ్యాలనుబట్టి, కేంద్రాల ప్రాముఖ్యతనుబట్టి తాలూకా కమిటీ నిర్ణయించుతుంది.

పైవిధంగా స్థానికపార్టీ నిర్మాణములో మార్పులు తీసుకురావాలి.

జిల్లా, తాలూకా కమిటీసభ్యులు - ఆర్గనైజర్లుగూడ ప్రజా నాయకులు గావాలి :

ప్రతి తాలూకా కమిటీ సభ్యుడు తన ప్రాంతంలోని యేదో ఒక ప్రజారంగాన్ని అభివృద్ధిచేసే బాధ్యత తీసుకోవాలి. కేవలం ఆ రంగానికి చెందిన ఫ్రాక్షన్ సభ్యులతో సంబంధం పెట్టుకోవడమేగాక, తాను తీసుకున్న ప్రజారంగంలో తాలూకా జనరల్‌బాడీలలోను, వర్కింగు కమిటీలలోను ప్రతిసమావేశానికిహాజరై, అచ్చట పార్టీసభ్యులనందరినీ నడపాలి. చర్చల్లో ముఖ్యపాత్ర వహించాలి. అలా చేయడంద్వారా తనకు ప్రత్యేకించిన ప్రజారంగంలో యెంతో అనుభవాన్ని పొందుతాడు; ఆ రంగంలో ప్రజానాయకుడుగా తయారు కాగల్గుతాడు.

జనరల్‌బాడీ సభ్యుడుగాగాని, వర్కింగుకమిటీ సభ్యుడుగాగాని ఇప్పుడు లేకపోతే ముందు సంవత్సరంలోనైనా తప్పక వచ్చేటట్లుచూడాలి. అంతవరకు సౌహార్ద్ర ప్రతినిధిగా జనరల్‌బాడీ సమావేశాల్లో పాల్గొనాలి. జనరల్‌బాడీ సభ్యుడుగా రావడమేగాకుండా, తాలూకా వర్కింగుకమిటీ సభ్యుడుగాగూడా రావటానికి ప్రయత్నంచేయాలి.

ఇదేవిధంగా జిల్లాకమిటీ సభ్యులు, ఆర్గనైజర్లు వాళ్లుతీసుకున్న ప్రజారంగాల జిల్లా జనరల్‌బాడీలకు, వర్కింగుకమిటీ మీటింగులకు హాజరయి, అచ్చటి చర్చలలో ముఖ్యపాత్ర వహించాలి. వీరుగూడ వచ్చే సంవత్సరంలో జనరల్‌బాడీ సభ్యులుగా వచ్చేటట్లు ప్రయత్నించాలి.

మనం యీరీతిగా ఆర్గనైజర్లను తయారుచేయ నారంభించినపుడు నేడు మనపార్టీ కమిటీలలోని ఒక గొప్ప లోపంగూడపోతుంది. ఆ లోపమేమిటి? మన పార్టీ కమిటీలలో, సిద్ధాంతజ్ఞానం, నిర్మాణశక్తిలేదని, ప్రజానాయకులుగా గుర్తించబడేవారు లేకుండా కమిటీలు కొన్నిచోట్ల యేర్పడియున్నాయి. నేడు మన పార్టీ కమిటీలు, మన పార్టీలోని అన్నిపోకడలను ప్రతిబింబించేవిగా వుండాలి. అలా వున్నప్పుడే పార్టీసభ్యులు విశ్వాసం, ఉత్సాహంతో పనిచేస్తారు. పార్టీ సభ్యులను, ప్రజలను పార్టీ కమిటీ నడుపగల్గుతుంది. పార్టీ సభ్యులలో రాజకీయ ఐక్యత, చైతన్యం హెచ్చేకొలదీ, పార్టీకమిటీలు పనిచేసే కొలదీ, పార్టీ కమిటీలోగూడ రాజకీయ ఐక్యతవస్తుంది. అంతేగాని, రాజకీయ ఐక్యతగల పార్టీ కమిటీ కావాలని, కేవలం సిద్ధాంతజ్ఞానం, పార్టీ నిర్మాణశక్తిలేని ప్రజాసంఘ నాయ

కులతోగూడిన కమిటీగాని, ప్రజలతో సంబంధంలేని, కేవలం పుస్తక సిద్ధాంతజ్ఞానమున్న పార్టీ సభ్యులతో పార్టీకమిటీని యేర్పరచడంగాని పనికిరాదు. పార్టీకమిటీలలో ప్రజాసంఘ నాయకులూ, సిద్ధాంతజ్ఞానమున్న కామ్రేడ్సు యిరువురూ ఉంటే ప్రజాసంఘ నాయకుల నుండి ఆచరణ కార్యవిధానాన్ని, సిద్ధాంతజ్ఞానమున్నవారు నేర్చుకొంటారు. వీరివద్దనుండి ప్రజా నాయకులు సిద్ధాంతజ్ఞానం, పార్టీ నిర్మాణ విధానాన్ని నేర్చుకొంటారు. ఈరీతిగా పార్టీ నాయకులు ప్రజా నాయకులుగానూ, ప్రజానాయకులు పార్టీ నాయకులుగానూ తయారవుతారు.

పార్టీ పునర్నిర్మాణము

పొలిటికల్ సర్క్యులర్ నెం. 11 లో పార్టీ పునర్నిర్మాణముగూర్చి కొన్ని సామాన్య సూత్రాలు యివ్వబడ్డాయి వాటిని ప్రతి జిల్లాకమిటీ స్థానికంగా అమలుపర్చడానికి సహాయకారిగా వుండేందుకుగాను రాష్ట్రకమిటీ ఈ క్రింది ప్లానును తయారుచేసింది. దానిప్రకారం ప్రతి జిల్లా కమిటీ పార్టీని పునర్నిర్మించాలి.

1. (అ) పార్టీపనిని, ప్రజారంగాల పనిని ఆర్గనైజర్లు తమలో తాము విభజించుకొనేటప్పుడు ప్రభుత్వం విభజించిన ఫిర్కా, తాలూకా ప్రాంతాలను యింతవరకూ యూనిట్లుగా తీసుకుంటున్నారు. ఇకముందు నుంచి పార్టీ పలుకుబడి, రాజకీయ ప్రాముఖ్యతగల ప్రాంతాలను కేంద్రాలుగా యేర్పరచి-ఆర్గనైజర్లమధ్య పనిని విభజించాలి. ఇదివరకే రాజకీయ ప్రాముఖ్యతగల ప్రాంతాలను (కాంగ్రెసు పలుకుబడిగల గ్రామాలు) అచ్చట పార్టీయూనిట్లు యేర్పడలేదనే వుద్దేశ్యంతో విడిచిపెట్టరాదు. బాగా అభివృద్ధిగాంచిన పార్టీ పలుకుబడిగల ప్రాంతాలనుండి సమర్థులైన వారిని ఆ ప్రాంతాలకు పంపి అచ్చట కేంద్రాలు యేర్పరచాలి. యే కేంద్రంలో యే ప్రజారంగ పై కేంద్రీకరించి పనిజేస్తే ప్రజాఉద్యమము, పార్టీ అభివృద్ధి అవడానికి వీలుంటుందో పరిశీలించి ఆ రంగాన్ని ప్రధానంగా అభివృద్ధి జేయుటకు కృషిజేయాలి. తదితర రంగాలను క్రమక్రమేణా అభివృద్ధిజేయాలి. పై విధంగా జేసినప్పుడు పార్టీ పలుకుబడివున్న ప్రాంతాలలో పార్టీ బలపడటమే గాక, రాజకీయంగా ప్రాముఖ్యతగల అన్ని ప్రాంతాలకు పార్టీ వ్యాపించి ప్రజల రాజకీయజీవితంలో అభివృద్ధికరమైన మార్పు తీసుకురాగలుగుతాం; పార్టీ అన్ని ప్రాంతాలకు విస్తరించడానికి అవకాశం వుంటుంది.

(ఆ) పై విధంగా కేంద్రాలను నిర్ణయించిన తరువాత వాటిని ప్రస్తుతము ఫిర్కాలో వున్న పార్టీ, ప్రజారంగాల ఆర్గనైజర్లమధ్య విభజించాలి. ప్రతి ఆర్గనైజరుకు ఒక్కొక్క కేంద్రం యివ్వాలి. ఆ కేంద్రాలలో పార్టీనిర్మాణమును అభివృద్ధిజేసే బాధ్యత, అతను నిర్వహించగల యేదో ఒక ప్రజారంగం బాధ్యత, అతనికి యివ్వాలి. ఆ కేంద్రంలో రెండు సెల్లులకన్నా ఎక్కువ లేనప్పుడు అచ్చటి ప్రధానసెల్లుకు అతన్ని కార్యదర్శిగా చేయాలి.

రెండవసెల్లు పనిచేయడానికి ఆ సెల్లు కార్యదర్శికి తోడ్పడుతూ వుండాలి. అతను ప్రత్యేకంగా బాధ్యతతీసుకున్న ప్రజారంగంగాక, ఆ కేంద్రంలోని తదితర ప్రజారంగాలు అంతగా అభివృద్ధిజెందనప్పుడు (వాటికి ప్రత్యేక ఆర్గనైజర్లు లేనప్పుడు) వాటినిగూడ అభివృద్ధిజేసే బాధ్యత అతనే తీసుకోవాలి. తన కేంద్రం ప్రక్కనున్న మరో కేంద్రంలోని తనకు సంబంధించిన ప్రజారంగాన్ని (దానికి ప్రత్యేక ఆర్గనైజరు లేనప్పుడు) అభివృద్ధి జేయడానికి ఆ కేంద్రంలోని ఆర్గనైజరుకు సహాయపడాలి. అలాగే తన కేంద్రంలోవున్న యితర ప్రజారంగాలను అభివృద్ధిజేయడానికి వాటికి సంబంధించిన ఇతర కేంద్రాల ఆర్గనైజర్లసహాయం పొందుతూవుండాలి.

(ఇ) ఒక కేంద్రంలో రెండు సెల్లులకన్నా హెచ్చుపార్టీ సెల్లులు వున్నప్పుడు, అచ్చటి ప్రజారంగాలు, బాగా అభివృద్ధి చెందినప్పుడు అభివృద్ధి గాంచుచున్న అన్ని ప్రజారంగాలకు ప్రత్యేక ఆర్గనైజరులను నియమించాలి. ఈ ఆర్గనైజర్లు తమ రంగాలను అభివృద్ధి జేస్తూవుండడమే గాకుండా వాటిల్లో పార్టీనిర్మాణమును అభివృద్ధిజేసే బాధ్యత గూడ వారు తీసుకోవాలి. ఆ కేంద్రంలో తమ ప్రజారంగాన్నంతా చూచుకొంటూ తమ రంగంలో ప్రధానమైన గ్రామంలో కేంద్రీకరించి పనిజేయాలి. కేంద్రంలోని యితర గ్రామాలకు వెళ్ళినప్పుడు అచ్చట తమ రంగానికి సంబంధించిన ఫన్‌క్షనల్ సెల్సు యేవైనా వుంటే వాటిని సమావేశపర్చాలి. తమ రంగాలకు సంబంధించిన సమస్యలను ప్రధాన సమస్యలుగా జేసి ప్రజలందరినీ సమీకరించాల్సిన అవసరము వచ్చినప్పుడు తమ ఫన్‌క్షనల్ సెల్సునేగాక, అచ్చటి తదితర సెల్లులతోకలిపి జాయంటు సమావేశం చేయవచ్చును. ఆసమావేశంలో ఆ ప్రత్యేకసమస్యనుగూర్చి మాత్రమే చర్చించాలి. గాని పార్టీనిర్మాణమునకు సంబంధించిన తదితర సమస్యలగూర్చి చర్చించ నవసరంలేదు. దీనివలన యే రంగంలో పనిజేసేవారు ఆ రంగంలోని ప్రజలను సమీకరించడమే గాకుండా, ఆ ప్రాంతపు అన్నివర్గాల ప్రజలను ప్రధాన సమస్యలన్నిటిమీద సమీకరించడానికి వీలవుతుంది. ప్రధానమైన ప్రజాసమస్యలన్నిటిపై అన్ని రంగాలు ఒకదానికొకటి సహకారం జేసుకుంటూ కలసి పని చేయగల్గుతాయి. ఉదాహరణకు: ఒక గ్రామములో కూలీ రేట్లను హెచ్చింపజేయడానికి ఆ గ్రామ కూలీసంఘం పనిజేస్తున్నప్పుడు అచ్చటి ఫన్‌క్షనల్ సెల్లు సభ్యులే తంటాలుపడకుండా ఆ సమస్యపై రైతుఫ్రంటులో పనిజేసే కామ్రేడ్సు గూడ వాళ్ళకు తోడ్పడేటట్లు చూడాలి. అందుకు కూలీఫ్రంటు ఆర్గనైజరు కూలీ సెల్లును, రైతు సెల్లును సమావేశపర్చవచ్చును. కూలీరేట్లను హెచ్చింపజేయడానికి రైతుల సహకారం గూడ యెలా సంపాదించాలో, అందుకు రైతుల్లో యెలా పనిజేయాలో ఒక కార్యక్రమము నిర్ణయించుకోవచ్చును.

పైవిధమైన కేంద్రాలలో (పార్టీసెల్లులు హెచ్చుగావుండి, ప్రజారంగాలు అభివృద్ధి పొందిన ప్రాంతాల్లో) తమ తమ రంగాల్లో పార్టీ ఆర్గనైజేషన్ బాధ్యత చూచుకొంటున్న

ప్పటికిని మొత్తం కేంద్రంలో అన్నిసెల్లులు సక్రమంగా పనిజేయించేటట్లు ఒకరు ప్రత్యేక బాధ్యత తీసుకోకపోతే పార్టీ నిర్మాణములో ఒక క్రమపద్ధతి వుండదు. ఆ పరిస్థితుల్లో ఆర్గనైజర్లకు సహాయపడడానికి, సెల్సు సరిగా పనిచేస్తున్నదీ లేనిదీ తనిఖీచేయడానికి, ఒక ఆర్గనైజరు అవసరం. ఆ ఆర్గనైజరును ప్రత్యేకంగా బైటనుండి తీసుకురానవసరం లేదు. ఆ కేంద్రంలోని ఆర్గనైజర్లలో రాజకీయంగాను, నిర్మాణరీత్యా బాగా అభివృద్ధిచెందిన వానిని ఆ పనికి నియమించవచ్చును. అతను యితర ఆర్గనైజర్లనుగూడ సెల్లులచే బాగా పని జేయించేటట్లు తర్ఫీతుచెయ్యాలి. అందుకు వారిని అతను సెల్లు సమావేశాలకు వెళ్ళునప్పుడు వెంటబెట్టుకొని తీసుకువెళ్ళాలి, తనిఖీచేసే పద్ధతులన్నీ వారికిగూడ నేర్పాలి. అతనికిచ్చిన ప్రజారంగాన్ని చూచుకుంటూనే సెల్సు అన్నీ సక్రమముగా పనిజేసేటట్లు చూస్తూవుండాలి. యీపనికొరకు తన కిచ్చిన ప్రజారంగపు పనిని యెన్నడూ మానరాదు. సెంటరు పనికంతకూ బాధ్యతవహించే ప్రధాన ఆర్గనైజరుగూడ ఆ సెంటరులోని ఒక ముఖ్య గ్రామంలో కేంద్రీకరించి పనిచేయాలి.

2. తాలూకా కమిటీ కార్యదర్శి, సహాయక కార్యదర్శి (ఆఫీసులో వుండేఅతను), తాలూకా రైతుసంఘ అధ్యక్షకార్యదర్శులు, బాగాపనిజేస్తూ సక్రమమైన ఆఫీసులుకలిగిన తాలూకా యువజనసంఘ అధ్యక్ష కార్యదర్శులు - వీళ్ళుతప్ప తతిమ్మా తాలూకాకమిటీ సభ్యులు, తాలూకా ప్రజారంగాల వర్కింగుకమిటీ సభ్యులు అందరూ పైవిధంగా నిర్ణయించిన కేంద్రాలలో ఆర్గనైజర్లుగానో, ప్రధాన గ్రామసెల్లు కార్యదర్శులుగానో వుండి పనిజేయాలి. కేంద్రాల్లో నియమించకుండా తాలూకా మొత్తం పనికి మినహాయించిన పైన జెప్పబడ్డవారు ఒకరు ఆఫీసులోవుంటూ రెండవవారు తాలూకాలోని కేంద్రాలల్లో పనిని తనిఖీచేయడానికి, అచ్చటి ఆర్గనైజర్లకు తోడ్పడడానికి పనిచేస్తారు. ఈవిధంగా ఒకరు ఆఫీసులోవుంటారు. మరొకరు తాలూకాలో యెప్పుడూ కేంద్రాలకు వెళ్ళుతారు.

తాలూకా వ్యవసాయకూలీసంఘం ఆఫీసులో ప్రత్యేకంగా ఒక కామ్రేడు వుండనవసరంలేదు. తాలూకా రైతుసంఘం ఆఫీసులోని కామ్రేడే ఆఫీసు కరెస్పాండెన్సు చూస్తూ వుండవచ్చును. ఆ తాలూకాకు వ్యవసాయకూలీ ఫ్రంటుకు నియమించిన జిల్లా ఆర్గనైజరు వచ్చినపుడు అతనిచేత ఆ పనిఅంతా చేయించవచ్చును. డెప్యుటేషన్సు వుంటే జిల్లా ఆర్గనైజరే నడుపుతాడు. తాలూకా రైతుసంఘ ఆఫీసు బాగా పనిచేయనిచోట్ల తాలూకాపార్టీ ఆఫీసే పైపని చూడవచ్చును.

జిల్లా పార్టీ కమిటీసభ్యులు, ఆర్గనైజరు, వీళ్ళమధ్యనుకూడ పని విభజన జరగాలి. ప్రతిఒక్కరికి ఒక్కొక్క ప్రజారంగం బాధ్యతఇవ్వాలి; ప్రాంతంగూడా నిర్ణయించాలి. ప్రజారంగాల వర్కింగుకమిటీ సభ్యులకు (అధ్యక్ష, కార్యదర్శులను మినహాయించి) కూడ ఒకప్రాంతం నిర్ణయించి వారిచే పనిచేయించాలి.

3. (అ) ఇప్పుడున్నట్లుగా తాలూకా ప్రజారంగాల ఫ్రాక్షన్సు వుండనవసరంలేదు. వాటిని రద్దుపరచవచ్చును. తాలూకా ప్రజారంగాల వర్కింగుకమిటీ మీటింగుల ముందు తాలూకా పార్టీకమిటీ విస్తృత సమావేశం జరుగుతుంది గాబట్టి ప్రజారంగాల ముఖ్యులందరూ ఆ సమావేశానికి వస్తారు. అచ్చటే తాలూకా ఫ్రాక్షనులు చర్చించే విషయాలన్నీ చర్చించవచ్చును. అంతే కాకుండా ప్రజారంగాల తాలూకా కమిటీలన్నిటిలో దాదాపు అన్నిస్థానాలు పార్టీసభ్యులే ఆక్రమించివున్నారు. అందుచేత వాటిలో ఫ్రాక్షన్సుగా పని జేయాల్సిన అవసరమేమీ లేదు. పార్టీయేతర సభ్యులుగూడా ప్రజారంగాల వర్కింగు కమిటీలలో వున్నప్పుడు పార్టీ సభ్యులతోగూడిన ఫ్రాక్షన్సు యేర్పరచాలిగాని అలాంటి పరిస్థితులులేనిచోట్ల ఫ్రాక్షన్ల నన్నిటిని రద్దుపర్చాలి. అట్లే జిల్లా ప్రజారంగాల ఫ్రాక్షనులు కూడా ఉండవు.

(ఆ) పార్టీ జనరల్‌బాడీ సమావేశాల అనంతరం ఫ్రంటులవారీగా ఆ ఫ్రంటులలో బాగా చురుకుగా పనిజేసే పార్టీసభ్యుల నందరినీ సమావేశపర్చాలి. అప్పుడు వాళ్ళ వాళ్ళ ప్రాంతాలలో చురుకుగా తాలూకా మొత్తంమీద పనిచేస్తున్నవారందరూ ఒకచోట సమావేశమై వాళ్ళ సమస్యలను చర్చించుకోవడం, పనిని తనిఖీచేయడంగూడ జరగాలి ఈ సమావేశాలే ఫ్రాక్షన్సుగా పనిజేస్తాయి. ఇంతకన్నా వేరే ఫ్రాక్షన్సు వుండనవసరంలేదు.

4. పై ప్లానుప్రకారం పార్టీని పునర్నిర్మాణముచేస్తే పార్టీ ఆర్గనైజర్లమధ్య ప్రస్తుతమున్న అసహజమైన విభజన పోతుంది. ఒకేరకమైన పార్టీ ఆర్గనైజర్లు యేర్పడుతారు; వాళ్ళుగూడ అన్నిరంగాల సమస్యలను జనరల్‌గా పరిష్కరించేశక్తి, తమ రంగాలగూర్చి ప్రత్యేక నైపుణ్యంగల్గి వుంటారు; పార్టీ ఆర్గనైజర్లుగాను, ప్రజానాయకులుగాను తయారౌతారు.

ఉద్యమాన్ని ఏవిధంగా అభివృద్ధి చేయగలుగుతాం, అనే దాని మీద మన కామ్రేడ్స్‌కు ఒక స్పష్టమైన అభిప్రాయంలేదు. ముఖ్యమైన గ్రామాలు, పేటలమీద కేంద్రీకరించకుండా, మనకున్న పార్టీ సభ్యులను అన్ని గ్రామాలకు పేటలకు జనరలు ప్రచారంకోసం వినియోగించడం జరుగుతోంది. ఇది మనకు వారసత్వంగా వచ్చిన కాంగ్రెసు సాంప్రదాయం. దీనివల్ల ఒక స్థిరమైన ప్రజా ఉద్యమం ఎన్నటికీనీ ఏర్పడదు. ఉద్యమమంటే అస్పష్టమైన సానుభూతి ఏర్పడుతుందేమోగాని, ఉద్యమాభివృద్ధికి తాము త్యాగం చేయాలనేభావం గలుగదు. ఈ పద్ధతివల్ల మనకున్న పార్టీ సభ్యులను వెదజల్లడం పార్టీ శక్తిని వృధాజేయడం జరుగుతుందిగాని, స్థిరమైన ప్రజాఉద్యమం ఏర్పడదు. స్థిరమైన ప్రజాఉద్యమాన్ని ఎలా నిర్మించాలి? ఎలావిస్తరింపజెయ్యాలి? అనే దానిమీద కమ్యూనిస్టు ఇంటర్నేషనలు ఒక సూత్రాన్ని ఇచ్చింది. 1921 లో జరిగిన 3 వ అంతర్జాతీయ కమ్యూనిస్టు మహాసభచే అంగీకరించబడిన 'కమ్యూనిస్టుపార్టీల నిర్మాణంమీద దీసిసు' అనేదాంట్లో ఈ క్రిందివిధంగాఉంది.
(Principles of party organisation, Page 23).

"భూగోళిక విభాగాలను మాత్రమే అనుసరించి, పార్టీ విస్తరణ, బలమైన స్థానాలు ఏర్పరచుకొనుటకు ప్రయత్నించగూడదు. ఒక జిల్లాలో నిజమైన ఆర్థిక, రాజకీయ, రహదారి సౌకర్యాల ప్రాముఖ్యత మొదలైన పరిస్థితుల ననుసరించి ఆ విస్తరణ జరగాలి. పార్టీ శక్తిని ప్రధానంగా ముఖ్యమైన పట్టణాలలోనూ, పెద్ద పారిశ్రామిక ప్రాంతాలలోనూ కేంద్రీకరించాలి.

ఒక కొత్త పార్టీని నిర్మించేటప్పుడు, దేశమంతటా ఒక్కసారిగా పార్టీ నిర్మాణాన్ని వ్యాపింపజేయాలనే తత్వం సామాన్యంగా బయలుదేరుతుంది. పార్టీ సభ్యుల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, వీరిని నలుమూలలకు పంపడం జరుగుతుంది. ఇందువల్ల నూతన సభ్యులను పార్టీలోకి తీసుకునేశక్తి, పార్టీ అభివృద్ధి, సన్నగిలుతాయి. ఇటువంటి సందర్భాలలోనే అనేక నామమాత్రమైన పార్టీ ఆఫీసులు, ఒకదానిక్రింద మరొకటిగా ఉండేటటువంటి పద్ధతి వస్తుంది. గాని పార్టీ ముఖ్యమైన పారిశ్రామిక పట్టణాలలో బలమైన స్థానం ఏర్పరచుకోవడం జరగదు."

అంటే ప్రభుత్వం తన పరిపాలన సౌకర్యాలకోసం ఏర్పరచిన తాలూకా, ఫిర్కా, జిల్లా సరిహద్దుల ననుసరించే, మనం పార్టీని విస్తరింపజేయాలిసిన అవుసరం లేదు. ఒక జిల్లాలో ముఖ్యపరిశ్రమలున్న పట్టణాల ప్రాంతాలు, రాజకీయంగా ముందుకువచ్చిన ప్రాంతాలు, రహదారి సౌకర్యాలు, మొదలైనవాటిని అనుసరించి మనం విస్తరించాలి. ఆంధ్రలో వరంగల్లుజిల్లాలోను, హైదరాబాదునగరంలోనుతప్ప మరెచ్చట పెద్దపారిశ్రామిక పట్టణాలుగాని, ప్రాంతాలుగాని లేవు. ఆంధ్రదేశంలో చాలవరకు చిన్నపరిశ్రమలేఉన్నాయి. అందుచే ఆంధ్రపట్టణాలలో ఎక్కువగా మధ్యతరగతి ప్రభావముంటుంది. ఆంధ్రలో డెల్టా ప్రాంతాల్లోని గ్రామాలు ముందుగా రాజకీయాలలోకి వచ్చాయి. అందుచే పట్టణాలలోని కార్మికులకన్న ఆ గ్రామాల్లోని రైతులకు రాజకీయచైతన్యం ముందువచ్చింది. బొంబాయి, కలకత్తా, కాన్పూరు మొదలైన పారిశ్రామిక పట్టణాలున్నరాష్ట్రాలలో, కమ్యూనిస్టుఉద్యమం ముందు ఆ పట్టణాలలో ప్రారంభమయింది. అటువంటిపట్టణాలు ఆంధ్రలో ఏవీ లేకపోవుటచేతనూ, ఆంధ్రకంతకూ నాగరికతకు కేంద్రమైన పెద్దపట్టణమేదీ లేకపోవుటచేతనూ, కమ్యూనిస్టు ఉద్యమం కాంగ్రెసు సత్యాగ్రహోద్యమంలో పాల్గొన్న కొన్నిగ్రామాల్లో ప్రారంభమయింది. తరువాత పట్టణాలకు వ్యాపించింది. కనుక మనపార్టీని గ్రామాల్లో విస్తరింపజేయడంలో, మనం రాజకీయంగాను, ఆర్థికంగాను ముఖ్యంగాఉన్న పెద్దగ్రామాల్లో పార్టీకి బలమైన పునాదిని ముందుగా నిర్మించడానికి ప్రయత్నించాలి.

మనం మనకున్న కొద్దిమంది చురుకుగా పనిజేసేసభ్యులను ఇటువంటి గ్రామాలలో కేంద్రీకరించి పని చేయించకుండా, అన్నిగ్రామాలకు పంపేటట్లయితే, ప్రజాసమస్యల మీద ప్రజలను సమీకరించడం సాధ్యపడదు; అస్పష్టమయిన ప్రచారంమాత్రమే చేయగల్గుతాం. స్థానిక సమస్యలమీద ప్రజాపోరాటాలు నడిపితేనేగాని, 'మిలిటెంట్సు'

ఆ పోరాటాలనుండి బయలుదేరరు. అలా మిలిటెంట్సు బయలుదేరినప్పుడే, మనం వారందరినీ పార్టీలోకి తీసుకోవడం, పార్టీసభ్యులను, వారి అనుభవాన్ని ఎక్కువజేయడం జరుగుతుంది. ఈవిధంగా ఎక్కువమంది పార్టీసభ్యులుగా వచ్చినప్పుడే, నూతన గ్రామాలకు, ప్రాంతాలకు విస్తరించగలుగుతాం. అస్పష్టమైన ప్రచారంమాత్రమేచేస్తూ పార్టీ సభ్యులను త్రిప్పుతుంటే, ప్రజలు కదలకపోవడంవల్ల కామ్రేడ్స్‌లో నిస్పృహరావడం, వారికోర్కెలు ఫలించకపోవడంవల్ల ప్రజల్లో నిర్లక్ష్యతరావడం, పార్టీఅభివృద్ధి కాకపోగా క్షీణించడం గూడ జరుగుతుంది.

ఇదే కమ్యూనిస్టు అంతర్జాతీయ మహాసభ నిర్మాణథీసిసులోని పై భాగంయొక్క సారాంశం.

గ్రామాలలో కొన్ని పెద్దవిగాను, రాజకీయంగా ముందుకు వచ్చినవిగాను విద్య, నాగరికతలో అభివృద్ధిచెందినవిగాను, ఇతర గ్రామాలకు కూడలి స్థలాలుగాను ఉంటాయి. ఇటువంటి కేంద్రగ్రామాలు చుట్టుపట్ల ఉన్న గ్రామాలమీద నాయకత్వం వహిస్తాయి. ఒక ముఖ్యగ్రామం చుట్టుపట్లగ్రామాలు ప్రతివిషయానికి ముఖ్యగ్రామం ఏమిచేస్తుందాఅని ఎదురుచూచి, దాని ననుసరిస్తాయి. అందువల్ల ఒక ప్రాంతంలో పార్టీ ప్రజాపార్టీ కావాలంటే, ఆ తాలూకాలోని ఇటువంటి కేంద్రగ్రామాలలో మనం మనపార్టీకి స్థిరమైన పునాదిని సంపాదించాలి. ఇటువంటి కేంద్రగ్రామాలు పూర్తిగా పార్టీపలుకుబడిక్రింద లేకపోయినా, గమనించదగిన పలుకుబడి కలిగిఉన్నా, చుట్టుపట్ల చిన్నగ్రామాలలో పార్టీ ప్రాకదం తేలిక. కాని మన కామ్రేడ్స్‌కు ముందు ఇటువంటి కేంద్రగ్రామాల్లో కేంద్రీకరించి పని చెయ్యాలనే దృక్పథంలేదు. అంతేగాక కొన్నిచోట్ల ఇటువంటి గ్రామాలను పూర్తిగా వదలివేసి, కుగ్రామాలను పట్టుకు వేళ్ళాడుతున్నారు. కారణం, కాంగ్రెసు నాయకులు, జస్టిసుపార్టీ నాయకులు ఇటువంటి పెద్దగ్రామాలలోనివారే, వారితో సంఘర్షణపడి కాలాన్ని "వృధాజేసుకోవడ" మెందుకనే దృష్టితో, ఈ పెద్దగ్రామాలను వదలివేసి, కుగ్రామాలలో క్రిందామీదా పడుతూఉంటారు. ఆ కుగ్రామాలలో అవస్థపడి మార్పు తీసుకువచ్చినా, దాని ప్రభావం చుట్టుపట్ల గ్రామాలమీద అంతగాఉండదు. ఒక జిల్లాలోగాని, తాలూకాలోగాని, ఇటువంటి కేంద్రగ్రామాలనుతీసుకొని వాటిమీదకేంద్రీకరించి పనిచేయాలనీ, వివరమైన ప్లానువేసుకోవడం ఇంతవరకూ పార్టీ కమిటీలు చేయడంలేదు. గుడ్డిగా ఏదో తోచినట్లు పనిచేస్తున్నాయి.

అందువల్ల ప్రతి తాలూకాలోనూ జనాభాలో పెద్దవిగనూ రాజకీయంగా ముందుకు వచ్చినవిగనూ, విద్య, నాగరికతలలో అభివృద్ధి చెందినవిగనూ, చుట్టుపట్ల గ్రామాలకు కూడలిగానూ, ఉన్న కేంద్రగ్రామాలను ఏరి వాటిలో కేంద్రీకరించి పనిచెయ్యాలి. అగ్రామాల్లో వచ్చే ప్రతి చిన్నసమస్యనూ తీసుకొని పనిచెయ్యాలి. ఒకగ్రామంలో "ఎలా పనిచెయ్యాలి" అనేది ముందు వ్రాయబడుతుంది.

4. ముఠాలుగట్టడం (Factionalism)

పార్టీలోపల ప్రజాస్వామ్యం :

కమ్యూనిస్టుపార్టీ కేంద్రీకృత ప్రజాసామ్య సూత్రాన్ననుసరించి తన జీవితాన్ని సాగించుతుంది. ప్రతి సభ్యుడు తనకున్న అభిప్రాయాలను తన యూనిటులో నిర్మొగమాటంగా, దాపరికంలేకుండా చెప్పాలి. అందరియొక్క అభిప్రాయాలు వెలిబుచ్చడానికి పూర్తి అవకాశం ఇవ్వబడిన తర్వాతనే, పార్టీ యూనిటు ఒక నిర్ణయాన్ని చేస్తుంది. నిర్ణయం చేసిన తరువాత దాన్ని వ్యతిరేకించడంగాని, అమలు జరుపకుండా ఊరుకోవడంగాని, పార్టీ సభ్యులుగానివారివద్ద దాన్ని విమర్శించడంగాని, దాని మీద పార్టీ యూనిటులో అంతులేని చర్చసాగించడంగాని పార్టీ శిక్షణకు విరుద్ధం. నిర్ణయంచేయబడిన తరువాత ప్రతి పార్టీ సభ్యుడూ దాన్ని తు. చ. తప్పక అమలు జరపాలి. తన యూనిటు చేసిన నిర్ణయం తన కిష్టంలేకపోతే, తన యూనిటు పైయూనిట్లకు తన అభిప్రాయాన్ని తెలియపర్చవచ్చును. కాని పై యూనిటు నిర్ణయంవచ్చేంత వరకూ, తన యూనిటు నిర్ణయాన్ని అమలుజరుపుతూనే ఉండాలి. పార్టీ సభ్యులయెడల తనకున్న అనుమానాలను, చాటుగా ఇతర పార్టీ సభ్యుల యెదుటగాని, పార్టీ ఇతరులవద్దగాని విమర్శించరాదు. నిర్మొగమాటంగా పార్టీ యూనిటులో అడగాలి. తన యూనిటు నిర్ణయంయెడల తనకున్న అనుమానంగాని, తన యూనిటులోని పార్టీ సభ్యునియెడల తనకున్న అసంతృప్తినిగాని, తనక్రింది యూనిట్ల సభ్యులతోను, తన తోటి యూనిట్ల సభ్యులతోను చెప్పడం పార్టీ శిక్షణకు వ్యతిరేకం.

సామాన్యంగా ఎన్నికలద్వారానే కమిటీలు ఏర్పడతాయి. కాని రహస్య రోజుల్లో ఎన్నికల కవకాశం లేనపుడు పై కమిటీలు దానికి సంబంధించిన ముఖ్య కామ్రేడ్సును సంప్రదించి క్రింది కమిటీలను ఏర్పరచడం జరుగుతుంది. పై కమిటీలు — తమ క్రింది కమిటీలుగాని, వ్యక్తులుగాని బాధ్యత సరిగా నిర్వహించనప్పుడు, ఆకమిటీలను రద్దుజేసి నూతన కమిటీని లేక ఆర్గనైజరును వేయడం, అవ్యక్తిని తొలగించి ఆతనిస్థానే మరొకరిని నియమించడం చేయవచ్చును. ఇది కేంద్రీకృత ప్రజాసామ్య సూత్రం యొక్క సారాంశం.

ముఠాలుగట్టడం — (Factionalism) :

ఏ పార్టీ సభ్యుడైనా పై జెప్పబడిన పార్టీ శిక్షణకు విరుద్ధంగా ప్రవర్తిస్తూ, ఇతర పార్టీ సభ్యులను తన వైపుకు త్రిప్పుకొంటానికి చేసే ప్రయత్నాలనే ముఠాలుగట్టడం

అంటాము. ఈ విధంగా పార్టీలోగాని చీలికలు ఏర్పడి, ఏగ్రూపుకాగ్రూపు చాటుగా సంప్రదించుకుంటూ, ఒక గ్రూపు చెప్పేదాన్ని మంచినైనా మరొక గ్రూపు వ్యతిరేకించడం మొదలైనవి జరుగుతున్నప్పుడు, పార్టీలో ముఠాలు ఏర్పడినవి అని అంటాం. ముఠాలు ఏర్పడటానికి కారణం ఏమిటి? మనపార్టీ కార్మికవర్గపార్టీ అయినప్పటికీ మధ్యతరగతి మేధావులు, రైతులు, ధనిక రైతులు, చివరకు పెట్టుబడిదార్లు, జమీందార్ల నుండి గూడ, పార్టీరాజకీయపాలసీ సిద్ధాంతాన్ని అంగీకరించి పార్టీలోకి చేరుతున్నారు. వారు పార్టీలో చేరేటప్పుడు వారి వర్గసిద్ధాంతాలను వదలుకొన్నా, వర్గ అలవాట్లు, స్వభావాలు పూర్తిగాపోవు. పై జెప్పిన ఇతర వర్గాల దురలవాట్లే ముఠాలు కట్టడానికి మూలకారణం. ఆ దురలవాట్లు ఏమిటి? వ్యక్తి అహంకారం, ఆత్మ విమర్శనద్వారా తనలోట్లను తెలుసుకోకపోవడం, ఇతరులు తన లోపాలను చూపితే వారిమీద కోపంతెచ్చుకోవడం, ఇతరులలోని లోపాలను సూటిగా, నిర్మొగమాటంగా వారియెదుట చెప్పక చాటుగా ఇతరులతో చెప్పడం, ఇతరుల లోపాలను సానుభూతితో వారుదిద్దుకునేలా చూపించకుండా ఎగతాళిచేయడం, మొదలైనవి. ఈ పై దురలవాట్లు ఆయా వర్గాల జీవిత పద్ధతులను బట్టియే వచ్చినవి. మధ్య తరగతి మేధావులు, రైతులు సమిష్టిగా పనిచేసే అలవాట్లు లేకపోవుటవలన, ఇతరుల విమర్శలను సరిగా స్వీకరించి తన లోటు మార్చుకోవడం అనేది ఉండదు. ఒంటరిగా పనిచేసే జీవిత పద్ధతినుండే వ్యక్తి అహంకారం, ఆత్మవిమర్మన లేకపోవడం, ఇతరుల విమర్శన స్వీకరించలేకపోవడం మొదలైన లక్షణాలు ఏర్పడతాయి. పెట్టుబడిదార్లు, జమీందార్లు తాము మిగతా జనసామాన్యంమీద పెత్తనం చేయడానికే పుట్టామనుకుంటారు గనుక, వారికి వ్యక్తి అహంకారం, ఆత్మవిమర్శనలేకపోవడం, మొదలైనవి ఉంటాయి.

కార్మికవర్గానికి ఇటువంటి దురలవాట్లు ఉండవు. పైగా వారిలో ఆత్మవిమర్శనద్వారా తన లోట్లను కనిపెట్టి వాటిని దిద్దుకోవడం, ఇతరుల లోట్లను నిర్మొగమాటంగాను, సానుభూతితోనూ విమర్శించి వారు వాటిని దిద్దుకునేటట్లు చేయడం. మొదలైనవి ఉంటాయి. కారణం వారి జీవిత విధానమే. ఒక్కొక్క ఫ్యాక్టరీలో వేలమంది కార్మికులు ఆధునిక యంత్రాలమీద సమిష్టిగా పనిచేయాలిసి వస్తుంది. అనేక వందలమంది ఒకొక పెద్ద ఇంట్లో కలిసిఉండాలిసివస్తుంది. ఈజీవితం సాగించడానికి పై మంచి లక్షణాలు అవుసరం.

పైజెప్పబడిన దురలవాట్లు ముఠాలు ఏర్పడటానికి మూలంఅయినా, అంతమాత్రాన ముఠాలు ఏర్పడవు. ఈ ముఠాలు ఏర్పడటానికి పార్టీలో కుళ్లుడు రాజకీయ వాతావరణం గూడ ఉండాలి. పార్టీ తన రాజకీయ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగించేటప్పుడు, ముఠాలుగట్టే లక్షణాలు ఉన్నవారుఉన్నా ఏమీ చేయలేరు. వారి గుసగుసలకు చెవివొగ్గేవారు ఉండరు. కాని పార్టీ కార్యక్రమాన్ని సాగించలేక, నిస్తబ్ధంగాఉండి (stagnation) పార్టీసభ్యులలో రాజకీయ మనోనిబ్బరం లేనప్పుడు, ఇటువంటి ముఠాలుగట్టేవారి మాటలకు పార్టీసభ్యులు చెవివొగ్గుతారు. అంటే పార్టీ అభివృద్ధి అవుతున్నప్పుడు ఈ

ముఠాలు గట్టడానికి అవకాశంఉండదు. పార్టీలో నిస్తబ్ధతవచ్చి పార్టీ దిగజారుతున్నపుడు, ముఠాలు గట్టేవారికి చక్కని అవకాశముంటుంది. కుళ్ళుడు నీటినుంచే చెడుపురుగులు పుడతాయి. రాజకీయ నిస్తబ్ధతనుంచే ముఠాలు బయలుదేరతాయి. ముఠాలు గట్టడానికి పునాదిగా రాజకీయభేదాలు ఉంటాయి. ఈ రాజకీయభేదాలు, పార్టీ చర్చలలో నిర్మొగమాటంగా చర్చించి, పార్టీనిర్ణయాలను పార్టీ శిక్షణతో అమలుజరుపుతుంటే (అంటే పార్టీ పద్ధతిలో పరిష్కరించుకొంటే) ఈ రాజకీయభేదాలు అంతరించుతాయి. లేక రాజకీయంగా ఒకే దృక్పధం కలిగినవారంతా ఒకేముఠాగా తయారై, పార్టీ పద్ధతులలో మెలగకుండా ఉంటే ముఠాలు ఏర్పడతాయి. అంటే రాజకీయభేదాలకు, వ్యక్తి అహంకారం, ఆత్మవిమర్శన లేకపోవడం, ఇతరుల విమర్శనను స్వీకరించకపోవడం, మొదలైన కార్మికేతరవర్గ అలవాట్లు దోహదమివ్వడంద్వారానే, పార్టీలో ముఠాలు ఏర్పడుతాయి. కనుక పార్టీలో ముఠాలు ఏర్పడినాయంటే, వాటికిగల రాజకీయ కారణాలను, భేదాలను ముందుగా పరిశీలించాలి.

ఇందుకు ఉదాహరణగా ఆంధ్రరాష్ట్రంలోనే పార్టీ చరిత్రలోని కొన్ని ఉదాహరణలను తీసుకొందాం. తూర్పుగోదావరిజిల్లా నాయకత్వంలో 1942 వరకూ అరాజకవిధానం (Anarchism) యొక్క చిహ్నాలు ఉండేవి. అనార్కిస్టు పద్ధతులను తెలుసుకోవాలంటే, దాని సిద్ధాంతం తెలుసుకోవడం అవుసరం. అనార్కిస్టు సిద్ధాంతంయొక్క మూలపురుషుడు క్రొపాట్కిన్. అనార్కిజంగూడ వర్గరాహిత్యమైన, ప్రభుత్వ యంత్రంలేని సమాజమే అంత్యలక్ష్యంగా అంగీకరించుతుంది. మన ఆశయమైన కమ్యూనిస్టు సమాజంలోగూడ వర్గాలు, ప్రభుత్వయంత్రం (పోలీసు, మిలిటరీ, కోర్టులు, జైళ్ళు వగైరా) ఉండవు. కాని ఎంతమంది ప్రజలున్నారు, వారికి ఏయే అవుసరాలు ఎంతెంతకావాలి, వాటిని ఎక్కడెక్కడ ఎంతంత ఉత్పత్తిచెయ్యాలి, మొదలైన విషయాలను అంచనావేసి, ఒక ప్లానుప్రకారం సమాజాన్ని నడపడానికి, ఒక వాలంటరీశిక్షణ యంత్రం ఉంటుంది. అనార్కిస్టులుకోరే వర్గరాహిత్య సమాజంలో ఒక వాలంటరీ శిక్షణమీద కట్టుబడిఉండే యంత్రాన్ని అంగీకరించరు. ప్రజలు ఒకరికొకరు పరస్పరం సహాయం జేసుకొంటూ జీవితయాత్ర సాగిస్తారని అస్పష్టంగామాత్రమే చెబుతారు. అసలు అనార్కిస్టు సిద్ధాంతానికంతకూ మూలసూత్రం ఏ విధమైన ఆటంకంలేని వ్యక్తిస్వేచ్ఛ. వాలంటరీగా అంతా కలిసి ఒక శిక్షణకు కట్టుబడి ఉండటంలోగూడ వ్యక్తిస్వేచ్ఛ పోతుందంటారు. కమ్యూనిస్టు సిద్ధాంతం వాలంటరీ శిక్షణకు లోబడివున్న వ్యక్తిస్వేచ్ఛనే అంగీకరించుతుంది.

అనార్కిస్టులు ప్రభుత్వం యంత్రం — పెట్టుబడిదార్లదయినాసరే, లేక కార్మికులదైనాసరే — వ్యక్తిస్వేచ్ఛను అరికడుతుందంటారు. కనుక ఏ ప్రభుత్వ యంత్రమూ ఉండగూడదంటారు. కనుక వారు పెట్టుబడిదారీ సమాజంలోనుండి సరాసరి ప్రభుత్వ యంత్రం లేని పరస్పర సహాయక సమాజంలోకి పోవాలంటారు. కమ్యూనిస్టులు అది సాధ్యం

గాదంటారు. పెట్టుబడిదారీ వర్గంనుంచి అధికారం లాక్కొన్న వెంటనే. పెట్టుబడిదారి వర్గం అంతరించిపోదు. ఆ వర్గం తిరుగుబాటుచేసి తిరిగి అధికారం హస్తగతం చేసుకోకుండాచేసి, పరిశ్రమల నభివృద్ధిజేస్తూ కమ్యూనిస్టు సమాజానికి ప్రథమ సోపానమైన సోషలిస్టు సమాజాన్ని నిర్మించడానికి, రైతులు. ఇతర ప్రజలకు నాయకత్వంవహించి కార్మికవర్గం సాగించే ప్రభుత్వం అవుసరం. అటుతర్వాత ప్రజలందరి అవుసరాలకు ఎన్నోరెట్లు ఎక్కువ ఉత్పత్తిచేసే యంత్రాలనిర్మాణంసాగిస్తూ క్రమంగా ప్రభుత్వయంత్రం పోతుంది. (Whither) కమ్యూనిస్టు సమాజం ఏర్పడడానికి మూలం, ప్రజల జీవితావుసరాలకు ఎన్నోరెట్లు ఎక్కువ ఉత్పత్తిచేయగల శక్తివచ్చినప్పుడు అందరియొక్కమంచే తన మంచిఅని అనుకోగలిగిన నైతికస్థాయివచ్చినప్పుడు, శక్తిననుసరించి ప్రతిఒక్కరూ పనిజేయడం అవుసరమైనంత తీసుకోవడం అనే కమ్యూనిస్టు సమాజసూత్రం అమలు జరుగుతుంది. ప్రజల జీవితావుసరాలకన్న ఎన్నోరెట్లు ఎక్కువ ఉత్పత్తి చేయగలశక్తి రాకుండానే. ప్రభుత్వ యంత్రాన్ని లేకుండా చేయడమంటే. అరాజకవిధానాన్ని తీసుకువచ్చి పెట్టడమే.

అనార్కిస్టులు తమ ఆశయాన్ని ఏ వర్గంద్వారా సాధిస్తారు? అడుక్కుతినేవారు, రౌడీలు (Lumpen proletaiat) మొదలైనవారికి అసలు శ్రమజేసే కార్మికులకుండే ఆస్థి సైతం ఉండదు గనుక, వారు కార్మికులకన్న ఎక్కువ విప్లవకరంగా ఉంటారని వీరి వాదన, అందుచేత వీరు తాముకోరే పరస్పర సహాయకసమాజాన్ని సాధించడానికి ముందుంటారని అనార్కిస్టులు చెబుతారు. బిచ్చగాళ్ళు, రౌడీలు ప్రస్తుతసమాజంలో ఎలావచ్చారో చూదాం. మొదట వీరిలో చాలమంది నిరుద్యోగులవడం వలన, బిచ్చమెత్తుకు తినడం, రౌడీయిజంద్వారా బెదిరించి డబ్బులు సంపాదించడం ప్రారంభించారు. వీరి పిల్లలుగూడ ఇదే అలవాటుపడ్డారు. వీరికి క్రమంగా పనిజేసే అలవాటుపోవడం, ఎవరు నాలుగు డబ్బులు ఇస్తే వారివైపుకుపోవడం, నీతినియమాలు లేకుండా ప్రవర్తించడం, చేస్తూఉంటారు. పెట్టుబడిదార్లు, జమీందార్లు చివరకు ప్రభుత్వంసైతం, ప్రజాఉద్యమాలకు వ్యతిరేకంగా వీరినే ఉపయోగిస్తూంటారు. కనుక కమ్యూనిస్టులమైన మనం ఏమిచెబుతామంటే, ఈ నీతి నియమాలులేనివర్గం ప్రజాఉద్యమాలను అణచడానికే ఉపయోగపడుతుందిగాని, పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోయడానికి ఉపయోగపడదు. వీరికి శిక్షణగాని, కట్టుబాట్లుగాని ఉండవు. వీరిమీద ఆధారపడే సమాజంలోగూడ అలాగే ఉంటుంది. వీరి యెత్తుగడలు గూడ అరాజకంగానే ఉంటాయి. దోపిడీలు చేయించడం, ఇళ్లు వాకిళ్లు తగలబెట్టడం, పెట్టుబడిదార్ల ఫ్యాక్టరీలను ధ్వంసం చేయడం మొదలైన అరాజకచర్యలు జరిపితే, ఈ అరాజకంలో పెట్టుబడిదారీ విధానం నాశనమయి పోతుందనీ, అందులోనుంచి తాముగోరే పరస్పర సహాయక సమాజం పుడుతుందనీ, అనార్కిస్టులు వాదిస్తారు.

కనుక వారు ఏప్రజాఉద్యమాన్నీ ఒక నిర్దిష్టమైన కార్యక్రమంమీద క్రమంగా నిర్మించరు. అరాజక చర్యలద్వారా ఉద్యమాన్ని త్వరత్వరగా నిర్మించాలని చూస్తారు. వారేర్పరచే సంఘాల్లో క్రమశిక్షణ ఉండదు.

ఆధునిక యంత్రాలలో వేలమంది కార్మికులు సమిష్టిగా ఒకచోట పనిచేస్తారు. అటువంటి వీరే సమిష్టిగా శ్రమజేయడమేగాక. సమిష్టిగా శ్రమఫలితాన్ని అనుభవించే కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించగలుగుతారు. యంత్రాలను ఇంకా అభివృద్ధిజేసి మానవుని శ్రమను ఇంకా తగ్గించగల అభివృద్ధికరమైన వర్గమిదే. పెట్టుబడిదారివర్గం చేతులనుండి ఉత్పత్తి పరికరాలను (యంత్రాలను) రక్షించి, వాటిని మానవాభ్యుదయంకోసం అభివృద్ధి పరచగల విప్లవవర్గమిదే. కనుక కమ్యూనిస్టులు కార్మికవర్గంద్వారానే కమ్యూనిస్టుసమాజం సాధ్యమవుతుందంటారు. అంతేగాక దొంగతనాలు, దోపిడీలు, యంత్రాలను పగులగొట్టడం, కుప్పలు తగులబెట్టడం, చేనులు కోసుకుపోవడం మొదలైన అరాజక పనుల ద్వారా ప్రజాఉద్యమాన్ని నిర్మించలేము. అంతేగాక ఈ అరాజక చర్యలు బీదప్రజలకు గూడ హానిని గలుగజేస్తాయి. కనుక వీటిని బీదప్రజలుకూడ అసహ్యించుకొంటారు. కనుక ఈ చర్యలు ప్రజాఉద్యమాన్ని చీల్చి, దోపిడీ వర్గాలకు ప్రజలను అణచివేయడానికి ఉపయోగపడతాయి. కనుక ఈ చర్యలు ప్రస్తుత సమాజవ్యవస్థను అలాగే ఉంచడానికి ఉపయోగపడతాయి.

19 వ శతాబ్దంలో, మార్క్సు కాలంలో అనార్కిజంయొక్క పలుకుబడి కొంతవరకు కార్మికవర్గం మీదఉండేది. క్రమంగా అనార్కిస్టు సిద్ధాంతం ఎత్తుగడలవల్ల నష్టాన్ని కార్మికవర్గం గ్రహించింది. అనార్కిస్టు సిద్ధాంతం అంతరించిపోయినా, దాని అలవాట్లు కొంతవరకు ఇంకా మిగిలిపోయినాయి. తూర్పుగోదావరిలో పార్టీ నాయకత్వం మీద ఈ అనార్కిస్టు ఎత్తుగడల ప్రభావంఉండి. ప్రజాసంఘాలను చకచకా నిర్మించాలని ఆదుర్దా. కాని ఒకొక్క ప్రజాసంఘాన్ని నిర్మించాలంటే, ఒడుదుడుకుపరిస్థితుల నెదుర్కొని నిర్మించే ఓర్పు వీరిలోలేదు. తమ కష్టాల నీడేర్చుకోవాలంటే ఎంత కష్టపడాల్సి వస్తుందో, ఎంత ఓర్పుతో ఉండాలో ప్రజలకు చెప్పేవారుగాదు. తేలికగా కష్టాలీడేరతాయనేభావం గల్పించి, ప్రజలను ఉద్రేకపరచి లేవగొట్టేవారు. ప్రభుత్వం, జమీందార్లు, మొదలైనవార్ల ఆటంకం రాగానే, ప్రజల్లో నిస్పృహ ధృవపడి వెనక్కుతగ్గితే వారితోపాటు వీరిలోను నిస్పృహ వ్యాపించేది. అప్పుడు అక్కడి ప్రజా ఉద్యమాన్ని వదలివేసి మరొకచోటుకు పోవడం జరిగేది. 1938 లో కాంగ్రెసు మంత్రివర్గ కాలంలో రైతుల నుత్సాహపరచి, జమీందారీ ఎంక్వయరీ కమిటీ ముందు సాక్ష్యాలకు రైతులను చాలమందిని సమీకరించారు. కాని అంతటితో రైతుల కష్టాలు ఈడేరలేదు. రైతులు ఓర్పుతో తమ హక్కులకోసం ఎలా పాటుబడాలో చెబుతూ, వారికి మనోనిబ్బరంకల్గించి, వారి స్థానిక ఇబ్బందులను తీసుకొని ఓర్పుతో వాటినివారణకు కృషిచెయ్యాలి. ఇంత ఓర్పు

తూర్పుగోదావరిలో పార్టీ నాయకత్వానికిలేదు. రైతులు స్వంత ఆస్థి ఉన్నవారుగనుక విప్లవవర్గంగాదనీ, వారితో ఎంతకాలం తంటాలుపడినా ఏమీ ప్రయోజనంలేదనీ, రైతుల్లో పనిచేసే ముఖ్యులు ఏజన్సీ ప్రజలలో పని ప్రారంభించారు. జిల్లా రైతు సంఘం మూలబడింది. అల్లూరి సీతారామరాజువలె ఏజన్సీ ప్రజలను కదిపి, ఒక బ్రహ్మాండమైన ఉద్యమాన్ని నిర్మించుదామనుకున్నారు. వారు భావించినట్లుగా త్వరలో ఆ ఉద్యమం నిర్మించబడే అవకాశం కన్పించలేదు. ఇంతలో సామ్రాజ్యవాదయుద్ధం వచ్చింది. కాకినాడలో కార్మికులలో పనిజేసి, గొప్ప విజయాలను సాధించారు. కాని అందులో వచ్చిన మిలిటెంట్లకు తర్ఫీదు ఇచ్చి, కార్మిక సంఘాలలో పార్టీని నిర్మించలేదు. ప్రభుత్వ నిర్బంధవిధానం వచ్చింది. దానితో అక్కడ పనిని వదిలివేశారు. కార్మిక ఉద్యమం మూలబడింది. ఇంతలో కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రభుత్వోద్యోగులవద్దకు బ్రహ్మాండమైన కూలీ ఆకలియాత్రలు వచ్చినాయి. తూర్పుగోదావరి జిల్లాలో మానేపల్లి అనే గ్రామంలో ఒక ధనిక రైతు ఇంటికి, తట్టలు, పంచలతో కూలీలయాత్ర లేవదీయబడింది. కూలీలలో ఆరోజునే వారికి గింజలు వస్తాయనే భావంగల్గించారు. కూలీరైతు సామరస్యంయొక్క అవుసరం, దాన్ని సాధించడానికి కూలీల్లో ఉన్న దురలవాట్లను తొలగించుకోవాలిసిన అవుసరాన్నిగూర్చి వారికి నచ్చజెప్పలేదు. కూలీలు దోచుకుపోవడానికి వచ్చారనే నినాదంతో, సామాన్య రైతులనుగూడ తమ వైపుకు ధనికరైతులు తిప్పుకున్నారు. పోలీసులను పిలిపించి, ఆ కూలీల ప్రదర్శనాన్ని చెదరగొట్టారు. దీనితో కూలీలలో నిస్పృహ వ్యాపించింది. దీనితో కూలీరంగం వదలివేసి, రహస్య ప్రెస్సుపెట్టి యుద్ధానికి వ్యతిరేకంగా కరపత్రాలను విరివిగా వేయడం మొదలు పెట్టారు. దీనిద్వారా కమ్యూనిస్టు పార్టీ చాల ప్రజల్లో పలుకుబడి సంపాదించి, అభివృద్ధి అవుతుందని ఆశించారు. కాని ఇది పోలీసులను అనవుసరంగా బెదరవేసింది. అందువల్ల నిర్బంధవిధానం చాల ఎక్కువయి, పార్టీ దెబ్బతింది. ఇంతలో జపాను బర్మామీద దాడిచేయడంతో, బర్మాలో నివశించుతున్న రాజోలు తాలూకా కూలీలు చాలమంది తిరిగి వచ్చారు. వీరు రంగూనులో స్వతంత్రంగా బ్రతకడంవల్ల కొంత వ్యక్తిత్వం, పరాయి దేశాలు తిరగడం, అష్టకష్టాలుపడి ఇంటికి చేరుకోవడంతో కొంత నిర్భీతితత్వం (daredivil) ఏర్పడింది. వీరు రంగూనులో చాల ఎక్కువ సంపాదించేవారు. అందుచే జీవిత పరిమాణం పెరిగింది. మనదేశంలో కూలి తక్కువ. అందుచే వీరు ఇక్కడ జీవితం గడపడం దుర్భరమయింది. మన కామ్రేడ్స్ వీరి నాధారంగా జేసుకొని వ్యవసాయకూలీ ఉద్యమం తిరిగి నిర్మించడానికి పూనుకొన్నారు. మన పార్టీ రైతుల్లో పనిచేయకపోవడంవల్ల, రైతులకు దూరమయింది. అంతేగాక కొంతమంది వ్యవసాయకూలీలలో ఉండే దోపిడీ దొంగతనం తత్వాలను అరికట్టకపోగా, దోహదమియ్యడం వలన రైతులకు విరోధులయ్యారు. ధనిక రైతులు సామాన్య రైతులను గూడ సమీకరించి, కూలీ ఉద్యమాన్ని అణచడానికి సమకట్టారు. కొంతమంది కూలీ

నాయకులను రైతులు చంపించడం, రైతుల పెత్తనదార్లను కూలీలు చంపడం జరిగింది. అనేకచోట్ల దోపిడీలుగూడా జరిగాయి. ధనిక రైతులు సామాన్య రైతులనుండి కూలీలను వేరుపరచి, ధనబలంతో కూలీలను తన్నించి, కేసులుపెట్టి, కూలీఉద్యమాన్ని అణచివేశారు. మన పార్టీ గ్రామాల్లో పార్టీ పనికి, కూలీరైతు సామరస్యాన్ని పునాదిగా జేసుకొని పనిచెయ్యాలని, 1938 లో జరిగిన రాష్ట్ర పార్టీ కాన్ఫరెన్సు తీర్మానించింది. రాజకీయంగా ఈ నినాదాన్ని కాదనలేక, తమ అరాజక ఎత్తులవలన రైతులకు దూరమైనపార్టీ నాయకులు ఒక కొత్త అర్థమీయడం మొదలుపెట్టారు. స్వంత ఆస్థిఉన్న రైతులకు, కూలీలకు సామరస్యం సాధ్యంగాదనీ, ఇతరుల పొలం కౌలుకుతీసుకొని జీవించే కౌలుదార్లు విప్లవరైతులనీ, రైతుకూలీ సామరస్యమంటే కౌలుదార్లకు కూలీలకు సామరస్యమనీ, వాదించడం మొదలుపెట్టారు. అంతేగాక రైతులనుంచి వేరపడడంవలన, పార్టీ ధనసహాయానికి మార్గం తోచక, పార్టీ ఫండుకు అరాజక చర్యలు జరిపినా ఫరవాలేదనే స్థితికి వచ్చారు. ప్రభుత్వం సాగించిన తీవ్రనిర్బంధవిధానంతో పార్టీలో చీలికలు వచ్చినవి. పార్టీ నాయకత్వంలో ఒకముఠా ధనికరైతులతో దగ్గరగాఉంటూ, కూలీల అరాచక చర్యలతో తమకు సంబంధంలేదని చెప్పసాగారు. దీనితో అదివరకే పార్టీసభ్యులలో పెట్టీ బూర్జువా దురల్వాట్లవల్ల ఏర్పడిన వ్యక్తి కలహాలు ముఠాలరూపంలోకి మారినాయి. అంటే అది వరకే వ్యక్తి ద్వేషాలున్నా, పార్టీమీద తీవ్రనిర్బంధవిధానంవచ్చి పార్టీలో నిస్తబ్ధత ఏర్పడేవరకూ అవి ముఠాలుగా (Factions) గా వృద్ధిజెందలేదు. ఈ ముఠాలు ఏర్పడటానికి రాజకీయ కారణం అనార్కిస్టుఎత్తుగడలు. అనార్కిస్టు ఎత్తుగడలవల్ల ప్రజాఉద్యమం ఎలా నాశనమవుతుందో, పార్టీలో చీలికలువచ్చి పార్టీ ఎలా విచ్ఛిన్నమవుతుందో, తూర్పుగోదావరి జిల్లాలో మన పార్టీచరిత్ర రుజువుచేస్తుంది.

గుంటూరు జిల్లాలో ఫాక్షనలిజం :

గుంటూరుజిల్లా పార్టీ నాయకత్వంలో సెక్టేరియన్ దృక్పధముండేది. సెక్టేరియను దృక్పధమంటే, ఇతర రాజకీయపక్షాల బలాన్ని, వాటి రాజకీయాలను తక్కువఅంచనా వేయడం, పార్టీబలాన్ని ఎక్కువఅంచనా వేయడం. మొదటనుంచీ గుంటూరుజిల్లాలో రంగాముఠా బలాన్ని తక్కువఅంచనా వేయడం, రంగాముఠా నాయకత్వంయొక్క రాజకీయాలు అపర్ట్యునిస్టు రాజకీయాలైనప్పటికి ఆముఠావెనుకనున్న యువకులలోని మంచిని గ్రహించకపోవడం జరిగింది. అందుచేతనే ప్రస్తుతయుద్ధానికి పూర్వం సంయుక్తసంఘటన రోజుల్లో జిల్లాలోని తీవ్రవాదులందరినీ కలిపి నాయకత్వంవహించి, దీనిద్వారా సంయుక్త సంఘటనను నిర్మించుటకుబదులు, మనపార్టీ కాంగ్రెసుమితవాదముఠాకు తోకగా పనిచేసింది, రంగాముఠాయెడల ఈ సెక్టేరియను దృక్పధమే 1941 ఆఖరున రంగాముఠా జిల్లా రైతుసంఘ ఎన్నికలలోచేసిన అన్యాయానికి రెచ్చిపోయి, జిల్లా రైతు

సంఘాన్ని వారిచేతుల్లోబెట్టి, మరొక పోటీసంఘాన్ని పెట్టడం జరిగింది. బూర్జువా పత్రికలన్నీ రంగాముఠాకే సపోరుచేసినాయి. ఈ ఎలెక్షను యుద్ధంలో ఓడిపోవడంవలన రైతు ఉద్యమంలో యీ చీలికలవలన, పార్టీలో నిస్తబ్ధత ఏర్పడింది. పార్టీపని కుంటుబడింది. ఈ పరిస్థితిలో అదివరకునుండీ సరిగా పనిచేయక ఉంటున్న దాదాలుకొందరు, జిల్లాకమిటీమీద అసంతృప్తిఉన్న మరికొందరు కలసి ముఠాగా తయారయి, జిల్లాకమిటీకి వ్యతిరేకంగా ప్రచారంచేశారు. ఏదో ఒక చిన్నఘటనను సాకుగాజేసుకొని జిల్లాకమిటీని ఎదుర్కొసాగారు. జిల్లాకమిటీమీద అసంతృప్తితోఉన్న దాదాలు ఇదివరకునుంచీ ఉంటున్నప్పటికీ, రైతుసంఘ ఎన్నికల తగువురాకపూర్వం ఏమీచేయలేదు. కాని పార్టీలో నిస్తబ్ధత వచ్చిన పరిస్థితుల్లో పార్టీసభ్యుల దృష్టిని చిన్నచిన్న విషయాలమీదకు మరల్చి, ముఠాలు కట్టగలిగారు. 1942 అక్టోబరులో నూతనపంధాను వివరించి, జాతీయైక్యతా ప్రచారంద్వారా పార్టీని ఈ నిస్తబ్ధతనుండి కదిపినతరువాత ఈ ముఠాలు పోయినాయి.

కృష్ణాజిల్లాలో ఫాక్షనలిజం

పార్టీ ఆర్గనైజర్లకు రాజకీయపరిజ్ఞానం ఉండి, పార్టీ డాక్యుమెంట్లు, సర్క్యులర్లు చదివి అర్థం చెప్పగలిగితే చాలునని, ప్రజాసమస్యలను గూర్చి అంతగా అనుభవం లేకపోయినా ఫరవాలేదనే డీవియేషను ఉండేది. ప్రజారంగ ఆర్గనైజర్లకు ప్రజాసమస్యల అనుభవముంటే చాలునని, రాజకీయపరిజ్ఞానం అంతగా లేకపోయినా ఫరవాలేదనీ గూడ భావించేది. అందుచే ప్రజాసమస్యలలో ఏమీ అనుభవం లేకపోయినా సరే, ఇంగ్లీషు బాగా వచ్చినవారిని, విద్యార్థులనుండి వచ్చిన నూతనసభ్యులను సైతం, పార్టీ ఆర్గనైజర్లుగా నియమించుతూ ఉండేది. చాల కాలంనుంచీ పార్టీలో ఉంటూ ప్రజాసమస్యలను తెలిసిననూ, రాజకీయంగా అభివృద్ధికాని వారినందరినీ ప్రజారంగబాధ్యులుగా నియమించేది. పార్టీ ఆర్గనైజర్లకు ప్రజాపనిలో అనుభవంలేదు. ప్రజారంగ బాధ్యులకు రాజకీయపరిజ్ఞానం అంతగా లేదు. అందువల్ల పార్టీఆర్గనైజర్లు ప్రజారంగాలలోని పార్టీసభ్యులను కలుసుకొని, వారికి సూచనలివ్వడం ఉండేదిగాదు. ప్రజారంగ ఆర్గనైజర్లు పార్టీ సాధారణసభ్యులతోనూ పార్టీ సెల్లులతోనూ సంబధంపెట్టుకొని, సెల్లులద్వారా తమ పనిని చేయించడం ఉండేదిగాదు. పార్టీకమిటీలలో పార్టీఆర్గనైజర్లు ఉండేవారు. ప్రజారంగ బాధ్యులకు రాజకీయ పరిజ్ఞానం లేదనే కారణంచేత, వారిని కమిటీలలో జిల్లాకమిటీ ఉంచేదిగాదు. పై కారణాలవల్ల పార్టీ ఆర్గనైజర్ల మధ్య ప్రజారంగ ఆర్గనైజర్లమధ్య పెద్ద అగాధం ఏర్పడింది. పార్టీ కమిటీలంటే, ప్రజారంగఆర్గనైజర్లకు వ్యతిరేకత ఏర్పడింది. 1943 జులై రాష్ట్రపార్టీ కాన్ఫరెన్సుకు పూర్వం జరిగిన తాలూకా కాన్ఫరెన్సుల సమయంలో, గుడివాడ, దివితాలూకాలలో ఈ చీలిక ఫాక్షనలిజంగా బ్రద్దలయింది. ఈ డీవియేషను జిల్లా అంతటా ఉన్నప్పుడు, ఈ రెండు తాలూకాల్లోనే ఇది ఫాక్షనలిజంగా యెందుకు తయారయింది?

గుడివాడ తాలూకా కాంగ్రెసు ప్రముఖులు కొందరు పార్టీలోకి వచ్చారు. కానీ వారి కాంగ్రెసు అలవాట్లుతత్వం పోగొట్టి, పార్టీ అలవాట్లను పనిచేసేపద్ధతులను నేర్పి తనలో ఇముడ్చుకోలేకపోయింది. వీరు ప్రజల్లో నాయకులుగా గుర్తింపబడేవారు. వీరు ఏదోఒక ప్రజాసమస్యను తీసుకొని తంటాలుపడుతూ ఉండేవారు. ఇక పార్టీ ఆర్గనైజర్ల సంగతి చూదాం. కొత్తగా పార్టీలోకి వచ్చిన యువకులు. వీరు పార్టీపత్రికలను, డాక్యుమెంట్లను చక్కగా చదువుతూ రాజకీయ పరిజ్ఞానం వృద్ధిజేసుకొనేవారు. కాని వీరికి ప్రజాపనిలో అనుభవం తక్కువ. ప్రజల్లో నాయకులుగా గుర్తింపబడేవారు గాదు. దీనితోపాటు సామ్రాజ్య యుద్ధకాలంనుండీ సెల్లులు సరిగా కలుసుకోవడంగాని, దైనందినం ఏదోపని చేయడంగాని ఉండేదిగాదు. స్వాతంత్ర్యదినోత్సవం మొదలైనవి మాత్రం జరుపబడేవి. అందువల్ల పార్టీలో ఒక నిస్తబ్ధత ఏర్పడింది. ఈ నిస్తబ్ధతలో పైచీలిక పెద్దదయి, ముఠాలుగా మారింది.

దివితాలూకాలోగూడ పార్టీలోకి ప్రజల్లో పలుకుబడిగలిగిన కొందరు వచ్చారు. వీరిలో పల్లెటూరి పెద్దమనుష్యుల లక్షణాలు ఉండేవి. వాటిని పోగొట్టి, పార్టీ తనలోకి ఇముడ్చుకోలేక పోయింది. పైగా కొత్త కొత్తగా విద్యార్థిరంగనుంచి వచ్చిన కామ్రేడ్స్, ప్రజాపనిలో ఏమీ అనుభవం లేకపోయినప్పటికీ పార్టీ ఆర్గనైజర్లుగా నియమింపబడ్డారు. దీనితోపాటు పార్టీపని మూలబడటంవలన నిస్తబ్ధత ఏర్పడింది. చల్లపల్లి జమీందారు, అధికాహారోత్పత్తికోసం బంజరుభూములకు గట్లుపెట్టిన వారిమీద కేసులు పెట్టడం, మంగళాపురంలో కూలీలకిచ్చిన భూములను పోలీసులు లాఠీచార్జీ చేయించి తిరిగి ఆక్రమించుకొని వారిమీద అనేక కేసులుపెట్టి తిప్పడం, మొదలైనవిచేస్తూ పార్టీమీద దాడి చేశాడు. దీనివల్ల పార్టీ సభ్యులలో నిస్పృహవచ్చి, పార్టీపని మూలబడింది. ఈ నిస్తబ్ధ పరిస్థితుల్లో ఆపై చీలిక తాలూకా పార్టీ కాన్ఫరెన్సునాటికి ఫాక్షనలిజగాం తయారయింది.

కృష్ణాజిల్లాలోని మిగతా తాలూకాలలో పార్టీ ఆర్గనైజర్లు, ప్రజారంగాల బాధ్యుల మధ్య ఇంత అగాధం ఏర్పడలేదు. పైగా మిగతా తాలూకాలలో కాంగ్రెసునుండి ముఖ్యులనుగాని, ఇతర గ్రామపెద్దమనుష్యులనుగాని ఎక్కువమందిని ఆకర్షించలేదు. అందుచే ఆ సమస్య అంత తీవ్రతరంగాలేదు. ప్రజల్లో దైనందినపుపని తీవ్రంగా సాగకపోయినా ఏదోరీతిగా సాగుతూనేఉంది. అందుచే పార్టీ ఆర్గనైజర్లు, ప్రజారంగ బాధ్యులమధ్య చీలిక ఉన్నా, యీ మిగతా తాలూకాలలో ఫాక్షనలిజంగా మారలేదు.

పార్టీలో నిస్తబ్ధత ఏర్పడి ఏమీ పని జరుగని పరిస్థితుల్లోనే, అంతకు పూర్వం ఉన్న విభేదాలు, వ్యక్తిగతవులు పెరిగి ఫాక్షనలిజంగా తయారవుతాయనీ, పార్టీ ముందుకు పోతున్నంతకాలం ఈ విభేదాలు వ్యక్తిగతగూలు అణగిఉంటాయనీ, రుజువుచేయడానికి పార్టీ చరిత్రనుంచి ఇంకా ఎన్నైనా ఉదాహరణ లియ్యవచ్చును.

పార్టీ ఫాక్షనలిజాన్ని ఎన్నటికీ సహించదు :

కమ్యూనిస్టుపార్టీలో ముఠాలు ఏర్పడటమంటే, పార్టీ యంత్రం, ప్రజాసంఘాలు మూలబడటమన్నమాట. ప్రజలను, భారతదేశాన్ని - తిండిదొంగలకు, కరువుకాటకాలకు, అంటుజాడ్యాలకు బలిచేయడమన్నమాట. దేశాన్ని ఐక్యపరచి సామ్రాజవాదులనుండి జాతీయప్రభుత్వాన్ని గుంజుకోవడానికి, జపాను పాసిస్టులదాడినుండి దేశాన్ని రక్షించడానికి నిరాకరించడమన్నమాట. పార్టీయొక్క అంత్యలక్ష్యమైన సోషలిజంవైపుకు పోవడాన్ని ఆటంకపరచడమన్నమాట. అందువల్ల రాజకీయ భేదాలను, వ్యక్తితగాదాలను పార్టీ పద్ధతులలో పరిష్కరించకుండా, పార్టీలో ముఠాలుగట్టి పార్టీని విచ్ఛిన్నం చేయడానికి పూనుకునేవారు పార్టీకి, ప్రజలకు బద్ధవిరోధులు. అట్టివారికి ప్రపంచమంతటా సోషలిజంస్థాపించి, మానవకోటిని రక్షించబూనుకొన్న కార్మికవర్గ పార్టీయైన కమ్యూనిస్టు పార్టీలో తావులేదు. ఫాక్షనలిజాన్ని పార్టీ ఒక్క క్షణంగూడ సహించదు.

ఫాక్షనలిజం బూర్జువా పోకడయే (Burgeoise tendency) గాని, కార్మికవర్గ పోకడగాదు. ఒక కార్మికుని ప్రయోజనాలకు మరొక కార్మికుని ప్రయోజనాలకు మధ్య వైరుధ్యంలేదు. అందరినీ దోచుకుతినేది పెట్టుబడిదారే. అందరూ పెట్టుబడిదారువద్ద కూలి తీసుకోవలసిందే. తన స్థితిని బాగుచేసుకోవాలంటే, ప్రతికార్మికుడు కార్మికులందరి మంచి కోసం పాటుబడాలి. కనుక కార్మికవర్గంలో వ్యక్తి ప్రయోజనాలు, వర్గప్రయోజనాలు ఒక్కటే. కాని బూర్జువావర్గంలో వ్యక్తి ప్రయోజనాలు, వర్గప్రయోజనాలు ఒక్కటిగావు. ఎందువల్లనంటే, బూర్జువావర్గం తమ ఆస్తులను పెంచుకోడానికి కార్మికవర్గాన్ని దోచుకొన్నా, లాభాల సంపాదనకు ఒక పెట్టుబడిదారుకు మరొక పెట్టుబడిదారుకు మధ్య పోటీ ఉంది. చిన్న పెట్టుబడిదారును పెద్ద పెట్టుబడిదారు పోటీలో మ్రింగివేస్తాడు. అందువల్ల బూర్జువా పార్టీలలో ముఠాలు ఉండటం సహజమే. ఆ పార్టీలలో ప్రతి సభ్యుడు తనకున్న అనుమానాలను నిర్మొగమోటంగా చెప్పక, తన కోర్కెలీడేర్చుకోడానికి ముఠాలు గట్టడం, సహజమే. కమ్యూనిస్టుపార్టీ చుట్టూ బూర్జువా వాతావరణం ఉండుటవలన, రైతులు పెట్టుబడిదార్లు, జమీందార్లు మేధావులనుండి, కార్మికవర్గ సిద్ధాంతమైన మార్క్సిజంను స్వీకరించి కమ్యూనిస్టుపార్టీలోకి జేరుతున్నారు. వారు తమ తమ వర్గసిద్ధాంతాలను వదలివేసి కార్మిక వర్గ సిద్ధాంతాన్ని స్వీకరించినా, వారి వర్గ అలవాట్లను, దృష్టిని వెంటనే వదలుకోలేరు. అందువల్ల కమ్యూనిస్టుపార్టీలోకి ఫాక్షనలిజం వస్తుంది.

తమ తమ వర్గ అలవాట్లను, దష్టిని, కమ్యూనిస్టుపార్టీ కార్యక్రమాన్ని అమలు జరుపుతూ కృషిజేసి పోగొట్టుకొని, కార్మికవర్గ అలవాట్లను దృష్టిని అలవరచుకోవడాన్నే, మార్క్సిస్టు భాషలో "డీక్లాసు' (Declass) అవడమని అంటాం. సామాన్యంగా 'డీక్లాసు' అవడం బూర్జువా, జమీందారీ వర్గాలనుండి కమ్యూస్టుపార్టీలోకి తక్కువమంది వస్తారు.

ఎందువల్లనంటే, కమ్యూనిస్టుపార్టీ ఆవర్గాల దోపిడీవిధానానికి వ్యతిరేకంగానే కార్మికులను, కూలీలను, రైతులను సమీకరించుతుంది. ఆదోపిడీవర్గాలనుండి వచ్చేవారు విచ్ఛిన్నమవుతున్న పెట్టుబడిదారీ విధానంనుండి బయట పడటానికి ప్రపంచానికి మార్క్సిస్టు సిద్ధాంతం ఎలా ఏకైక మార్గమో గ్రహించిన తరువాతనే పార్టీలోకి వస్తారు. వారు వారి వర్గపు వారితో సంబంధాలు వదలుకోవడం, వారి వారి కుటుంబాలతో సంబంధం వదలుకోవడం (వారి కుటుంబాలకు పార్టీ సానుభూతికల్గేలా చేయడం చాలకష్టం), సామాన్యులమీద పెత్తనంజేసే అలవాట్లను మార్చుకోవడం, (కష్టజీవులైన రైతులు, కూలీలు, కార్మికులతో కలిసిమెలిసి ఉండటం) అన్నిటికన్న ముఖ్యమైనది. తమ జీవిత పరిమాణం (భోగలాలసత్వం) తగ్గించుకొని సామాన్యజీవితం గడపడం, ఆత్మవిమర్శనద్వారాను ఇతరులు చూపించినప్పుడు తమ తప్పులను గ్రహించి వాటిని దిద్దుకోవడం, నిర్మొగమోటంగా తమ తప్పులను పార్టీ మీటింగులో అంగీకరించడం, ఇతరులనుగూర్చి నిర్మొగమాటంగా చెప్పడం, మొదలైనవన్నీ చేసి 'డీక్లాసు' కావాలి.

మధ్య తరగతి మేధావులకు ఆస్తులుండకపోయినా, వారు బూర్జువావర్గంమీద ఆధారపడి ఉండేవారగుటచే, వారి అలవాట్లు, దృక్పథం వీరికిగూడ ఉంటుంది. పైగా బూర్జువా విజ్ఞానం వీరిలో మూర్తీభవించి ఉండుటచే, ప్రపంచమంతా తమవల్లనే నడుస్తుందనే అహంభావం ఎక్కువగా ఉంటుంది. మేధావి మిగతావారికన్న తనే గొప్పవాడి ననుకుంటాడు. ఇతరులలోని మంచిని, గొప్పదనాన్ని గ్రహించలేడు; చూచి ఓర్వలేడు. తన తప్పును ఆత్మవిమర్శనద్వారా తెలుసుకోలేడు. ఇతరులు తన తప్పును చూపితే సహించలేడు. సామాన్యంగా వాగుడు ఎక్కువగా ఉంటుంది. ప్రాక్టికలుగా జేసేపని తక్కువ ఉంటుంది. తరచు విద్యార్థులలో ఈలోపం కనపడుతుంది. మేధావులనుంచి వచ్చిన వారు 'డీక్లాసు' అవాలంటే వారి వ్యక్తి అహంభావాన్ని పోగొట్టుకోవాలి.

రైతులుగూడ దోపిడీచేయబడే వర్గమే గనుక రైతులనుండి వచ్చినవారు సామాన్యంగా వారికుటుంబాలతో సంబంధం వదలుకోవాలిసిన అవుసరంఉండదు. కుటుంబాలను పార్టీసానుభూతిగల వాటినిగా చేయవచ్చును. వీరికిగూడ నిర్మొగమాటంగా మాట్లాడకపోవడం, తప్పును అంగీకరించడానికి అవస్థపడటం మొదలైన అలవాట్లు ఉంటాయి. వీరు 'డీక్లాసు అవడం' బూర్జువా, మధ్యతరగతి మేధావులనుండి వచ్చిన వారంత కష్టంగాదు.

బూర్జువావర్గానికి, కార్మిక వర్గానికి తప్ప మిగతా వర్గాలకు టైముకు రావడం (Punctuality) ఉండదు. ఎందువల్లనంటే రైతులు, జమీందార్లు, ఇతర మధ్యతరగతివారు ఒంటరిగా పనిచేయడం వలన, వారికి ఒక టైము నిర్ణయించుకొని ఆటైముకు సరిగా హాజరుకావడం ఉండదు. కాని కార్మికులు అనేక వేలమంది కలిసి ఒకే ఫాక్టరీలో పని చేయాలిసిన అవుసరం ఉండుటవలన, యేఒక్కరు టైముకు రాకపోయినా మిగతావారి పనికి దెబ్బతగులుతుంది. అందువల్ల టైముకు రావడం అనే అలవాటు కార్మికులకు

ఉంటుంది. వారిచే సకాలానికి పనిచేయించుకోడానికి పెట్టుబడిదార్లలోకూడ అది సహజంగా ఉంటుంది.

రైతులు, మధ్య తరగతివారు, ఎవరికివారు వ్యక్తిగతంగా పనిచేసుకోవడంవలన, కలిసి టీముగా పనిజేసే అలవాటు ఉండదు. కాని కార్మికుడు ఒక యంత్రాన్ని నడపడానికి మిగతా కార్మికులతో కలిసి జట్టుగా పనిచేయాలిసిన అవుసరం ఉంది. మిగతా వర్గాల నుంచి వచ్చిన వారికి ఈ జట్టుగా పనిజేసేతత్వం అలవరచాలి. వివిధవర్గాల అలవాట్లు, దృష్టి ఏవిధంగా ఉంటాయో పైన వివరించబడినాయి. ఇతర వర్గాల యువకులు కమ్యూనిస్టు పార్టీలోకి వచ్చినప్పుడు వారివారి వర్గ అలవాట్లను పోగొట్టి, కార్మికవర్గ అలవాట్లను, దృష్టిని అలవాటు చెయ్యాలి. ఈవిధంగా చేస్తే, పార్టీలోకి ఫాక్షనలిజం రాకుండా కాపాడగలుగుతాము.

ఫాక్షనలిజాన్ని రూపుమాపేది ఎలా ?

ఎక్కడైనా ఫాక్షనలిజంవస్తే దాని రాజకీయ కారణాలేమిటో ముందు తెలుసుకోవాలి. రాజకీయ నిస్తబ్ధతనుండి పార్టీ యూనిటును బయటికి లాగడానికి, ఒక కార్యక్రమమివ్వాలి. ఫాక్షనలిజంఉన్న పార్టీయూనిటులో ముఠాలుగట్టడానికి కారకులెవ్వరో తెలుసుకోవాలి. ముఠాలుకట్టడానికి కారకులెవ్వరో తెలుసుకోవడం తేలికే. సెల్లులలో అయితే అట్టివారిని బట్టబయలుచేయడం అంత కష్టంగాదు. కాని పైకమిటీలలో అటువంటివారు ఫాక్షనలిజం చేసినట్లుగా రుజువుచేసి వారిని బట్టబయలుచేయడం కష్టం. ఎందుచేతనంటే వారు ఒకవైపున ముఠాలుగడుతూ, రెండవవైపున తాము బయటపడకుండా ఉండటానికి, ముందే ఎత్తులువేసి ఉంచుతారు. ఒకటి రెండు ఉదాహరణలను చెబుతాను. ఒక ముఖ్య పార్టీ ఆర్గనైజరు పార్టీ కార్యక్రమానికి వ్యతిరేకంగా ప్రవర్తించి, దాన్ని రాష్ట్రకమిటీకి తెలియకుండ దాచిపెట్టుటచే, రాష్ట్రకమిటీ అతనిని పార్టీనుండి సస్పెండుచేసింది. అతడు తనకు వ్యక్తిగతంగా సానుభూతిగా ఉండేవారిని పిలిచి, రాష్ట్రకమిటీ పక్షపాతబుద్ధితో ప్రవర్తిస్తోందనీ, రాష్ట్రకమిటీకి లొంగి పనిచేసేవారిని ఆర్గనైజర్లనుగా నియమించిందనీ చెప్పి, వారికి ఉద్రేకాన్ని కలుగజేశాడు. వచ్చే జిల్లాకాన్ఫరెన్సులో మనం కమిటీని ఆక్రమించుకుందామని వారు సూచించితే, ఇది ఫాక్షనలిజమనీ, పార్టీ శిక్షణకు విరుద్ధమనీ చెబుతూ, తాను పార్టీ శ్రేయోభిలాషివలె వారిముందు నటించేవాడు. వారు వారికి సంబంధించిన పార్టీ సభ్యులవద్దకువెళ్ళి, రాష్ట్రకమిటీకి, రాష్ట్రకమిటీచే నియమింపబడిన ఆర్గనైజర్లకు వ్యతిరేకంగా ప్రచారంచేశారు. ఇది బయటబడింది. ఫాక్షనలిజానికి మూలకారకుడైన ఆముఖ్య కామ్రేడును నిలవదీస్తే, వాళ్ళే తనవద్ద ముఠాగడదామనిచెబితే తానే వద్దని చెప్పానని సమాధానమిచ్చాడు. ముఠాలుగట్టడానికి ప్రయత్నించివారినడిగితే, అతడు వద్దన్నాడనీ, తామే ముఠాలుగట్టామనీ చెప్పారు. ఫాక్షనలిజానికి కారకుడైన ముఖ్యుడు వారిని రెచ్చ

గొట్టాడు. వారు రెచ్చిపోయినతరువాత తనమీదకు రాకుండా మాటవరుసకు వద్దని చెప్పాడు. అతడుకోరినది ఆచరణలో జరిగింది. తానువద్దన్నా ఇది జరుగుతుందని ఆ ముఖ్య కామ్రేడ్‌కు తెలుసు.

మరొక ఉదాహరణ. ఒక కార్మిక యూనియనులో ఒక కామ్రేడ్ పార్టీ పాలసీని అమలుజరపకపోవడమే గాక, దాన్ని సొంతఆస్తిగా జేసుకోడానికి అందులోని పార్టీసభ్యుల లోని లోపాలను సమర్థించడం, కులపెత్తనదారులను సమర్థించడం మొదలుపెట్టాడు. పార్టీ దీనిని గ్రహించి ఆ యూనియను వ్యవహారాలను చక్కబెట్టడానికి ఒక కామ్రేడ్‌ను నియమించింది. పార్టీశిక్షణకు వ్యతిరేకంగా నడుస్తున్న కామ్రేడ్స్‌ను సమర్థిస్తూ, వారిని ముఠాగట్టడానికి రెచ్చగొడుతూ, మొదటి ఉదాహరణలో చెప్పబడిన కామ్రేడు వలెనే మాటవరుసకు వారికి వద్దని చెప్పడం ప్రారంభించాడు. కాని మొదటి ఉదాహరణలోని కామ్రేడ్ కన్న ఇతడు ఇంకా తెలివిగలవాడు. ఇట్లా ఫాక్షనలిజం సాగిస్తూనే, ముందే స్థానికపార్టీ కమిటీకి ఆయూనియనును చక్కబరచడానికి నియమించబడిన కామ్రేడుకుసైతం చెప్పాడు.

మరొక ఉదాహరణ తీసుకుందాం. ఒక పార్టీకమిటీ రెండుముఠాలుగా చీలిపోయింది. రెండుముఠాలకు పార్టీశ్రేయస్సు బుర్రలోలేదు ఒక ముఠాలోని కామ్రేడ్ ఆకమిటీకి కార్యదర్శిగా ఉన్నాడు. ఇతడు ఆ తగాదాలను గూర్చి తన ముఠాలోనివారు చేసిన పొరపాట్లను చెప్పకుండా, జరిగిన విషయాలను తల్లక్రిందులు చేసి రెండవముఠా వ్యక్తులమీద తప్పుడు రిపోర్టు ఇచ్చాడు. ఆ రిపోర్టులో ఉన్న పరస్పరవిరుద్ధమైన విషయాలనుబట్టి, అది తప్పుడు రిపోర్టుఅని స్పష్టంగా తె[illegible]స్తుంది. అందువల్ల తాను ముఠాగట్టినట్లు కాదనలేదు. కనుక తాను ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు రిపోర్టులు వ్రాయలేదనీ, ఉద్రేకంలో తన ముఠావారు చేసిన పొరపాట్లను చూడలేకపోయాననీ, చెప్పాడు. ముఠాగడుతూ ఉద్దేశ్యపూర్వకంగా ఆపని చేయలేదనడం, ఇది చివరివాదన. ఇతని తప్పులు బయటపడిపోవడంవలన, తమమీద ఇటువంటి ప్రత్యక్షరుజువులు లేకపోవుటవలన, రెండవ ముఠావారు ధైర్యంతెచ్చుకొని, తామేమీ ముఠాగట్టలేదనీ, అలా కట్టామని చెపితే రుజువుచెయ్యాలనీ, లాయర్లు వాదన మొదలుపెట్టారు.

పై ఉదాహరణలో చెప్పబడిన వ్యక్తులలాంటివారు "నేను పలుగు పుచ్చుకొని కన్నం వేస్తుండగా చూచావా ?" అన్నట్లు, సామ్రాజ్యవాదకోర్టులలో లాయర్లవలె వాదిస్తారు. ప్రత్యక్షరుజువు లేదుగదా అని ఇటువంటివారి వాదనలకు లొంగిపోగూడదు. ఈ పరిస్థితులను బట్టి నీవు ఫాక్షనలిజం చేసినట్లు రుజువౌతుందనీ, లాయర్ల ఆర్గుమెంటు కమ్యూనిస్టుపార్టీలో పనికిరావని నిర్మొగమాటంగా చెప్పాలి. సామ్రాజ్యవాద కోర్టులలో లాయర్లు ఇటువంటి ఆర్గ్యుమెంట్లుద్వారా నేరంచేసినవాడిని శిక్షనుండి ఎలా తప్పిస్తారో, నేరం చేయనివారికి ఎలా శిక్షలువేయిస్తారో గూడ పార్టీసభ్యులకు నచ్చజెప్పాలి. అసలు ఇటువంటి ఫాక్షనలు దృష్టి ఉన్నవారిని కనిపెడుతూ, ఎప్పటికప్పుడు వారిచేతలను పార్టీ

సభ్యులముందు బట్టబయలుజేసి, పార్టీసభ్యులనుండి దూరంచెయ్యాలి. అలాచేస్తే వారి తత్వాన్ని మార్చుకుంటారు. లేకపోతే పార్టీనుంచి వెళ్ళిపోతారు. వీరిని పార్టీసభ్యులముందు బట్టబయలుజేసి పార్టీకమిటీలలోనూ, ఇతర బాధ్యతగల స్థానాలనుండి తొలగించాలి. అవసరమైతే పార్టీనుండి గూడ తొలగించాలి. వీరు ఎటువంటి బాధ్యతగల స్థానాల్లో ఉన్నా వహించగూడదు. ఈ విధంగా చేయుటద్వారానే పార్టీ ఐక్యతను కాపాడగలుగుతాం.

సామాన్యసభ్యులు ఫాక్షనలిజంలో ముఖ్యులచేతుల్లో కీలుబొమ్మలలాగ ఉపయోగపడతారు. కనుక వీరికి సామాన్యంగా వార్నింగుఇస్తే సరిపోతుంది. వీరికి ఫాక్షనలిజం వల్ల పార్టీ ఉద్యమానికి ఎలా హానిజరుగుతుందో నచ్చజెప్పి, వీరిని మార్చడానికి ప్రయత్నించాలి.

గుడివాడ తాలూకాలోవలె పార్టీకమిటీ రెండుముఠాలుగా చీలిపోయి, ఒకరిలో మంచిని మరొకరు చూడలేకపోవడం, ఒకరి తప్పులను మరొకరు పెద్దవాటినిచేయడం, చేస్తున్నప్పుడు, ఆ కమిటీ పార్టీని నడపలేదు. అట్టిపరిస్థితుల్లో ఆ కమిటీని రద్దుజేసి, పార్టీసభ్యుల అభిమానాన్ని చూరగొని, ఈ ఫాక్షనలిజాన్ని రూపుమాపి పార్టీని ముందుకు తీసుకుపోగలిగిన శక్తిగల సభ్యులతోగూడిన కమిటీనివెయ్యాలి. దానికి అవకాశంలేకపోతే ఒక దిట్టమైన ఆర్గనైజరును వెయ్యాలి.

కమిటీలో ఆవిధంగా రెండుముఠాలుగా తయారుగానప్పుడు, అందులో ఫాక్షనలిజానికి కారణమైనవారిని తీసివేసి, సమర్ధులైన ఇతర కామ్రేడ్స్‌ను ఆకమిటీలోకి వేయవచ్చును.

ఫాక్షనలిజం ప్రాకిన పార్టీసెల్లులలో పార్టీ నీతినిగూర్చి పార్టీసభ్యులలో వివరించాలి. ఫాక్షనలిజంవల్ల పార్టీకి జరిగే హానినిగూర్చి, ఫాక్షనలిజం పార్టీలో ఎంత పెద్దనేరంగా పరిగణించబడుతుందో వివరించిచెప్పాలి. అంతేగాక ముఖ్యంగా చెయ్యాలిసింది ఏమంటే, ఫాక్షనలిజం అక్కడ ఎందుకు వచ్చిందో, దానికి వెనుకనున్న రాజకీయ కారణాలేమిటో, దాన్ని పోగొట్టడానికి ఏ కార్యక్రమం తీసుకొని పనిజేయాలో వివరించాలి. ఆ ఫాక్షనలిజానికి కారణం కొద్దిమంది వ్యక్తులేగాక, పార్టీ నిస్తబ్దంగాఉండటం ఎలా కారణమో వివరించిచెప్పాలి. ఫాక్షనలిజం సాగించిన ముఖ్యులనుగూర్చి వారికి బట్టబయలుచెయ్యాలి.

ఫాక్షనలిజం జరిగినచోట, ఒక సెల్లుసభ్యుడు మరొక సెల్లుసభ్యునికి చెప్పటం, సాధారణ సభ్యులు చాటుగా మాట్లాడుకోవడం మొదలైన చిన్న పొరపాట్లు సాధారణంగా ఉంటాయి, వాటిని పట్టుకువేళ్లాడగూడదు. అసలు ఫాక్షనలిజానికి మూలమైన రాజకీయ కారణాలను, ముఖ్య వ్యక్తులనుగూర్చి విచారించాలి. ముఖ్యులమీద డిసిప్లినరీచర్య తీసుకొని, 'ఫార్మల్‌గా' పార్టీశిక్షణకు వ్యతిరేకంగా నడిచినవారికి వార్నింగుఇస్తే చాలును.

పార్టీసభ్యుల జనరల్‌బాడీ మీటింగులు :

పార్టీసభ్యులలో ఇప్పుడు పార్టీ చైతన్యం బాగా వచ్చింది. ఫాక్షనలిజం సాగించిన వ్యక్తి ఎంత ముఖ్యుడైనాసరే సహించరు. వారిని మందలించి, తప్పును గ్రహించేలాచేసే స్థితిలో పార్టీసభ్యులున్నారు. ఫాక్షనలిజం జరిగిన ప్రాంతంలోని పార్టీ సభ్యుల జనరల్‌బాడీ మీటింగు పిలవాలి. ఫాక్షనలిజం గ్రామం, పట్టణంవరకే ఉంటే, గ్రామం లేక పట్టణంలో ఉన్న పార్టీ సభ్యుల మీటింగుకు పిలవాలి. ఫిర్కాలో ఉంటే ఫిర్కా సభ్యుల జనరలుబాడీ మీటింగు, తాలూకా అంతట ఉంటే తాలూకా పార్టీ సభ్యుల జనరలుబాడి మీటింగు జరపాలి. జిల్లాకమిటీతోఉంటే అవుసరమయితే జిల్లాకమిటీలోలేని ఇతర తాలూకా ముఖ్యులనుగూడ పిలిచి ప్లీనంజరపాలి. ఈమీటింగులలో గ్రామానికి తాలూకాఆర్గనైజరు, ఫిర్కా లేక తాలూకాకు జిల్లాఆర్గనైజరు జిల్లాకు రాష్ట్ర ఆర్గనైజరు హాజరుగావాలి. వీరు పై మీటింగులు జరపకపూర్వమే పూర్తి విచారణజేసి, ఫాక్షనలిజం ఎందుకు వచ్చిందీ, సాగించిన వ్యక్తులు ఎవరూ, ఏ డిసిప్లినరీ చర్యతీసుకోబడిందీ, ఫాక్షనలిజం రూపుమాపడానికి తీసుకోవాలిసిన ఇతర జాగ్రత్తలు మొదలైనవివరాలతో రిపోర్టు తయారుచెయ్యాలి. సందర్భాన్ని బట్టి జిల్లా లేక తాలూకా లేక పట్టణ కమిటీమీటింగులో దీన్ని పెట్టి చర్చించాలి. ఏవైనా సవరణలుంటే చేసి, పైకమిటీ ప్రతినిధి జనరల్‌బాడీ మీటింగులోపెట్టాలి. తరువాత ఫాక్షనలిజం సాగించిన వ్యక్తులను ముందు సమాధానం చెప్పమనాలి. తరువాత ఇతర కామ్రేడ్సును గూడ మాట్లాడమనాలి. ఫిర్కాలోనూ, గ్రామంలోనూ పార్టీ కమిటీలు లేవు గనుక, పైకమిటీ ప్రతినిధి నేరుగానే జనరలుబాడీ మీటింగులో రిపోర్టులు పెట్టవచ్చును. డిసిప్లినరీ చర్య తీసుకోవడం విషయంలోనూ, రిపోర్టు విషయంలోనూ కమిటీలను సంప్రదించినా, అంత్య నిర్ణయం పై కమిటీ ప్రతినిధిదే.

ఈ జనరలుబాడీ మీటింగులో సానుభూతిపరులు - వీరికి పార్టీ రహస్యాలు కాపాడే శిక్షణగాని చైతన్యంగానిఉండదు. గనుక మిలిటెంట్లనుగాని పిలువరాదు. వీటిలో 'సెక్సు'కు సంబంధించిన విషయాలుగాని, కామ్రేడ్సు గృహ విషయాలుగాని ఎత్తగూడదు. ఇటువంటి విషయాలు అందరిలోబెట్టి చర్చించేవిగాదు. ఇవి అందరిలో చర్చించడంవల్ల ఆ కామ్రేడ్సును డీమోరలైజు' చేయడం, కొన్ని పరిస్థితుల్లో పార్టీ నుంచి దూరంచేయడం గూడ జరుగుతుంది. ఏవ్యక్తి అయినా తన రాజకీయ లోపాలను పదిమందిలో చర్చిస్తుంటే సహించగలడుగాని, 'సెక్సు' విషయాలు, గృహవిషయాలు చర్చిస్తుంటే సహించలేడు. కనుక 'సెక్సు' గృహవిషయాలు జనరలుబాడీ మీటింగులలో మాట్లాడటమంటే పార్టీకి దెబ్బగొట్టడమే. ఇవి ఫాక్షనలిజంతో కలిసిఉంటే, వీటిని పైకమిటీ ప్రతినిధి స్వయంగా విచారించాలి. సెక్సు', గృహవిషయాలు జనరలుబాడీ మీటింగులలో మాట్లాడటంవల్ల పార్టీకి జరిగే హానినిగూర్చి, రాజకీయ విషయాలను ఇతర వ్యక్తిలోపాలను మాత్రమే చెప్పాలనీ, ముందుగానే కామ్రేడ్సును హెచ్చరించాలి.

మీటింగులో మాట్లాడేవారందరికీ అవకాశమిచ్చి, అటుతర్వాత పై కమిటీ ప్రతినిధి ముగింపు ఉపన్యాసంలో అందులో సభ్యులు ఎత్తిన ప్రశ్నలకు సమాధానమియ్యాలి. పార్టీ నీతిని గూర్చి సభ్యులకు నచ్చజెప్పాలి.

పార్టీనీతి అంటే ఏమిటి ?

(1) ఆత్మవిమర్శన ద్వారా తనలోపాలను గ్రహించడం, ఇతరులు తనలోపాలను చూపినప్పుడు కోపం తెచ్చుకోకుండా ఉండటం, దానిని పోగొట్టుకోవడం చెయ్యాలి. తన తప్పును సమర్థించుకోడానికి చూడగూడదు; లోపాలను అంగీకరించినంతమాత్రాన సరిపోదు. వాటిని దిద్దుకోవాలి.

(2) తనలోపాలను నిర్మొగమాటంగా పార్టీయెదుట అంగీకరించడం, ఇతరుల లోపాలను నిర్మొగమాటంగా, సానుభూతితో విమర్శించి వాటిని సర్దుకునే మార్గాలను చూపించడం, చెయ్యాలి. మధ్యతరగతి వారివలె, ఇతరుల లోపాలను ఆధారంగాచేసుకొని వారిని ఎగతాళిచేసి, వారిని రెచ్చగొట్టగూడదు.

(3) పార్టీయెదుట ఎప్పుడూ అబద్ధం చెప్పగూడదు. పార్టీసభ్యులను స్పష్టమైన కారణం లేకుండా అనుమానించడంగాని దురుద్దేశం అంటగట్టడంగాని కూడదు. ఒక పార్టీసభ్యుడు తన పొరపాటును చెప్పినప్పటికీ దిద్దుకోకుండా, పదేపదే చేస్తూఉంటే అప్పుడు అతని ఉద్దేశ్యాన్ని అనుమానించాలి.

(4) తన అభిప్రాయాలను స్పష్టంగా పార్టీలోచెప్పాలి. ఇతర కామ్రేడ్స్‌తో చాటుగాచెప్పి ముఠాలుగట్ట ప్రయత్నించగూడదు. మొదట తన అసంతృప్తిని తన దగ్గర స్నేహితులకు చెప్పుకొని తృప్తిపడటం, వారు ఇతనికి సానుభూతిచూపడం, ఈవిషయం పార్టీలో చెప్పకపోవడం, క్రమంగా ముఠాగా ఏర్పడటం జరుగుతుంది. తన అసంతృప్తిని చాటుగా తన స్నేహితులవద్ద వెళ్ళబోసుకోవడంలో ఫాక్షనలుదృష్టి మొదట లేకపోవచ్చును. గాని. క్రమంగా అది ఏర్పడుతుంది.

(5) ఎవరైనా అలా తనకు చెబుతుంటే, ప్రతి పార్టీసభ్యుడూ అతనిని మందలించాలి. పార్టీకి వెంటనే రిపోర్టుచేయాలి. ముఠాలుగట్ట ప్రయత్నించే అతడు ముఖ్యుడైతే, అతనిముఖాన ఉమ్మివెయ్యాలి. ఇలాచేయడం ద్వారానే. వారిని బాగుచేయ గలుగుతారు. పార్టీసభ్యులలో పార్టీచైతన్యం, తమంతటతాము ప్రతివిషయాన్ని ఆలోచించి మంచి. చెడును నిర్ణయించుకోలేని రాజకీయపరిజ్ఞానం లేనప్పుడే, ఫాక్షనలు దృష్టిగల పార్టీముఖ్యులు ముఠాలు గట్టగలుగుతారు. కనుక ఫాక్షనలిజానికి తావులేకుండా చెయ్యాలంటే పార్టీసభ్యుల రాజకీయ చైతన్యాన్ని పార్టీ చైతన్యాన్ని అభివృద్ధిచేయాలి.

(6) ఏ సభ్యుడూ తన యూనిటులోని విషయాలను, తనతోటి మరొక యూనిటు సభ్యునితోగాని. తనయూనిటు క్రిందియూనిటు సభ్యునితోగాని చెప్పగూడదు. అంటే తాలూకా కమిటీసభ్యుడు ఇతర తాలూకాల కమిటీసభ్యులతో గాని, తమక్రింది సెల్లుసభ్యులకుగాని, తనయూనిటు విషయాలను చెప్పగూడదు. రహస్యపార్టీలలో ఇది మరీ అవసరం. ఎందువల్లనంటే ఎవరైనా పోలీసులకు లొంగిపోయినా, పోలీసుఏజంటు పార్టీలో ప్రవేశించినా, డిసిప్లినును సరిగా అమలుజరిపితే ఆ యూనిటుకు మాత్రమే దెబ్బగొట్టగలుగుతాడు. లేకపోతే ఇతర యూనిట్లను గూడ దెబ్బగొట్టగలుగుతాడు.

(7) ఏ పార్టీసభ్యుడైనా తనకున్న అసంతృప్తిని మిగతా యూనిట్లకు వ్యాపింపజేయగూడదు. తనపై యూనిటుకు రిపోర్టు చేయవచ్చును.

5. సెల్లు - గ్రామము, పట్టణములోని పేట.

పార్టీకి సెల్లు ప్రాథమికయూనిటు. సెల్లుకే నేరుగా ప్రజలతో సంబంధముంటుంది. పార్టీపంథాను ప్రజల్లో చొప్పించేదీ, ప్రజలను సమీకరించేదీ సెల్లు. పార్టీలో సెల్లు తన చుట్టుప్రక్కల ప్రజల దైనందిన సమస్యలను పరిష్కరిస్తూ, నిత్యసంబంధం పెట్టుకొంటేనేగాని, ప్రజల నాయకురాలుగా ముందుకురాలేదు. మనసెల్లులలో చాలభాగం నేడు ప్రజలకు నాయకత్వం వహించేవిగా తయారుగాలేదు. చాల కొద్దిసెల్లులు మాత్రమే తమ చుట్టుపట్ల ప్రజల ప్రతిసమస్యను తీసుకోవడం, గ్రామపెత్తనదార్లు, చెట్టుక్రింద ప్లీడర్ల కుతంత్రాలను బట్టబయలుచేయడం, మొదలైన వాటిద్వారా ప్రజలకు నాయకులుగా తయారయినాయి. కొన్ని సెల్లులు స్థానికసమస్యలను తీసుకొన్నా, స్వతంత్ర పాత్రను వహించక, ఒక పెత్తనదారుకు వ్యతిరేకంగా రెండవ పెత్తనదారు తోకగా ఉంటున్నాయి. సెల్లులలో హెచ్చుభాగం, స్థానిక తగవులలో పాల్గొంటే ఒక స్థానికపార్టీ వ్యతిరేకము అవుతుందనీ, స్థానిక తగాదాలలో పాల్గోకుండా ఉంటే రెండు స్థానికపార్టీలు సానుభూతిగా ఉంటాయనే అపోహతో, స్థానిక తగాదాలలోపాల్గొనక దినోత్సవాలను జరపడం, జనరలు సమస్యలను తీసుకొని ప్రచారంచేయడంతో సంతృప్తి పడుతున్నారు.

ప్రజలకు మనం స్వాతంత్ర్యం, సోషలిజం సాధించుతామని ఎంత ప్రచారంచేసినా, వారికి దైనందినంవచ్చే ఇబ్బందులను తీర్చడం, స్థానిక పెత్తనదార్లు, దుండగీండ్లయొక్క దౌర్జన్యాన్ని ఎదుర్కొనే మార్గం చూపించితేనేగాని, ప్రజలు పార్టీ వెనుకరారు. ఈపని చేయకపోతే మనలను ఏదో దేశంకోసం కష్టపడే స్వార్థరహితులగా మాత్రమే అనుకుంటారుగాని, ప్రజానాయకులుగా గుర్తించరు. ఏదో అస్పష్టమైన సానుభూతిని చూపుతారుగాని, పార్టీ పిలుపుతో ముందుకురారు. ప్రజలను ఎదుర్కొన్న ప్రతి సమస్యను తీసుకొని క్రిందామీదపడి సాధించితేనేగాని, స్థానికపెత్తనదార్ల నాయకత్వాన్నిపోగొట్టి, పార్టీనాయకత్వాన్ని సంపాదించలేం. మొత్తంమీద మనపార్టీసభ్యులు తమతమ ప్రాంతాల్లో స్వార్థరహితమైన దేశసేవకులుగా పరిగణింపబడుతున్నారేగాని, ప్రజానాయకులుగా గుర్తింపబడుటలేదు. ఏకొద్దిమంది పార్టీ ముఖ్యులనుమాత్రమే జనరలుగా ప్రజానాయకులుగా గుర్తిస్తున్నారు. మనపార్టీ ప్రజాపార్టీగా తయారవాలంటే, ప్రతి పార్టీసభ్యుడూ తన చుట్టుపట్ల ప్రజలచే నాయకుడుగా గుర్తింపబడేస్థితి రావాలి.

పార్టీసభ్యులు స్థానికప్రజాసమస్యలను తీసుకొని పనిచేయకపోవడానికి కారణాలేమి,

(1) స్థానికపరిస్థితులను మార్క్సిస్టు దృష్టితో అవగాహనచేసుకొని, పార్టీ ఇచ్చిన జనరలు నినాదాలను (ఆహారకమిటీలు, అధికోత్పత్తి, అధికాహారోత్పత్తి) ఆ స్థానిక (గ్రామము, పేట) పరిస్థితుల కన్వయించి, వివరమైన కార్యక్రమం వేసుకొని, ప్రజలను సమీకరించి, ముందుకు సాగుటలేదు. స్థానిక పెత్తనదార్లు చేసే తప్పుడు ప్రచారాన్ని, తప్పుడు నినాదాలను పటాపంచలుచేసి, పార్టీ కార్యక్రమాన్ని కొనసాగించగల రాజకీయ చైతన్యం పార్టీ సభ్యులలో లేదు. అందుచేత పెత్తనదార్లు వేసే ఎత్తుగడలను తట్టుకోలేక, పార్టీ ముఖ్యులకోసం ఎదురుచూడటం జరుగుతోంది. ఈలోగా పెత్తనదారు చొరవను చేజిక్కించుకొని, తనకు కావలసిన పనినికాస్త పూర్తిచేసుకుంటాడు. మన కామ్రేడ్సు చొరవను జారవిడిచి, పరిస్థితుల తోకబుచ్చుకుపోవాలిసి వస్తుంది.

రాజకీయ చైతన్యం, పుస్తకాలు చదివినంతమాత్రాన వచ్చేదిగాదు. ప్రతిసభ్యుడు తాను చదివిన మార్క్సిస్టు సిద్ధాంతాన్ని పరిస్థితుల పరిశీలనకు పనిముట్టుగా ఉపయోగించి, పార్టీ సాహిత్యాన్ని, నినాదాలను తన చుట్టు ఉన్న పరిస్థితుల కన్వయించి, ఆ పరిస్థితులకు తగిన కార్యక్రమాన్ని వేసుకొని ముందుకు పోవాలి. మన కార్యక్రమానికి వ్యతిరేకంగా స్థానికంగా ఉన్న ప్రతికక్షుల నినాదాలను, ఎత్తులను అర్థంచేసుకొని, వాటిని పటాపంచలు చేయాలి. అనుభవంనుండి నేర్చుకొంటూ, తన కార్యక్రమంలోని లోపాలను దిద్దుకుంటూ ముందుకు పోవాలి. ఈ విధంగా తాను చదివిన దానిని ఆచరణలో పెడుతూ అనుభవంనుండి నేర్చుకొంటూంటే, రాజకీయ చైతన్యం వస్తుంది. సిద్ధాంతం మానవుల అనుభవంయొక్క సారమే. మానవుల అనుభవాన్ని సూత్రీకరణం చేసి తేల్చిన సూత్రాలే సిద్ధాంతం. ఈ సూత్రాల నాధారంగా చేసుకొనే, మానవులు జీవితాన్ని సాగిస్తారు. తమ జీవితంలోనుంచి వచ్చిన నూతన అనుభవంనుండి, పూర్వపు సూత్రాలను ఇంకా అభివృద్ధిచేస్తారు. మార్క్సిజం కార్మికవర్గం యొక్కయూ దాని పార్టీయైన కమ్యూనిస్టుపార్టీ యొక్కయూ అనుభవంయొక్క సారాంశమే. కమ్యూనిస్టుపార్టీ, మార్క్సిజం అనే వెలుగుతో ప్రతి విషయాన్ని పరిశీలించి, ముందుకు పోతుంది. తను అనుభవం నుండి ఎప్పటి కప్పుడు మార్క్సిస్టుసిద్ధాంతాన్ని అభివృద్ధి చేస్తుంది ఈవిధంగా మార్క్సిజంలో సిద్ధాంతం, ఆచరణ రెండూ కలిసి ఉంటాయి. ఏ కమ్యూనిస్టు అయినా మార్క్సిజాన్ని, పార్టీపంథాను ఆచరించడంద్వారానే అవగాహన చేసుకోగలుగుతాడు. కనుక రాజకీయ చైతన్యమనేది, చదివినదానిని ఆచరణలో పెట్టుటద్వారానే వస్తుంది. ఆచరణలేని సిద్ధాంతం గొడ్రాలు (నిష్ప్రయోజనమైనది). సిద్ధాంతంలేని ఆచరణ, గుడ్డిగా తడమటమవుతుంది.

(2) రెండవ కారణం ఆలోచించుదాం. పెత్తనదార్లకున్నంత వ్యావహారిక జ్ఞానం పార్టీసభ్యులకు లేదు. వ్యావహారికజ్ఞానం అంటే ప్రభుత్వ డిపార్టుమెంటులను ప్రజల శ్రేయస్సుకోసం ఉపయోగించుకోవడానికి అవసరమయిన చట్టాలను, డిపార్టుమెంటులను (కో-ఆపరేటివు సొసయిటీలు, పంచాయితీ, మున్సిపాలిటీలు, కోర్టులు

మొదలైనవి) గూర్చిన అనుభవం. మన కామ్రేడ్స్‌కు వ్యావహారికజ్ఞానం అంతగా లేక పోవుటచే పెత్తనదార్లు తమను ఎన్నిసార్లు మోసగించి దబ్బుకాజేస్తున్నా. ప్రజలు వారి దగ్గరకే వెళతారు. పెత్తనదార్లంటే ద్వేషం ఉన్నప్పటికీ, వేరేమార్గం కానరాక, వారికే లొంగిఉంటారు. కనుక ప్రతి కామ్రేడ్, తాను పనిజేసే రంగానికి సంబంధించిన వ్యవహారిక జ్ఞానమంతా సంపాదించాలి. ఇలాచేస్తే ప్రజలు, వారి శ్రేయస్సుకోసం పాటుబడే మన దగ్గరకు వస్తారుగాని, పెత్తనదార్ల వద్దకు వెళ్ళరు. ఈ వ్యవహారికజ్ఞానం కల్పించడానికే, రైతుసంఘం రైతుసమస్యలనే పుస్తకాన్ని ప్రకటించింది. ఈ విధంగా అన్ని రంగాలలో వర్కర్లకు గైడ్సుగా పుస్తకాలు ప్రకటించబతాయి. ఎవరికి వారుకృషిజేసి వ్యవహారికజ్ఞానాన్ని సంపాదించాలి.

(3) మూడవ కారణం. పార్టీసభ్యులలో చాల మందికి ఇంటివద్ద పెత్తనంలేదు. వారు తమ తలిదండ్రులను పార్టీ కార్యక్రమం వైపుకు మొగ్గేటట్లు చేయలేకపోతున్నారు. తమ తలిదండ్రులు వ్యక్తికక్షలను మాని, గ్రామశ్రేయస్సుకోసం కలిసివచ్చేలా చేయలేకుండా ఉన్నారు వీరు అలా కలిసిరాక, గ్రామానికి నష్టంవచ్చే పనులు చేస్తుంటే, వారిని బట్టబయలుచేసి, గ్రామ ప్రజల అభిమానాన్ని చూరగొనుటలేదు. అలాగే దగ్గర బంధువులు చేస్తున్న చెడుపనులను వ్యతిరేకించడంలేదు. అందుచేత అటువంటి కామ్రేడ్సు "మాగ్రామంలో నామాట ఎవరూ వినరు; నేను ఇంకొక చోటికి పోయి పనిచేస్తాను" అని అంటున్నారు. గ్రామంలో తగువుకు భయపడినవాడు ఎక్కడయినా భయపడతాడు. అటువంటి వారిని వారి గ్రామాల్లోనేఉంచి, అన్యాయాన్ని ఎదుర్కొని, పార్టీకి ప్రజల అండను నిర్మించేలా చెయ్యాలి. గ్రామంలో పార్టీకి ప్రత్యేక పలుకుబడిని నిర్మించాలంటే, పార్టీ సభ్యులు న్యాయంకోసం నిలబడి పోరాడాలి. అందుకు అవుసరమైతే కుటుంబాన్ని, బంధువులనుగూడ వదలుకోవాలి.

పార్టీకి స్వతంత్ర ప్రజా ప్రాతిపదికను నిర్మించుట : (Independant mass base)

స్వతంత్ర ప్రజా ప్రాతిపదిక ఏర్పరచడమంటే, కమ్యూనిస్టుపార్టీయొక్క రాజకీయ పంథాను అనుసరించే ప్రజా సామాన్యాన్ని గ్రామాల్లోనూ, పట్టణాలలోనూ తయారుచేయడమే. అల్లాగే ఒక తాలూకాలో కొన్ని గ్రామాలు, ఒక జిల్లాలో కొన్ని తాలూకాలు, ఆంధ్రజిల్లాల్లో కొన్ని జిల్లాలు పార్టీయొక్క ప్రత్యేక రాజకీయ పలుకుబడిక్రిందకు తీసుకురావాలి. (అంటే, ప్రజాసంఘాలలో పార్టీ పాలసీ అంగీకరించిన వారిని తప్ప ఉంచగూడదనే అపోహపడరాదు. ప్రజాసంఘాలలో మన మవలంబించాలిసిన పద్ధతినిగూర్చి, "ప్రజాసంఘాలు- పార్టీ" అనే శీర్షికక్రింద వివరించబడుతుంది.) మన కామ్రేడ్స్ ప్రజలయొక్క

ఏదో ఇబ్బందినిగూర్చి తంటాలు పడినంతమాత్రాన, ఆ ప్రజలు పార్టీ పలుకుబడిక్రిందకు వచ్చారని అపోహపడుతుంటారు. వారి ఇబ్బందులను తీర్చడంతోపాటు వారిలో పార్టీయొక్క రాజకీయ పంథాను వారిలో ప్రచారంజేయడం, పార్టీయొక్క రాజకీయ పాలసీవల్ల వారి ఇబ్బందులను ఎలా ఈ దేర్చగలుగుతున్నామో వారికి చూపించడం, జాతీయ ప్రభుత్వాన్ని, సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సాధించడానికి ఇంకా ఎంత త్యాగం చెయ్యాలో చెప్పడంద్వారా, ప్రజల్లో పార్టీ పాలసీయడల చైతన్యసహితమైన విశ్వాసంగల్గించాలి. వారు పార్టీ రాజకీయ పంథాను అమలు జరపడానికి ముందుకు వచ్చేటట్లు చెయ్యాలి. పార్టీ రాజకీయపాలసీని సపోర్టుజేస్తూ ముందుకు వచ్చినప్పుడే, ఆ ప్రజలు పార్టీ రాజకీయ పలుకుబడిలో ఉన్నారని చెప్పవచ్చును. వారిలో ఇటువంటి రాజకీయ చైతన్యం కలుగజేయనప్పుడు, వారి కష్టాలకోసం పాటుబడుతున్నా మనలను వారి నాయకులుగా గుర్తించరు. వారికి సేవజేసే స్వార్థరహితులని మాత్రమే అనుకుంటారు. వారు ఏదైనా రాజకీయ ఘటన జరిగితే, దానిలో బూర్జువా పార్టీలనే సపోర్టుచేస్తారు.

ఒకటిరెండు ఉదాహరణలు తీసుకుందాం విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించింది కమ్యూనిస్టుపార్టీయే, వారియొక్క ఎన్నో యిబ్బందులను కమ్యూనిస్టుపార్టీ తీర్చింది. 1942 ఆగష్టు ఘటనలకు పూర్వం, విద్యార్థిఉద్యమం కమ్యూనిస్టుపార్టీయొక్క రాజకీయ పలుకుబడిలో ఉన్నదని భావించేవారం. కాని ఆగస్టు ఘటనలలో విద్యార్థులే ముందు పాల్గొన్నారు. పార్టీ ఆ ఉద్యమాన్ని నిర్మించినా, విద్యార్థులయొక్క నాయకుడు కాలేదు. కమ్యూనిస్టులంటే అభిమానమున్నా వారు కాంగ్రెసు బూర్జువా రాజకీయ పలుకుబడిలో ఉండుటవలన ఆగస్టు ఘటనలలో విరివిగా పాల్గొన్నారు.

మరొక ఉదాహరణ తీసుకుందాం. ఆంధ్రలో కమ్యూనిస్టుపార్టీ రైతుల్లో పుట్టి పెరిగింది. రైతుసంఘాలను నిర్మించి, దైనందినం రైతుల ఇబ్బందులను తీర్చడానికి పాటుబడుతోంది. వారికి ఎన్నో లాభాలను గలుగజేసింది. అయినను ఇంతవరకూ కూలీల న్యాయమైన కనీసకూలి కోర్కెను చాల కొద్ది గ్రామాల్లోనే అమలుజరుపగలిగింది. ప్రభుత్వం బస్తా రు 11-0-0 లకు వడ్లధర కంట్రోలుచేసింది. ధనికరైతులు, జస్టిసుపార్టీ, రంగాముఠాల అండతో బస్తా రు 20 ధర డిమాండుచేస్తున్నారు. వర్తకులు ప్రభుత్వం నిర్ణయించిన కంట్రోలుధరను భగ్నంచేయడానికి, రు 12; 12-8-0 పెట్టి కొంటున్నారు. మనం ప్రభుత్వం నిర్ణయించిన కంట్రోలురేటుకు ప్రభుత్వానికి ప్రజలచే అమ్మించగలిగినప్పుడు, కూలీల కనీసపుకూలి రేటును అంగీకరింపజేయకలిగినప్పుడు, రైతులు మనపార్టీ రాజకీయ పలుకుబడిక్రింద ఉన్నారని చెప్ప వీలవుతుంది.

1934 వరకూ కమ్యూనిస్టుపార్టీ కార్మికవర్గంలో తీవ్రకృషిజేసి ప్రత్యేక ప్రాతిపదికను సంపాదించగలిగింది. అందువల్లనే జాతీయైక్యసంఘటన రోజులలో (1936–39)

తన రాజకీయపాలసీని ప్రతినిముషాన కార్మికవర్గంచేత అమలు జరిపించేలాజేసి, రైతులు, ఇతర మధ్యతరగతి వారికి దారి చూపింది. అందుచేతనే కమ్యూనిస్టుపార్టీ తన స్థిరమైన కార్మికవర్గ ప్రాతిపదిక నుండి భారతదేశమంతటికీ — రైతులు కూలీలు, ఇతర పీడిత ప్రజల్లోకి — వ్యాపించింది. సామ్రాజ్యవాద యుద్ధ మారంభమవగానే, తన కార్మిక పునాది నుండీ, జాతీయైక్యసంఘటనకాలంలో రైతుల్లోను, కూలీలలోనూ, ఇతర పీడితప్రజలలోనూ ఏర్పరచుకొన్న స్వతంత్ర రాజకీయ పలుకుబడిద్వారా, తన యుద్ధ వ్యతిరేకపంధాలను ఆచరణలో పెట్టించి చూపి, ఇంకా విస్తరించింది. ఆగస్టు ఘటనలలో కార్మికవర్గంచే సమ్మెలుచేయించి, ఉత్పత్తిని నాశనంచేయాలని ఎంతో ధనాన్ని ఖర్చుపెట్టినా, ఫ్యాక్టరీలు మూసివేసి ఎన్నో మాయోపాయాలుపన్నినా, కార్మికులు కమ్యూనిస్టుపార్టీ అండనే నిలబడి దేశం జపానువశం గాకుండా కాపాడారు. అలాగే పార్టీకి స్వతంత్రపలుకుబడి గల పల్లె ప్రాంతాలు విధ్వంసకార్యాల్లో పాల్గోకుండాజేసి, విధ్వంసకచర్యలు వ్యాపించకుండా పార్టీ చేయగలిగింది. పార్టీకి కార్మికులలోనూ, కొన్ని పల్లెప్రాంతాల్లోనూ స్వతంత్ర పలుకుబడి ఉండుటచేతనే, దేశం ఇంతవరకూ జపాను పాలుగాకుండా పార్టీచేయగలిగింద. ఆంధ్రలో గూడ పట్టణాలలో కార్మికులు కృష్ణాజిల్లా, గుంటూరు జిల్లాలలో కొన్ని తాలూకాల లోనూ రైతులు ఈ విధ్వంసకచర్యల్లో పాల్గోకుండా చేయగలిగాము. రాష్ట్రమంతటా కామ్రేడ్సు తీవ్రకృషి జేసి ఈ విధ్వంసకచర్యలు వ్యాపించకుండా చేశారు. పార్టీకి ప్రజల్లో స్వతంత్రపలుకుబడి ఎంత ఎక్కువ అవుతుందో, అంత ఎక్కువగా ప్రజాసామాన్యాన్ని పార్టీ పాలసీమీద కదపగలుగుతాం; అంత ఎక్కువగా కాంగ్రెసు నాయకత్వం, ముస్లిము లీగు నాయకత్వం, హిందూ మహాసభ నాయకత్వం, జాతీయైక్యతా విధానం దగ్గరకు వచ్చే టట్లు చేయగలుగుతాం. వారి వెనుకఉన్న ప్రజాసామాన్యం పార్టీపాలసీవైపుకు మొగ్గు తుంటే, వారు కదలకతప్పదు. అంటే పార్టీయొక్క స్వతంత్ర ప్రజాపలుకుబడి ఎంత ఎక్కువ అవుతుంటే, జాతీయైక్యతా ఆశయానికి అంత దగ్గరకు పార్టీ పోగలుగుతుంది. తాలూకాలలోనూ, జిల్లాలలోనూ, రాష్ట్రాలలోనూ స్వతంత్ర ప్రజాపలుకుబడి నిర్మించాలంటే, గ్రామాల్లోనూ, పట్టణాలలో, పేటలలోనూ స్వతంత్రపలుకుబడిని నిర్మించుకోవాలి. కనుక గ్రామాల్లోనూ, పేటలలోనూ ఎలా స్వతంత్ర ప్రజాపలుకుబడిని నిర్మించాలో దాన్ని ఎలా విస్తరింపచేయాలో ఆలోచించుదాం.

గ్రామాల్లో రెండురకాలున్నాయి. ఒకటి మాగానిగ్రామాలు, రెండు మెట్టగ్రామాలు.

మాగాని గ్రామాలు :

కృష్ణా, గోదావరి, పెన్న ప్రాజెక్టులతో కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లో కొన్నితాలూకాలు, నెల్లూరుజిల్లాలో రెండుతాలూకాలు డెల్టా తాలూకాలుగా మారినవి. మెట్టగాఉన్నప్పుడు పంటలు దాని ఇష్టంవచ్చినప్పుడు కురిసే

వర్షంమీద ఆధారపడి ఉండాలినివచ్చేది. పంట పండటం నికరంగా ఉండేదిగాదు. కాలువ మాగాని రావడంతో ప్రతిసంవత్సరం కొంచెం ఎంచుమించుగా పంట నికరంగా ఉండటం, అంతకు పూర్వం అంతగా సారవంతంగాని భూములుగూడ ఎక్కువ పంటలు పండటం, ప్రారంభమయింది. దీనితో సామాన్య రైతులలోనుండి ధనిక, మధ్య తరగతి రైతులు ఉత్పన్నమయ్యారు. మాగానితోపాటు రోడ్లు, మోటారుకార్లు మొదలైన రహదారి సౌకర్యాలు బాగుగా ఏర్పడినవి. ఆధునిక విజ్ఞానంఇచ్చే స్కూళ్ళు, కాలేజీలు ఎక్కువ అయినాయి. ఈ గ్రామాల్లోని ధనిక, మధ్యతరగతి రైతుల కొడుకులు ఇంగ్లీషు విద్య నభ్యసించసాగారు. బూర్జువా నాగరికత చిహ్నాలు గ్రామాల్లో పొడసూపినాయి. రైతుల్లో ఒకరకమైన వ్యక్తిత్వం, ఆత్మగౌరవము, ఆత్మవిశ్వాసం జనించాయి. రైతులు జమీందార్లయొక్క అక్రమచర్యలను ఎదుర్కొని, చట్టసమ్మతమైన తమ హక్కులను కాపాడుకోజొచ్చారు. దీనితో జమీందార్లు ఈ మాగానిగ్రామాలలో శిస్తును పోగుచేసుకొనే మనవర్తిదార్లుగా అయిపోయారు. ఇక గ్రామంలో పెత్తనంసాగించేది జమీందారు, జమీం తొత్తులయిన కరణం మునసబులుగాక గ్రామంలోని ధనికరైతులుమాత్రమే. గ్రామమునసబు సామాన్యంగా పెద్దరైతు అవడంవల్ల, కొన్నిగ్రామాలలో పెత్తనం గ్రామమునసబులదే. ఈస్థితిలో పంచాయితీబోర్డులు, జిల్లాబోర్డులు, కోఆపరేటివు సొసయిటీలు, పంచాయితీ కోర్టులు మొదలైన స్థానిక స్వపరిపాలకశాఖలు గ్రామాల్లో వెలిసినాయి. అంతేగాకుండా గ్రామంలో జమీందారు పెత్తనం పోవడంతో గ్రామసమిష్టిభూములు, చెరువులమీద పెత్తనం, వాటిఆదాయం ఎవడు మ్రింగడం అనే సమస్యవచ్చింది. గ్రామపెత్తనం, స్థానిక సంస్థలలో పెత్తనంకోసం పెద్దరైతులమధ్య పోటీలు ప్రారంభమయినాయి. వీరు తమకు అండగా గ్రామప్రజలను చీల్చడం మొదలుపెట్టారు. గ్రామంలో రైతులు ఒకే కులము వారైతే, కుదుళ్ళు, జిమ్మాలు (ఒకే రక్తసంబంధ మున్నవారందరినీ ఒక కుదురు లేక జిమ్మా అని వాడతారు) గొప్పతనం, పౌరుషం రేగగొట్టి గ్రామాన్ని చీల్చుతారు. రైతుల్లో వేరువేరు కులాలుఉంటే, కులకక్షలను రేగకొట్టుతారు. అంటే ఒక జిమ్మాలోని లేక ఒక కులంలోని బీదరైతులను, సామాన్యరైతులను గ్రామపెత్తనం సంపాదించడానికి, దాన్ని కాపాడుకోడానికి, ఆ జిమ్మా లేక ఆ కులంలోని ధనికరైతులు ఉపయోగించుకొంటారు.

మాగాని రావడంతోనూ, క్రిస్టియనుమతం ప్రబలడంతోనూ హరిజన కూలీలలో గూడా విద్య, వ్యక్తిత్వం వ్యాపించింది వారిలోగూడ ఆత్మగౌరవం ఎక్కువఅయింది. రైతులు వారిమీద జరిపే దౌర్జన్యాలను వ్యతిరేకించడం మొదలుపెట్టారు. వీరిలోని కుల పెత్తనదార్లకు పంచాయితీబోర్డులు, కోర్టులలో స్థానాలిచ్చి, ధనిక రైతుపెత్తనదార్లు వీరిని తమవెంట త్రిప్పుకొన మొదలుపెట్టారు. ఒక కులంకూలీలే ఉన్నచోట్ల ఆకులంలోని పెత్తనదార్లలో కొందరిని ఒక గ్రామపెత్తనదారు, మరికొందరిని మరొక గ్రామపెత్తన దారు చేర్చుకోవడం జరుగుతుంది. కూలీలలో రెండు మూడు కులాలున్నచోట్ల, ఒక

కులంలో చీలికలుపెట్టడమేగాక, కులకక్షలనుగూడపెట్టి కూలీలనుచీల్చడం జరుగుతుందీ. ఈవిధంగా రైతుల్లో ఏర్పడిన స్థానికపార్టీలు, కూలీలలోకిగూడ ప్రాకినాయి. ఈ పార్టీలకు రాజకీయాల్లో ఏమీభేదంలేదు. రెండుపార్టీలు ప్రభుత్వోద్యోగులకు వంగి సలాములుజేస్తూ వారి అభిమానాన్ని సంపాదించడానికి పాటుబడేవే. బూర్జువా ప్రజాస్వామిక దేశాలైన బ్రిటను, అమెరికా, ఫ్రాన్సులలోవలే, కాన్స్టిట్యూషనలిస్టు (మితవాద) పార్టీలు తయారయినాయి.

చాల గ్రామాలలో కఱ్ఱసాములు నేర్చుకోవడం, దెబ్బలాటలు జరగడం, కోర్టులకెక్కి చాలడబ్బు ఖర్చుపెట్టడం జరిగింది.

1930–34 కాంగ్రెసు ఉద్యమంలో రెండు స్థానికపార్టీలనుంచీ సామాన్యరైతులు పాల్గొన్నారు. కాని 1935 నుంచీ ఎప్పుడైతే ఎన్నికలలో పాల్గోవటం ప్రారంభమైందో, అప్పటినుంచీ ప్రతి గ్రామంలోనూ ఏదో ఒక స్థానికపార్టీ నాయకుని తనవైపుచేర్చుకొని, ఎన్నికలలో పాల్గోవడం మొదలుపెట్టింది. కాంగ్రెసు నాయకత్వం బూర్జువా నాయకత్వమవడంవల్ల గ్రామశ్రేయస్సు అనే నినాదంమీద రెండు స్థానికపార్టీలనుండీ సామాన్య ప్రజలను ఆకర్షించి, పెద్ద రైతులను దూరంచేసి, తానొక ప్రత్యేకమైనపార్టీని నిర్మించలేకపోయింది. కాంగ్రెసుగూడ స్థానికపార్టీల విధానంలో కలిసిపోయిందిగాని, దాన్ని పోగొట్టలేకపోయింది. సామాన్యంగా గ్రామాల్లో కాంగ్రెసుపార్టీ అనుకొనేవారు, ఎన్నికలలో కాంగ్రెసుకే ఓటిస్తారుగాని, మిగతాగ్రామవ్యవహారాల్లో జస్టిసుపార్టీకి ఏమీతీసిపోరు.

ఆంధ్రదేశంలో 1934 లో కమ్యూనిస్టుపార్టీ పుట్టింది. కాని 1938 వరకూ కమ్యూనిస్టులు గ్రామంయొక్క స్థానిక వ్యవహారాల్లో పాల్గొనేవారుగాదు. కృష్ణాలో జస్టిసుపార్టీవాళ్ళ దౌర్జన్యాలను సంహించలేక స్థానిక తగాయిదాలలో పాల్గోవడం మొదలుపెట్టారు. ఇంకనూ చాల గ్రామాల్లో పాల్గొనడంలేదు. పాల్గొన్న గ్రామాల్లోసైతం మన పార్టీసభ్యులు మనకు సంబంధించిన స్థానిక పార్టీ నాయకునికి తోకలవలె ఉంటున్నారు. గాని, రెండు పార్టీలలోని పెద్ద రైతులను బట్టబయలుచేసి ప్రజా ఐక్యతను సాధించి, పార్టీ పలుకుబడిక్రింద స్వతంత్రమైన స్థానిక పక్షాన్ని నిర్మించడంలేదు. వెంట్రప్రగడ, కాటూరు, జొన్నపాడు, (కృష్ణాజిల్లా) లాంటి కొన్ని గ్రామాల్లోనే ఆవిధంగాచేసి పార్టీ స్వతంత్ర పలుకుబడిని నిర్మిస్తోంది. ఇక గ్రామ ప్రజల నైక్యపరచి, ధనిక రైతులను వేరుజేసి స్వతంత్రమైన ప్రజాపక్షాన్ని పార్టీ పలుకుబడిక్రింద నిర్మించేది ఎలాగో చూదాం. రైతుకూలీ సామరస్యం ద్వారానే, రైతులు కూలీలను స్వాతంత్ర్య పోరాటానికి సమీకరించగలమనీ, గ్రామాల్లో మన పనికి ఇది పునాదిగా ఉండాలనీ, 1939 జూనులో బెజవాడలో జరిగిన రాష్ట్రపార్టీ కాన్ఫరెన్సు ఒక పిలుపునిచ్చింది. రైతుకూలీ సామరస్యంమీద అప్పుడు చేయబడిన తీర్మానం కొద్ది మార్పులతో నేటి పరిస్థితులకుగూడ అన్వయిస్తుంది. నేడుగూడ రైతుకూలీ సామరస్య నినాదమే గ్రామప్రజల నైక్యపరచడానికి, పార్టీకి

స్వతంత్ర పలుకుబడిని నిర్మించడానికి ఆయుధం. దేశాన్నెదుర్కొన్న ఆహారసంక్షోభం అంటుజాడ్యాలనుండి నేడు దేశాన్ని రక్షించాలంటే, అధికాహారోత్పత్తిని చేయటమే రైతుల, కూలీలయొక్క దేశభక్తిపూరిత కర్తవ్యం.

కనుక అధికాహారోత్పత్తికి రైతుకూలీ సామరస్యం సాధించాలి అనేదే గ్రామాల్లోని నేటి మన నినాదం. దీనిద్వారా మునుపటికన్న ఎంతో తేలికగా ఈనినాదంమీద రైతుకూలీ రస్యాన్ని సాధించవచ్చు. ఎందువల్లనంటే, పూర్వం "కూలీలకు ఎక్కువగా కూలి ఇయ్యాలి. వాళ్ళను తిట్టగూడదు; కొట్టగూడదు." అని మనం రైతులకు చెప్పేవాళ్లం. మనం పైచెప్పినవి కూలీల హక్కులని చెప్పినా, రైతులు తమను జీవకారుణ్యదృష్టిలో ఎక్కువ కూలి ఇమ్మంటున్నారని అర్థంచేసుకొనేవారు. నేడు "నీవు దేశాన్ని ప్రస్తుత ప్రమాదంనుండి కాపాడటానికి నీభూమి ఎక్కువగా పండాలంటే, నీ ఎద్లు బలంగా ఉండి ఎక్కువకాలం పనిచెయ్యాలంటే, నీవు ఎక్కువ కూలి ఇయ్యాలి; కూలీలను నీసోదరులవలె చూచుకోవాలి, రైతులు కూలీలు గలిసి పంట బోదులు, మురుగుకాల్వలు, బాగుచెయ్యాలి. వాటికోసం ఆందోళనచెయ్యాలి." అని చెప్పగలుగుతాం. నీయొక్క స్వప్రయోజనానికే. నీవు ఎక్కువకూలి ఇయ్యాలని రైతులనుగద్దించి అడగగలుగుతున్నాం. ఇప్పుడు ధనికరైతులు ఈ నినాదానికి ఆటంకంగావస్తే, ఇప్పుడు రైతులు కూలీలముందు ప్రజావిరోధివలె తేలికగా బట్టబయలు అవుతారు. కనుక గ్రామంలో మనకామ్రేడ్స్ ఏపనిచేసినా, రైతుకూలీ సామరస్య సాధనకు అనుగుణ్యంగానే చెయ్యాలి.

గ్రామంలో తమ స్వలాభాలకోసం గ్రామాన్నిచీల్చి ముఠాలుగట్టేది ధనికరైతులు. చాలచోట్ల పెద్దరైతే మునసబుగాఉంటాడు; పెద్దరైతులే వడ్డీ వ్యాపారంగూడ చేస్తారు. కనుక కార్తీకమాసంలో వడ్లుఇచ్చి ఇతరవిధంగా తనపలుకుబడి, దౌర్జన్యం ఉపయోగించి తక్కువకూలి ఇచ్చేది పెద్దరైతులే. కూలీలకు పేదరైతులకు అప్పులుపెట్టి, అధికవడ్డీలు, నాములు గుంజడం, ఇచ్చినడబ్బు వసూళ్ళువేయక, చివరకు ఇళ్ళ వాకిళ్ళుగూడ వేలంవేయించి రైతులను కూలీలుగా మార్చేదీ, కూలీలను శాశ్వత బానిసలుగాచేసేదీ, ధనిక రైతులే. గ్రామంమీద సమిష్టిఆదాయాన్ని మ్రింగుతూ, పంచాయితీబోర్డులు, కోఆపరేటివు సొసయిటీలు, పంచాయితీ కోర్టులు మొదలైన అధికారస్థానాలను అలంకరించేదీ ధనిక రైతులే. చివరకు బ్రిటిషుసామ్రాజ్యవాదులకు అండగాఉండి బ్రిటిషు సామ్రాజ్యవాదులు జాతీయైక్యత రాకుండా చేయడానికి చేస్తున్న ప్రయత్నాలకు దోహదంగా గ్రామైక్యత రాకుండచేసేదీ ధనికరైతులే. ఇప్పుడు కమ్యూనిస్టు వ్యతిరేకులైన "జాతీయ" సంఘాలవాళ్ళకు సహాయం చేసేదీ వీరే. జపాను వచ్చేటట్లయితే వారికి ఎదురుగా పోయి పూలదండవేసి, వారికి సమస్త సౌకర్యాలు చేకూర్చి, బ్రిటిషుసామ్రాజ్యవాదులకు సేవకావృత్తి చేసినట్లుగానే, వారికి బానిసత్వం చేసేదీ వీరే. జపాను ప్రమాదం ఎక్కువగాఉన్న గత సంవత్సరం శీతకాలంలో కొందరు జస్టిసుపార్టీ ధనికరైతులు-ఫార్వర్డుబ్లాకు రంగాముఠావారికి విరివిగా చందాలిచ్చారు. ఇప్పుడు రామచంద్రారెడ్డి, రంగాముఠాలయొక్క పుట్టి

రు 200 నినాదానికి రైతులను మోసపుచ్చి సమీకరించి, కరువును తీవ్రంచేయడానికి కారకులయ్యేదీ వీరే. గ్రామాల్లో మన కామ్రేడ్లు చేసే సంఘ సంస్కరణ కార్యాలకు (వితంతు వివాహాలు, ప్రేమపూరిత వివాహాలు, మూఢాచారాలను పోగొట్టడం) గూడ వ్యతిరేకించేది వీరే. కనుక గ్రామంలో ప్రతి అభివృద్ధి కార్యానికి ఆటంకాలు పెట్టేది వీరే. ప్రతి అభివృద్ధి నిరోధక కార్యానికి సపోర్టు చేసేది వీరే. కనుక వీరిని బట్టబయలుచేసి, ప్రజలనుండి దూరంజేసి, వీరి నాయకత్వానికి దెబ్బకొట్టకుండా, మనం గ్రామంలో ఒక్క అడుగుగూడ ముందుకు వేయలేం. రైతుకూలీ సామరస్యం సాధించడమంటే, వీరి నాయకత్వాన్ని పీకి పారవేయడమే. మన ప్రస్తుత అధికోత్పత్తి కార్యక్రమానికి వీరిలో కొందరు కలిసిరావచ్చు. కాని వీరిని నాయకులుగా మన నెత్తిమీద ఎక్కించుకోరాదు. మన కార్యక్రమాన్ని అనుసరించి పనిచేసేటట్లు మాత్రం చూడాలి. రైతులు బ్రిటిషు సామ్రాజ్య వాదులవల్ల ప్రత్యక్షంగా పన్నులద్వారాను, వడ్డీవ్యాపారస్తులవల్ల విపరీతమైన వడ్డీలద్వారాను, విపరీతంగా దోయబడుతున్నారు. ఉప్పు, అగ్గిపెట్టెలు మొదలైన ఇతర జీవితావసర వస్తువులమీద పన్నులద్వారా పరోక్షంగా ప్రజలంతా దోపిడి చేయబడుతున్నారు. ప్రభుత్వం కృత్రిమ ఎరువులు, మంచి విత్తనాలు మొదలైన ఆధునిక పద్ధతులద్వారా వ్యవసాయాభివృద్ధికి అంతగా ప్రోత్సాహమియ్యడంలేదు. రైతులయొక్క ఆదాయం పెరగలేదుగాని, అతనిమీద పన్నులు, అప్పులభారం మాత్రం పెరిగింది. అందువల్ల రైతులు క్రమక్రమంగా వడ్డీవ్యాపారులకు తమభూములను అప్పులక్రిందగట్టి, కూలీలౌతున్నారు. రైతులు తమకు రాబోయే దుస్థితినుండి తప్పుకోడానికి, ప్రభుత్వం వడ్డీవ్యాపారులు తనమీద ఉంచిన భారాన్ని కొంత కూలీలమీదకు నెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. తక్కువ కూలి ఇయ్యడం, తప్పుడు కొలతలు మొదలైనవానిద్వారా, కూలీల కోపానికి గురిఅవుతున్నాడు.

ప్రభుత్వం కూలీలనుండి ప్రత్యక్షంగా పన్నులు ఏమీ వసూలుచేయడంలేదు. కాని ప్రభుత్వాదాయంలో చాలభాగం ఉప్పు, అగ్గిపెట్టెలు, కల్లు మొదలైన వాటిమీద వేయబడే పరోక్షపుపన్నులద్వారా వచ్చేదే! దీనిలో కూలీలుగూడ కొంతభాగాన్ని చెల్లిస్తున్నారు. ఇదేగాక ప్రభుత్వం పన్నులు మొదలైన వాటిద్వారా రైతులవద్దనుండి వసూలుచేసేదాంట్లోనూ, వడ్డీవ్యాపారస్థులు అధికవడ్డీలద్వారా రైతులవద్ద గుంజేదాంట్లోనూ, కూలీలుగూడ భాగం చెల్లిస్తున్నారు. రైతులు, ప్రభుత్వం, వడ్డీవ్యాపారులు, కూలీలమీద సాగించే దోపిడీ విధానంలో పనిముట్లుగాగూడ ఉపయోగపడుతున్నారు. ఈవిషయం కూలీలు గ్రహించలేక, రైతులనే తమ శత్రువులుగా ఎంచుతున్నారు. ధనిక రైతులు తమ గ్రామపెత్తనం, ఆర్థిక బలంతో కూలీలను లొంగదీసి, సామాన్య రైతులకన్న తక్కువకూలి ఇస్తూఉంటారు. కార్తికమాసంలో ధాన్యం ఇచ్చి కోతల్లో తక్కువ కూలికి చేయించడం, లేక బస్తాకు బస్తాన్నరనాము తీసుకోవడం జరుగుతుంది. పెద్దరైతుల చేలల్లోకి కూలీల పశువులు పోతే బందిలదొడ్డిలో పెడతాననీ అనేక విధాలవారు కూలీలను బెదరించుతారు. సాధారణంగా

గ్రామంలో పెద్దరైతే వడ్డీవ్యాపారిగాగూడ ఉంటాడు. అందువల్ల రైతులకు కూలీలకు విరోధులు ప్రభుత్వం, ధనికరైతులే. కనుక రైతుకూలీ సామరస్యం సాధించడానికి ఆర్థిక పునాది ఉంది. దేశాన్ని ఇప్పుడెదుర్కొన్న ఈమహోపద్రవంలో, రైతుకూలీ సామరస్యం సాధించడం ఇంకా తేలిక అవుతుంది.

రైతులు తక్కువకూలి ఇస్తుంటే, కొందరు కూలీలు రైతుల చేలల్లో దొంగతనాలు చేస్తూ ఉంటారు. పని సరిగా చేయరు. మనపార్టీ ఉన్నచోట్ల ఈ దొంగతనాలను అరికట్టడం, కూలీసంఘాలుపెట్టి ఎక్కువ కూలికోసం పాటుబడటం జరుగుతోంది. దొంగతనాలు కూలీల కష్టాల నివారణకు మార్గంగాదు. ఎందువల్లనంటే మొదటిది, ఈ దొంగతనమనే అలవాటు పెద్ద రైతులు చేలతోనే ఆగదు. కూలీలు, బీదరైతులుగూడ దీనివల్ల నష్టపడతారు. ఇందువల్ల కూలీలలో ఐక్యత చెడిపోతుంది రెండవది, దొంగతనాలు కూలీలలో ఐక్యత, సంఘ చైతన్యం అభివృద్ధిని, ఆటంకపర్చడంవల్ల, కూలీలకు కారణమైన ప్రస్తుత సమాజాన్ని స్థిరంగా ఉంచడానికే తోడ్పడతాయి. అందువల్ల దొంగతనాలు ప్రస్తుతసమాజ పద్ధతిని మార్చి, అందరూ సౌఖ్యంగా ఉండే సోషలిస్టు సమాజన్ని తీసుకురావడానికి మారుగా, కూలీలు ఈ సమాజంలోనే ఎలాగో ఒకలా ఒదిగి ఉండటానికి అనుసరించే పద్ధతులే. అందుచేత కమ్యూనిస్టులు దొంగతనాలను ప్రోత్సహించరు.

రైతులే తక్కువకూలియిచ్చి, తప్పుడు కొలతలు కొలిచీ, బూతులుతిట్టి కొట్టి కూలీలను అనేకవిధాల బాధపెడుతుంటారు. ఇందువల్ల కూలీలు దొంగతనాలు చేయడం, పని సరిగా చేయక పోవడం జరుగుతోంది. పైగా రైతులు రెండు సత్యాగ్రహోద్యమాలలో పాల్గొవడంవల్ల రాజకీయ చైతన్యం ఎక్కువగా వుంటుంది. మనపార్టీ సభ్యులలో 100 కి 75 మంది రైతుయువకులే. అందుచేత రైతుకూలీ సామరస్యాన్ని సాధించే ప్రధాన బాధ్యత రైతుయువకులమీదనేఉంది. రైతులచేత ముందు ఎక్కువకూలీ ఇప్పించాలి, తప్పుడు కొలతలు, బూతులు, కొట్టడం, నాముపద్ధతి మాన్పించాలి అప్పుడు కూలీ కామ్రేడ్లు కూలీలలో దొంగతనాలను అరికట్టగలుగుతారు. కూలీలచే శ్రద్ధగా పనిచేయించగలుగుతారు. రైతు కామ్రేడ్లు కూలీల న్యాయమైన కోర్కెలు రైతులంగీకరించేటట్లుచేయడానికి, నిర్భయంగాప్రయత్నించాలి. కూలీకామ్రేడ్లు కూలీలలోఉన్న దురల్వాట్లనుపోగొట్టడానికి నిర్మొగమాటంగా ప్రయత్నించాలి. (రైతుకూలీలమధ్య సమస్యల నెలాపరిష్కరించాలో ఆసంఘాలను కూర్చి ప్రత్యేకంగా వ్రాయబడేదాంట్లో వ్రాయబడుతుంది. రైతుసమస్యలు పుస్తకం చూడండి)

కూలీరైతు సామరస్యమంటే, మన కామ్రేడ్లు కొందరికి తప్పుడు అభిప్రాయముంది. రైతులే అక్రమంగా ప్రవర్తిస్తున్నప్పటికీ, కూలీలు ఎట్టి పరిస్థితులలోనూ రైతులకు ఎదురుతిరగగూడదనీ, అలా ఎదురుతిరిగితే కూలీరైతు సామరస్యం చెడిపోతుందనీ, రైతుల వెంటబడి ఒప్పించడమే మార్గమనీ, భావించుతున్నారు ఒక ఉదాహరణ తీసుకుందాం.

వెంట్రప్రగడ (కృష్ణాజిల్లా) అనే గ్రామంలో పనిపాట లేకుండా తిరుగుతూ ప్రజలను దబాయించి కాలంగడిపే ఒక రౌడీముఠా తయారయ్యింది. దానికి నాయకుడు కొంతమంది షాహుకార్ల అండతో గ్రామ పెత్తనదారయ్యాడు. గ్రామ పెత్తనం, ధనికుల అండ, దౌర్జన్యంద్వారా గ్రామంలో చాలభాగం తన పరిపాలన క్రిందకు తీసుకువచ్చాడు. ఇక కమ్యూనిస్టులు, వారి సానుభూతిపరులుమాత్రం మిగిలారు. వీరిమీదగూడ 1939 లో దాడి ప్రారంభించాడు. దానిమీద మన కామ్రేడ్సు ఇక ఊరుకుంటే లాభంలేదని, గ్రామ సమస్యలలో పాల్గోడం మొదలు పెట్టారు. ఆ రౌడీనాయకుడు సాగించే దౌర్జన్యాలను ఎదుర్కోడం మొదలుపెట్టారు. ఈవిధంగా మన అండకు పీడిత ప్రజలు కొందరు రాజొచ్చారు. మన పార్టీ బలపడుతోంది. మన కూలిసంఘాలకృషివల్ల కూలీలలో చాలభాగం పార్టీ పలుకుబడిక్రిందకు వచ్చారు. ఇది చూచి సహించలేక అతడు ఒక ఎత్తు ఎత్తాడు. కూలిసంఘాలు బలపడిపోతున్నాయనీ, కూలీలు దొంగతనాలను విరివిగా చేస్తారనీ, రైతులంతా ఏకమయి కూలీలను అణచివేయకపోతే రైతులు నాశనమయిపోతారనీ రైతులలో దుష్ప్రచారంసాగించాడు. 18 మంది కుటుంబ పెద్దల (జిమ్మాదార్లను) తో గూడిన ఒక జిమ్మాకమిటీని నిర్మించాడు. దీనిలో మన పార్టీకి సంబంధించిన ఇద్దరు కుటుంబ పెద్దలను గూడ వేశాడు. కుప్పకొట్టుళ్ళకు మూడు అడ్డల కూలి నిర్ణయించి, దొంగతనాలు చేయము అని కాగితంమీద వ్రాసి, దానిమీద కూలీలను సంతకాలు పెట్టమని నిర్బంధించాడు. మన కామ్రేడ్సు చొరవతీసుకొని, ఆ రౌడీతనం కూలిపోతున్న పెత్తనాన్ని నిలబెట్టుకోడానికి ఈ ఎత్తుగడ ఎలా ఎత్తాడో, అతడి అనుచరులే ఎలా దొంగతనాలు చేస్తూవుంటారో, అతడే పూర్వం కూలీలుచేయించి గ్రామానికి ఎంత నష్టం చేకూర్చాడో, కమ్యూనిస్టుపార్టీ, రైతుకూలీసంఘాల ఆశయంతో రైతులచే సక్రమమైన కూలిఇప్పించి, కూలీలచే సక్రమంగా పనిచేయించి, రైతుకూలీ సామరస్యం సాధించడ ఎలాగో, రైతుకూలీల సమస్యలు పరిష్కరించడానికి ఏనాడో చీలిపోయిన కుటుంబాల ప్రతినిధులతో గూడిన జిమ్మా కమిటీ పనికిరాదనీ, రైతులు కూలీల ప్రతినిధులతో గూడిన కమిటీనీ ఏర్పరచాలనీ. ఆకమిటీ కూలీసమస్యలను, గ్రామంలోజరిగే దొంగతనాలను, రైతులు కూలీలను అవమానపరచడం మొదలైన విషయాలన్నిటినీ విచారించుతుందనీ, ప్రచారంసాగించి ఆరౌడీని రైతులనుంచి దూరంచేయలేదు. మన కామ్రేడ్సుకు రైతులందరూ ఆ రౌడీవైపుకు పోయినట్లుగానే కన్పించింది. రైతుల్లో మన సానుభూతిపరులు మనం సమీకరించకపోవుటచే నోరుమూసుకు కూర్చున్నారు. కూలీలు ఆకాగితంమీద సంతకంపెట్ట నిరాకరించారు. మన కామ్రేడ్సు రైతుకూలీసంఘర్షణవస్తుందనీ, రైతుకూలీసామరస్యానికి భంగంగల్గుతుందనీ భయపడి, కూలీలచే సంతకాలు పెట్టించారు. ఈసమయంలో చొరవతో నిలబడినట్లయితే, గ్రామంలోని కూలీలందరూ, బీదరైతులు కొంతమంది, మధ్యతరగతి రైతులు, పార్టీ నాయకత్వంక్రిందకు వచ్చేవారు. ఆ రౌడీపెత్తనం పోయిఉండేది. మన కామ్రేడ్సు మొట్టమొదటనుండీ, వెంట్రప్రగడలో మన పార్టీ ఆ రౌడీ చర్యలకు వ్యతిరేకంగా నిలబడుట ద్వారానే ఎలా అభివృద్ధి అయిందో మరచిపోయారు.

చరిత్రనేర్పిన గుణపాఠాన్నే మరచిపోయారు. క్లిష్టసమయంలో ప్రజలకు సరియైన మార్గం చూపలేదు. ఈ విజయంతో ఆ రౌడీ మనమీద ప్రత్యక్షంగా దాడికి సిద్ధమయ్యాడు. మన సానుభూతిపరుల బండ్లు ఇతరుల చేలల్లోనుండి పోకుండా అడ్డంగొట్టించడానికి, మన స్వాతంత్ర్యదినోత్సవంలో ఎవరూ పాల్గొనవద్దని బెదిరించడం, ప్రారంభించాడు. మన కామ్రేడ్సు తాము చేసిన తప్పును గ్రహించి, సరియైన పంథాను తీసుకొని, అతడిదాడిని ఆపగల్గారు. కాని సరియైనసమయంలో ప్రజలకుమార్గం చూపించకపోవడంవల్ల, గ్రామంలో ప్రజానాయకత్వం ఏర్పరచే అవకాశాన్ని జారవిడిచారు.

కామ్రేడ్స్, రెండురకాల గ్రామైక్యతలు ఉన్నాయి. ఒకటి ధనికరైతులు తమ పెత్తనాన్ని జమాయించి, కూలీలను బీదరైతులను దబాయించి, నోరుమూయించి, గ్రామంలో "శాంతి"ని ఏర్పరచడం. రెండవది కమ్యూనిస్టులు, ధనికరైతుల పెత్తనం పోగొట్టి, కూలీ రైతులు చైతన్యసహితంగా యథేచ్ఛగా కలిసిఉంటూ గ్రామసౌభాగ్యానికి పాటుబడేలాచేసి, నిజమైన గ్రామశాంతిని ఏర్పరచడం. మనం చూడాలిసింది కూలీలకు రైతులకు తగాదా లేకుండా పోతుందిగదా అనిగాదు. అది ఎలా జరుగుతోంది. ధనికరైతులు కూలీలను లొంగదీయుటద్వారా, తాత్కాలికంగా తగాదా సమసిపోయిందా ? లేక కూలీలు రైతులు చైతన్యంతో యథేచ్ఛగా ఐక్యంగా ఉంటున్నారా ?

కామ్రేడ్స్, సామ్రాజ్యవాదులు ప్రజలమీద దౌర్జన్యంజరిపి, ప్రజోద్యమాన్ని తాత్కాలికంగా అణచివేసి భారతదేశంలో "శాంతిని" "ఐక్యతను" నెలకొల్పామని దబ్బాకొట్టుకుంటున్నారు ఇది నిజమైన శాంతి ఐక్యతేనా ? కాదు. ప్రజా ఐక్యతను ఏర్పరచి, సామ్రాజ్యవాదుల పెత్తనం పోగొట్టి, ప్రజారాజ్యమేర్పరచి, భారతదేశంలో నిజమైన శాంతి నెలకొల్పాలి. కమ్యూనిస్టులు చెప్పే శాంతికి, ఐక్యతకు అర్థం ఇది.

ఐక్యత అంటూ ప్రజలు, ధనికులు పెద్ద రైతుల తోక పుచ్చుకు పోయేలా చేయరాదు. మనం కోరే ప్రజాఐక్యతద్వారా, దోపిడీదార్ల పెత్తనానికి దెబ్బగొట్టి, ప్రజాపెత్తనం బలపర్చాలి. ఐక్యత అంటే అర్థం ఇదే. ధనికుల పెత్తనం బలపడుట ఐక్యతగాదు. ప్రజల బానిసత్వం.

గ్రామంలో వచ్చే ప్రతి సమస్యలోనూ మనం చొరవతీసుకొని, మనపద్ధతి ప్రకారం పనిచెయ్యాలి. ఏసమస్యనూ కల్పించుకోకుండా వదలివేసి, చొరవ ధనికరైతుల చేతుల్లో పెట్టగూడదు. చొరవ వారిచేతుల్లో పెట్టడమంటేనూ, తటస్థంగా కూర్చోడమంటేనూ, ప్రజలను గ్రామ పెత్తనదార్లకు వదలివేయడమే. ఏసమస్యమీద అయినా పార్టీ సభ్యులు తీసుకొనే పంథా ప్రజా శ్రేయస్సుకు అనుకూలించేదిగా ఉండాలి. జిమ్మా తత్వంగాని, బంధుతత్వంగాని, కులతత్వంగాని, మతతత్వంగాని ఈ ప్రజాశ్రేయస్కరమైన పంథాను అనుసరించడంలో ఆటంకంగా ఉండగూడదు.

ఈ పంథాను అనుసరించడంలో అవుసరమైతే బంధువులను చివరకు తలిదండ్రులనుసైతం వదలుకోవాలసివస్తే వదలుకోవాలి. ఏపార్టీ సభ్యుడూ తటస్థంగా కూర్చోగూడదు. గ్రామ పెత్తనదార్లు తన తండ్రిగాని తనదగ్గర బంధువుగాని అయితే, అతడే ముందు వాళ్ళను ఎదుర్కోవాలి. వారు ఏకులంవారు ఏమతంవారు అయితే, ఆకులం, మతంలోని పార్టీ సభ్యులే ముందు వారిని ఎదుర్కోవాలి. పేదప్రజలకు ఏ కులం-ఏ మతం వారికి జరిగినాసరే, పార్టీసభ్యులు దాన్ని ఎదుర్కోవాలి.

ప్రతి విషయంలోనూ ముందు మన పార్టీ సభ్యుల కుటుంబాలను, ఇతర మంచి వారిని సమీకరించాలి. పార్టీ సభ్యుల కుటుంబాలు గ్రామంలో ఏమీ అన్యాయాలకు పాల్పడకుండా పార్టీ సభ్యులు చెయ్యాలి. అంతేగాక గ్రామ శ్రేయస్సుకోసం ముందుకు వచ్చేలా చేయాలి. అప్పుడు తేలికగా గ్రామ సమస్యలను పరిష్కరించగలుగుతాం. గ్రామ పెత్తనదార్లు కుటుంబ, జిమ్మా, కుల, మత తత్వాలద్వారా తమ వెనుక ప్రజలను ప్రోగుచేయజూస్తారు. కులం, మతం, జిమ్మాలు, ప్యాడలువిధానాలు. వీటికి ఇప్పుడు తావులేదు. ఈ తత్వాలు పేద ప్రజాసామాన్యాన్ని చీల్చడానికి, పెత్తనదార్ల పెత్తనం కాపాడు కోటానికి మాత్రమే ఉపయోగిస్తాయి. కనుక మనం గ్రామంలో ముందుకుపోవాలంటే, కులం, మతం, జిమ్మాలను గ్రామ రాజకీయాల్లోకి రానీయగూడదు. వాటిని ఇంటి గడపలోపలే ఉంచాలి. మనం కుల సంఘాలను పోగొట్టి, వర్గసంఘాలను బలపరచాలి. గ్రామంలో వారి వారి ప్రత్యేక కష్టాల నివారణకు రైతుకూలీ యువజన బాల మహిళాసంఘాలను ఆర్గనైజు చెయ్యాలి. ఈవిధంగా గ్రామప్రజల్లో బాలుర దగ్గరనుండి వృద్ధులవరకూ అన్నివర్గాలవారిని ఆర్గనైజు చెయ్యాలి. గ్రామ మంచికి, గ్రామసమస్యల పరిష్కారానికి, అన్ని సంఘాలను సమీకరించాలి. ఈ విధంగానే పెత్తనదార్లకు అన్ని వైపులనుండీ ఊదరపెట్టి వారిని లొంగదీయగలుగుతాం; ఈవిధంగా మన ప్రత్యేక పలుకుబడి క్రింద ఉండి, మన కార్యక్రమాన్ని ఎల్లప్పుడూ అనుసరించడానికి సిద్ధంగాఉండి, మిగతా ప్రజాసామాన్యానికి దారిజూపే, ప్రజల ముఠాను ఏర్పరచాలి (Crystlise) ఇంతటితో చేసరిపోదు. వీరిని కదపడానికి పార్టీ వెనుక ఉండాలి. లేకపోతే పార్టీకి పలుకుబడిఉన్నా, దాన్ని సమయం వచ్చినప్పుడు సమీకరించలేం. కనుక మన కార్యక్రమాన్ని అమలు జరుపుతున్నప్పుడు, పైకి తేలే మిలిటెంట్ల నందరినీ అన్ని కులాలు, అని వర్గాలు స్త్రీ పురుషులనుండి పార్టీలో చేర్చుకొని, వారికి రాజకీయ తర్ఫీదు ఇచ్చి, సుశిక్షితమైన సైనికులనుగా తయారు చెయ్యాలి. గ్రామాల్లో పనిచేయడానికి పైన జెప్పబడింది జనరలు సూత్రమయినా, వివిధ రకాల గ్రామాలకు ఆ పరిస్థితులనుబట్టి, పై సూత్రాన్ని అన్వయించాలిసివస్తుంది.

మనపార్టీ బలహీనంగాఉన్న గ్రామాలు

రాజకీయంగా ముందుఉన్న గ్రామాలను కామ్రేడ్స్ ప్రతికక్షులకు వదలివేసి అప్రాముఖ్యమైన గ్రామాల్లో పనిచేస్తున్నట్లుగానే, కామ్రేడ్సు గ్రామంలో రాజకీయంగాను ఇతర విధాల ముందున్న ప్రజలగ్రూపులను ప్రతికక్షులకు పూర్తిగా వదలివేసి, వెనుకబడి ఉన్న గ్రూపులలోనే పనిచేయడం గూడ జరుగుతోంది. ఒక గ్రామంలో రాజకీయంగా ముందున్న ప్రజల గ్రూపును మిగతా గ్రూపులు (Sections) సాధారణంగా అనుసరిస్తూ ఉంటాయి. అటువంటి పరిస్థితులలో అటువంటి 'డామినెంటు' గ్రూపును ప్రతికక్షులకు వదలివేస్తే మనం అక్కడ ప్రజాఉద్యమాన్ని అభివృద్ధిచేయడం అసంభవం. కనుక ముందు రాజకీయంగా ముందుకు వచ్చిన గ్రూపునుండి మనం 'కాడరును' సంపాదించాలి. మనకు స్థానిక పార్టీలలో దేనితోటీ సంబంధం లేనప్పుడు, రాజకీయంగా కొంచెం అభివృద్ధి శక్తులున్న స్థానికపార్టీతో సంబంధం పెట్టుకొని, అందులోని అభివృద్ధి భావాలుగల యువకులను గ్రామశ్రేయస్కరమైన, ఎవ్వరూ కాదనలేని పనులద్వారా ఆకర్షించాలి. రెండవ పార్టీలోని మంచి యువకులను గూడ ఆకర్షించడానికి ప్రయత్నించాలి, ముందుగానే పెత్తనదార్లు రెచ్చిపోయే పెద్దపెద్ద పనులలో (పంచాయితీబోర్డు, కో ఆపరేటివు సొసయిటీ వగైరా వ్యవహారాలు) వేలు పెట్టగూడదు. మన కార్యక్రమం అమలుజరిపే ఒక యువకులముఠా తయారయిన తర్వాత, పెత్తనదార్ల అన్యాయాలను ప్రత్యక్షంగా ఎదుర్కొనడం ప్రారంభించాలి. కాని గ్రామంలో ప్రజలదృష్టిని ఆకర్షించేటటువంటి ఏదైనా ఘోర అన్యాయం జరిగినప్పుడు, పార్టీసభ్యుడు ఒక్కడున్నా దానిని ఎదుర్కొని నిలబడాలి. మనకు అండ ఎవ్వరూ లేరే అని తటపటాయించగూడదు. ఎందువల్లనంటే, ప్రజలు అన్యాయంచేసిన పెత్తనదారు అంటే అసహ్యంగా చూస్తారుగాని, వారికి ఆ అన్యాయాన్ని ఎదుర్కొంటానికి మార్గంచూపే నాధుడులేక చూస్తూ కూర్చుంటారు. అట్టి పరిస్థితుల్లో మనపార్టీసభ్యుడు ఒక్కడైనా అట్టి అన్యాయాన్ని ధైర్యంగా ఎదుర్కొని ప్రజాసమీకరణ మొదలు పెడితే, మనవైపుకు కొంతమంది ప్రజలైనా వస్తారు. అదే పార్టీకి స్వతంత్ర ప్రజాప్రాతిపదిక అవుతుంది. ఒక్కసారిగా పార్టీ కొంతమంది ప్రజలకైనా నాయకుడుగా తయారవుతుంది. అటువంటి పరిస్థితుల్లో మనకామ్రేడు దెబ్బలుతిన్నా, కోర్టులవెంట తిరగాలిసివచ్చినా ఫరవాలేదు. పార్టీకార్యక్రమాన్ని అంగీకరించి పనిజేసే యువకులను కొద్దిమందినైనా సరే సెల్లుగా ఏర్పరచి, వారికి రాజకీయపరిజ్ఞానమిచ్చి, ప్రతికక్షుల కుట్రలకు, ఎత్తులకు తాళగలిగే ఆయుధంగా సెల్లును తయారుచెయ్యాలి. గ్రామంలో కాలుమోపడానికి ఎంత చిన్న గ్రూపు అయినాసరే ఒక ప్రజలముఠా, వీరిని నడపడానికి బలమైన సెల్లును నిర్మించడమే, (Crystalise) మొదట చెయ్యాలిసినపని. అటుతర్వాత దాన్ని ఆధారంచేసుకొని ముందుకు పోవచ్చును.

మనకు ఏదైనా ఒక స్థానికపార్టీతో సంబంధమున్నప్పుడు, దానిలోనున్న అభివృద్ధి శక్తులను సమీకరించుతూ, ప్రతివిషయంలోనూ ఆ పార్టీనాయకుని లోపాలను బట్టబయలు చేస్తూ, మనం చొరవతీసుకొని కార్యక్రమమిస్తూ, రెండవపార్టీలోని మంచి యువకులను, ప్రజలనూ ఆకర్షించడానికి కృషిచెయ్యాలి. ఎప్పుడూ తనకు సంబంధమున్న స్థానికపార్టీ నాయకుని తోకగా ప్రవర్తించగూడదు. ఇలాసాగిస్తూ ఏదైనా పెత్తనదారు పూర్తిగా బట్టబయలయ్యే ఘటన జరిగినప్పుడు, దానిలో ఆ పెత్తనదారు నాయకత్వం ఊడబెరికి నాయకత్వాన్ని స్వీకరించడం గాని లేక మనకు సంబంధించిన వారందరినీ చీల్చుకొని వేరే ముఠాగా ఆర్గనైజు చేయడంగాని చేయాలి.

కుల అహంకారాన్ని ఎదుర్కోవాలి :

మన కామ్రేడ్సులో పార్టీకి పలుకుబడిఅంటే ఒక తప్పుడు అభిప్రాయముంది. మనం గ్రామంలోని కూలీల కష్టాలు, బీదరైతులకష్టాలు తీసుకోకుండా, జనరలుగా రైతు సమస్యలు తీసుకొని పాటుబడినచోట, మధ్యతరగతి రైతులు, ధనికరైతులు సైతం మనకు సానుభూతిగాఉన్నట్లు ఉండటం, మనపార్టీకి ధనసహాయం చేయడంగూడ జరుగుతుంది. కామ్రేడ్సు దీన్ని పార్టీ పలుకుబడిక్రింద అంచనావేస్తున్నారు. పెద్దరైతులు కూలీలకు, బీదరైతులకు అన్యాయం చేసినప్పుడు, పార్టీకిఉన్న అస్పష్టమైన అభిమానాన్ని, పలుకుబడిని, పలుకుబడిక్రింద అంచనావేసి, అది పోతుందేమోననే భయంతో, పెద్ద రైతులకు వ్యతిరేకంగా కూలీలకు నాయకత్వంవహించి నడపరు; పెద్దరైతులను బ్రతిమాలడంతో సరిపెట్టుతున్నారు. ఒక ఉదాహరణ తీసుకుందాం, కృష్ణాజిల్లాలో తేలప్రోలు అనే పెద్ద గ్రామముంది. ఆగ్రామంలో రెడ్లు మెజారిటీ. భూమి చాలవరకు రెడ్లక్రిందనే ఉంది. అందుచే రెడ్లలోనుంచే గ్రామపెత్తనదార్లువచ్చారు. ఆగ్రామంలో తూర్పునుంచి వచ్చినవారు ఉన్నారు. వీరిలో కొందరు కూలిచేసుకొని, మరికొందరు స్వంత వ్యవసాయాలుచేసుకొని బ్రతుకుతారు. వీరు అంతా బీదవారే. సామాన్యంగా రెడ్లు వీరిమీద చీటిమాటికి ఒంటికాలుమీద లేవడం అలవాటు. ఆగ్రామంలో రెడ్డికులానికి చెందిన ఒక ధనికుడు త్రాగుబోతు రౌడీ, ఒకరోజున త్రాగి తూర్పువారి ఇండ్లమీదపడి దౌర్జన్యానికి పూనుకున్నాడు. వాళ్ళు మందలించి పంపివేశారు. దానిమీద రెడ్లరాజ్యం పోతుందనే కులఅహంకారాన్ని లేవగొట్టి, కొంతమంది రెడ్లను వెంటవేసుకొని, తూర్పువారి ఇళ్ళమీదపడ్డాడు. తూర్పువారు ఇళ్ళు వదలిపెట్టి పారిపోయారు. కొంతమంది ఇంకనూ తిరిగిరానేలేదు. ఈ పరిస్థితుల్లో మనకామ్రేడ్స్ ఏమిచేశారు ? మన పార్టీసభ్యులు రెడ్లలోనూ, తూర్పువారిలోనూ ఇద్దరిలోనూ ఉన్నారు. రౌడీ కొంతమందిని తీసుకొని తూర్పువారి ఇళ్ళమీదపడినప్పుడు, దెబ్బలాట ఆపి తీసుకువచ్చారు. ఇది బాగానేఉంది. కాని ఆటుతర్వాత ఆ రౌడీదే ఎలా తప్పో, ఆరౌడీని సమర్థించుతూ కులఅహంకారంతో అతనికి ఇతరులు సహాయంగా

పోవడం ఎలా గ్రామానికి హానికల్గించుతుందో, ఆ రౌడీ ఇదివరకు ఖూనీలకు కారణమయి గ్రామాన్ని ఎంత నష్టపెట్టాడో ప్రచారంచేసి, అతనిని రెడ్డిరైతులనుండి దూరం చెయ్యాలిసింది. రెడ్లనుంచి దూరమవుతామేమో అనే భయంతో అది చెయ్యకపోవడంచేతనూ, తూర్పువారిలోని రెడ్లలోని కమ్యూనిస్టులందరూ ఐక్యంగాఉండి ఏఒక్కరికి కష్టంవచ్చినా మరొకరు ఆదుకుంటారనే భావం ప్రజల్లో కలుగజేయకపోవుటచేతనూ, ఆ రౌడీ కమ్యూనిస్టు లందరినీ తిట్టడం సాగించాడు.

కామ్రేడ్స్ ! మనది కార్మికులయొక్క, కూలీలయొక్క, బీదవాళ్ళయొక్క పార్టీ. మనం వీరిని సమీకరించి, వీరిని పార్టీ నాయకత్వంక్రిందకు తీసుకురావడంద్వారానే, మిగతా ప్రజాసామాన్యంనుగూడ ఆకర్షించగలుగుతాం. ధనికరైతులపెత్తనాన్ని ఊడగొట్టగలుగుతాం. పార్టీ ముందుగా గ్రామాల్లో కూలీలు, బీదరైతులలో ప్రత్యేక పలుకుబడిని నిర్మించిన తరువాతనే, తరువాత మిగతా గ్రామప్రజలను మనవైపుకు తీసుకురాగల్గుతాం. మనపార్టీ సభ్యులు చాలమంది రైతులలోనుంచి వచ్చినవారగుటచే, రైతులయొక్క సమస్యలనే తీసుకొని ఎక్కువగా పాటుబడుతూవచ్చారు. కూలీల సమస్యలను తీసుకొని అంతగా పాటుబడలేదు, అందుచేత రైతులందరిలోనూ అస్పష్టమైన అభిమానంఏర్పడింది. ఇది పలుకుబడిగాదు. పలుకుబడిఅంటే, పార్టీ ఇచ్చిన ధాన్యం కంట్రోలునినాదం, కనీస కూలినినాదం, రైతులు అంగీకరించాలి; మన రాజకీయ నినాదాలను, కార్యక్రమాన్ని ఎప్పుడూ అనుసరిస్తూఉండాలి. మనం ఎప్పుడైతే కూలీల కష్టాలు తీసుకొని పనిజేస్తూ ఉంటామో, అప్పుడు రైతులలోఉండే ఈ అస్పష్టఅభిమానం పటాపంచలవుతుంది. ధనిక రైతులు తమవెనుక రైతుల నందరినీ సమీకరించ ప్రయత్నించుతారు. మనం చిన్నరైతులను సమీకరించి, ధనికరైతులను దూరంచెయ్యాలి. మనకు ప్రత్యేక పలుకుబడి ఏర్పడేటప్పుడు (Crystalise) చిన్నరైతులు కొంతమంది ధనికరైతుల వెనుకకుపోవచ్చును. అయినా ఫరవాలేదు, మనకు కూలీలలోనూ, కొంతమంది చిన్న రైతులలోనూ బలమైన స్థానం చిక్కినతర్వాత, గ్రామసౌభాగ్యకరమైన పనులను ధనికరైతుచేసే దోపిడీచర్యలకు వ్యతిరేకంగా ప్రారంభించితే, మిగతా చిన్నరైతులుగూడ మనవైపుకే వస్తారు.

గ్రామాల్లో మరొకవిషయంగూడ ఉంది. ఆంధ్రగ్రామాలలో కమ్మ, రెడ్డి, వెలమ, కాపు ఈ నాలుగు కులాలలోవారికి చాల భూమిఉంది. అందుచే పెత్తనదార్లుగూడ ఈ కులాలనుండే వస్తారు. ఈ కులాలవాళ్ళు గ్రామాల్లో 'డామినెంటుగా' ఉండటం, మిగతా కులాలవాళ్ళమీద పెత్తనం జమాయించడం జరుగుతుంది. గ్రామపెత్తనదార్లే ఈ కుల అహంకారాన్ని రెచ్చగొట్టి, తమ పెత్తనాన్ని కాపాడుకుంటారు. ఈ కుల అహంకారానికి బీదరైతులుగూడ పాల్పడుతూఉంటారు. ఈ కులాలవాళ్లు మిగతా కులాలవాళ్ళను నీచంగా చూడటం, అన్యాయంగా కొట్టడం, మిగతా కులాలవాళ్ళు కొంచెం వ్యతిరేకంగా మాట్లాడితే, అంతా కర్రలువేసుకువెళ్ళి వాళ్ళను చావబాదటం జరుగుతుంది.

పైనాలుగు కులాలలోనైతం కొన్నిగ్రామాల్లో కమ్మవారు, కొన్నిగ్రామాల్లో రెడ్లు, కొన్ని గ్రామాల్లో కాపులు, కొన్నిగ్రామాల్లో వెలమవారు 'డామినెంటు'గా ఉంటారు. అటువంటి పరిస్థితులలో ఏకులంవారిది పైచేయిగా ఉంటుందో, ఆకులం పెత్తనదార్లు ఆకులాన్ని వెనుకవేసుకొని, మిగతాకులాలవారిని అణచివేస్తూఉంటారు. పెత్తనదార్లకుబలం పైనాలుగుకులాల కులఅహంకారమేగనుక, మనం ఆ కులఅహంకారంపోగొట్టనిదే ముందుకు ఒక్క అడుగైనా వేయలేం. మనం ఆకులంలోని బీదరైతులకు వారిని పెత్తనదారు ఎలా ఉపయోగించుకుంటున్నాడో తెలియజెప్పాలి. వారు మిగతాకులాల ప్రజలందరితో కలిస్తేనే గాని, వారికష్టాలు ఎలా నెరవేరవో చెప్పాలి. ఈవిధంగా బీదరైతులను ఆ పెత్తనదార్ల పలుకుబడినుండి తొలగించ ప్రయత్నించాలి. కాని కులఅహంకారంతో 'డామినెంటు' కులంవారు మిగతా కులాలమీద దౌర్జన్యం జరుపుతున్నప్పుడు, మన పార్టీసభ్యులు అంతా కలిసి ఆ దౌర్జన్యాన్ని ఎదుర్కోవాలి. ఆ ఎదుర్కోవడంలో 'డామినెంటు' కులంలోని బీదరైతులు తాత్కాలికంగా మనవైపుకు రాకపోయినా, విరోధులయినా ఫరవాలేదు. అణుగునబడివున్న మిగతా కులాలవారిలో పలుకుబడి సంపాదించితే, పెత్తనదారు దుశ్చేష్టలను అరికట్టుటద్వారా ఆ కులంలోని బీదలనుకూడా క్రమంగా ఆకర్షించవచ్చును.

మనకు ప్రత్యేకపలుకుబడిగల గ్రామాల్లో

మనం గ్రామంలో ప్రతివిషయంమీద మన మార్గాన్ని చూపించుతూ, మన పలుకుబడి క్రిందనున్న ప్రజలచే దానిని అనుసరింపజేస్తూ, ఇతర పెత్తనదార్లక్రింద ఉన్న ప్రజలను గూడ ఆకర్షించాలి.

సాధారణంగా పెత్తనదార్లయొక్కబలం, ప్రజల్లో వ్యక్తిత్వం లేకపోవుటవలన ఉండే జీమ్మాపద్ధతిలోనేగాక, గ్రామపంచాయితీ బోర్డులు, కో-ఆపరేటివు సొసైటీలు, గ్రామ పంచాయితీకోర్టులు చేతుల్లో ఉంచుకోవడంవల్ల గూడ ఉంది. కనుక వీరిని ఈబలమైన స్థానాలనుండి ఊడగొట్టడానికి ప్రయత్నించాలి. అంటే పల్లెటూరి పెత్తనదార్లవలె ఏదో కుతంత్రాలుపన్ని వీటిని స్వాధీనపరచుకోమనిగాదు దాని అర్థం. పెత్తనదార్లు వీటిని తమ దోపిడీ విధానానికి ఎలా ఉపయోగించుకుంటున్నారో, ప్రత్యక్ష నిదర్శనాలద్వారా సమయం దొరికి నప్పుడల్లా, ప్రజలకు బట్టబయలు చేయాలి. ముఖ్యంగా వారి వెనుకనున్న ప్రజలకు బట్టబయలుచేసి, వారిని ప్రజలనుండి దూరంచెయ్యాలి. మనం సాదించే ఇతర కార్యక్రమం ద్వారాగూడా, వారిని ప్రజలనుంచి దూరంచెయ్యాలి. ఈవిధంగా వారిని ప్రజలనుంచి దూరం చేసి, పంచాయితీబోర్డు, కో-ఆపరేటి సొసయిటీ మొదలైనవాటిని మనం చేతుల్లోకి తీసుకోవాలి. పైజెప్పిన స్థానిక స్వపరిపాలన సంస్థలను ఎలా పెత్తనదార్లు స్వార్థానికి ఉపయోగించుకొంటారోచూదాం. పంచాయితీబోర్డుధనాన్ని తమ ఇళ్ళవద్ద రోడ్లు, తూములు మొదలైన సౌకర్యాలకోసం ఉపయోగించుకుంటారు. ఈ పనులు చేయించడానికి కంట్రా

క్టులలో లంచాలుతీసుకుంటారు. లెక్కలు సరిగావుంచరు. కో-ఆపరేటివ్‌సొసయిటీలో తమ దగ్గరవారినేగాని, ఇతరులను చేర్చుకోరు. తమదగ్గరవారి పేర్లతో తాము డబ్బు అప్పుతీసుకొని ఎక్కువ వడ్డీలకు తిరిగి అప్పులిస్తారు; లేకపోతే వ్యాపారంచేసి లాభాలు సంపాదిస్తారు. పంచాయితీ కోర్టులలో తప్పుడు కేసులుపెట్టి తమ విరోధులను అవస్థలు పెడతారు. లంచాలు తీసుకొని అన్యాయపు తీర్పులు చెపుతారు ఈకోర్టులలో కూలీలకు అసలే న్యాయంజరగదు.

మనకు పూర్తిగా పలుకుబడిఉన్న గ్రామాలలో

మన పార్టీసభ్యులు ఎప్పుడూ గ్రామశ్రేయస్సు కోసంపాటుబడేటట్లు చేయాలి. మన పలుకుబడిక్రిందఉన్న ప్రజలుగూడ గ్రామశ్రేయస్సుకు, భిన్నంగా ప్రవర్తించకుండా చేయాలి. మనచేతుల్లోఉన్న పంచాయితీబోర్డులను, కోర్టులను, కో-ఆపరేటివు సొసైటీలను ఆదర్శప్రాయంగానడపాలి. కులం, మతం, బంధు విచక్షణలేకుండా ప్రజల శ్రేయస్సుకోసం వాటిని ఉపయోగించాలి. మనం గ్రామంలో పరిపాలనచేసే పక్షంగా తయారయినప్పుడు పైజెప్పిన ప్రమాదం ఉంటుందిగనుక, ఇంత గట్టిగా చెప్పాలిసి వస్తోంది.

సెక్టేరియనిజం

ప్రస్తుతం మన కా్రమేడ్సు పెత్తనదార్ల వెనుకనున్న ప్రజల యెడల సెక్టేరియను వైఖరితో మెలుగుతున్నారు. ఆ ప్రజలతో నిత్యం దగ్గరసంబంధంపెట్టుకోవడం, వారిని మనవైపుకు తీసుకు రావడానికి ప్రయత్నించడంలేదు. అందువలన పెత్తనదార్లు మనమీద వారికి అనేక అపోహలు కల్పించి, వారిని తమ వెనుక ఉంచుకోవడం జరుగుతోంది. పార్టీ సభ్యులు ఆ ప్రజలందరితోటీ దైనందిన సంబంధం పెట్టుకోవడం, వారితో ఆప్యాయంగా సంభాషించడం, వారి ఇళ్ళకు ఏదైనా పెళ్ళిళ్ళు మొదలైనవాటికి పిలిస్తే వెళ్ళడం, చెయ్యాలి.

కూలీలపేటలలో

రైతులలో పెత్తనదార్లవలెనే, కూలీలపేటల్లో కులపెద్దలు కూలీలను దోపిడీచేస్తుంటారు. ఈ కులపెద్దలు గ్రామపెత్తనదార్లవెనుకచేరి, ఏదో మామూళ్ళు వగైరా తీసుకొంటూ, కూలీలను ఉపయోగించుకోడానికి సాధనాలుగా ఉపయోగపడతారు. ఈ కుల పెద్దలు వంశపారంపర్యంగా వస్తారు. వీరు కులంలో వచ్చిన తగవులను విచారించి జరిమానాలువేసి, వాటిని త్రాగుడుకు ఉపయోగించడం, గ్రామఉమ్మడిడబ్బును కొట్టివేయడం చేస్తుంటారు. ఈ కుల పంచాయితీలు, కుల తప్పులు, జమీందారీయుగంనాటి పద్ధతులు. ఇప్పుడు ఇవి కూలీలలో వ్యక్తిత్వం అభివృద్ధికాకుండా ఉంచడానికే ఉపయోగపడు

తున్నాయి. మూఢాచారాలను, మూఢనమ్మకాలను సుస్థిరంగా ఉంచడానికే ఉపయోగపడుతున్నాయి. ప్రస్తుతం జరిమానాలు ఇచ్చుకోలేకపోవడంవల్లా, వ్యక్తిస్వేచ్ఛను అరికట్టడంవల్లా, ఈ కులపంచాయితీలు కూలీలలో చీలికలు కలుగజేస్తున్నాయి. కనుక మనం ముందు కులపెద్దలలోపాలను బయటపెట్టి, క్రమంగా మూఢాచారాలను సమర్థించే ఈ కుల పంచాయితీపద్ధతినే రద్దుచేయాలి. మూఢాచారాలను పోగొట్టడానికి ముందు యువకులను సమీకరించాలి. ఈవిధంగా కూలీ కామ్రేడ్స్ కుల పెత్తనదార్ల పలుకుబడిని తగ్గించి, కూలీలనైక్యపరచి, గ్రామపెత్తనదార్ల కుతంత్రాలకు కూలీపేటల్లో చోటులేకుండా చేయాలి.

రౌడీయిజం ప్రబలిన గ్రామాలు

సామ్రాజ్యవాద ఆర్థిక విధానంవల్ల రైతులు క్రమక్రమంగా ఏవిధంగా భూములు పోగొట్టుకొని కూలీలౌతోందీ వెనుక వ్రాయబడింది. గత యుద్ధమయిన తర్వాత (1918) వచ్చిన ఆర్థిక మాంద్యంఫలితంగా చాలామంది రైతులు కూలీలయ్యారు. ఈ ఆర్థికమాంద్యం ఫలితం ఎక్కువగాఉన్న గ్రామాల్లోనూ, పట్టణాలకు, దగ్గరగావున్న గ్రామాల్లోనూ శ్రమచేయకుండా గాలిగా తిరుగుతూ, తాగుడు, జూదం, వ్యభిచారం మొదలైన దురల్వాట్లకు లోనైన యువకులు బయలుదేరారు. పట్టణాలలో రౌడీలవలెనే ప్రజలను బెదిరించడం, లంచం ఇచ్చినవాడి తరపున దెబ్బలాటకు పోవడం మొదలుపెట్టారు. 1930 ఆర్థికమాంద్యం తరువాత గ్రామాల్లో రౌడీయిజం ఇంకా ప్రబలమయింది అంతకుపూర్వం బాగా బ్రతికి ఆర్థికమాంద్యంలో ఆస్తులుపోగొట్టుకొన్న రైతుల యువకులు కూలీజీవితం అలవరచుకోక రౌడీయిజంలోకి దిగుతున్నారు. మనపార్టీ అన్ని గ్రామాలకు వ్యాపించి, ప్రజాఉద్యమాలను నిర్మించి, యువకులను సన్మార్గాలలో పెట్టకపోతే, సామ్రాజ్యవాద దోపిడీవిధానం వలన అన్ని గ్రామాలలోనూ ఇటువంటి రౌడీమూకలు తయారవుతాయి.

నీతి నియమాలు పోగొట్టుకొని, అద్దెబంట్లుగా తయారైన ఈరౌడీమూకలను కొంతమంది గ్రామ పెత్తనదార్లు తమక్రింద జేర్చుకొని, త్రాగుడు, జూదం వగైరాలను ప్రోత్సహించి, ప్రజలమీద, తమ ప్రతికక్షులైన ఇతర పెత్తనదార్లమీద, దౌర్జన్యం ప్రయోగించి, గ్రామ పెత్తనాన్ని చేజిక్కించుకొంటున్నారు. రౌడీమూకను వుపయోగించని పెత్తనదార్లు రౌడీలమూకకు నాయకత్వంవహించిన పెత్తనదార్లకు లొంగిపోవడమో, లేక గ్రామ రాజకీయాలలో జోక్యంపట్టించుకోకుండా దూరంగా వుండడమో జరుగుతోంది. ఈవిధంగా నాజీదళాలను పోలిన ఈ రౌడీమూకలకు నాయకులైన పెత్తనదార్ల ఫాసిస్టు పరిపాలనక్రిందకు కొన్ని గ్రామాలు వచ్చివేసినాయి. ఈ పెత్తనదార్లు పంచాయితీ బోర్డులు, కో-ఆపరేటివు సొసయిటీలు, పంచాయితీకోర్టులు మొదలైనవాటిని స్వాధీనంచేసుకొని, అనేకవిధాల ప్రజలజుట్టును చేతిలో ఇరికించుకొని, బలపడి కూర్చున్నారు.

ఇటువంటి గ్రామాలలో మనపార్టీసభ్యులు ఆ రౌడీముఠాయొక్క దౌర్జన్యాన్ని ప్రతిదౌర్జన్యంతో ఎదుర్కోవాలి. అప్పుడే రౌడీముఠాలంటే భీతిజెందిన ప్రజాసామాన్యాన్ని క్రమంగా ఆకర్షించగలుగుతాం. మనం ఈదౌర్జన్యాన్ని ఎదుర్కోకుండా ఎన్నిధర్మపన్నాలు చెప్పినా, ప్రజలు మన వైపురారు. మనం ఆరౌడీమూకను దౌర్జన్యం ద్వారా పూర్తిగా ప్రజాబలంతో అణచివేసినప్పుడే, గ్రామనాయకత్వం మనచేతుల్లోకి వస్తుంది. ఈ రౌడీమూకను ఎదుర్కోవడంలో కోర్టులచుట్టూతిరిగినా, క్రిమినలుకేసులలో జైళ్ళకువెళ్ళాలిసి వచ్చినా మనమేమీ చింతించనవసరంలేదు. ఎక్కడైతే మనకామ్రేడ్సు ఈ రౌడీమూకను దౌర్జన్యంతో ఎదుర్కొంటూవచ్చారో, అక్కడ మనపార్టీ బలపడింది. లేనిచోట్ల ప్రజలకు మనమంటే అభిమానమున్నా, చేతగానివారమనే అభిప్రాయంతో ఉండి మనకు దూరంగా ఉన్నారు.

రౌడీయిజం ప్రబలిన గ్రామాల్లోని కూలీలలోగూడ కొంతమంది పనిపాటలుమాని, ఈ రౌడీమూకలతో తిరుగుతూ, దొంగతనాలను ప్రోత్సహిస్తున్నారు. వీరుగూడ మామూలు కూలీలమీద దౌర్జన్యం సాగించడం జరుగుతోంది. మన కూలీ కామ్రేడ్సు కూలీపేటల్లో ఇటువంటి దౌర్జన్యాన్ని ఎదుర్కోవాలి.

స్వతంత్ర ప్రజాప్రాతిపదికను నిర్మించడంలో మిగతా గ్రామాల్లో అవలంబించే ఇతర ఎత్తుగడలన్నీ ఈరకమైన గ్రామాలలోగూడ పనికివస్తాయి.

వర్తక పంటలు విపరీతంగావేసే గ్రామాలు

మెట్టగ్రామాలు కొన్నిటిలో పుగాకు, వేరుశనగకాయ మొదలైన వర్తకపుపంటలు విరివిగా పండించబడుతున్నాయి ఇటువంటిగ్రామాల్లో మిగతా మెట్టగ్రామాలకన్న ఆదాయం ఎక్కువరావడం, పట్టణాలతో సంబంధాలు ఎక్కువ అవడంతో మాగాని గ్రామాలవలెనే బూర్జువా నాగరికత ఇక్కడగూడ కొంతవరకు ప్రవేశించింది. ఇక్కడగూడ పంచాయితీ బోర్డులు, కో-ఆపరేటివుసొసైటీలు, మొదలయినవి వచ్చినాయి గ్రామపార్టీలు ఏర్పడినాయి. కనుక ఇటువంటి గ్రామాలవిషయంలో మాగాని గ్రామాలలో మన మవలంబించే పద్ధతులనే అవలంబించాలిసి ఉంటుంది.

ఇతర మెట్టగ్రామాలు

కొన్ని మెట్టగ్రామాలలో గ్రామ స్వయంపోషకంగాఉండే, పురాతన ఆర్థిక విధానమే ఇంకా సాగుతోంది. ఏగ్రామానికి కావలసిన ఆహారపదార్థాలు, బట్టలు మొదలైన జీవితావసర వస్తువులు చాలవరకు ఆగ్రామంలోనే ఉత్పత్తి చేయబడుతాయి. ఈ గ్రామాలు చాలవరకు ఆర్థికంగా స్వయంపోషకంగా ఉంటూఉన్నాయి. అందుచే ఈ గ్రామాలకు పట్టణాలతో అంతగా సంబంధంలేదు. ఈగ్రామాలు నాగరికతలోనూ, విజ్ఞానంలోనూ, చాల వెనుకబడిఉన్నాయి. ఈ ప్రజలలో వ్యక్తిత్వం అభివృద్ధిగాలేదు. కనుక ఇటువంటి గ్రామా

లలో జమీందార్లు, మొఖాసాదార్లు, జమీందారీవిధానంలేనిచోట్ల గ్రామమునసబు కరణాలు లేక రాయలసీమలోవలె పెద్దరెడ్లు, పెత్తనంచేస్తూఉంటారు. వ్యక్తితగూలుఉన్నా మాగాని గ్రామాలలోవలె, ఇవి స్థానికపార్టీలుగా అభివృద్ధిగాలేదు. ఇటువంటి గ్రామాలలో కూలీలు రైతులమధ్యగూడ అంతగా వైషమ్యాలు కనిపించవు. కాని కొన్నికొన్నిచోట్ల జమీందార్లు కూలీలను రైతులమీద పురిగొల్పుతున్నారు. రైతులు కొంచెం కూలీలతో చక్కగా మెలిగితే, కూలీలను తమతో తేలికగాకలుపుకోవచ్చును. షైరకమైన గ్రామాలలో అందరికీ పెద్దపులివలె కన్పించే జమీందారు లేక మొఖాసాదారు లేక కరణం లేక పెద్దరెడ్డి ఉండుట వలన గ్రామంలోని కూలీలను రైతులను అందరినీ వీరికి వ్యతిరేకంగా సమీకరించడం తేలిక. మన కామ్రేడ్స్ ఇటువంటిచోట్ల పైదోపిడీగాండ్ర అన్యాయానికి వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడితే, తేలికగా గ్రామప్రజలందరినీ ఐక్యపరచవచ్చును. గ్రామాన్నంతనూ పార్టీనాయకత్వంక్రిందకు తీసుకురావచ్చును.

ఇటువంటి గ్రామాలలో విద్య, నాగరికతలను అభివృద్ధిచేసే బాధ్యతగూడ మన మీదనే పడుతుంది. స్కూళ్ళు, పోస్టాఫీసులు, పంచాయితీబోర్డులు మొదలైన సౌకర్యాలను మనమే కల్పించాలిసివస్తుంది.

రెడ్ గ్రామాలు

'రెడ్‌విలేజెస్' అంటే ఏమిటి? పార్టీ ప్రజాపార్టీగా తయారవుతున్నప్పుడు, 'రెడ్ విలేజెస్' ఏర్పడుతాయి. ఒకగ్రామం రెడ్‌విలేజి అయిందంటే, ఆగ్రామ రైతులు, కూలీలు స్త్రీ-పురుషులు అందరూ మనపార్టీపాలసీని అంగీకరించడమేగాక, దానిననుసరించి పని చెయ్యాలి. ఆవిధమైన రాజకీయచైతన్యం, పార్టీమీద అభిమానం, ప్రజల్లో వచ్చిందోలేదో తెలుసుకోవడానికి రెండు పరీక్షలున్నాయి. ఒకటి రైతులు, తమధ్యాన్ని మనం నిర్ణయించిన బస్తా 1 కి రు 11 ల రేటుకు వర్తకులకుగాక ప్రభుత్వానికే అమ్మాలి; రెండవది కూలీలకు మనం నిర్ణయించిన కనీసకూలిరేట్లు ఇయ్యాలి. రైతులు ఈపనిచేస్తే కూలీలు కూడ తప్పక కలిసి వస్తారు. కూలీలు అధికోత్పత్తిని చేయడానికిగాను బాధ్యతతో పనులు చెయ్యాలి; టైముప్రకారం పనులు చెయ్యాలి. తమ స్వంతపనిగాదు గదా అనే ఉద్దేశ్యంతో, కాలంగడుపుకు పోవడానికి పనిచేయరాదు. ఈవిధంగా రైతులు కూలీలు ఏగ్రామంలో అయితే పార్టీ చెప్పినట్లు చేయడానికి సిద్ధమవుతారో, ఆ గ్రామం రెడ్‌విలేజి అనబడుతుంది. ఒకదశలో పార్టీ కార్యక్రమాన్ని అనుసరించి, మరొకదశలో అనుసరించడానికి నిరాకరించే టట్లు ఉండరాదు. ఎల్లప్పుడూ పార్టీ కార్యక్రమాన్ననుసరించి పనిజేసే గ్రామమే 'రెడ్ విలేజి'. ఇటువంటి బలమైన ప్రజాఉద్యమం ఆగ్రామంలో నిర్మింపబడుతున్నప్పుడు, దానితో పాటు గ్రామంలో గ్రామానికంతకూ నాయకత్వంవహించే పార్టీ నాయకత్వంగూడ నిర్మింప బడుతుంది. ఈ పరిస్థితులలో గ్రామ పెత్తనదార్లు అనామకులుగా ఉంటారు.

మనకామ్రేడ్స్ యేదో ఒక సమస్యమీద వర్గచైతన్యంలేకుండా కలిసివచ్చిన గ్రామాలన్నిటినీ రెడ్‌విలేజెస్ అనడం జరుగుతోంది. గ్రామపెత్తనదార్లు తమపెత్తనం పోతుందని గ్రహించి చీలికలుపెట్టి, గ్రామంలో ముఠాలు ఏర్పరచినప్పుడు, గ్రామైక్యత పోవడం జరుగుతుంది. కనుక కామ్రేడ్స్ ఒక గ్రామానికి రెడ్‌విలేజి అని నామకరణం జేసే టప్పుడు పైజెప్పబడిన లక్షణాలు ఉన్నవాలేవా అని చూడాలి.

పట్టణాలు

ఆంధ్రదేశంలో ఆధునిక పరిశ్రమలు అంతగా అభివృద్ధి చెందలేదు. బట్టల మిల్లులు చిన్న చిన్నవి రెండుమూడు మాత్రమున్నాయి. అలాగే జనపనార మిల్లులుగూడ కొద్దిగా ఉన్నవి. పెద్దపెద్ద ఇంజనీరింగు వర్కుషాపులు అసలే లేవు. బియ్యపుమిల్లులు, నూనె మిల్లులు మాత్రం ఉన్నవి. అందుచేత ఆంధ్రపట్టణాలలో ఆధునిక కార్మికవర్గం అంతగా లేదు. మనపట్టణాలు ముఖ్యంగా వర్తక కేంద్రాలుగానే ఉన్నవి. అందువల్ల పట్టణాలలో దుకాణదార్లు, గుమాస్తాలు, వకీళ్ళు, టీచర్లు మొదలైన మధ్యతరగతివర్గం ఎక్కువగాఉంది.

ఈ పట్టణాలలోని మధ్యతరగతి చాలవరకు కాంగ్రెసు ప్రభావంక్రింద ఉండేది. కాని గత 4 సం॥ల యుద్ధకాలంలో కాంగ్రెసు నాయకత్వం దేశానికి సక్రమమైన దారిచూపక పోవడంవలన, ఈమధ్యతరగతి హిందూమహాసభ పలుకుబడిక్రిందకు పోతోంది. ఈ యుద్ధానికిపూర్వం ఆంధ్రదేశంలో హిందూమహాసభకు నామరూపాలులేవు. ఇప్పుడు దాదాపు అన్ని ముఖ్యపట్టణాలలోనూ వ్యాపించింది. కాంగ్రెసులోని ముఖ్యులే కొంతమంది దీనిలోచేరారు. కొంతమంది ముఖ్యులు స్థానిక విషయాల్లో హిందూమహాసభనే సపోర్టు చేస్తున్నారు. యుద్ధకాలంలో కాంగ్రెసు నాయకత్వం సరియైనదారిని చూపించకపోవడం వలన, ముఖ్యంగా ఆగస్టు ఘటనల తర్వాత కాంగ్రెసు జనసామాన్యంలో నిస్పృహా వాతావరణం ఏర్పడింది. హిందూమహాసభ ఈ పరిస్థితిని ఉపయోగించుకొని ఈ జనసామాన్యంలో మహమ్మదీయ వ్యతిరేకతను రెచ్చగొడుతోంది. హిందూమత చిహ్నాలను పునరుద్ధరిస్తూ, హిందువులలో మతోద్రేకాన్ని రెచ్చగొడుతోంది. ఈమధ్య బెజవాడలో రాణాప్రతాపు, శివాజీ, కాళీవేషాలువేసి, ఊరేగించారు. పట్టణాలలో హిందూ ముస్లిము కలహాలను గూడ రెచ్చగొడుతోంది.

ఇందుకోసం పట్టణాలలోని రౌడీలను డబ్బు ఆశపెట్టి చేరదీస్తోంది. రౌడీయిజం గూడ సామ్రాజ్యవాద దోపిడీవిధానంయొక్క ఫలితమే. పట్టణాలలో నిరుద్యోగులయిన వారు, త్రాగుబోతులు, ముండలముఠాకోరులు, మొదలైనవారు ప్రజలను భయపెట్టి డబ్బు గుంజుకొని బ్రతుకుతారు. ఈరౌడీయిజం చిన్న దుకాణదార్లు, జట్కాబండివాళ్ళు, చివరకు కార్మికులకుసైతం ప్రాకింది. పట్టణంలో కొంతమంది యువకులకు రౌడీయిజం ఫాషను అయింది. ఇంతేగాక హిందూమహాసభ, మహమ్మదీయులయెడల సహ

జంగా హిందువుకుండే అనుమానాలను పురస్కరించుకొని, చిన్న వ్యక్తితగాదాలను పెద్దవి చేసి, హిందూ జనసామాన్యాన్నిగూడ తన పలుకుబడిక్రిందకు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తోంది.

యుద్ధకాలంలో ప్రజల జీవితావసర వస్తువులు ఇతరదేశాలనుంచి దిగుమతి అవడం లేదు. దీన్ని ఆధారంగాజేసుకొని వర్తకులు మనదేశంలో ఉత్పత్తి అయ్యే సరకునంతనూ చేజిక్కించుకొని, ధరలను విపరీతంగా పెంచివేశారు. దేశంలో చాలచోట్ల లూటీలు జరిగాయి. ప్రజాఉద్యమంగూడ అభివృద్ధి అవుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రజాఉద్యమం నుండి తమ అధికలాభాలను కాపాడుకోడానికి, హిందూమహాసభ అండకు చేరారు. హిందూమహాసభ ప్రోగుచేసిన రౌడీలను ఉపయోగించుకొని, తమ ఆస్తులను కాపాడుకోవాలని వర్తకుల ఆశ. ఈఉద్దేశ్యంతోనే ఆర్యవైశ్య యువజన సంఘాలద్వారా సమీకరించుతున్నారు.

ఆర్. యస్. యస్.

హిందూమతోద్ధరణచేసి, మహమ్మదీయులను అణచిపారవేయాలనే నినాదంతో 1925 లో హెడ్గెవరు అనే అతడినాయకత్వాన మహరాష్ట్రలో రాష్ట్రీయస్వయంసేవక సంఘం బయలుదేరింది. ఈ సంస్థ నాజీపద్ధతులమీద ఆర్గనైజుచేయబడింది. హిందూయువకులకు డ్రిల్లు, లాఠీ, నేర్పుతారు. దీనికి వర్తకులు జమీందార్లు, మిల్లుయజమానులు కొందరు ధనసహాయంచేయడం మొదలుపెట్టారు. మహరాష్ట్ర, మధ్యరాష్ట్రాలలో ఈసంస్థ బలంగాఉంది. ఈసంస్థనాయకులు తమకు హిందుమహాసభతో సంబంధంలేనట్లుగా నటిస్తారు గాని, వీరికి ధనసహాయంజేసేది హిందూమహాసభలోని ధనికులే.

ఈసంస్థ ఆంధ్రలో ప్రవేశించి 8 సం॥ అయింది. ఈ యుద్ధకాలంలోనే ఇది ఆంధ్రదేశంలో చాల పట్టణాలకు వ్యాపించింది. ఈ యుద్ధకాలంలో పట్టణాలలోని కాంగ్రెసు సామాన్యంలో వచ్చిన నిస్పృహను ఉపయోగించుకొని, ఆటలు, పాటలు మొదలైనవాటిద్వారా కాంగ్రెసు యువకులను ఆకర్షించుతున్నారు. ఇదివరకు కాంగ్రెసును సపోర్టుచేసిన వకీళ్లు, గుమాస్తాలు, టీచర్లే ఇప్పుడు దీనిని సపోర్టుచేస్తున్నారు. వర్తకులు కొంతమంది, జమీందార్లు ప్రజాఉద్యమానికి వ్యతిరేకంగా ఈ సుశిక్షితమైన సంస్థను ఉపయోగించుకోవచ్చునని దీనికి ధనసహాయం జేస్తున్నారు. కాలేజీ స్కూళ్ళలో హిందూ ఉపాధ్యాయులు దీనికి చేయూతనిస్తున్నారు. ఇది కమ్యూనిస్టు వ్యతిరేకులయిన వారినందరినీ ఆకర్షించుతోంది. విద్యార్థులలో చాలచోట్ల స్థానాన్ని ఏర్పరచుకుంది.

మన బలం :-

పట్టణాలలో మన సంబంధం ఎక్కువగా కార్మికులలోనే. మధ్యతరగతిలో మనకు పలుకుబడి చాలతక్కువ ఉంది. మొత్తంమీద పట్టణాలలో మన పార్టీ పలుకుబడి చాల

తక్కువ. ఆహారసమస్య, మున్సిపలు కార్మికులద్వారా పట్టణ పారిశుధ్యానికి ప్రజలను సమీకరించడం మొదలైన మన దేశరక్షణ నినాదాలను ప్రచారస్థాయినుండి నిర్మాణ స్థాయికి తీసుకుపోనందువలన, పట్టణమధ్యతరగతిలోను, ఇతర ప్రజాసామాన్యంలోనూ, ప్రాతిపదికను సంపాదించలేకపోయాం. అయినప్పటికీ మనకు కార్మికులలో చాలకాలం నుండి మనంచేస్తున్న ట్రేడుయూనియను పనివలన చాల పలుకుబడిఉంది. విద్యార్థులలో బాగా పలుకుబడిఉంది. మనకు ముందుకుపోవడానికి బలమైన ప్రజాపునాది ఉంది.

ఈ పరిస్థితులలో మనం పట్టణాలను పార్టీ పలుకుబడిక్రిందకు తేవడానికి అవలంబించాలిసిన కార్యక్రమం ఏమిటి?

(1) మున్సిపలు కార్మికులచేత ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమనే దేశభక్తిపూరితమైన పంథాను అమలుజరపాలి. దీనిద్వారా పట్టణంలోని ఇతరప్రజలు మనపంథా ప్రజల శ్రేయస్కరమైన పంథా ఎలాఅవునో తమకళ్ళతో చూచి అంగీకరిస్తారు. ఇప్పుడు మధ్యతరగతివారిలో మన పంథాయెడల ఉన్న దురభిప్రాయాలుపోతాయి. అందుకు మనం మున్సిపలు కార్మికులు పని సరిగా చేసేటట్లుచెయ్యాలి. ప్రతి డివిజనులోనూ ఊడ్చేవారు, దొడ్లు బాగుచేసేవారు, కాలువలు బాగుజేసేవారు, చెత్తబళ్ళవాళ్ళు ఇప్పుడు ఎంతమంది ఉన్నారో లెఖ్ఖతీయాలి. వారు రోజుకు 8 గంటలుపనిచేస్తే, ఎంతపని మిగిలిపోతుందో, పై డిపార్టుమెంటులో ఒక్కొక్కదానికి ఇంకా ఎంతమందికావాలో, అంచనావెయ్యాలి. ఆ డివిజనును పరిశుభ్రంగా ఉంచడానికి ఎక్కడెక్కడ కాలువలు వెడల్పుచెయ్యాలో, పాకీదొడ్లు కట్టించాలో, డస్టుబిన్నులు వెయ్యాలో మొదలైన ఇతర సూచనలుగూడ చెయ్యాలి. ఈవిధంగా ప్రతిడివిజనుకు వివరమైన ప్లానును తయారుచెయ్యాలి. ఆడివిజనులోని పెద్దమనుష్యులు, మున్సిపలు కౌన్సిలర్లు, స్వయంగా మనపనిని చూడటానికి ఆహ్వానించి, వారిని అంగీకరింపజేసి, ఆ డివిజను వ్యవహారాలను పరిష్కరించడానికి, డివిజను పెద్దలు, కార్మిక ప్రతినిధులు, వీలుంటే శానిటరీ ఇన్స్పెక్టర్లతోగూడిన డివిజను కమిటీని ఏర్పరచాలి. దీనిద్వారా మనం తయారుచేసిన ప్లాను, కార్మికుల కోర్కెలను మున్సిపలు అధికారులచే అంగీకరింపజేయడానికి ఆందోళనచెయ్యాలి. ఈపనిలో మిగతా సంఘాల సహాయం తీసుకోవాలి.

(2) ఆహారకమిటీలద్వారా ప్రజలకు ఆహారపదార్థాలు, ఇతరజీవితావసరవస్తువులు, కంట్రోలురేటుకు అందేలా చేయాలి. వర్తకుల రహస్య గిడ్డంగులనుండి జీవితావసర వస్తువులను బయటికిలాగి, దొంగ మార్కెట్టును అరికట్టాలి. రేషనింగు పెట్టని పట్టణాలలో రేషనింగు కోసం ఆందోళన చెయ్యాలి. రేషనింగుపెట్టిన పట్టణాలలో రేషను కార్డులు ఇవ్వడంలోనూ ప్రజలకుజరిగే కష్టాలను తొలగించి, రేషనింగు జయప్రదమయ్యేలా చెయ్యాలి. చౌకడిపోలు సరిగా నడిచేలా చేయాలి. ఈ విధంగా ప్రజలను సమీకరించి, వార్డు ఆహారకమిటీలను పట్టణ ఆహారకమిటీని ఏర్పరచి పనిచెయ్యాలి. వాలంటీరు దళాన్నిగూడ నిర్మించాలి.

(4) యువజన సంఘాలను, బాలసంఘాలను, ప్రతిపేటకోనూ ఆర్గనైజుచేయ్యాలి. వీటిద్వారా యువకుల దురల్వాట్లను అరికట్టి, రౌడీయిజం ప్రభావంతగ్గించాలి. ఆటలు, పాటలు మొదలైన వాటిద్వారా యువకులను ఆకర్షించాలి. ప్రతిపేటలోనూ రోజూ ఆటలు ఆడించాలి. ఈ కార్యక్రమంలో విద్యార్థిసంఘాల సహాయం తీసుకోవాలి. ఈ కార్యక్రమం ద్వారా యువకులను ఆర్.యస్.యస్. వైపుకు పోకుండా చేయగలుగుతాం. యువకులలో అభివృద్ధి భావాలు ప్రవేశపెట్టి, దేశశ్రేయస్సుకు పాటుబడేలా చేయగలుగుతాం. యువజన సంఘాలద్వారా పట్టణ పారిశుధ్యానికి, అంటుజాడ్యాలను అరికట్టడానికి, కృషిచెయ్యాలి.

మహిళాసంఘాలను గూడ ఆర్గనైజుచేసి, నీటిపంపులు, పాకీదొడ్లు మొదలైన కష్టాలను తీర్చడానికి పనిచెయ్యాలి.

(5) పట్టణాలలో రౌడీలు ప్రజలమీద చాల దౌర్జన్యం చేస్తూఉంటారు. మనకామ్రేడ్సు తమ పేటలలో ఉన్న రౌడీలు అలాదౌర్జన్యం చేస్తునప్పుడు పార్టీబలాన్ని సమీకరించి ఎదుర్కోవాలి. ఈవిధంగా మనప్రజల సానుభూతిని సంపాదించగలుగుతాం. పేటల్లోని మధ్యతరగతివారు మనవైపుకు వస్తారు.

కామ్రేడ్సు, మనం ప్రజలను రౌడీలనుండి కాపాడాలన్నా, కమ్యూనిస్టు వ్యతిరేకుల నుండి ప్రజాసంఘాలను కాపాడాలన్నా; మనం స్వీయరక్షణలో శిక్షణను పొందాలి. కనుక పార్టీసభ్యులకు, మిలిటెంట్లందరికీ (ఆర్గనైజర్లుతోసహా) డ్రిల్లు, లాఠీ, ఇతర స్వీయరక్షణ పద్ధతులు నేర్పాలి. పార్టీ కమిటీ ఇదొక ప్రధాన బాధ్యతగా గ్రహించాలి.

(6) మహమ్మదీయులు :-ఆంధ్రలో మహమ్మదీయులు 100 కి 10 మంది మాత్రమే వున్నారు. వీరిలో ఎక్కువభాగం పట్టణాలలో ఉన్నారు. కొన్నిపట్టణాలలో 100కి 25 వరకు గూడ ఉన్నారు. సామాన్యంగా వీరిపేటలు ప్రత్యేకంగాఉండి, ఇతర జనసామాన్యంతో సంబంధముండవు.వీరు చాలవరకు ముస్లిములీగు పలుకుబడిలో ఉన్నారు. దాదాపు పార్టీకి వీరితో సంబంధమేలేదని చెప్పవచ్చు. మన పాలసీవల్ల వీరిలో యువకులు ఆకర్షింపబడు తున్నారు. విద్యార్థిసంఘాలద్వారా, మన ఆహారసమస్యనుగూర్చి పనిచేయుటద్వారా మహమ్మదీయ యువకులను, ప్రజాసామాన్యాన్ని ఆకర్షించాలి. పార్టీలోఉన్న మహమ్మదీయ కామ్రేడ్సు, మహమ్మదీయ జనసామాన్యం మధ్యనే పనిచేసేలా చెయ్యాలి.

పట్టణంలోని పార్టీకమిటీ మన పార్టీ బలాన్ని, మన ప్రతికక్షుల బలాన్ని, అంచనా వెయ్యాలి. ప్రతికక్షుల పలుకుబడిని తగ్గించడానికి ప్రజాసంఘాలకు ఒక ప్లాను వెయ్యాలి. దానిమీద ప్రజాసంఘాలను పనిచేయించాలి.

పార్టీ క్లిష్టదశ:

కామ్రేడ్స్, ఆంధ్రదేశంలో పార్టీని ఎదుర్కొన్న క్లిష్టసమస్య ఆహారసమస్యయే గాదు. దీనితోపాటు మరొకటిగూడ ఉంది. మనపార్టీ ప్రజాసమస్యలను తీసుకొని, వాటి

నివారణకు పాటుబడుతూబలపడుతోంది. దీన్నిచూచి ఇతరబూర్జువా, పెట్టిబూర్జువా రాజకీయ పార్టీలు, గ్రూపులు, సహించలేకపోతున్నాయి. వారివారి తప్పుడుపంథాను వదలుకొని, మన పార్టీచూపే జాతీయైక్యపంథాను స్వీకరించడంలేదు. పైగా రాజకీయంగా వారిలో పరస్పరం భేదమున్నా మనపార్టీని వ్యతిరేకించడంలోకలిసి పనిచేస్తున్నాయి. రంగాముఠా, కాంగ్రెసు సోషలిస్టులమని చెప్పుకొనే కొందరు కాంగ్రెసువాదులు, పార్వర్డుబ్లాకువారు, రాయిస్టులు, హిందూమహాసభ, ఆర్. యస్. యస్. జస్టిసుపార్టీవాళ్ళు మొదలైన గ్రూపులు పార్టీమీద తగాదాలకు దిగుతున్నాయి. రౌడీలను ఉపయోగించి, దౌర్జన్యంద్వారా పార్టీని అణగగొట్ట డానికి ప్రయత్నించుతున్నారు. వీరు పార్టీరాజకీయ నినాదాలను ఎదురించలేక, చివరకు దౌర్జన్యానికి దిగారు. గాంధీవాదులు ప్రత్యక్షంగా మనతో దెబ్బలాటల్లో పాల్గొనకపోయినా, వెనుకనుండి సపోర్టుయిస్తున్నారు. గ్రామ పెత్తనదార్లు తమ పెత్తనం పోతుందనే భయంతో, పై గ్రూపులతో కలిసి కమ్యూనిస్టుపార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. కమ్యూనిస్టులు ఉన్న ప్రతిగ్రామం, పట్టణంలో జరుగుతున్నది ఇదే. కమ్యూనిస్టు వ్యతిరేకులంతా కలిసి ఒకవైపున పార్టీమీద దాడిసాగించుతుంటే, ప్రభుత్వం మరొకవైపునుండి పార్టీమీద నిర్బంధవిధానం తీవ్రంగా కొనసాగించుతోంది.

ఎందుకు ఇతర రాజకీయగ్రూపులు, పెత్తనదార్లు అంతాకలిసి మన పార్టీని వ్యతిరే కించుతున్నారు? ఇదొక వర్గపోరాటంపై బూర్జువా, పెటీబూర్జువా పార్టీలకు, కార్మికవర్గ పార్టీయైన కమ్యూనిస్టుపార్టీకి మధ్య ప్రజానాయకత్వంకోసం జరుగుతున్న వర్గపోరాటం. పై బూర్జువా, పెట్టీబూర్జువాపార్టీలు దేశవినాశనకరపంథా అవలంబించుటచే, ప్రజల్లో తమ పలుకుబడిని పోగొట్టుకొంటూ ఉన్నాయి. మనపార్టీ దేశంలోని దేశభక్తపార్టీలన్నిటినీ ఐక్యంజేసి, దేశాన్ని రక్షించే రాజకీయపంథాను అవలంబించుటచే, ప్రజల్లో పలుకుబడిని సంపాదించుతోంది. పార్టీ ప్రజాపార్టీగా తయారవుతోంది. అందుచేతనే ఇతర రాజకీయ గ్రూపులు పార్టీపై వర్గద్వేషంతో మన పార్టీమీద కత్తిగట్టినవి.

ఇది క్లిష్టదశ. మన రాజకీయనినాదాలు సరియైనవని రుజువైనాయి. ఇక కమ్యూనిస్టువ్యతిరేకులు దౌర్జన్యానికి పూనుకున్నారు. మనం ఆ దౌర్జన్యాన్ని దౌర్జన్యంతో ఎదుర్కోవాలి. రాజకీయనినాదాలు ఇవ్వడంలోనూ, ప్రజలను సమీకరించడంలోనే గాక, రౌడీయిజం నుంచి ప్రజలను, తమ్ముగూడ కాపాడుకోగల ధైర్యశాలురనేది గూడ రుజువు చేసుకోవాలి. ఈవిధంగా రౌడీల దౌర్జన్యాన్ని అణగగొట్టితేనేగాని, మనపార్టీ ప్రజాపార్టీగా తయారుగాదు; చివరకు దేశభక్త పార్టీలను ఏకంచేసి దేశస్వాతంత్ర్యం సంపాదించడం జరగదు. పార్టీసభ్యులు ప్రతి గ్రామంలోనూ, పట్టణంలోనూ ఒక ఐక్యసైన్యంవలె సుశిక్షితంగా పనిచేసి, దౌర్జన్యాన్ని దౌర్జన్యంద్వారా ఎదుర్కొని, పార్టీని క్లిష్టదశనుంచి దాటించాలి.

6. ప్రజాసమస్యలు - పార్టీ

1943 జనవరిలో జరిగిన రాష్ట్రప్లీనం సమావేశం. పార్టీసభ్యులు-ప్రజలను నిత్యం ఎదుర్కొనే సమస్యలను. ప్రజలను కలవరపెట్టే ప్రధానసమస్యలను తీసుకొని పనిచేయడంలేదనీ, జనరలు రాజకీయ ప్రచారం చెయ్యడం, పైసమస్యలలో తీసుకున్నవాటినిసైతం ఆందోళన. మహజర్లు పెట్టడంతో ఆపివేయడం జరుగుతోందని చెప్పింది; పార్టీని ప్రజా పార్టీగా చెయ్యాలంటే. ప్రజాసంఘాలనే అస్తిపంజరాలను రక్తమాంసాలతోనింపి ప్రజల్లో సంఘ చైతన్యం (తమ నిత్యజీవితంలో సంఘం ఒకభాగం అనేభావం) కల్గించాలంటే. ప్రజలను నిత్యం ఎదుర్కొంటున్న అసంఖ్యాకమైన సమస్యల నివారణకు పనిచెయ్యాలని చెప్పింది.

అప్పటినుండి మనకామ్రేడ్సు ప్రతిచోట స్థానికసమస్యలను తీసుకొని పనిచేయడం ప్రారంభించారు. కాని స్థానికంగాఉన్న పెత్తనదార్లు కమ్యూనిస్టు వ్యతిరేకులుపెట్టే ఆటంకాలను దాటలేక, నిస్పృహచెంది కూర్చుంటున్నారు. అందుకు ధైర్యంతో ప్రజలయెదుట పెత్తనదార్ల కుతంత్రాలను బట్టబయలుచేసి, ప్రజలను సమీకరించి సమస్యలను పరిష్కరించడంలేదు. అందువల్ల మన ప్రజాసమస్యలన్నీ మహజర్ల కార్యక్రమంతో ఆగిపోతున్నాయి. తమకోర్కెలు సాధించడంకోసం తాము ముందుకురావాలనే భావం ప్రజల్లో కలుగజేయనంతకాలం మనం ప్రజల నెదుర్కొన్న సమస్యలను పరిష్కరించజాలం. ప్రస్తుతం యుద్ధబాండ్లు, ధాన్యపుపండ్లు, కూలిసమస్య, కాల్వలు చెరువులు మరమ్మతుల సమస్య, చౌకడిపోలు, రేషనింగుసమస్య మొదలైనవెన్నో ప్రజలను కలవరపెట్టుతున్నాయి. ప్రజలు వీటి పరిష్కారమార్గం చూపించే ధీరులకోసం ఎదురుచూస్తున్నారు. కాని కొన్నిచోట్ల మన కామ్రేడ్సు ఈసమస్యలు తమకు మించినవనీ, ప్రజలు తమమాట వినరనీ, వదలివేస్తున్నారు. ఒకచోట ఒక పార్టీసభ్యుడున్నాసరే, అతడు ధైర్యంతో అటువంటిసమస్యను తీసుకుంటే, సహాయంచేయడానికి ఎంతోమంది మిలిటెంట్లు ముందుకువస్తారు. వారిద్వారా ప్రజలను సమీకరించి, సమస్యను పరిష్కరించవచ్చు. నూజివీడు ఉదాహరణ. అంతర్జాతీయంగా చైనా, స్పెయిన్, ఫ్రాన్సు, బ్రిటను దేశాలలోని సోదరపార్టీల చరిత్రలే ఇందుకు తార్కాణం.

నెలరోజులక్రితం కృష్ణాజిల్లా నూజివీడు తాలూకాలో కమ్యూనిస్టుపార్టీకిగాని, రైతు సంఘానికిగాని 12 గ్రామాలతో సంబంధముంది. ఆగ్రామాలలోనైనా పార్టీ, రైతు సంఘాన్నిగూర్చి అందరికీ తెలియదు. నెలరోజుల్లోనే పార్టీ, రైతుసంఘం అంటే తాలూకాలో 80 గ్రామాల ప్రజలకు అభిమానపాత్రమయినాయి. 30 గ్రామాల్లో పార్టీకి

మిలిటెంట్లు వచ్చారు. పార్టీ ఆఫీసు తిరుణాలవలె అయిపోయింది. ప్రజలు తండోపతండాలుగా ఆఫీసులో మూగుతున్నారు. ఇంత కొద్దికాలంలోనే, ఇంత పెద్దమార్పు ఎలా వచ్చింది?

ఆంధ్రదేశమంతటివలెనే నూజివీడుతాలూకాలోగూడ ప్రభుత్వోద్యోగులు బీదబిక్కి అనే విచక్షణలేకుండా నిర్బంధంగా యుద్ధబాండ్లుకొనిపించడం మొదలుపెట్టారు. కరణాలు, మునసబులు, పెద్దరైతులు, షావుకార్లు-నోరులేని రైతుల కూలీలమీద ఎక్కువభారాన్ని నెట్టడానికి ప్రయత్నించారు. ఎంతభూమి ఉంది? ఎంతఆదాయం వస్తుంది? అనే విషయాలను ఆలోచించకుండా రైతు చెల్లించే శిస్తునుబట్టి అంచనాలు వేశారు. ఈ పద్ధతివల్ల భాగ్యవంతుల బరువు కొంతవరకు బీదవారిమీద త్రోయడానికి అవకాశమేర్పడుతుంది. ఎందువల్లనంటే, 4యకరాల బీదరైతు దానిలోనే కుటుంబాన్నంతా పోషించాలి; అప్పులు తీర్చడం మొదలైనవి చెయ్యాలి. 50 యకరాల ధనికరైతుగూడ కుటుంబాన్నే పోషించాలి. సామాన్యంగా బీదరైతుకు కుటుంబ ఖర్చులకు పోను మిగిలేది ఏమీ ఉండకపోగా, ఇంకా కొంత అప్పుగూడ చేయవలసి వస్తుంది. ధనికరైతుయొక్క జీవిత పరిమాణం ఎక్కువ అనుకుంటే 10 యకరాల ఆదాయంతో సుఖంగా కుటుంబాన్ని గడుపుకోవచ్చును. మిగతా భూమిలో శిస్తు, వ్యవసాయ ఖర్చులు పోను, మిగిలినదంతా ఆదాయమే. కనుక యకరాలవంతున గాని లేక శిస్తునుబట్టి గాని యుద్ధబాండ్లు కొనమనడంవల్ల బీదలకు అన్యాయం జరుగుతుంది. ఇందువల్ల మన కామ్రేడ్స్ చొరవతీసుకుని ఆదాయాన్ని, కుటుంబ ఖర్చుల పట్టీలను తయారుజేసి, ఏమీ నికరాదాయం మిగలని బీదరైతులను మినహాయించి మిగతావారికి నికరాదాయాన్నిబట్టి, యుద్ధబాండ్ల పట్టీలను తయారుజేశారు. ప్రజల్లో ఇది సవ్యమైన పద్ధతి అని ప్రచారంజేశారు.

ధనికులు తమ కుట్రలు భగ్నమయ్యాయని, మరొక ఎత్తు ఎత్తారు. గ్రామాల్లో దగ్గర చుట్టరికం ఉన్న కుటుంబాలు గలసి ఒక ముఠాగా ఉంటాయి. దీన్నే జిమ్మా అంటారు. ప్రతి జిమ్మాలోనూ బీదలు, భాగ్యవంతులు వుంటారు. జిమ్మాకునాయకుడుగా ధనికుడు, నోరుగలవాడుంటాడు. గ్రామ వ్యవహారాలన్నీ ఈ జిమ్మా పద్ధతినే నడుస్తాయి. ఆ జిమ్మాలో పెద్దచెప్పినట్లు అంతా వినాలి. దీనిలో ప్రజాస్వామ్యమేమీ ఉండదు. ఇది జమీందారి యుగపు సాంప్రదాయం. దీన్ని ఆధారంగా జేసుకొనియే ధనికరైతులు, పెత్తందార్లు కుటుంబ అహంకారాలు రెచ్చగొట్టి బీదరైతులను వెనకవేసుకొని, గ్రామ పార్టీలను కట్టి, తమ దోపిడీవిధానాన్ని సాగిస్తారు. అందువల్ల వీరు జిమ్మాపద్ధతిని రూపుమాపే వర్గఉద్యమాలన్నా, వర్గసంఘాలన్నా (రైతు, కూలీ) ద్వేషించుతారు. వాటిని అభివృద్ధిగానీయరు. మనం గ్రామంలో ఈ జిమ్మాపద్ధతిని రూపుమాపందే. వర్గపద్ధతి మీద ప్రజా ఉద్యమాన్ని నిర్మించలేం. నూజివీడు తాలూకాలో ధనికులు శిస్తునుబట్టి వసూలు చేసే పద్ధతి ఎప్పుడైతే సాగలేదో, ఇంక జిమ్మాపద్ధతిని లేవదీశారు. జిమ్మాపద్ధతిలో కనీసం తన దగ్గర బంధువులైన బీదరైతులమీదనైనా కొంతభారం నెట్టవచ్చునని, వీరి

ఉద్దేశ్యం. మన కామ్రేడ్స్ దీనికిగూడ అంగీకరించక, ఈ పద్ధతి బీదల కెట్లా నష్టమో రుజువుపరిచారు. పెద్దరైతులు చాలచోట్ల అంగీకరించలేదు. తాము వేసిన లిస్టు ప్రకారం డబ్బు వసూలుచేశారు. తహసిలుదారుగూడ ఇంగితజ్ఞానం గలవాడగుటచే దాన్ని అంగీకరించాడు. మన కామ్రేడ్సు ఈ విధంగా 3 గ్రామాల్లో పరిష్కరించగానే, ఈ వార్త తాలూకా అంతా దావానలంవలె వ్యాపించింది. ప్రజలు పార్టీ ఆఫీసు చుట్టూ గుంపులు గుంపులుగా మూగసాగారు. ఇంతవరకూ 15 గ్రామాల్లో ఈ సమస్యను పరిష్కరించారు. (వివరాలు ప్రజాశక్తి 8-12-43 సంచిక 9 వ పేజీలో ఉన్నాయి.)

పెద్దరైతుల, గ్రామోద్యోగుల ఆట కట్టింది. ప్రజలు గ్రామపెత్తనదార్లకు ఇదివరలో ఇచ్చినట్లుగా, డబ్బు తీసుకోమని రహస్యంగా బలవంత పెట్టసాగారు. ఒక బీదరైతు అడవిపంది మాంసం (అక్కడ గొప్ప ఆహారంగా పరిగణింపబడుతుంది) పంపనా అని అడిగాడు. పార్టీని గూర్చి చెప్పినతరువాత, గ్రామ పెత్తందార్లకు పార్టీకిగల భేదాన్ని ప్రజలు తెలుసుకున్నారు. ఈ సమస్యను పరిష్కరించిన 15 గ్రామాల్లోనూ, రైతులు, కూలీలు, యువకులు, మహిళలు, బాలబాలికలు అంతా ఆయాసంఘాల్లో చేరుతున్నారు. మూడు గ్రామాల్లో వారి సొంతఖర్చుమీద ముగ్గురు హోల్‌టైమర్లను ఈ సంఘాల పనికి ఇస్తామన్నారు. బెజవాడలో జరిగే అఖిలభారత రైతుమహాసభకు చద్దిమూటలు గట్టుకొని వస్తామంటున్నారు.

కోటాలు పూర్తిగావని సణిగే కామ్రేడ్స్! మీరు మీ మీ ప్రాంతాల్లో ప్రజలను ఆందోళనపరిచే విషమసమస్యల తీసుకొని పనిచేశారా? ఎన్ని ఆటంకాలు వచ్చినా లెక్కజేయక పార్టీ పాలసీయందు ఆత్మవిశ్వాసంతో ముందుకు పోయారా? లేక ధనికరైతులు, "జాతీయ" సంఘాలవారు పెట్టే ఆటంకాలను చూచి నడుము విరిగి నిస్పృహతో గూర్చున్నారా? మీకు నూజివీడు తాలూకా ఉదాహరణయే. జవాబు లేచి నిలబడండి. పరిస్థితులను అంచనావేసి, పార్టీబలాన్ని సమీకరించి, ప్లానుప్రకారం పార్టీపాలసీయందు ఆత్మవిశ్వాసంతో ముందుకు నడవండి. పొరపాట్లు చేస్తామనే పిరికితనం వదలండి. పొరపాటు చేస్తే పార్టీ ఏమనదు. పొరపాటు నుండి అనుభవాన్ని గడించి, ఆ అనుభవాన్ని ముందు పనికి ఉపయోగించుతూ ముందుకు పోవాలి. అలా చేయక నిస్పృహతో మూల గూర్చుంటే, పార్టీ ఊరుకోదు. ఆత్మ విశ్వాసంలో ముందుకు నడవండి. మీ మీ ప్రాంతాల్లో ప్రజలను ఎదుర్కొన్న విషమసమస్యలను వెంటనే తీసుకొని పనిచేయండి. ఒక్క విజయం సాధించితే పార్టీ, ప్రజాసంస్థలు అన్నీ ఒక్క దూకుతో ముందుకు పోతాయి. మీరు తీసుకున్న కోటాలకు రెట్టింపు పూర్తి అవుతాయి.

పార్టీయొక్క అభివృద్ధినిగూర్చి పార్టీ సభ్యులలో ఒక పొరపాటు దృక్పథం వుంది. క్రిందటి నెలకన్నా పార్టీసభ్యత్వం ప్రజాసంఘాల సభ్యత్వం యెక్కువ అయిందిగదా అని పెట్టిబూర్జువా ఆత్మతృప్తి చూపుతారు. పార్టీబలానికి, పరిస్థితులకు అనుగుణ్యంగా యీ

అభివృద్ధి వుందా అని ఆలోచించరు. ఇది మెకానికల్ అంచనాగాని, మార్క్సిస్టు అంచనా గాదు. మార్క్సిస్టులు అంచనా వేసేటప్పుడు పార్టీకి యెంతబలముంది? ఏ పరిస్థితుల్లో పార్టీ పనిచేస్తోంది? ఈ రెండు అంశాలకు తగినట్లుగా పార్టీ అభివృద్ధి అవుతోందా? అని ఆలోచిస్తారు. ఈవిధంగా ప్రతి పార్టీ సభ్యుడు, ఆర్గనైజరు కమిటీ తన పనినిగూర్చి అంచనా వెయ్యాలి.

ఇప్పుడు మనపార్టీ భారతదేశంలో మూడవ పార్టీ. ప్రతి ప్రాంతంలోనూ పార్టీకి ప్రజల్లో స్వతంత్రి పలుకుబడి (Independant mass following) ఉంది. మనదేశ ప్రజలందరినీ క్షామదేవత యెదుర్కొంది. దేశం నాశనమవ్వడమా? లేక స్వాతంత్ర్యం సంపాదించడమా? అనేది ప్రశ్న. ప్రజలనందరినీ, ప్రధాన రాజకీయ పార్టీలను దీన్ని రూపుమాపడానికి ఐక్యపరచామా, కాంగ్రెసునాయకులు విడుదల అవుతారు; జాతీయ ప్రభుత్వం వస్తుంది. దేశం స్వాతంత్ర్యంవైపుకు ఒక్క పెద్ద అంగముందుకు వేస్తుంది. దీనితోపాటు పార్టీ, ప్రజాసంస్థలు ఒక పెద్ద అంగ ముందుకు వేస్తాయి.

1931 లో ఫాసిస్టుజపాను చైనాను కబళించ బూనుకున్నప్పుడు చైనా ముందున్న సమస్య జపాను దాస్యంలో మ్రగ్గడమా లేక సంపూర్ణమైన ప్రజాస్వామ్య పద్ధతులమీద ముందుకుపోవడమా? అనేది. ఈ విషమస్థితిలో సోదరచైనా కమ్యూనిస్టుపార్టీ జాతీయైక్య సంఘటన కార్యక్రమమిచ్చి, జాతీయైక్యత చేకూర్చింది. దానితో చైనా కమ్యూనిస్టుపార్టీ ఎన్నోరెట్లు కొద్దికాలంలో అభివృద్ధి అయింది. అలాగే 1934 లో ఫ్రాన్సుకు ఫాసిస్టు ప్రమాదం వచ్చినప్పుడు ఫ్రెంచి కమ్యూనిస్టుపార్టీ జాతీయైక్యతా సంఘటన కార్యక్రమం ద్వారా, ఫాసిజాన్ని ఆపింది. దానితో ఆ పార్టీ 50000 సభ్యత్వంనుండి 3,50,000 వరకూ గంతువేసింది. ఇలాగే 1936 లో అంతర్యుద్ధంలో స్పెయిను కమ్యూనిస్టుపార్టీ కొన్ని వేల నుండి కొన్ని లక్షలవరకూ పెరిగింది.

నేడు మనపార్టీగూడ అదే పరిస్థితిలో ఉంది. మనం యీ సంకటావస్థనుండి దేశాన్ని కాపాడామా, 35000 సభ్యత్వం నుండి 350000 వరకూ గంతువేస్తుందనడంలో అతిశయోక్తి లేదు. కామ్రేడ్స్, ఈ విషమపరిస్థితిలో ప్రజలు తెన్నుగానక చూస్తున్నారు. నడుములు బిగించండి. ప్రజలకు మార్గం చూపండి. ఆటంకాలు సరకుజేయక ముందుకు నడవండి. ఇదే మనం చేయవలసింది.

కమ్యూనిజానికి మూలపురుషుడైన కారల్‌మార్క్స ఏమిచెప్పాడు? ప్రపంచంలో అభివృద్ధి క్రమంగానే గాక, కొన్ని పరిస్థితుల్లో గంతుల (leaps) ద్వారా జరుగుతుంది. మనపార్టీని అట్టి పరిస్థితులెదుర్కొన్నాయి. మనపార్టీ అట్టి గంతువెయ్యాలి.

విప్లవపద్ధతి - సంస్కరణపద్ధతి

ప్రస్తుతం కామ్రేడ్సు ప్రజాసమస్యలను తీసుకొని పనిచేస్తున్నా సమస్యను పరిష్కరించడంలో ప్రతికూలంగాఉన్న శక్తుల కుట్రలను నినాదాలను ఎప్పటికప్పుడు ప్రజలకు బట్టబయలుచేసి, పార్టీనినాదాలు ఎలా సరిఅయినవో రుజువుచేస్తూ ప్రజలను సమీకరించుటలేదు. ఒక పిటీషను పెట్టించితే కనీసం దాన్నిగూర్చి ఏమిజరిగిందీ ప్రజలకు మన కామ్రేడ్సు కొంతమంది చెప్పరు.

పనిచేయుటలో భేదం

విప్లవకారులైన కమ్యూనిస్టులకు సంస్కరణవాదులకు మధ్యనున్న ప్రధానభేదం ఏమంటే, ప్రజలు తమ కష్టాలను బాపుకోవడానికి తామే పూనుకోవాలని ప్రజలకు నచ్చజెప్పి కమ్యూనిస్టులు వారిని సమీకరించుతారు. సంస్కరణవాదులు ప్రజలను సమీకరించకుండా, ప్రజలకోసం తాము కొంతమంది ఏదోచేస్తూ, ప్రజల కోర్కెలను ఈడేర్చుతామనే భావం ప్రజల్లో కలుగజేసి, వారిని నోరుతెరుచుకొనిచూచే ప్రేక్షకులనుగా (Passive spectators) మాత్రమే తయారుచేస్తారు. సంస్కరణవాదుల్లో రెండురకాలున్నారు. మితవాదులు, గాంధీవాదులు. సప్రూ, జయకరు మొదలైన మితవాదులు (అఖిలభారత లిబరలు ఫెడరేషను) అసలు ప్రజలతో ఎట్టిసంబంధం పెట్టుకోరు. ఏదైనా రాజకీయ సమస్యవస్తే నేరుగా వైస్రాయి, గవర్నరు, కలెక్టరు మొదలైన ఉద్యోగులతో మాట్లాడుతారు. వీరు ప్రజల దైనందిన సమస్యలను అసలు తీసుకోరు. గాంధీవాదులుగూడ ప్రజల దైనందిన సమస్యలను అంతగా తీసుకోరు. రాజకీయ సమస్యలమీదనే తమదృష్టిని కేంద్రీకరించుతారు. రాజకీయ సమస్యల పరిష్కారంకోసం సైతం ప్రజలందరినీ సమీకరించరు. కొంతమంది ఆరితేరిన సత్యాగ్రహులు స్వాతంత్ర్యం తీసుకువస్తారు; ప్రజలు సత్యాగ్రహోద్యమానికి ధనసహాయంచేసి, చూస్తూ గూర్చుంటేచాలు. కొన్నిటికి గాంధీజీ మొదలైన ముఖ్యసత్యాగ్రహులు మాత్రమే నిరశనవ్రతం జేస్తేజాలు. ఉదాహరణకు గాంధీజీ 1938లో రాజకోట ప్రజాపోరాటం చేతులు దాటిపోతుంటే, దాన్ని ఆపి నిరశనవ్రతం జేశాడు. అలాగే 1921 సత్యాగ్రహోద్యమాన్నిగూడ చౌరీచౌరా, మాప్లా తిరుగుబాటులు రావడంతో ఆపివేశాడు. టెర్రరిస్టులు (వ్యక్తిగత హింసావాదులు) గూడ ప్రజలమీద విశ్వాసము వుంచరు. ప్రజలను సమీకరించరు. వారు తాము బలిఅయిపోయి, స్వాతంత్ర్యం సంపాదిస్తామనేభావం ప్రజల్లో కలుగజేస్తారు. ఈవిషయంలో గాంధీవాదులకు టెర్రరిస్టులకూ భేదంలేదు.

రాజకీయభేదం

ప్రస్తుతం మనదేశాన్ని ఎదుర్కొన్న క్షామం, అంటువ్యాధులనుండి ప్రజలను కాపాడాలి. అందుకు ప్రతిగ్రామంలోనూ ప్రతి పట్టణంలోనూ ఆహారసమస్య అధికాహారోత్పత్తి, అధికోత్పత్తి మొదలైన వాటిమీద ప్రజాఐక్యతను సాధించాలి. ఈవిధంగా వివిధరాజకీయ పార్టీలలోని స్థానికదేశసేవకులను ఐక్యపరచాలి. ఈ స్థానికైక్యత క్రమంగా భారతదేశానికంతకూ హిందూ-ముస్లిము ఐక్యత, కాంగ్రెసు-లీగు ఐక్యతగా అభివృద్ధిచెందాలి. ఈవిధముగా జాతీయైక్యత క్రిందనుండి నిర్మింపబడాలి. కాంగ్రెసువాదులచేత ముస్లిముజాతుల స్వయంనిర్ణయసూత్రం అంగీకరింపజేయాలి. ముస్లిములీగువారు, కాంగ్రెసు నాయకుల విడుదలకు ముందుకువచ్చేలా చేయాలి. అప్పుడు కాంగ్రెసు-లీగు ఐక్యతవస్తుంది అంటే హిందూ-ముస్లిము జనసామాన్యాన్ని ఆహారసమస్య, అధికోత్పత్తి, అధికాహారోత్పత్తి కాంగ్రెసు నాయకుల విడుదల, ముస్లిముజాతుల స్వయంనిర్ణయ సూత్రం, మొదలైన సమస్యలమీద ముందుకు తీసుకురావాలి. ప్రజలయొక్క వత్తిడి నాయకులమీదపడితేనే గాని, వారు దేశరక్షణకు, జాతీయైక్యతకు పూనుకోరు. అందువల్ల ప్రతిస్థానిక సమస్యమీద ప్రజలను సమీకరించేటప్పుడు, ప్రస్తుత ప్రభుత్వం భారతప్రజలను బానిసత్వంలో ఉంచడానికి సామ్రాజ్యవాదులు నిర్మించిన యంత్రంఎలాగో, మనదేశాన్ని ప్రస్తుత కరువుకాటకాలనుండి ఈప్రభుత్వం ఎలా కాపాడలేదో, అందుకు కాంగ్రెసు-ముస్లిములీగు మొదలైన దేశభక్త పార్టీల ప్రతినిధులతోగూడిన జాతీయప్రభుత్వం, రాష్ట్రాలలో సంయుక్త మంత్రివర్గాలు, ఎలా అవసరమో, జాతీయప్రభుత్వం సంపాదించడానికి కాంగ్రెసు-లీగు ఐక్యత ఎలా అవసరమో, అందుకు ప్రజలు తమతమ నాయకులను వత్తిడిచేయడం ఎలా అవసరమో, ఆచరణలో ప్రజలకళ్ళకు చూపుతాం. ఈ సందర్భంలోనే ఇతరపార్టీలు, గ్రూపులు, వ్యక్తులు ఇచ్చే ప్రజావ్యతిరేక నినాదాలను, ఎత్తుగడలను ప్రజలముందు బట్టబయలుచేస్తాం. ఈవిధంగా ప్రజలు తమతమ గ్రామాల్లోనూ పట్టణాలలోనూ తమకష్టాలను బాపుకోవడానికిచేసే ప్రయత్నాలలో, ఇతర రాజకీయపార్టీలు, వ్యక్తులు సాగించే చర్యలు ఇచ్చేనినాదాలద్వారా వాటి నిజస్వరూపం గ్రహించేటట్లు చేయడం, వారి ప్రస్తుత సమస్యల పరిష్కారానికి జాతీయ ప్రభుత్వాన్ని సాధించే జాతీయైక్యత అవసరం గుర్తించేలాజేసి, అందుకు నాయకులను వత్తిడిచేయడానికి ముందుకువచ్చేలా చేయడం; ఇదే ప్రజలకు రాజకీయ చైతన్యం గలుగజేయడమంటే.

ప్రస్తుతం మన కామ్రేడ్స్ పార్టీయొక్క రాజకీయ నినాదాలు (జాతీయ నాయకుల విడుదల, ముస్లిముజాతుల స్వయంనిర్ణయ సూత్రం, ఆహారసమస్య, అధికోత్పత్తి) ప్రజలలో ప్రచారం చేస్తున్నారు. ప్రజలయొక్క దైనందిన కష్టాల నివారణకోసం కృషిచేస్తున్నారు. కాని రాజకీయ నినాదాల ప్రచారానికి, ప్రజల దైనందిన కష్టాల నివారణకోసం సాగించే కృషికి, లంకెలేదు. అవి వేరువేరుగా సాగింపబడుతున్నాయి. అందువల్ల

ప్రజలు తమ నాయకులమీద వత్తిడి తీసుకువచ్చేటందుకు వారిని ముందుకు తీసుకురాలేక పోతున్నాం. తమ నిత్యజీవితంలో వివిధపార్టీలు, గ్రూపులు సాగించేచర్యలు, ఇచ్చే నినాదాలద్వారానే, ప్రజలు వాటివాటి నిజస్వరూపాన్ని తెలుసుకోగల్గుతారు. తమ కష్టాలన్నీ ఈదేరాలంటే, ప్రస్తుత ప్రభుత్వంస్థానే జాతీయప్రభుత్వాన్ని తీసుకురావాలసిన అవుసరాన్ని (రాజకీయాధికారం లాక్కోవడం) గ్రహిస్తారు. అంతేగాని వారి నిత్యజీవితానికి సంబంధంలేకుండా, ఏదో అస్పష్టంగా జాతీయైక్యత, జాతీయప్రభుత్వం అవుసరాన్ని చెప్పడంద్వారా ప్రజల్లో రాజకీయచైతన్యం గలుగదు. రాజకీయ చైతన్యం ప్రజల్లో కలుగజేస్తేనేగాని, రాజకీయాధికారం స్వీకరించడానికి ప్రజలను ముందుకు తీసుకురాలేం అందువల్ల కమ్యూనిస్టుపార్టీ ప్రజల్లో రాజకీయచైతన్యం తీసుకురావడంద్వారానే, తన కార్యక్రమం అమలుజరుప గలుగుతుంది.

సంస్కరణవాదులు

సంస్కరణవాదుల్లో గాంధీవాదులైనాసరే, మితవాదులైనాసరే ప్రజల్లో రాజకీయ చైతన్యం గలుగనీయరు. గాంధీవాదులు ప్రజలను గుడ్డిగా తమ్ము అనుసరించమంటారు. మితవాదులు అసలు ప్రజలజోలికేపోరు.

సంస్కరణవాదులు భారతపెట్టుబడిదారీ వర్గానికి రాజకీయప్రతినిధులు. ప్రజల్లో రాజకీయచైతన్యం రావడమంటే, ప్రజలు తమ చేతులుదాటి కమ్యూనిస్టుపార్టీ పలుకుబడి క్రిందకు పోవడమే. ప్రజల్లో రాజకీయచైతన్యం వస్తే, బ్రిటిషు పెట్టుబడిదారీవర్గ పెత్తనం పోయినతరువాత, భారతపెట్టుబడిదారీవర్గాన్నిగూడ పెత్తనంనుండి తొలగిస్తారని సంస్కరణవాదుల భయం. వారు కోరేదల్లా బ్రిటిషుపెట్టుబడిదార్ల పెత్తనం పోయి, భారతపెట్టుబడిదారీవర్గ పెత్తనం రావడమే. అందుచే ప్రజలు తమ్ముగుడ్డిగా అనుసరించేలా చేసుకోవాలని చూస్తారు. అందుచేతనే ప్రజలకు రాజకీయచైతన్యం గలుగడం వీరి కిష్టముండదు.

మితవాదులు, గాంధీవాదులు, ముస్లిములీగు నాయకులు అందరూ నేడు జాతీయ ప్రభుత్వం జాతీయైక్యత కావాలంటున్నారు. కాని జాతీయైక్యత వేటివల్లఅయితే వస్తుందో, ఆ రాజకీయనినాదాలను అంగీకరించడంలేదు. గాంధీవాదులు మితవాదులు ముస్లింజాతుల స్వయంనిర్ణయసూత్రాన్ని అంగీకరించడంలేదు. ముస్లిములీగునాయకులు కాంగ్రెసునాయకుల విడుదలకు ముందుకు రావడంలేదు.

ప్రస్తుత ప్రభుత్వచట్టాలవిషయంలో భేదం

ప్రస్తుత సామ్రాజ్యవాద ప్రభుత్వం భారతదేశంలో చేసినచట్టాలలోకొన్ని సెక్షనులు ప్రజలకు అనుకూలంగా ఉన్నవి. ప్రజలయొక్క అందోళనవల్లనూ, జమీందార్లు, వడ్డీవ్యాపారస్తుల దోపిడీ విధానం పెచ్చుపెరిగి ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని గలుగజేసి

అసలు ప్రభుత్వంయొక్క ఉనికికే ప్రమాదంవాటిల్లే పరిస్థితులు ఏర్పడినప్పుడూ దోపిడీ విధానాన్ని కొన్ని హద్దుల్లోఉంచి ప్రజాఉద్యమాన్ని కొంచెంశాంతి పరచడానికి, పైజెప్పబడిన కొన్ని ప్రజానుకూల సంస్కరణలను చేసింది. మద్రాసు ఎస్టేట్సులాండుఆక్టు, ఋణనివారణచట్టం మొదలైనవి ఈవిధంగానే వచ్చాయి.

పైజెప్పబడిన ప్రజానుకూల సెక్షనులు సైతం చాల అస్పష్టంగా ఉంటాయి. వాటిని కోర్టులు ప్రజల కనుకూలంగాగాని లేక దోపిడీవర్గాలకు అనుకూలంగాకాని, అర్థం చెప్పవచ్చును. సాధారణంగా ఉద్యోగులు, కోర్టులు ప్రజాసామాన్యానికి వ్యతిరేకంగా తీర్పులిస్తారు. ఐనా కమ్యూనిస్టులు ప్రస్తుత ప్రభుత్వ చట్టాలను ప్రజలకనుకూలంగా అమలు జరిపించడానికి కృషిచేస్తారు. కాని యింతమాత్రాన ప్రజల కష్టాలను పూర్తిగా పోగొట్టగలమనే భ్రమ కమ్యూనిస్టులకులేదు. ప్రజా ప్రభుత్వం వస్తేనేకాని ప్రజల కష్టాలు యీడేరవని చెబుతారు

అందుచే యీలోగా ప్రస్తుతం ప్రభుత్వ చట్టాలలో ఉన్న ప్రజానుకూలమైన సెక్షనును తీసుకొని, వాటిమీద ప్రజలను సమీకరించి, వాటిని ప్రజల కనుకూలంగా నిర్వచనం ఇచ్చేలాచేస్తారు ప్రజలకు వ్యతిరేకమైన చట్టాలు, సెక్షనులను రద్దుచేయమని ఆందోళన జరుపుతారు. కొత్త చట్టాలు, సెక్షనుల కోసం ఆందోళన చేస్తారు ఈవిధంగా ప్రజల సమీకరణద్వారా ప్రజల కనుకూలమైన చట్టాలను సెక్షనులను ప్యాసుచేయించడానికి ప్రయత్నించుతారు. ప్రభుత్వం ప్రజాఉద్యమం బలపడేకొలదీ, తనఉనికికే పూర్తిగా భంగకరంగాని సంస్కరణలను కొన్నింటిని, ప్రజాఉద్యమాన్ని తాత్కాలికంగా శాంతి పరచడానికి చేస్తుంది. ప్రజాఉద్యమం తన ఉనికికే భంగకరమయ్యేటంత బలవత్తరంగా తయారయినప్పుడు, దాన్ని అణచడానికి పూర్తిగా దౌర్జన్యంమీద ఆధారపడుతుంది. అట్టి పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రజలను మోసగించడానికి ఎటువంటి సంస్కరణలనుగూడ చేయలేదు. కమ్యూనిస్టులు స్థానిక సమస్యలమీద ప్రజలను సమీకరించి, ప్రజలకనుకూలమైన చట్టాలకోసం ఆందోళన జరుపుతారు. ప్రభుత్వం కొన్ని సంస్కరణలుచేస్తే, అవి ప్రజలు ఐక్యమయి కృషిచేయడంవల్ల ఎలా సాధ్యమయ్యాయో చెబుతారు. ప్రజలు ఆందోళనచేసినా అంగీకరించని చట్టాలనుచూపి, ప్రస్తుత సామ్రాజ్యవాద ప్రభుత్వం ఎందుకు వీటిని చేయలేదో, ఈ ప్రభుత్వాన్ని పోగొట్టి ప్రజాప్రభుత్వం తీసుకురావలసిన అవుసరం ఎలాఉందో ప్రజలకు చెప్పుతారు.

ప్రస్తుత పరిస్థితుల్లో జాతీయైక్యత (కాంగ్రెసు-లీగు ఐక్యత) సాధించి, బ్రిటిషు, అమెరికా ప్రజల సహాయంతో జాతీయ ప్రభుత్వం సాధించాలిసిన అవుసరాన్ని ప్రజలకు చెబుతారు. ఈవిధంగా ప్రజల్లో రాజకీయచైతన్యంగలుగజేస్తారు. ప్రస్తుతచట్టాలలో ప్రజల కనుకూలముగా ఉన్న హంశాలుసైతం, ప్రజల్లో వ్యవహారజ్ఞానం, వ్యక్తిత్వం ఏర్పడి ప్రజాఉద్యమం బలంగాఉన్న మాగాని ప్రాంతాల్లోనే అమలు జరుగుతున్నాయి.

వెనుకబడిఉన్న మెట్టప్రాంతాలలోనూ, జమీందారీ ప్రాంతాలలోనూ అవిగూడ అమలు జరుగుటలేదు. ప్రజలను సమీకరించి ప్రజాఉద్యమాన్ని నిర్మించుటద్వారానే, వాటిని అమలు జరిపించుటయే పెద్ద విప్లవకరమైనపని.

కోర్టులకు వెళ్ళడం విషయంలోగూడ పైదృక్పధాన్నే అనుసరిస్తాం. ప్రస్తుత కోర్టులు సామాన్యంగా దోపిడీవర్గాలనే సమర్ధించుతాయి. లంచాలు పెట్టిన వారికే లాభం జరుగుతుంది. దోపిడీచేసేవర్గాలు లంచాలు ఇవ్వగలవు. తిండికిలేని ప్రజలు ఏమి లంచాలు ఇవ్వగలుగుతారు? అందుచే పై ప్రజానుకూల చట్టాలుగూడ, కోర్టుకువెళ్ళినంతమాత్రాన అమలు జరగవు. ఆ చట్టాలకు వ్యతిరేకంగా దోపిడీవర్గాలవారు నడుస్తున్నప్పుడు, ప్రజలను సమీకరించి, కోర్టులలో కేసులు పెడతాం. వెనుకబడిఉన్న ప్రాంతాలలో జమీందార్లు, ధనికులు కోర్టుకువెళ్ళినందుకు ప్రజలను హింసించడం, తమవైపున దొంగసాక్ష్యాలకు రమ్మని నిర్బంధించడం, మొదలైన దుష్కృత్యాలు జరుపుతారు. అటువంటి పరిస్థితుల్లో కోర్టుకు వెళ్లి నిలబడటం, సాక్ష్యాలిచ్చేటట్లు కొంతమందిని తయారు అయ్యేలా చేయడం మొదలైన పనులుకూడ ప్రజల సమీకరణకు తోడ్పడతాయి. ఈవిధంగా జమీందార్లవైపుకు సాక్షులను వెళ్ళకుండా చేయడం, ప్రజలవైపున మంచి సాక్ష్యాలు ఇప్పించడంద్వారా కొన్ని కేసులలో విజయం లభిస్తుంది. ఈ విజయాలు ప్రజాఉద్యమాభివృద్ధికి తోడ్పడుతాయి. కాని ప్రజలసమీకరణవల్లనే ఇవి ఎలా సాధ్యమైనాయో ప్రజలకు నచ్చచెప్పాలి. అంతేగాని కోర్టులకు ఎక్కితే, తమ కష్టాలీడేరతాయనే అపోహను వారిలోకల్గనీయరాదు. కొన్ని కొన్ని పరిస్థితులలో ప్రతికక్షులు మనమీద చట్టాలను ఉపయోగించుకోకుండా చేయడానికి మనమే ముందుగా, కోర్టుకువెళ్ళాలిసిఉంటుంది. ఉదాహరణకు, ఒక భూమి మన స్వాధీనంలో ఉన్నదని రుజువుచేసుకోడానికి, ఆక్రమణదావా లేక 144 పిటీషను పెట్టాలిసి ఉంటుంది. ప్రజాసమీకరణకు కోర్టులదావాలు మొదలైనవి అనుబంధంగానే ఉండాలిగాని, ప్రజా సమీకరణలేకుండా ప్రతిపనికి కోర్టులకు ఎక్కడమేపనిగా పెట్టుకోగూడదు. ప్రజా సమీకరణ, కోర్టులకు వెళ్ళడం, రెండూ సమన్వయపరచినప్పుడే, ప్రతికక్షులను లొంగదీయగల్గుతాం.

సంస్కరణవాదులు

వీరిలో మితవాదులు ప్రజాసమీకరణ అవుసరంలేకుండానే, పిటీషనింగుద్వారా క్రమక్రమంగా ప్రజల కనుకూలమైన చట్టాలు చేయించగలమని నమ్ముతారు. బ్రిటిషు సామ్రాజ్యవాద ప్రభుత్వ యంత్రంలోనే సంస్కరణలు చేయించుటద్వారా ప్రజల కష్టాలను పోగొట్టవచ్చునని నమ్ముతారు. ఈవిధంగా సంస్కరణలుచేయిస్తూ, కొంతకాలానికి సామ్రాజ్యవాదులు తమ పెత్తనాన్నివదలుకొని, జాతీయప్రభుత్వం స్థాపించడానికి అంగీకరించేలా చేయవచ్చునని వీరి అభిప్రాయం. వీరు ప్రతివిషయానికి, ప్రజల హక్కులు

రక్షించుకోవడానికి కోర్టులకు ఎక్కించుతారు. ప్రజాసమీకరణతో వీరికి పనిలేదు. ప్రస్తుత ప్రభుత్వచట్టాలకు ప్రజలు ఏవిధంగాను వ్యతిరేకంగా పోవడానికి అంగీకరించరు.

గాంధీవాదులు ప్రస్తుతప్రభుత్వం పనికిరాదనీ, జాతీయప్రభుత్వం రావాలని పేరుకు అన్నారు. కాని జాతీయప్రభుత్వం రావడానికి అవుసరమైన ప్రజాసమీకరణగాని, జాతీయైక్యతగాని సాధించరు. ప్రభుత్వంమీద సత్యాగ్రహమనే వత్తిడి తీసుకువచ్చి, ఏదో విధంగా రాజీపడాలని ప్రయత్నించుతారు. వీరు నోటితో ఏమిచెప్పినా, ఆచరణలోమాత్రం ఈప్రభుత్వం పూర్తిగాపోయి జాతీయప్రభుత్వం వచ్చేమార్గాలు అవలంబించరు. ఏదో ఒకరకమైన రాజీకి సిద్ధమవుతారు. ప్రభుత్వంపోవాలని ఉపన్యాసాలిచ్చినా, గాంధీవాదులుగూడ కోర్టులకు వెళతారు. కాని వీరిదృష్టిలో రాజకీయాలువేరు, కోర్టు వ్యవహారాలువేరు. ప్రస్తుత ప్రభుత్వచట్టాలలో ప్రజానుకూలమైన సెక్షనులనుఉపయోగించి, ప్రజాఉద్యమాన్ని నిర్మించుతూ, సామ్రాజ్యవాద ప్రభుత్వాన్ని పోగొట్టి ప్రజలు రాజ్యాధికారాన్ని స్వీకరించాలనే రాజకీయ చైతన్యాన్ని ప్రజల్లో కల్గించరు. ప్రస్తుత ప్రభుత్వం పోవాలనీ, జాతీయ ప్రభుత్వం రావాలనీ, ప్రజలు సత్యాగ్రహంచెయ్యాలనీ ఉపన్యాసంచెప్పి జైళ్ళకుపోతారు. ప్రజాసమీకరణ లేకుండా, కోర్టులకు వెళతారు.

సిద్ధాంతభేదం

ప్రస్తుతమున్న వ్యక్తిఆస్తి విధానంపోయి, ఉత్పత్తి పరికరాలన్నీ సమాజాధీనమై దానిఫలితం, అందరి ఉపయోగానికి వినియోగపెట్టే సోవియటువిధానం (సోషలిజం) వస్తేనేగాని, ప్రజలకష్టాలు పూర్తిగాపోయి సౌఖ్యమైన జీవితం ఏర్పడదని కమ్యూనిస్టులు చెబుతారు. అంటే ప్రజల దోపిడీవిధానంమీద ఆధారపడిఉన్న ప్రస్తుత పెట్టుబడిదారీ విధానంపోయి, దానిస్థానే సోషలిస్టు సమాజంవస్తేనేగాని ప్రజలకు శాంతి సౌఖ్యం ఏర్పడదన్నమాట.

సంస్కరణవాదులు (గాంధీవాదులు, మితవాదులు, లీగునాయకులు) ఏముఠాకు చెందినాసరే, ఆముఠాలలో ఇతర భేదాలు ఏమున్నాసరే, వారంతా ప్రస్తుత పెట్టుబడిదారీ విధానం శాశ్వతంగా ఉంచాలనేవారే. వారు ఏదోవిధంగా పెట్టుబడిదారీ సమాజానికి సంస్కరణలు అనే అతుకులువేసి, దానిలోని లోపాలను కప్పిపెట్టాలని ప్రయత్నించేవారే. అందుచేత వీరు ఏమిచేసినా పెట్టుబడిదారీ సమాజం పూర్తిగా పోకుండావుండాలనే, చేస్తూఉంటారు. ప్రస్తుతం ప్రజలకున్న కష్టాలన్నీపోయి శాంతి సౌఖ్యాలు రావాలంటే, సోషలిస్టు సమాజ అవుసరాన్ని కమ్యూనిస్టులు ప్రజలకు చెబుతూఉంటారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీఇచ్చిన జాతీయప్రభుత్వ నినాదం దేశంయొక్క సంపూర్ణ స్వాతంత్ర్యానికి ఒకమెట్టు మాత్రమే. దేశభక్తపార్టీల ప్రతినిధులతో గూడిన జాతీయ ప్రభుత్వం కరువుకాటకాలనుండి ప్రజలను కాపాడుతుంది. జపాను దుండగీండ్లను బర్మానుంచి పారద్రోలి, భారతదేశానికి జపాను

ప్రమాదం శాశ్వతంగా తొలగించడానికి భారతప్రజలను సమీకరించుతుంది. ఈవిధంగా ప్రపంచ ఫాసిస్టు వ్యతిరేక సంఘటనలో భారతదేశానికి అర్హమైన స్థానాన్ని సంపాదించుతుంది. భవిష్యత్తులో స్వాతంత్ర్య ప్రపంచవ్యవస్థను నిర్మించుటలో తన పాత్రను నిర్వహించుతుంది. ఈ పైపనుల నిర్వహించుటద్వారా, జాతీయప్రభుత్వం, బ్రిటిషు సామ్రాజ్యవాదుల నుండి అధికారాన్ని వాస్తవంగా తీసుకుంటుంది. యుద్ధానంతరం ముస్లింజాతుల స్వయం నిర్ణయసూత్రం, మైనారిటీ వెళ్ళినవారందరి ఓటింగుహక్కు మీద ఆధారపడి, ప్రజాస్వామిక భారతరాజ్యాంగ విధానం నిర్ణయింపబడుతుంది.

ఈ ప్రజాస్వామిక భారతరాజ్యాంగవిధానమే సోషలిజానికి ఒక మెట్టుగా ఉంటుంది. కమ్యూనిస్టులు సోషలిజం యొక్క ప్రచారాన్ని ఎన్నటికీ వదలుకోరు. సోవియటుయూనియను ఏర్పడక పూర్వం సోషలిజాన్ని గూర్చి సిద్ధాంతరూపంలో ప్రచారం చేయాలిసి వచ్చింది. ఇప్పుడో, సోవియటుయూనియనులో సోషలిజం ఆచరణలోఉంది. కనుక మనం ఇప్పుడు ప్రజలకు సోషలిజాన్ని గూర్చి తేలికగా ప్రచారంచేయవచ్చు మన రైతుల నెదుర్కొంటున్న సమస్యలను సోవియటుయూనియనులోని రైతులు ఎలా పరిష్కరించుకుంటున్నారో చెప్పవచ్చు. ఈవిధంగానే రైతులకు, కూలీలకు, కార్మికులకు, విద్యార్థులకు, యువకులకు, బాలురకు, ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు, మహిళలకు వారి వారి నిత్యసమస్యలను సోవియటుయూనియనులో ఎలా పరిష్కరించుకుంటున్నారో చెప్పవలెను. ఈ విధంగా భారతీయులలో ప్రతిఒక్కరు సోవియటుజీవనాన్ని తన జీవితానికి పోల్చిచూచుకోగలుగుతారు. ఈ విధంగా మన ప్రజల్లో సోషలిజాన్ని గూర్చి ప్రచారంచెయ్యాలి.

ప్రజలకు రాజకీయచైతన్యం కల్గించేపద్ధతి

ఉదాహరణకు ఒకగ్రామంలో ఒక మురుగుకాల్వసమస్యను తీసుకుందాం. ముందుగా మన కార్యకర్తలు ఆమురుగుకాల్వను బాగుచేయించడానికి అవుసరమయ్యేడబ్బు అంచనావేసి, అది బాగయితే ప్రక్కభూములు ఇంకా ఎంత ఎక్కువగా పంటపండేవీ ఆఖర్చులో రైతులు ఎంతపెట్టుకోవాలి, ప్రభుత్వం ఎంతపెట్టుకోవాలి మొదలైన వివరాలన్నీ సేకరించాలి. అటు తర్వాత ఆ మురుగుకాల్వ తవ్వించడంవల్ల ఆగ్రామానికి; కలిగేలాభం, ప్రస్తుతం దేశాన్నెదుర్కొన్న ఆహారసమస్యను పరిష్కరించడానికి అది ఎలా తోడ్పడుతుంది, దేశరక్షణకు రైతులు ఎక్కువగా పండించాలిసిన అవుసరం; మొదలైన వాటినిగూర్చి ప్రచారంజేయాలి. మురుగుకాల్వను బాగుజేయడానికి రైతులు ఎంతభరించునేవీ, ప్రభుత్వం ఎంతభరించాలి నిందీ మొదలైన వివరాలతో పిటీషనువ్రాసి, గ్రామస్థులందరిచేత సంతకాలుపెట్టించి, గ్రామపెద్దలను వీలుంటే ప్రజలందరినీ ప్రభుత్వోద్యోగి వద్దకు డెప్యుటేషను తీసుకువెళ్ళాలి. ఈ సమస్యలో ప్రభుత్వోద్యోగులు పెట్టే ఆటంకాలు, లంచగొండితనం మొదలైనవాటిని తీసుకొని, ఈప్రభుత్వం సామ్రాజ్యవాద ప్రభుత్వం అవడంవల్ల ఈవిధంగా ఎలా ఉందో,

జాతీయ ప్రభుత్వంవస్తే ఈపనులు ఎలా తేలికగా నెరవేరతాయో సోవియటు యూనియనులో ప్రభుత్వ పద్ధతి ఎలాఉంటుందో, ప్రజలకు ఎప్పటికప్పుడు చెబుతుండాలి. ఈసమస్యవిషయమై గ్రామంలో ఇతర రాజకీయ గ్రూపులు, స్వార్థపరులైన వ్యక్తులు, ఎలా ఆటంకాలు పెడుతున్నారో చూపుతూ, వారి జనరలు రాజకీయనినాదాలకు వారి చర్యలకు సంబంధాన్ని చూపుతూ, ఆ గ్రూపులను వ్యక్తులను ప్రజలయెదుట బట్టబయలు చెయ్యాలి. సోవియటు యూనియనులో ఆధునిక వ్యవసాయ పద్ధతులద్వారా అధికపంటలు ఎలా పండిస్తున్నారో వారికి వివరించి చెప్పాలి. ఈవిధంగా వారిలో సోషలిజంమీద అభిమానం గలుగచెయ్యాలి. ఈవిధంగా ప్రజలకు ఆమురుగుకాల్వసమస్యను సాధించడం విషయంలో జరిగిన కధనంతా రాజకీయాలను అన్వయించి ఎప్పటికప్పుడు చెబుతూ, వారిలో రాజకీయ చైతన్యం గలుగజేస్తూ, వారిని సమీకరించి, ఆ సమస్యను సాధించాలి. వివిధరాజకీయ గ్రూపుల నిజస్వరూపం, వారి కష్టాలను పూర్తిగా బాపుకోడానికి, చివరకు రాజకీయాధికారం ప్రజలు హస్తగతం చేసుకోవాలిసిన అవుసరం, అందుకుమార్గం, ప్రజలు తెలుసుకొనేలా చేయడమే, ప్రజలకు రాజకీయ చైతన్యం గల్గించడం.

7. ప్రచారపద్ధతులు

మన ప్రచారపద్ధతులలోని జనరలు లోపాలు

(1) ఏదైనా ఒక ఘటన జరిగినవెంటనే, మన ప్రతికక్షులకంటె ముందుగా ప్రజలకు మనం నిజవిషయంచెప్పాలి. మనం ఆలస్యంజేస్తే ముందు మన ప్రతికక్షులు ప్రజల్లో అబద్ధాలు ప్రచారంచేస్తారు. అబద్ధాలు ప్రచారం జరిగిపోయినతరువాత, వాటిని బట్టబయలుచేయడం చాలకష్టం. చాలచోట్ల మన కామ్రేడ్సు మన ప్రతికక్షులకే చొరవ వదలిపెడుతున్నారు. అందుచేత వాళ్ళు మనమీద దుష్ప్రచారపుదాడిని ప్రారంభించితే, మన కామ్రేడ్సు దెబ్బకాచుకునేస్థితి (defensive)లో పడిపోవాలిసి వస్తోంది.

ఏదైనా ఘటనజరిగిన వెంటనే, అక్కడఉన్న కామ్రేడ్సు నలుమూలలకు వెళ్ళి మిగతా పార్టీసభ్యులతో జరిగినవిషయం వెంటనేచెప్పాలి. పార్టీసభ్యులందరూ, గ్రామాల్లో అయితే, అన్ని కబుర్లకేంద్రాలలోకి (Gossip Centres) వెళ్ళి, జరిగిన విషయం చెప్పాలి; ప్రతికక్షుల వాదనలనుచెప్పాలి. పట్టణాలలోఅయితే, వెంటనే కరపత్రం అచ్చు వేయించి పంచిపెట్టాలి. సాయంత్రంవేళ పార్కులలోనూ, క్లబ్బులలోనూ జరిగిన విషయం చెప్పాలి. ప్రతికక్షుల వాదనలను బట్టబయలు చెయ్యాలి.

(2) మనపార్టీని, కామ్రేడ్సుగురించి, మన ప్రతికక్షులు దుష్ప్రచారం చేస్తోంటే, కొంతమంది పార్టీసభ్యులు తమకు సంబంధించనట్లుగా ఊరుకోవడం జరుగుతోంది. మరి కొందరు పార్టీసభ్యులు నిజవిషయం తనకు తెలియనప్పుడు తానేమీ మాట్లాడలేనని నోరు మూసుకు కూర్చోడంగూడ జరుగుతోంది. కామ్రేడ్స్! మన ప్రతికక్షులు ప్రజాసేవలో మనలను జయించలేరు. అందుచే వారు మనమీద ఎల్లప్పుడూ అబద్ధపువార్తలను ప్రచారంచేయుటద్వారా, మనపనికి ఆటంకం కల్పిస్తారు. మన ప్రతికక్షులు దుష్ప్రచారం చేస్తున్నప్పుడు ఊరుకోగూడదు. అతడు చెప్పేదానిలో ఉన్నలోపాలను తీసుకొని, అతని ప్రచారాన్ని ఎదుర్కోవాలి తరువాత మన కామ్రేడ్సును అడిగి నిజవిషయం తెలుసుకోవాలి.

(3) మన ప్రతికక్షులలోని ముఖ్యులుచేస్తున్న తప్పుడుపనులను వారిపేర్లెత్తి వారిని ప్రజల్లో నిర్భయంగా బట్టబయలుచెయ్యాలి. అలా చేయడంద్వారానే ఆ వ్యక్తులను ప్రజల నుంచి వేరుచేయగల్గుతాం. పేర్లెత్తకుండా "ప్రతికక్షులు ఇలా చేస్తున్నారు. అలా చేస్తున్నారు" అని ప్రచారం చేయడంవల్ల ప్రయోజనంలేదు.

(4) పార్టీయొక్క రాజకీయపంధాను, వివిధరాజకీయ పార్టీల నినాదాలను, గూర్చి ప్రజల్లో చెప్పుతున్నప్పుడుగాని, సోవియటుయూనియను, ప్రపంచరాజకీయాలను గూర్చి చెబుతున్నప్పుడుగాని, మన కామ్రేడ్సు వాటిని స్థానికపరిస్థితుల కన్వయించడంలేదు. పై కమిటీలు పంపినపార్టీ రిపోర్టులు పుస్తకాలు మొదలైనవాటిలోనివి ఉన్నవి ఉన్నట్లుగా చెప్పడం జరుగుతోంది. దీనివల్ల ప్రయోజనంలేదు. ఎందువల్లనంటే ప్రజలకు తమ గ్రామం లేక పేటలోని విషయాలు తప్ప, ప్రపంచరాజకీయాలు, దేశరాజకీయాలు అంతగా తెలియవు. అందుచేత వారివారి పేటలలోని, గ్రామాలలోని స్థానిక పరిస్థితులకు మన నినాదాలు అన్వయించి, స్థానిక ఉదాహరణలను తీసుకొని చెప్పినప్పుడే అర్థంచేసుకోగలుగుతారు. అందుచేత కాంగ్రెసుసోషలిస్టులు, ఫార్వర్డుబ్లాకు, రంగాముఠా మొదలైన ముఠాల నినాదాలను, ఎత్తుగడలను బట్టబయలు చేసేటప్పుడు, ఆ గ్రామంలో ఆ పట్టణంలో ఆ ముఠాలకు సంబంధించిన వ్యక్తులు, వారు చేస్తున్న చర్యలు, స్థానికంగా యిచ్చే నినాదాలు, తీసుకొని అవి ఎలా ప్రజావ్యతిరేకమో చెబుతూ వారిముఠా జనరలు నినాదాలనుబట్టి బయలు చెయ్యాలి. అలాగే మన పార్టీపాలసీ, హిందూ-ముస్లిము ఐక్యత, ఉద్యోగస్థులను ప్రజావత్తిడిద్వారా లొంగదీయుట, మొదలగువానిని వివరించేటప్పుడు, ఆ గ్రామంలో పట్టణంలో మనం సాధించిన విజయాలను ముందు తీసుకొని వివరించాలి. ఆతర్వాత మిగతాచోట్ల విజయాలను, ఉదాహరణలను, తీసుకొని వివరించాలి. మన కామ్రేడ్స్ ప్రజాశక్తి, పీపుల్సు వారు మొదలైన పార్టీపత్రికలను మొదటినుండి చివరవరకూ క్షుణ్ణంగా చదివి, వానిలోని వార్తలను ప్రచారంలో ఉపయోగించాలి. కామ్రేడ్సు కొంతమంది మన రాజకీయాలు యుద్ధసమీక్ష, సంపాదకీయం మాత్రం చదువుతారు, వార్తలన్నీ చదివితేనేగాని మన ఉద్యమం ఎలా అభివృద్ధి అవుతోందీ తెలియదు.

ఏదైనా గ్రామంలోగాని పట్టణంలోగాని స్థానిక ప్రజాసమస్యమీద విజయం సాధించినప్పుడు, ప్రజలంతా ఐక్యమయి ముందుకు రావడంవల్ల అది ఎలావచ్చిందో, ఆగ్రామంలోగాని ఆపట్టణంలోగాని కామ్రేడ్సు చెప్పడంలేదు. మనం సాధించిన విజయాలను ఆయా గ్రామాల్లో ఎప్పటికప్పుడు ప్రజల్లో ప్రచారం చెయ్యాలి.

ఇంటింటికి తిరిగి చేసే ప్రచారం

బహిరంగసభలద్వారా మన పాలసీని ఎక్కువమందికి ఒక్కసారిగా చెప్పగలుగుతాం. కాని ప్రజల్లో వచ్చే సందేహాలన్నిటికి సమాధానాలు బహిరంగసభల్లోచెప్పడం సాధ్యంగాదు. పైగా బహిరంగసభకు రానివారికి పార్టీ పాలసీ అందజేయాలిసిన అవసరం గూడఉంది. అందుకు దళాలుగా బయలుదేరి ఇంటింటికి తిరిగి ప్రచారం చెయ్యాలి. ఈవిధంగా ప్రజలలోని సందేహాలను పోగొట్టడం సాధ్యమవుతుంది. బహిరంగసభలంటే హుషారులేనివారికి, ఉత్సాహం కల్గించడం సాధ్యమవుతుంది. ఇల్లుకదలని మహిళా

సామాన్యానికి గూడ రాజకీయ ప్రబోధం చేయగల్గుతాం. బహిరంగసభలద్వారా మనకు ఏపేటలో ఎంత పలుకుబడిఉందీ, ప్రతికక్షులకెంత పలుకుబడిఉందీ, తెలుసుకోవడంసాధ్యం గాదు. ఇంటింటికి తిరిగి చేసే ప్రచారంద్వారా, ప్రతి పేటలోనూ పార్టీ అనుకూలురు, ప్రతికూలురు, తటస్థులను తెలుసుకోవడం, పార్టీయొక్క బలాన్ని అంచనావేయడం సాధ్యమవుతుంది.

ఏదైనా ప్రజాసమస్యను తీసుకున్నప్పుడు ముందు ఇంటింటికి తిరిగి చేసే ప్రచారం ద్వారానే, ఎక్కువమంది ప్రజలను సమీకరించగల్గుతాం. తర్వాత పెట్టే బహిరంగసభకు ఎక్కువమందిని సమీకరించగల్గుతాం. కనుక స్వాతంత్ర్య దినోత్సవం, నవంబరు 7 మొదలైనవాటికి బహిరంగసభలు జరిపేముందు ఇంటింటికి తిరిగి ప్రచారం చెయ్యాలి. ఇంటింటికి తిరిగి చేసే ప్రచారం, వీధిమీటింగులు బహిరంగసభలకు ప్రాతిపదికలుగా ఉంటాయి.

బహిరంగసభలు నిషేధింపబడినచోట్ల పార్టీ పాలసీని ప్రజలకు అందజేయడానికి, ప్రజా సంఘాల కార్యక్రమంకోసం ప్రజలను సమీకరించడానికి, ఇంటింటికి తిరిగి చేయు ప్రచారం వీధిమీటింగులే సాధనాలు.

కరపత్రాలు సినిమా కాగితాలవలె వీధుల్లో పంచిపెట్టడంవల్ల లాభంలేదు. ఇంటింటికి తిరిగి చేసే ప్రచారంలో ఉపయోగించాలి. కరపత్రాలలో చాలవిషయాలు ఇరికించి చాటభారతంగా తయారుచేయడంవల్ల, వాటిని ప్రజలు చదవరు. ఒకే ముఖ్యవిషయాన్ని ప్రజల హృదయాలకు హత్తుకుపోయేరీతిని తేలికభాషలో ఒక కరపత్రంలో వ్రాయాలి. ఇవి చిన్నవిగా ఉండాలి.

ఇంటింటి ప్రచారం దళాలుగా ఏర్పడి చేయడం అవుసరం. ఒకరికన్న ఎక్కువమంది ఉంటే, ప్రచారంచేయడానికి ధైర్యం వస్తుంది. ప్రతికక్షులవాదనలను ఎదుర్కోవడంలో ఒకరికొకరు సహాయపడవచ్చును. ప్రతికక్షులు వాదనమాని తగాదాకు, అల్లరికి దిగిన యీరోజుల్లో, దళాలవారీగా ప్రచారం చేయడం చాల అవుసరం. దళంలో కరపత్రాలు ఇవ్వడం, హుండీలుపట్టుకోవడం మొదలైన పని విభజన ఉంటుంది. దళంలో స్త్రీలుగూడ ఉండటం మంచిది, పురుషులు స్త్రీలలో ప్రచారంచేయడానికి అవకాశం ఉండదు. స్త్రీ కామ్రేడ్సు ఆ ఇంట్లోని స్త్రీలతో మాట్లాడవచ్చును. మన ప్రతికక్షులు అల్లరులకు పూనుకున్న యీరోజుల్లో ప్రత్యేకంగా మహిళాదళాలు ప్రచారం చేయడం ముఖ్యంగా పట్టణాలలో మంచిదిగాదు. ఒకేదళంలో స్త్రీలు పురుషులు కలిసి ప్రచారంచేయడం మంచిది.

పర్మనెంటు ప్రచారం

మనకామ్రేడ్సు దినోత్సవాలు, ఏవైనా ప్రజాసమస్యలు తీసుకున్నప్పుడు మాత్రం ప్రజల్లో ప్రచారం చేస్తారు. నిత్యం ప్రజలతో సంబంధంపెట్టుకొని, ప్రజలసందేహాలను తీర్చరు. కొన్నిచోట్ల మన కామ్రేడ్సు అందరూ సాయంత్రం ఒకచోటజేరి కబుర్లు చెప్పు

కొంటూ, ప్రజలనుంచి దూరంగాఉన్న ఒకముఠాలాగ ప్రవర్తించడంగూడ ఉంది. మన ప్రతికక్షులు మనమీద ఎల్లప్పుడూ ఏదో ఒక దుష్ప్రచారం చేస్తూనే ఉంటారు. కనుక మనం మన ప్రతికక్షుల దుష్ప్రచారాన్ని ఎప్పుడూ బట్టబయలుచేస్తూఉండాలి.

కబుర్ల కేంద్రాలు

సాధారణంగా గ్రామాల్లో పదిమంది పోగయి (సాయంత్రం, రాత్రి, పనిలేనిరోజుల్లో ఉదయం) కబుర్లు చెప్పుకునే కేంద్రాలు ఉంటాయి. ఇక్కడే మన ప్రతికక్షులు మనమీద అపోహలు ప్రజల్లో వ్యాపింపజేస్తూ ఉంటారు. గ్రామంలో కబుర్ల సెంటర్లను తెలుసుకొని, అక్కడకు నిత్యం వెళ్ళడానికి కామ్రేడ్సును నియమించాలి. మామూలుగా ఒకకేంద్రంలో ప్రచారంచేసే కామ్రేడు, అక్కడివాడై ఉండటం మంచిది. ఒక కేంద్రంచుట్టుపట్ల ఏకామ్రేడూ లేనిచో, మరొక కామ్రేడును ఆ కేంద్రానికి నియమించవచ్చును. ఈవిధంగా ప్రతి గ్రామానికి కబుర్లకేంద్రాల్లో ప్రచారం చేయడానికి ఒకప్లాను వేసుకోవాలి. మనకు బలంలేనటువంటి ప్రతికక్షుల కేంద్రాలకుగూడ తప్పక కామ్రేడ్సును పంపాలి.

కేంద్రాలలో మన కామ్రేడ్సు ఉపన్యాసాలు దంచగూడదు. ప్రజలసంభాషణలో పాల్గొంటూ, గ్రామరాజకీయాల నుంచి ప్రపంచరాజకీయాలు, దేశరాజకీయాల్లోకి లాక్కెళ్ళాలి. ఉదాహరణకు, యుద్ధబాండ్లు ఉద్యోగులు బలవంతంగా వసూలుచేయడం, విమానం గ్రామంమీదుగా పోవడం మొదలైనవాటినుంచి, ప్రస్తుత యుద్ధపరిస్థితులు చెప్పవచ్చును. కామ్రేడ్సు కబుర్లుచెప్పుచున్నట్లే ఉండాలిగాని, ఉపన్యాసాలు చెబుతున్నట్లుగా ప్రజలు ఊహించేలా చేయగూడదు.

క్లబ్బులు, పార్కులు

పట్టణాలలో సాయంత్రం క్లబ్బులలోనూ, పార్కులలోను జనం చేరతారు. మన ప్రతికక్షులు ఇక్కడ మనమీద అబద్ధాలు ప్రచారంచేస్తారు. మన కామ్రేడ్సు పట్టణంలోని గ్రంథాలయాలలోనూ, సామాన్యులుండే క్లబ్బులలోనూ సభ్యులుగా చేరాలి. నిత్యం ఈ క్లబ్బులలోనికి సాయంత్రం పోవాలి. అలాగే పార్కులలోకి కామ్రేడ్సు నిత్యం వెళ్ళడానికి కొంతమందిని నియమించాలి. వీరు అంతా ఒకచోటగూర్చొని కబుర్లు చెప్పుకోకుండా, నలుమూలల జనంలో కలిసిపోయి, వారి సంభాషణలో పాల్గోవాలి. పై పనులకు హోలుటైమర్లు అవుసరంలేదు. 'పార్టుటైము' కామ్రేడ్సు ఈపని చేయవచ్చును.

వైజ్ఞానికదళం - (Cultural Squad)

ఉపన్యాసాలకన్నా పాటలు, నాటకాలు, బుర్రకథలు మొదలైన వాటివల్ల సామాన్య ప్రజల్లో ఎక్కువ రాజకీయప్రచారం చేయగలుగుతాం. ఉపన్యాసాలద్వారా అయితే రాజకీయ ప్రబోధం చేస్తున్నట్లు ప్రత్యక్షంగా తెలుస్తుంది. వైజ్ఞానిక పద్ధతులద్వారా, వినేవారికి రాజ

కీయప్రబోధం జరుగుతోందని తెలియకుండానే, రాజకీయాలు వినేవారి బుర్రల్లో ప్రవేశించుతాయి. ఈ వైజ్ఞానికకార్యక్రమం ద్వారా ప్రతికక్షుల పలుకుబడిలో ఉన్న ప్రజాసామాన్యాన్ని సులభంగా ఆకర్షించవచ్చు. అందుచేత పార్టీసభ్యులున్న ప్రతిగ్రామంలోనూ, ప్రతిపేటలోనూ వైజ్ఞానికదళాన్ని తర్ఫీదుచెయ్యాలి. కార్యకర్తలు అంతా సమిష్టిగానం తప్పక నేర్చుకోవాలి. దాదాపు అందరుకార్యకర్తలు ఈ వైజ్ఞానికదళంలో ఉండాలి.

ఉపన్యాసాలు

నేడు మనపార్టీ ఎంతో విస్తరించింది ఎన్నో బహిరంగసభలు, మహాసభలు పెడుతున్నాం. పూర్వంవలె ఏ కొద్దిమంది ఉపన్యాసకులో ఇప్పుడు చాలరు ప్రతి పార్టీసభ్యుడు ఉపన్యాసకుడుగా తయారుగావాలి. అప్పుడే మనపార్టీ చాలఎక్కువగా ప్రజాసామాన్యాన్ని కదపగలుగుతుంది.

పైగా మవపార్టీ ప్రచారకదళనుదాటి స్థానిక పోరాటాలు నడుపుతూ ప్రజలను సమీకరించేదశలోకి పోయింది. ప్రచారకదశలో పుస్తకాలను, పార్టీ రిపోర్టులను, పత్రికలను చదివి, వాటిలో ఉన్నదిఉన్నట్లుగా ఉపన్యాసాలుచెప్పే, 'ప్రొఫెషనలు' పార్టీఉపన్యాసకులు సరిపోయేవారు. స్థానికసమస్యలను తీసుకొని పనిచేస్తున్న ఈరోజుల్లో, వారు పనికిరారు. స్థానికసమస్యలలో పనిచేసి అనుభవంగడించిన కార్యకర్తే స్థానికఉదాహరణలతో ప్రజలకు చక్కనిమార్గం చూపించి, ఉద్రేకపరచగలరు. కనుక పార్టీలో ప్రొఫెషను ఉపన్యాసకులుండరు.

ఉపన్యాసధోరణి స్వభావసిద్ధంగా పుట్టుకతో వచ్చేదనీ, దానిని అలవరచుకోవడం సాధ్యంగాదనే అపోహ కొందరు కార్యకర్తలలోఉంది. తెలివితేటలు పుట్టుకతోవచ్చేవని దోపిడీవర్గంవారు చెప్పే బూటకపు కబుర్లవంటిదే పై అపోహగూడాను. ఉపన్యాసధోరణి అందరూ అలవరచుకోవచ్చును.

ఉపన్యాసం చెప్పబోయేముందు, ఎక్కడ బహిరంగసభ జరుగుతున్నదో, అచ్చటి స్థానిక పరిస్థితులను తెలుసుకోవాలి, తాను చెప్పబోయే విషయానికి స్థానికపరిస్థితుల కన్వయించి, అంటే స్థానికపరిస్థితులనుండి ఉదాహరణలను తీసుకొని నోట్సు వ్రాసుకోవాలి. ఎక్కువ విషయాలను తీసుకుని వినేవారిని గందరగోళ పెట్టగూడదు. ఒకే విషయంమీద వివిధ దృక్పథాలనుండి చెప్పాలి — చెప్పేవిషయాన్ని గూర్చిన పాయింట్లు ఒక క్రమపద్ధతిని, ఒక గొలుసువలె, ఉండాలి. ఒకచోట మొదలుపెట్టి మరొకచోటకు గంతులువేయరాదు. చెప్పేవిషయం ప్రజల కర్థమవుతున్నదీ, లేనిదీ, వారిమీద ఎట్టి ప్రభావం కలుగుతున్నదీ ముఖాలనుబట్టి గ్రహించుతూఉండాలి. తదనుగుణ్యంగా భాష, విషయ విపులీకరణను మార్చాలి. వారలను సంతోషపెట్టడానికి విషయాన్నే మార్చివేయరాదు. ఉపన్యాసం

చెబుతున్నపుడు ప్రజలు లేచిపోతుంటే పద్ధతులను మార్చి వారిని ఆకర్షించాలి. లేకపోతే ఉపన్యాసాల్ని ముగించాలి.

ఉపన్యాసకులను తర్ఫీదుచెయ్యాలి. అందుకు ముఖ్యమైన కార్యకర్తలు ఉపన్యాసం చెప్పబోయేవారితో చర్చించి నోట్సు వ్రాయించాలి. ముఖ్యకార్యకర్తలు వెళ్లి ప్రజలమధ్య గూర్చొని ఉపన్యాసం వినడం, ప్రజలు ఏమి అనుకుంటున్నారో వినడంచెయ్యాలి. ఇంకా కొంతమంది కార్యకర్తలను ప్రజలమధ్య అక్కడక్కడ కూర్చోబెట్టి ప్రజలువెలిబుచ్చే అభిప్రాయాలను జాగ్రత్తగా వినేలాచెయ్యాలి. అభిప్రాయాలు వెలిబుచ్చినవారి వయస్సు, వర్గం, మొదలైనవివరాలుగూడ తెలుసుకోవాలి, ఇవి తెలుసుకోవడంవల్ల ఏవర్గం, ఏవయస్సువారిమీద ఈ బహిరంగసభ ప్రభావం ఎలాఉందీ తెలుసుకోగలుగుతాం. బహిరంగసభ అయినతర్వాత ప్రజాభిప్రాయం గమనించడానికి నిర్ణయించబడిన కార్యకర్తలయొక్క రిపోర్టులు తీసుకొని, ముఖ్యకార్యకర్తలు ఉపన్యాసకునికి సూచనలియ్యాలి. ఈవిధంగా ఉపన్యాసకులను తర్ఫీదు చేయగల్గుతాం.

8. సెల్లు పనిచేసే విధం

జనరలుబాడీ మీటింగులు — సెల్లులు

మనపార్టీ రహస్య జీవితం గడుపుతున్న రోజుల్లో, పార్టీ పాలసీ కేంద్రకమిటీ నుండి రాష్ట్రకమిటీకి, దానినుండి జిల్లాకమిటీకి, తాలూకాకమిటీలున్నచోట్ల జిల్లాకమిటీల నుండి తాలూకా కమిటీలకు, వాటినుండి సెల్లులకు, వరుసగాచేరేది. ఈపద్ధతి ఆరోజుల్లో పార్టీ నిర్మాణాన్ని కాపాడటానికి ఉపయోగపడింది. కాని 1942 జూనులో పార్టీపై నిషేధం తొలగింపబడినతర్వాత, పైపద్ధతి అవసరం కాకపోగా, పార్టీ అభివృద్ధికే ఆటంకంగా తయారయింది. ఆపద్ధతివల్ల పార్టీ పాలసీ, కార్యక్రమం, సెల్లు వరకూ చేరడానికి చాల ఆలస్యమయ్యేది.

అందువల్ల 1943 ఫిబ్రవరిలో జరిగిన కేంద్రకమిటీ ప్లీనం సమావేశం, పార్టీ సభ్యుల జనరలుబాడీ మీటింగులను పార్టీనిర్మాణంలో ప్రవేశపెట్టింది. వీనివల్ల కార్యక్రమం జిల్లాకమిటీలనుండి నేరుగా పార్టీసభ్యులకు చేరుతుంది. మధ్య తాలూకాకమిటీలు గాని సెల్లులుగాని ఆటంకాలుగా ఉండవు. పార్టీసభ్యులు ఎక్కువగాఉన్న పట్టణాలలోనూ ఫిర్కాలలోనూ జనరలుబాడీ మీటింగులు ఏర్పరచవచ్చును. పార్టీ సభ్యులు తక్కువగా ఉన్నచోట్ల తాలూకాకు ఒక జనరలుబాడీ మీటింగు, లేక అవసరమైతే రెండు మూడు తాలూకాలకొకటిగాని, పరిస్థితుల ననుసరించి పెట్టవచ్చును. జనరలుబాడీ మీటింగు 'ఏరియాలను' నిర్ణయించడంలో, ప్రభుత్వ ఫిర్కా తాలూకా హద్దులను సాధ్యమయినంత వరకు పాటించవచ్చు. కాని ప్రధానంగా పార్టీ సభ్యులున్నచోట్లనుబట్టి, సమావేశమవడానికి వీలుగాఉండేలా వాటిని నిర్ణయించాలి.

జనరలుబాడీ మీటింగులలో అంతర్జాతీయ, జాతీయ, రాజకీయ సమస్యలను; ఆహార సమస్య, అధికోత్పత్తి మొదలైన సమస్యలనుగూర్చి ఒక పార్టీ ఆర్గనైజరు రిపోర్టు ఇస్తారు. దానిమీద వివిధసెల్లుల ప్రతినిధులు మాట్లాడతారు. చర్చజరుగుతుంది. చివరకు ఆ పట్టణం, ఫిర్కాలేక తాలూకా పరిస్థితులననుసరించి, జనరలుగా కార్యక్రమం, నినాదాలు నిర్ణయించబడతాయి. తర్వాత యీ జనరలు కార్యక్రమాన్ని ఆధారంగాచేసుకొని, సెల్లు మీటింగులో గ్రామానికి లేక పేటకు వివరమైన కార్యక్రమం వేసుకోవడం, సెల్లుసభ్యులందరికీ పని విభజన చేయడం జరుగుతుంది. జనరలుబాడీ మీటింగులలో, ఇదివరకు సెల్లులలో జరిగే కొంతపని, జరపబడుతోంది. ఇదివరకు సభ్యులకు రాజకీయపరిజ్ఞానం, ఆహారసమస్య, అధికోత్పత్తి, మొదలైన వాటినిగూర్చిన పరిజ్ఞానంగూడ సెల్లులోఇవ్వబడేది.

ఇప్పుడు ఇది జనరలుబాడీ మీటింగులలో ఇవ్వబడుతోంది. సెల్లులో వివరమైన కార్యక్రమం వేసుకోవడం, అదెంతవరకు పూర్తిఅయిందో తనిఖీచేసుకోవడం మాత్రమే జరుగుతోంది. ఈవిధంగా సెల్లుకు జనరలుబాడీ మీటింగుకు పని విభజన చేయబడింది. కనుక అవిరెండూ ఒకదానికొకటి తోడుగా ఉంటాయిగాని, ఒకదానిస్థానం మరొకటి ఆక్రమించదు. దీని అర్థం మరల జనరలుబాడీ మీటింగు జరిగేలోపల సెల్లులో రాజకీయాలు చర్చించరనికాదు. ఈ జనరలుబాడీ అయినపిదప సెల్లు మీటింగు కార్యక్రమాన్నిగూర్చే పైన చెప్పింది. జనరలుబాడీ మీటింగులు జరపాలిసిన పద్ధతినిగూర్చి రాష్ట్రకమిటీ నెం. 6, 10, 15, 14 సర్క్యులర్లలోని భాగాలు ఈక్రింద పొందుపరచబడుతున్నాయి.

కృష్ణాజిల్లాలో జులైనెలలో జరిగిన పార్టీజనరలుబాడీ సమావేశాలకు మొత్తం 1437 మందికి 79. మంది హాజరయారని జిల్లాకమిటీ రిపోర్టు ఇచ్చింది. ఈజిల్లాలోనే ఇంతకుపూర్వం జనరలుబాడీ సమావేశాల్లో 100 కి 75 మంది హాజరయ్యేవారు. ఈవిధంగానే మిగతాజిల్లాల్లో జనరలుబాడీ సమావేశాలకు చాలమంది హాజరగుటలేదు. జనరలుబాడీ మీటింగులంటే ప్రారంభంలోఉన్న శ్రద్ధ తగ్గుతోంది.

ఇందుకు రెండురకాలైన కారణాలున్నాయి. రాజకీయ కారణాలు; నిర్మాణ కారణాలు.

(1) జనరలుబాడీ మీటింగుల రాజకీయ ప్రాముఖ్యతను పార్టీసభ్యులు గ్రహించకపోవుట, పార్టీఆర్గనైజర్లు గ్రహింపజేయలేకపోవుట. పార్టీని, దేశాన్ని ఎదుర్కొన్న ప్రధానసమస్యలను (ఆహారసమస్య, కొయిలిషను మంత్రివర్గాలు వగైరా) వివరంగా తెలుసుకోకపోతే, వానినిగూర్చి రాజకీయ పరిజ్ఞానం సంపాదించకపోతే, తమంతటతాము తమగ్రామాల్లోను, పట్టణాలలోనూ వచ్చే దైనందిన సమస్యలను పరిష్కరించలేమని పార్టీసభ్యులు గ్రహించడ లేదు. అందువల్లనే బూర్జువా పార్టీలోవలెనే, నాయకులు ఆజ్ఞలు ఇస్తే మనం వాటిని అమలుజరుపుదాం, మనకు రాజకీయాలు అర్థంగావు, అనేభావమే మన పార్టీసభ్యులలో కొంతవరకుంది. వారిలో ఈభావాన్నిపోగొట్టాలి. ప్రతి పార్టీసభ్యుడు తన రాజకీయ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడంద్వారానే, తననెదుర్కొనే సమస్యలను చొరవతో పరిష్కరించగలడు. అప్పుడే పార్టీ తనమీద నేడున్న దేశభక్తిపూరితమైన బాధ్యతలను (జాతీయైక్యత, జాతీయప్రభుత్వం, ఆహారసమస్య) నెరవేర్చగలుగుతుంది.

మనపార్టీలో పాలసీని నిర్ణయించేవారు నాయకులు. అమలుజరిపేది సాధారణ సభ్యులు అనేది ఉండదు. ప్రతి పార్టీసభ్యుడు రాజకీయంగా ఆలోచించి పార్టీపంథాను నిర్ణయించడానికి తోడ్పడాలి.

1941 జూన్ 22 న నాజీ జర్మనీ సోవియటు యూనియన్‌మీద దాడిచేసినప్పుడు, మన కేంద్రనాయకత్వం బ్రిటిషు ప్రభుత్వాన్ని విప్లవంద్వారా పడగొట్టడానికి ప్రయత్నం చేయడంద్వారానే సోవియట్‌కు సహాయం చేయగలుగుతామనే' నినాదమిచ్చింది. అప్పుడు

ఈ నినాదంతో ప్రజలను ఒప్పించలేకపోతున్నామని, ఈ నినాదంలో లోటుందని కేంద్రీ నాయకత్వానికి చెప్పకపోవుటవలననే. ఆరునెలలు పార్టీ తప్పుడుత్రోవను పోవటం జరిగింది. ప్రతి పార్టీసభ్యుడు రాజకీయపరిజ్ఞానం సంపాదించాలి. అందుకు జనరలుబాడీ మీటింగులు ఒక ప్రధానఅవకాశం, వీటిలో సంపాదించిన విజ్ఞానంతో స్వయంగా పుస్తకాలు చదువుకోవచ్చును.

(2) జనరల్‌బాడీ మీటింగులలో మొదటఉన్న శ్రద్ధగూడ తగ్గడానికి కారణం, రాజకీయ రిపోర్టుయిచ్చే కామ్రేడ్ సభ్యుల కర్థమయ్యేరీతిని మాట్లాడకపోవడమే. రాజకీయ రిపోర్టునిచ్చే కామ్రేడు ఆయా తాలూకా, ఫిర్కాపరిస్థితులకు పార్టీయొక్క జనరల్ నినాదాలను అన్వయించి, సభ్యులు తమ స్వానుభవాన్నిబట్టి పార్టీ రాజకీయ నినాదాలను అర్థం చేసుకొనేటట్లు చేయడంలేదు. జనరల్ నినాదాలు పైనుంచివచ్చినవి వచ్చినట్లుగా వివరించడం జరుగుతోంది, పంచమాంగదళం, మితవాదులు, జస్టిసుపార్టీవాళ్లు మొదలైన రాజకీయ గ్రూపులనుగూర్చి చెప్పేటప్పుడు ఆ తాలూకాలలో ఎవరు ఈముఠాలకు చెందుతారో, వారు యేయే నినాదాలు తీసుకొంటున్నారో చెప్పాలి. ఆహారకరువును గురించి చెప్పేటప్పుడు ఆ తాలూకాలో ఏరూపంలో ఉందో ఆ తాలూకా ఉదాహరణలు తీసుకుచెప్పాలి.

అంతేగాక సాధారణసభ్యులకు ముఖ్య నినాదాలను అనేక ఉదాహరణలతో వివరించి, ఇవి వారి మనస్సులో నాటుకొనేటట్లుచెయ్యాలి. రాజకీయస్థాయిఉన్న కామ్రేడ్స్‌కు చెప్పినట్లుగా మరీ వివరాలలోకిపోయి (Hair splitting) సాధారణసభ్యులను చికాకు పరచగూడదు.

ఇంగ్లీషుపదాలు సాధ్యమైనంతవరకు వాడగూడదు. తీవ్ర జాతీయవాదం, జాతీయైక్యత మొదలైన పడికట్టుపదాలు వాడినప్పుడు వాటిని విపులీకరించి చెప్పాలి.

(3) ఇంక జనరల్‌బాడీ మీటింగులను ఆర్గనైజుచెయ్యడంలో జరుగుతున్న నిర్మాణ లోపాలనుగూర్చి ఆలోచించుదాం.

జనరల్‌బాడీ మీటింగు తేదీకి 10, 12 రోజులుముందుగా సెల్లులకు తెలియపర్చుట లేదు. కొన్నిసెల్లులకు మీటింగురోజున తెలియడం, కొన్నిటికి మీటింగు అయినతరువాత తెలియడంగూడా జరుగుతోంది. ఉత్తరాలద్వారాగాకుండా నోటితో కబురుపంపడంవల్ల గూడా జరిగేటైము, చోటు సరిగా తెలియడంలేదు. జనరలుబాడీ మీటింగుకు పార్టీ సెంటరునుండి నేరుగా ప్రతిసెల్లుకు కబురు పంపడంలేదు. సెంటరు ఒకసెల్లుకు కబురంపడం, ఆసెల్లు మరొకసెల్లుకు ఈవిధంగా ఉండుటవల్లగూడ ఆలస్యమవుతోంది. కొన్నిచోట్ల పార్టీసభ్యుడుగాని గ్రామ పెద్దమనిషి సొంతపనిమీదవస్తే కబురంపడం, అతను మరచి పోవడంగాని, సరిగా చెప్పలేకపోవడంగాని జరుగుతోంది.

కామ్రేడ్స్ !

మన పార్టీ ఇప్పుడు ప్రజాపార్టీ అవుతోంది. అత్యధికసంఖ్యాకులు తమ సొంత పనులు చూచుకుంటూ పార్టీపనులు చేస్తారు. కనుక 10, 12 రోజులు ముందుగా ప్రతి సభ్యునికి తెలియజేస్తే, ఆరోజుకు పనులు లేకుండా సర్దుకోగలుగుతాడు. అంతేగాక పార్టీ కేంద్రం సూటిగా ప్రతి సెల్లుకు కొరియర్లను పంపాలి. ఈపనికి ఒకరిద్దరిని ప్రత్యేకంగా నియమించాలి. తేదీ, టైము, చోటు, ఎజెండా, ఇతరసలహాలతోగూడిన మీటింగు నోటీసును ప్రతిసెల్లుకు ఈ కొరియర్లద్వారా పంపాలి. చర్చించబడే అంశాలేమిటో, తాము ఏవిధంగా రిపోర్టులు ఇవ్వాలో తయారయి రాకపోతే, మీటింగు పురాణకాలక్షేపం అవుతుంది.

(4) మనపార్టీలో నానాటికి వ్యవసాయ కూలీలసంఖ్య ఎక్కువవుతోంది. వీరికి ఏరోజు కూలిచేస్తే ఆరోజు డొక్కనిండుతుంది. వీరిని కూలిపని మానుకొని, జనరలుబాడీ మీటింగుకు రమ్మంటే, ఆరోజు అతనిపోషణ, కుటుంబపోషణసంగతి చూడాలి. ఈసమస్యను పరిష్కరించలేకపోవుటవలననే చాలామంది వ్యవసాయకూలీ కామ్రేడ్స్ హాజరు కాలేకపోతున్నారు. కుటుంబపోషణ ఏదోరకంగా జరిగినా, ఖర్చులుభరించుకోలేక కొంత మంది బీదకామ్రేడ్స్‌గూడా హాజరుకావడంలేదు. వ్యవసాయకూలీ కామ్రేడ్స్‌కు ఇటువంటి బీదకామ్రేడ్స్‌కు, ఉచితభోజనాలు ఏర్పాటుచెయ్యాలి. వ్యవసాయకూలీ కామ్రేడ్స్, కుటుంబాలకు ఆరోజు పోషణకు, గ్రామసెల్లు లేక తాలూకాకమిటీ బాధ్యతవహించాలి.

(5) గ్రామాల్లో భోజనాలు ఏర్పాటుచేయడం కష్టమనీ, ఖర్చు ఎక్కువ అవుతుందనీ, జనరల్‌బాడీ మీటింగులు పట్టణాలలో వేయడం జరుగుతోంది. అందువల్ల ఖర్చు ఎక్కువ అవడమేగాక, సభ్యుల ఆరోగ్యాలుగూడ చెడుతున్నాయి. తెచ్చుకున్న డబ్బు కాస్త అయిపోయిన తరువాత, జనరల్‌బాడీ మీటింగు సాంతం అవకుండానే కొంతమంది వెళ్లిపోవడంగూడా జరుగుతోంది.

కామ్రేడ్స్ !

పెళ్లిళ్ల భోజనాలవలె అన్నం, నెయ్యి, పప్పు, కూర, పులుసు, పచ్చడి, మజ్జిగ అన్నీ పెట్టడం కష్టం. ఖర్చులెక్కువగూడాను. భోజనం పెట్టడం అంటే పై బూర్జువా భావాన్ని కామ్రేడ్లు వదులుకోవాలి. మనది ప్రజాపార్టీ. ఆరోగ్యకరమైన, బలమైన, సాధారణమైన భోజనముంటే చాలు.

ముడి బియ్యపు అన్నం, పప్పు పులుసు (పప్పు, కూరముక్కలు) పచ్చడి, మజ్జిగ ఉంటే చాలు. ఈ భోజనం పూటకు 0-2-0, 0-2-6 లో పెట్టవచ్చు. గ్రామాల్లో వెసుకుంటే కూరలు, మజ్జిగ ఊరికినేదొరుకుతవి. ప్రజాసహాయంగూడ వస్తుంది.

(6) జనరల్‌బాడీ సమావేశం తాలూకా, ఫిర్కాకు ఒకమూలగాకాకుండా, దాదాపు సెంటరులో వేస్తే అందరికి రావడానికి వీలుగావుంటుంది.

(7) కమ్యూనిస్టు ఉద్యమానికి మూలపురుషులైన మార్క్స్, ఎంగెల్సు, లెనిన్. మననాయకులైన స్టాలిన్, జోషీ, డిమిట్రాఫ్, జాతీయనాయకులైన గాంధీ, జవ్హారిలాల్ జిన్నా, అజాద్ మొదలైనవారి చిత్రాలతో జనరలుబాడీ మీటింగుహాలును అలంకరించాలి. దొరికితే ఇతరదేశాల కమ్యూనిస్టు నాయకులైన పామీదత్తు, పొలిట్, బ్రౌడర్, థోరే, ధాల్‌మన్ మొదలైనవారి ఫొటోలనుగూడ సంపాదించాలి. ఇటువంటి మహాపురుషులను చూడడంవల్ల పార్టీసభ్యులలో ఒకరకమైన ఉత్సాహము, కార్యశూరత ఏర్పడుతుంది.

ఈ ఫొటోలేగాక, మధ్యన ఎర్రజెండాను ఇరుప్రక్కల కాంగ్రెసు ముస్లిమ్‌లీగు జండాలను ప్లాట్‌ఫారం వెనుకభాగానపెట్టాలి. హాలుబయట, ఊరేగింపులలోనూ, మీటింగులలోనూ ఎర్రజండామాత్రమే పెట్టాలి. కాంగ్రెసు జండాను ప్రభుత్వం నిషేధించింది, అందువల్ల కాంగ్రెసుజండాను పెట్టడానికి వీలులేదు. కాంగ్రెసుజండాను పెట్టకుండా ముస్లిమ్‌లీగు జండాను పెట్టడంవల్ల ప్రజల్లో అపోహలు ప్రబలుతాయి. అందువల్ల ఆరెండు జండాలను ఊరేగింపులు, మీటింగులు వగైరాలలో పెట్టగూడదు.

జనరలుబాడీ మీటింగు - వివిధరంగాల సభ్యులసమావేశాలు

కృష్ణాజిల్లాలో జనరలుబాడీ మీటింగు అయినతరువాత, వివిధరంగాలకు చెందిన వర్కర్ల సమావేశాలు వేరువేరుగా జరుపబడుతున్నాయి. ఈ పద్ధతి చాల ఉపయోగకరముగావుంది. జనరలుబాడీ మీటింగుల్లో, క్రిందటి జనరలుబాడీ మీటింగుకు-జరుగుతున్న దానికి మధ్యకాలంలో జరిగినపనిని, రాజకీయఘటనలను గూర్చిన రిపోర్టు ఇయ్యబడుతుంది. దీనిమీద వివిధసెల్లుల ప్రతినిధులు మాట్లాడుతారు. ముందుకార్యక్రమం, కోటాలు వివిధసెల్లులకు పంచబడుతాయి. ఈ కోటాలను సెల్లులు తమతమ గ్రామాలలో ఎట్లా అమలుజరపాలని సెల్లుసమావేశాలు ఆలోచిస్తాయి. సామాన్యంగా నిర్మాణవిషయాలన్నీ సెల్లులలోనూ, కమిటీలలోనే ఆలోచించబడతాయి. ఒక నిర్మాణసమస్య తాలూకాసమస్య అయినప్పుడుమాత్రమే జనరల్‌బాడీ మీటింగులలో చర్చింపబడుతుంది.

వివిధరంగాల మీటింగులలో ఆయా రంగంలో జరిగిన పనినిగూర్చి ముఖ్యులు రిపోర్టు ఇస్తారు. పనిలో లోటుపాట్లను చర్చించుకొని ముందుకార్యక్రమం వేసుకుంటారు. దీనివల్ల లోటుపాట్లను వెంటనే తెలుసుకోవటానికి, ఒకచోట అనుభవాన్ని మరొకచోట త్వరగా ఉపయోగించడానికి చక్కని అవకాశం వస్తోంది. కనుక ఈపద్ధతిని మిగతా జిల్లాకమిటీలుగూడ తమతమ జిల్లాలలో ప్రవేశపెట్టాలి,

పార్టీ జనరల్‌బాడీ మీటింగులు : వీటినిగూర్చి పార్టీలెటరు నెం. 8 లో వ్రాయబడింది. పార్టీసభ్యులందరూ జనరల్‌బాడీ మీటింగులకు హాజరు అయ్యేటట్లు చేయడానికి ముఖ్యమైన సూచన లివ్వబడ్డాయి. సెప్టెంబరునెల జనరల్‌బాడీ మీటింగులకు నూటికి

నూరుమంది హాజరుకాకపోయినా అంతక్రితం జనరల్‌బాడీ మీటింగులకన్నా హెచ్చుమంది హాజరు అయ్యారు.

జనరల్‌బాడీ మీటింగులకు పార్టీసభ్యులందరూ హాజరుకావడమే గాక, వాటినుండి రాజకీయ పరిజ్ఞానాన్ని పూర్తిగా పార్టీసభ్యులు పొందినప్పుడే జనరల్‌బాడీ సమావేశాల ప్రయోజనముంటుంది. ప్రతి పార్టీసభ్యుడు తన రాజకీయపరిజ్ఞానాన్ని అభివృద్ధి గావించుకోడానికి, ప్రస్తుత రాజకీయ నినాదాలను స్పష్టంగా అర్థం జేసుకోడానికి జనరల్‌బాడీ మీటింగులు ఒక సాధనం. అందుచేత పార్టీసభ్యులు నానాటికి రాజకీయ పరిజ్ఞానం పొందుతూ వుండేది జనరల్‌బాడీ మీటింగులు జయప్రదంగాను, ప్రయోజనకరముగాను జరుపబడే దానిపై ఆధారపడివుంది. పార్టీ ఆర్గనైజరులు యీ ముఖ్యవిషయాన్ని గ్రహించి జనరల్‌బాడీ మీటింగులను పార్టీ సభ్యులకు అత్యంత ప్రయోజనకారిగా వుండేటట్లు జరపాలి.

కాని ఇప్పుడు జరిగేదేమిటి? పార్టీసభ్యులు జనరల్‌బాడీ సమావేశాలంటే హెచ్చు శ్రద్ధ చూపెట్టడంలేదు. హాజరైన వాళ్ళుగూడ యెప్పుడు యింటికి వెళ్ళిపోదామనే ఆతురతతో వుంటూవుండడం జరుగుతోంది కారణం పార్టీసభ్యులకు విసుగుపుట్టేరీతిని సమావేశాలు జరుపడం; విశ్రాంతిలేకుండా 7, 8 గంటలు సమావేశాలు జరుపడంవలన అదివరకు యిట్టి సమావేశాలకు అలవాటుపడని వారందరూ విసుగుజెంది యెప్పుడు సమావేశం ముగుస్తుందా అని కనిపెట్టుకొని కూర్చోవడం జరుగుతోంది. అంతేగాకుండా రాజకీయ రిపోర్టు యిచ్చే కామ్రేడ్ సభ్యులకు అందరికి అర్థమయ్యేరీతిని మాట్లాడకపోవడం తరుచుగా జరుగుతోంది. స్థానికపరిస్థితులకు పార్టీ జనరల్ నినాదాలను అన్వయింపజేసి పార్టీసభ్యుల స్థాయినిబట్టి వారి కర్థమయ్యేటట్లు రిపోర్టు యివ్వడంలేదు. జనరల్ నినాదాలు పైనుంచి వచ్చినవి వచ్చినట్లుగా వివరించడం జరుగుతోంది. పంచమాంగదళాన్ని గూర్చి చెప్పేటప్పుడు స్థానిక ఉదాహణలిచ్చి విశదపర్చడమనేది వుండడంలేదు. అస్పష్టంగా సెంటరు నినాదాలే తీసుకొని తిరిగి వల్లించడం జరుగుతోంది. ఆహారకరువును గూర్చి చెప్పేటప్పుడుగూడ స్థానిక పరిస్థితుల కన్వయింపజేసి అచ్చట యే రూపంలో కరువు వుంది, యెలా పరిష్కరించవలసింది, ముందు వెనుక చేయవలసిన పనులేవి - వగైరా స్థానిక సమస్యలగూర్చి చర్చించడం జరుగకుండా ఆహారసమస్య జనరల్ నినాదాలను అప్పజెప్పడం జరుగుతోంది. ఈవిధముగా రాజకీయ రిపోర్టింగు కూడ చాలమంది పార్టీ సభ్యులకు ఉత్తేజాన్ని యిచ్చి తమ స్థానికసమస్యలను పరిష్కరింవగల నూతన చైతన్యం రాజకీయ పరిజ్ఞానం యివ్వడానికి బదులు వారికి విసుగుపుట్టించేటట్లు వుంటోంది.

ఈ పరిస్థితులను మార్చందే జనరల్‌బాడీ సమావేశాలకు నూటికి నూరుమంది హాజరు అవడముగాని, హాజరైనవారికి రాజకీయంగా అవి ప్రయోజనకరంగా వుండడంగాని సంభవంగాదు. ఇందుకు తక్షణమే జిల్లాకమిటీలు యీ క్రింది చర్యలు తీసుకోవాలి.

రిపోర్టింగు స్థానికపరిస్థితుల కన్వయింపజేసి యివ్వాలి

(1) జనరల్‌బాడీ సమావేశాల్లో పార్టీ ఆర్గనైజర్లు యిచ్చే రాజకీయ రిపోర్టింగులో పైనుంచి వచ్చిన జనరల్ నినాదాలను వల్లించడమును వెంటనే మాన్పించాలి. స్థానిక పరిస్థితులకు జనరల్ నినాదాలను అన్వయింపజేసి సభ్యులకు అర్థమయ్యేరీతిని రిపోర్టింగు యివ్వాలి. ఇందుకు జనరలుబాడీ సమావేశాలకు ఒకరోజు ముందే తాలూకా కమిటీనిగాని అదిలేనిచోట్ల తాలూకా ఆర్గనైజర్లనుగాని ఆ సమావేశాలకు వెళ్ళే జిల్లా ప్రతినిధి సమావేశపర్చి మరుసటిరోజు జనరలుబాడీ మీటింగులో పార్టీ జనరల్ నినాదాలను ఆ ప్రాంత పరిస్థితులకు యెలా అన్వయింపజేయాల్సిందీ చర్చించాలి. విపులంగా ప్రతిరంగాన్ని తీసుకొని ఆ రంగానికి సంబంధించిన పార్టీ నినాదాలను యెలా అన్వయింప జేయవలసిందీ రిపోర్టునోట్సు తయారుచేయాలి స్థానిక వుదాహరణలు హెచ్చుగా యివ్వాలి. ఇలా ముందుగా తాలూకా కమిటీ సభ్యులతోను, ఆర్గనైజర్లతోను జిల్లాప్రతినిధి చర్చించి, నోట్సు తీసుకుంటే చాలవరకు జనరల్ నినాదాలను స్థానిక పరిస్థితులకు అన్వయింపజేసి పార్టీసభ్యులకు అర్థమయ్యేటట్లు రిపోర్టింగు యివ్వగలుగుతాడు.

జనరల్‌బాడీ సమావేశాలకు జిల్లా ప్రతినిధులు వెళ్ళేటప్పుడు ముందుగా జిల్లాకమిటీ సభ్యులు, ఆర్గనైజర్లు కలుసుకొని పార్టీ జనరల్‌బాడీ నినాదాలను జిల్లాఅంతటకు జనరల్‌గా యెలా అన్వయింపజేయాల్సింది గూడ చర్చించాలి. అంతేగాకుండా జిల్లా ప్రతినిధుల కందరకు వారువెళ్ళే ప్రాంతాల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆ ప్రాంతంలో పార్టీ జనరల్ వినాదాలు యెలా అన్వయింపజేసి చెప్పాల్సిందీ గూడ వివరాలు జనరల్‌బాడీ సమావేశాలకు వెళ్ళే ప్రతినిధి చర్చించి, నోట్సు తయారుచేయాలి. వారి వారి శక్తిసామర్థ్యాల ననుసరించి పనిజేస్తారులే అని వ్యక్తులకే ఆ వివరాలు తయారుచేసుకోడాన్ని వదలివేయరాదు. మొదట సరియైన ఇన్‌స్ట్రక్షన్సు యివ్వకుండా తరువాత ఆత్మవిమర్శ చేసుకోవడం మొదలుపెడితే దానివలన యెవరికీ ప్రయోజనముండదు. అందుచేత ప్రథమములో జిల్లాకమిటీ, తరువాత తాలూకా కమిటీలు సమావేశమై రిపోర్టింగును యెలా స్థానికపరిస్థితుల కన్వయింపజేసి ఇవ్వాలో ముందుగానే వివరాలుగూర్చి చర్చించి రిపోర్టు నోట్సు తయారుచేయాలి.

అంతేగాదు; జిల్లా ప్రతినిధులు మాత్రమే రాజకీయ రిపోర్టింగు యిస్తూవుండడం యింతవరకూ జరుగుతోంది. దీనివలన తాలూకాకమిటీ సభ్యులుగాని, ఆర్గనైజర్లుగాని రాజకీయ రిపోర్టింగు యివ్వడానికి తర్ఫీదు చేయబడడంలేదు. అందువలన తాలూకా ఆర్గనైజర్ల రాజకీయస్థాయి, పరిజ్ఞానం అభివృద్ధి పొందడానికి అవకాశం లేకుండా పోతోంది. జిల్లాకమిటీ సభ్యులకు జనరల్‌బాడీ సమావేశాలతో చాలకాలము వ్యయమైపోయి, జిల్లా కమిటీ తదితర బాధ్యతలు వెనుకబడిపోతున్నాయి. ఇకముందు యీ పద్ధతిగూడ మార్చాలి.

జిల్లా ప్రతినిధి జనరల్‌బాడీ మీటింగులకు హాజరు అవ్వాలిగాని, రాజకీయ రిపోర్టింగు తాలూకా కమిటీ శెక్రటరీచేతనో, ఆర్గనైజరుచేతనో యిప్పించాలి; ఏవైనా ముఖ్యవిషయాలు లోపించితే ఆఖరుకు వాటిని విశదపర్చుతూ ఒక అరగంట జిల్లాప్రతినిధి ముగింపు ఉపన్యాసం యివ్వవచ్చును.

జనరల్‌బాడీ సమావేశాలు జరిపే విధానం

జనరల్‌బాడీ సమావేశాలు జరిపే ప్రస్తుతపద్ధతే మార్చాలి. పగలు ఒంటిగంటకో, రెండుగంటలకో ప్రారంభించి విడవకుండా రాత్రి 7, 8 గంటలవరకూ సమావేశాలు జరపడం చాల విసుగుపుట్టిస్తోంది. మొత్తం సమావేశం 6 గంటలకన్నా హెచ్చుకాలం వుండరాదు. అదీగూడా విశ్రాంతికాలం లేకుండా విడవకుండా వుంటే చెప్పేది అర్థంచేసుకోవడం కష్టమౌతుంది. అందుచేత యే సమావేశం 3 గంటలకన్నా హెచ్చకుండా, మొత్తం సమావేశాన్ని రెండు పర్యాయాలు జరపాలి. ఉదయం 3 గంటలు, సాయంకాలం మూడుగంటలు - రెండు పర్యాయములు సమావేశమైతే అంత కష్టంవుండదు. ఎందుచేతనంటే ఒకే పర్యాయం 3 గంటల కాలానికన్నా ఎక్కువసేపు మనస్సును కేంద్రీకరించ నవసరంలేదు.

జనరల్‌బాడీ సమావేశం జరిపే ప్రదేశం యెటుచూచినా 5 లేక 6 మైళ్ళకన్నా హెచ్చుదూరం వుండకుండా వుండే కేంద్రప్రదేశంగా వుండాలి; అలా వున్నప్పుడు రాత్రి భోజనంగావించి మరుసటిదినం సమావేశానికి వుదయానికే పార్టీసభ్యులు అందరూ హాజరుగావచ్చును. స్త్రీలువుంటే రాత్రికే వచ్చేయేర్పాట్లు చేయవచ్చును. అలాచేస్తే ఉదయం 8 గంటలకు ప్రథమసమావేశం జరుపవచ్చును. వుదయం సమావేశంలో రాజకీయ రిపోర్టింగు మాత్రమే వుంటుంది. రాజకీయ రిపోర్టింగు యే పరిస్థితులలోను 3 గంటల కన్నా హెచ్చుకాలం తీసుకోరాదు. భోజనం అయిన తరువాత మధ్యాహ్నం రెండుగంటలవరకు పార్టీసభ్యులకు విశ్రాంతి యిస్తే మధ్యాహ్నం సమావేశానికి బాగా కేంద్రీకరించి వినగల్గుతారు. మధ్యాహ్నం సమావేశం 2-4 గంటలకు ఒకటి, 4-6 వరకు మరొక సమావేశం జరపాలి. మధ్యాహ్నం మొదటి సమావేశంలో సెల్ సెక్రటరీల రిపోర్టులు, జిల్లా ప్రతినిధి ముగింపు వుపన్యాసం వుంటుంది. రెండవ సమావేశం పార్టీ సభ్యులందరికీ వుండ నవసరంలేదు.

బాగా చురుకుగా పనిచేసే పార్టీసభ్యులందరూ ఫ్రంటులవారిగా సమావేశం గావాలి. ప్రతి సమావేశానికి తాలూకా ఆర్గనైజరో లేక తాలూకా కమిటీ సభ్యుడో హాజరై స్థానిక సమస్యలను ఆ రంగానికి సంబంధించినంతవరకు చర్చించాలి. జనరల్‌బాడీలో యిచ్చిన పార్టీ జనరల్ నినాదాలను ఆయా రంగాలకు ప్రాంతాలను బట్టి యెలా అన్వయింపజేయాలో ఒక స్పష్టమైన కార్యక్రమం వేసుకోవాలి. ఈ ఫ్రంటువారీ సమావేశాలు యెలా జరుపాలో పార్టీలెటరు నెం. 6 రులో యివ్వబడింది.

జనరల్‌బాడీ సమావేశానంతరం తప్పక బహిరంగసభ, వైజ్ఞానిక ప్రదర్శనాలు వుండాలి.

జనరల్‌బాడీ సమావేశాలు జరిగిన తరువాత బహిరంగసభలు చాల ప్రదేశాల్లో పెట్టడంలేదు; కొద్ది ప్రదేశాల్లోమాత్రం వైజ్ఞానిక ప్రదర్శనాలు జరుగుచున్నాయి. జనరల్‌బాడీ సమావేశానంతరం తప్పక ప్రజలు బహిరంగసభ పెడతారని ఆశించుతారు: అలా పెట్టకపోవడమంటే ప్రజలకు సంబంధంలేకుండా గూడుపుఠాణి సమావేశాలు గావించడమన్నమాట; ప్రజలకు మన పాలసీగూర్చి చెప్పడానికి నిరాకరించడమన్నమాట. ప్రజల నిత్యజీవితంతో సంబంధంలేని యే వేదాంతులకో ప్రజలతో సంబంధం లేకుండా రహస్య మందిరాల్లో గుసగుసలాడడం, వినులారగించడం తగుతుంది గాని ప్రజలతో నిత్యసంబంధమున్న మనపార్టీ అలా చేయడమంటే పార్టీని ప్రజలకు దూరంగా వుంచడమౌతుంది; ఒక చిన్న ముఠాగామాత్రం తయారు చేయడమౌతుంది. అందుచేత ప్రతి జనరల్‌బాడీ మీటింగు అనంతరం తప్పక బహిరంగసభను పెట్టాలి. పార్టీ పాలసీని ప్రజలకు అర్థమయ్యే సులభశైలిలో క్లుప్తంగా విశదపర్చాలి. ఒక గంటలో సభముగించి తరువాత వైజ్ఞానిక ప్రదర్శనాలు రెండు మూడు చూపెట్టాలి. ఈవిధంగా ప్రతి జనరల్‌బాడీ మీటింగుకు జరిగేటట్లు ముందుగానే యేర్పాట్లు స్థానికపార్టీ చేయాలి.

పై సూచనల ననుసరించి. పార్టీలెటరు నెం. 6 రులో ఇచ్చిన సూచనల ననుసరించి యికముందు జనరల్‌బాడీ సమావేశాలు జరిపితే తప్పక అవి పార్టీసభ్యులకు యెంతో రాజకీయంగా ప్రయోజనముంటుంది; పార్టీసభ్యులందరూ అవంటే వుత్సాహాన్ని చూపెట్టి తప్పక హాజరు అవుతారు; యెంతో అభివృద్ధిపొందుతారు.

మన జనరలుబాడీ సమావేశాలు పార్టీపనికి ఎంతో తోడ్పడుతున్నాయి. ప్రతినెలా పార్టీసభ్యులు సమావేశంకావడం, తాము గావించిన పనినిగురించి రిపోర్టుఇవ్వడం. తిరిగి వచ్చే సమావేశంలోపల తమ కార్యక్రమాన్ని కోటాలుగ తీసుకోవడం జరుగుతున్నాయి. దీనివల్ల పార్టీసభ్యులలో ఒక సన్నిహితసంబంధం ఏర్పడుతూఉంది. తామంతా ఒక విప్లవ సంస్థకు చెందిన సైనికులమని, ఒకే కమ్యూనిస్టు కుటుంబంలోని సోదరులమనే చైతన్యం కల్గుతూఉంది. దీనినే ఇంగ్లీషులో "ఎస్ప్రిరిడీకోర్" అంటారు.

గత సమావేశానికి, ఈ సమావేశానికిమధ్య ప్రపంచ పరిస్థితులలోనూ, దేశపరిస్థితులలోను జరిగిన మార్పులను. ఘటనలనుగూర్చి రాజకీయ రిపోర్టు ఇవ్వబడుతుంది. ఈ మార్పులు మనజిల్లాలో. మన తాలూకాలో. మన ఫిర్కాలో మనం పనిచేసేటప్పుడు ఏరకంగా ప్రజలకు చెప్పాలి? ఘటనలనుగూర్చి, ప్రజలు ఏమనుకుంటున్నారు? ఇతర రాజకీయపార్టీ లేమనుకుంటున్నాయి? ఈప్రజల సందేహాలకు, ఇతరపార్టీలువేసే ప్రశ్నలకు, ప్రచారానికి, ఏరీతిగా జవాబుచెప్పాలో అగ్రనైజస్లు విశదంగా తెలియజేయడానికి

ప్రయత్నిస్తున్నారు. జనరలుబాడీ సమావేశాలు, ఈరీతిగ మన పార్టీసభ్యులకు దేశీయ అంతర్జాతీయ ఘటనలనుగూర్చి విశదపర్చడమేగాక, ప్రజలమధ్య ప్రచారం చేయడానికి, ప్రజల అనుమానాలు పోగొట్టడానికి పార్టీసభ్యులను తరిఫీదు చేస్తున్నాయి.

జనరలుబాడీ సమావేశాలలో తాముచేసిన పనినిగూర్చి రిపోర్టు ఇవ్వాలసిఉంటుంది. కొబట్టి ఏమీచేయలేదని చెప్పడానికి ఏకామ్రేడ్ సిగ్గుపడకుండా వుండగలడు? అందుచే తప్పక పనిచేయాలని, తమసెల్లులు మిగిలిన సెల్లులకన్నా వెనుకబడి యుండకూడదని కార్యదీక్షకూడ హెచ్చుఅగుతూ ఉంది.

సానుభూతిపరులు. ఈ సమావేశాలకు హాజరుకావడంవల్ల, రాజకీయంగ అభివృద్ధి చెందడమేగాక, మనపార్టీ ఎంత ఎక్కువగా ప్రజాతంత్ర సిద్ధాంతాల ననుసరించి పనిచేస్తూ ఉందీ; ప్రజలకోసం ఎలా పనిచేస్తూఉందీ తెలిసికొనుచున్నారు. పార్టీకి మరింత దగ్గరికి వస్తున్నారు. అయితే గ్రామాలలో ఈ సమావేశాలు జరిగినపుడు, చాలమంది గ్రామ ప్రజలు మన కనుకూలురు, మనకు వ్యతిరేకులు కానివారుకూడరావడం, వారిని రావద్దంటే వారిలో రియాక్షన్‌రావడంకూడ జరుగుతూఉంది. మన వ్యతిరేకులను రానివ్వం. ఇతరులకు ఈసమావేశం కమ్యూనిస్టుపార్టీలో చేరినవారికి, చేరి పనిచేయడానికి తయారవుతున్న వారికి మాత్రమే అని ముందుగా చెప్పాలి. అటువంటివారినే పిలుస్తున్నామని, వారు మాత్రమే వస్తారని చెప్పాలి.

కొన్నిస్థలాలలో మన కామ్రేడ్సు ప్రజలందరివద్దనుండి ఈ సమావేశాలకోసం డబ్బు వసూలుచేస్తున్నారు. అలా చేసినప్పుడు డబ్బు ఇచ్చినవారందరూ, మమ్మలమాత్రం ఎందుకు రానివ్వరని అడుగుతున్నారు. ఇకముందు జనరలుబాడీ సమావేశాలు జరిపే స్థలంలో ప్రజలందరివద్దనుండి వసూలుచేయకూడదు. స్థానిక పార్టీసభ్యులనుండి, సానుభూతి పరులనుండి, జనరలుబాడీ సమావేశానికి వచ్చేసభ్యులనుండి వసూలుచేయాలి. అప్పటికి డబ్బు సరిపోకుంటే పైకమిటీలు, పార్టీఖర్చులక్రింద ఆమొత్తాన్ని ఖర్చుపెట్టాలి.

జనరలుబాడీ సమావేశాలు మరింత ఉపయోగకరంగా ఉండడానికి మునుపటి సూచనలేగాక ఈ క్రింది సూచనలు అమలుపెట్టాలి.

పాటలు, కల్చరల్ స్క్వాడ్సు

కృష్ణాజిల్లాలో మేమువెళ్ళిన ఏ జనరలుబాడీ మీటింగులోను, పార్టీసభ్యులంతా సమిష్టిగా కొన్ని ముఖ్యమైనపాటలుకూడ పాడుటలేదు. ప్రతి పార్టీసభ్యుడు "ఎగురవేయ్ ఎర్రజెండా" పాటను, "అంతర్జాతీయ గేయాన్ని" కనీసం ఈ రెంటినైనా నేర్చుకోవాలి. ఈ పాటలు సమావేశానికిముందు, ఆఖరున సమిష్టిగాపాడాలి, పార్టీసభ్యులలోను, వచ్చిన సానుభూతిపరులలోను చక్కని ఉత్సాహం కలిగిస్తుంది.

విజ్ఞాన ప్రచారకదళాలు, కృష్ణాలో ప్రతి తాలూకాలోనులేవు. జిల్లాదళం, తాలూకా దళాలను, అదేపనిగా పెట్టుకొనేవారితో ఏర్పరచాలి. అలా ఏర్పడి వచ్చే కొత్తపాటలను నేర్చుకుంటూ, ఫిర్కాదళాలను, వాటిద్వారా ఆపిమ్మట సెల్లు సభ్యులకుకూడ మనం పాటలు, బుర్రకథలు నేర్పగలం. రాత్రి బహిరంగసభలకు, విజ్ఞాన ప్రచారకదళాలు, చాల ఉపయోగకరం. పార్టీ ప్రచారానికికూడ చాలముఖ్యం.

జనరలుబాడీ సమావేశాలలోగాని, రాత్రి బహిరంగసభలలోగాని క్రొత్తగా వచ్చిన పాటలన్నీ విజ్ఞాన ప్రచారకదళం పాడితే ప్రజలకు, పార్టీ సభ్యులకు చాల చక్కని విజ్ఞానం కల్గుతుంది. ఊరేగింపులు, ప్రజా సమావేశాలు జరుగుతూ ఉన్నప్పుడు, చాల పర్యాయాలు, ఆ సందర్భంలేని పాటలు పాడుతూ ఉన్నారు. యువజనసభలలో రైతు గేయాలు, లేక కేవలం కరువుపాటలతోను కాలం గడిపివేస్తున్నాం. మనకు ఫాసిస్టువ్యతిరేక గీతాలున్నంత, మనప్రజలలో వివిధవర్గాలకు సంబంధించిన గేయాలు ఇంకా తక్కువగా ఉన్నాయి. అలాంటి పాటలు వ్రాయాలి. వానిని ప్రచారంలోకి తేవాలి.

రిపోర్టులు; దేశపటాలు

రాజకీయ రిపోర్టు ఇచ్చేటప్పుడు, సంస్కృతపదాలు, అర్ధంకాని మాటలు రాకుండ చూడాలి. చాల చిన్న వాక్యాలతో, సులభంగా, ఏమీ తెలియని వ్యక్తికికూడ అర్ధమయ్యేటట్లు చెప్పడానికి ప్రయత్నించాలి. లోగడ విషయాలు ఒక ఐదునిమిషాలు క్లుప్తంగా చెప్పితే మనం ప్రస్తుతం చెప్పబోతూ ఉన్న విషయాలను అర్ధంచేసుకోడానికి తోడ్పడుతుంది.

మనం చెప్పే యుద్ధ వివరాలు, దేశాల వివరాలు, దేశపటాలను గోడమీద తగిలించి, కర్రతో చూపుతూ వివరించి చెప్పాలి. ఇది పార్టీసభ్యులందరికీ తోడ్పడుతుంది. అనవసరంగా ఎక్కువ పట్టణాల పేర్లు చెప్పవద్దు.

రిపోర్టు ఇచ్చేటప్పుడు రెండు ఉద్దేశాలు మనస్సులో పెట్టుకోవాలి.

(1) మనపార్టీ సభ్యులకు సంగతులు విశదపర్చడం. (2) మనపార్టీ సభ్యులు తాము తెలుసుకున్న విషయాలు ప్రజలకు ఏవిధంగా చెప్పాలి? ప్రజల అనుమానాలు పోగొట్టి మనపని జయప్రదంగా సాగించడానికి ఎలా ఉపయోగించుకోవాలి? ఎప్పటికప్పుడు కొన్ని ముఖ్య పాయింట్లు, ఘటనలు, వివరించిన తరువాత వానిని ప్రజలకు ఏలా చెప్పితే మనపనికి ఉపయోగమో వివరిస్తూ రావాలి.

ఈలాంటి రిపోర్టు కామ్రేడ్ లక్ష్మణస్వామి (బెజవాడ తాలూకా కార్యదర్శి) ఇచ్చాడు. ఆ రిపోర్టులోని ముఖ్యాంశాలు ఇవి.

సోవియటు విజయాలు చెప్పాడు. ఇవి ఏవిధంగా యూరపు ప్రజలలో నూతన చైతన్యం కలిగిస్తున్నాయో చెప్పాడు. యూరపు ప్రజలు చేసే గెరిల్లా యుద్ధాలనుగూర్చి

చెప్పాడు. జర్మనీ త్వరగా ఓడిపోవడానికి ఇవి ఎలా తోడ్పడుతున్నాయో చెప్పాడు. గ్రీసు గెరిల్లాలు గ్రీసురాజును రావద్దన్న విషయాన్ని, బడోగ్లియో ప్రభుత్వాన్ని, ప్రజాపార్టీలు కలిసిన ప్రభుత్వంగా ఏర్పరచాలన్న మెడిటరేనియను కమిటీవారి నిర్ణయాన్ని చెప్పాడు. యూరపులో యుద్ధానంతరం రాబోయే ప్రభుత్వాలు ప్రజా ప్రభుత్వాలుగా ఉంటాయని, దానికి గ్యారంటీ యూరపు ప్రజల చైతన్యం, పోరాటం; సోవియటురష్యా సహకారం; అమెరికా బ్రిటిషుప్రజలు సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా యూరపు ప్రజలను బలపరుస్తూ రావడం అని నిరూపించాడు. జర్మనీ - రష్యాలమధ్య సంధి కుదిరిందనే తప్పుడు ఆక్సిస్ ప్రచారాన్ని, ఎత్తిచూపుతూ, దాని ఫలితంగా ప్రజలలో గల్గిన అనుమానాలకు సమాధానమేమిటో చెప్పాడు.

యూరపులో సోవియటు విజయాలవల్ల ఇటలీ ఓడిపోవడం ఎలా జరిగిందీ; ఇటలీ ఓటమిలో బ్రిటిషు నౌకాసైన్యం హిందూమహాసముద్రానికివచ్చి జపానుదాడి మన దేశం మీదికి రాకుండా జేయగల్గుతూవుంది. మిత్రమండలి విజయాలు మనదేశ సరిహద్దునుండి జపానును తరిమి త్వరగా యుద్ధాన్ని ముగించడంవల్ల మన ప్రజలను ఎదుర్కొంటూఉన్న కరువుకాటకాలు పోతాయి. యూరపులో మిత్రమండలి విజయాలతో జపానుమీద దాడికి పూనుకొన్నప్పుడు, భారతదేశ రాజకీయ సమస్యపై ప్రపంచ ప్రజలదృష్టి ఏరీతిగ మరలుతూ ఉందో చెప్పాడు. బ్రిటీషు ట్రేడుయూనియను కాంగ్రెసు నాయకులను విడుదలచేయాలని, రాజకీయ ప్రతిష్టంభనను తొలగించి జాతీయ ప్రభుత్వాన్ని జపానుపై యుద్ధంలో త్వరగా జయంపొందడానికి ఏర్పరచమన్న తీర్మానాన్ని ఉదహరించాడు. మిత్రమండలి విజయాలు, ఆర్ధికంగాను, రాజకీయంగాను మన ప్రజలకు ఏరకంగా ఉపయోగమో చెప్పాడు. మిత్రమండలి విజయాలు, మన బానిసత్వాన్ని బలపర్చుచున్నవనే ప్రజలలోని దురభిప్రాయాన్ని పోగొట్టాలని చెప్పాడు.

తరువాత మనదేశంలో కాంగ్రెసు - ముస్లింలీగులుకలిసి బెంగాలు కరువుకోసంకూడ పనిచేయకపోవడాన్ని చూపి, ఐక్యత అవసరం అని చెప్పాడు. ఆంధ్రలోను, కృష్ణాజిల్లాలోను, బెజవాడ తాలూకాలోను పార్టీలు, వ్యక్తులు మనమీదచేసే వ్యతిరేక ప్రచారాన్ని ఎలా ఎదుర్కోవాలో చెప్పాడు.

పార్టీ అభివృద్ధి

జనరల్‌బాడీ సమావేశంలో, గతమాసానికి నేటికీ జిల్లా అంతట పార్టీ, ప్రజా సంఘాలు ఎంత ముందుకుపోయిందో నిర్మాణసంఖ్య ఇస్తూ చెప్పాలి. మన తాలూకాలో కూడ ఎంత ముందుకు పోయిందీ చెప్పాలి. కేవలం అంకెలే అయినా ఈలా చెప్పడం పార్టీ సభ్యులలో ఉత్సాహం కల్గిస్తుంది. మనపార్టీ పెద్దపార్టీ అని, మనం పనిచేసేకొద్దీ బలపడుతూ ఉన్నామని ఆత్మవిశ్వాసం కల్గుతుంది.

రాష్ట్రమంతా పార్టీ అభివృద్ధినిగూర్చి, అదేవిధంగా భారతదేశమంతటాగూర్చి తెలిసినప్పుడు చెప్పాలి.

జనరల్‌బాడీ సమావేశానికి రాకముందు, సెల్లువారీగ లెక్కలు వ్రాసుకోడానికి టేబిల్సుతో తయారుగా సమావేశకర్తలు రావాలి. ఆ టేబిల్సులో గత సమావేశంనాటికి మొత్తం చేర్పించిన సభ్యత్వం; ఈ సమావేశానికి తీసుకొన్న కోటా; చేర్పించినదీ ఈ సమావేశంనాటికి మొత్తం సభ్యత్వం; వచ్చే సమావేశంలోపల చేర్పించవలసినకోటా ప్రతి రంగానికి ఉండాలి. రిపోర్టులన్నీ పూర్తిఅయిన పిమ్మట ఆ లెక్కలు కూడాలి. ఈలాచేస్తే అంత్యోపన్యాసంలో సెల్లులకు జవాబు చెప్పుతూ, ప్రతిసెల్లు పనినిగూర్చి విమర్శించి వారి భవిష్యత్ కార్యక్రమాన్నిగూర్చి చెప్పడంతోపాటు, ఫిర్కా మొత్తంమీద ఆనాటికి పార్టీ ప్రజాసంఘాలస్థితి ఏమిటో, చెప్పడానికి వీలవుతుంది.

ఫ్రంటువారీ మీటింగులు

పీనిలో చాల జనరలుబాడీ సమావేశాలలో జరిగినవే తిరిగి అనవసరంగా చెప్పుతున్నారు. డబ్బు వసూలుచేసుకోవడంలోను, కోటాలు లెక్కలు వ్రాసుకోవడంలోను కాలాన్ని అనవసరంగా ఖర్చుపెట్టుచున్నారు ఫ్రంటువారీగా సమావేశమయినప్పుడు ఆ ఫ్రంటులో ప్రతి గ్రామానఉన్న సమస్యలేమిటో చర్చించుటలేదు. ఫ్రంటువారీగా సమావేశమయినవారు తాము తీసుకొన్న కార్యక్రమాన్ని, తిరిగి వెళ్ళి తమ సెల్లులలో చర్చించి, మిగతా సెల్లు కార్యక్రమంతో కోఆర్డినేటు చేసుకోవడంలేదు.

జనరలుబాడీలలో సెల్లు కార్యదర్శులు రిపోర్టులిచ్చేటప్పుడే ఆ లెక్కలు వ్రాసుకుంటే కాలం కలిసివస్తుంది. డబ్బుకూడ ఆఖరున తీసుకుంటే, మిగిలిన పని అయిపోయినందున, డబ్బిచ్చినవారు వెళ్ళిపోవడానికి వీలవుతుంది. ఒకరి లెక్కలు చూస్తున్నప్పుడు మిగిలినవారందరూ కూర్చోవలసిన అవసరముండదు.

ఫ్రంటువారీ సమావేశాలలో రెండు లాభాలు కనబడుతున్నాయి. తాము పరిష్కరించిన సమస్యలనుగూర్చి, తమ అనుభవాలనుగూర్చి మరింత వివరాలు చెప్పడానికి వీలు కల్గుతూఉంది. దీనివల్ల ఇతరులకు లాభకరంగాను, ఉత్సాహకరంగాకూడ ఉంది. ఆ ఫ్రంటులోని ప్రధాన కామ్రేడ్, ఆ ఫ్రంటులోని ప్రధాన సమస్యను చాల వివరంగా విశదీకరించడానికి కూడ ఉపయోగపడుతూఉంది.

ఇప్పుడు పార్టీకమిటీల మీటింగులక్రింద, ప్రజాసంఘాల కార్యవర్గ సమావేశాలక్రింద చాలకాలము వృధా అవుతోంది, పార్టీ ముఖ్యులకు యీ మీటింగులతోనే సరిపోతోంది, దీనివలన వారు, ప్రత్యక్షంగా ప్రజారంగాల పనిపై కేంద్రీకరించి పనిచేయడానికిగాని, ప్రజారంగాల్లో పనిజేసేవారికి ప్రత్యక్షంగా సహాయపడుతూ, వారిని నడపడానికిగాని సాధ్యంగావడంలేదు. ఆఫీసుల్లో పనిజేసేవారు ఆఫీసు పనినిగూడ సక్రమముగా చూడలేకపోతున్నారు. (పై కమిటీలకు సకాలంలో రిపోర్టులు పంపుట, క్రిందికమిటీల రిపోర్టులపై విమర్శనలు, సలహాలు పంపుట చురుకుగా జరగడంలేదు). అంతేగాకుండా తమ సిద్ధాంత జ్ఞానాన్ని అభివృద్ధి జేసుకోడానికి పార్టీ సాహిత్యాన్నంతనూ గూడ తీరికలేక చదువలేకపోతున్నారు. మీటింగులలోనే కాలమంతా వృధా అవకుండా చూడాలి. అందుకుగాను ప్లానుప్రకారం అన్ని మీటింగులు జరిగేటట్లు ఒక టైమ్‌టేబులును రాష్ట్రకమిటీ తయారుచేసింది. దాని ప్రకారం యికముందు అన్ని మీటింగులు (పార్టీకమిటీల, ప్రజాసంఘాల మీటింగులు) జరగాలి.

మీటింగుల టైముటేబులు

ప్రతినెల లేక ఆరువారాల కొకపర్యాయం జిల్లాకమిటీ మీటింగు జరగాలి. ఈ మీటింగుకు జిల్లాకమిటీ సభ్యులనేగాక జిల్లాఆర్గనైజర్లను, జిల్లాకమిటీ సభ్యులస్థాయివున్న తాలూకా కమిటీ కార్యదర్శులను, జిల్లా ప్రజాసంఘాల నాయకులను గూడ పిలవాలి. ప్రతి ప్రజారంగాన్ని గూర్చి చర్చించి, తాలూకాలవారీగా కార్యక్రమాన్ని ప్రతి ప్రజారంగానికి తయారుచేయాలి. తాలూకా ముఖ్యబాధ్యతలను నిర్ణయించాలి.

జిల్లా పార్టీకమిటీ సమావేశం మూడు రోజుల్లో పూర్తిజేసి వెంటనే ప్రజారంగాల జిల్లా వర్కింగుకమిటీ సమావేశాలను జరపాలి. ఆ సమావేశాల్లో జిల్లాకమిటీలో చర్చించి ప్రజారంగాలకు యివ్వబడిన కార్యక్రమాన్ని తాలూకాలలోవి ముఖ్యకేంద్రాలలో యెలా అమలుజరపాలో వివరాలు తయారుచేయాలి. ముందుగా జిల్లాకమిటీలో దీన్నిగూర్చి చర్చించడం వలన ప్రజారంగాల జిల్లా వర్కింగుకమిటీల సమావేశాలు యెక్కువకాలం జరుగనవసరంలేదు. ఒకటి రెండు రోజులకన్నా హెచ్చు టైముపట్టదు.

ఈవిధంగా జిల్లాపార్టీకమిటీ, జిల్లా ప్రజాసంఘాల కార్యవర్గసమావేశాలను జరిపిన వెంటనే తాలూకాపార్టీ కమిటీల సమావేశాలను జరపాలి. తాలూకా పార్టీఆర్గనైజర్లస్థాయివున్న ప్రజానాయకులను, (పార్టీసభ్యులైనవారిని) తాలూకాకమిటీ సమావేశాలకు పిలవాలి. ఆ తాలూకాకు యిచ్చిన కార్యక్రమముగూర్చి చర్చించి దాన్ని అమలుజరపడానికి యింకా వివరాలు తయారుజేయాలి. తాలూకాకమిటీ సమావేశం అవడంతోనే తాలూకా ప్రజాసంఘాల కార్యవర్గ సమావేశాలను జరపాలి. ఈ తాలూకా సమావేశాలన్నీకూడ మూడు రోజులకన్నా హెచ్చుపట్టవు.

తాలూకా పార్టీకమిటీ, తాలూకా ప్రజాసంఘాల వర్కింగుకమిటీ మీటింగులు అయిపోయిన తరువాత వెంటనే పార్టీ జనరల్‌బాడీ మీటింగులు జరపాలి. జనరల్‌బాడీ మీటింగులలో యిప్పటివలె ఒక్క జిల్లాకమిటీ సభ్యులు, జిల్లాపార్టీ ఆర్గనైజర్లు మాత్రమే మాట్లాడటం మానివేయాలి; వీరి స్థాయిగాని, దాదాపు ఆ స్థాయిలో వున్న తాలూకా పార్టీ ఆర్గనైజర్లు, ప్రజారంగాల్లో పనిజేసే ముఖ్యులుగూడ మాట్లాడాలి. అప్పుడు జనరల్

బాడీ మీటింగులను యిప్పటికన్నా త్వరగా జరపవచ్చును. అంతేగాకుండా తాలూకా ముఖ్య ఆర్గనైజరులందరూ రాజకీయ రిపోర్టింగుయివ్వడాన్ని నేర్చుకుంటారు. రాజకీయంగా బాగా అభివృద్ధి పొందుతారు.

పై విధంగా జిల్లాకమిటీ సమావేశంనుండి పార్టీసభ్యుల జనరల్‌బాడీ సమావేశాల వరకూ ఒకదానివెనుక ఒకటి వరుసగా మీటింగులన్నిటిని పూర్తిచేయాలి. ఈ సమావేశాలకన్నింటికి మొత్తం 10 రోజులకంటె హెచ్చుకాలం పట్టదు. ఇప్పటివలె 15, 20 రోజులవరకూ పార్టీకమిటీల మీటింగులతోనూ, జనరల్‌బాడీ సమావేశాలతోను కాలం వృధాకాదు.

జిల్లా తాలూకా ప్రజారంగాల వర్కింగుకమిటీ మీటింగులు జిల్లాపార్టీ కమిటీ, తాలూకాపార్టీ కమిటీల సమావేశాలతోపాటు జరుపబడేటట్లు ముందుగానే నోటీసులు పంపాలి. జిల్లా తాలూకా పార్టీకమిటీల కార్యదర్శులు అలా జరిగేటట్లు బాధ్యత తీసుకోవాలి.

ఏవైనా అసాధారణ పరిస్థితులు వచ్చినప్పుడు జిల్లా, తాలూకా ప్రజారంగాల వర్కింగుకమిటీ మీటింగులు జరగాల్సివస్తే ప్రత్యేకంగా వాటి సమావేశాలను జరుపవచ్చును. అప్పుడు వచ్చిన ప్రత్యేక సమస్యలగూర్చి చర్చించవచ్చును. సాధారణ పరిస్థితులలో మాత్రం పై కార్యక్రమము ప్రకారం వాటి సమావేశాలు జరుపుతూ వుండాలి.

సెల్లులోపలి జీవితం

పార్టీనిర్మాణంలో సెల్లు ప్రాధమిక యూనిటు. ప్రజలతో ప్రత్యక్షసంబంధముండేది. పార్టీ కార్యక్రమాన్ని ప్రజలలో అమలుజరిపేదీ సెల్లు. మిగతాపార్టీ యూనియూట్లకు (తాలూకా కమిటీలు, జిల్లాకమిటీలు వగైరా) ప్రజలతో ప్రత్యక్షసంబంధముండదు. మిగతా యూనిట్లు ఎంత బాగా పనిచేసినా, సెల్లు సరిగా పనిచేయకపోతే, పార్టీ తన నినాదాలను ఆచరణలో పెట్టలేదు. పార్టీయొక్క కేంద్రనాయకత్వం జాతీయైక్యసంఘటనదశ (1936-39), సామ్రాజ్యవాద యుద్ధకాలం (1939-41), ప్రజాయుద్ధకాలంలోనూ సరియైన రాజకీయ నినాదాలను, నిర్మాణనినాదాలను ఇస్తూవచ్చింది. కాని వాటిని పార్టీ అమలు జరుపలేకపోయింది. కారణం పార్టీయొక్క ప్రాధమిక యూనిటు అయిన సెల్లు సరిగా పనిచేయకపోవడమే. పైకమిటీలు ఇచ్చే జనరలు కార్యక్రమాన్ని తన గ్రామంలేక పట్టణపరిస్థితులకు అన్వయించి, దాని మీద ప్రజలను సమీకరించుతూ, పనిలోవచ్చిన సమస్యలను పరిష్కరించడం, ప్రతికక్షులు పెట్టే ఆటంకాలను వారి ఎత్తుగడలను భగ్నంచేయడం మొదలైనవి చేస్తూ, సెల్లు ప్రజాఉద్యమాన్ని నిర్మించాలి. ఆవిధంగా చొరవతో పనిచేసినప్పుడే, పార్టీ తానిచ్చిన నినాదాలను ఆచరణలో పెట్టగలుగుతుంది. కాని సెల్లులు ఆస్థితిలోలేవు. పైకమిటీలనుండి వచ్చిన సూచనలను స్థానికపరిస్థితుల కన్వయించకుండా మెకానికలుగా ఆచరణలోపెట్ట ప్రయత్నించడం, సమస్యలు ప్రతికక్షుల ఆటంకాలు వచ్చినవెంటనే పైకమిటీల

సూచనలకోసం ఎదురుచూడటం, ఇంతలో సమస్యదాటి పోవడం, పార్టీసభ్యులు ఏమీచేయలేక పోయామని నిస్పృహచెందడం, జరుగుతోంది. ఇందుచేతనే పార్టీసెల్లులు తమ తమ గ్రామాలు పట్టణాలలోని ప్రజలకు నాయకత్వం వహించలేకపోతున్నాయి; చాలచోట్ల మన సెల్లు సభ్యులు తమ నాయకులుగాగాక, నిర్దిష్టమైన ప్రజాసేవకులుగా మాత్రమే పరిగణింపబడుతున్నారు. పార్టీసభ్యులు తమ నెదుర్కొంటున్న దైనందిన సమస్యలు పరిష్కరించలేకపోవడానికి కారణం (1) ఆ సమస్యలకు సంబంధించిన వ్యావహారిక పరిజ్ఞానం లేకపోవడం (2) పరిస్థితులను పరిశీలించడానికి, ప్రతికక్షుల ఎత్తుగడలను నినాదాలను అర్థం చేసుకొని వాటిని భగ్నంచేయడానికి అవుసరమయిన మార్క్సిస్టు సిద్ధాంత పరిజ్ఞానం లేకపోవడం (3) ప్రతికక్షుల ఎత్తుగడలను భగ్నంచేయడానికి, తమ తలిదండ్రుల అభ్యంతరాలను దాటడానికి, అవుసమయిన పట్టుదల చొరవ లేకపోవడం, అయితే పైనజెప్పిన మూడు హంశాలు వేరువేరైనవిగావు. ఒకదానిమీద మరొకటి ఆధారపడిఉన్నాయి. వ్యావహారిక పరిజ్ఞానం మార్క్సిస్టు పరిజ్ఞాన. ఎక్కువ అయ్యేకొలదీ ఆత్మవిశ్వాసం, పట్టుదల, చొరవ వస్తాయి. చొరవ పట్టుదల ఆత్మవిశ్వాసం ఎక్కువ అయ్యేకొలదీ, ఎక్కువగా పనిచేయడం, మార్క్సిస్టుసాహిత్యం చదవడంపనిచేస్తూ దాన్నిఅరిగించుకోవడం జరుగుతుంది. పైజెప్పబడిన మూడుహంశాల కలయికయే రాజకీయ చైతన్యం అని అంటాం. పార్టీసభ్యులలో ఇట్టి రాజకీయ చైతన్యం కలుగజేయడమే పార్టీయొక్క నేటి ప్రధానకర్తవ్యం. ఇటువంటి రాజకీయచైతన్యమే పార్టీసభ్యులలో గలిగితే, పార్టీ సాధించలేనిది ఏదీ లేదు.

సెల్లు కార్యదర్శి

ఆంధ్రదేశంలోని పార్టీసెల్లులలో 100 కి 50 తమంతట తాము సమావేశమయి కార్యక్రమాన్ని వేసుకోలేవు. ఆర్గనైజర్లు వెళ్ళినప్పుడు మాత్రమే సమావేశమవుతాయి. సెల్లుకార్యదర్శులు, సెల్లు సభ్యులను సమావేశాలకు పిలవడం, సర్క్యులర్లు పుస్తకాలు భద్రపర్చడం మొదలైనవి చేసే సెల్లుగుమాస్తాలుగా మాత్రమే ఉన్నారు. గాని, సెల్లు నాయకులుగా మాత్రం లేరు. సెల్లునాయకుడుగా ఉండడమంటే, సెల్లును సమావేశపర్చడం, ప్రతిసభ్యుని పరిస్థితిని క్షమనస్తత్వాన్ని గ్రహించి పనిఇవ్వడం, సెల్లుసభ్యులకు వచ్చిన సమస్యలను పరిష్కరిస్తూ వారికి మార్గం చూపడం, పనిలో వెనుకబడిపోయిన వారికి సహాయంజేయడం, సెల్లుసభ్యుల నందరినీ కలిపి జట్టుగా పనిచేయించడం, వారికి రాజకీయపరిజ్ఞానం కలుగజేయడం, తాను వ్యక్తిజీవితంలోను, పార్టీశిక్షణలోనూ ఆదర్శంగా ఉండటం, మొదలైనవి జేస్తూ, సెల్లుసభ్యుల అభిమానాన్ని చూరగొని, వారిచే నాయకుడుగా పరిగణింపబడాలి.

ప్రతిసెల్లు కార్యదర్శి, కమిటీయొక్క కార్యదర్శి మిగతా సభ్యులందరికన్న ఎక్కువ రాజకీయసిద్ధాంతపరిజ్ఞానం, ప్రాక్టికలు పనిలోనిపుణత, ఓర్పు, పార్టీశిక్షణ, ఆదర్శ

మైన వ్యక్తి జీవితం. మొదలైన లక్షణాలు గలిగిఉండాలి. అప్పుడే పార్టీ యూనిట్ల కార్యదర్శులు, ఆ యూనిట్లలోని మిగతా సభ్యులను జట్టుగా పనిచేయించగల్గుతారు. అప్పుడే ప్రతికమిటీ టీముగాను, పార్టీసభ్యుల నాయకురాలుగాను పనిచేస్తుంది.

సెల్లు మీటింగు

సామాన్యంగా సెల్లు మీటింగుకు ముందు రెండు మూడు రోజుల ముందుగా సభ్యులకు తెలియజేయడం జరగదు. మీటింగు సమయానికి కార్యదర్శిసభ్యులను పిలవబోవడం కొంతమంది సొంతపనులమీద పోవడంవల్ల మీటింగు సంగతి తెలియకపోవడం, మరి కొంతమందికి మీటింగు జరిగేసంగతి తెలిసినా అప్పటికప్పుడు తమ సొంతపనులను మాని మీటింగులకు రాలేకపోవడం, జరుగుతోంది. సభ్యులందరూ సెల్లు సమావేశానికి హాజరయ్యేలా చేయాలంటే, సమావేశానికి 3 లేక 4 రోజులు ముందుగా తెలియజెయ్యాలి. సభ్యులు ముందే పనులను సర్దుకొని, ఆ సమావేశ సమయానికి సొంతపనులు లేకుండా చేసుకోవాలి. అలాగయినప్పటికీ, ఏదో ప్రాణంమీదకు వచ్చే పనులైతే తప్ప, సెల్లుసమావేశంకు రాకుండా మానరాదు.

సెల్లుమీటింగుకు ముందుగా కార్యదర్శి ఎజెండాను తయారుచేయడంగాని, సమావేశాని కవుసరమైన అన్ని కాగితాలనుగాని తేవడం ఉండదు. సమావేశంలో కూర్చున్న తరువాత హడావుడిపడటం, అప్పుడు ఎజెండాతయారుచేయడానికి ప్రారంభించడం జరుగుతోంది. కార్యదర్శులు సెల్లుమీటింగులకు ముందే ఎజెండా తయారుచెయ్యాలి. సమావేశాని కవుసరమయిన అన్ని డాక్యుమెంట్లుతేవాలి. సమావేశానికి అధ్యక్షుడిని ఎన్నుకోవాలి. (సెల్లులో సభ్యులు వరుసవారీగా ఒకరితర్వాత మరొకరు అధ్యక్షులవుతూ ఉంటారు.)

సెల్లు కార్యదర్శిచే తయారుచేయబడిన ఎజెండా చదవాలి. దానికి ఇతరసభ్యులు సూచించిన హంశాలనుగూడ చేర్చాలి. తరువాత వరుసవారీగా ఆ ఎజెండాలోని హంశాలను చర్చించాలి.

సామాన్యంగా ఎజెండాలో ఈక్రింది హంశాలుఉండాలి. స్థానికావుసరాలనుబట్టి ఇతర సమస్యలుగూడ చేర్చవచ్చును.

(1) కార్యదర్శి రిపోర్టు
(2) సెల్లు సభ్యుల రిపోర్టులు
(3) సెల్లుసభ్యుల రిపోర్టులమీద కార్యదర్శి అభిప్రాయం.
(4) పైకమిటీ సర్క్యులర్లు చదివి చర్చించుట.
(5) వివిధ ప్రజారంగాలలో ముందుపనిని గూర్చి కార్యక్రమం.

(6) ఇతర గ్రామవ్యవహారాలు.
(7) ఆర్థిక విషయాలు.
(8) నూతన సభ్యులను చేర్చుకోవడం,
(9) పార్టీపత్రిక అమ్మకం.
(10) సభ్యుల రాజకీయ శిక్షణ.
(11) సభ్యుల ఆరోగ్యం.

కార్యదర్శి రిపోర్టులో గ్రామంలో జరిగిన ఘటనలు, జమాఖర్చులు, తాను తీసుకొన్న పనిని ఎంతవరకు నెరవేర్చిందీ ఉంటాయి. సెల్లుసభ్యులు క్రింది సమావేశంలో తాము తీసుకున్న బాధ్యతలను కోటాలను ఎంతవరకు పూర్తిచేసిందీ, కారణాలతోసహా వివరిస్తారు. సెల్లుసభ్యులిచ్చిన రిపోర్టులలోని కారణాలు ఎంతవరకు సబబుఅయినవి, ఎంతవరకూ కానివి, సెల్లుకార్యదర్శిచెబుతూ, క్రిందటి సమావేశంలో సెల్లుమొత్తంగా తీసుకున్న బాధ్యతలను ఎంతవరకూ నెరవేర్చింది సమీక్షచేస్తాడు. సామాన్యంగా ఈ రిపోర్టులు నోటితో ఇవ్వడంవల్ల, విషయం స్పష్టంగా చెప్పలేకపోవడం, అనవుసరమయిన విషయాలు చాలచెప్పుతూ కాలాన్ని చాల వృధాచేయడం, జరుగుతోంది. ఏవిషయమైనా బుర్రలో ఉన్నంతకాలం అస్పష్టంగానే ఉంటుంది. కాగితంమీద పెడితేనేగాని స్పష్టమైన ఖచ్చితమైన అభిప్రాయం ఏర్పడదు. కనుక కార్యదర్శిఇచ్చే రిపోర్టు, సెల్లుసభ్యులిచ్చే రిపోర్టులు వ్రాసి చదవడం, ఏదైనా పాయింటును అవుసరమయినప్పుడు వివరించడం, చేస్తూఉండాలి.

తరువాత పై రిపోర్టులమీద ఏవైనా నిర్ణయాలు చేయాలిసివస్తే, చేయడం.

తరువాత పైకమిటీనుండి వచ్చిన సర్క్యులర్లను చదివి చర్చించి, అర్ధంజేసుకొని, ఆగ్రామానికో లేక పట్టణానికో ఎలా అన్వయించాలో ఆలోచించాలి; వివరమైన కార్యక్రమం, సభ్యులమధ్య పని విభజన చేసుకోవాలి. సామాన్యంగా సెల్లులలో జనరలుగా తీర్మానంచేయడం, దాన్ని అమలుజరిపే బాధ్యత ఎవరిదో నిర్ణయించకపోవడం, ప్లాను లేకుండా ఏదో గజిబిజిగా పనిచేయడమో, లేక ఎవరికివారు మరొకరుచేస్తారులే అని అందరూ ఊరుకోవడమో జరుగుతుంది. ఒకనిర్ణయం చేశామంటే, దాన్ని ఎలా ఎవరు ఎంత కాలములో పూర్తిచెయ్యాలోగూడ నిర్ణయించాలి. ఒకనిర్ణయం అవుసరమైన కాలంలోపల పూర్తిచేయకపోతే, ఆకాలం దాటినతరువాత పూర్తిజేసినా ప్రయోజనముండదు గనుక, ఎంతకాలంలో పూర్తిచెయ్యాలి అనేదిగూడ నిర్ణయించడం అవుసరం.

చాల సెల్లులు గ్రామవ్యవహారాలతో సంబంధంలేనట్లుగా భావించి వాటిని చర్చించనైనా చర్చించవు. గ్రామంలోని ప్రతి విషయంలోనూ మనం ప్రజలకు మార్గం చూపినప్పుడే, మనకు ప్రజలమీద నాయకత్వం వస్తుంది. కనుక ప్రతి సెల్లు సమావేశంలోనూ

ప్రజారంగాల విషయంలో రాని ఇతర గ్రామవ్యవహారాలనుగూడ చర్చించి నిర్ణయం తీసుకోవాలి.

చాల సెల్లులు సెల్లు ఆదాయవ్యయ పట్టికను ఉంచడంగాని, సెల్లు ఆర్థిక వ్యవహారాలనుగూర్చి చర్చించడంగాని ఉండదు. పార్టీసాగించే కార్యక్రమానికి ప్రతిదానికి, డబ్బుగావాలి. లేకపోతే పనిజరుగదు. కనుక ఎజెండాలో సెల్లు ఆర్థికస్థితిగూడ ముఖ్యాంశంగా ఉండాలి. సామాన్యంగా ఇప్పుడు సెల్లులు తమశక్తిని పరిస్థితులను సరిగా అంచనా వేయకుండా నిర్ణయాలు చేస్తున్నాయి. వాటిని పూర్తిగా అమలుజరుపలేక పోవడం, కొన్ని సెల్లులు వెనుక సమావేశంలో తాముచేసిన నిర్ణయాలు ఎంతవరకూ అమలుజరిగినాయో పునర్విమర్శించుకోకుండానే ముందు పనికి నిర్ణయాలు తీసుకో..డం, కొన్ని సెల్లులు పునర్విమర్శన చేసినా నామమాత్రమైన (Formal) కారణాలతో సంతృప్తిబడినేరం పరిస్థితుల మీదకు, ప్రతికక్షుల ఆటంకాలమీదకు నెట్టివేయడం, జరుగుతోంది ఇది చెప్పేదానికి చేసేదానికి సంబంధంలేని బూర్జువావర్గ పద్ధతి. కమ్యూనిస్టుపద్ధతిగాదు. బూర్జువాపార్టీలలో "ఈ పని చెయ్యాలి. ఆ పని చెయ్యాలి." అని తీర్మానాలు చేయుడం. తరువాత మరచిపోవడం, మరల సమావేశమయినప్పుడు వెనుక తీర్మానాలు సంగతి ఎత్తుకోకుండానే మరల తీర్మానాలు చేయడం జరుగుతుంది. మన కామ్రేడ్స్ నిర్ణయాలను అమలు జరపడానికి కొంత ప్రయత్నించడం, సెల్లులలో నామమాత్రమైన ఆత్మవిమర్శన మినహా ఇంకనూ ప్రధానంగా (Fundamentally) పనిచేయడంలో బూర్జువా పద్ధతినే మన సెల్లులు అనుసరిస్తున్నాయి.

కమ్యూనిస్టులు నిర్ణయాలు చేసేముందు స్థానిక నిజపరిస్థితులను (Objective conditions) (మన ప్రతికక్షులు పెత్తనదార్లు ప్రభుత్వోద్యోగుల వ్యతిరేకతను, ప్రజల యొక్క రాజకీయచైతన్యం) అంచనావేస్తారు. పార్టీసభ్యులు పార్టీ సానుభూతిపరులు పార్టీవెనుక నున్న ప్రజాసామాన్యం యొక్క బలాన్ని అంచనావేస్తారు. అంటే.ప్రతికక్షుల ఆటంకాలను బద్దలుచేయడానికి స్థానిక పరిస్థితులను మార్చడానికి, పార్టీకున్న బలాన్ని (Subjective factor) అంచనావేస్తారన్నమాట. ఒక స్థానిక నిజపరిస్థితులలో (Objective conditions) పార్టీశక్తినంతా (Subjective factor) ఉపయోగించి ఆ పరిస్థితులను ఎంతవరకు మార్చగలదో, దాన్నిబట్టి నిర్ణయంచెయ్యాలి. అంటే, ఏనిర్ణయమైనా స్థానికపరిస్థితులు పార్టీ బలంమీద ఆధారపడి, తీసుకోబడుతుందన్నమాట. అవిధంగాచేసిన నిర్ణయాన్ని తప్పక అమలుజరపాలి. ఆర్ణయాన్ని అమలు జరపకుండా, నేరం పరిస్థితులమీదకు నెట్టడమంటే, అది మార్క్సిజంగాదు. పరిస్థితులు ఎంత అనుకూలంగా ఉన్నా, పురుష ప్రయత్నం లేనిదే ఏదీ సాధ్యంగాదు. సోషలిజానికి పాదార్థిక పరిస్థితులు ఎంత అనుకూలంగాఉన్నా, మనం కృషిచేయందిరాదు. అలాగే హిట్లరిజం ప్రపంచ ప్రజలందరికీ వ్యతిరేకంగాఉన్నా, దానిని నాశనం చేయడానికి ప్రపంచ ప్రజలందరినీ సమీకరించి

దాని నెత్తిమీద చావుదెబ్బ కొట్టకపోతే, దానంతట అది చావదు. మెకానికలు భౌతికవాదానికి (Mechanical materialism) గతితార్కిక భౌతికవాదానికి (Dialectical materialism) తేడా ఇదే. పనిచేయకుండా బాధ్యతను పరిస్థితులమీదకు నెట్టడం, కర్మసిద్ధాంతంతో తృప్తిపడటం, పిరికితనంగాని మార్క్సిజంగాదు.

కొన్ని ప్రత్యేక పరిస్థితులలో మనం తప్పుడు అంచనావేయడంవల్లగాని, మనం ఊహించలేని నూతన పరిస్థితులు ఏర్పడినప్పుడుగాని, మనం తీసుకున్న నిర్ణయాన్ని పూర్తిగా అమలుజరుపలేకపోవచ్చు. అటువంటి పరిస్థితుల్లో మనం చూడాలిసింది ఏమంటే ఆ పరిస్థితుల్లో మన శక్తినంతా ఉపయోగించి పనిచేశామా లేదా, మనశక్తికి తగినంతగా చేశామా లేదా, అనేదే! ఇది మార్క్సిస్టు ఆత్మవిమర్శన.

సెల్లులు ఇకముందు నిర్ణయాలు చేసేటప్పుడు పైవిధంగా నిర్ణయాలుచెయ్యాలి. వాటిని తూచా తప్పక ఆచరణలోపెట్టాలి. తరువాత ఆత్మవిమర్శన చేసుకోవాలి. దీని నుండి గుణపాఠాలు నేర్చుకోవాలి. దీనిననుసరించి. మరల పరిస్థితులను పార్టీబలాన్నిబట్టి నిర్ణయాలుచెయ్యాలి. ఈవిధంగా పార్టీ అనుభవంనుంచి నేర్చుకొంటూ ముందుకుపోతుంది.

వ్యక్తి పరిస్థితులను గమనించి పని ఇచ్చుట

సెల్లుసభ్యులకు పనులు ఇచ్చేటప్పుడు, వారివారి ప్రత్యేక పరిస్థితులను అభిరుచులను శక్తిని గమనించకపోవడం జరుగుతోంది. అందువల్ల కొంతమంది కామ్రేడ్స్ పార్టీ శిక్షణకు కట్టుబడి ఉండలేమని దిగజారడంగూడ జరుగుతోంది.

కామ్రేడ్స్, మనపార్టీ ఎంతో విశాలమైన కార్యక్రమం గలది. ఆ కార్యక్రమం అమలు జరగాలంటే, ప్రజలందరినీ సమీకరించాలి. వివిధ వృత్తులలోఉన్న కామ్రేడ్స్‌ను అందరినీ వారివారి వృత్తులు వదలుకొని రమ్మని అనడం సాధ్యంగాదు. అందుచే కామ్రేడ్స్‌కు వారివారి వృత్తులలోఉంచి, వారిపొట్ట వారు నింపుకునేలాచేసియే, వారికి పనులు ఇవ్వాలిసివస్తుంది. ఆయాకామ్రేడ్స్ తమతమ వృత్తులకు సంబంధించిన ప్రజాసామాన్యంలో పనిజేసి, వారిని సమీకరించాలి. ఇది జనరలుగా 'పార్టుటైము' కామ్రేడ్స్ అవలంబించాలిసిన సూత్రం. ఒక కామ్రేడుకు పని ఇచ్చేటప్పుడు, ఇంటిపరిస్థితినిగూడ ఆలోచించాలి. పని ఇవ్వడంతోబాటు, ఈపనికి ఆటంకంగాఉన్న ఇంటిపరిస్థితులనుగూడ చక్కబెట్టాలి.

మనిషికి మనిషికి అభిరుచుల్లోగూడ తేడాఉంటుంది. ఇది సహజం. కనుక పని ఇవ్వడంలో ఈవ్యక్తి అభిరుచినిగూడ గమనించాలి. పై విషయాలు గమనించకుండా 'మెకానికలుగా' పని అప్పజెప్పితే, అది జరగదు.

'హోల్‌టైము వర్కర్స్' ముఖ్యంగా పైకమిటీల సభ్యులవిషయంలోగూడ గృహ పరిస్థితులు, వ్యక్తిఅభిరుచులను సాధ్యమైనంతవరకూ చూడాలి. కాని హోల్‌టైము

వర్కర్లు విప్లవమే వృత్తిగాగలవారు (Professional Revolutisnaries) పార్టీకి వెన్నెముకవంటివారు. వీరు ఏప్రాంతంలో అవుసరమైతే అక్కడకు వెళ్ళడం, ఏరంగ మవుసరమైతే ఆరంగం తీసుకోవడం చేస్తేనేగాని, పార్టీపనిసాగదు. వీరివిషయంలో కనుక వ్యక్తిగత విషయాలు, అభిరుచులు పని అవసరమున్నప్పుడు పాటించబడవు.

కోటాపద్ధతిని పని ఇచ్చుట

1942 సెప్టెంబరు కేంద్రప్లీనంకు పూర్వం, పార్టీసభ్యులకు పనిఇవ్వడం జనరలుగా ఉండేది. రైతుసంఘ సభ్యులను చేర్చాలి. బహిరంగసభ జరపాలి. అని జనరలుగా తీర్మానాలు చేయడం జరిగేది. కాని ఎంతమంది సభ్యులను ఎవరెవరు చేర్చాలి, బహిరంగ సభకు ఎంతమందిని ఎవరెవరు తీసుకురావాలని, కోటాపద్ధతిని ప్రతిసభ్యునికో లేక ప్రతి దళానికో పని ఇయ్యబడేదిగాదు. ఇందువల్ల పార్టీబలాన్ని సరిగా అంచనావేసి, ఎంత పని చేయగలుగుతామనేది నిర్ణయించడానికి వీలుండేదిగాదు. 1942 సెప్టెంబరు కేంద్రప్లీనం తరువాత ప్రతిపని కోటాపద్ధతిని నిర్ణయించాలని తీర్మానించబడింది. పార్టీసభ్యులను రైతు కూలీ సంఘసభ్యులను చేర్చడం, కోటాపద్ధతిని ఇవ్వడం జరుగుతోంది. కాని బహిరంగ సభలకు, మహాసభలకు జనాన్ని తీసుకురావడం, మహజర్లమీద సంతకాలు పెట్టించడం మొదలైన పనులు కోటాపద్ధతిని ఇవ్వబడుటలేదు. ఇకనుంచి ప్రతిపనినీ కోటా పద్ధతిని ఇయ్యబడాలి.

సెల్లు బడ్జటు

ఇంతవరకూ ఏ సెల్లుకు బడ్జటులేదు. వసూలుచేసిన పార్టీఫండు అంతా పై కమిటీకి పంపడం, సెల్లుకు కావలసివచ్చినప్పుడు స్వతంత్రులుగా ఉన్న పార్టీసభ్యుల జేబులు తడివి తాత్కాలికంగా పని గడపడం జరుగుతోంది. కామ్రేడ్స్! ఇంక ఈ అరాజకపద్ధతిని మానాలి. సెల్లు సరిగాపనిచేయాలంటే, సెల్లు బడ్జటువేసి, సెల్లుఫండు ఉంచుకోవాలి. సంవత్సరం మొత్తం మీద సెల్లుకు ఎంతఖర్చు (దినోత్సవాలు జరపడానికి, జనరలుబాడీ మీటింగులకు బీదకామ్రేడును పంపడానికి ఖర్చులు, పుస్తకాలు కొనడానికి డబ్బు మొదలైనవి) సంవత్సరానికి ఎంత అవుతుందో అంచనావెయ్యాలి. పార్టీఫండు వసూలుజేసే టప్పుడు, తమ కోటాతోపాటు ఈ మొత్తాన్ని కలిపి వసూలుచెయ్యాలి. పార్టీఫండు ఎలా వసూలుచెయ్యాలి? అనేది వేరుగా వ్రాయబడుతుంది.

ఇలాగే వివిధ ప్రజాసంఘాల విషయంలో గూడ పై సంఘపఫండుకు తామిచ్చే కోటాలతోపాటు గ్రామంలో సంవత్సరానికి తమ తమ సంఘాలకు అయ్యేఖర్చు మొత్తాన్ని కూడా కలిపి వసూలుచెయ్యాలి.

ప్రజాసంఘాలు, ఫండులు వసూలుచేసేటప్పుడు, పార్టీకి డబ్బువచ్చే దారులకు దెబ్బకొట్టగూడదు, అంటే పార్టీసానుభూతిపరులనుండి, ఆ రంగానికి చెందని పార్టీ సభ్యులనుండీ వసూలుచేయరాదు. ఇతర ప్రజాసామాన్యం నుండి వసూలుచెయ్యాలి. వివిధ ప్రజాసంఘాలు ఎలా ఫండును వసూలుచేసుకోవాలి అనేది ఆయా ప్రజాసంఘాలను గూర్చి వ్రాసేటప్పుడు వ్రాయబడుతుంది. ఇక్కడ జనరలుసూత్రం మాత్రమే వ్రాయబడింది.

సెల్లు ఆఫీసు

పార్టీపై నిషేధం తొలగినతరువాత కొన్నిగ్రామాల్లో, గ్రామపార్టీ ఆఫీసులు తెరువబడినవి. పార్టీయొక్క అభివృద్ధిని సూచిస్తున్న ఇదొక చక్కని చిహ్నము. గ్రామఆఫీసు ఏర్పరచి పైకమిటీతో ఉత్తర ప్రత్యుత్తరములు సెల్లులు జరపడం, ఆర్గనైజరు రాకుండానే పైకమిటీలనుంచి వచ్చిన సర్క్యులర్లను అమలుజరిపేవిషయంలో ఆలోచించడం, అంటే పార్టీయొక్క ప్రాథమిక యూనిటు అయిన సెల్లు, చొరవతో పనిచేయడం ప్రారంభించిందన్నమాట. పార్టీసభ్యులున్న ప్రతిగ్రామంలోనూ సెల్లు ఆఫీసు ఏర్పరచవలెను. ఎక్కువ సెల్లులున్న గ్రామాల్లో అన్ని సెల్లులకు గలిపి ఒక ఆఫీసు ఉంటే సరిపోతుంది. గ్రామాలంటే ప్రభుత్వ దృష్టిలో గ్రామాలుగాదు. ఒక గ్రామంక్రింద 2 మైళ్ళదూరం ఉన్నశివారులు గూడ ఉంటాయి. రెండు మూడు గ్రామాలు కలిసేఉన్నా (తాడంకి, మంటాడ, గురజాడ-కృష్ణాజిల్లా) ప్రభుత్వదృష్టిలో వేరువేరు గ్రామాలుగా ఉంటాయి. అటువంటి గ్రామాలను ఒక గ్రామంగా పరిగణించవచ్చును. గ్రామపార్టీఆఫీసు కమ్యూనిస్టు నాగరికతకు కేంద్రంగా ఉండాలి. ప్రజలు ముఖ్యంగా యువకులు పార్టీ ఆఫీసుకు రావడమంటే, హుషారుపడేటట్లుగా ఆఫీసు ఉండాలి. ఆఫీసులోపలికి వచ్చిన ప్రతి ఒక్కరు ఏదో కొత్తవిషయం నేర్చుకొని వెళ్ళినట్లుగా 'ఫీలు' అయ్యేలా ఉండాలి.

ఆఫీసు అలంకరణ

ఆఫీసు చుట్టూ ఖాళీస్థలముంటే బాగుజేసి దానిలో రామములగ, గోబీపువ్వు (Couliflower) మొదలైన కొత్తరకపు కూరగాయలు, కొత్తరకంపంటలు, పూలచెట్లు వెయ్యాలి. ఇందువల్ల కొత్త కూరగాయలు, పంటలు ప్రజల్లో ప్రచారం చేసినవారమవుతాం. "మీరు ఆ కూరగాయలు కాయించండి, ఈ పంటలుపండించండి" అని ఉపన్యాసాల్లో చెప్పే దానికన్న, పార్టీ ఆఫీసు ఆవరణలో వీటిని ఆచరణలో చూపెడితే, ప్రజలు సులభంగా అనుసరిస్తారు.

ఆఫీసులో అందరికి కనపడే స్థలంలో మధ్యన ఎర్రజెండా, దానికి కుడివైపున కాంగ్రెసుజండా, ఎడమవైపున ముస్లిము లీగు జండా, మూడూ ఒకే సైజువి గోడకు మేకులతో కొట్టాలి. ఈవిధంగా పెట్టడం, కమ్యూనిస్టుపార్టీ కాంగ్రెసు లీగు ఐక్యతకు కృషి

చేస్తున్నట్లు సూచిస్తుంది. ఆ మూడు జెండాలనుగూర్చి ఎవరైనా ప్రశ్నించితే, కాంగ్రెసు లీగు ఐక్యతయొక్క అవుసరాన్ని చెప్పవచ్చును.

అజెండాల చుట్టుప్రక్కలనే మార్క్సు, ఎంగెల్సు, లెనిన్, స్టాలిన్ మొదలైన అంతర్జాతీయ కమ్యూనిస్టునాయకులు, టిమోషెంకో, వోరోషిలావు, బుడియానీ, ఝుకావు, రకోసోవిస్కీ, వటూటిన్ మొదలైన సోవియటు సేనానాయకులు, జోయా, లూడ్‌మిల్లా మొదలైన ప్రఖ్యాతసోవియటు వీరవనితలు, రజనీపామిదత్తు, హారీపాలిట్, గలాచర్ (బ్రిటను), ఎరల్‌బ్రౌడరు (అమెరికా), థాల్‌మన్ (జర్మనీ), మారిస్‌థోరే (ఫ్రాన్సు), జోసోదయాజ్, పాషనారా (స్పెయిన్) మొదలైన వివిధదేశాల కమ్యూనిస్టు నాయకులు, గాంధీ, నెహ్రూ, అజాద్, జిన్నా మొదలైన జాతీయ నాయకులు, జోషీ, అధికారి, సుందరయ్య మొదలైన భారతకమ్యూనిస్టునాయకులు, భగత్‌సింగు, రాజగురు, సుకదేవ్, కయ్యూరు కామ్రేడ్సు, ఆగస్టుసంఘటనలలో తమకర్తవ్యాన్ని నెరవేర్చుతూ చనిపోయిన కామ్రేడ్సు, పంచమాంగదళంవారిచే చంపబడిన కామ్రేడ్సు, మొదలైన వారందరి ఫొటోలు సేకరించి అట్టలమీద అంటించి వ్రేలాడగట్టాలి. ఆ ఫొటోలక్రింద, వారివారి ప్రాముఖ్యతనుగూర్చి, వారి జీవితాన్నిగూర్చి చిన్న చీటీలమీద క్లుప్తంగా వ్రాసి అంటించాలి. దీనిద్వారా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాన్నిగూర్చి భారతజాతీయోద్యమాన్నిగూర్చి ఆఫీసుకు వచ్చిన వారికి తెలియజెప్పిన వారమవుతాం.

సోవియటురైతులు, కార్మికులు, ఉద్యోగులు, స్త్రీలు, పిల్లలు మొదలైనవారి జీవితాన్ని, మనరైతులు, కూలీలు ఉద్యోగుల స్త్రీలు పిల్లలు జీవితంతో పోల్చే బొమ్మలుగూడ ఉండాలి. ఉదాహరణకు, సమిష్టివ్యవసాయ క్షేత్రంలో ట్రాక్టరులతో దున్నడం, మనరైతునాగలితో దున్నడం, ఈ రెండుబొమ్మలు ఒకదానిపక్కన ఒకటిఉంచితే, చూచేవారికి మనం ఎంత వెనుకఉన్నామో బోధపడుతుంది. ఈ బొమ్మలక్రింద వారివారి ఆదాయాలను ఇతర వివరాలనుగూర్చి చిన్నచిన్న చీటీలమీద వ్రాసి అంటించాలి.

ప్రపంచాన్ని వివిధఖండాలను తెలిపే మ్యాపులుగూడ ఉండాలి.

ఎరువులు, మంచివిత్తనాలు, తెగుళ్ళు మొదలైనవాటి నిర్మూలనం, మేలుజాతి పశువులు వాటి పెంపకం మొదలైనవి తెలిపే వ్యవసాయ డిపార్టుమెంటు ప్రచురించే పటాలు ఉండాలి.

మలేరియా, కలరా మొదలైన అంటువ్యాధులను గూర్చిన బొమ్మలు, ఆహారం, శుభ్రతనుగూర్చిన ఆరోగ్యశాఖవారు ప్రకటించే బొమ్మలు ఉండాలి. పైవిధంగా ఆఫీసు ప్రజలకు రాజకీయాలనుండి ఆరోగ్యంవరకూ బోధించే ఒక విద్యాలయంవలె ఉండాలి.

ఆఫీసు పరిశుభ్రంగాఉండాలి. పెట్టెలు, బల్లలు, చాపలు ఒక క్రమపద్ధతినిఉంచాలి. మనం తీసుకురాబోయే సోషలిస్టు జీవితం ఎలాఉంటుందో గ్రామస్థులకు బోధపడాలి.

ఫైళ్ళు

ఈక్రింది ఫైళ్ళు ప్రతిఆఫీసులోనూ ఒక పెట్టెలోనో చిన్న బీరువాలోనో పెట్టి, తాళంవేసి భద్రంగాఉంచాలి. ఫైళ్ళులేకుండా అన్నీ కలగూరగంపగా ఉంచితే, ఏకాగితమైనా కావలిసివస్తే దానిలోనుంచి దేవి బయటకు తీయడానికి చాలకాలాన్ని వృధాచేయాలిసి వస్తుంది.

(1) రాష్ట్రకమిటీ, జిల్లాకమిటీ, తాలూకా కమిటీలనుంచి వచ్చే సర్క్యులర్ల ఫైలు.

(2) సెల్లుకార్యదర్శి పైకమిటీలకు పంపే రిపోర్టులు, వ్రాసే ముఖ్యమయిన ఉత్తరాల కాపీల ఫైలు.

(3) సెల్లు జమాఖర్చుల పుస్తకం.

(4) సెల్లు తీర్మానాలు మొదలైనవి వ్రాసే పుస్తకం. దీనిలో ప్రతిసమావేశం ముందు తేదీవేసి ఆ సమావేశానికి అధ్యక్షునిపేరు, హాజరయినవారిపేర్లు వ్రాయాలి. అటుతర్వాత సెల్లు తీర్మానాలు వ్రాయాలి.

(5) ప్రజాశక్తి ఫైలు

(6) దినపత్రికలఫైలు.

సెల్లు లైబ్రరీ

కొన్ని సెల్లులు ఇప్పుడిప్పుడే లైబ్రరీలు పెట్టుకుంటున్నాయి. చాలసెల్లులకు లైబ్రరీలు లేవు. కామ్రేడ్సు వ్యక్తిగతంగా పుస్తకాలు కొనడం, వాటిని చదివినతర్వాత ఏక్కడో పారవేయడం జరుగుతోంది. లైబ్రరీలు ఉన్నచోట్ల సైతం, ఒకరి ఆధీనంలో ఉండకుండా అందరు కామ్రేడ్సు పుస్తకాలు పంచడం, ఎవరికి ఇచ్చిందీ రిజిస్టరులో వ్రాయకపోవడం, ఒకరు ఒకపుస్తకం తీసుకొని అతడు మరల తిరిగి లైబ్రరీ కివ్వకుండా మరొకరికియ్యడం, అతడు మరొకరికియ్యడం ఈ విధంగా పుస్తకాలు పోవడం జరుగుతోంది. ఎప్పుడైనా తిరిగి చదవాలిసివచ్చినా, కొత్తగా పార్టీలోకి వచ్చిన కామ్రేడ్సుకు పుస్తకాలు ఇయ్యాలన్నా పుస్తకాలు ఉండవు.

కామ్రేడ్స్, పుస్తకాలు మన రాజకీయాయుధాలు అన్నమాట, లైబ్రరీలు మన రాజకీయ ఆయుధశాలలన్నమాట. పుస్తకాలు పారవేయడమంటే, మన రాజకీయాయుధాలను విసర్జించడమన్నమాట, కామ్రేడ్సు, పేపరు దొరకనిరోజుల్లో, ఒకొక పుస్తకాన్ని అచ్చువేయించడానికి రాష్ట్రకమిటీ, కేంద్రకమిటీలు ఎంత అవస్థపడుతున్నాయో గమనించండి. ప్రజలసొమ్ము ఎంత ఖర్చుపెడుతున్నామో ఆలోచించండి: ఒకొక్క పుస్తకం పారవేయడమంటే, ఎంతో పార్టీ శ్రమను, ప్రజలసొమ్మును వృధాచేయడమన్నమాట. పార్టీసభ్యులకు రాజకీయశిక్షణ నిచ్చుటను ఆటంకపరచడ మన్నమాట.

ఒక గ్రామంలోని లేక పట్నంలోని ప్రతిసెల్లుకు, ప్రతి ప్రజాసంఘానికి వేరువేరు లైబ్రరీలు ఉండాలిసిన అవుసరంలేదు, ఒకగ్రామానికి ఒకలైబ్రరీ సరిపోతుంది. వీలును, అవసరాన్నిబట్టి పట్టణంలో రెండుమూడు లైబ్రరీలు ఏర్పరచవచ్చును. గ్రామప్రజలచేత ఏర్పరుపబడిన గ్రామలైబ్రరీలు ఉన్నప్పటికీ, పార్టీలైబ్రరీ ప్రత్యేకంగా ఉండాలి. ఎందువల్లనంటే. గ్రామలైబ్రరీలో పార్టీరిపోర్టులు మొదలైనవన్నీ ఉంచడానికి వీలుండదు; పైగా పార్టీసభ్యులు మిలిటెంట్సును రాజకీయంగా తర్ఫీదు ఇయ్యడానికి. ఆ పుస్తకాలు మన అధీనంలోఉండవు. వేరే గ్రామలైబ్రరీ ఉన్నప్పుడు, దానిలోఉన్న జనరలుగా విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు మన లైబ్రరీలో లేకపోయినా ఫరవాలేదు. ఆగ్రామ లైబ్రరీనిగూడ మనం ఉపయోగించుకోవాలి.

పార్టీలైబ్రరీలో ప్రజాశక్తి పీపుల్సు పబ్లిషింగుహౌసు ప్రచురణలేగాక, చరిత్ర, భూగోళం. బూర్జువా అర్ధికశాస్త్రం, బూర్జువా రాజకీయాలు, సైన్సు, అభివృద్ధికరమైన నవలలు నాటకాలు, సాంఘిక సమస్యలకు సంబంధించిన అభివృద్ధికర సాహిత్యం, మొదలైనవాటికి సంబంధించిన పుస్తుకాలన్నీ ఉండాలి. ఈపుస్తకాలలిస్టు 1943 జనవరిలో జరిగిన రాష్ట్రకమిటీ ప్లీనం తీర్మానాలలో ఇయ్యబడింది.

(ఎ) మార్క్సిస్టు సిద్ధాంతగ్రంధాలు

1. సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ చరిత్ర
2. లెనినిజం - స్టాలిన్
3. పల్లెటూరి పేదలకు - లెనిన్
4. కుటుంబం, దాని పుట్టుపూర్వోత్తరాలు- ఎంగిల్సు
5. నిర్మాణ సమస్యలు - స్టాలిన్
6. సామ్రాజ్యవాదం - లెనిన్
7. జాతులసమస్య - స్టాలిన్
8. ప్రజానాయకుడు స్టాలిన్
9. మన లెనిన్
10. కమ్యూనిస్టు మ్యానిఫెస్టో
11. సోషలిజం వూహాజనితం - శాస్త్రీయం.
12. కూలి, పని, పెట్టుబడి
13. విలువ, ఖరీదు లాభం
14. కారల్‌మార్క్స ఉపదేశాలు
15. తత్వశాస్త్రం అంటే ఏమిటి ?
16. ప్రపంచ కార్మికోద్యమచరిత్ర
17. మార్క్సిజం అంటే ఏమిటి ?
18. సోషల్ డెమాక్రాటిక్‌పార్టీ కార్యక్రమం
19. స్టేట్ అండ్ రివల్యూషన్
20. అర్ధశాస్త్రం
21. అంతర్జాతీయ కమ్యూనిస్టుపార్టీ పంధా (శాంతి సంఘటననుంచి ప్రజాయుద్ధం వరకు)
22. కమ్యూనిస్టులతో కారల్‌మార్క్స

భారతదేశానికి సంబంధించిన గ్రంధాలు

1. ప్రపంచప్రజాయుద్ధమే భారతస్వాతంత్ర్య యుద్ధం
2. నేటి భారతదేశం
3. భారత కమ్యూనిస్టుపార్టీ నిర్మాణచరిత్ర
4. భారత కమ్యూనిస్టుపార్టీ నిబంధనావళి
5. సెంట్రల్ ప్లీనం (1942-43) రిపోర్టులు
6. 1943 మేడే సమీక్ష (ఆంధ్రకమిటీ)
7. మూడవ ఆంధ్ర కమ్యూనిస్టు మహాసభ- రిపోర్టులు తీర్మానాలు
8. రైతుసమస్యలు (మొదటిభాగం) } Hand Books
9. మహిళా ఉద్యమ నిర్మాణ సమస్యలు } Hand Books
10. రైల్వే కార్మిక సమస్యలు } Hand Books
11. ఆర్. ఎస్. ఎస్. నిజస్వరూపం (రాజకీయ కరపత్రం)
12. ఆంధ్రకమిటీ 1944 జనవరి ప్లీనం తీర్మానాలు

ఇంకను ప్రచురించవలసిన పుస్తకాలు

1. భారత కార్మికోద్యమచరిత్ర — రివైజుచేసి నేటివరకుగల చరిత్ర వ్రాయాలి.
2. పార్టీ నిర్మాణము
3. రైతుసమస్యలు (రెండవభాగం)
4. వ్యవసాయకూలీ సమస్యలు
5. ట్రేడ్‌యూనియన్ సమస్యలు
6. స్టేటుసమస్యలు
7. జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలు
8. ప్రసూతి, పిల్లల సంరక్షణ
9. ఆరోగ్యసూత్రములు—ప్రధమచికిత్స

(2–9: Hand Books)

10. రాయిజం
11. పాకిస్థాన్ — జాతీయైక్యత
12. సోవియట్‌జాతులు — జి. అధికారి
13. సోవియట్ స్త్రీలు

(10–13: రాజకీయ కరపత్రాలు)

14. చైనా, సోవియట్ యూనియనులపై ఇతరగ్రంధాలు.

(బి) విజ్ఞానంకోసం చదవాలసిన గ్రంధాలు

1. విశ్వరూపం
2. జగత్కధ
3. చైనా జాతీయోద్యమము
4. తురుష్క ప్రజాస్వామికం
5. (ఎ) నెపోలియన్ జీవితం
   (బి) ఫ్రెంచి స్వాతంత్ర్య యుద్ధం
6. ఆధునిక రాజ్యాంగ తంత్రములు
7. గాంధి-ఆత్మకధ

8. నెహ్రూ-ఆత్మకధ
9. తిలక్ జీవితం-ఉపన్యాసములు—
(మానికొండ సత్యనారాయణ)
10. గారిబాల్డీ జీవితం, మాజినీ జీవితం—
(శరణు రామస్వామిచౌదరి)
11. కాంగ్రెసు చరిత్ర
12. దక్షిణాఫ్రికా సత్యాగ్రహం
13. ,, పంపకం
14. పాలస్టైన్
15. ఆస్ట్రియా ఆక్రమణ
16. జెకొస్లోవియా విచ్ఛేదం
17. ఆంగ్ల రాజ్యస్థాపన } మానికొండ
18. బ్రిటిషు మహాయుగం } సత్యనారాయణ
19. భారతదేశ ప్రధమ స్వాతంత్ర్యయుద్ధం
20. భారతదేశ స్థితిగతులు
21. మోప్లా రైతుల తిరుగుబాటు
22. (ఎ) రష్యాసంచిక
(బి) స్టాలిన్ ఉపన్యాసము-సోవియట్ కాన్స్టిట్యూషన్
23. (ఎ) త్రిపురీసంచిక
(బి) మేడే సంచిక—1939
24. కార్మికోద్యమచరిత్ర
25. అమ్మ
26. అన్నా
27. నాడు-నేడు
28. పల్లెటూళ్ళల్లో
29. మాలపల్లి
30. టీకృదున్నేరు
31. కమ్యూనిస్టులు కోరేదేమిటి ?
32. లెనిన్ జీవితం
33. (ఎ) మనలెనిన్-ప్రజాశక్తి
(బి) స్టాలిన్
34. లెనిన్-ఉపదేశాలు-నవ్యసాహిత్యమాల
35. (ఎ) ఫాసిజం, నవ్యసాహిత్యమాల
(బి) ఫాసిజం కమ్యూనిజం. స్త్రీలు
36. సోవియట్ వీరవనితలు
37. గెరిల్లా
38. నాజీశ్రేణులవెనుక
39. దేశభక్తులు
40. చైనాయోధులు (బుర్రకధ)
41. క్రాంతిగీతాలు
42. విప్లవగీతాలు
43. ఫాసిస్టు వ్యతిరేకగీతాలు
44. విప్లవజ్వాల
45. రాజకీయభూగోళం
46. ఏ. ఆర్. పి. రక్షణ
47. టాన్యా
48. స్త్రీలపాటలు
49. సోవియట్ స్త్రీ
50. భయం
51. బాలసంఘం పాటలు
52. సోవియట్ బాలబాలికలు
53. శిశుహంతకులు
54. ఆకలిమంటలు (పిచ్చగుంటలకధ)
55. హిట్లరు పరాభవం (వీధిభాగవతం వగైరా)
56. జపాను నిజస్వరూపం
57. స్వాతంత్ర్య సంగ్రామం
(స్టాలిన్ ఉపన్యాసాలు)
58. నా కళ్ళారా చూచాను
59. గుండెనిబ్బరం (కధలు)
60. లెనిన్‌గ్రాడ్ యువజనవీరులు
61. టాన్యా (బుర్రకధ)
62. ప్రసాద్ చరిత్రి (బుర్రకధ)
63. పశ్చాత్తాపం (నాటకం)
64. నీవు-నీపుట్టుక

మార్క్సిస్టు సాహిత్యం సరిగా అర్థంచేసుకోవాలంటే. చరిత్ర, భూగోళం బూర్జువా ఆర్థిక రాజకీయశాస్త్రాలు సైన్సుసుగూర్చిన విజ్ఞానంఅవుసరం. బూర్జువా సమాజంవరకూ మానవులు సాధించిన ప్రజోపయోగకరమైన విజ్ఞానాన్ని స్వీకరించి, దానితో సోషలిస్టు విజ్ఞానాన్ని సమన్వయపరచియే, కమ్యూనిస్టుపార్టీ మానవకోటిని అభివృద్ధిమార్గాన తీసుకుపోతుంది, సోషలిస్టువిజ్ఞానం అందుచేత బూర్జువావిజ్ఞానంకన్న ఉన్నతస్థాయిలో ఉంటుంది. కనుక ప్రతికామ్రేడు విజ్ఞానాన్నిఇచ్చే ఇతర పుస్తకాలుగూడ చదవాలి.

లైబ్రరీ రూల్సు

(1) గ్రామపార్టీ ఫండునుంచి ప్రజాశక్తి ప్రచురణలన్నిటినీ కొనవలెను. ఇంగ్లీషు చదివేవారు ఎక్కువగాఉంటే పీపుల్సు పబ్లిషింగుహౌసు ప్రచురణలనుగూడ కొనవచ్చును. డబ్బుఉంటే ఇతర జనరలు పుస్తకాలనుగూడ కొనవచ్చును.

(2) పుస్తకాల క్యాటలాగు ఉండాలి. ఆపుస్తకంలో లైబ్రరీలోఉన్న పుస్తకాలు వివిధ శీర్షికలక్రింద (రాజకీయాలు, ఆర్థిక, నవల, నాటకాలు, సైన్సు, చరిత్ర, స్వీయ చరిత్ర మొదలైనవి) పుస్తకాలలిస్టులు వ్రాయాలి. ఎప్పుడు వచ్చిన పుస్తకంపేరు అప్పుడు ఆయా శీర్షికలక్రింద వ్రాయాలి. పుస్తకాలు కావలసినవారికి ఈ క్యాటలాగుఇయ్యాలి. పుస్తకాలన్నీ వచ్చిన ప్రతివాడు తిరగవేసేపద్ధతిని మాన్పాలి.

(3) లైబ్రరీ రిజిస్టరు ఉండాలి. దీనిలో పుస్తకంనంబరు, పేరు, తీసుకున్నవారి సంతకం, తీసుకున్నతేదీ, తిరిగిఇచ్చిన తేదీ, లైబ్రేరియను సంతకం మొదలైనవాటికి వేరువేరు 'కాలమ్సు' ఉండాలి, ఎప్పుడుఇచ్చిన పుస్తకం అప్పుడు రిజిష్టరులోవ్రాయాలి, అలాగే తిరిగి తీసుకున్న పుస్తకంగూడ జమ వేసుకోవాలి.

(4) పుస్తకాలన్నిటికీ పాతకాగితాలతో అట్టలువెయ్యాలి. వాటిమీద నంబర్లువెయ్యాలి. ఒక బీరువాలోనో, పెట్టెలోనోపెట్టి తాళంవెయ్యాలి. ఇది ఒకరి ఆధీనంలోఉండాలి. అతడే పుస్తకాలు ఇయ్యడంగాని, తీసుకోవడంగాని చెయ్యాలి. ఇతడు పుస్తకాలంటే జాగ్రత్తగా ఉండేవాడు, పుస్తకాలు తిరిగి తీసుకోవడంలో కాబూలీవాలాలాగు ఉండాలి. లేకపోతే పుస్తకాలుపోతాయి. లైబ్రేరియను చిరిగిపోయిన పుస్తకాలను ఎప్పటికప్పుడు మరమ్మతు చెయ్యాలి.

(5) పుస్తకాలు తీసుకువెళ్లే కామ్రేడ్సు వీటిని రోజూ చదివినతరువాత జాగ్రత్తగా ఉంచాలి, చదివేటప్పుడు వాటిని నలపగూడదు. పిల్లలకు అందేటట్లుగా అజాగ్రత్తగా పారవేయగూడదు. పుస్తకం మరొకరికి ఇయ్యగూడదు. ఒక కామ్రేడు చదివినవెంటనే లైబ్రేరియనుకు ఇయ్యాలి. పుస్తకం ఒక కామ్రేడునుంచి మరొక కామ్రేడుకు నేరుగా వెళ్ళగూడదు; ప్రతిపుస్తకం లైబ్రేరియను ద్వారానే వెళ్ళాలి.

(6) పార్టీసభ్యులు కానివారికి పుస్తకాలుఇచ్చేటప్పుడు, లైబ్రేరియనుకు స్వయంగా తెలిసి జాగ్రత్తగా పుస్తకాలు ఉంచుతాడనే విశ్వాసమున్నవారికి, పార్టీసభ్యులు ఆవిధంగా రికమెండుచేసినవారికి, మాత్రమే ఇయ్యాలి. ఎవరైనా కామ్రేడు పార్టీసభ్యునికాని వారికి రికమెండుచేసినా, అతనికి పుస్తకం ఇయ్యటోయేముందు, లైబ్రేరియనుకు విశ్వాసంఉండాలి.

(7) ఎవ్వరూ పుస్తకం 15 రోజులకన్నా ఎక్కువకాలం ఉంచుకోగూడదు. ఎక్కువకాలం ఉంచుకోవాలిసివస్తే, లైబ్రేరియనుచే తిరిగి వ్రాయించుకొని తీసుకువెళ్ళాలి.

(8) పుస్తకాలు ఇవ్వడానికి, తిరిగి తీసుకోడానికి వారంలో కొన్నిరోజులు, రోజులో టైము నిర్ణయించాలి. దీనిప్రకారం లైబ్రేరియను హాజరుగా ఉండాలి.

గోడవార్తా పత్రిక

సోవియటు ప్రజల జీవితంలో గోడవార్తా పత్రిక ఒక భాగమయిపోయింది. ప్రతి ఫ్యాక్టరీలోనూ, ప్రతి సమిష్టి వ్యవసాయక్షేత్రంలోనూ, ప్రతి పాఠశాలలలోనూ, ప్రతి ప్రజా సంఘ ఆఫీసులోనూ అది ఉంటుంది. ఇక పార్టీ ఆఫీసుల విషయం చెప్పనేల ! గోడవార్తా పత్రిక ఆత్మవిమర్శ, ఉత్పత్తిని అభివృద్ధి చేయడానికి సూచనలు, నూతన విషయాలను గూర్చిన పరిజ్ఞానం, మొదలైన వాటిని ఇయ్యడానికి, సోవియటు జీవితంలో ప్రజలందరికీ ఉపయోగపడుతోంది. సోవియటు యూనియను ఇంతగా అభివృద్ధిగావడానికి, ఈ పత్రికలు ఎంతో ఉపయోగపడినాయి.

మన సెల్లులుగూడ అభివృద్ధిగావడానికి, మనపార్టీని ప్రజాపార్టీగా తయారుచేయడానికి, ఈగోడవార్తాపత్రికలు అవుసరం. వీటిని నడిపే విధాన్నిగూర్చి, రాష్ట్రకమిటీ పొలిటికలు సర్క్యులరు నెం 1. (24-2-1943)లో ఇలా ప్రచురించింది.

"మన పార్టీ సెల్లులన్నీ వెంటనే గోడవార్తాపత్రికలు ప్రారంభించవలసిన అవసర మెంతయినా వుంది. బాగా అభివృద్ధిచెందిన ప్రతి సెల్లుకు ఒక గోడవార్తాపత్రిక ఉండాలి. ఇతరసెల్లులు రెండు మూడు కలిసి ఒక పత్రికను నడుపుకోవచ్చు. కాని, సాధ్యమైనంత త్వరలో ప్రతిసెల్లు ఒక పత్రిక చొప్పున నడపడానికి ప్రయత్నించాలి.

ఇవి యెందుకు ?

గోడ వార్తాపత్రికలు ఈరోజున ఎందుకింత అవసరమయాయి ?

పార్టీని-ప్రజలను కలిపేది పార్టీసెల్లు. ఏదయినా ఒక పార్టీవిధానాన్ని ప్రజలమధ్య ఆచరణలో పెట్టవలసింది సెల్లులు. ప్రజల అవసరాలను, ప్రజల మనోభావాలను, తెలుసు కునేది కూడా సెల్లులే. ఇందువల్లనే, సెల్లులు బ్రతికివుంటే పార్టీ బ్రతికిఉన్నదనీ, సెల్లులు గతిస్తే పార్టీకూడా గతించిందనీ, అంటాము.

అయితే, పార్టీ నిర్మాణమంతటిలోను సెల్లుల అనుభవం తక్కువ. నిరంతరం వాటిని అభివృద్ధి చేస్తేగాని అవి పార్టీ బాధ్యతలన్నింటినీ సరిగా నెరవేర్చలేవు. అందులోనూ, నేటి పరిస్థితులలో పార్టీకర్తవ్యాలను నెరవేర్చడంలో ఉన్న తికమకలు ఇదివర కెన్నడూ లేవు. క్రమశిక్షణ, ఏకాగ్రత, ప్లాను-వీటియొక్క అవసరం నేడు పూర్వంకంటే అనేకరెట్లు యెక్కువయింది.

గోడ వార్తాపత్రిక సెల్లుల నభివృద్ధిచేసే సాధనం

ప్రతి సెల్‌యొక్క కార్యనిర్వహణను చక్కని మార్గంలో నడపడానికి, మంచి శిక్షణ యివ్వడానికి, చురుకుగా పని చేయించడానికీ, వార్తాపత్రిక చక్కని సాధనం. సెల్ యొక్క పనినంతటినీ యిది ప్రతిబింబింపచేస్తుంది. ఆత్మవిమర్శన పద్ధతిద్వారా ఇది సెల్ సభ్యులకు శిక్షణనిస్తుంది. సెల్‌యొక్క విజయాలనూ, పరాజయాలనూ ఇది రికార్డు చేస్తుంది. ఏ యే పని ఎంతవరకూ జరిగిందో, ఏ యే లోపాలున్నాయో, అవి యెందుకు వచ్చాయో, మొదలైన విషయాల్ని ఇది పర్యాలోకించుతుంది. నల్లమందు బాయిలాలను పార్టీసభ్యుల యెదుట, సానుభూతిపరుల యెదుట పెట్టి బహిరంగపరుస్తుంది. సెల్‌సభ్యులు సోషలిస్టు పోటీలో పాల్గొనేటట్లు ప్రోత్సహించుతుంది. సెల్ ఎల్లప్పుడూ జీవకళతో అభి వృద్ధి చెందేలాగు చేస్తుంది.

పత్రికలో ఏవిషయాలుండాలి

ప్రతిసెల్, ప్రతిసెల్‌సభ్యుడు, నిర్వహించిన పనిని పత్రికలో రికార్డుచేయాలి. ఏ యే సభ్యునికి ఎంతెంత కోటా యిచ్చారో, అందులో ఎంత పూర్తిఅయిందో, అంకెల లోను, గ్రాఫ్‌లలోను, చూపాలి. ప్రతివారం కోటా ఎంతవరకు నెరవేర్చబడిందో సెల్లులు తనిఖీ చేయాలి, (Check-up) నెలకొకసారి సెల్ చేసిన పనిని పర్యాలోకించడం (Review) కూడా అవసరం. తనిఖీ యొక్క ఉద్దేశం, శక్తిహీనుల్ని శక్తివంతులుగా చేయడం. పర్యాలోకనయొక్క ఉద్దేశం అనేక వివరాలను పరిశీలించడం. ఉదా : కోటా లను నిర్ణయించడంలో, రాజకీయ పరిస్థితుల అవసరాలను గురించి, ప్రజల మనోభావాలను గురించి, పార్టీకిగల పలుకుబడిని గురించి, ఉన్న దళాలనుగురించి, సరిగా అంచనావేశారా, లేదా ? ఒక్కొక్క దళం ఫలానా పేటలో, లేక ఫలానా ప్రదేశంలో కోటాలు పూర్తి చేయాలని ముందుగా నియమించబడినదా, లేక అవకతవకగా, తమ యిష్టంవచ్చిన ప్రదేశంలో పూర్తిచేశారా ? కోటాలు పూర్తికాకపోవడానికి కారణం ఏమిటి ? లేక, ఎక్కువ కోటాలు పూర్తిచేస్తే, మొదట తక్కువ అంచనా వేయడానికి కారణం ఏమిటి ?

ఆందోళన, ఒప్పించే పద్ధతులు

ఒక కామ్రేడ్ పార్టీ కార్యక్రమాన్ని స్పష్టంగాను పూర్తిగాను, జీర్ణించుకున్నాడో-లేదో తెలుసుకోవడానికి ఆ కామ్రేడ్ గావించే ఆందోళన, ఇతరుల్ని ఒప్పించే పద్ధతులు చక్కని దాఖలా. విద్యార్థులలోను, కార్మికులలోను, రైతులలోను, కాంగ్రెసువారిలోను, ముస్లింలీగర్సులోను, హిందూమహాసభవారిమధ్య, అతడు పార్టీపంథాను సరిగా పెడుతున్నాడో లేదో, పత్రిక చూపుతూ ఉండాలి. ఎక్కడయినా ఒక ముస్లిం సోదరుడుగాని, ఒక పోరాటవాదిగాని, అడిగిన ప్రశ్నకు సెల్ సభ్యులందరినీ జవాబులు వ్రాయమని, వచ్చిన జవాబులలో అన్నిటికంటే చక్కనిది, అన్నిటికంటే పాడుది, పత్రికలో అంటించవచ్చు.

కొన్ని దళాలు సాధించిన పనిని క్లుప్తంగాను, పరిశీలనాదృష్టితోను, పత్రికలో వేయవచ్చును. ముందు అవలంబించవలసిన జాగ్రత్తలేవో కూడా దానికి చేర్చాలి.

ఆందోళన - నిర్మాణం

ఒక్కొక్క సమయంలో ఏదో ఒకే కార్యక్రమంలో నిమగ్నులయిపోవడం మన సెల్సులోవున్న సాధారణ లోపం. మొదట పార్టీనిధి, దానితరవాత "ప్రజాశక్తి"కి చందాదార్లు చేర్పించడం, అది అయాక సంతకాల ఉద్యమం, పిమ్మట ఆహార పదార్థాలసమస్య, ఈవిధంగా ఆందోళన ఒకటి తరవాత మరొకటి వరుసగా రావడం పరిపాటయింది.

ఏసమస్యను గురించి అయినా ఆందోళన చేస్తూంటే, అదే సమయంలో వివిధ ప్రజాసంస్థలలోను, వాలంటీరు దళాలలోను సభ్యుల్ని చేర్పించుతూ వుండాలి. అలా కాకుండా, పాతకాలపు పద్ధతులనే యీ రోజునకూడా అవలంబిస్తే, సర్వనాశనం కాక తప్పదు. గోడ వార్తాపత్రిక ఉంటే, వివిధరంగాలలో పని ఎలా సమన్వయమవుతూందో, ఎలా సమన్వయం చేయాలో, తెలుసుకుంటూ ఉండవచ్చు.

సెల్ సజీవంగా, పార్టీలో ఒక భాగమై పనిచేయాలి

సెల్ అసలు పని చేస్తూందా, పేరుకు మాత్రమే ఉన్నదా? పని చేస్తూన్నప్పటికీ జీవకళ లేకుండా, ఫార్మల్‌గా మాత్రమే పని చేస్తూందా లేక ఆందోళనకూ, నిర్మాణానికీ మధ్య సమన్వయం కూర్చుతుందా? సమావేశాలలో బాతాఖానీలు-సంభాషణలు జరుగుతున్నాయా, లేక సక్రమంగా సాగుతున్నాయా? సెల్‌నుంచి పైకమిటీకి పంపే రిపోర్టులు సరిగా ఉంటున్నాయా, లేదా? సెల్లులకు పైకమిటీ ఎప్పటి కప్పుడు సలహాలు యిస్తున్నదా? లేక తన యిబ్బందుల్నిగురించి పైకమిటీ సరిగా అర్థంచేసుకోవడం లేదని అభిప్రాయ పడుతోందా? సెల్ కార్యదర్శి తన పనిని సంతృప్తికరంగా నెరవేరుస్తున్నాడా,

లేదా? ఈప్రశ్నలన్నింటినీ పత్రికలో చర్చించాలి. వ్యక్తిగతంగా ప్రతిసెల్ సభ్యుడుచేసే పనినికూడా పత్రిక చూపుతూవుండాలి.

వ్రాయకూడని విషయాలు

1. గోడ వార్తాపత్రిక రాజకీయ పత్రికకాదు. జాతీయ - అంతర్జాతీయ పరిస్థితులపై అందులో వ్యాసాలు వ్రాయడం దాని ఉద్దేశం కాదు.

2. కేవలం అలంకారంగా మాత్రమే అది వినియోగపడకూడదు. అలంకారాలుండవచ్చునుగాని, సీరియస్ విషయాలనుండి తప్పించుకోడానికి వాటిని ప్రదర్శించకూడదు.

3. చవుకబారు హాస్య ప్రసంగాలకు గోడ వార్తాపత్రికను ఉపయోగించకూడదు.

4. ఒకరిని మరొకరు దూషించుకుంటూ, పత్రికను వ్యర్థపరచకూడదు. వేర్వేరు అభిప్రాయాలను పత్రికలో ప్రకటించవచ్చునుగాని అవి పార్టీయొక్క గౌరవాన్ని కుంటుపరచేవిగా ఉండకూడదు. అవి చదివినందువల్ల పార్టీ సానుభూతిపరులు కొత్తవిషయాలు నేర్చుకొని, పార్టీకి యింకా దగ్గరగా వచ్చేటట్లు ఉండాలి.

ఈ సర్క్యులరు ప్రకటించినతర్వాత జిల్లాకమిటీలు, తాలూకాకమిటీలు, ప్రజాసంఘాల ఆఫీసులు, కొన్నిసెల్లులు, గోడ వార్తాపత్రికలను ప్రకటించడం మొదలుపెట్టాయి. చాలసెల్లులు అసలు మొదలుపెట్టనైనాలేదు. మొదలుపెట్టబడినచోట్లయినా, రెగ్యులరుగా సాగ్గడంలేదు. ఆ గోడవార్తాపత్రికలుసైతం పార్టీసభ్యుల పనిని తనిఖీచేసేవిగాను, పనికి సూచనలిచ్చేవిగాను, లేవు.

గోడవార్తాపత్రికలు సక్రమంగా నడవాలంటే మొదటిది వీటిప్రాముఖ్యత పార్టీ సభ్యులకు తెలియాలి. రెండవది, వీటినినడిపేవిధం తెలియాలి. అందుకు ముందుగా ఆర్గనైజర్లు వీటిని తయారుచేయడంలో తర్ఫీదుపొందాలి. జిల్లాకమిటీలు ఈబాధ్యత వహించాలి, తర్వాత ఆర్గనైజర్లు సెల్లులకువెళ్ళి వాటినినడిపేవిధం, ఆచరణలో పార్టీసభ్యులకు చూపాలి.

పార్టీ సభ్యత్వానికి అర్హతలు

1943 ప్రారంభంవరకూ ఆంధ్రరాష్ట్రంలో మనపార్టీ ప్రచారదశలోనే ఉన్నదనీ, పార్టీ పాలసీనిగూర్చి రాజకీయప్రచారం విరివిగాచేసేదనీ, స్థానిక సమస్యలను తీసుకొని పార్టీపాలసీ ననుసరించి అంతగా పరిష్కరించేదిగాదనీ, అందుచేత పార్టీ, ప్రజాసంస్థలు నామమాత్రమైన నిర్మాణంతోఉన్నవనీ ఇంతకుపూర్వం వ్రాయబడింది. 1943 లో జరిగిన రాష్ట్రప్లీనం సమావేశం ఈలోపాన్ని పార్టీసభ్యులకు ఎత్తిచూపింది. అటుతర్వాతనుండీ పార్టీసభ్యులు విరివిగా స్థానికసమస్యలు తీసుకొని పనిచేయడం ప్రారంభించారు.

1942 ఆఖరువరకూ ఆంధ్రలో పార్టీ ప్రచారకదళలోనే ఉండుటవలన, పార్టీలోకి చేర్చుకోబోయేవారి చైతన్యం పట్టుదలలను ముందుగా ప్రజాపోరాటాలలో పరీక్షించడానికి అవకాశం ఉండేదిగాదు. అందుచే ఏదో మనతో ప్రచారకార్యక్రమంలో తిరుగుతూ, పార్టీలో చేరడానికి కుతూహలం చూపించేవారిని పార్టీలో చేర్చుకొనేవారం. సామ్రాజ్య వాద యుద్ధ ఆరంభంవరకూ ఈవిధంగా కొత్తగా జేర్చుకున్నవారిని, పార్టీసెల్లులలోనే ఉంచి, 3 మాసాలవరకూ ఓటింగుహక్కు లేకుండా సెల్లు మీటింగులలో పాల్గొనిచ్చే వారం. 3 మాసాల అనంతరం వారిని రెగ్యులరు మెంబరుగా చేసేవారం. వీరు కాండి డేట్సు అని పిలువబడేవారు. 1939 తర్వాత సామ్రాజ్యవాద యుద్ధకాలంలో ప్రభుత్వం యొక్క తీవ్రనిర్బంధ విధానంనుండి పార్టీ యంత్రాన్ని కాపాడుకోవాలిసి వచ్చింది. పరీక్ష చేయబడనివారిని పార్టీసెల్లులలో ఉంచడం ప్రమాదంగా కనిపించింది. అందుచే కొత్తగా తీసుకున్నవారిని పార్టీసెల్లులలో కూర్చోబెట్టడం మానివేసి సహాయకసెల్లులు ఏర్పరుపబడినవి. వీనిలో ఈ కొత్తవారిని పరీక్షించి, క్రమంగా పార్టీసెల్లులలో పూర్తి సభ్యులుగా తీసుకోబడేవారు. ఆరోజుల్లో ప్రజాసంఘాలకు పార్టీసెల్లుకు మధ్య సహాయక సెల్లు అనే ఒక 'హర్డిలు' ఉండేది. ఇలాగే ఇతరరాష్ట్రాల్లో ఆక్టివిస్టు గ్రూపులని, సాను భూతిపరుల గ్రూపులని వేరువేరు పేర్లతో ఉండేవి.

1942 ఆరంభంనుండీ మన దేశానికి జపానుదాడి ప్రమాదం, ఆగస్టు ఘటనల నుండీ పార్టీమీద ఒకవైపున ప్రభుత్వం రెండవవైపున కాంగ్రెసువాదులు, పంచమాంగ దళంవాళ్ళు దాడి సాగించారు. రైలుపట్టాలు పీకసిద్ధంగా ఉన్న ప్రజలను ఆపడం, ఆహార కరువువల్లవచ్చిన ఒకదోపిడీని ఆపడం, ప్రభుత్వఆఫీసులు తగలబెట్టకుండా ఆపడం, ప్రజా ఐక్యతద్వారా చౌకడిపోలు తెరిపించడం, బంజరుభూమి సాగుకిప్పించడం, మొదలైన ఏదో ఒకపనిచేస్తే చాలు, పై ఘటనలలో విజయం పొందాలంటే పంచమాంగదళం వాళ్ళ తోనూ, కమ్యూనిస్టువ్యతిరేకులతోనూ పోరాడాలిసివచ్చేది. ప్రభుత్వోద్యోగుల నిర్బంధానికి గురిగావలసివచ్చేది. రాజకీయాలు చాల వేగంగా పరుగెత్తనారంభించాయి. అందుచే పార్టీలో చేరాలని ముందుకు వచ్చేవారికి, సహాయకసెల్లులనే మధ్య మెట్టు అనవసరము.

రెండవ విషయమేమంటే 1942 జూనులోనే పార్టీపై నిషేధం తొలగింపబడింది.

అన్నిటికన్న ముఖ్యమైన విషయం, పార్టీ గత 15 సంవత్సరాలనుండీ సాగించిన పోరాటాలవల్ల పార్టీచుట్టుపట్ల ఉండే జనసామాన్యంలో కమ్యూనిస్టు సాంప్రదాయాలను ప్రవేశపెట్టింది. ప్రజాపోరాటాలలో పైకి తేలిన మిలిటెంట్లను ప్రత్యేకంగా పరీక్షించడం అనవుసరం. ప్రజాపోరాటంలో వారు పాల్గొనడం, పార్టీ గత 15 సం॥ నుండి సాగించిన కృషివల్ల ఏర్పడిన సాంప్రదాయాలు వారిలో ఇమిడివుండటం చాలు. పై మూడు కారణాల వల్ల పార్టీకి ప్రజాసంస్థలకు మధ్య సహాయకసెల్లులుగాని, మరే ఇతర ఆటంకాలు గాని ఉండరాదని, ప్రజాసంస్థల నుండి నేరుగా మిలిటెంట్లను పార్టీలోనికి తీసుకోవాలనీ, అలా

ఆటంకాలు ఉంచడం పార్టీ ప్రజాపార్టీగా అభివృద్ధిగావడానికి, జాతీయైక్యత సాధించడానికి ఆటంకాలు కల్గించడమేననీ, 1943 ఫిబ్రవరిలో సమావేశమయిన కేంద్రకమిటీప్లీనం సమా వేశం నిర్ణయించింది. పార్టీసభ్యులను చేర్చుకోడానికి నూతన కొలతబద్దను నిర్ణయించింది. పై ప్లీనంరిపోర్టులో ఈ విధంగాఉంది.

పార్టీయొక్క గత 15 సంవత్సరాల సాంప్రదాయం

ఇప్పటి రాష్ట్రనాయకులలో అత్యధిక సంఖ్యాకులు అధ్యయన తరగతులద్వారా మార్క్సిస్టు గ్రంధాలను వల్లించి, చాలకాలం ట్రేడ్‌యూనియన్ లేక ఇతర ఉద్యమాలలో పనిచేసినతరువాత తీసుకోబడ్డారు. పార్టీలోకి కార్మికవర్గంలోనుండి వచ్చినవారికి అధ్యయన తరగతులు పెట్టి తరువాత తీసుకోబడేవారు, ఆరోజుల్లో పార్టీ చాల శైశవదశలో ఉండుట వలన, పార్టీకి రాజకీయ ప్రాక్టికలు అనుభవం లేకపోవుటవలన ఆరోజుల్లో అది అవుసర మైనది. నేడో, పార్టీతన గత 15 సంవత్సరాల కృషివల్ల సామాన్యప్రజల రాజ కీయస్థాయిని, వర్గచైతన్యాన్ని శిక్షణను చాల ఎక్కువచేసింది. పూర్వం పార్టీలో చేర్చుకోబోయేముందు పార్టీపాలసీ, సిద్ధాంతాలు చెప్పాలిసివచ్చేది. ఇప్పుడు ప్రజలు అనేక మీటింగులకు హాజరయి పార్టీనాయకులు పార్టీయొక్క పాలసీ, సిద్ధాంతాలనుగూర్చి ఇచ్చిన ఎన్నో ఉపన్యాసాలను విన్నారు, అంతేగాక పార్టీనడిపిన అనేక పోరాటాల్లో పాల్గొని చూచి పార్టీయొక్క పాలసీ, సిద్ధాంతాలను ఆచరణలో ఎలాఉంటాయో చూచారు. వీటిలో నుండి పైకివచ్చిన మిలిటెంట్సుకు ఈ రాజకీయ ప్రాక్టికలు అనుభవముంటుందిగదా ? 15 సంవత్సరాల పూర్వం మిలిటెంట్సుకు - ఇప్పుడువచ్చే మిలిటెంట్సుకు ఎంత భేదముంది! ఆ రోజుల్లో మిలిటెంటు అధ్యయన తరగతుల్లో మార్క్సిజాన్ని వల్లించినా అది ఆచరణ లోకి రాని ఊహా మాత్రమైన (abstract) సిద్ధాంతమే! ఇప్పటి మిలిటెంటుకు మార్క్సి సిద్ధాంతాలు నిర్దిష్టంగా తెలియకపోయినా, సోషలిజంఅంటే వ్యక్తి ఆస్తిని రద్దుజేసి, అంతా కష్టపడి అంతా అనుభవించడమని తెలుసు. పార్టీపాలసీ పాయంటు తరువాత పాయంటుగా తెలియకపోయినా జనరలుగా తెలుసు; అంతేగాక తాను దానిని ప్రజల్లో అమలు జరుపు తున్నాడు.

కనుక 15 సం॥ నాడు పార్టీలోకి సభ్యులను ఏవిధంగా చేర్చుకున్నామో నేడుగూడ ఆవిధంగానే పార్టీలోకి చేర్చుకోవాలనడం, మార్క్సిజాన్ని అర్థంచేసుకోకపోవడమే: ప్రజలు, ప్రపంచం ఎంత మారిందో గ్రహించకపోవడమే! గత 15 సంవత్సరాలనుండి పార్టీ జేసిన కృషిఫలితాన్ని పార్టీసాంప్రదాయాన్ని తెలుసుకోలేకపోవడమే: మాటల్లో మార్క్సి జాన్ని వల్లించినా, ఆచరణలో మార్క్సిజాన్ని వదలిపెట్టి భావవాదాన్ని స్వీకరించడమే అవుతుంది.

'అప్పుడు మార్క్స్ లెనిన్ గ్రంథాలను పఠించి యువకులు పార్టీలోకివచ్చారు. ఇప్పుడు టాన్యా (సోవియటు వీరయువతి) జీవితచరిత్ర చదివి పార్టీలోకి వస్తారు. అని కామ్రేడ్ జోషీ చెప్పాడు. ఆరోజుల్లో మార్క్స్ సిద్ధాంతాన్ని చదివి పార్టీలోకి వచ్చారు. నేడు ఆ సిద్ధాంతం ఆచరణలో పెట్టడాన్ని చూచి పార్టీలోకి వస్తారు.

ఆంధ్రలో: బెంగాలు బొంబాయి, రాష్ట్రాలలోవలె పార్టీసభ్యులను చేర్చుకోవడంలో సెక్టేరియను దృక్పథంలేకపోయినా పైజెప్పబడిన మార్క్సిస్టు దృక్పథంతో మాత్రం పనిచేయలేదు. ప్రజల్లో పార్టీచేసినపనివల్ల మిలిటెంట్సు పైకిరావడం అందులో పార్టీపత్రికలను, పుస్తకాలను సొంతంగా చదివి అర్థంచేసుకోగలిగిన విజ్ఞానమున్న వారిని పార్టీలోకి తీసుకోవడం, మిగతావారిని వారి ఖర్మకు వదలివేయడం అలవాటుగా జరుగుతూంది. అందువల్ల చదువురాని బీదరైతులు, వ్యవసాయకూలీ కార్మిక మిలిటెంట్లు కొంతమంది మరల రాజకీయాలనుండి విరమించడం, కొంతమంది డబ్బాలవలె తయారై రాజకీయంగాను, నైతికంగాను పతనమై పార్టీకే ఎదురుతిరగడం, మరికొంతమంది మూఢవిశ్వాసంతో పార్టీని అంటిపట్టుకు ఉండటం జరుగుతూఉంది. ఈవిధంగా గ్రూపు తరువాత గ్రూపు మిలిటెంట్సు కథ తిరిగి జరుగుతూ (repeat) ఉంది. ముఖ్యంగా ఈ విధంగా వ్యవసాయకూలీ రంగంలో జరుగుతూఉంది. వీరిని పార్టీలోకి తీసుకొని చదువనూ వ్రాయనూ నేర్పి, రాజకీయచైతన్యం గలుగజేయడానికి తగిన ఓపిక పార్టీ ఆర్గనైజర్లలో లేదు. బ్రిటిషుప్రభుత్వం చదువనూ, వ్రాయనూ ఉచితంగా నేర్పితే వీరు వారిని పార్టీలోకి తీసుకొని పనిచేయించుకొంటారు,

1929 నుండీ నేటివరకు భారతపార్టీలో ఉన్న పెద్దలోటు ప్రజాపోరాటాలలో పైకి వచ్చిన మిలిటెంట్సును పార్టీలో చేర్చుకొని వారికి రాజకీయ పరిజ్ఞానం కలుగజేయలేకపోవుటే; అందువలననే ప్రతిదశలోను తన రాజకీయ నినాదాలను పూర్తిగా అమలు జరుపలేకపోయింది.

3. పార్టీసభ్యుల అర్హతలు

(క) పార్టీయొక్క కార్యక్రమాన్ని పాలసీని అంగీకరించితేచాలు. అర్థంచేసుకోనవసరంలేదు." అంటే పార్టీలోకి చేరడానికి ఉత్సాహంగా ఉండే మిలిటెంటు పార్టీపాలసీని అస్పష్టంగా తెలుసుకొని ఉంటాడు. దాన్ని అర్థం చేసుకోవడమంటే చదివి పూర్తిగా అవగాహన చేసుకోవడం. (ఇప్పుడు చాలమంది పార్టీసభ్యులు పార్టీకార్యక్రమాన్ని పాలసీని నిర్దిష్టంగా ఇది అని చెప్పలేరు) అతడు విషయాలు తెలుసుకోవడానికి కుతూహలంగా ఉండాలి. అతనిలో విషయాలు తెలుసుకొని అభివృద్ధి కావాలనే కుతూహలం ఉంది, చక్కని పార్టీసభ్యుడుగా అభివృద్ధిఅయ్యే లక్షణాలు ఉన్నవో లేవో పార్టీకమిటీలుచూడాలి.

(ఖ) యూనిటు డిసిప్లిను ననుసరించడానికి అంగీకరించాలి. అంటే పార్టీయెడల భక్తివిశ్వాసాలుంటే సరిపోదు. మిలిటెంట్సు అందరికీ ఇవి ఉంటాయి. చూడవలసింది అతడు నలుగురితో కలిసి నిర్మాణయుక్తంగా పని చేయగలడేమో చూడాలి. మన పార్టీ మిగతా పార్టీలవంటిది గాదనీ, పాలసీని అంగీకరించి ఏదో పనిచేస్తే చాలదనీ, తన యూనిటుక్రింద శిక్షణతో పనిచెయ్యాలని మిలిటెంటుకు చెప్పాలి.

(గ) వారానికి కొన్ని నిర్ణీతగంటలు పనిచెయ్యాలి. అతనికి ప్రజలమధ్య పనిచేయగల శక్తి ఉన్నదీ లేనిదీ చూడాలి. ఎందువల్లనంటే మనపార్టీ ప్రజల్లో తీవ్రంగా పనిచేసిగాని ఆశయాన్ని సాధించలేదు. మిలిటెంటు విజ్ఞానం సంపాదించాలన్నా అభివృద్ధి కావాలన్నా ప్రాక్టికలుపని చెయ్యాలి.

1943 జాన్యువరిలో జరిగిన రాష్ట్రప్లీనంనుండీ, పార్టీసభ్యులు స్థానిక సమస్యలను తీసుకొని పనిచేయడంవలన, ప్రజాసంఘాలు సజీవంగా తయారవుతూవచ్చాయి. అందుచే ఇప్పుడు మిలిటెంట్ల పట్టుదలను, స్వార్థత్యాగాన్ని ప్రజాసంఘాలలోనే పరీక్షించడానికి అవకాశంగల్గింది. అందుచే కేంద్రప్లీనం నిర్ణయం (పార్టీకి ప్రజాసంఘాలకు మధ్య అటంకాలను తొలగించడం) ఆంధ్రకుకూడ వర్తించుతుంది.

1943 ఫిబ్రవరి కేంద్రప్లీనం పార్టీసభ్యులను చేర్చుకోడానికి నిర్ణయించిన అర్హతలను అనుసరించే, ఆంధ్రలోగూడ పార్టీలో సభ్యులను చేర్చుకోవడం మొదలుపెట్టాం. పార్టీసభ్యత్వం 1150 (లెనిన్‌డే) నుండి 1944 జాన్యువరీ రాష్ట్రప్లీనంనాటికి 4660 వరకూ పెరిగింది. కాని పార్టీ ఆర్గనైజర్లు కేంద్రప్లీనం నిర్ణయించిన పార్టీసభ్యుని అర్హతలను సరిగా అర్థంచేసుకోకపోవడంవల్లనూ, చదువురాని, రాజకీయ పరిజ్ఞానంలేని మిలిటెంట్లను పార్టీలోకి తీసుకొని వారికి రాజకీయశిక్షణ ఇవ్వకపోవడంచేతనూ, మిలిటెంట్లుఅంటేగూడ సరియైన దృక్పథం లేకపోవుటచేతనూ, పార్టీలో కొందరు పనికిరాని సభ్యులు మొదట కొంతమంది తయారయ్యారు. వీరు సరిగా పనిచేయడంగాని, పార్టీ మీటింగులకు హాజరు అవడంగాని, పార్టీకోటాలు చెల్లించడంగాని లేదు. ఈరకమైన పనిజేయని సభ్యులు ఎలా తయారయిందీ చూదాం,

కేంద్రకమిటీ ప్లీనం పార్టీసభ్యత్వానికి మూడు అర్హతలను నిర్ణయించింది.

(1) పార్టీ పాలసీని, కార్యక్రమాన్ని అంగీకరించడం. పార్టీ సాహిత్యాన్ని చదువుతూ, రాజకీయ విజ్ఞానాన్ని అభివృద్ధి పరచుకొనే లక్షణముండటం.

(2) డెమోక్రాటిక్ సెంట్రలిజంమీద ఆధారపడిఉన్న పార్టీశిక్షణకు కట్టుబడి ఉండటం. తన యూనిటు సభ్యులతో జట్టుగా, యూనిటు శిక్షణక్రింద పనిచేయడం. దీనిలోనే సెల్లుమీటింగులకు రెగ్యులరుగా రావడం, పార్టీకోటాలు చెల్లించడంగూడ ఇమిడిఉంది.

(3) వారానికి కనీసం 4 గం॥ పార్టీ ఇచ్చినపనిని చేయడం. పార్టీపాలసీ అంగీకరించాననీ, శిక్షణకు కట్టుబడిఉంటాననీ, పనిచేస్తాననీ, చెప్పినంత మాత్రాన కొంతమంది

ఆర్గనైజర్లు కొందరిని పార్టీసభ్యులుగా తీసుకున్నారు. పైమూడు హంశాలు నామమాత్రంగా అంగీకరిస్తే చాలదు. వాటిని ఆచరణలో పెడతాడని పార్టీ ఆర్గనైజరుకు విశ్వాసముండాలి. ఆ విశ్వాసం సైతం పార్టీలో చేరతానన్నవ్యక్తి హామీఇచ్చినంతమాత్రాన గలుగదు. ఆ మిలిటెంటును ఆర్గనైజరుగాని మరొక ముఖ్య కార్యకర్తగాని, ప్రజాపని చేస్తుంటే పూర్తిగా ఎరిగి ఉండాలి. చెప్పేదానికి చేసేదానికి సంబంధంలేని బూర్జువాభాషలో, అంగీకరించడమనేదానిలో ఆచరించడమనేది ఇమిడిఉండదు. కాని మార్క్సిస్టు భాషలోమాత్రం అంగీకరించడంలో ఆచరించడమనేదిగూడ ఇమిడిఉంది.

మిలిటెంటుఅంటే ఆర్గనైజర్లకు కొందరికి సరియైన దృక్పథంలేదు. ఎప్పుడో ఒకప్పుడు ఏదో సహాయం చేసినవారినందరినీ మిలిటెంట్లక్రింద లెక్క గడుతున్నారు. మిలిటెంటు ప్రజలను ఏదైనా సమస్యమీద పార్టీ సమీకరించుతున్నప్పుడు పైకి తేలతాడు. తనంతటతానే చొరవతీసుకొని పార్టీకి ప్రజాసంఘాలకు పనిలో సహాయపడటం ప్రారంభిస్తాడు. ఈవిధంగా వరుసగా (Consistent) సహాయపడుతూనే ఉంటాడు. అప్పుడప్పుడు ఏదో సహాయపడే వారంతా మిలిటెంట్లుగాదు. అంటే మిలిటెంట్లకు అవసరమైనప్పుడు సొంతపనిగూడ మానివేసి, ప్రజాపనిచేసే స్వార్థత్యాగం ఉంటుంది. ప్రజలుగూడ అప్పుడప్పుడు పార్టీకి పనిలో సాయంచేస్తారు. కాని వారు సొంతపని వదలుకొని, పార్టీకి సహాయంచేయరు. అంతేగాక మిలిటెంటు పార్టీ మీటింగులకు బహిరంగసభలకు రెగ్యులరుగా హాజరవడంవల్ల కొంతవరకూ రాజకీయపరిజ్ఞానం గూడ సంపాదించి ఉంటాడు. మిలిటెంటుకు ప్రజలకు భేదమిదే. ఇక మిలిటెంటుకు పార్టీసభ్యునికి మధ్యనున్న తేడా చూదాం. పార్టీసభ్యుడు రెగ్యులరుగా పార్టీసాహిత్యం చదువడం, తనకు ఇష్టంలేని పనిని సైతం పార్టీశిక్షణకు కట్టుబడిచేయడం, రెగ్యులరుగా పనిచేయడం చేస్తూఉంటాడు. మిలిటెంటుకు తన తలిదండ్రులను, దగ్గరస్నేహితులను సైతం వ్యతిరేకించి పార్టీ శిక్షణకు కట్టుబడి ఉండేటంత పార్టీచైతన్యం ఉండదు. కొన్నిచోట్ల సెల్లుమీటింగులలోకి మిలిటెంటును గూడ తీసుకువస్తున్నారు. ఇది సరియైనదిగాదు. ఎందువల్లనంటే, సెల్లులో గ్రామ విషయాలను గూర్చి అనేకం మాట్లాడుకుంటారు. ఈవిషయాలు బయటతెలిస్తే ప్రమాదం. ఇటువంటి రహస్యాలను దాయగలశక్తి మిలిటెంట్లలో ఉండదు. జనరలుబాడీ మీటింగులలో పార్టీ నిర్మాణంలోని లోపాలు చర్చించరు గనుకనూ, ఇటువంటి వివరమైన గ్రామ వ్యవహారాలు రావుగనుకనూ, జనరలుగా రాజకీయనినాదాలు, ప్రజాసమస్యలు చర్చించబడతాయి గనుకనూ, మిలిటెంట్లను జనరలుబాడీ మీటింగులలోకి తీసుకురావలెను. జనరలుబాడీ మీటింగులవల్ల మిలిటెంట్లకు రాజకీయ పరిజ్ఞానం గలుగుతుంది. సామాన్యంగా జనరలుబాడీ మీటింగులలో డిసిప్లినరీ చర్యలు, ఆర్గనైజర్ల మార్పులు మొదలైన దైనందిన నిర్మాణవిషయాలు రావు. ఇవి సెల్లులలోనే చర్చించబడతాయి. ఫాక్షనలిజం, డిసిప్లినరీ చర్యలు మొదలైనవి జనరలుబాడీ మీటింగులో ఆలోచించాల్సివస్తే, అప్పుడు

మిలిటెంట్లను దానికి పిలువగూడదు. ప్రజాపని నిర్వహించడానికి ఆటంకంగాఉన్న నిర్మాణ పద్ధతులు, దాని అవుసరమైన నిర్మాణమార్పులు జనరలుగా మాత్రమే, జనరలుబాడీ మీటింగులలో చర్చించవచ్చును.

మూడవ విషయం. చదువు పూర్తిగా రానటువంటి, వానాకాలపు చదువు వచ్చినా ఏమాత్రం రాజకీయ పరిజ్ఞానం లేనటువంటివారిని వ్యవసాయ కూలీలనుండి, బీదరైతుల నుండి కొంతమంది మిలిటెంట్లను పార్టీలోకి తీసుకోవడం జరిగింది. వారిని అలాతీసుకోవడం సరిఅయినదే. కాని వారికి రాజకీయ పరిజ్ఞానం కలుగచేయడం, చదువను వ్రాయను నేర్పడం, మొదలైనవి చేయకపోవడంవల్ల, కొంతకాలం తర్వాత వారు జారిపోవడం జరుగుతోంది. వారు మొట్టమొదట జనరలుబాడీ మీటింగులకు, సెల్లు సమావేశాలకు హుషారుగారావడం, ప్రాథమిక చారిత్రిక, భౌగోళికపరిజ్ఞానమైనా లేకపోవడంవల్ల ఆ మీటింగులలో చెప్పేది అర్థంకాకపోవడం. పార్టీ మీటింగులకు వెళ్ళి టైము పాడుచేసుకొనే దానికన్నా ఏదో సొంతపని చేసుకోవచ్చునని పార్టీమీటింగులకు హాజరుకాకపోవడం, అడిగితే రాకపోయినా పార్టీ ఇచ్చినపని చేస్తానని చెప్పడం, జరుగుతోంది. పార్టీపని చేయటానికి సిద్ధంగాఉండి, పార్టీమీద భక్తివిశ్వాసాలున్నవారు జారిపోవడం, పూర్తిగా పార్టీలోటే. ఏకార్యమైనా రాజకీయంగాను, ప్రాక్టికలుగాను నిత్యం అభివృద్ధి అవ్వాలి. అతనికి తాను పార్టీలో అభివృద్ధి అవుతున్నాననేభావం హుషారుకలగాలి. అప్పుడు అతడు పార్టీశిక్షణను చైతన్యసహితంగా అవలంబించుతాడు. లేకపోతే హుషారులేకపోవడం, పార్టీ పనిని మెకానికలుగాచేయడం, పార్టీశిక్షణను మెకానికలుగా ఆచరించడం క్రమక్రమంగా దిగజారడం జరుగుతుంది. కనుక ప్రతి పార్టీసభ్యుడూ నిత్యం అభివృద్ధి అవుతూవుండాలి. లేకపోతే దిగజారుతున్నాడన్నమాట. పై రెంటికీ మధ్యస్థంగా ఉండడంఅనేదిలేదు.

పార్టీసభ్యులకు ఉండాలిసిన అర్హతలు లేనివారిని పార్టీనుంచి తొలగించవచ్చును. కాని రాజకీయ పరిజ్ఞానంలేని పైరకం పార్టీసభ్యులకు, రాజకీయపరిజ్ఞానం కలుగజేయడానికి చేయాలిసిన ప్రయత్నాలన్నిటినీచేసి అటుతర్వాతనే చురుకుగా పనిచేయనివారిని పార్టీనుండి తీసివేయాలి.

కొన్నిచోట్ల పార్టీసభ్యులను తీసుకోబోయేముందే తీసుకుంటామని వారితోచెప్పి, వారిఎదుటే తీసుకోవచ్చునా కూడదా అని చర్చించడం, కొంతమంది మొగమోటపడి ఊరుకోవడం. ఈవిధంగా అనర్హమైన వ్యక్తులనుగూడ పార్టీలోకి తీసుకోవడం, సెల్లు తీసుకోనిరాకరించితే 'రికమెండు' చేసిన సభ్యునికి తీసుకోబడని అతనికి రియాక్షను రావడం, జరుగుతోంది. ఈవిధంగా పార్టీకి దెబ్బతగులుతోంది. కనుక పార్టీసభ్యుని తీసుకోబోయేముందు అతనిని అడగాలిసిన అవుసరంలేదు, తీసుకోదగినవాడైతే, సెల్లులో చర్చించి నిర్ణయం తీసుకోవడం. అటుతర్వాత అతనిని అడగడం చెయ్యాలి. ముందే తీసుకువచ్చి సెల్లులో కూర్చోబెట్టరాదు.

వివిధవర్గాల మిలిటెంట్లను పార్టీలోకి తీసుకొనుట

కార్మికులు వ్యవసాయకూలీలు స్వొంత ఆస్తిలేనివారుగనుక ఈ వర్గాలు ఎవ్వరినీ దోపిడీచేసేవిగావు గనుకనూ ఈ వర్గాలనుండి వచ్చేవారిని కనీసపు పార్టీ అర్హతలుంటే వెనుకాడక తీసుకోవచ్చును.

చిన్నరైతులు తాము శరీరశ్రమచేసినా, అప్పుడప్పుడూ కూలీలను పెట్టిపని చేయించుతాడు గనుక, సొంతఆస్తి ఉంటుందిగనుకనూ, వీరిలో కొద్దిగానైన దోపిడీతత్వం వ్యక్తి ఆస్తితత్వం ఉంటుంది. కనుక వీరిలోనుంచి వచ్చే మిలిటెంట్లు కమ్యూనిజమనే ఆశయానికి చిహ్నం, పార్టీ నిర్ణయించిన కూలిరేటును అంగీకరించడం, కూలీలను సోదరులవలె చూడడం; వారిని పార్టీలోకి తీసుకోబోయేముందు పైరెండూ చూడాలి.

ధనికరైతులు సామాన్యంగా శారీరక శ్రమజేయరు. కూలీలమీద పెత్తనంచేస్తారు, వీరిలోని మిలిటెంట్లు పైరెండుపనులు చేయడాని కంగీకరించడమేగాక, శారీరక శ్రమజేనే వారంటే ప్రేమఉండాలి. పెత్తనంజేసేతత్వం ఉండగూడదు శారీరకశ్రమకు నైతంఓర్వాలి. బీదరైతులనుంచి వచ్చేవారికన్న, వీరిలోనుంచి వచ్చేవారిని జాగ్రత్తగా పరీక్షించాలి. పెట్టుబడిదార్లనుండి వచ్చేవారుగూడ కార్మికులు బీదలంటే ప్రేమ, శారీరకశ్రమకు ఓర్చడం' దూబరాఖర్చులేకుండా ఉండటం, పెత్తనంజేసేతత్వం లేకుండా ఉండటం, మొదలైన లక్షణాలుండాలి. ఈవర్గాన్నుంచి వచ్చేవారిని ధనికరైతులనుండి వచ్చేవారికన్నా ఇంకా జాగ్రక్తగా పరిశీలించాలి'

భారతదేశంలో ఉన్నవర్గాల్లో అన్నిటికన్న అభివృద్ధి నిరోధకమైనది జమీందారీ వర్గం. వీరికి శ్రమచేయకపోవడం' పెత్తనంచేయడం, దూబరాఖర్చుచేయడం మొదలైన అవలక్షణాలు ఉండటమేకాదు; దాసీలచే కాళ్ళు గడిగించుకోవడం బెట్టుగా మాట్లాడకుండా కూర్చోవడం, మాటమాటకు తప్పుబట్టుకోవడం, సాంఘిక దురాచారాలు అన్నీ సమర్థించడం, మొదలైన 16 వ శతాబ్దపు దురాచారాలన్నీ ఉంటాయి. కనుక ఈ వర్గాన్నుంచి కమ్యూనిస్టుపార్టీలోకి రావడం చాలకష్టం, వీరిని మరీ జాగ్రత్తగా పరిశీలించాలి.

కార్మికవర్గపార్టీ యైన కమ్యూనిస్టుపార్టీలో చేరేటప్పుడు, ఇతరవర్గాలనుంచి వచ్చిన వారు తమతమ వర్గసిద్ధాంతాలను, అలవాట్లను, దృక్పధాన్నివదలుకొని, కార్మికవర్గసిద్ధాంతమైన కమ్యూనిజాన్ని, కార్మికవర్గఅలవాట్లను, దృక్పధాన్ని స్వీకరించాలి. దీనినే 'డీక్లాసు' అవడమని అంటాం. (ఇది ఇంతకుపూర్వం పూర్తిగా వివరించఃడింది.) చిన్న రైతులు, ధనికరైతులు, పెట్టుబడిదార్లు, జమీందార్లు ఈ వరుసలో పైకి పోయేకొలదీ, 'డీక్లాసు' అవడంలో కష్టం ఎక్కువఅవుతూ ఉంటుంది. కనుక వరుసలో పైకిపోయే కొద్దీ పార్టీలో చేరడం తక్కువ అవుతూపోతుంటుంది.

వివిధవర్గాలనుంచి పార్టీలోకి సభ్యులు రావడం ఏవిధంగా ఉంటుందో, పార్టీ ఆర్గనైజర్లకు సలహాగా మాత్రమే వ్రాయబడింది. దాన్ని 'మెకానికలు'గా అర్థంచేసుకొని పార్టీసభ్యత్వాన్ని తగ్గించడంగాని, లేక పార్టీలో, వివిధవర్గాలనుంచి వచ్చినవారిని వేరువేరుగా చూడటంగాని ఉండగూడదు. పార్టీసభ్యునికి ఉండాల్సిన అర్హతలు ఉన్న ప్రతివానిని, ఏ వర్గంనుంచి వచ్చినా, పార్టీలోకి తీసుకోవాలి. పార్టీలోకి తీసుకున్న తరువాత ఏ వర్గాన్నుంచి వచ్చినా, కమ్యూనిస్టే. ధనిక కమ్యూనిస్టు అనిగాని, రైతుకమ్యూనిస్టు అనిగాని, జమిందారు కమ్యూనిస్టు అనిగాని, కార్మిక కమ్యూనిస్టు అనిగాని భేదాలుండవు. ఏ ఇతరవర్గ వ్యక్తికైనా పార్టీసభ్యత్వానికి అర్హతఉందంటే అర్థం, తన వర్గాల ఆశయాలను వదలుకొని కార్మికవర్గ ఆశయాలను స్వీకరించాడన్నమాట. అంటే కార్మికవర్గాన్ని తన వర్గంగా స్వీకరించాడన్నమాట.

ప్రముఖులను పార్టీలో చేర్చుకొనుట

ఇతరపార్టీలలో ప్రముఖులుగా ఉన్నవారికి కొన్ని స్థిరమైన రాజకీయాభిప్రాయాలు పార్టీసంబంధాలు ఏర్పడిఉంటాయి; సామాన్యులకు అలా ఏర్పడవు. వారు పార్టీలో చేరాలంటే, తమ రాజకీయాభిప్రాయాలను అలవాట్లను మార్చుకోవాలి. ఇతర పార్టీసంబంధాలు వదలుకోవాలి. ఇది చాలకష్టం. కనుక ఇతర పార్టీలనుండి ప్రముఖులను పార్టీలోకి తీసుకోవడం అరుదుగా జరుగుతుంది. వీరిని చాల జాగ్రత్తగా పరిశీలించిగాని, పార్టీలోకి తీసుకోవడం జరుగదు. వీరిని పై కమిటీలే తీసుకోవాలి. క్రిందికమిటీలు తీసుకోకూడదు.

స్త్రీలను పార్టీసభ్యులనుగా జేర్చుకొనుట

మనదేశం ఇంకనూ జమీందారీవిధానంనుంచి బయటబడలేదు. సాంఘికకట్టుబాట్లు, అలవాట్లు మొదలైన వాటిలో చాలవరకూ జమీందారీ విధానాన్నే అనుసరిస్తోంది. అందువల్ల వ్యక్తిస్వేచ్ఛకు అంతగా తావులేదు. జమీందారీ సమాజంలో స్త్రీలస్థితి అదరికన్న అన్యాయం. ఏరకమైన వ్యక్తిస్వేచ్ఛ లేదు. భర్తమాట జవదాటగూడదు. సామాన్యంగా స్త్రీలలో వ్యక్తిత్వం నిలుపుకోవడం అరుదు. భార్యలు భర్తలను అనుసరించే పోతుంటారు. కనుక పెండ్లి అయిన స్త్రీలను పార్టీసభ్యురాండ్రుగా తీసుకోబోయేముందు, అవుసరమైతే భర్తను, సాంఘికకట్టుబాట్లను వ్యతిరేకించి, పార్టీని వదలిపెట్టకుండా ఉండేటంత వ్యక్తిత్వం ఉన్నదా అని చూడాలి. అటువంటి వ్యక్తిత్వంలేని వారిని సానుభూతిపరులుగా మాత్రమే ఉంచాలి. ఈవిషయం రాష్ట్రకమిటీ సర్క్యులరు 4/44 లో ఈ క్రిందివిధంగా వివరించబడింది.

అందుచేతనే రాష్ట్రకమిటీ ఈ నిర్ణయంచేసింది:-(1) స్త్రీలను పార్టీసభ్యులమగాతీసుకొనేటప్పుడు, వారి భర్తలు పార్టీసభ్యులు అవునో కాదో చూడాలి. కానిచో భర్తలను పార్టీ

సభ్యులనుగా తయారుచేసేవరకు, సానుభూతిపరులుగానే వుండి పనిచేయించాలిగాని పార్టీలోకి తీసుకోకూడదు. భర్త ఏమాత్రం అభివృద్ధిచెందక ఆమెమరీ ముందుకువస్తున్నప్పుడు, భర్త తనకు వ్యతిరేకమయితే భర్తకు విడాకులివ్వడానికి తగిన చైతన్యం, ధైర్యం ఆమెకున్నదని తోస్తేనే పార్టీసభ్యత్వం ఇవ్వాలి. అది రాష్ట్రకమిటీ అంగీకరించిన పిమ్మటే జరగాలి.

(2) భార్యాభర్తలు పార్టీలోనుండినప్పుడు, భర్తను పార్టీనుండి తీసివేస్తే, భార్య భర్తకు విడాకులివ్వడానికి, వేరుగావడానికి తయారుకావాలి. లేనిచో ఆమెను సానుభూతి పరురాలుగా పరిగణించాలి.

(3) పెండ్లికాని స్త్రీ పార్టీసభ్యులు, పార్టీసభ్యుడుకాని వానివి పెండ్లిచేసుకోకూడదు. అలా చేసుకుంటే పార్టీసభ్యత్వాన్ని కోల్పోతుంది.

ఇలాగే గ్రామపెత్తనదార్ల విషయంగూడ. వీరుగూడ గ్రామంలో తన సొంతపనుల కోసం అనేక పిచ్చిపనులు చేసిఉంటారు. వీరు ఈ అలవాట్లను మార్చుకోవడం, తమ పెత్తనదారీతనాన్ని వదలుకొని పార్టీశిక్షణకు కట్టుబడిఉండటం చాలకష్టం. గనుక వీరిని గూడ పార్టీలోకి తీసుకోవడం చాల అరుదుగా జరుగుతుంది. తొందరపడి తీసుకుంటే, వీరు పార్టీకి పెద్ద బెడదఅయి, పార్టీలో చీలికలకుగూడ కారకులవుతారు.

కనుక ప్రముఖవ్యక్తులనుగాని, పెత్తనదార్లనుగాని సెల్లులు పార్టీలోకి తీసుకోగూడదు. పైకమిటీలకు ' రికమెండు ' మాత్రం చేయవచ్చును. ఆవ్యక్తియొక్క ప్రాముఖ్యతనుబట్టి, గ్రామంలో ప్రముఖవ్యక్తి అయితే తాలూకాకమిటీ, తాలూకాలో ప్రముఖవ్యక్తిఅయితే జిల్లాకమిటీ, జిల్లాలో ప్రముఖవ్యక్తి అయితే రాష్ట్రకమిటీ, పార్టీలోకి తీసుకోవాలి.

యువక కమ్యూనిస్టులు

పార్టీ నిబంధనావళి 3 వ నిబంధనలో 1 ఎ సెక్షను ప్రకారం 18 సంవత్సరాలు దాటినవారు మాత్రమే పార్టీలో సభ్యులుగా తీసుకోబడతారు. 14–18 సం॥ మధ్యవయస్సు గలిగి, పార్టీ రాజకీయాలను శ్రద్ధగాచదువుతూ, పనిచేస్తున్నవారికి యంగ్ కమ్యూనిస్టు సెల్సు ఆర్గనైజుచెయ్యాలి. వారికి పార్టీ కాన్ఫరెన్సులలో ఎన్నికలలో పాల్గొనేహక్కుగాని, లేక తీర్మానాలమీద ఓటిచ్చే హక్కుగాని లేదు.

పైదాని ఉద్దేశ్యమేమంటే, సాధారణంగా 18 సం॥దాటితేనేగాని ఏ యువకునికైనా తన అభిప్రాయాలకోసం నిలబడిపోరాడే వ్యక్తిత్వం, తలిదండ్రులను అవుసరమైతే ఎదిర్చి పనిచేసే పట్టుదలరాదు. అందువల్ల పార్టీ సభ్యత్వ అర్హతకు 18 సం॥వయస్సు నిర్ణయించబడింది. కాని కమ్యూనిస్టు కుటుంబాలనుండీ, విద్యార్థులనుండీ వచ్చిన 18 సం॥ నిండని యువకులు కొంతమంది, పార్టీ సాహిత్యం శ్రద్ధగా చదవడం పార్టీపని చేయడం చేస్తూ

ఉంటారు. వీరిని యువక కమ్యూనిస్టు సెల్లులలో ఆర్గనైజుచెయ్యాలి. 1943 జూనుకు పూర్వం 18 సం॥ నిండకపూర్వమే పార్టీసభ్యులుగా తీసుకోబడినవారిని పార్టీసభ్యులుగానే పరిగణించాలి. అటుతర్వాత వారినిమాత్రమే యువక కమ్యూనిస్టు సెల్లులలోపెట్టాలి.

వ్యక్తిదురలవాట్లు - పార్టీ

పార్టీసభ్యులు అన్నివిషయాలలోనూ ప్రజలకు ఆదర్శంగాఉంటే, పార్టీ ఎంతో అభివృద్ధిఅవుతుంది. కాని ప్రస్తుతసమాజవిధానంవల్ల త్రాగుడు, వ్యభిచారం, జూదం మొదలైన దురలవాట్లు ప్రజల్లో ఉన్నవి. ప్రజాపార్టీ అయిన మన పార్టీలోగూడ చుట్టుపట్లఉన్న ఈ వాతావరణం కొంతవరకు ప్రతిబింబించడం అసాధ్యంగాదు. అందువల్ల పార్టీలోగూడ కొద్దిమంది పై దురలవాట్లు ఉండిగూడ, పార్టీలో శ్రద్ధగా పనిచేసేవారు ఉండటం అసంభవంగాదు. కాని పై దురలవాట్లలో పూర్తిగామునిగిపోయి, ఇక వాటినుండి బయటబడే అవకాశంలేనివారికి పార్టీలో తావులేదు. పై దురలవాట్లు కొద్దికొద్దిగాఉన్న వారందరినీ పార్టీనుంచి తీసివేయడమంటే పార్టీ దెబ్బతింటుంది.

అలా తీసివేయడమంటే, ప్రస్తుత సమాజంలోని ఆర్థిక పరిస్థితులవల్ల ఇటువంటి దురల్వాట్లు వచ్చాయినీ గ్రహించకపోవడమన్నమాట; ఆ సమాజవిధానాన్ని మార్చి, ఇటువంటి దురల్వాట్లకు ఆర్థిక అవకాశంలేని సోషలిస్టు సమాజాన్ని తీసుకురావడానికి బదులుగా, సంస్కరణతత్వ మవలంబించడమన్నమాట. అంటే దీని అర్థం ఆ దురల్వాట్లను పార్టీ లీగలైజుచేస్తున్నదనిగాదు. వీటిని పార్టీసభ్యులలో పోగొట్టడానికి తీవ్రకృషి నిరంతరం సాగిస్తుంది.

అటువంటివారు క్రమంగా వారి దురలవాట్లను మానుకొనేలా చేయడానికి పరిస్థితులను కల్పిస్తుంది. వివరాలకు 4/44 నెం. పార్టీ లెటరు చదవాలి.

పార్టీ సభ్యులపని తనిఖీచేయడం - తగినస్థానాల్లో ఉంచడం

ప్రజలను సమీకరించి వారి సమస్యలను పరిష్కరించే ఆయుధంగా ఆ రోజుకారోజు ఎక్కువగా పార్టీని అభివృద్ధిచెయ్యాలంటే, పార్టీ యంత్రాన్ని ఎల్లప్పుడూ పరిశీలించి లోపాలను సవరించుతూ పదునుపెడుతూ ఉండాలి. అందుకు ఆర్గనైజర్లు తమ క్రిందనున్న పార్టీసభ్యులు ఎలా పనిచేస్తున్నదీ తనిఖీచెయ్యాలి. వారికి పనిలోవచ్చే సమస్యలకు పరిష్కారమార్గంచూపి, అవుసరమైతే చేసిచూపించి, వారికి ఆచరణలో శిక్షణ ఇవ్వాలి. ఆవిధంగా వారిని ఉత్సాహపరచి, ఆత్మవిశ్వాసాన్ని చొరవను కల్గించాలి. ఇది బోల్షివిక్కు తనిఖీఅంటే. కొంతమంది ఆర్గనైజర్లు పార్టీసభ్యులను "ఇదిచేశావా? అదిచేశావా? కోటాలు ఎందుకు పూర్తిచేయలేదు?" అని దబాయించడం తనిఖీచేయడం

తీసుకుంటున్నారు. ఇందువల్ల పార్టీసభ్యులలో డీమోరలైజేషనువచ్చి, జారిపోవడం మాత్రమే జరుగుతుందిగాని, వారు అభివృద్ధి అవడానికి ఉపయోగపడదు. ఇది బూర్జువా తనిఖీ; నిరంకుశోద్యోగులు తనిఖీచేసే పద్ధతి.

పని తనిఖీతోపాటు పార్టీసభ్యుల ఆరోగ్యం. గృహఇబ్బందులనుగూడ తెలుసుకోవాలి. వాటికిగూడ పరిష్కారమార్గాలు చూపెట్టాలి. ప్రతి పార్టీసభ్యుడూ తనభార్యనూ, పిల్లలనూ, తన కుటుంబాన్ని పార్టీపైపుకు తీసుకురావడానికి ఏమిచేస్తున్నాడో తెలుసుకొని, సలహాలివ్వాలి, పార్టీసభ్యుల వ్యక్తిగత లోపాలు ఏమైనాఉంటే, సవరించుకొనేమార్గం చూపాలి. సిగరెట్లు, టీ, కాఫీలు అధికంగా త్రాగడం, సాధ్యమయినంతవరకూ భోజనం నిద్ర మొదలైనవాటిలో రెగ్యులరుగాఉండక అరాజకంగా ఉండటం, మొదలైన దురలవాట్లవల్ల సభ్యులు ఆరోగ్యం చెడగొట్టుకోకుండా చూడాలి. ఎందువల్లనంటే, పార్టీసభ్యుల అనారోగ్యం, గృహఇబ్బందులు, వ్యక్తిలోపాలు, పార్టీసభ్యులు పనిచేయడానికి ఆటంకంగా ఉంటూఉంటాయి.

పార్టీసభ్యుల పనిని తనిఖీచేయడంలోనే, ప్రతి పార్టీసభ్యునియొక్క శక్తిసామర్థ్యాలు, వివిధరంగాలలో దేనికి పనికివచ్చేదీ, లోపాలు తెలుస్తాయి. పై తనిఖీనిబట్టి చురుకుగాఉన్న పార్టీసభ్యులను పైస్థానాలలోకి పంపడం, తమ బాధ్యతలను సరిగా నిర్వహించలేనివారిని క్రింది స్థానాలకుదింపడం, ఒకసభ్యుడు ఏ రంగంలో బాగా పనిచేయగలడో తెలుసుకొని ఆ రంగానికి మార్చడం, మొదలైనవిచేస్తూ ఉండాలి. ఒకపార్టీ సభ్యునికి పని ఇచ్చేముందు, (1) అతనికి ఆ బాధ్యతను నిర్వహించగల రాజకీయస్థాయి (2) ఆపనికి అవుసరమైన ప్రాక్టికలుజ్ఞానం, వ్యవహారజ్ఞానం (3) ఆపనిఅంటే అభిరుచి, ఉన్నవా అని సాధారణంగాచూడాలి. పార్టీలో అవుసరమైన పైమార్పులు చేయడంలో, పైమూడు హంశాలే చూడాలిగాని, మరే ఇతర కారణాలు అడ్డుగా రాగూడదు. తనపనిని సరిగా నిర్వహించని, అభివృద్ధి అవడానికి అన్ని అవకాశాలుఇచ్చినా అభివృద్ధిగాని కామ్రేడును అతని స్థానంలోనుంచి తొలగించి, క్రిందిస్థానం ఇవ్వడానికి ఏమాత్రం జంకరాదు. అలాగే త్వరత్వరగా అభివృద్ధిఅవుతున్న కామ్రేడు పార్టీలోచేరి చాలకాలం కాకపోయినా, పైస్థానంలోకి వేయుడానికి సంకోచించరాదు. ఇప్పుడు రాజకీయాలు ఎంతో వేగంగా పరుగెత్తుతూఉన్నవి. మనపార్టీ తనమీదనున్న బాధ్యతలను నిర్వహించుతూ, ప్రజాపార్టీగా తయారవుతోంది. ఈ పరిస్థితుల్లో పార్టీ సభ్యులను పరీక్షించడానికి అనేక ఘటనలు వస్తూఉన్నవి. అందుచేత సమస్యలను పరిష్కరించడంలో చొరవజూపిన కామ్రేడ్స్‌ను త్వరత్వరగా పైస్థానాల్లోకి పంపాలి. అంతేగాక కొంతమంది కామ్రేడ్స్ పరిస్థితుల గమనంతో ముందుకుపోలేక, తమబాధ్యతలను నిర్వహించలేక, తమస్థానాల్లో ఉండి పార్టీఅభివృద్ధికి ఆటంకంగాఉన్నారు. పార్టీఅభివృద్ధిని దృష్టిలోపెట్టుకొని, ఇటువంటివారికి విషయాలు నచ్చజెప్పి, బాధ్యతలు తొలగించి, శక్తిసామర్థ్యంగల కొత్త కామ్రేడ్స్‌ను ఆ స్థానాలలోవెయ్యాలి. పార్టీసభ్యులపని తనిఖీ, ప్రమోషను మొదలైనవిషయాన్ని గూర్చి కామ్రేడ్ స్టాలిన్ ఈవిధంగా చెప్పాడు.

కేడర్ల సెలక్షన్, ప్రమోషన్, నియామకం

రాజకీయపంథా దేనికి? ప్రకటనకొరకుగాదు. కార్యరంగంలో అమలుచేయుటకే సరియైన రాజకీయపంథా. కాని సరియైన రాజకీయపంథాను కార్యరంగంలో విజయవంతంగా అమలుజరపాలంటే, ఆ రాజకీయపంథాను సరిగా అర్థంచేసుకొని, అది తమ పంథాయే అని భావిస్తూ ఆచరణలో పెట్టగల్గి, ఆ పంథానుగురించి వచ్చే అనుమానాలను తీర్చి పంథాను సమర్థించి దానికొరకు పోరాడగల్గిన శక్తిగల కాడర్లు అవసరం. అటువంటి కాడర్లు లేనియెడల, ఆ రాజకీయపంథా సరియైనది అయినప్పటికీ నామమాత్రంగానే ఉండిపోతుంది.

ఇక్కడే బయలుదేరుతుంది అసలు విషయం. కాడర్లను సరిగా సెలెక్ట్‌చేయుట, కాడర్లకు శిక్షణ ఇచ్చుట, కొత్తవారిని ప్రొమోట్‌చేయుట, కాడర్లను సరిగా నియమించుట, చేస్తున్న పనినిబట్టి కాడర్లను పరీక్షచేయుట—యీ ప్రశ్నలు బయలుదేరుతాయి.

కాడర్లను సరిగా సెలక్ట్‌చేయుట అంటే ఏమిటి?

కాడర్లను సరిగా సెలెక్టుచేయుట అంటే, చుట్టూ బోలెడంత మంది అసిస్టెంట్లను తమక్రింద పనిచేసేవారిని ప్రోగుచేసి, ఆఫీసు ఒకటి పెట్టుకొని, ఆర్డర్ తరువాత ఆర్డర్ ప్యాస్‌చేయటంకాదు (నవ్వు). తనక్రిందఉండే వందలమందిని ఒక పనినుంచి ఇంకో పనిలోకి అసందర్భంగా మారుస్తూ "పునర్నిర్మాణాలు" సాగిస్తూ అధికార దుర్వినియోగం చేయుటకాదు. (నవ్వు)

కాడర్లను సరిగా సెలెక్టుచేయుట అంటే:—

1. పార్టీయొక్క, ప్రభుత్వంయొక్క బంగారపునిధిగా కాడర్లను చూస్తూ, వారిని గౌరవిస్తూ భద్రపరచాలి.

2. కాడర్లను గురించి తెలుసుకుంటూ, వారిలో ప్రతి ఒకవ్యక్తియొక్క సుగుణాలను, లోపాలను గ్రహిస్తూ, ఏ స్థానంలో ఉంటే ఆ వ్యక్తియొక్క శక్తిసామర్థ్యములు అభివృద్ధి కాగలవో పరిశీలించాలి.

3. అభివృద్ధి కాగల ప్రతివర్కరునూ, టైమ్ లేదని విసుగుపడకుండా, అభివృద్ధి చేస్తూ, కాడర్లను పెంపొందించాలి.

4. క్రొత్తవారిని, యువకకాడర్లను ధైర్యంగా సాహసించి, ప్రొమోట్‌చేయాలి. కాని సంకోచిస్తూ, వారిని పాతస్థానాల్లోనే ఉంచి క్షీణింప చేయరాదు.

5. తనకు తగినటువంటి స్థానంలో నియమించబడినాడనే భావాన్ని ప్రతి వర్కరులో కల్గునట్లు వర్కర్లను నియమించినప్పుడు, ప్రతివర్కరూ తన సంపూర్ణ శక్తిసామర్థ్య

ములను వినియోగించి అందరి ఉమ్మడి ఆశయంయొక్క అభివృద్ధికి తోడ్పడగల్గుతారు. అంతేకాదు. రాజకీయ పంథాను అమలుచేయుటకు తగిన కాడర్ల విభజనగూడజరుగుతుంది.

ఈ సందర్భంలో ప్రత్యేకంగా గుర్తించవలసినది. నూతనంగావచ్చే యువక కేడర్లను సకాలంలో సాహసించి ప్రొమోట్ చేయుటయే. ఈ విషయంలో అందరికి స్పష్టమైన అభిప్రాయం లేదనుకుంటాను. వ్యక్తులను సెలెక్ట్ చేయునప్పుడు, ప్రధానంగా పాతకేడర్ల మీదనే ఆధారపడాలని కొందరి అభిప్రాయం, అలాకాకుండా, నూతన కేడర్లమీద ప్రధానంగా ఆధారపడాలని మరికొందరి అభిప్రాయం. ఈ రెండుఅభిప్రాయాలూ సరియైనవికావు.

పాత కాడర్లు పార్టీకి, ప్రభుత్వానికి గొప్ప అండ అనుటలో సందేహంలేదు. కొత్తవారికిలేని గొప్ప అనుభవజ్ఞానం, నాయకత్వ అనుభవం వారిలో ఉన్నమాటనిజమే. మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతాలలోనూ, విషయజ్ఞానంలోనూ, స్వయంశక్తితో నడుపగల శక్తిలోనూ, వారికి గొప్ప శిక్షణ అనుభవాలు ఉండేమాటనిజమే, కాని చాలినంతగా ఈ పాతకేడర్లు ఎప్పుడూ లేరని, కాలగతిలో వీరిసంఖ్య తగ్గిపోతున్నదనేది మొదటి విషయం. రెండవది - పాతవారిలో కొంతమందికి గడచిపోయిన భూత కాలమునందే దృష్టి ఎక్కువగా ఉండి పాతదాన్నే పట్టుకొని వేళ్ళాడుతూ, పాత దారులలోనే చిక్కుకొనిపోయి. జీవితకాలంలో వస్తున్న నూతన సృష్టిని గుర్తించలేకపోవుట జరుగుతుంది. నూతనగతిని చూడలేనటువంటి దృష్టి యేర్పడుతుంది. ఇది సామాన్యలోపంకాదు. చాలా అపాయకరమైన లోపంగాగూడ పరిణమిస్తుంది.

ఇక క్రొత్తగావచ్చిన యువక కేడర్లవిషయంలో పాతవారికున్నంత అనుభవం, శిక్షణ, విషయజ్ఞానం, స్వయంగా నడుపగల శక్తిలేనిమాట వాస్తవమే. కాని యువక కాడర్లు అసంఖ్యాకులుగా ఉన్నారనేది మొదటి ముఖ్యవిషయం. రెండవది - వారంతా యువజను లగుటవల్ల ఇచ్చినపనిలోనుంచి వెళ్ళిపోయే అపాయం ఉండదు. మూడవది - బోల్షివిక్కుల లక్షణమైన ఉత్సాహం, నూతన జీవితమంటే అంతులేని ఉత్సాహం వారిలో నిండి ఉంటుంది. నాల్గవది - కొద్దికాలంలో పాతవారిని మించిపోయేటంత వడిగా విషయాలను గ్రహించేశక్తి ముందుకు తోసుకుపోయే చొరవ వారిలో నుంటుంది. కొద్ది కాలంలో పాతవారికి సమానులుగా అభివృద్ధిచెంది. పాతవారిస్థానములను ఆక్రమించేస్థితికి వస్తారు. అందువల్ల పాతకాడర్లమీదఆధారపడాలా ? లేక కొత్తకాడర్లమీద ఆధారపడాలా ? అనేది కాదు సమస్య. పార్టీకి ప్రభుత్వానికి అగ్రగామియైన నాయకత్వమును తయారు చేయుటకై ఇద్దరిని జోడించి సమ్మేళనం గావించాలి. (హర్షధ్వనులు)

అందువల్ల నూతన యువక కాడర్లను సకాలంలో నాయకస్థానాలకు ప్రొమోట్ చేయుటకు సాహసించాలి.

ప్రస్తుత దశలో పార్టీ నాయకత్వాన్ని బలపరచే విషయంలో, కాడర్లను సెలక్టుచేసే సందర్భంలో పైనుంచి క్రిందవరకు ఈ సూత్రాలను అనుసరించి పాత కాడర్లను, కొత్త

కాడర్లను సమ్మేళనంగావించి పనిచేయుట పార్టీసాధించిన మహత్తర విజయాలలో ఒకటి అని చెప్పవచ్చును.

పార్టీ కేంద్రకమిటీయొక్క లెక్కలప్రకారం, ప్రస్తుతదశలో నూతన యువక బోల్షివిక్కులను, పార్టీ సభ్యులుగాని, పార్టీకి దగ్గరగా ఉండేవారినిగాని, మొత్తం 5 లక్షల మందిని ఈవిధంగా బాధ్యతగల పార్టీ స్థానములకుగాని, ప్రభుత్వ స్థానములకుగాని ప్రమోట్‌చేయుట జరిగింది. వీరిలో నూటికి 20 వంతులు స్త్రీలు.

ఇప్పుడు మన కర్తవ్యం మేమిటి ?

పైనుంచి క్రిందికి కాడర్లను సెలక్టుచేసే పనినంతా కేంద్రీకరించి నిర్వహించుటకు ఒక ప్రత్యేక సంస్థను యేర్పాటుచేసి, దానిస్థాయిని నిజమైన బోల్షివిక్ స్థాయికి పెంపొందించుటయే మన కర్తవ్యం.

వర్కర్సును సెలక్టుచేయటం యెలా !

వర్కర్సును సెలక్టుచేయుట, సెలక్టు చేసినతరువాత పనిలో సరిగా వారిని విభజించటం - అంటే అర్థంయేమిటి ?

వర్కర్సును సెలక్టు చేయటం అంటే - (1) రాజకీయదృక్పథంనుంచి, ఆ స్థానానికి తగిన దృఢ రాజకీయస్థాయి ఉన్నదా ? (2) ఆచరణ దృక్పథంనుంచి ఆ నిర్ణీతపనిని నిర్వహించగల శక్తి సామర్ధ్యములు ఉన్నవా ? ఈ రెండు విషయాలను చూసి కాడర్లను సెలక్ట్‌చెయ్యాలి.

దీని అర్థం-రాజకీయ స్థాయిని పాటించకుండా కేవలం కార్యసాధనశక్తిని గుణగణాలను లెక్కలోకి తీసుకొని వ్యాపారస్థుడి పంథాను అనుసరించుటకాదు.

దీని అర్థం - కార్యరంగంలో ఉన్న శక్తి సామర్ధ్యాలను పాటించకుండా కేవలం రాజకీయస్థాయియే ప్రధానంగా లెక్కించుటా కాదు.

ఈ బోల్షివిక్ సూత్రాన్ని ఆచరణలో మన కామ్రేడ్స్ వర్తింపచేస్తున్నారా ? అని అడుగవచ్చును. అలా చేయటంలేదని చెప్పక తప్పదు. ఈ విషయాన్ని గురించి ఈ ప్లీనమ్ సమావేశంలో చెప్పడం జరిగింది. కాని విషయాన్నంతా చెప్పలేదు. యదార్థంగా జరుగుతున్నదేమిటంటే. ఈ అనుభవసూత్రాన్ని ఇష్టంవచ్చినట్లుగా దారుణంగా అమలు చేస్తున్నారు. అంతేకాదు. వర్కర్లు తరుచుగా, యదార్ధ పరిస్థితులనుబట్టిగాక, మనస్సుకు తోచినట్లు వాస్తవిక పరిస్థితులకు సంబంధంలేని ఆలోచనల ఫలితంగా వర్కర్లను సెలెక్ట్ చేయుట తరచుగా జరుగుతున్నది. ఎక్కువ తరచుగా తాము ఎరిగినవారిని. వ్యక్తిగత స్నేహితులను, తమ ఊరివారిని, తమయందు వ్యక్తిగత భక్తిని చూపేవారిని, తమను రక్షకులుగా భావించి పొగడేవారిని - రాజకీయస్థాయి ఉన్నాసరే లేకపోయినాసరే, కార్యసాధనశక్తి ఉన్నాసరే లేకపోయినాసరే - వర్కర్లుగా సెలెక్ట్‌చేయుట జరుగుతోంది.

దానిఫలితం ఏమిటి ? బాధ్యతగల్గి నాయకత్వము వహించగల గూర్పుకు బదులు ఒక కుటుంబ గ్రూపుగానో లేక ఒక స్నేహబృందంగానో కమిటీలు ఏర్పడి, ఒకరినొకరు తప్పులు పట్టకుండా, ఒకరినొకరు అభినందించుకుంటూ, ఒక రకమైన శాంతియుత జీవనాన్ని గడుపుతూ, బహిరంగముగా ప్రజలముందు లోపాలను బట్టబయలు చేసుకోకుండా ఉంటూ, తమ విజయాలనుగురించి తెలియజేసే తలనొప్పి రిపోర్టులను అప్పుడప్పుడూ కేంద్రమునకు పంపుట జరుగుతుంది.

అటువంటి బాంధవిక' సంబంధాలు ఏర్పడే వాతావరణంలో వారి పనిలోగల లోపాలను విమర్శించుకొనుటకుగాని, లేక తమ పనినిగురించి నాయకులు ఆత్మవిమర్శనం చేసుకొనుటకుగాని ఎంతమాత్రం అవకాశం ఉండదని సులభంగా తేటతెల్లమవుతుంది.

కామ్రేడ్స్‌యొక్క పనిని 'చెకప్' చేయటం ఎలా ?

వర్కర్లమీద 'చెకప్' అంటేనూ, కర్తవ్యాలను నెరవేర్చే కార్యక్రమంమీద 'చెకప్' చేయుట అంటేనూ అర్థం ఏమిటి ?

వారుచేసే వాగ్దానాలను, ప్రకటనలను, బట్టిగాక, వారియొక్క కృషిఫలితాలనుబట్టి వర్కర్లను పరీక్షించుటయే వర్కర్లమీద చెకప్ అవుతుంది.

ఆఫీసులోనూ రిపోర్టులనుబట్టి మాత్రమేగాక నెరవేర్చిన పనిఫలితాలనుబట్టి పనిచేసే కేంద్రములోనే ప్రధానంగా పరీక్షించుటయే సాధించిన కర్తవ్యాలమీద చెకప్ అవుతుంది.

అటువంటి జెనరల్ 'చెకప్' అవసరమా ? నిస్సందేహంగా అవసరం. ఎందుకంటే (1) అటువంటి చెకప్‌వల్లనే వర్కర్‌ను నిజంగా తెలుసుకొనగల్గుతాం. ఇంకా అతని నిజగుణాలుగూడా వెల్లడి కాగలవు. (2) అటువంటి చెకప్‌ద్వారా మన కార్యనిర్వాహక నిర్మాణంలోని లోపాలోపాలను, మంచిచెడ్డలను తెలుసుకొనగల్గుతాం. (3) అటువంటి 'చెకప్'వల్లనే కర్తవ్యాలయొక్క లోపాలోపాలనుగూడా నిర్ణయించగల్గుతాం.

పనియొక్క ఫలితాలను నాయకులు పైనుంచి కామ్రేడ్స్‌ను పరీక్షచేయుటద్వారానే తెలుసుకొనగల్గుతారని కొందరి కామ్రేడ్స్ అభిప్రాయం. ఇది సరియైనది కాదు. అంతమాత్రాన పైనుంచి తనిఖీచేయుట అనవసరమనికాదు. అదికూడా అవసరమే.

కాని పైనుంచి చేసే 'చెకప్'ద్వారా జరగవలసిన 'చెకప్' అంతా జరుగదు. క్రిందినుంచి చేయవలసిన 'చెకప్'గూడా ఉన్నది. ప్రజలు, క్రిందికమిటీ కామ్రేడ్స్ నాయకులను పరీక్షించి వారి తప్పులనుచూపి వారిని సరియైన పద్ధతిలో పెట్టుటకై క్రిందినుంచిగూడా 'చెకప్' అవసరం. వ్యక్తులను పరీక్షించుటకు ఈ 'చెకప్' ఎంతో ఉపయోగపడుతుంది.

ఆక్టివ్ పార్టీవర్కర్ల సమావేశాల్లోనూ, కాన్ఫరెన్సులలోనూ నాయకుల రిపోర్టులను విని, వారి లోపాలను విమర్శించి, పై కమిటీలకు ఎన్నుకునే విషయంలో కొంతమందిని ఎన్నుకొని ఇతరులను ఎన్నుకొనకుండా ఉండుటద్వారా పార్టీ సామాన్యసభ్యులందరూ పార్టీ నాయకులను పరీక్షిస్తారు. మన పార్టీ నిబంధనల ప్రకారం నిజమైనటువంటి ప్రజాస్వామ్య కేంద్రీకరణ సూత్రం, అభ్యర్థులను నిలబెట్టి ఉపసంహరించుకునే హక్కులు, రహస్య వోటింగు, విమర్శనా స్వాతంత్ర్యం, ఆత్మవిమర్శనా స్వాతంత్ర్యం, ఇవన్నీ నిజంగా సజీవంగా ఉండాలి. దానికొరకు జరిపేకృషి సందర్భంలోనే పార్టీనాయకులను పార్టీ సామాన్య సభ్యులందరూ 'చెకప్'చేయుటగూడా జరుగుతుంది.

పార్టీకి చెందని ప్రజాసామాన్యం వారి ట్రేడ్ యూనియన్, ఆర్థిక సంస్థలకు చెందిన నాయకులను, పార్టీకి చెందని ఆక్టివ్ వర్కర్ల సమావేశాల్లోనూ ఇంకా ఇతర అన్నిరకాల సమావేశాల్లోనూ వారి రిపోర్టులు విని లోపాలను విమర్శించే పద్ధతిద్వారాపరిచేయగల్గుతారు.

వారి తప్పుల నాధారంచేసుకునే కాడర్లకు శిక్షణ నిచ్చుట

కాడర్లతప్పుల నాధారంగా జేసుకొని కాడర్లకు శిక్షణ ఇచ్చుట అంటే ఏమిటి ?

పార్టీ కాడర్లకు విద్యగరిపి శిక్షణ నిచ్చుటలోనూ, కార్మికులకు, ఇతరశ్రమజీవులకు విద్యాశిక్షణలు గరపుటలోనూ, సరియైన గ్యారంటీ పద్ధతి - పార్టీతప్పులను బుద్ధిపూర్వకంగా తెలియజెప్పి, ఏకారణాలవల్ల అటువంటి తప్పులు బయలుదేరినవో పరిశీలించి, ఆ తప్పులు తిరిగి రాకుండా సరియైనమార్గాలను నిర్ణయించుటయే అని లెనిన్ బోధించాడు.

లెనిన్ ఈ క్రిందివిధంగా చెప్పాడు :

"తన వర్గానికి శ్రమజీవులందరికి నిర్వర్తించవలసిన బాధ్యతలను పరీక్షించే విధానంలో తనయొక్క తప్పులయందు పార్టీ చూపించే వైఖరి ఒక ప్రధానవిషయం. ఆవైఖరిలోనే పార్టీ స్వభావమంతా కనిపిస్తుంది. బహిరంగముగా తప్పును ఒప్పుకొని, దానికి కారణాలు తెలిపి, తప్పుమార్గానికి దారితీసిన పరిస్థితులను పరిశీలించి, ఆ తప్పును సవరించే మార్గాలను చర్చించే విధానం అమలులో ఉంటే నిజంగా పార్టీ తనయొక్క బాధ్యతలను నెరవేర్చుటకై పనిచేస్తున్నదని చెప్పవచ్చును. ఈ విధానంద్వారా, కర్తవ్యాలను సరిగా నెరవేరుస్తూ తన వర్గానికి, ప్రజాసామాన్యానికి, సరిగా శిక్షణ గరపి పనిచేయగలదు."

అనగా తప్పులను దాటవేయకుండా ఉండుట ; తప్పులను మరుగుపరచకుండుట, బహిరంగంగా, న్యాయంగా తప్పులను ఒప్పుకొని, బహిరంగంగానూ, బుద్ధిపూర్వకముగానూ తప్పులను సవరించుకొనుట - ఇవి బోల్షివిక్కుల లక్షణాలు.

కాని యీ పనిని కామ్రేడ్స్ అందరూ తృప్తికరంగా చేస్తున్నారా ? లేదు. కాని బోల్షివిక్కులు నిజమైన బోల్షివిక్కులుగా వుండాలంటే, తప్పులను బహిరంగముగా ఒప్పు

కునే ధైర్యం, వాటికి కారణాలు చెప్పి సరియైన మార్గాన్ని సూచించి, పార్టీసభ్యులకు సరియైన శిక్షణనిచ్చే ధైర్యంవుండాలి. ఈ ఆత్మవిమర్శన పద్ధతియే బోల్షివిక్కుల సరియైన శిక్షణాపద్ధతి. పార్టీసభ్యులుగాని, పార్టీ నాయకులుగాని శిక్షణపొందే మార్గం యిదే.

మన తప్పులను బహిరంగపరచుటవల్ల మన శత్రువులు వాటిని మన బలహీనతగా యెంచి వారి ప్రయోజనములకై వినియోగించగల్గుతారనే భావంతో కొంతమంది కామ్రేడ్స్ మన తప్పులను బహిరంగపరచ గూడదంటారు.

కామ్రేడ్స్, యీ వాదన అర్థంలేనిది. ఇలా వాదించటం శుద్ధితప్పు. ఆత్మవిమర్శన ద్వారా, తప్పులను బహిరంగపరచుటద్వారా కార్మికులలో, రైతులలో, శ్రమచేయు విద్యాధికులలో నమ్మకం హెచ్చి మన పార్టీ మరింత బలపడగలదు. మన ప్రభుత్వముయొక్క అధికారం బలపడగలదు. నిజానికి ప్రధానమైన విషయం ఇదే. కార్మికులు, రైతులు, శ్రమచేసే విద్యాధికులు మనపట్ల వున్నంతకాలం యితర విషయాలన్నీ అవే పరిష్కారం కాగలవు.

తప్పులను బహిరంగపరచుటవల్ల కాడర్లకు శిక్షణ హెచ్చి బలపడేబదులు వారిని బలహీనపరచి వారిలో అయిష్టత బయలుదేరవచ్చును. గనుక మన కాడర్లయొక్క పరువు ప్రతిష్ఠలను కాపాడుటకొరకై తప్పులను బహిరంగపరచగూడదని కొందరి కామ్రేడ్స్ అభిప్రాయం. అందువల్ల తప్పులను అంతగా పట్టుకోకుండా దాటవేస్తూ విమర్శ గూడా తీవ్రంగా సాగించగూడదని వారి వుద్దేశ్యం. ఇదిగూడా తప్పు పంథాయేనని వేరుగా చెప్పనక్కరలేదు. తప్పులను మరుగుబుచ్చి కామ్రేడ్సును 'కాపాడే' ప్రయత్నంవల్ల తప్పని సరిగా కాడర్లన్నీ నాశవమగుటకు దారి తీయుటయే జరుగుతుంది.

ప్రజలకు బోధించుట-వారినుంచి నేర్చుకొనుట

ప్రజలకు బోధించుటయేగాక వారినుంచి నేర్చుకొనమనిగూడా లెనిన్ చెప్పాడు.

ఏమిటి దీని అర్థం ?

దీని అర్థం ఏమిటంటే—(1) మనకు అహంభావం యెంతమాత్రం పనికిరాదని, కేంద్రకమిటీ సభ్యులైనప్పటికి, పీపుల్స్ కమీసార్లయినప్పటికి సరియైన నాయకత్వమునకు అవసరమైన విజ్ఞానమంతా ఉన్నదనే భావం తప్పు. ఒక అధికారస్థానంలో ఉన్నంత మాత్రాన విజ్ఞాన అనుభవాలను ఆ స్థానం కల్గచేయలేదు.

(2) సరియైన నాయకత్వం వహించుటకు కేవలం నాయకుల అనుభవం చాలదు. అందువల్ల నాయకుల అనుభవంతో పాటు ప్రజాసామాన్య అనుభవాలను పార్టీసభ్యుల అనుభవాలను కార్మికవర్గ అనుభవాలను కలిపి జోడించి పనిచేయుట అవసరం.

(3) ఎట్టి పరిస్థితులలోనైనా ఒకక్షణమాత్రంగూడా ప్రజాసంబంధాన్ని బలహీన పరచుకొనుటగాని, తెంచుకొనుటగాని చేయగూడదు.

(4) ప్రజలయొక్క అభిప్రాయాన్ని, 'సామాన్య' పార్టీసభ్యుల అభిప్రాయాన్నీ 'చిన్న' వారి అభిప్రాయాలను జాగ్రత్తగా గుర్తించవలని యున్నది.

సరిగా నడుపుట అంటే అర్థం యేమిటి ?

ఆఫీసులో కూర్చుని సూచనల జాబితాలను తయారుచేయుట సరిగా నడుపుట కానేరదు.

సరిగా నడుపుట అంటే ?

(1) సమస్యను యెదుర్కొనుటకై సరియైన మార్గాన్ని నిర్ణయించుట. మన నాయకత్వ ఫలితాలను మోసే ప్రజలయొక్క అనుభవాన్ని లెక్కలోకి తీసుకొనకుండా సరియైన మార్గాన్ని నిర్ణయించలేము.

(2) సరియైన మార్గాన్ని నిర్ణయించిన తరువాత, దాన్ని అమలుపరిచే కార్యక్రమాన్ని ఆర్గనైజ్ చేయుట. కార్యక్రమాన్ని ప్రజల ప్రత్యక్ష సహకారంలేకుండా యెప్పుడూ సాగించలేమనే విషయం స్పష్టమే.

(3) కార్యక్రమాన్ని అమలు చేయునప్పుడు దానిమీద 'చెకప్'ను ఆర్గనైజ్ చేయుట - దీనికిగూడా ప్రజల ప్రత్యక్ష సహాయము అవసరం.

నాయకులం మనం ప్రజలనూ, పరిస్థితులనూ ఎప్పుడూ ఒకే దృక్పథాన్నుంచి చూస్తాం. అనగా ఎప్పుడూ పైనుంచేచూడటం జరుగుతుంది. అందువల్ల మన దృష్టి మొత్తంమీద కొన్ని హద్దులు కలిగివుంటుంది. కాని ప్రజలు పరిస్థితులను మరొకదృష్టితో చూస్తారు. క్రిందినుంచి చూస్తూవుంటారు. అందువల్ల ఒకవిధంగా వారిదృష్టికికూడా కొంత వరకు హద్దులుంటాయి. ఏ సమస్యా పరిష్కారానికైనా యీ రెండు దృక్పథాలు అవసరం. రెండురకాల అనుభవాలు ఐక్యమవాలి. అప్పుడే నాయకత్వం యిచ్చే పంథా సరియైనదవుతుంది.

ఇదే దీని అర్థం - ప్రజలకు బోధించుటయేకాదు, వారిదగ్గర నుంచి నేర్చుకోవాలి గూడా....................

అందువల్ల వమస్యలను యెదుర్కొని నడిపేటప్పుడు, కేవలము మన అనుభవం మాత్రమే చాలదని స్పష్టపడుతోంది. సరిగా నడుపుటకై పార్టీసభ్యుల అనుభవాన్ని, కార్మికుల అనుభవాన్ని, ఇతర శ్రమజీవుల అనుభవాన్ని, ఇతర 'క్రింది'వ్యక్తుల అనుభవాన్ని నాయకుల అనుభవంతో జోడించుట అవసరం.

ఇది ఎప్పుడు సాధ్యపడుతుంది ?

నాయకులు ప్రజలతో సంబంధంకలిగి వున్నప్పుడు, పార్టీసభ్యులతోనూ, కార్మిక వర్గంతోనూ, రైతాంగముతోను, పనిచేసే విద్యాధికులతోను నిత్య సంబంధాన్నికల్గిఉన్నప్పుడే ఇవి సాధ్యపడుతుంది.

ప్రజలతో సంబంధం ఆ సంబంధాన్ని బలపరుచుకొనుట, ప్రజాభిప్రాయాలను వినుటకు తయారుగా ఉండుట - దీనిలోనే బోల్షివిక్ నాయకత్వంయొక్క అభేద్యశక్తి ఇమిడివున్నది. ప్రజాసామాన్యముతో సంబంధము ఉన్నంతవరకూ బోల్షివిక్కులు అజేయులని చెప్పవచ్చును. అదేరీతిగా ప్రజలతోగల సంబంధం బలహీనమగుటగాని, లేక పూర్తిగా సంబంధములు లేకుండాపోవుటగాని జరిగినప్పుడు అధికారతుప్పుతో వారు రోజురోజుకు జీర్ణించి, బలహీనమై శూన్యస్థితికి క్షీణిస్తారని వేరుగా చెప్పనక్కరలేదు.

అర్హతలేని సభ్యులను తొలగించుట

పార్టీసభ్యుల తనిఖీలోనే, పనిచేయకుండా సొల్లువాగుడు వాగే కబుర్లరాయుళ్ళు (Demogangges) తాము ప్రాక్టికలుగా పనిచేయకుండానే పార్టీసభ్యులకు నాయకత్వం వహించగల మనుకొంటూ సిద్ధాంతాలు వల్లించేవారు (Theorisers), చాలకాలం నుంచి పార్టీలో ఉంటూ ఎన్ని అవకాశాలిచ్చినా అభివృద్ధిగాకుండా పార్టీకి బరువుగాఉన్నవారు (Dadas), ఏదో సొంతపనులలో నిమగ్నమయిపోయి పార్టీపనిని సరిగా చేయనివారు, పార్టీసాహిత్యం సరిగా చదవడంగాని, ఇచ్చిన పనిని చేయడానికి చొరవచూపడంగాని లేక తమలో తమకే విశ్వాసంలేనివారు, బయటబడుతుంటారు. తమను అభివృద్ధి చేసుకోవడానికి, లోపాలను సవరించుకోడానికి, వీరికి తగినమార్గాలు చూపాలి. వారికి సహాయం చేయాలి. ఇక లాభంలేదని తేలినప్పుడు, ఇట్టివారిని పార్టీనుంచి రాజీనామా ఇప్పించి, సానుభూతిపరులనుగా ఉంచాలి. రాజీనామా పెట్టడానికి నిరాకరించిన వారిని పార్టీశిక్షణకు వ్యతిరేకంగా నడిచినట్లుగా పరిగణించి, పార్టీనుండి తీసివెయ్యాలి. అలవాటుగా పార్టీశిక్షణకు వ్యతిరేకంగా నడిచేవారిని వెంటనే పార్టీనుంచి తీసివేయాలి. పైన చెప్పబడిన వారిని పార్టీలో ఉంచడంవల్ల, పార్టీశిక్షణకు దెబ్బ తగులుతుంది. మిగతా పార్టీసభ్యులు, కొత్త పార్టీసభ్యుల అభివృద్ధికి ఆటంకమవుతుంది. గనుక పై జెప్పబడినవారిని ఎప్పటికప్పుడు రాజీనామాపెట్టించి సానుభూతిపరులనుగా ఉంచడంగాని, పార్టీనుంచి తొలగించడంగాని చెయ్యాలి.

పార్టీనుంచి తొలగింపబడిన వారితో సంబంధం

పార్టీనుంచి తొలగింపబడినవారు పార్టీవ్యతిరేకగ్రూపుల్లో చేరి పార్టీకి దెబ్బకొట్టకుండా ఉండటం చాలా అరుదు. వారితో పార్టీసభ్యులు ఎటువంటి దగ్గరసంబంధం పెట్టుకోగూడదు, అలా సంబంధం పెట్టుకోవడం పార్టీశిక్షణకు వ్యతిరేకం. ఏవైనా అవుసరమైన వ్యవహారాలుంటే, 'బిజినెస్‌లైక్'గా మాట్లాడాలి. అంతేగాని ఒకరి ఇండ్లకు ఒకరు వెళ్ళుతూ, రాసుకు పూసుకు తిరగగూడదు.

పార్టీకి విరోధముతాలకు (రంగాగ్రూపు, రాయిస్టులు, ఫార్వర్డుబ్లాకు, కాంగ్రెసు సోషలిస్టులు, ట్రాట్స్కీయిస్టులు) చెందినవారితోను, పార్టీకి బద్ధవిరోధులైన గ్రామపెత్తనదార్లతోనూ పైవిధంగానే మెలగాలి. వారిని ప్రజలు ద్వేషించేలా చెయ్యాలి. అలా చెయ్యాలంటే, మనమే ఆచరణలో వారిని ద్వేషించడం చూపించాలి.

పార్టీ హోల్‌టైమర్లు

పార్టీ హోల్‌టైమర్లంటే తమ సర్వకాలాన్ని పార్టీపనికే వినియోగించే విప్లవ కార్యక్రమం సాగించడమే వృత్తిగాగలవారు. వీరికి పార్టీ అభివృద్ధితప్ప మరే ఇతర ఆలోచనఉండదు. వీరు పార్టీకి వెన్నెముక వంటి వారు. వీరి అభివృద్ధిమీదనే పార్టీఅభివృద్ధి గూడ చాలవరకు ఆధారపడిఉంది. తమ సొంతపని చూచుకుంటూ పార్టీపని చేసేవారు, తమ సొంతవ్యవహారాల్లో పడిపోయి పార్టీపని మరచిపోకుండా చేయడానికి, వారికి ఎప్పటికప్పుడు సలహాలిస్తూ పనిచేయించడానికి హోల్‌టైమర్లు అవుసరం. హోల్‌టైమర్లలో రెండురకాలున్నారు. ఒకరకం పార్టీవేతనాలు తీసుకునేవారు. మరొకరకం తమ సొంత డబ్బుతో జీవిస్తు పనిచేసేవారు. పనిచేయడంలోగాని. పార్టీశిక్షణ విషయంలోగాని మరెట్టి భేదం వీరిమధ్యలేదు. పార్టీహోల్‌టైమర్లనుగూర్చి 1943 జనవరిలో జరిగిన రాష్ట్రప్లీనం తీర్మానం ఈక్రింద ఇవ్వబడుతోంది.

పార్టీ హోల్‌టైమ్ వర్కర్లు

అక్టోబరు నెలలో (1932) జరుపబడిన పార్టీ అగ్రనైజర్ల సమావేశానంతరం, పార్టీసభ్యులలో నూతనచైతన్యం బయలుదేరింది. చాలమంది పార్టీసభ్యులు తనకున్న సర్వస్వం పార్టీకిచ్చివేసి.పార్టీవేతనాలపై, పార్టీహోల్‌టైం వర్కర్సుగా పనిచేయాలనే చైతన్యం పుద్భవించింది. ఇట్టి చైతన్యంద్వారాపార్టీచరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమౌతోంది. నేడు మనదేశాన్ని ఎదుర్కొన్న మహాసంక్షోభాన్నుండి, మనదేశాన్ని రక్షించుకోడానికి, మన పార్టీ పురోభివృద్ధికెంతేని తోడ్పడే పార్టీసభ్యుల ఈచైతన్యాన్ని రాష్ట్రకమిటీ ఆహ్వానించుతోంది. పార్టీయొక్క ఈ దశలో పార్టీసభ్యులలో గల్గిన పైత్యాగాన్ని, చైతన్యాన్ని, సక్రమమయినపంథాను, ఉపయోగించుకోకపోతే, పార్టీఅభివృద్ధికి ఎంతేని హానికల్గుతుంది, అంతేగాకుండా అలాంటి చైతన్యంగల్గిన పార్టీసభ్యులుగూడ, విప్లవకరమైన మన పార్టీ హోల్‌టైమర్సు బాధ్యతలేవో తెలిసికోవాలి. అప్పుడే ప్రస్తుతం చాలమంది పార్టీసభ్యులలో గల్గిన ఈ చైతన్యం వారిని నిజమైన బోల్షివిక్‌పార్టీ హోల్‌టైమర్సుగా, అభివృద్ధి చేయడానికి తోడ్పడుతుంది. లేకపోతే తాత్కాలికావేశంతో పార్టీ హోల్‌టైమరుగా పనిచేయాలనే "రొమాంటిక్" భావాలకు లోనైపోయి తుదకు పార్టీనెత్తిపై ఒక సమస్యగా తయారవడానికి మాత్రమే తోడ్పడుతుంది. కాన పార్టీ యిప్పుడే పార్టీహోల్‌టైమర్సుయెడల పార్టీ కమిటీల బాధ్యతలేవో, స్పష్టంగా నిర్ణయించవలసిన అవుసర మేర్పడింది.

పార్టీహోల్‌టైమర్సును తీసుకొనేటప్పుడు గమనించవలసిన విషయాలు

ఒక పార్టీసభ్యుడు తనకున్న ఆస్థినంతా పార్టీకిచ్చివేసినంత మాత్రాన, పార్టీవేతనంపై పార్టీహోల్‌టైమరుగా తీసికొనబడజాలడు. పార్టీవేతనంపై పార్టీ హోల్‌టైమరుగా ఒక పార్టీసభ్యుడు పనిచేయాలా ? లేదా ? అని నిర్ణయించేది పార్టీయేగాని, పార్టీసభ్యుడు తన ఆస్తిని పార్టీకి యిచ్చివేయడం మాత్రంతోనే నిర్ణయముగాదు. ఒక పార్టీసభ్యుని పార్టీ వేతనంపై పార్టీహోల్‌టైమరుగా తీసుకొనేటప్పుడు, ఈక్రింది సూత్రాలను జిల్లాకమిటీలు పాటించాలి.

1. ఆపార్టీసభ్యుని ప్రస్తుత రాజకీయపరిపక్వాన్ని, శక్తిసామర్ధ్యాలను పరిశీలించాలి.

2. ఆసభ్యునకు, ఆ ప్రాంతములో యివ్వబోయేపని, దాని ప్రస్తుత అవుసరాన్ని గూడ పరిశీలించాలి.

3. అతనికిచ్చే పనియెడల అతనికున్నఆసక్తి దాని నిర్వహించగల అతనిప్రస్తుత శక్తిసామర్ధ్యాలను పరీక్షించాలి.

4. ఆ ప్రాంతములో ఆపని జేయడానికి, ఆసభ్యుడే వున్నవారందరికంటే తగినవాడై యుండాలి.

5. అతనికిచ్చినపనిని నిర్వహించుతూ, క్రమేణా రాజకీయంగాను, నిర్మాణయుక్తంగాను అతను అభివృద్ధి అవడానికి తగిన శక్తి అతనికున్నదీ లేనిదీ చూడాలి.

పై అర్హతలుగలిగి పార్టీకి తమ ఆస్థినంతా యిచ్చివేయడానికి సిద్ధపడ్డ కామ్రేడ్సుకు జిల్లాకమిటీలు ఈ క్రిందివిధంగా స్పష్టపర్చాలి.

1. ఆస్థినంతా పార్టీకిచ్చినా, పార్టీవేతనాలపై హోల్‌టైమరుగా తీసుకోవడమనే విషయం, హోల్‌టైమరు కుండాల్సిన లక్షణాలనుబట్టి, జిల్లాకమిటీ అవుసరాలనుబట్టి జిల్లాకమిటీ నిర్ణయించుతుంది.

2. తన కుటుంబానికి (తల్లికి, భార్యకు, పిల్లలకు) తగినంత ఆస్థిని మిగల్చగా, తనవాటాకు యింకామిగిలే ఆస్థిమాత్రమే అమ్మి పార్టీకి యివ్వాలిగాని, కుటుంబజీవనానికి, పోషణకు కష్టమయ్యేటట్లు, ఆస్థినంతాఅమ్మి పార్టీకి యివ్వకూడదు.

3. సం॥మునకు 250 రూ॥లు ఆదాయం లోపుగల కుటుంబ కామ్రేడ్స్ ఎవరూ తమ ఆస్థులను పార్టీకివ్వడానికి ప్రయత్నించరాదు.

4. తమకు వేతనాలు యిచ్చేబాధ్యత పార్టీకమిటీలదని, పార్టీకమిటీలను జీతాలిచ్చే యజమాని అనేభావం, ధోరణి, హోల్‌టైమర్సుకుండరాదు. తాము పార్టీకోసం డబ్బు వసూలుచేస్తున్నప్పుడు, మొత్తం పార్టీకి వసూలైన డబ్బులోనుండి తమ సొంతవ్యక్తి

అవసరాలకు, కొంత నియమితమొత్తాన్ని ఖర్చుపెట్టుకోడానికి పార్టీ అనుమతిపొంది. పార్టీకమిటీద్వారా ఆ నియమితమొత్తాన్ని తీసుకోవాలనేభావం, హోల్‌టైమ్ వర్కర్లకుండాలి.

ఈ భావమున్నప్పుడే తాము ఎంతఎక్కువ పార్టీకి వసూలుచేయగల్గితే అంత ఎక్కువగా పార్టీకమిటీ తన బాధ్యతలను నెరవేర్చగలదనీ, పార్టీ వేతనాలను తప్పనిసరిగా, సకాలంలో ఇవ్వగల్గుతుందనే చైతన్యం వస్తుంది.

5. తనకిచ్చిన పార్టీపనిని సక్రమంగా నిర్వహిస్తూ అనుదినం అభివృద్ధిఅవుతూ యింకా హెచ్చుబాధ్యతలను తీసికోడానికి తగినశక్తి సామర్థ్యాలు తాను సంపాదించి, తనకు పార్టీయిచ్చే వేతనాలకు తగివుండాలనే చైతన్యంతో, యెప్పుడూ హోల్‌టైమరు పనిచేస్తూవుండాలి. అంతేగాకుండా ఇలా తాను అభివృద్ధిగావడం జరుగనప్పుడు, పార్టీ తనను పార్టీ హోల్‌టైమరుగా తొలగించి తనకిచ్చే వేతనాలను, యింకొక సమర్ధనీయమైన కామ్రేడ్సుకు, వినియోగించకుండా తనకే యిస్తుండాలి అనడం, పార్టీఅభివృద్ధిని అరికట్టడమనే విషయాన్ని గుర్తించాలి అలా అభివృద్ధిగాకుండా వున్నప్పుడు, తనను హోల్‌టైమరుగా తీసివేయకతప్పదనీ, అలా తీసివేయని పార్టీకమిటీ, తన బాధ్యత నెరవేర్చక, పార్టీఅభివృద్ధికే అడ్డువస్తుందని, తానే గుర్తించాలి. గుర్తించినపుడు అట్టిపార్టీ నిర్ణయాన్ని హృదయపూర్వకంగా, స్వీకరిస్తాడు.

(6) పార్టీ హోల్‌టైమరు రాజకీయంగా, ఎప్పటికప్పుడు, అభివృద్ధి అవుతూవుండడమేగాక, వ్యక్తిగతంగాకూడ తనకున్న లోటుపాట్లను తొలగించుకొని, ఆదర్శప్రాయమైన, వ్యక్తిజీవితాన్ని అలవర్చుకోవాలి. తన కుటుంబముతోను, యితరులతోను, తనకుండే సంబంధాలు, కమ్యూనిస్టు సంబంధాలుగా వుండాలి. అన్ని రంగాల్లోను, ఆదర్శప్రాయమైన, మానవుడుగా తయారు గావడానికి కృషిచేస్తూ వుండాలి.

పార్టీ హోల్‌టైమర్సు, వారివంతు బాధ్యతలను, విధులను, జయప్రదంగా నిర్వహించుతూ వుండడానికి, పార్టీకమిటీలుగూడ శ్రద్ధగైకొనాలి. అప్పుడే పార్టీ అభివృద్ధిగావడానికి యింకా అనేకమంది పార్టీసభ్యులు హోల్‌టైమర్సుగా తయారవడానికి అవకాశమేర్పడుతుంది.

హోల్‌టైమర్సు యెడల పార్టీకున్న బాధ్యతలు

(1) సాధ్యమైనంతవరకు, హోల్‌టైమర్సుకు యివ్వాల్సిన వేతనాలను సకాలంలో అందజేస్తూ వుండాలి.

(2) రాజకీయంగా ఎప్పటికప్పుడు హోల్‌టైమర్సును, అభివృద్ధిచేయడానికి అందుకు తగిన శిక్షణ యివ్వడానికి, పార్టీ ప్రత్యేక ఏర్పాట్లు చెయ్యాలి.

(3) వ్యక్తిగతంగాగూడ ఆదర్శప్రాయమైన జీవితం, వారికి అలవడేటట్లు పార్టీ జాగ్రత్త తీసికోవాలి. వారు గావించుతూవుండే తప్పులను సకాలంలో వారికి చూపెడుతూ,

వాటిని విసర్జించే ఆచరణయోగ్యమైన, సూచనలు యివ్వడానికి శ్రద్ధతీసుకోవాలి. ఈ విధంగా చేసేటప్పుడు పార్టీ వారిని స్వంత కుటుంబములో వారివలె చూడాలి. వారి తప్పులను సరిజేసి, వారిని అభివృద్ధిచేయాలనే దృష్టితోనే వారిని చూస్తూవుండాలిగాని, తప్పులెన్నుటే ప్రధానంగాపెట్టుకొని తప్పుచేసినవారిని నిరుత్సాహపర్చకుండా పార్టీచూస్తూండాలి.

(4) హోల్‌టైమర్ల భార్యాబిడ్డల, ఆర్థిక, రాజకీయ స్థితికి, బాధ్యతకూడ పార్టీపై కొంతవరకు వుంది. ఆ బాధ్యతను, పార్టీకమిటీలు గుర్తించి, వానిని నెరవేర్చడానికి పరిస్థితుల ననుసరించి, తగిన ప్రయత్నాలుచేస్తూరావాలి.

హోల్‌టైమర్ప్రయెడల పార్టీకున్న బాధ్యతలన్నిటినీ అది విప్లవసాధనకొరకు కృషిచేస్తూ అనేక కష్టతమ పరిస్థితులను ఎదుర్కొంటూ, నిర్వహిస్తూ వున్నదనే చైతన్యం వారికి యెల్లప్పుడూ వుండాలి. పై విధులన్నిటినీ, పార్టీ తప్పక నిర్వహించగలదనే భ్రమకు మాత్రం లోనుగాగూడదు. అలా తప్పక పార్టీ నిర్వహించుతుందనే గ్యారంటీ మాత్రం పార్టీ యిచ్చుటలేదనే స్పష్టంగా తెలుసుకోవాలి.

ప్రతి హోల్‌టైమరు తన వ్యక్తిగత బాధ్యతలను నెరవేర్చాడంటే పార్టీ నిర్వహించాల్సిన మొత్తపు బాధ్యతలను కొంతవరకు నిర్వహించా డన్నమాట. హోల్‌టైమర్లు అందరూ వ్యక్తిగతంగా తమ బాధ్యతలను నిర్వహించడమంటే పార్టీ కమిటీ, హోల్‌టైమర్ల యెడల తన బాధ్యతనంతా నెరవేర్చినదన్నమాట. ఈ దృక్పధమున్నప్పుడు పార్టీ వేరు, తానువేరు అనేభావానికి తావుండదు. తామే పార్టీ అనీ, పార్టీ మొత్తపు బాధ్యతలను, పార్టీ నిర్వహించడమనేది, పార్టీసభ్యులూ, ముఖ్యంగా హోల్‌టైమర్లు, తమ వ్యక్తిగత బాధ్యతలను నిర్వహించడమేనన్న సంగతికూడ గ్రహిస్తారు.

భవిష్యత్కార్యక్రమం

(1) హోల్‌టైమర్లను తీసికోడానికి ముందు, జిల్లా కమిటీలు పై విషయాలు మనస్సులో వుంచుకోవాలి. పార్టీ వేతనంపై హోల్‌టైమరును తీసికోడానికి ముందు, రాష్ట్ర కమిటీకి తెలియజేసి, దాని అంగీకారాన్ని పొందాలి.

(2) హోల్‌టైమర్ల వేతనాలు రాష్ట్రమంతటా ఒకేరీతిగా వుండాలి. ప్రతి ఒక హోల్‌టైమరుకు, నెలకు, 20 రూ॥లు; టవున్ అలవెన్సు 5 రూ॥లు; "భార్య అలవెన్సు 5 రూ॥లు - గ్రామంలో; 10 రూ॥లు టౌనులో;" బిడ్డల అలవెన్సు 5 రూ॥ల నుంచి 10 రూ॥ల వరకు, జబ్బుపడినప్పుడు ప్రత్యేకంగా మెడికల్ అలవెన్సు, ప్రయాణము చేసేవారికి ప్రయాణపు ఖర్చులు వేరే వుంటాయి.

పట్టణాలలోను, ఆహారపదార్థాల కొరతఏర్పడిన రాయలసీమలాంటి మెట్టప్రాంతాలలోను హోల్‌టైమర్ల వేతనాలు ఇలావుండాలి. పెండ్లికాని కామ్రేడ్స్‌కి నెలకు రు. 25 లు.

పెండ్లిఅయి పిల్లలులేని భార్యాభర్తలకు రు 40 లు, ఒకపిల్లవున్న కుటుంబానికి రు 45 లు, ఇద్దరుగాని అంతకు ఎక్కువగాని పిల్లలున్న కుటుంబానికి రు 50 లు.

ఆహార పదార్థాలకు కొరతలేని మాగాణి ప్రాంతపు గ్రామసీమలలో నివసించే పార్టీ హోల్‌టైమర్లకు పెండ్లికానివారికి రు 15 లు, పెండ్లి అయి పిల్లలులేనివారికి రు 30 లు, ఒకపిల్లగల వారికి రు 35 లు, ఇద్దరుగాని ఎక్కువగాని పిల్లలున్న వారికి రు 40 లు చొ॥ ఇవ్వాలి. కొన్ని ప్రత్యేక పరిస్థితులుండి ఈ అలవెన్సులు చాలని హోల్‌టైమర్లుంటే జిల్లాకమిటీలు ఆ పరిస్థితులను విచారించి ఎంత అదనంగా ఇవ్వాలో నిర్ణయించాలి. ఇవే గరిష్ట (Maximum) వేతనాలని కామ్రేడ్సు గుర్తించాలి. ప్రస్తుతం మన ఆంధ్రలో నిత్య జీవితవ్యయ పరిమాణాన్ని (Standard of living) బట్టి చూస్తే ఇంతకంటె ఎక్కువ అవసరం వుండదు. కాకపోతే ఎక్కువసార్లు టీకాఫీలు త్రాగడం, లేక ఎక్కువగా సిగరెట్లు త్రాగడం ఎక్కువ సినిమాలుచూడటం మొదలైన దురభ్యాసాలుండి అలవెన్సు చాలదంటే వాటిని అంగీకరించడానికి వీలులేదు. అట్టి కామ్రేడ్స్ ఒక పార్టీ కర్తవ్యంగా అట్టి దురభ్యాసాలను మానుకోవలసివుంటుంది. పార్టీ కామ్రేడ్స్, ముఖ్యంగా హోల్‌టైమర్లు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోడం, పార్టీ సొమ్ము అంటే ప్రజల సొమ్మును - తమ దురభ్యాసం దుర్వినియోగం చేయకుండా వుండడంఅనేది తమ కర్తవ్యంగా ఎంచుకోవలసివుంటుంది. పోతే ఏదైనా జబ్బుచేసి ఆరోగ్యం చెడితే అవసరాన్నిబట్టి దానికి కావలసిన మెడికల్ అలవెన్సు ప్రత్యేకంగా పార్టీ యిస్తుంది.

జిల్లా కమిటీలు హోల్‌టైమర్లను తీసుకోవడంలో పై తీర్మానాన్ని అనుసరించడం లేదు. సొంతపని చేయకుండా, ఏదో అప్పుడప్పుడూ పార్టీపని చేసేవారు అందరూ పార్టీ హోల్‌టైమరుగా తీసుకోబడుతున్నారు. ఇటువంటివారిని, పార్టీ వేతనాలు ఇవ్వాలిసిన అవసరమైనంత మాత్రాన హోల్‌టైమర్లనుగా పరిగణింపగూడదు. వీరు పూర్తిగా పార్టీ పనిచేయక, ఇంటిపనిచేయక గాలిగాతిరుగుతుంటే, ప్రజల్లోనూ, వారికుటుంబాలలోనూ పార్టీ అంటే చెడు అభిప్రాయం గల్గుతుంది. కనుక ఇటువంటి వారిచేత తమ సొంత వ్యవహారాలు చూచుకుంటూ, పార్టీ పనిచేసేలా చెయ్యాలి. ఇటువంటి వారిని పార్టీ హోల్‌టైమర్ల లిస్టునుండి తొలగించాలి.

పార్టీ వేతనాలమీదవచ్చే హోల్‌టైమర్లు కొంతమందికి తగినంత రాజకీయచైతన్యం, ప్రాక్టికలు పరిజ్ఞానం లేకపోయినా, పూర్తికాలం పనిచేస్తానని చెప్పగానే, ఏదో అవుసరమని చెప్పి, వారిని హోల్‌టైమర్లుగా తీసుకోవడం జరుగుతోంది. హోల్‌టైమరు కుండాలిసిన లక్షణాలులేని వారిని పార్టీవేతనాలమీద తీసుకుంటే, పార్టీసభ్యులకు సరియైన సూచనలిస్తూ వారిని నడపలేకపోతారు. వారు పార్టీ కమిటీల సూచనలను చేరవేసే, పార్టీ కూలీలుగా మాత్రమే తయారవుతారు. తరువాత వారిలో నిస్పృహగలగడం, పార్టీ పని చేయకుండా తప్పించుకోవడం, చివరకు అబద్ధపు రిపోర్టు ఇవ్వడం, పార్టీ ఇచ్చేవేతనాన్ని

యజమాని జీతగాడికిచ్చే జీతంగా పరిగణించడంగూడ జరుగుతుంది. కనుక ఇకముందు పార్టీ వేతనాలమీద తీసుకోబోయేవారిని, ప్లీనం తీర్మానాన్ననుసరించి తీసుకోవాలి.

కొన్నిచోట్ల కొంతమందికి పార్టీ నిర్ణయించిన వేతనాలకన్న తక్కువగాఇచ్చి, హోల్‌టైమర్లుగా తీసుకోవడం జరుగుతోంది. ఇంటివద్ద తిండిపెట్టే తాహతుకుటుంబానికుంటే, పార్టీయెడల కుటుంబానికి సానుభూతిఉంటే పైఖర్చుకు అయ్యేడబ్బుఇస్తూ హోల్‌టైమర్లనుగా తీసుకోవచ్చును. కాని కుటుంబానికి అటువంటి తాహతు, సానుభూతి లేనప్పుడు, తక్కువ అలవెన్సుమీద హోల్‌టైమర్లనుగా తీసుకోగూడదు. పూర్తి అలవెన్సు ఇవ్వాలి. లేకపోతే వారు తమ ఖర్చులను పూడ్చుకోలేక, పార్టీడబ్బు వాడుకొని తప్పుడు లెఖ్ఖలు వ్రాసేస్థితికిగూడ దిగడం జరుగుతుంది. పార్టీ నిర్ణయించిన వేతనాలు కనీస పరిమాణ వేతనాలని గ్రహించాలి.

పార్టీవేతనాలమీద ఉన్న హోల్‌టైమర్లలో పనికిరాని వారిని ఏమి చెయ్యాలి? అనే ప్రశ్నవస్తుంది. ఏవిధంగాను అభివృద్ధి అయ్యే అవకాశాలు లేనివారిని, విషయం నచ్చజెప్పి, వారికేదోవృత్తి చూపించి, హోల్‌టైమరుగా తీసివేయాలి. అభివృద్ధిఅయ్యే అవకాశం ఉన్నవారికి, వారిలోపాలనుచెప్పి, కొంతకాలంలోగా సవరించుకోమని, లేకపోతే హోల్‌టైమరుగా ఉండరనీ చెప్పాలి.వారు అభివృద్ధి అవడానికి అన్ని అవకాశాలు కల్పించాలి.

పార్టీ కమిటీలు పార్టీ హోల్‌టైమర్ల రాజకీయాభివృద్ధి, పనిచేయడంలో అభివృద్ధి, ఆరోగ్యం మొదలైనవాటి విషయంలో శ్రద్ధవహించుటలేదు. హోల్‌టైమరుగా తీసుకోవడం, అతనికి పనిఇచ్చి అతనిని స్వేచ్ఛగా వదలివేయడం, అతడు తనంతట తాను అభివృద్ధిగాక నిస్తబ్ధతగా తయారైతే పనికిరాడని తీసివేయడం, జరుగుతోంది. ఈవిధంగా హోల్‌టైమర్లను తీసుకోవడం, వారు పనికిరాకుండా తయారైనప్పుడు తీసివేయడంవల్ల పార్టీ దెబ్బతింటుంది. పార్టీ అనుభవం వారితోపాటు మట్టిపాలవుతుంది. పార్టీ అభివృద్ధి గాదు. హోల్‌టైమరు నిరంతరం పార్టీసభ్యుల అనుభవాన్ని ఇముడ్చుకుంటూ, పార్టీ అనుభవాన్ని తన కృషిద్వారా ఎక్కువచేస్తూఉండాలి. అందుకు పార్టీ కమిటీలు తోడ్పడాలి. వారి రాజకీయాభివృద్ధికి, వారి పనిని రెగ్యులరుగా తనిఖీచేస్తూ పనిచేయుటలో అభివృద్ధికి, వారి వ్యక్తిగత లోపాలను, కుటుంబ వ్యవహారాలను తెలుసుకొంటూ వాటి పరిష్కారానికి తోడ్పడుతూ ఉండాలి. హోల్‌టైమర్లు ఆరోగ్యం కాపాడుకునేలా చెయ్యాలి. వారికి సిగరెట్టు, టీ, కాఫీలు ఎక్కువగా త్రాగడం, రెగ్యులరు అలవాటులేకపోవడం మొదలైన దురభ్యాసాలను తగ్గించేలా చేయాలి. ఆరోగ్యాన్ని కాపాడుకోని హోల్‌టైమరు పార్టీకి నష్టం కలుగచేస్తాడు. పార్టీ కమిటీలు ఈవిధంగా హోల్‌టైమర్లను కాపాడటం, వాటి ప్రధాన బాధ్యతలలో ఒకటి. జిల్లా కమిటీ సభ్యులు ఆర్గనైజర్లు తాలూకా కమిటీ సభ్యులను తాలూకా ఆర్గనైజర్లనుగూర్చి బాధ్యత తీసుకోవాలి. అలాగే తాలూకా కమిటీ సభ్యులు, ఆర్గనైజర్లు; తమక్రిందివారినిగూర్చి జాగ్రత్తతీసుకోవాలి.

పార్టీసభ్యుల రాజకీయ శిక్షణ

ఆంధ్రదేశంలో మనపార్టీ సభ్యత్వం 1944 జనవరి రాష్ట్రప్లీనంనాటికి 4660 వరకు పెరిగింది. ప్రజాపార్టీగా తయారవుతోంది. 1944 ఆఖరుకు 7500 కోటా తీసుకోబడింది. పార్టీసభ్యులలో అన్ని వర్గాలనుంచి వచ్చినవారు, స్త్రీలు పురుషులు అందరూఉన్నారు. వ్యవసాయకూలీలు, కార్మికులు, బీదరైతులు స్త్రీలనుండి వచ్చినవారిలో చాలమందికి చదువుట వ్రాయటగూడ రాదు. వీరికి చరిత్రకు భూగోళానికి సంబంధించిన పరిజ్ఞానం అసలేలేదు. చదువుట వ్రాయుట వచ్చినవారికిసైతం, చరిత్ర భూగోళానికి సంబంధించిన పరిజ్ఞానంలేదు. పార్టీసభ్యులలో చాలమందికి పార్టీపాలసీని రాజకీయాలనుగూర్చి అస్పష్టంగా తెలుసు. ఇక మనపార్టీకి వెలుగుగాఉన్న మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాలయొక్క ప్రాథమిక సూత్రాలనుగూర్చి కొద్దిమందికే తెలుసు. కనుక నేడు పార్టీసభ్యులకు రాజకీయ సిద్ధాంత పరిజ్ఞానం కలగజేయడానికి పార్టీముందున్న బాధ్యతలు.

(1) చదువురానివారికి చదువుచెప్పడం.

(2) చరిత్ర, భూగోళం, పార్టీపాలసీ రాజకీయాలకు సంబంధించిన పరిజ్ఞానం కలుగజేయడం.

(3) ప్రాథమిక మార్క్సిస్టు - లెనినిస్టు సూత్రాలనుగూర్చిన పరిజ్ఞానం కలుగజేయుట.

రాజకీయ పరిజ్ఞానం కలుగజేయుట

పైమూటిలో ముఖ్యమైనది రాజకీయ పరిజ్ఞానం కలుగజేయడమనే సమస్యయే. ఎందువల్లనంటే, పార్టీసభ్యులు ప్రజల్లో ప్రచారంచేయాలన్నా, వివిధ రాజకీయగ్రూపుల నినాదాలను బట్టబయలుచేయాలన్నా, పార్టీపాలసీని వివిధగ్రూపులు రాజకీయాలు ప్రపంచ రాజకీయాలనుగూర్చి తెలుసుకోవడం అవసరం. దైనందినం పార్టీసభ్యులుసాగించే కార్యక్రమానికి ఇది అవసరం.

మనదేశం బానిసదేశ మగుటచేతనూ, పరిశ్రమలు అభివృద్ధిగాకపోవడంవల్ల వ్యవసాయ వస్తువులుత్పత్తిజేసే దేశంగామాత్రమే ఉండుటచేతనూ, విద్యలో మనదేశం ఇంత వెనుకబడి ఉంది. బూర్జువా ఆర్థికవిధానం ప్రభుత్వం నడవాలంటే ప్రాథమికవిద్య అవసరం. అందుచే దేశీయ బూర్జువావర్గం పెత్తనంజేస్తున్న దేశాల్లో, ఆ బూర్జువావర్గమే ప్రాథమికవిద్యను అభివృద్ధిజేస్తుంది. దీనితోపాటు చారిత్రిక భూగోళిక విజ్ఞానంగూడ వస్తుంది. కాని మనదేశంలో సామ్రాజ్యవాదులు పరిశ్రమల అభివృద్ధిని ఆటంకపరచుతూ, తమ ప్రభుత్వయంత్రం సాగించడానికి, తమ దోపిడీకి అవసరమైన రైళ్ళు, బ్యాంకులు మొదలైనవి సాగించడానికి అవసరమైనంతవరకే విద్యను అభివృద్ధిగానిచ్చారు. ఇప్పుడు

అనేక వీధాలుగా విద్యాభివృద్ధిని ఆటంకపర్చుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలకు ప్రాథమిక విద్యాజ్ఞానం కలుగజేయడంగూడ భారతీయులమీదనే ఉంది. ప్రజలందరకు విద్యాజ్ఞానం కలుగజేయడం పార్టీ చేయలేదు. ప్రజాస్వామ్య ప్రభుత్వమే నిర్బంధవిద్య ప్రవేశపెట్ట గలుగుతుంది. కాని పార్టీలోకివస్తున్న మిలిటెంట్లుగాఉన్న చాలమంది నిరక్షరాస్యులకు చదువునేర్పడం, ప్రాథమిక రాజకీయ పరిజ్ఞానం కలుగజేయడం, పార్టీయే చెయ్యాలి. లేకపోతే పార్టీఅభివృద్ధికి చాల ఆటంకం గలుగుతుంది.

పుస్తకాలు, పత్రికలు చదివి వినిపించడం ద్వారాను, పార్టీమీటింగులద్వారాను, చదువురానివారికి సైతం రాజకీయపరిజ్ఞానం కలుగజేయవచ్చును. అందుచే రాజకీయపరిజ్ఞానం కల్పించే పద్ధతులలో పార్టీసభ్యులందరినీ కలపవచ్చును. ఇక పద్ధతులను గూర్చి ఆలోచించుదాం.

(అ) ప్రజాశక్తి రీడింగుగ్రూపులు. ఇవి ప్రతి గ్రామంలోనూ, పెద్ద గ్రామమయితే ఎక్కువచోట్ల పట్టణాలలో, పేటలలోనూ, ఆర్గనైజుచెయ్యాలి. దీనిలో రాజకీయపరిజ్ఞానం లేని పార్టీ సభ్యులు, చదువుగూడ రాని పార్టీసభ్యులు, మిలిటెంట్లు తప్పక హాజరు అయ్యేలా చెయ్యాలి. ఒక గ్రామంలో లేక పట్టణంలో ఉన్న రాజకీయపరిజ్ఞానం లేని పార్టీ సభ్యులను, మిలిటెంట్లందరి లిస్టు వ్రాయాలి. వీరికి వీలునుబట్టి పైలిస్టులోనివారిని పంచాలి. ప్రజాశక్తి రీడింగుగ్రూపు నడిపే అతనికి, ఆ గ్రూపుకు వచ్చే పార్టీసభ్యులు మిలిటెంట్ల లిస్టు ఇవ్వాలి. వీరు రెగ్యులరుగా హాజరవుతున్నదీ లేనిదీ చూస్తూఉండాలి. ఈ రీడింగు గ్రూపులు సామాన్యంగా దేవాలయాలలోనూ, పబ్లికు లైబ్రరీలలోనూ, కూడలిస్థలాలలోనూ జరపాలి. వీనిలోకి ఇతరులనుగూడ ఉత్సాహంగా ఉన్నవారిని తీసుకురావాలి. ఈ రీడింగుగ్రూపులు పనిఉన్న రోజుల్లో రాత్రిపూట, తీరికగాఉన్న రోజుల్లో మధ్యాహ్నంపూట జరపాలి.

ఈ గ్రూపులలో ప్రజాశక్తి మొదటనుంచి చివరవరకూ చదవాలి. అంతర్జాతీయ రాజకీయాలు, జాతీయరాజకీయాలు మీద వ్యాసాలు అవసరమైన ఇతర వ్యాసాలు మాపుల ద్వారా వివరించి చెప్పాలి. మాపులద్వారా అయితే, తేలికగా అర్థంజేసుకోడానికి గుర్తుంచుకోడానికి, వీలవుతుంది. వీలుంటే ఏవైనా పుస్తకాలు గూడ చదవవచ్చును. దినపత్రికలోని వార్తలు గూడ చెప్పవచ్చును.

ఈ గ్రూపులు నడిపేబాధ్యత ప్రతి సెల్లులోని రాజకీయపరిజ్ఞానమున్న పార్టీసభ్యులకు ఇవ్వవలెను. సాధ్యమయినంత వరకూ ఉపాధ్యాయ కామ్రేడ్సు మొదలైన 'పార్టు టైమర్సు'ను ఇందుకు వినియోగించాలి. సాధ్యమైనంతవరకూ హోలుటైమర్లమీద ఈ బాధ్యత పడకుండా చూడవలెను,

"ప్రజాశక్తి రీడింగుగ్రూపులలో ప్రపంచజాగ్రఫీ, చరిత్ర, వివిధ రాజకీయపార్టీలను గూర్చిన పరిజ్ఞానం వస్తుంది.

(ఆ) జనరలుబాడీ మీటింగులు. వీనిలో వివిధ రాజకీయపార్టీలను గూర్చి, పార్టీ పాలసీ, దాన్ని ఎట్లా అమలుజరపాలి. మొదలైనవాటిని గూర్చి ఎక్కువగా తెలుస్తుంది. అంతర్జాతీయ రాజకీయాలను గూర్చి సమీక్ష జేసేటప్పుడు మ్యాపులసహాయం తీసుకోవాలి. వివిధ రాజకీయపార్టీల పాలసీలను, నినాదాలను గూర్చి చెప్పేటప్పుడు, అవుసరమైతే వాటి పూర్వచరిత్రను గూర్చి క్లుప్తంగా చెప్పడం అవుసరం. ప్రజాశక్తి రీడింగుగ్రూపుకు రెగ్యులరుగా హాజరయ్యే పార్టీసభ్యుడు గాని మిలిటెంటుగాని, జనరలుబాడీ మీటింగులో చెప్పబడేదానిని అర్థంచేసుకోగలుగుతాడు. పార్టీసభ్యులకు రాజకీయ పరిజ్ఞానం కలుగజేయడంలో, ప్రజాశక్తి రీడింగుగ్రూపులకు పైమెట్టు పార్టీసభ్యుల జనరలుబాడీ మీటింగులు.

(ఇ) ప్రజాశక్తి చదివినంతమాత్రాన చాలదు. చదువువచ్చిన పార్టీసభ్యులందరూ దినపత్రిక తప్పక చదవాలి. లేకపోయేటట్టయితే, ప్రతికక్షుల ప్రచారాన్ని ఎదుర్కోవడం, ప్రజలమీద రాజకీయనాయకత్వం సంపాదించడం, చాలకష్టం. మనం దినపత్రికలు చదవక, మన ప్రతికక్షులు దినపత్రికలు చదువుతూ, వాళ్ళు అబద్ధప్రచారం చేస్తున్నట్లయితే. మనం నోరు వెళ్ళబెట్టవలసి వస్తుంది. ప్రజల్లో మనలను ప్రజాసేవకులనుగా మాత్రమే పరిగణిస్తారుగాని, వారి రాజకీయనాయకులుగా పరిగణించరు.

చాలగ్రామాల్లో పార్టీసభ్యులు దినపత్రికలు తెప్పించడంలేదు. పార్టీసభ్యుడున్న ప్రతిగ్రామంలోనూ దినపత్రిక తెప్పించేలా చేయాలి!

(ఈ) రాజకీయాలనుగూర్చి, సిద్ధాంతాలనుగూర్చి పార్టీ అనేక పుస్తకాలను ప్రచురిస్తోంది. చదువువచ్చిన పార్టీసభ్యులుసైతం, అర్థంగావడంలేదనీ, భాష కఠినంగాఉందనీ ఆ పుస్తకాలను చదవకపోవడం, లేక కొంచెం చదివి అవతల పారవేయడం జరుగుతోంది.

పుస్తకాలు పూర్వంవలె స్టడీక్లాసులుపెట్టి చదివి అర్థంచెప్పడం, ఇంత పెద్దపార్టీ అయినప్పుడు సాధ్యపడదు. రాష్ట్రకమిటీ పార్టీసభ్యుల నెదుర్కొంటున్న సమస్యలకు రాజకీయాలను సిద్ధాంతాలను అన్వయించి, సాధ్యమయినంత తేలికభాషలో పుస్తకాలను ప్రకటించుతోంది. ఇంకా ఇతర పుస్తకాలనుగూడ ప్రకటించుతోంది. వీటన్నిటినీ ఎవరికివారు తిప్పలుబడి చదువుకోవాలి. కొంచెం మొదట పట్టుబట్టిచదివితే, క్రమంగా సొంతంగా చదువుకోవడం అలవాటు అవుతుంది. విషయాలుగూడ తెలుస్తాయి. కనుక ప్రతి పార్టీ సభ్యుడూ సొంతంగా పుస్తకాలు చదవడం అలవరచుకోవాలి.

(2) చదువుచెప్పడం. ఇప్పుడు మనపార్టీలో చదువురానివారి సంఖ్య ఎక్కువగా లేదు. అయినప్పటికి వీరిని అభివృద్ధిచేయాలంటే, వారి కాళ్ళమీద వారు రాజకీయంగా నిలబడేలా చేయాలంటే. వీరికి చదువుట వ్రాయుట నేర్పాలి. మనపార్టీ ప్రజాసమస్యలను తీసుకొనేకొలదీ, వ్యవసాయ కూలీలనుండీ, కార్మికులనుండీ, బీదరైతులనుండీ, స్త్రీలనుండీ, ఎంతోమంది పార్టీలోకి వస్తూఉంటారు. ఇకముందు చదువునేర్పడం పెద్ద సమస్య

అవుతుంది. ఈసమస్యను పరిష్కరించనిదే, పార్టీని అభివృద్ధిజేయడం అసంభవ మవుతుంది.

ఇందుకు రాత్రిపాఠశాలలు పెట్టాలి. టీచరు కామ్రేడ్సు ఎవరైనాఉంటే, ఈపనికి ఉపయోగించవచ్చును. లేకపోతే పార్టుటైమర్సును ఉపయోగించవచ్చును. హోలు టైమర్సు ఈపనిలో మునిగిపోరాదు. రాత్రిపాఠశాలలో పార్టీసభ్యులు, మిలిటెంట్లు, ఇతరులనుగూడ తీసుకోవచ్చును.

చదువునేర్పడంలో నూతనపద్ధతులు వచ్చినాయి. అక్షరాలనుంచీ ప్రారంభించడం, చదవడం వ్రాయడం ఒకేసారి నేర్పడం, అనే పాతపద్ధతి మంచిదిగాదు. కొత్తపద్ధతి ప్రకారం ముందు గుణింతంలేని మాటలు వాక్యాలుచదవడం నేర్పబడుతుంది. అటుతర్వాత మాటలు విడదీసి అక్షరాలుచెప్పడం. తర్వాత గుడింతం. ద్విత్వాక్షరాలు, సంయుక్తాక్షరాలతో గూడినమాటలు వరుసగా చెప్పబడతాయి. ఈవిధంగా మొదటి తరగతి పుస్తకం అయిపోయిన తర్వాత, వ్రాత మొదలుపెట్టబడుతుంది. మనపార్టీ సభ్యులకు చదువు యొక్క ప్రాముఖ్యత తెలుసునుగనుకను, రాజకీయాలు ముందే తెలిసిఉండటంచేత చాల మాటలు వచ్చిఉండుటచేతనూ, త్వరగా చదువువస్తుంది. 4 నెలలలో మన పుస్తకాలు చదివేస్థాయికి తీసుకురావచ్చు.

చదువునేర్పడానికి చింతా దీక్షితులుగారిచే రచింపబడిన, లీలా వాచకాలను ఉపయోగించాలి.

3. సిద్ధాంతపరిజ్ఞానం గలుగజేయడం

పార్టీ పత్రికలు చదవడంవల్ల పార్టీ జనరలుబాడీ మీటింగులవల్ల, పార్టీ రాజకీయ నినాదాలను అర్ధంచేసుకొని వాటిమీద జనరలుగా ప్రజలను సమీకరించడం, మాత్రమే పార్టీసభ్యులకు చేతనవుతుంది. కాని స్థానిక పరిస్థితులను పరిశీలించడం, ఆ రాజకీయ నినాదాలను వారివారి స్థానిక పరిస్థితులకు అన్వయించడం వారికి చేతగాదు. ప్రతికక్షులు ప్రభుత్వోద్యోగుల చర్యలవల్ల నూతన పరిస్థితులు ఏర్పడితే, వాటిని పరిశీలించి ఆ పరిస్థితులకు అనుగుణ్యమైన ఎత్తుగడలతో పార్టీని ముందుకు తీసుకుపోవడంగూడ చేతగాదు. అందుచే వారు పనికి ఆటంకంగల్గినప్పుడెల్ల పై ఆర్గనైజర్లకోసం ఎదురుచూడాలిసివస్తుంది. అలాగాకుండా చొరవతో పనిచేయాలంటే, పార్టీసభ్యులకు ప్రతివిషయాన్ని మార్క్సిస్టు దృక్పధంనుంచి చూడాలి. అందుకు అవుసరమైన ప్రాధమిక మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంత పరిజ్ఞానం కావాలి.

పార్టీ ప్రజాపార్టీగా తయారవుతున్నకొలదీ క్రొత్తగా పార్టీలో వేలకువేలు నూతన సభ్యులు వస్తున్నారు. క్రొత్తగా పార్టీలోనికి వచ్చిన సభ్యులకు మార్క్సిస్టు విజ్ఞానం

కలుగజేయడానికి తేలికగాఅర్ధమయ్యే మూలసిద్ధాంతగ్రంధాలు (Theoritical) కావాలని జిల్లకమిటీలు అన్నీడిమాండుచేస్తున్నాయి. మార్క్సిజం ఒకజీవితసిద్ధాంతాన్ని.దృక్పధాన్ని తెల్పుతుంది. మార్క్సిజం పరిస్థితులను అర్ధంజేసుకోడానికి సరియైన మార్గాన్ని అవలంబించడానికి ఒక వెలుగులాగ వుపయోగపడుతుంది. ఈ సిద్ధాంతాలను మన పరిస్థితులకు అన్వయింపజేసి వాటిని అర్ధంజేసుకుని తగిన ఆచరణయోగ్యమైన కార్యక్రమాన్ని వేసుకోవాల్సి వుంటుంది. అందుచేత కేవలం మార్క్సిస్టు సిద్ధాంతాలను (abstract princeples) తెల్పుతూ ఎంత తేలికగా పుస్తకాలు వ్రాసినా వాటిని చదివినంత మాత్రాన మార్క్సిజాన్ని అర్ధంజేసుకోవడం సాధ్యంగాదు. వాటిని పరిస్థితుల కన్వయింపజేసి వ్రాసినప్పుడే సులభంగా అర్ధంజేసుకొని ఆచరణలో పెట్టడానికి అవకాశముంటుంది.

పార్టీసభ్యులకు మార్క్సిస్టు విజ్ఞానం కలుగజేయడానికి కేవలం సిద్ధాంత పుస్తకాలు అందజేస్తే ప్రయోజనంలేదు. మార్క్సిజాన్ని ఆధారంగా చేసుకుని యిప్పుడు రాష్ట్రంలో పార్టీసభ్యుల నెదుర్కొంటున్న సమస్యలగూర్చి ఒక్కొక్కదాన్ని తీసుకుని రాష్ట్రకమిటీ వ్రాయాలి. ఆంధ్రజాతీయోద్యమంగూర్చి మార్క్సిస్టు దృక్పధంతో వ్రాస్తే, కామ్రేడ్ స్టాలిన్ వ్రాసిన "మార్క్సిజం - జాతుల సమస్య"లోని మార్క్సిస్టు మూలసిద్ధాంతాలన్నీ తెలుస్తాయి. అలాగే హైదరాబాద్ రాజకీయ, ఆర్థిక, సాంఘిక పరిస్థితులగూర్చి తీసుకుని వ్రాస్తే భూస్వామికయుగం, కేపిటలిజం, సామ్రాజ్యవాదం — యీ మాటినిగూర్చి మార్క్సిజం యేమి చెప్పుతూందో తెలుస్తుంది. కేవలం సిద్ధాంతాలు తెలియడమేగాక అచ్చటి కామ్రేడ్సు ఆ పరిస్థితులలో యెలా పనిజేయాలో స్పష్టమైన పంథా తెలుసుకుంటారు. ఉద్యమము అభివృద్ధి అవుతుంది; సులభంగా మూల సిద్ధాంతాలను తెలుసుకోగల్గుతారు. కామ్రేడ్సు లెనిన్, స్టాలిన్ చిట్టచివరవరకు మార్క్సిజానికి ఆదిపురుషులైన మార్క్స్, ఎంగిల్సుగూడ 'మార్క్సిస్టు మూలసిద్ధాంతాల'నేవి యేవీ ప్రత్యేకంగా వ్రాయలేదు. లెనిన్ తన కాలంలో ప్రచారంలోవున్న విభిన్న రాజకీయ, సాంఘిక, ఆర్థిక, మత సిద్ధాంతాలను తీసుకుని అవియెలా సరియైనవిగావో, మార్క్సిజం ఒక్కటే యెలా సరియైనదో గ్రంథాలు వ్రాశాడు. లెనిన్ గ్రంథాలన్నీ గూడ యిదే మాదిరిగావున్నాయి. ఆ పంథానే స్టాలిన్‌గూడ అనుసరించాడు, ఇంకా నూతన అనుభవాన్ని అనుసరించి మార్క్సిజాన్ని యింకా అభివృద్ధిజేశాడు. అలాగే మనంగూడ మనల నెదుర్కొంటున్న సమస్యలనుగూర్చి, మన వ్యతిరేకముఠాల రాజకీయాలనుగూర్చి మార్క్సిస్టు దృక్పధంతో పుస్తకాలు వ్రాయాలి. అవి మన కేడరుకు మూలసిద్ధాంతాలు బాగా అర్ధమయ్యేటట్లు సులభంగా వుపయోగపడుతాయి. ఆచరణలోగూడ బాగా తోడ్పడుతాయి. కేవలం సిద్ధాంత గ్రంథాలు వ్రాస్తే మామూలు పార్టీసభ్యులకు యేమీ ప్రయోజనంలేదు. ఇకముందు రాష్ట్రకమిటీ యీ బాధ్యతను నిర్వహించడానికి ప్రయత్నించుతుంది. కాని ఒక్కవిషయం గ్రహించాలి. పైవిధంగా మార్క్సిస్టు సిద్ధాంతాల పరిస్థితుల కన్వయించి వ్రాయాలంటే స్పష్టమైన

మార్క్సిస్టు దృక్పధంవుండాలి. అలాంటిపని నిర్వహించగలవాళ్ళు మన పార్టీలో చాల కొద్దిమందేవున్నారు. అందుచేత యీ బాధ్యతను నిర్వహించడంలోవున్న హద్దులను, కష్టాలను బాగా గ్రహించాలి.

మనం ప్రకటించుతున్న మార్క్సు, ఏంగిల్సు, లెనిన్, స్టాలిన్ గ్రంధాల అనువాదాలు అభివృద్ధిజెందిన కార్యకర్తలకు మాత్రమే వుపయోగపడుతాయి. వాటిని పై విధంగా అన్వయించి వ్రాయబడే గ్రంధాలను ఆధారంగాగొని పార్టీ ఆర్గనైజర్లు, సెల్లు కార్యదర్శుల విజ్ఞానాన్ని అభివృద్ధి చెయ్యాలి. పార్టీ యితర ప్రజా కార్యక్రమములో పాల్గొనకుండా కేవలం సిద్ధాంతగ్రంధాలను అధ్యయన తరగతులద్వారా పార్టీ సెల్సుకు విశదపర్చడానికి కొంతమంది పార్టీ అధ్యాపకులు ప్రత్యేకంగా వుండాలని కొందరు కార్యకర్తలు కోరారు. (కృష్ణాజిల్లా) కాని యీకోర్కె అసలు మార్క్సిస్టు పరిజ్ఞానం యెలా అలవడుతుందో మర్చిపోవడంవలన సంభవిస్తోంది. మార్క్సిజాన్ని వుత్తమమైన పార్టీ ఆర్గనైజరే బోధించగలడు. పైవిధంగా ప్రత్యేకించినవాళ్ళు బోధించేది జీవరహితమైన, ఆచరణకు సంబంధంలేని, వట్టిమంత్రాలు మాత్రమే. కాన ప్రత్యేకంగా పార్టీసభ్యుల సిద్ధాంతపరిజ్ఞానాన్ని అభివృద్ధిగావించడానికి, అధ్యయన తరగతులు నడపడానికి ప్రత్యేక అధ్యాపకులు అనవసరం; పార్టీ ఆర్గనైజర్లే యీపని చేయాలి.

9. రిపోర్టులు ఎలా వ్రాయాలి?

ప్రాముఖ్యత :— పార్టీలో పై కమిటీ తనక్రింది కమిటీల పనిని రెగ్యులరుగా తనిఖీచేసి, వాటికి సూచనలిస్తూ నడిపించుతూవుంటుంది. ఒకచోట వచ్చిన అనుభవాన్ని స్వీకరించి, మిగతా యూనిట్లకు అవి సక్రమంగా పనిచేయడానికి ఆ అనుభవాన్ని ఉపయోగించుతుంది. వివిధ యూనిట్ల అనుభవాన్ని క్రోడీకరించి మొత్తంమీద వుద్యమాన్ని ఉన్నతస్థాయిలో నడుపుతుంది. తన పై కమిటీకి తనక్రింది యూనిట్లయొక్క, తనయొక్క అనుభవాన్ని తెలియపరచుతుంది. పార్టీలో ఒకచోట అనుభవాన్ని మరొకచోట వుపయోగించడం, మొత్తం పార్టీయొక్క కృషిని పరిశీలించడంద్వారా వచ్చే అనుభవంద్వారా యెప్పటికప్పుడు పరిస్థితుల కనుగుణ్యమైన నూతన నినాదాలను యెత్తుగడలను అవలంబించడంద్వారానే పార్టీ అభివృద్ధి అవుతుంది. ఇందుకు ప్రతి పార్టీ యూనిటుకు తన పై యూనిటుతోనూ, తన క్రింది యూనిటుతోనూ రెగ్యులరుగా సంబంధంవుండటం అవసరం. పార్టీయొక్క రాజకీయైక్యత కాపాడటానికి, పార్టీని అభివృద్ధిపరచడానికి, పార్టీ నాయకత్వానికి సాధారణసభ్యులకు అవినాభావ సంబంధమేర్పడటానికి, పై కమిటీనుంచి క్రిందకు, క్రింద కమిటీనుండి పైకి రెగ్యులరు రిపోర్టింగు అవసరం. ఈ సంబంధం రెండువిధాలుగా వుంటుంది. ఒకటి ఆర్గనైజర్లద్వారా ఉండే ప్రత్యక్ష సంబంధం. రెండవది పై కమిటీలనుండి క్రింది కమిటీలకు పంపే పార్టీ లెటర్లు, సర్క్యులర్లు, రిపోర్టులద్వారాను, క్రింది కమిటీలనుండి పై కమిటీలకు పంపే వార, పక్ష, లేక మాసరిపోర్టులద్వారాను ఏర్పడే పరోక్ష సంబంధం, పై రెండు పద్ధతులు ఒకదానికొకటి సహాయకారిగా ఉంటాయి. పై కమిటీల ఆర్గనైజర్లు రెగ్యులరుగా రావడం జరగకపోవచ్చు. అయినా రిపోర్టులు సర్క్యులర్లు పార్టీ లెటర్లు రెగ్యులరుగా నడుస్తూవుండాలి.

పై కమిటీ తన ఆర్గనైజర్లద్వారా పార్టీసభ్యుల జనరలుబాడీ మీటింగులలో రిపోర్టులు యిప్పిస్తుంది. అంతేగాక ఒకచోట సాధించిన ఘనకార్యాలను, లోపాలను పార్టీ లెటర్లు, సర్క్యులర్లద్వారా క్రింది యూనిట్లకు తెలియపరుస్తుంది; సూచనలిస్తుంది. ప్రతి యూనిటు పంపిన రిపోర్టులను తీసుకొని, వాటినిగూర్చిన

సూచనలు ప్రతి యూనిటుకు అందజేస్తుంది. అలాగే క్రింది యూనిటు పై యూనిటుకు రెగ్యులరు రిపోర్టులు పంపుతూవుంటుంది.

రిపోర్టుల ప్రాముఖ్యతను గ్రహించకపోవుట

చాల పార్టీ యూనిట్లు, కామ్రేడ్సు ఇంతవరకూ రిపోర్టులయొక్క ప్రాముఖ్యతను సరిగా గ్రహించలేదు. అందుచేతనే పార్టీ యూనిట్లు పై యూనిట్లకు రెగ్యులరుగా రిపోర్టులను పంపడంలేదు. కొంతమంది కామ్రేడ్సుకు రిపోర్టులు వ్రాయడమంటే బద్ధకం, రేపు వ్రాదాములే అని కొంతకాలం గడపడం, అటు తర్వాత వార్తలు పాతబడిపోయినవి గనుక ప్రయోజనంలేదని మానివేయడం గూడ జరుగుతోంది. కొంతమంది కామ్రేడ్సు రిపోర్టులు సరిగా వ్రాయలేమేమో అనే భయం జూపడం, ఆలస్యంగా పంపడంగూడ ఉంది. కామ్రేడ్సు, రిపోర్టులు ఆలస్యంగా పంపినందువల్లగూడ హాని జరుగుతుంది. సకాలంలో పై కమిటీకి రిపోర్టు అందకపోతే, ఆ అనుభవాన్ని మరొకచోటున ఉపయోగించేలోపుగానే రిపోర్టుపంపిన యూనిటుకు సూచనలిచ్చేలోపుగానే, పరిస్థితులు పూర్తిగా మారిపోవచ్చును. కనుక కామ్రేడ్సు రిపోర్టు పంపడంవిషయంలో రెగ్యులరుగాను, సకాలానికి అందించేటట్లుగాను ఉండాలి.

రిపోర్టులన్నిటిలో మరొక పెద్ద లోపమేమంటే, రిపోర్టులోని విషయాన్ని ప్రదేశాన్నిగూర్చిన వాస్తవిక పరిస్థితులను చిత్రించడంలేదు. రిపోర్టు వ్రాసే కామ్రేడ్సు వాస్తవిక పరిస్థితులను తెలుసుకోడానికి బదులుగా తమయొక్క ఊహలను రిపోర్టులలో వెల్లడిస్తారు. ఒక రాజకీయగ్రూపును లేక ఒక వ్యక్తినిగూర్చి వ్రాసేటప్పుడు వారి వారి ఆర్థిక రాజకీయ సంబంధాలను, వారు ప్రజా సమస్యలలో ప్రాక్టికలుగా అవలంబించే యెత్తుగడలనుబట్టి వారిని పరీక్షించడం జరగడంలేదు. వారియెడల రిపోర్టువ్రాసే కామ్రేడ్సుకు యేర్పడిన అభిప్రాయాల ననుసరించి వారి చర్యలను అర్థంచేసుకోవడం జరుగుతోంది. కామ్రేడ్సు, ఆఫీసులలో కూర్చున్నవారికి కళ్ళు కాళ్ళు ప్రజల్లో పనిజేసేవారే. ప్రజల్లో పనిజేసేవారు రిపోర్టులను వాస్తవిక పరిస్థితుల ననుసరించి వ్రాస్తేనేగాని సరియైన సూచనలిచ్చి నడపడానికి, ఉద్యమ గమనాన్ని సరిగా అంచనా వేయడానికి ఆఫీసులోని కామ్రేడ్సుకు అవకాశముండదు. కామ్రేడ్సు రిపోర్టులు వ్రాయడానికి అవస్థపడుతూవుంటే, క్రమంగా వాస్తవిక పరిస్థిలను చిత్రించే రిపోర్టు వ్రాయడం అలవాటవుతుంది.

రిపోర్టులు వ్రాసే విధం

ఒక యూనిటు చేస్తున్న పనినిగూర్చి రెగ్యులరుగా పంపే రిపోర్టులు బహిరంగ సభలను గూర్చిన రిపోర్టులు, మహాసభలను గూర్చిన రిపోర్టులు అని వివిధ రకమైన రిపోర్టులు వుంటాయి.

పనినిగూర్చిన రెగ్యులరు రిపోర్టులు

(1) వివిధ రంగాలను గూర్చి పార్టీ తీసుకున్న బాధ్యతలను, కోటాలను గూర్చి క్లుప్తంగా ఇయ్యాలి.

(2) ఒక్కొక్క రంగంలో ఆ బాధ్యతలను నిర్వహించడానికి యూనిటు చేసిన కృషినిగూర్చి, ప్రతికక్షులుపెట్టిన ఆటంకాలు, ఇచ్చిన నినాదాలు, వేసిన ఎత్తుగడలను గూర్చి, మనం బాధ్యతలను సభ్యత్వ కోటాలను ఎంతవరకూ పూర్తిచేశాం అనేదానిని గూర్చి, పూర్తిచేస్తే ఎందుకు పూర్తిచేయగలిగాం, పూర్తిచేయకపోతే ఎందుకు పూర్తిచేయలేకపోయాం, అనే ఆత్మ విమర్శనతోసహా ప్రతి రంగానికి వేరువేరుగా వ్రాయాలి. పార్టీ నిర్మాణాన్నిగూర్చి గూడా బాధ్యతలు ఎంతవరకూ పూర్తిచేసింది, పార్టీ నిర్మాణంలో లోపాలు, సూచనలు అన్నిరంగాల రిపోర్టు లయిపోయిన తర్వాత చివర వ్రాయాలి.

(3) తర్వాత క్రిందటి మీటింగుకు, ఇప్పటికి పార్టీ స్థితిలో భేదం, ఇతర రాజకీయ పార్టీతో సంబంధం, వాటితో పోల్చి చూస్తే ఎంత బలముందీ, సమీక్ష చెయ్యాలి.

(4) అటు తర్వాత ముందుచేయబోయే పనికి సూచనలుండాలి,

(5) ఆ యూనిటు యొక్క జమా ఖర్చులు ఉండాలి.

రిపోర్టులు వ్రాయడాన్ని గూర్చి పైన ఇవ్వబడిన జనరలు పద్ధతి అన్ని పార్టీ యూనిట్లు తాము రెగ్యులరుగా పంపే రిపోర్టులకు ఉపయోగించుతుంది.

సెల్లు రిపోర్టులు

సెల్లులు ఎలా రిపోర్టు పంపాలి అనేదానిమీద కృష్ణాజిల్లాకమిటీ ఇచ్చిన సర్క్యులరు నెం, 67, మిగతా జిల్లాలకు సూచనగాఉండటానికి యీ క్రింద ముద్రింపబడుతోంది. ఈ సర్క్యులరులోఉన్న హంశాలన్నిటికి మొట్టమొదటి

సారి సెల్లుపంపే రిపోర్టులో సమాధానాలు ఉండాలి. కాని తరువాత పంపే రిపోర్టుల్లో తిరిగి వ్రాసే (Repeat) హంశాలను వదలివేయ వచ్చును. ఉదాహరణకు పార్టీ నిర్మాణం అనే శీర్షికలో "సెల్లు ఏరియాలో ఎన్ని గ్రామాలున్నవి?" రాజకీయంగా అనే శీర్షికలో "మీసెల్లు ఏరియాలోఉన్న గ్రామాల్లో యేయేరాజకీయ పక్షాలున్నవి?" మొదలైన ప్రశ్నలను తరువాత రిపోర్టులలో వదలివేయవచ్చును. ఈ రిపోర్టులో అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం వ్రాయనవసరంలేదు. ఈ రిపోర్టులోని శీర్షికలను తీసుకొని, రిపోర్టు వరుసగా వ్రాయాలి. కాని ప్రశ్నలకు అవును కాదు అని సమాధానం వ్రాయగూడదు,

పార్టీ నిర్మాణం !

సెల్లుప్రాంతము :— సెల్లు ఏరియాలో ఎన్ని గ్రామాలున్నవి ? ఎన్ని గ్రామాలనుండి వచ్చిన సభ్యులతో మీ సెల్లు ఏర్పడింది ? ఎన్నిగ్రామాలతో పార్టీకి దగ్గర సంబంధ మేర్పడినది ?

సెల్లు సమావేశాలు :— సెల్లులో సభ్యులెంతమంది ? ఎంతమంది హాజరైనారు ? క్రిందటి సమావేశంలో తీసుకొన్న నిర్ణయాలు - వాటి నెంతవరకు అమలు జరిపారు ? విభజించుకొన్న పనిని నిర్వహించని సభ్యులను సంజాయిషీ అడిగి హెచ్చరిస్తున్నారా ? సమిష్టిగా ఆలోచించి ప్రతి విషయంమీద నిర్ణయాలు తీసుకొంటున్నారా ? వచ్చే సమావేశంనాటికి మీరు ఏయే నిర్ణయాలు తీసుకున్నారు? వాటినెలా ఆచరణలో పెట్టదలచుకొన్నారు ? క్రొత్తసభ్యులను చేర్చుకొనేటప్పుడు వారి పూర్వచరిత్రను పై కమిటీకి తెలియజేస్తున్నారా ? పై కమిటీనుండి వచ్చిన సర్క్యులర్లను సెల్లులో చర్చించి యేవిధంగా ఆచరణలో పెట్టదలంచినది, ఆచరణలో పెట్టిన పిమ్మట యెటువంటి ఫలితాల నిచ్చుచున్నదీ పై కమిటీకి తెలియజేస్తున్నారా ?

మిలిటెంట్సు—సానుభూతిపరులు :— మీ సెల్లు ఏరియాలోనున్న గ్రామాలలో ఎంతమంది మిలిటెంట్సు వున్నారు ? వారికి ఏమైనాపని అప్పజెప్పి చేయిస్తున్నారా ? వారిలో దినదినాభివృద్ధి కన్పడుతోందా ? ఎంతకాలంలో వారిని పార్టీ సభ్యులుగా తీసుకోవచ్చు ? పార్టీ సానుభూతిపరు లెంతమంది వున్నారు ? వారు మన పార్టీకి ఆర్థికంగాగాని, యితరత్రాగాని ఏ విధంగా సాయంచేస్తున్నారు ?

సెల్ లైబ్రరీ—పార్టీసభ్యుల విజ్ఞానాభివృద్ధి :— సెల్ లైబ్రరీ ఏర్పాటు చేసుకున్నారా ? లేనిచో ఎందుచేత ? ఉన్నచో పార్టీ ప్రచురణలన్నీ ఉన్నవా ? మొత్తం ఎన్నిపుస్తకాలున్నవి ? పార్టీసభ్యులందరూ చదువుకున్నారా ? చదువురాని పార్టీసభ్యులకు చదివిచెప్పుటను ఏర్పాటు చేశారా ? సందేహాలను నోట్ చేసుకొని వాటిని తీర్చుకొనుటకు ఆర్గనైజర్లసాయం పొందుతున్నారా ? మీ లైబ్రరీ పుస్తకాలను సానుభూతిపరులు, మిలిటెంట్సు, యితరులూ ఎవరైరా చదువుతున్నారా? యీ నెలలో యెంతమంది చదివారు ? పార్టీసభ్యుల విజ్ఞానాభివృద్ధికి ఎంతవరకు మన సాహిత్యం సాయపడుతోంది ? సాహిత్యపుఫండు మీసెల్లుకు నిల్వవున్నదా?

వైజ్ఞానిక ప్రచారం :— మీ సెల్లు సభ్యులందరూ ఒక దళంగా పని చేస్తున్నారా ? అందరూ సమిష్టిగా అంతర్జాతీయగీతము, జెండాపాటలను పాడగలరా ? యితర వైజ్ఞానిక ప్రదర్సనాలు ఏమైనా చేయగలరా ? యీవారంలో లేక యీ నెలలో ఎంతమంది ప్రజల్లో ప్రచారం చేశారు ? జిల్లా లేక తాలూకా దళాలు మీ సెల్లు ఏరియాలో ఏమైనా ప్రదర్శనాలు యిచ్చినవా ? వాటివల్ల ప్రజల్లోఏమైనా మార్పు వచ్చిందా ? ఫలితాలు.

పార్టీ పత్రికలు :—మీ సెల్లు ఏరియాలో అన్ని గ్రామాలకు ప్రజాశక్తి వెళ్తోందా, వెళ్ళనిచో ఎన్నిరోజులలో అన్నిగ్రామాలకు తీసుకువెళ్ళగలరు? ఎన్ని రీడింగుగ్రూపుల నేర్పాటుచేశారు ? ఎంతమంది హాజరౌతున్నారు ? చందాదారులెంతమంది ? మొత్తం ఎంతమంది చదువుతున్నారు ? కేంద్రాలలో ఎంతమందికి చదివి వినిపిస్తున్నారు ? చదువరులందరితోను పార్టీసభ్యులు దగ్గర సంబంధం పెట్టుకొంటున్నారా ? ప్రజాశక్తిపై ప్రజల అభిప్రాయము ? పార్టీసభ్యులందరూ ప్రజాశక్తి చదివి సరిగా అర్థంచేసుకొంటున్నారా ? యితరుల సందేహాలను తీర్చగల్గుతున్నారా ? ప్రజాశక్తిపై మీ సెల్లు విమర్శన పంపుతోందా ?

పార్టీ కోటాలు—పార్టీఫండు :— పార్టీ కోటాలను పార్టీసభ్యులు రెగ్యులరుగా చెల్లిస్తున్నారా ? నెలసరిచందా యిచ్చే సానుభూతిపరులెంతమంది ? పార్టీ ఫండును ఎంత ప్రోగుచేశారు ? యింక ఎంత వాగ్దానమున్నది ? దీనిలో పార్టీ సభ్యులు యిచ్చేదెంత ? ప్రజలనుండి ఎంత ? సెల్లు ఆదాయ వ్యయాలు ఎంత ? ఎకౌంట్సు వ్రాస్తున్నారా ?

జనరల్‌బాడీ సమావేశాలు :— జనరల్‌బాడీ సమావేశానికి సభ్యులందరూ హాజరగుటకు ఏమి ప్రయత్నాలు చేశారు ? ఎంతమంది హాజరుకాలేదు ? కారణాలు. జనరల్‌బాడీవల్ల సభ్యులలో ఏమైనా మార్పు వచ్చిందా ? ఎట్టి ఫలితాల నిచ్చింది ?

రా జ కీ య ం గా :

ఇతర రాజకీయపక్షాలు వాటి పాత్ర :—మీ సెల్లు యేరియాలో నున్న గ్రామాలలో ఏయే రాజకీయపక్షాలున్నవి ? మన పార్టీయెడ వారివైఖరి యేమిటి ? వారి కార్యకలాపాలు - జమీందారు, జస్టిస్ లేక స్థానికపెత్తందార్లు మనయెడ యెట్టివైఖరి అవలంబిస్తున్నారు ? ఏయే విషయాల్లో మనలను వ్యతిరేకిస్తున్నారు ? ఏయే సమస్యలు తీసుకొని ప్రజలను సమీకరించుటద్వారా వారిని ప్రజలనుండి వేరు పరచగల్గుతున్నారు ?

పార్టీ నాయకత్వం :— మీసెల్లు యేరియాలో ఎన్ని గ్రామాల్లో పార్టీ పలుకుబడి వృద్ధియౌతోంది ? మనవెనుక ఏయేవర్గాలు నిలచుటకు సిద్ధంగా వున్నాయి ? ఎందుచేత ? మన పార్టీసభ్యులను ప్రజానాయకులుగా గుర్తిస్తున్నారా? మీసెల్లు ఉన్న గ్రామంగాని, మీ ఏరియాలోనున్న తక్కిన యే గ్రామాలు గాని రెడ్ విల్లేజస్‌గా తయారైనవా ? లేని యెడల యింకెంతకాలంలో గుర్తించబడతాయి ? అందుకు మీరవలంబిస్తున్న విధాన మేమిటి ?

రాజకీయప్రచారం :—ప్రజల్లో మన పంథాను గూర్చి యేవిధంగా ప్రచారం చేస్తున్నారు ? యెంతమందిలో చేశారు ? వచ్చిన ఫలితాలేమిటి ? యితర రాజకీయపక్షాల ప్రచారం - వాటి నెదుర్కొనుటకు మీరుచేసిన ప్రచారము ? (బహిరంగ సభలద్వారాను - యింటింటికీ తిరుగుటద్వారాను)

ప్ర జా స ం స్థ లు :

రైతుసంఘము :— (1) ఆర్గనైజేషన్ : సెల్లుయేరియాలోనున్న గ్రామాలన్నిటిలోను సంఘాలేర్పడినవా ? సభ్యత్వమెంత ? కోటాయెంత ? ఎంతపూర్తి అయినది ? ఎన్ని గ్రామాల్లో ఆఫీసులేర్పడినవి ? ప్రతి గ్రామసంఘంనుండి తాలూకాసంఘానికి రిపోర్టులు వెళ్ళేటట్లు చూస్తున్నారా ? రైతుసంఘ ఆఫీసుకు

రైతులు వచ్చి పోతూవుంటారా ? రైతుసంఘమంటే తమదిఅని రైతులు గుర్తిస్తున్నారా ? పిటీషనులు రాయబారాలను గురించి వివరించాలి. (2) సమస్యలు : రైతుకూలీ సామరస్యం, అధికోత్పత్తి, ఆహారసమస్య, యెరువులు, నీటిసౌకర్యాలు, స్థానికసమస్యలు - వీటి విషయంలో రైతుసంఘంద్వారా చేసిన కృషిని వివరించాలి.

కూలీసంఘం :— (1) ఆర్గనైజేషన్ పైవిధంగానే. (2) సమస్యలు— బంజరుభూములు, కూలీరేటు, ఇళ్ళస్థలాలు, మరుగుదొడ్లను గురించి ఏమికృషి జరిగిందీ వివరించాలి.

యువజనసంఘం :—(1) ఆర్గనైజేషన్ : ఆఫీసు, సభ్యత్వం, సంఘాలు. కార్యక్రమం : ఆటలు, వయోజనవిద్య, విజ్ఞానప్రచారం మొదలైనవాటిని గురించి వివరించాలి. (2) బాలసంఘము, కార్యక్రమము. (3) జాతీయ యువజనసంఘాలను గురించి వివరించాలి.

మహిళాసంఘం :— సభ్యత్వంలో అభివృద్ధి, సంఘనిర్మాణము. సమస్యలు-లెట్రిన్, విద్యా, వైద్యసౌకర్యాలు, రాపుకమిటీబిల్లుపై ఆందోళనను గురించి.

ప్రజారక్షణదళము :— (1) నిర్మాణము : సభ్యత్వం, వివిధదళాలుగా యేర్పడి పనిచేయుచున్నవా ? (2) కార్యక్రమం : వివిధరంగాల్లో చేసినపని; ప్రచారసందర్భంలోనూ, బహిరంగసభల్లోనూ గ్రామసౌకర్యాల విషయంలో చేసిన పనిని గురించి వివరించాలి.

విద్యార్థిసంఘం :—(1) నిర్మాణము : సభ్యత్వమును గురించి, ఆఫీసును గురించి, (2) కార్యక్రమం : కిరోసిన్, పేపరు, టిఫిన్‌షెడ్, ఆటలు, విజ్ఞానం మొదలైనవాటిని గూర్చి, (3) విద్యార్థిఫెడరేషన్ పంథానుగూర్చి ప్రచారం (4) జాతీయవిద్యార్థిసంఘము వీటిపైన వివరించాలి.

ట్రేడ్ యూనియన్ :—(1) వివిధకార్మిక సంఘాల నిర్మాణము - సభ్యత్వాలు-ఆఫీసులు, వాటి నిర్వహణ. (2) ఉత్పత్తిపంథా ననుసరించి వివిధకార్మిక రంగాల్లో పని ఎలా జరుగుతోంది ? (3) వివిధసమస్యలు తీసుకొని యెలా కృషి చేస్తోందీ వివరించాలి.

కో టా ల వే బి ల్

	పార్టీ సభ్యత్వం	రైతు	యువజన	కూలీ	మహిళా	ప్ర.ర.ద.	ప్రజాశక్తి	పార్టీ ఫండు	విద్యార్థి
నెలలో తీసుకున్న కోటా									
పూర్తిచేసినది									
ఇప్పటికున్న మొత్తం									

షరా :— పై విషయాలమీద రెగ్యులరుగా రిపోర్టులు పంపాలి. ఏవైనా ప్రత్యేక ఘటనలు జరిగినపుడు వెంటనే ప్రత్యేక రిపోర్టు పంపాలి. పార్టీకి వివరంగా రిపోర్టులు పంపుటతోబాటు పార్టీ ఆర్గనైజేషన్ మినహాయించి తక్కినవాటిమీద ప్రజాశక్తికి, దిన పత్రికలకు రిపోర్టులు పంపాలి.

పార్టీ కమిటీల రిపోర్టులు

తాలూకాకమిటీలు, జిల్లాకమిటీలు పంపేరిపోర్టులలో, ఆతాలూకా లేక జిల్లాలలో ఒక్కొక్కరంగంతీసుకొని ఆరంగంలో తాలూకాలవారీగా ప్రతి చిన్నవివరం వ్రాయడం జరుగుతోంది. అంతేగాక ముందు పార్టీనిర్మాణం, కోటాలు తరువాత ప్రజారంగాలు రిపోర్టులు ఒకదానితో మరొకదానికి సంబంధంలేనట్లుగా వ్రాయబడుతున్నాయి. ఇతర రాజకీయ గ్రూపులనుగూర్చి వ్రాసేటప్పుడు, వివిధరంగాలలో ప్రజాసమస్యలలో వారు ఎట్లా మనతో మెలుగుతున్నారో వ్రాయకుండా, చివరకు రాజకీయ గ్రూపులు రాజకీయంగా ఎలా వ్యతిరేకంగా పనిచేస్తున్నాయి అని వ్రాస్తున్నారు. రిపోర్టులలో చాలవరకు పార్టీయొక్క కృషి ఉంటోందిగాని, మిగతా రాజకీయ గ్రూపులు వ్యక్తులు పార్టీకి సంబంధం లేకుండా చేసే పనులనుగూర్చి గూడా వ్రాయబడుటలేదు. మొత్తం ఆ ప్రాంతంలోని ప్రజా జీవితాన్ని రిపోర్టులు ప్రతిబింబింప చేయుటలేదు. కమిటీ ఏబాధ్యతలు తీసుకుందో, వాటిని ఎంతవకు నెరవేర్చారో ? అనేది రిపోర్టులలో ఉండటంలేదు. చేసిన పనులుమాత్రం పరిస్థితులకు సంబంధం లేకుండా వ్రాయబడుతున్నాయి.

తాలూకా లేక జిల్లాకమిటీల రిపోర్టులలో ఆహారసమస్య, రైతురంగం, కూలిరంగం, కార్మికరంగం, విద్యార్థి, యువజన, బాల, ఉపాధ్యాయ, ప్రజారక్షణ దళం, మహిళా రంగాలు వరుసగా తీసుకోవాలి. ఆయారంగాలలో ఆ నెలలో తాలూకా లేక జిల్లామొత్తంమీద తీసుకొన్న బాధ్యతలు, అవి ఎంతవరకు నెరవేర్చిందీ, ఏయే సమస్యలు తీసుకు పనిజేసిందీ, ఇతర రాజకీయ గ్రూపులు ఏమి చేసిందీ, వ్రాయాలి. ఈ చేసిన పనులవల్ల ఆ రంగంలో ఎంతమంది ప్రజాసంఘ సభ్యులను చేర్చిందీ, ఎంతమంది మిలిటెంట్లు వచ్చిందీ, ఎంతమందిని పార్టీ సభ్యలనుగా తీసుకుందీ వ్రాయాలి. ఆ రంగంలో ప్రజాసంఘం నిర్మాణం ఎలావుందీ వ్రాయాలి. అంతేగాని ఒక్కొక్క రంగంలో ప్రతి తాలూకాలో ఏమిచేసిందీ వివరాలు అపుసరంలేదు.

అటుతర్వాత పార్టీ నిర్మాణం తీసుకొని దానిలో పార్టీసభ్యత్వ పెంపుదల, సెల్లు ఫంక్షనింగు, పార్టీ పత్రిక, పార్టీసభ్యుల రాజకీయాభివృద్ధి, జమాఖర్చులు వ్రాయాలి.

చివరకు మన పార్టీయొక్క మొత్తం పనినిగూర్చిన "జనరలైజేషనులు", మన పార్టీకి యితర రాజకీయ గ్రూపుల సంబంధాలు, బలాబలాలు మొదలైన వాటిని వ్రాయాలి.

ప్రజాసమస్యలు తీసుకోవడంవల్ల యేవిధంగా బలపడ్డామో, యెలా ప్రజా సంఘాల సభ్యత్వం, మిలిటెంట్లు, పార్టీ సభ్యత్వం యెలా యెక్కువయాయో, దీనిద్వారా వివిధ రాజకీయ పార్టీల సంబంధం యెలామారాయో; యీ విధంగా రిపోర్టు మొదటినుండి చివరివరకూ ఒక గొలుసువలె వుండాలి. రిపోర్టులో పార్టీ కృషేగాక ఆ ప్రాంతంలోని రాజకీయ జీవితాన్నంతనూ, ప్రజా జీవితాన్నంతనూ ప్రతిబింబించాలి.

ప్రజా సంఘాల రిపోర్టులు

పార్టీ యూనిట్లకోసం వ్రాయబడిన రిపోర్టుయొక్క 'జనరలు' స్వరూపం వీటికిగూడ పనికి వస్తుంది. పార్టీ కమిటీల రిపోర్టులలో వివిధ రంగాలనుగూర్చి వ్రాయబడుతుంది. కాని ప్రజాసంఘాలు తమ పైసంఘానికి పంపే రిపోర్టుల్లో, ఆ సంఘాన్నిగూర్చి మాత్రమే వుంటుంది. ఈ రిపోర్టులో,

(1) ఆ నెలలో తీసుకున్న బాధ్యతలు, కోటాలు

(2) ఆ బాధ్యతలను నెరవేర్చడానికి ఏయే పనులుచేసింది, సంఘంలోని యితర రాజకీయ గ్రూపులు, సంఘం వెలుపలవున్న రాజకీయ గ్రూపులు యే వైఖరి అవలంబించిందీ వ్రాయాలి. మనంచేసిన పనిలోని లోపాలు, సాధించిన కార్యాలు వ్రాయాలి.

(3) మనంచేసిన కృషిద్వారా సంఘ సభ్యత్వాన్ని ఎలా ఎక్కువజేశాం; ప్రాథమిక సంఘాలు యెలా పనిచేస్తున్నవి; మొదలైన సంఘ నిర్మాణ విషయాలనుగూర్చి వ్రాయాలి.

(4) ముందు తీసుకోబోయే సమస్యలు, వాటిని యెలా ఆచరణలో పెట్టబూనుకునేదీ వ్రాయాలి.

గమనిక :— పార్టీ రిపోర్టులలో పార్టీ యేమి కృషిచేసిందీ, యితర రాజకీయ గ్రూపులు ఏమిచేసిందీ వ్రాస్తాం. కాని ప్రజాసంఘాల రిపోర్టులలో తమ సంఘం యెలా కృషిచేసిందీ, సంఘంలోని యే వ్యక్తులు యెలాచేసిందీ, వ్రాస్తాం. సంఘంలోని వివిధ రాజకీయ గ్రూపులనుగూర్చి వ్రాయం. సంఘం బయటవున్న రాజకీయ గ్రూపులు ఆ రంగంలో పనిచేసేటప్పుడు వాటినిగూర్చి వ్రాయవచ్చును.

పత్రికలకు పంపే రిపోర్టులు

మన కామ్రేడ్సు ఏవైనా విజయాలను సాధించినప్పటికీ, వాటి రిపోర్టులను దినపత్రికలకు, ప్రజాశక్తి, పీపుల్సువార్‌కు ఎప్పటికప్పుడు పంపడంలేదు. ఇది కొంతవరకు బద్ధకంవల్ల, కొంతవరకూ భాష సరిగా ఉండదనీ, మరికొంత దినపత్రికలు వేసుకోవడం లేదుగనుక వ్రాయడం వ్యర్థమనీ, జరుగుతోంది. కామ్రేడ్సు ఎప్పటికప్పుడు సాధించిన ప్రజా విజయాలను గూర్చి, బహిరంగ సభలను గూర్చి రిపోర్టులు పంపుతుండాలి. ఇవి పత్రికలలో ప్రకటింప బడితే, మిగతా చోట్ల ప్రజలు, కామ్రేడ్సుకు పనిచేయడానికి హుషారు ఎక్కువ అవుతుంది. ఇవి నిస్పృహగా కూర్చున్న కామ్రేడ్సును మేల్కొలుపుతాయి.

మన పార్టీ చాల విశాలమయింది. ఎంతోమంది కామ్రేడ్సు ఎన్నో ప్రజా సమస్యలను తీసుకు పనిచేస్తున్నారు, ప్రజాశక్తికి ఉన్నదల్లా 8 పేజీలే, ఈ 8 పేజీ

లలోనే పార్టీసభ్యులకు, ప్రజలకు వారంలోని జాతీయ అంతర్జాతీయ విషయాలను గూర్చి వ్రాయాలి. ఇతర రాష్ట్రాల్లోని, మన రాష్ట్రంలోని ప్రజా వుద్యమాన్నంతటినీ ప్రతిబింబింపజేయాలి. కనుక పార్టీ కామ్రేడ్సు పంపే ప్రజా సమస్యలను గూర్చిన రిపోర్టుల నన్నిటినీ వేయడానికి వీలుండదు. వచ్చిన మొత్తం రిపోర్టులలో పార్టీ సభ్యులను ప్రజలకు మార్గం చూపించడానికి యే రిపోర్టులైతే తోడ్పడతాయో వాటినే వేయడం జరుగుతుంది. కాగితం కరువుగావున్న రోజుల్లో యింతకన్న చేయగలిగేదేమీలేదు. కనుక కామ్రేడ్సు తాము పంపే రిపోర్టులు పడలేదని నిస్పృహ చెందకుండా, యెప్పటికప్పుడు విజయాలు సాధించినప్పుడు, యితర ప్రజాసమస్యలు కష్టాలనుగూర్చి ప్రజాశక్తికి రిపోర్టులు వ్రాస్తూవుండాలి.

ఇలాగే పీపుల్సువార్ సంగతిగూడా. ముఖ్యమైన కామ్రేడ్సుసైతం, చివరకు జిల్లా కమిటీలుగూడా కామ్రేడ్ జోషీవలె చక్కని ఇంగ్లీషు వ్రాయలేముగదా అనే భావంతో, పీపుల్సువార్‌కు వార్తలు పంపడంలేదు. అన్ని రిపోర్టులు రాష్ట్ర కమిటీకి వచ్చినతరువాత వాటిని ప్రోగుజేసి 'న్యూస్ లెటరు'గా-పంపడం జరుగుతోంది. ఇందువల్ల వార్తలు పీపుల్సువార్‌కు చేరడానికి కనీసం నెలరోజులు పడుతోంది. ఇంతలో వార్తలు పాతబడి, వాటి ప్రాముఖ్యత పోతోంది. దీనివల్ల ప్రయోజనంలేదు. అందువల్ల కామ్రేడ్సు ఇంగ్లీషుభాష సరిగా వ్రాయలేమనే చిన్నతనం (Inferiority Complex) అవుసరంలేదు. మన మాతృభాష తెలుగు. ఇంగ్లీషులో సరిగా వ్రాయలేకపోయినందుకు సిగ్గు అవుసరంలేదు. తప్పులున్నా అర్థమయేటట్లు వ్రాస్తేచాలు. పని గడుస్తుంది. కనుక కామ్రేడ్సు వారికి చేతనైనట్లుగా ఇంగ్లీషులో వ్రాసి, యెప్పటికప్పుడు వార్తలు "ప్రత్యక్షంగా" (Direct) పీపుల్సువార్ ఆఫీసుకు పంపాలి. జిల్లా కమిటీలు, తాలూకా కమిటీలు తప్పక యీ పనిని చెయ్యాలి. విషయం మంచిదైతే, వాళ్ళే చక్కని ఇంగ్లీషులో తిరిగి వ్రాసి ప్రచురించుతారు.

ఇక దినపత్రికల విషయం. ఇవన్నీ బూర్జువావర్గ పత్రికలే. అందుచే ఇతర వార్తలుంటే, మనం పంపిన వార్తలను వేయడంలేదు. ఖాళీగా వుండి, కాగితం నింపాలసిన అవుసరం వచ్చినప్పుడే మన వార్తలను వేస్తున్నారు. అయినప్పటికీ మనవార్తలే యెక్కువగా ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రికలలో వస్తూవున్నవి.

ఎందువల్లనంటే ఆంధ్రరాజకీయరంగంలో చురుకుగా పనిచేసేది మనపార్టీయే. మిగతా రాజకీయపార్టీలు, గ్రూపులు నిస్తబ్ధతగా కూర్చున్నాయి. కమ్యూనిస్టు వ్యతిరేకులకు మన మీటింగులను చెడగొట్టడం తప్ప వేరే 'పోజిటివు' కార్యక్రమం లేదు. దిన పత్రికలలో వచ్చే యీ కొద్ది వార్తలైనా మనవార్తలు రాష్ట్రకమిటీకి యెంతో ఉపయోగ పడుతున్నాయి. నిస్సందేహంగా యితర ప్రజాసామాన్యానికి గూడ ఉపయోగపడుతున్నాయి. మన వార్తలను రూపం చెడగొట్టివేస్తున్నా మన ప్రతికక్షుల అబద్ధాలకు చోటుయిస్తున్నా. మనం ప్రస్తుతపరిస్థితుల్లో బూర్జువా దిన పత్రికలను ఉపయోగించుకోక తప్పదు. కనుక కామ్రేడ్సు దిన పత్రికలకు వార్తలను రెగ్యులరుగా పంపుతూవుండాలి.

పత్రికలకు పంపే రిపోర్టులు ఎలా వుండాలి ?

ఈరిపోర్టులలో 'కట్టె, కొట్టె, తెచ్చె' అన్నట్లు, "బహిరంగసభకు ఇంత మంది వచ్చారు; ఫలానావారు ఉపన్యాసం యిచ్చారు; సభ దిగ్విజయంగా ముగిసింది" అని వ్రాస్తున్నారు. వీటివల్ల ప్రజల్లో వుత్సాహం కలుగుతుందేమోగాని వారి సమస్యలను పరిష్కరించడంలో వారికి మార్గంచూపడానికి పనికిరావు.

రిపోర్టులు ఎలా వుండాలి ? ముందుగా ప్రజాసమస్యలనుగూర్చి చదువరుల కర్థమయ్యేటట్లు వివరంగా వ్రాయాలి. దానిమీద ప్రజలను ఎలా సమీకరించిందీ, ఇతర రాజకీయ గ్రూపులు, వ్యక్తులు యేమిచేసిందీ, కమ్యూనిస్టు వ్యతిరేకులు (ముఖ్యులపేర్లుగూడ పేర్కొనవలెను) ఏవిధంగా ఆటంకాలుపెట్టిందీ, వాటిని మనం ఏవిధంగా బద్దలుచేసిందీ, ప్రజల్లో ఏ అభిప్రాయాలుగలిగిందీ వివరంగా వ్రాయాలి. వీటిమీద మన అభిప్రాయం వ్రాయనవుసరంలేదు, పైవిధంగా విషయాలువ్రాస్తే చదువరులే అభిప్రాయాలు యేర్పరచుకుంటారు, ఈ పద్ధతి పార్టీ ప్రచారానికి చక్కగా ఉపయోగపడుతుంది. మనం ప్రతికక్షులనుగాని, మనలకు సహాయం చేసినవారికిగాని తిట్లు, దీవనలు పత్రిక రిపోర్టులలో అవుసరంలేదు, ఈ రిపోర్టులలో పార్టీ నిర్మాణాన్నిగురించిగాని, ప్రజాసంఘాల నిర్మాణాన్నిగూర్చిగాని చర్చించ నవుసరం లేదు.

ఏమీ విజయాలను సాధించకపోయినప్పటికీ ప్రజా సమస్యలను వివరించే వార్తలుగూడ పంపవచ్చును.

సర్క్యులర్లు :

ఏదైనా ప్రజాసమస్యగాని, పార్టీ సమస్యగాని వచ్చినప్పుడు, ఒకపార్టీ యూనిటు తన క్రింది యూనిట్లకు సూచనలను సర్క్యులరు ద్వారా పంపుతుంది. ఇలాగే ఒక ప్రజాసంఘ కార్యవర్గం తనక్రింది సంఘాలకు సర్క్యులర్లను పంపుతుంది,

మొదట ఏ విషయంగూర్చి వ్రాయబడుతోందో, దాన్ని హెడ్డింగుగా పెట్టాలి. మొదటి పేరాలో ఆసమస్యయొక్క ప్రాముఖ్యతను, కామ్రేడ్సుకు అర్థమయ్యేటట్లు క్లుప్తంగా వ్రాయాలి. సమస్యయొక్క ప్రాముఖ్యత అర్థమయితేనేగాని, క్రింద ఇవ్వబడిన సూచనలను, ప్రతికామ్రేడ్ తనయొక్క స్థానిక పరిస్థితులకు అన్వయించి కార్యక్రమం వేసుకోలేడు. లేకపోతే ఆసూచనలను మెకానికలుగా తన ప్రాంత పరిస్థితుల కన్వయింప ప్రయత్నించుతాడు.

సమస్యయొక్క ప్రాముఖ్యతనుగూర్చి వ్రాసిన తరువాత సూచన లన్నిటినీ వరుసగా 1, 2, 3.... వేసి వ్రాయాలి. ఆ సూచనలలో ప్రజల్లో చెయ్యాల్సిన పనులు, ఆ పనులను అమలుజరపడానికి చేయవలసిన నిర్మాణకర్తవ్యాలు గూడ వ్రాయాలి.

చివరకు ఈ సమస్యను ఆచరణలో పెట్టడంలో జరిగే ప్రమాదాలను, తప్పులను, 'గమనిక' అనే శీర్షికక్రింద 1, 2, 3 వేసి వ్రాసి, పార్టీ సభ్యులను ముందుగానే హెచ్చరించాలి,

పేపరు, పెన్సిలు, కార్బను ఖరీదుగావున్న యీ రోజుల్లో సర్క్యులర్లు అచ్చువేయించడంవల్ల శ్రమ తప్పుతుంది; డబ్బు కలిసివస్తుంది. కనుక సాధారణంగా సర్క్యులర్లు అచ్చువేయించాలి. ముఖ్యమైన కొన్ని రహస్య సర్క్యులర్లు మాత్రం చేత్తో వ్రాయించి చేత్తోపంపాలి.

పార్టీ లెటర్లు

పార్టీ లెటర్లు పార్టీసభ్యులకు పనిలో శిక్షణ యివ్వడానికి, పార్టీలో వున్న లోపాలను చర్చించి, పార్టీ శిక్షణను, పార్టీ ఐక్యతను కాపాడటానికి ఉద్దేశింపబడినవి. వీటిలో పార్టీలోపలి జీవితం ప్రతిబింబిస్తుంది. పార్టీ అభివృద్ధికి పార్టీ

లోపల జీవితాన్నిగూర్చి చర్చలు అవసరం. పార్టీ ఆత్మ విమర్శన చేసుకొని అనుభవంనుంచి నేర్చుకోడవం అవసరం. అందుకు పార్టీలెటర్లు ఉపకరిస్తాయి.

పార్టీకమిటీ తనక్రింది యూనిట్ల రిపోర్టులనుంచి సాధించిన ఘనకార్యాలను, చేసిన పెద్ద తప్పులను తీసుకొని, వాటినిగూర్చి పార్టీ లెటర్లలో వ్రాస్తుంది. అంతేగాక యేదైనా ప్రజా సమస్యను తీసుకొని పనిచేయడానికి ఏ యెత్తుగడలు అవలంబించాలో, ప్రతికక్షుల యెత్తుగడలను ఎలా భగ్నంచేయాలో, ఆ సమస్యా పరిష్కారానికి యెటువంటి నిర్మాణపద్ధతు లవలంబించాలోగూడ వ్రాయబడుతుంది. పార్టీనిర్మాణంలోని లోపాలు, వాటిని పోగొట్టే మార్గాలనుగూర్చి వ్రాయబడుతుంది.

ఆంధ్రరాష్ట్రంలో ప్రస్తుతం పొలిటికలు సర్క్యులర్లనే పేరుతో పార్టీలెటర్లు ప్రకటించబడుతున్నాయి; సర్క్యులర్లలో పార్టీ నిర్మాణంలో దైనందినం వచ్చే చిన్న సమస్యలు మాత్రం వ్రాయబడుతున్నాయి.

కరపత్రాలు:

ఏదైనా సమస్యమీద ప్రజలను 'ఎడ్యుకేటు' చేసి, వారిని కార్యరంగంలోకి దూకే ఉత్సాహాన్ని రేకెత్తించడానికి కరపత్రాలు ఉద్దేశించబడినవి. వాటిలో ఏదో ఒక విషయాన్నే తీసుకోవాలి. ఆవిషయాన్నిగూర్చి మనం ఏవర్గానికి చెప్పదలుచుకున్నామో, ఆవర్గంయొక్క జీవితానికి అన్వయింపజేసి, వారిహృదయాలకు హత్తుకుపోయేటట్లు, వారికర్థమయ్యే భాషలో ఆవర్గంవారువాడే ప్రత్యేక పదాలతో (Technical Words) సూటిగా వ్రాయాలి. అందులోసిద్ధాంత విషయాలను తీసుకురాగూడదు. ఆసమస్యవల్ల వారి జీవితంలో ఏమిమార్పు గలుగుతుందో, వారికి ఏమి లాభం, ఏమి నష్టం కలుగుతుందో ప్రజలు ఏమి పరిష్కారమార్గం అవలంబించాలో సూటిగా వ్రాయాలి.

ఒకే కరత్రంలో అనేక సమస్యలనుతీసుకొని, చాటభారతంగా తయారుచేసి ప్రజలను విసిగించరాదు. కరపత్రం చిన్నదిగా ఉండాలి. ఉదాహరణకు-ఆహారకరువునుగూర్చివ్రాస్తున్నామనుకోండి. రైతులకు వ్రాసేటప్పుడు, ఆ కరువువల్ల తాము పండించే వారైనా చివరకు తమకే తిండిలేకుండా ఎలా పోతుందో, ఇతరవస్తువుల ధరలుకంట్రోలులేక పోవడంవల్ల ధరలు విపరీతంగా పెరిగిపోయి తానెట్లా నష్టపడతాడో, అదేకాకుండా అరాజకం, అంటుజాడ్యాలవల్ల గ్రామైక్యతచెడి అంత

ర్యుద్ధం సర్వనాశనం ఎలాజరుగుతుందో, అందువల్ల ధాన్యాన్ని కంట్రోలుధరలకు ప్రభుత్వానికి అమ్మి ఎరువులు, గుడ్డలు, ఇనుపవస్తువులు మొదలైన మిగతా వస్తువుల ధరల కంట్రోలుకు ఆందోళనచేస్తే ఎలా సాధ్యమవుతుందో వ్రాయాలి. అలాగే గుడ్డల కార్మికులకు ఆహార కరువువల్ల తానుమాడి ఎలా చావాలిసి వస్తుందో, అందుకుతాను ఎక్కువ గుడ్డలను ఉత్పత్తిజేసి, గుడ్డలధరల కంట్రోలుకు ఆందోళన ప్రారంభించితే, రైతు తానుపండించే తినుబండారాల ధరలు గూడ ఎలా కంట్రోలు ధరలకు అమ్ముతాడో వ్రాయాలి. ఇలాగే ఇతర వర్గాలకు గూడ ఆయా వర్గాలజీవితానికి అన్వయించి వ్రాయాలి. ఇలాగే ఇతర సమస్యలను గూడ ఆయావర్గ ప్రజల జీవితాలకు అన్వయించి వ్రాయాలి. ఏదైనా ప్రజా సమస్యమీద ప్రజలను సమీకరించుతున్నప్పుడు, ప్రజాసమీకరణకు కరపత్రం ఎంతైనా ఉపయోగపడుతుంది. ప్రతి కామ్రేడ్, మిలిటెంటు ఆ కరపత్రం సహాయంతో ఆందోళన చేయగలుగుతాడు. లేకపోతే అంతచక్కగా, ఆందోళన చేయలేదు. ప్రజాసమస్య పరిష్కరించుతున్నప్పుడు, మన ప్రతికక్షులకు ఈ కరపత్రం ఒక్కొక్కటీ ఒక్కొక తుపాకి గుండు అన్నమాట.

బహిరంగ సభలు, మహాసభలను గూర్చి రిపోర్టులు వ్రాసేపద్ధతి, వాటిని ఎలా ఆర్గనైజు చెయ్యాలనే శీర్షిక క్రిందవ్రాయబడుతుంది.

10. ఊరేగింపులు, బహిరంగ సభలు, మహాసభలు.

బహిరంగ సభలు

సామాన్యంగా కామ్రేడ్సు బహిరంగసభలను జరపడానికి ముందుగా ఒక ప్లానువేసుకొని, ప్రజలకు ఆ సభయొక్క ప్రాముఖ్యతను తెలపడంగాని, ప్రజలను తీసుకురావడంగాని వుండదు. స్థలంకు అనుమతి పొందకుండానే, అధ్యక్షత వహించేవారిని అడగకుండానే నోటీసులలో స్థలం, అధ్యక్షునిపేరు వేసి ప్రకటించడం, మీటింగు సమయానికి హడావుడిపడటం జరుగుతూవుంది. బహిరంగ సభలనుగూర్చి సరియైనప్రచారం ముందుగా జరపకపోవడం, కావలసిన యేర్పాట్లన్నీ ముందుగాచేసుకొని తయారుగా వుండకపోవటంవల్ల చాల బహిరంగసభలు సరిగా జరగడంలేదు.

బహిరంగ సభలు సరిగా జరగడానికి కామ్రేడ్సు యీ క్రింది సూచనలననుసరించి పనిచెయ్యాలి.

(1) స్వాతంత్ర్య దినోత్సవం, సోవియటు నవంబరు విప్లవదినోత్సవం మొదలైన సాంవత్సరిక దినోత్సవాలకు 10 రోజులు ముందుగానే సెల్లు సమావేశమవాలి. పై కమిటీ సర్క్యులరు ననుసరించి, ఆ దినోత్సవాలు జరపడానికి వివరమైన ప్లానువేసుకోవాలి. అలాగే పై కమిటీలు జరపమని ప్రకటించిన దినోత్సవాలకు సెల్లు తన ప్రాంతంలో జరపాలని నిశ్చయించుకున్న బహిరంగ సభలకుగూడ 4 లేక 5 రోజులు ముందుగానే సమావేశమయి ప్లానువేసుకోవాలి.

(2) ఆ ప్లానులో బహిరంగసభ జరిగే చోటు, టైము, అధ్యక్షులుగా వుండదగినవారి పేర్లు నిర్ణయించి, ఆ ప్రయత్నాలు చేయడానికి బాధ్యత ఒకరికో యిద్దరికో అప్పగించాలి. గ్రామాన్ని, పట్టణాన్ని కొన్ని భాగాలుగా విభజించి, ఆ యా ప్రాంతంలో యెవరు వీధి మీటింగులు, గ్రూపు మీటింగులు, మెగాఫోనులు (సీనారేకుతో చేయబడిన గొట్టాలు, వీటిలో యెత్తు ప్రదేశంనుంచి

మాట్లాడితే చాలాదూరం వినిపిస్తాయి.) ద్వారా బహిరంగసభయొక్క ప్రాముఖ్యతనుగూర్చి ప్రచారం చెయ్యాలి అనేది నిర్ణయించాలి. ఏ యే వ్యక్తులు, లేక దళాలు తమకు నిర్ణయించిన ప్రాంతాలనుండి ఎంతెంతమందిని ప్రజలను తీసుకురావాలనేది గూడ కోటాలు యివ్వాలి.

(3) గ్రూపు మీటింగులలోను వీధిమీటింగులలోను, మెగాఫోనులద్వారాను బహిరంగసభ ఎందుకు జరుపబడుతుందో, ఎక్కడ ఎన్నిగంటలకు జరుపబడుతుందో, ఎవరు అధ్యక్షత వహిస్తారో, మొదలైన విషయాలు క్లుప్తంగాచెప్పాలి. బహిరంగసభయొక్క ప్రాముఖ్యత తెలిస్తే ఎక్కువమంది ప్రజలువస్తారు.

పట్టణాలలోని సభలకు మీటింగు నోటీసులను గూడ వేయడం మంచిది. ఆ నోటీసులో దినోత్సవం పేరు హెడ్డింగుగా పెట్టాలి. దానిక్రింద బహిరంగ సభయొక్క ప్రాముఖ్యత, మీటింగుజరిగే తేదీ, స్థలం, టైము, అధ్యక్షుడు మొదలైన వివరాలు వ్రాయాలి. తరువాత ఏసంఘం ఆధ్వర్యం క్రింద జరుగుతుందో దానిపేరు వెయ్యాలి. ఊరేగింపుగూడ వుంటే, ఎన్నిగంటలకు ఎక్కడనుండి బయలుదేరుతుందో గూడ వ్రాయాలి.

ప్రభాత భేరీలు, సైకిలుడిమాన్‌స్ట్రేషన్లు మొదలైనవిగూడ చేయవచ్చును.

(4) ప్రతి మీటింగు. ఊరేగింపు కమ్యూనిస్టు వ్యతిరేకులనుండి కాపాడుకోవలసిన అవుసరం నేడు వచ్చింది. అందుచే శిక్షణపొందిన వాలంటీర్లను, ఆ పరిస్థితులనుబట్టి యెంతమంది అవసరమయితే, అంతమందిని ముందుగానే సమీకరించాలి. వీరంతా కమాండరు ఆజ్ఞను పాలించాలి. వాలంటీర్లు లేకుండా యే మీటింగు, ఊరేగింపు జరుపరాదు.

(5) ఊరేగింపు :— బహిరంగసభకు ముందుగా ఊరేగింపు జరపడంవల్ల యెక్కువమంది ప్రజలు బహిరంగసభకు హాజరయ్యేటట్లు చెయ్యగలం. అందుచే అవకాశమున్నప్పుడు తప్పక బహిరంగసభ ముందు ఊరేగింపు జరపాలి. ఊరేగింపు యీ క్రింది సూచనల ననుసరించి జరపాలి.

(అ) ఊరేగింపులోకి మన కామ్రేడ్సు, వారి కుటుంబాలలోనివారు, ఇతర సానుభూతిపరులను తప్పక తీసుకురావాలి. సాధ్యమైనంతవరకు ప్రజలనుగూడా తీసుకురావాలి. వీరినందరినీ ఊరేగింపు బయలుదేరే స్థలానికి ముందుగానే తీసుకురావాలి.

(అ) ఊరేగింపు నిర్ణయించిన టైముకు ప్రారంభించాలి. ఊరేగింపును నడపడానికి ఒక బాధ్యుని నిర్ణయించాలి. అతని ఒక్కడి ఆధిపత్యం క్రిందనే జరగాలి. ఎవరి ఇష్టంవచ్చినట్లు వారు మాట్లాడటానికి వీలులేదు.

(ఇ) ఊరేగింపులో ఇవ్వవలసిన నినాదాలు, పాడవలసిన పాటలు ముందుగానే నిర్ణయించాలి. నినాదాలు, పాటలు సాధ్యమైనంతవరకు ఆ బహిరంగసభకు సంబంధించేవిగా వుండాలి. ఫలానాచోటుకురండి అనేదిగూడ నినాదంగా ఇయ్యవచ్చు. నినాదాలు అంతర్జాతీయ, జాతీయ రాజకీయాలనుగూర్చి. సామాన్యంగా ప్రజలకుండే ఆర్థిక యిబ్బందులనుగూర్చి, ఆ గ్రామ లేక పట్టణ స్థానిక ఇబ్బందులనుగూర్చి సులభమైన భాషలోను, పొడుగుగాలేకుండాను, తెలుగులోనూ ఉండాలి. ఇంగ్లీషులోగాని, హిందీలోగాని నినాదాలు యివ్వగూడదు,

నినాదాలు ఇచ్చేవారు, పాటలు పాడేవారు వేరుగావుండాలి. వీరిని ముందుగానే నిర్ణయించాలి. మరెవ్వరు పాటలు పాడటంగాని, నినాదాలియ్యడంగాని జరుగరాదు.

(ఈ) ఊరేగింపులో వాలంటీర్లను చిన్నచిన్న గ్రూపులుగాచేసి, ఆ గ్రూపులకు ప్రత్యేక కమాండర్లను నిర్ణయించి, మొత్తం ఊరేగింపును భాగాలుగాచేసి, ఒక్కొక్కభాగంముందు ఒక్కొక్క వాలంటీరు గ్రూపును నిలబెట్టాలి. ఈ గ్రూపుల కమాండర్లు మొత్తం వూరేగింపును నడపడానికి నిర్ణయించబడిన బాధ్యుని ఆజ్ఞకులోబడి పనిచెయ్యాలి.

(ఉ) ఊరేగింపు పోవాలిసినమార్గాన్ని ముందుగానే నిర్ణయించాలి. సగం దూరంపోయి అటుఇటుఅని ఆలోచిస్తూ కూర్చోగూడదు. ముందునిర్ణయించుకున్న దారినే పోవాలి.

ఊరేగింపు బయలుదేరేటైము, బహిరంగసభ ప్రారంభమయ్యేటైము, లోపలలోనే ఊరేగింపు పూర్తి అయ్యేటట్లుగానే దారిని నిర్ణయించాలి. ఈ దారిన వూరేగింపు పూర్తిచేయడానికి ఎంత టైము అవుతుందో ముందుగానే అంచనా వెయ్యాలి. బహిరంగ సమావేశం నిర్ణయించిన టైముకు ఊరేగింపు తప్పక అక్కడకు జేరుకోవాలి.

(ఊ) ఊరేగింపు ట్రాఫికురూల్సుకు భిన్నంగాకుండా జరగాలి. ఎప్పుడూ మూడు లైనులలో రోడ్డుకు ఎడమవైపుగా ఊరేగింపు పోవాలి. పట్టణాలలో ఈ విషయంలో జాగ్రత్తగాఉండాలి. రాకపోకలకు ఆటంకం గల్గించరాదు.

(ఎ) ఊరేగింపు మొదలు పెట్టబోయేటప్పుడు నినాదాలు ఇవ్వాలి. తరువాత పాటలు ప్రారంభించాలి. ఊరేగింపు పెద్దదయితే, పాటలు పాడేవారిని అక్కడక్కడ పెట్టాలి. కామ్రేడ్సు అందరూ పాటలు పాడాలి.

కూడలిస్థలంలో పాటలు ఆపి నినాదాలు ఇవ్వాలి. పాటలు ఆపడానికి గుర్తుగా ఊరేగింపు బాధ్యుడు చెయ్యిఎత్తుతాడు.

(6) బహిరంగ సమావేశం జరిగేచోటుకు డ్రాయర్లు, కుర్చీలు, లైట్లు, జెండాలు ముందుగానే చేరవెయ్యాలి. సభాస్థలాన్ని పార్టీ నాయకులు జాతీయ నాయకులు, మార్క్సు, ఏంగెల్సు, లెనిన్, స్టాలిన్ మొదలైన ప్రపంచశ్రామిక నాయకుల బొమ్మలతోనూ, ఎర్ర జెండాలతోనూ, అలంకరించాలి.

అవకాశమున్నచోట్ల కాంగ్రెసు-లీగు జండాలను, గాంధీ, జిన్నా బొమ్మలను గూడ పెట్టవచ్చును. కాని కాంగ్రెసుజండా గాంధీ బొమ్మలేకుండా, ముస్లిం లీగు జండాను జిన్నా బొమ్మను పెట్టగూడదు. ఇలా జేయకపోతే కాంగ్రెసువాదులలో పార్టీయడల దురభిప్రాయం గల్గుతుంది. ప్రతికక్షులు పార్టీ మీద దుష్ప్రచారం చేయడానికి అవకాశమిచ్చినవారమవుతాం. కాంగ్రెసు జండా గాంధీ బొమ్మపెట్టడానికి పోలీసులు అంగీకరించే అవకాశం లేకపోతే, అసలే పెట్టగూడదు. మనం పెట్టిన తర్వాత పోలీసులు తీసివేస్తే, ప్రజల్లో అనవసరమైన సంచలనం కలుగుతుంది.

(7) అధ్యక్షుడు పార్టీకి సానుభూతి పరుడుగా ఉండాలి. ప్రజాసంఘాల మీటింగులయితే వాటికి సానుభూతి పరుడై ఉండాలి. పార్టీకి సానుభూతిలేని పెద్దమొత్తల వారిని నెత్తిన ఎక్కించుకొని తరువాత బాధపడగూడదు.

ఒకరిద్దరికన్న ఎక్కువమంది ఉపన్యాసకులను పెట్టి, ప్రజలను విసిగించగూడదు. అధ్యక్షుడు ఉపన్యాసకులు ఒకరు చెప్పింది మరొకరు చెప్పకుండా, విషయాన్ని ముందుగానే విభజన చెయ్యాలి. వారు ఉపన్యాసంకు నోట్సు వ్రాసుకొనిరావాలి. (ఉపన్యాసాలు యెలా యివ్వాలి, వారిని యెలా తర్ఫీదుచెయ్యాలి, అనే విషయాలనుగూర్చి "ప్రచార పద్ధతులు" అనే అధ్యాయంలో వివరంగా వ్రాయబడింది.)

బహిరంగ సభలలో వైజ్ఞానిక దళాలద్వారా సమిష్టిగానం చేయించాలి. దీనివల్ల ప్రజలు యెక్కువగా ఆకర్షింపబడతారు.

(8) మీటింగులో గలభా జరగకుండా చేయడానికి ప్లాటుఫారంచుట్టూ వాలంటీర్లను కాపలా పెట్టాలి. ప్రజల్లో మధ్యమధ్య ఒక్కొక్క వాలంటీరును కూర్చోబెట్టాలి. మీటింగుచుట్టూ వాలంటీర్లను నిలబెట్టాలి. అవసరమైనచోటికి పంపడానికి కొంతమందిని ప్లాటుఫారందగ్గర నిలబెట్టాలి. ఎక్కడైనా గలభా జరుగుతుంటే మిగతావోట్ల జనం లేవకుండా ఎక్కడవాలంటీర్లు అక్కడ సర్దాలి. కాని తాము ఆ గలభాజరిగే చోటుకు వెళ్ళకూడదు. వాలంటీర్లు శాంతంగా మీటింగు సాగుతున్నప్పుడు అనవసరంగా అటూ ఇటూ తిరిగిగాని, నిలబడివుండిగాని అలజడి గల్గించరాదు. నిశ్శబ్దంగా కూర్చోవాలి. ప్రతికక్షులు లైట్లు, లేక మైక్రోఫోను సెట్లు పాడుచేయకుండా అక్కడ తగిన వాలంటీరు బందోబస్తును వుంచాలి.

ప్రతికక్షులు ముఠాగా చేరినచోట, ఆ ముఠాచుట్టూ వాలంటీర్లను నిలబెట్టి వారిని కదలకుండా చూడాలి. వారు అల్లరిచేస్తుంటే ప్రజల్లో వారిని రౌడీలుగా బట్టబయలుచేసి, వారిని అసహ్యించుకొనేలాచేసి, అటుతర్వాత వారిని మీటింగునుంచి నెట్టివెయ్యాలి. ముందే దెబ్బలాటకుదిగితే, వారికి తగిన బుద్ధి చెప్పి, బయటకు తోసివెయ్యాలి. ఎట్టి పరిస్థితులలోనూ వారు దెబ్బలాటకు దిగినప్పుడు ఊరుకోరాదు. కాని ఆ మీటింగులోని పార్టీ ముఖ్యుడు చెప్పేవరకూ వారిని యే వాలంటీరు తోసివేయకూడదు.

(9) పార్టీసభ్యులు అంతా ప్లాటుఫారంమీదనే కూర్చోకూడదు. ప్రజల మధ్య అక్కడక్కడ కూర్చొని ప్రజలు చెప్పుకునే మాటలు వినాలి.

(10) సమావేశం పూర్తి అయినతర్వాతగాని, సెల్లుమీటింగులోగాని, సమావేశంలో జరిగిన లోపాలోపాలను చర్చించి, గుణపాఠాలు తీసుకోవాలి.

పత్రికలకు రిపోర్టులు

పత్రికలకు రిపోర్టుపంపడానికి ఒకనిని నియమించాలి. అతడు కామ్రేడ్సు నుండి, ప్రజల అభిప్రాయాలనుగూడ తెలుసుకొని, మరుసటిరోజే అన్ని పత్రికలకు వార్తలు పంపాలి. దానిలో వూరేగింపులో యెంతమంది పాల్గొందీ, అది యెలా జరిగిందీ, బహిరంగసభకు యెంతమంది వచ్చిందీ. యెవరు అధ్యక్షత వహించిందీ, యెవరు మాట్లాడిందీ, ఉపన్యాసాలలోని ముఖ్యమైన భాగాలు,

ప్రతికక్షుల ప్రశ్నలు, ప్రవర్తన, చివరకు ప్రజలు యీ సభనుగురించి యేమి అభిప్రాయాలు వెలిబుచ్చిందీ, వ్రాయాలి.

పార్టీకి పంపే రిపోర్టు :— సెల్లు సమావేశమై సభ జరపడానికి ఏమేమి తీర్మానాలుచేసిందీ, వాటిని యెలా ఆచరణలో పెట్టిందీ. తరువాత పత్రికలకు పంపే రిపోర్టు. ప్రతికక్షుల యెత్తుగడలు, వాటిని యెలా భగ్నంచేసిందీ, ప్రజల్లో యేమి అభిప్రాయాలుగల్గిందీ, మన పనిలోని లోపాలోపాలు, సూచనలు, పార్టీకి పంపే రిపోర్టులలో వుండాలి.

మ హా స భ లు

పార్టీ లేక యితర ప్రజా సంస్థలు సంవత్సరమునకొకసారి మహాసభలను జరుపుతూ ఉంటాయి. వానిలో రెండు భాగాలుంటాయి. (1) డెలిగేట్ల సమావేశం. దీనినే విషయ నిర్ణయసభ అనికూడ అంటారు. (2) బహిరంగసభ.

గత సంవత్సరం సంఘంచేసిన కృషి ఫలితంగా దాని సభ్యత్వం యెక్కువవుతుంది. క్రొత్త ప్రాంతాలకు వ్యాపించుతుంది. సంఘంయొక్క యీ అభివృద్ధి డెలిగేట్ల యెన్నికలలో ప్రదర్శిత మవుతుంది. డెలిగేట్లలో ప్రాతవారు కొందరు, క్రొత్తవారుకొందరు యెన్నుకోబడతారు. ఈ విధంగా కొత్త పాతల కలయికతో సంఘం అభివృద్ధి అవుతూపోతుంది. ఈ డెలిగేట్సు సమావేశమై, సంఘం గత సంవత్సరం సాగించిన కార్యకలాపాన్ని సమీక్షజేసి, ఆత్మవిమర్శన జేసికొని లోటుపాట్లను నిర్ణయించి, యీ అనుభవాన్ని ఉపయోగించి ముందు సంవత్సర కార్యక్రమం వేసుకుంటారు. ఈ విధంగా ప్రజా సంఘాలు సంవత్సరానికొకసారి అవి సాధించిన విజయాలను, చేసినలోపాలను సమీక్షచేసి, ముందు కార్యక్రమం వేసుకోవడం, ప్రతి సంఘాభివృద్ధికి అవసరం. ప్రతి మహా సభానంతరం సంఘం తనలోని లోపాలను సర్దుకొని, నూతనోత్సాహంతో పని సాగించుతుంది.

బహిరంగసభద్వారా ప్రజలు గత సంవత్సరం తమ సంఘం తమకై యెలా కృషిచేసిందో, ముందు సంవత్సరం ఏమిచేయబోతుందో తెలుసుకుంటారు. ఆటలు, పాటలు, బుర్రకథలు మొదలైన విజ్ఞాన ప్రచార కార్యక్రమంద్వారా, ప్రపంచం మనదేశం తమ దైనందిన సమస్యలకు సంబంధించిన విషయాలను

తెలుసుకుంటారు. ఈవిధంగా ప్రజల్లో మహాసభవల్ల నూతనోత్సాహం, సంఘ చైతన్యం అభివృద్ధి అవుతుంది. తమ కష్టాలను ఈడేర్చుకోడానికి తమ సంఘం వెనుక యింకా యెక్కువగా గుమికూడతారు.

ఏర్పాట్లు

మహాసభ యే ప్రాంతంలో జరుగుతుందో, కాన్ఫరెన్సు యేర్పాట్లుచేసే బాధ్యత యెక్కువగా ఆ ప్రాంత కమిటీమీద పడుతుంది. అయినప్పటికీ యితర ప్రాంత కమిటీలు, పై కమిటీకూడ సహాయంచెయ్యాలి. ఏ ప్రాంతంలో మహాసభ జరుగుతుందో ఆ ప్రాంతంలోని ప్రజలనుండి యెక్కువడబ్బు వసూలు చేయడంగూడ సాధ్యమవుతుంది.

ముందుగా కాన్ఫరెన్సులు నడుపుటలో అనుభవశాలురైన వారందరినీ మహాసభకు 2 లేక 3 నెలలముందే ఆ ప్రాంత కమిటీ సమావేశపరచాలి, దీనికి పై కమిటీ ప్రతినిధులుగూడ వెళ్ళాలి. పై కమిటీ ప్రతినిధి అక్కడ మహాసభ అయ్యేంతవరకూ ఉండి, వారి పనిని తనిఖీచేస్తూ, సూచనలిస్తూ సహాయపడాలి. ఆ పై సమావేశంలో యీ క్రింది కమిటీలను వేసి పనిచేయించాలి.

(1) నిర్మాణకమిటీ. రహదారి సౌకర్యాలు, మంచినీళ్ళ సప్లయి మొదలైనవన్నీచూచి, మహాసభ జరిపే చోటును ఆప్రాంత కమిటీయే నిర్ణయిస్తుంది. ఈ కమిటీ ఆ చోటున మహాసభ పెండాలు, వంటశాలలు, వైద్యశాల, పాకీదొడ్లు వాలంటీర్లు వుండే పాకలు, మొదలైనవి యెక్కడెక్కడ నిర్మించాలో జనరలుగా ప్లానువేస్తుంది. వాటిని నిర్మించే బాధ్యత తీసుకుంటుంది. తాటాకు, వాసాలు, పందిళ్ళకు, పాకలకు అవుసరమైన వస్తువులను సేకరించుతుంది.

(2) వంట కమిటీ:—ఇది వంటపాత్రలు, మంచినీళ్ళ కుండలు, వంట చేసేవాళ్ళు, కూరగాయలు, బియ్యం మొదలైన ఆహార వస్తువులను సేకరించుతుంది. వంటకు సంబంధించిన పనికంతకూ బాధ్యత వహించుతుంది. మంచి నీటి సదుపాయాలనుగూర్చికూడ బాధ్యత వహించుతుంది.

(3) ప్రదర్శనాల (Exhibitions) కమిటీ:—ఇది ఆయా ప్రజాసంఘాలకు సంబంధించిన ప్రదర్శనాలకు అవుసరమైన వస్తువులను సేకరించుతుంది.

వాటికి యేర్పాట్లను చేస్తుంది. ఉదాహరణకు రైతుమహాసభ అయితే వ్యవసాయ ప్రదర్శనం, పశువుల ప్రదర్శనం, పోటీలు, ఆరోగ్య ప్రదర్శనం రైతు ఉద్యమానికి, రైతుజీవితానికి సంబంధించిన బొమ్మలు, నాయకుల ఫొటోల ప్రదర్శనం, ఆర్గనైజు చేయబడతాయి. కూలీ సంఘానికిగూడ దాదాపు పై ప్రదర్శనాలే పనికి వస్తాయి.

యువజన మహాసభలలో ఆటల, పాటల పోటీలు, బల ప్రదర్శనాలు, ఆరోగ్య ప్రదర్శనం, యువజనోద్యమానికి సంబంధించిన బొమ్మల ప్రదర్శనం మొదలైనవి ఉంటాయి.

మహిళా మహా సభలలో శిశువుల ప్రదర్శనం పోటీలు, పిల్లలకు ఆటల పోటీలు, శిశుపోషణ, ఆరోగ్యం, మొదలైన విషయాలను తెలిపే ప్రదర్శనం, వాటిమీద ఉపన్యాసాలు ఉంటాయి. ఈవిధంగా ప్రతి మహాసభకు ఆ యా వర్గాలకు సంబంధించిన ప్రదర్శనాలు యేర్పాటు చేయబడతాయి.

అన్ని మహాసభలలోనూ వైజ్ఞానిక కార్యక్రమం (సమిష్టిగానం, బుర్రకథలు, విచిత్రవేషాలు, నాటకాలు) ఉండాలి ఈ కార్యక్రమం సాధ్యమైనంత వరకూ ఆ యా ప్రజాసంఘానికి సంబంధించినదై వుండాలి. వీనిలో పోటీలు ముందుగానే జరిపి అందులో బాగా ప్రదర్శించిన ఐటములను ఒక్కొక్కటి ఒక్కొక్క దళమే ప్రదర్శించాలి. పోటీలు బహిరంగ సమావేశంలో జరిపితే, ప్రజలకు విసుగు, కాలం వృధా అవుతుంది. నాయకుల ఉపన్యాసాల ద్వారానే గాక, పై ప్రదర్శనాలు వైజ్ఞానిక కార్యక్రమంద్వారా ప్రజలు చాలా విషయాలు నేర్చుకుంటారు.

(4) వైద్య కమిటీ:—ఇది మహాసభకు అవసరమైన డాక్టర్లను సంపాదించి, వైద్యశాలలు యేర్పరచుతుంది. పాకీదొడ్లు శుభ్రంగా ఉంచేలాచేయడం, మొదలైన బాధ్యతలు నిర్వహిస్తుంది. ఇంతమంది జనం చేరినప్పుడు అంటు వ్యాధులు తేలికగా రేగుతాయి. కనుక కలరా మొదలైన అంటుజాడ్యాలకు అవుసరమైన మందులను యెక్కువగా సేకరించి పెట్టుకోవాలి.

(5) ప్రచారం, ధనసేకరణ కమిటీ:—ఈకమిటీ యెప్పటికప్పుడు పత్రికలకు మహాసభనుగూర్చిన వార్తలను పంపుతుంది. ఆ సంఘం గత సంవత్సరం

చేసిన కృషిమీద ప్రతికక్షుల దుష్ప్రచారానికి సమాధానంగాను, కరపత్రాలు అచ్చు వేయించి, ప్రచారక దళాలకు అందించుతుంది. పార్టీయొక్క సహాయంతో ప్రచారక దళాలనువేసి, గ్రామాలను, పేటలను వీటికి పంచుతుంది. ఈ కమిటీ సభ్యులు తాము స్వయముగావెళ్ళి డబ్బు వసూలు చేస్తారు. దళాలద్వారా వసూలు చేయించేలాచేస్తారు. మనది ప్రజాపార్టీ. మనం నడిపే సంఘాలు ప్రజాసంఘాలు. కనుక మనం ధనంకోసం యెక్కువగా, సామాన్య ప్రజలమీదనే ఆధారపడాలి. బూర్జువా సంఘాలవలె కొద్దిమంది ధనికులమీద ఆధారపడరాదు.

(6) వాలంటీరు కమిటీ:—ఈకమిటీ మహాసభకు భోజనాలవద్దన కిచెను డిపార్టుమెంటుకు, ఆఫీసులు, ప్రదర్శనశాల కాపలాలకు, బహిరంగసభకు వచ్చే ప్రజలను సర్దడానికి ప్రతి 50 మంది ప్రజలకు ఒకవాలంటీరు చొప్పున, అంచనా వేస్తుంది. వాలంటీర్ల సమీకరణకు, వారి తర్ఫీదుకు మహాసభలో వారి సౌకర్యాలకు బాధ్యతవహిస్తుంది. వాలంటీర్లకు ప్రత్యేక క్యాంపు ఉండాలి.

మంటలనార్పడానికి ప్రత్యేకంగా, మంటలనార్పే దళాలను ఏర్పరిచి, వారికి తర్ఫీదు యిస్తుంది.

(7) ఇతర జనరలు విషయాలను చూడటానికి ఒక కమిటీ ఉంటుంది.

ఆ ప్రాంత కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగూడ పైకమిటీలలో దేని లోనో ఒకదానిలో సభ్యులుగా ఉంటారు. అవుసరమైనప్పుడు కార్యనిర్వాహకవర్గ కమిటీ సమావేశమవుతుంది; ఇంకా అవుసరాన్నిబట్టి ఎక్కువ కమటీలనుగూడ వేసుకోవచ్చును.

ఆ హ్వా న సం ఘం

ప్రచారక కమిటీ కొంతపనిచేసి, ఆహ్వానసంఘ సభ్యులను ఛేర్చిన తర్వాత ఆహ్వానసంఘసభ్యుల సమావేశం జరిపి, అధ్యక్ష కార్యదర్శులను కార్యనిర్వాహక కమిటీని ఎన్నుకోవాలి. ఆహ్వానసంఘం నిర్మించడం బూర్జువా జీవరహితమైన అలవాటు మాత్రమే. ప్రజలు ఆ సంఘంమీద నమ్మకముండే చందాలు యిస్తున్నారు. అటువంటప్పుడు ఆ సంఘ కార్యనిర్మాహకవర్గమే ఆహ్వానసంఘంగా ఉండవచ్చును. కాని బూర్జువాఅలవాటు పాతుకుపోయి ఉండటంవల్ల మనంగూడ అనుసరించాలిసి వస్తోంది.

ఆహ్వానసంఘాధ్యక్షుడు ఆ ప్రజల్లో బాగుగా తెలిసిన పార్టీసభ్యుడుగాని, లేక గట్టి సానుభూతిపరుడుగాని అయి ఉండాలి. మర్యాదకు ఏమీ పనిచేయని వానిని, నమ్మకస్తుడు కానివానిని తెచ్చిపెట్టుకోగూడదు. తరువాత చిక్కులు వస్తాయి. కార్యదర్శి ప్రజాసంఘ కార్యనిర్వాహకవర్గంయొక్క కార్యదర్శి ఉండ వచ్చును. ఆహ్వానసంఘ కార్యవర్గంలో మహాసభఏర్పాటుచేసే కామ్రేడ్సు $\frac{2}{3}$, ఇతరులు సహాయంజేసేవారు $\frac{1}{3}$ ఉండేలాచేయాలి. మధ్య గడబిడలు ఏమీ జరగకుండా ఉండాలంటే ఈ జాగ్రత్తలు తీసుకోవడం అవుసరం. ఆహ్వానసంఘ కార్య వర్గంలో ఏమాత్రం సాయపడని ఇతరులెవ్వరినీ తీసుకోగూడదు.

సామాన్యంగా మహాసభలకు ఏర్పాట్లలో ఒక పొరబాటు చేస్తున్నారు. పైవిధంగా కమిటీలువేసి పనివిభజనచేయడం ఉండదు. అందుచే అందరూ అన్ని పనులు చేయబోవడం, ఏ పనీ సరిగా కాకపోవడం, చివరకు కాన్ఫరెన్సు సమయంలో త్రొక్కిళ్ళాడటం జరుగుతోంది. ముఖ్యంగా భోజనాల విషయంలో సరియైన అంచనాలేక చాల లోపాలు జరుగుతూ ఉన్నవి. డబ్బు వసూలుచేయడంలో గూడ వెనుకబడటం, తరువాత అప్పోసప్పో చేసి పూర్తిచేయడం జరుగుతోంది. మనం శ్రద్ధబట్టి వసూలుచేస్తే, కాన్ఫరెన్సులో డబ్బుగూడ మిగులుతోంది. అన్నిటికన్నా పెద్దలోపమేమంటే, కాన్ఫరెన్సుకు రెండుమూడు నెలలు ముందునుంచి ఏర్పాట్లు ప్రారంభించక, చివరరోజుల్లో హడావుడిపడటం గూడ ఉంది. కామ్రేడ్సు, ఇకముందు పై లోపాలుచేయగూడదు. పై జెప్పబడిన పద్ధతులలో, నిర్మాణయుక్తంగా మహాసభల ఏర్పాట్లుచేయాలి.

మహాసభ కార్యక్రమం

ఈ కార్యక్రమంలో డెలిగేట్ల సమావేశం, పోటీ పందాలు, ఆరోగ్యం, వ్యవసాయం మొదలైనవాటిమీద ఉపన్యాసాలు, బుర్రకథలు, నాటకాలు మొదలైనవి, బహిరంగ సభ మొదలైనవాటిని చక్కగా ఇమడ్చాలి. కార్యక్రమం వత్తిడిగావుండరాదు. పై అన్నిహంశాలు సరిగా సాగడానికి ఖాళీగా (Flexible) ఉండాలి.

కార్యక్రమంలో ముందురోజు డెలిగేట్ల సమావేశం ఉంటుంది. కారణం ముందే బహిరంగసభ జరిపితే, ఊరేగింపు, అధ్యక్షోపన్యాసం మొదలైన హడా

పుడీలో డెలిగేట్ల సమావేశం మునిగిపోతుంది. కొన్నపేరెన్నుయొక్క ప్రధానోద్దేశమైన గత సంవత్సరం సంఘంయొక్క పనిని విమర్శించి ముందు సంవత్సరానికి కార్యక్రమం వేసుకోవడం అనేది నెరవేరదు. కనుక డెలిగేట్ల సమావేశం ప్రశాంతంగా జరగాలి.

మరురోజున ఊరేగింపు, బహిరంగసభలో అధ్యక్షోపన్యాసం. డెలిగేట్ల సమావేశంలో ప్యాసు అయిన ముఖ్య తీర్మానాల సారాంశం చెప్పడం, మొదలైనవి వుండాలి.

డెలిగేట్ల సమావేశం

రైతు సంఘాలకుమాత్రం కాంగ్రెసులోవలె విషయ నిర్ణయసభ, డెలిగేట్ల సమావేశం అని రెండు వేరువేరుగా ఉంటాయి. రైతుసంఘ నూతన జనరలు బాడీనే విషయనిర్ణయసభ అని వాడతారు. దీనిలో తీర్మానాలు చర్చించబడతాయి. ఆమోదించబడతాయి. దీనిలో తోసివేయబడిన తీర్మానాలను, బహిరంగ సమావేశంలోని డెలిగేట్ల మీటింగులో తేవడానికి నిర్ణీత సభ్యుల సంతకాలు లేనిదే తేవడానికి వీలులేదు. అంగీకరింపబడిన తీర్మానాలకు ఓడిపోయిన సవరణలను బహిరంగ సమావేశంలో తీసుకురావచ్చు. బహిరంగ సమావేశంలో డెలిగేట్లు ఒకచోట ప్రత్యేకంగా కూర్చోబెట్టబడతారు. తీర్మానాలమీద డెలిగేట్లు మాత్రమే మాట్లాడటంగాని, ఓటు చేయడంగాని చేయవచ్చును. చర్చలు జరిగినతర్వాత తీర్మానాలు ఓటుకు పెట్టబడతాయి. రైతుసంఘం చాలా అభివృద్ధిచెంది, చాలా ఎక్కువ సభ్యత్వం కలిగివుండుటవల్ల డెలిగేట్లు చాలా ఎక్కువమంది వున్నారు. గనుక పైవిధంగా విషయ నిర్ణయసభ, డెలిగేట్ల సమావేశం అని వేరువేరుగా వుంటాయి.

కాని కూలీ, యువజన, మహిళా సంఘాలకు అంతగా సభ్యత్వం లేకపోవుటచే డెలిగేట్లు తక్కువగా వుంటారు. అందుచే విషయ నిర్ణయసభ, డెలిగేట్ల సమావేశం అని వేరువేరుగా ఉండనవుసరం లేదు. ఆ రెంటికీ ఒకటే సరిపోతుంది.

విషయ నిర్ణయ సభ

కార్యదర్శి రిపోర్టు, తీర్మానాలు ముందుగానే కార్యనిర్వాహకవర్గం తయారు చేయాలి. డెలిగేట్లను యింటివద్ద వ్రాసి తీసుకురమ్మనాలి. విషయ నిర్ణయసభకు ముందుగా ఆ తీర్మానాలను తీసుకొని, సమస్యలను అనుసరించి వాటిని 'సార్టు' చెయ్యాలి. ఒకే విషయంమీద వచ్చిన తీర్మానాలలో చక్కగా వ్రాయబడినదాన్ని విషయ నిర్ణయసభలో చర్చకుపెట్టాలి. ఇందులోలేని మిగతా తీర్మానాలలోని హంశాలను ఆ తీర్మానానికి సవరణగా పెట్టమని చెప్పాలి. సామాన్యంగా కార్య నిర్వాహక కమిటీలు తీర్మానాలు తయారుచేయక విషయ నిర్ణయసభ సమయంలో బరికిపారవేయడంతో, తీర్మానాలు బాగుగా ఉండడంలేదు; పైగా టైము యెంతో వృధా అవుతోంది. ఇందుచే తీర్మానాల విషయంలో పై జాగ్రత వహించాలి.

కార్మదర్శి రిపోర్టు :—దీనిలో క్రిందటి మహాసభ తీర్మానాలు, వాటిని ఎంతవరకు ఎలా అమలుజరిపిందీ. సంఘవ్యతిరేకుల చర్యలు వాటిని ఎలా ఎదుర్కొందీ, లోపాలోపాలు, ముందు సంవత్సరానికి సూచనలు ఉండాలి. ఈ రిపోర్టు డెలిగేట్సులో సంఘంయొక్క గతసంవత్సరం కృషినిగూర్చి ఒకస్పష్టమైన అభిప్రాయం ఇచ్చేదిగాను, ముందుపనికి మార్గం చూపించేదిగాను, చర్చించబోయే తీర్మానాలకు ప్రాతిపదికగాను ఉండాలి.

ఈ రిపోర్టును కార్యదర్శి చదివి, అవసరమైనచోట్ల వివరించాలి. ఆటు తర్వాత ఏమైనా ముఖ్యమైన సవరణలుంటే వాటిని చర్చించాలి. చిన్నిచిన్ని సవరణలను చర్చించాలిసిన అవుసరంలేదు రిపోర్టులోని ముఖ్యహంశాలు సరిగా ఉంటే చాలు.

తీర్మానాలు :—వీటిలో రాజకీయ తీర్మానాలు, సానుభూతి తీర్మానాలు, ప్రజల దైనందిన కష్టాలకు సంబంధించిన తీర్మానాలు ఉంటాయి. సామాన్యంగా ముందుగా రాజకీయ తీర్మానం తీసుకోవడం, దానిమీద అంతులేని చర్చలు సాగించడం, డెలిగేట్లు అలిసిపోవడం, చివరకు టైములేదని ప్రజాసమస్యలను గూర్చిన తీర్మానాలు చర్చలులేకుండానే అంగీకరించడం జరుగుతోంది. దీనివల్ల డెలిగేట్సులో ప్రజాసమస్యల పరిష్కరించుటలో తమకున్న అనుమానాలను తీర్చుకోలేకపోవడం, ముందుసంవత్సర కార్యక్రమం స్పష్టంగా వారిబుర్రలలో

జోరబడకపోవడం, జరుగుతోంది. కాంమ్రేడ్స్, ఈ విధంగా చేసే మహాసభ యొక్క అసలు ఉద్దేశమే దెబ్బతింటుంది; కనుక ప్రతి తీర్మానానికి ముఖ్యమైన టైము నిర్ణయించాలి. అప్రాముఖ్యమైన తీర్మానాలను వర్కింగుకమిటీకి వదలి వేయవచ్చును. ఆ టైము ప్రకారం చర్చలు సాగించాలి. చర్చలు నియమబద్ధంగా గూడ ఉండాలి. ప్రజాసమస్యలకు సంబంధించిన తీర్మానాలు బాగా చర్చించబడే టట్లు చూడాలి.

బహిరంగ సమావేశం

దీనిలో ఇప్పుడు పతాకారోహకుని ఉపన్యాసం, ఆహ్వానసంఘ అధ్యక్షోపన్యాసం, ప్రారంభోపన్యాసం, అధ్యక్షోపన్యాసం వరుసగా ఉంటాయి. అందరు ఉపన్యాసకులు ప్రపంచమంతా తిరిగి చివరకు భారతదేశం చేరుకుంటారు. ఒకరు చెప్పిందే మరొకరు తిరిగి చెప్పడంవల్ల ప్రజల్లో విసుగుబుట్టి లేచిపోతూ ఉంటారు. చివరకు విషయనిర్ణయసభ చేసిన తీర్మానాలను చర్చించడానికే టైము ఉండదు. ప్రజలు ఉండరు. అందుచే ఆ తీర్మానాలు చదివి మొక్కుబడిచెల్లించడం జరుగుతోంది. ఇందువల్ల కాన్ఫరెన్సుకు వచ్చిన ప్రజల్లో ఏదోరకమైన సంఘాభిమానం గల్గుతుందిగాని, సంఘ చైతన్యం గలుగదు.

అందుచే పతాకారోహకుడు, పతాకంయొక్క ప్రాముఖ్యత చెబితేచాలు. ఆహ్వాన సంఘాధ్యక్షోపన్యాసంలో అధ్యక్షుడిని ఇతర ముఖ్యులనుగూర్చి ప్రజలకు చెప్పాలి. ఇక్కడ ఏర్పాట్లు, ప్రజలవలంబించాలిసిన పద్ధతులుగూర్చి చెప్పాలి. అంతేగాని జాతీయ అంతర్జాతీయ పరిస్థితులను ఎత్తుకోవలసిన అవసరంలేదు. మహాసభయొక్క ప్రాముఖ్యతను క్లుప్తంగా చెబితేచాలు. ప్రారంభోపన్యాసకుడు అవసరంలేదు. అధ్యక్షుడు ప్రస్తుత జాతీయ అంతర్జాతీయ పరిస్థితులలో మహాసభయొక్క కర్తవ్యం, దాన్ని యెదుర్కొన్న సమస్యలకు పరిష్కారమార్గం, అధ్యక్షోపన్యాసంలో చూపాలి. అధ్యక్షుడు ఆ సంఘంయొక్క సమస్యలు తెలిసిన వాడుగా ఉండాలి. గాని ఎవరినో బొమ్మను జాతీయ అంతర్జాతీయ దబ్బాకొట్టే వాడుగా ఉంటే చాలదు. కార్యదర్శి గతసంవత్సరం సంఘంజేసిన కృషినిగూర్చి తర్వాత చెప్పాలి. అటుతర్వాత విషయనిర్ణయ సభలో చేయబడిన ముఖ్యతీర్మానాలను సమీక్ష జేస్తూ, ప్రజలకు ముందు సంవత్సర కార్యక్రమాన్నిగూర్చి స్పష్ట

మైన అభిప్రాయాన్ని ఏర్పరచాలి. సభ ముగిసేటప్పుడు అభివందనాలు చెప్పి సభ ముగించాలి.

వాలంటీరు ర్యాలీ

మహాసభ అయిన తర్వాత మరుసటి ఉదయం వరకూ వాలంటీర్లను ఉంచి, ర్యాలీ జరపాలి. దానిలో మహాసభలో వాలంటీర్లుచేసిన లోటుపాట్లను చెప్పి, ముందు మహాసభలు జరపడానికి వాలంటీరు కమాండరు సూచనలివ్వాలి. తరువాత వాటిమీద వాలంటీర్లను మాట్లాడమనాలి. దీనివల్ల వాలంటీర్లకు పనిలో తర్ఫీదు వస్తుంది.

పతాకారోహణం సమయంలో వాలంటీర్లను వరుసలుగా నిలబెట్టి వందనం చేయించాలి. అటుతర్వాత బారులుగా తీర్చి నడిపించాలి. ఈ విధంగా చేస్తే, ప్రజలు తమ పుత్రులు తమ్ము రక్షించడానికి ఎలా తయారవుతున్నారో చూచి, ఉల్లాసపడతారు.

మహాసభ అకౌంట్లు

మహాసభ పూర్తి అయినవెంటనే ఆహ్వానసంఘం సమావేశమయి, జమా ఖర్చు పట్టికను తయారుజేసి పత్రికలకు యివ్వాలి. ఈవిధంగా జేస్తే ప్రజలకు తామిచ్చిన సొమ్ము సద్వినియోగం చేస్తున్నట్లుగా భావించి, ముందు మహాసభలకు యింకా యెక్కువగా డబ్బుయిస్తారు.

పత్రికలకు రిపోర్టులు

మహాసభ అయినవెంటనే పత్రికలకు రిపోర్టుపంపాలి. ఈ రిపోర్టు పెద్దదిగా వుండాలి.

(1) మహాసభ పెండాలు, మొదలైనవాటి వర్ణన.
(2) ప్రదర్శనాలు, పోటీలు, వాటిమీద ఉపన్యాసాల సారాంశం.
(3) బుర్రకథలు, నాటకాలు, మొదలైన కల్చరలు కార్యక్రమం.
(4) ఊరేగింపు, పతాకోత్సవం.
(5) బహిరంగసభ సమావేశంలో అధ్యక్షోపన్యాసంలోని సారాంశం, ముఖ్యమైన భాగాలు.

(6) కార్యదర్శి రిపోర్టు సారాంశం, ముఖ్య భాగాలు.

(7) ముఖ్య తీర్మానాల సారాంశం, వాటిలోని ముఖ్య భాగాలు.

పై హంశాలలో ఎక్కడైతే మన వ్యతిరేకులు అసభ్యంగా ప్రవర్తిస్తారో దాన్ని ఆ హంశం క్రిందనే వ్రాయాలి.

పై పాయింట్లమీద రిపోర్టు మొదటినుంచి చివరివరకూ ఒక గొలుసువలె వుండి, మహాసభకు రాని ప్రజలను ఉత్సాహపరచి, ముందు కార్యక్రమం యిచ్చేదిగావుండాలి. మన ప్రతికక్షుల దుశ్చేష్టలను బట్టబయలుచేసేదిగావుండాలి. దినపత్రికలు వాళ్ళకిష్టమొచ్చినంత వేసుకుంటాయి. ప్రజాశక్తి, పీపుల్సువార్ సాధ్యమైనంత యెక్కువగా ఆ రిపోర్టును ప్రచురించుతాయి.

పార్టీకి రిపోర్టు:— ఈ రిపోర్టువల్ల మహాసభకు హాజరుకాని పార్టీ ముఖ్యులకుసైతం, మహాసభ దృశ్యం కళ్ళకు కట్టినట్లు వుండాలి. ఈ క్రింది పాయంట్లమీద రిపోర్టు వ్రాయాలి.

(1) మహాసభకు వేసిన ప్లాను.

(2) వివిధ కమిటీల పనివి ఎంతవరకు నెరవేర్చినాయి. లోపాలోపాలు. ముందుకు సూచనలు. ప్రతికక్షుల చర్యలు.

(3) మహాసభలో ప్రదర్శనాలు. వైజ్ఞానిక కార్యక్రమం యెంతవరకు ప్రజలను 'ఎడ్యుకేటు' చేసింది. లోపాలోపాలు, ముందుకు సూచనలు, ప్రతికక్షుల చర్యలు.

(4) డెలిగేట్సు మీటింగు, దాని ఆశయాలు యెంతవరకు నెరవేరింది, వివిధ రాజకీయ గ్రూపులు వ్యక్తుల నినాదాలు, వైఖరి. మనం మన తీర్మానాలను యెంతవరకు అంగీకరింపజేశాం, మన లోపాలోపాలు, ముందుకు సూచనలు,

(5) మహాసభ. ఎంతవరకూ ప్లానుప్రకారం జరిగింది. ప్రజలలో గలిగిన ప్రభావం. ప్రజల అభిప్రాయాలు ప్రతికక్షుల చర్యలు, ముందుకు సూచనలు.

(6) జమా ఖర్చుల పట్టిక.

(7) మహాసభవల్ల అక్కడ ప్రజా జీవితంలో గలిగిన మార్పు, వివిధ రాజకీయ గ్రూపుల బలాబలాలలో మార్పు, ముందుకు జనరలు సూచనలు.

(8) తీర్మానాలు, కార్యదర్శి రిపోర్టు, అధ్యక్షోపన్యాసం మొదలైనవికూడ పంపాలి.

11 పార్టీ—ప్రజాసంస్థలు

మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ప్రస్తుత ప్రజాయుద్ధ పాలసీ అంగీకరించుట, పార్టీయొక్క కేంద్రీకృత ప్రజాస్వామ్యానికి సంబంధించిన కఠినమైన శిక్షణకు కట్టుబడి ఉండుట, పార్టీయొక్క సిద్ధాంతానికి, పాలసీ ఆచరణలో పెట్టడానికి ప్రజలయొక్క దైనందిన సమస్యలలో పాల్గొని పనిచేయుట మొదలైనవి చేసే స్వార్థత్యాగులు ప్రజలలోని ఉత్తములు (Cream of the people) అంతా పార్టీలో ఉంటారు.

ప్రజల్లో వివిధవర్గాలు, ఒక వర్గంలోనే అనేకస్థాయిల రాజకీయ చైతన్యం గల తరగతులు ఉన్నవి. ఉదాహరణకు రైతుల విషయం తీసుకుందాం. వీరిలో కమ్యూనిజమనే ఆశయాన్ని ప్రజాయుద్ధ పాలసీని అస్పష్టంగానైనా అంగీకరించే వారు కొందరున్నారు. కొందరు కాంగ్రెసు అభిమానులున్నారు. కొందరు జస్టిసుపార్టీ మొదలైన ప్రభుత్వ గులాములుగా ఉండే రాజకీయముఠాల పలుకుబడిక్రింద ఉన్నారు. కొందరు ఏ రాజకీయ గ్రూపుకు చెందకుండా ఉండే గ్రామ పెత్తనదార్ల పలుకుబడిలోనున్న రాజకీయాలతో సంబంధం లేనివారున్నారు. ఈ విధంగా వివిధవర్గాల ప్రజలను, ఒకేవర్గంలో వివిధరాజకీయ స్థాయిలలో ఉన్న ప్రజలను, పార్టీ రాజకీయపాలసీ కార్యక్రమాలవైపుకు తీసుకురావాలంటే, ప్రజలయొక్క దైనందిన ఇబ్బందులమీద ప్రజలను సమీకరించడానికి ప్రజాసంఘాలు అవసరం. పార్టీ ప్రజలయొక్క దైనందిన ఆర్థిక రాజకీయ ఇతర ఇబ్బందులను తీసుకొని, వాటిని పోగొట్టడానికి కృషిజేస్తూ, ప్రస్తుత సామ్రాజ్యవాద ప్రభుత్వాన్ని పోగొట్టి దానిస్థానే ప్రజాప్రభుత్వం తీసుకురావలసిన అవుసరాన్ని, అందుకు వివిధజాతుల స్వయంనిర్ణయ సూత్రంమీద హిందూముస్లిం ఐక్యత సాధించాలిసిన అవసరాన్నిగూర్చి, ప్రజల నిత్యానుభవంద్వారా రుజువుచేస్తారు. ఈ విధంగా వారిలో ప్రజలు వారికోర్కెలు ఈడేర్చుకోడానికి రాజకీయాధికారం సంపాదించాలిసిన అవుసరాన్ని, దాన్ని సాధించే పద్ధతిని తెలుసుకునేలా చేస్తారు. ఇలాగే ప్రస్తుత వ్యక్తిగత ఆస్థి సమాజంపోయి, ప్రజల జీవితావుసరాలు ఉత్పత్తి

జేసే సాధనాలు (భూమి, ఫ్యాక్టరీలు, బ్యాంకులు వగైరా) ప్రజలందరి ఆస్థిగాజేసి, ప్రజలందరి లాభంకోసం ఉత్పత్తిని సాగించే, సోవియట్ యూనియనులో లాంటి సోషలిస్టు సమాజవిధానాన్ని సాధించినప్పుడు, ప్రజలందరూ ఎలా సౌఖ్యంగా ఉంటారో ప్రజల్లో తెలియజేస్తారు. ప్రజల్లో రాజకీయ చైతన్యం గలుగజేయడమంటే ఇదే. పార్టీయొక్క ప్రస్తుత ఆశయమైన స్వాతంత్ర్యం, అంత్యాశయమైన సోషలిజాన్ని సాధించడానికి, దాన్ని దోపిడీవర్గాలనుండి కాపాడుకోడానికి, మానవసమాజాన్ని కమ్యూనిజం వైపుకు తీసుకుపోవడానికి, ప్రజలను సమీకరించే సాధనాలుగా ప్రజాసంఘాలు అవుసరం.

మన పార్టీ ప్రథమంనుండి కమ్యూనిజం అనే ఒక రాజకీయాశయాన్ని దృష్టిలో ఉంచుకొని, దాన్ని సాధించడానికి ప్రజాసంఘాలద్వారా కృషిజేస్తుంది. కాని ప్రజాసంఘాలు అటువంటి రాజకీయాశయంతో బయలుదేరవు. ఆ సంఘానికి సంబంధించిన ఆర్థిక యితర దైనందిన యిబ్బందులను తీర్చడానికే ఆరంభించుతాం. క్రమంగా మన పార్టీ రాజకీయాశయంవైపుకు మొగ్గేలా చేస్తాం.

గాంధీవాదులు, రాయిస్టులు, రంగాముఠా, ఫార్వర్డు బ్లాకు మొదలైన రాజకీయ గ్రూపులుకూడ ప్రత్యేక రాజకీయాశయాలతో ప్రజా సమీకరణకు పూనుకుంటాయి. ప్రజా సంఘాలను యేర్పాటుచేస్తాయి. కాంగ్రెసు, ముస్లింలీగు కూడ స్వాతంత్ర్య సంపాదన అనే రాజకీయాశయంతోనే పనిచేస్తాయి. ఇవికూడ రాజకీయ పార్టీలే. కాని వీటిలో దేశ స్వాతంత్ర్యంకోరే వివిధ రాజకీయపార్టీలు, గ్రూపులు వున్నాయి. కొన్ని ప్రత్యేక చారిత్రిక కారణాలవల్ల, వివిధ రాజకీయ గ్రూపులు కలసివుండే రాజకీయ పార్టీలు పుడతాయి.

పార్టీ, ప్రజాసంస్థల సంబంధాన్నిగూర్చి స్టాలిన్ అభిప్రాయం

కార్మికవర్గ నియంతృత్వం (సోషలిస్టు ప్రభుత్వం) అనేదాంట్లో పార్టీకి, ప్రజా సంస్థలకు యే రకమైన సంబంధముందో, అవి యే పాత్రను నిర్వహిస్తాయో స్టాలిన్ 'లెనినిజం' అనే పుస్తకంలో వ్రాశాడు. పార్టీ అన్ని ప్రజాసంస్థలను నడిపే మూలశక్తి అనీ, ప్రజాసంస్థలు ప్రజలను కదిపే "బెల్టులు - లివరులు" అని వర్ణించాడు. కార్మికవర్గ నియంతృత్వాన్ని ఒక ఫ్యాక్టరీకి పోల్చాడు. దానిలో ఇంజను పార్టీ, వస్తువులను తయారుజేసేయంత్రాలు (మగ్గాలు, కండెలు

వగైరా) ప్రజలు. ఈ యంత్రాలను త్రిప్పడానికి ఇంజనుకు యీ యంత్రాలను కలిపే "బెల్టులు - లివర్లు" ప్రజా సంస్థలు. ఫ్యాక్టరీకి కార్మికవర్గ నియంతృత్వానికి భేదమేమంటే, ఫ్యాక్టరీ జీవంలేని పనిముట్లతో కూడివుంటుంది. ఇంజను కదిలితేనే అందులోని మిగతా యంత్రాలు కదులుతాయి. కాని కార్మికవర్గ నియంతృత్వంలో ప్రజలతోగూడిన సంస్థలున్నాయి. దీనిలో సామాన్యంగా పార్టీయే ప్రజలను కదిపినా, యెల్లప్పుడు ప్రజలనుంచి పార్టీసభ్యులు నేర్చుకుంటూవుంటారు. ప్రజలుగూడ పార్టీకి సాయపడుతూవుంటారు.

ఇప్పుడు మనం కార్మికవర్గ నియంతృత్వంయొక్క నిర్మాణం యెలావుంటుందో, అది యెలా పనిచేస్తుందో చూదాం. కార్మికవర్గ నియంతృత్వయంత్రం 'బెల్టులు' 'లివర్సు' 'నడిపేశక్తి' (Guiding force) తో కూడుకొని ఉంటుంది. వీటి సహాయంతోనే అది తన నిత్యకృత్యాన్ని సాగించుతుంది. అటువంటివాటియొక్క పనియేమిటో, ప్రాముఖ్యతయేమిటో తెలుసుకుందాం.

లివర్లు, బెల్టులు కార్మిక వర్గంయొక్క ప్రజాసంస్థలే. అవిలేకుండా కార్మిక నియంతృత్వాన్ని ఆచరణలో సాధించలేం.

వాటిని నడిపేశక్తి కార్మికవర్గంలో రాజకీయంగా ముందున్న భాగమే (పార్టీ) ; కార్మికులయొక్క పురోగామియే (Vanguard). ఇదే కార్మిక నియంతృత్వానికి నాయకుడు.

కార్మికవర్గానికి ఈ బెల్టులు, లివర్లు వాటిని నడిపేశక్తి అవుసరం. ఎందువల్లనంటే, అవిలేకపోతే నిర్మాణయుక్తంగా ఉన్న సైన్యాన్ని సమాయత్తం చేసుకు కూర్చున్న పెట్టుబడిదారీ వర్గం ముందు ఆయుధాలులేని సైన్యంవలె నిలబడాలిసి వస్తుంది ; పెట్టుబడిదారీ వర్గాన్నుండి అధికారం లాక్కోవడం, దాని అధికారాన్ని స్థిరపరచుకోవడం, సోషలిస్టు సమాజాన్ని నిర్మించడం, అసంభవమవుతుంది. వీటియొక్కయూ, కార్మికవర్గ పురోగామి (పార్టీ) యొక్కయూ నిర్మాణయుక్తమైన సహాయం లేకపోతే, కార్మికవర్గ నియంతృత్వం నిలబడి ఉండటం సాధ్యంగాదు." (స్టాలిన్‌చే రచింపబడిన 'లెనినిజం' లో మొదటి 'వాల్యూము' లో 29 వ పేజీ)

(పై గ్రంథంలోనే 167 వ పేజీ)

పార్టీ. కార్మికవర్గంయొక్క అత్యున్నతవర్గ నిర్మాణసంస్థ.

కార్మికవర్గంయొక్క నిర్మాణయుక్తమైన సైనికదళమే పార్టీ. కాని పార్టీ ఒక్కటే కార్మికవర్గంయొక్క నిర్మాణ సంస్థకాదు. కార్మికవర్గానికి యింకా అనేక యితర నిర్మాణ యుక్తమైన సంఘాలుకూడా వున్నాయి, కార్మిక సంఘాలు సహకార సంస్థలు, ఫ్యాక్టరీ, డిపార్ట్‌మెంటల్ కమిటీలు; శాసనసభా గ్రూపులు; పార్టీకి చెందని స్త్రీల సంఘాలు; ప్రచురణాలయం; వైజ్ఞానిక విద్యాసంస్థలు; యువజన సంఘాలు: విప్లవ పోరాటసంస్థలు (విప్లవ పోరాట సమయాల్లో పనిసేవి) ప్రజా ప్రతినిధులతోకూడిన సోవియట్లు (కార్మికవర్గానికి అధికారం వచ్చినయెడల) మొదలైన అనేక సంస్థలువున్నాయి. ఇవన్నీ లేనియెడల పెట్టుబడి విధానమునకు వ్యతిరేకంగా పోరాటం అసంభవం; వీటిలో యెక్కువభాగము పార్టీ సంస్థలు కావు; కొన్ని మాత్రం పార్టీని అనుసరించి పనిచేసేవి. ఒక పరిస్థితి యేర్పడేసరికి యీ సంస్థలన్నీ అవసరమవుతాయి. అవిలేనియెడల కార్మికవర్గం వివిధ రంగాల్లో తన వర్గ స్థానాన్ని బలపరుచుకొనుట అసంభవమవుతుంది. అవిలేకుండా కార్మిక వర్గం బలపడి బూర్జువా విధానమును తొలగించి, సోషలిష్టు విధానమును ప్రవేశ పెట్టలేదు. కాని, యిన్నిసంఘాలు పెట్టుకొని ఒకే ఏకైకనాయకత్వం ఎలా సాధ్య పడుతుంది? ఈ సంఘాలన్నీ బహు నాయకత్వానికి దారితీయవని గ్యారంటీ యేముంది? ఈ సంఘాలలో ప్రతి సంఘమూ తనయొక్క ప్రత్యేకరంగములోని పనిని నిర్వహించుకుంటున్నప్పుడు వాటిమధ్య ఘర్షణ ఏర్పడలేదని వాదించవచ్చు. ఇది నిజమే. కాని ఈ సంఘాలన్నీ ఒకే మార్గం పెట్టుకొని పనిచేస్తూవుండాలనే విషయంకూడా నిజమే. ఎందుకంటే, యీ సంఘాలన్నీగూడా ఒకే వర్గాన్ని (కార్మికవర్గాన్ని) బలపరచే సంఘాలుగా పనిచేయాలి గనుక. అప్పుడు ఈ ప్రశ్న బయలుదేరుతుంది. ఈ సంఘాలన్నీ యేమార్గంలో యేపంథానుసరించి పని చేయాలో నిర్ణయించేదెవరు? అవిధంగా నిర్ణయించగల్గి, దానికి అవసరమైన అనుభంగల కేంద్ర సంస్థ ఏది? అన్ని ప్రజాసంఘాలచేత జనరల్‌పంథా ప్రకారం పనిచేయించగల ప్రతిష్ఠగల్గి నాయకత్వ ఐక్యతకు దారితీసి, ఘర్షణలు, చీలికలు రాకుండా చేయగల కేంద్రసంస్థ యేది?

ఈ కేంద్రసంస్థయే కార్మికవర్గ పార్టీ.

పైన చెప్పబడిన లక్షణాలన్నీ ఈ కార్మికవర్గపార్టీకివున్నాయి. ఎలాగంటే. (1) పార్టీకిచెందని కార్మికేతర సంస్థలతో ప్రత్యక్ష సంబంధాలుకల్గి తరచుగా వాటిని నడుపుతూవుండే కార్మికవర్గంలోని ఉన్నతమైన వారందరిని సమీకరించే కేంద్రమే పార్టీ. (2) కార్మికవర్గంలోని ఉన్నతమైనవారందరి సమీకరణతో యేర్పడిన పార్టీ కేంద్రము, తమ వర్గసంస్థల నన్నిటినీ నడుపగల కార్మికనాయకు లందరికి శిక్షణనిచ్చుటకు ఉన్నతమైన శిక్షణా కేంద్రం. (3) కార్మిక నాయకు లందరికీ శిక్షణనిచ్చే పార్టీ, తనయొక్క అనుభవం, ప్రతిష్టలవల్ల కార్మికవర్గ పోరాట నాయకత్వాన్ని కేంద్రీకరించుటకు పార్టీ సంస్థలు కానటువంటి కార్మికేతర సంస్థల నన్నింటిని పార్టీకి - కార్మికవర్గానికి మధ్య లింకులుగావుండే సహాయక సంస్థలుగా మార్చుటకు తగిన కేంద్రం. కార్మికవర్గంయొక్క వర్గసంస్థ లన్నింటిలో పార్టీ అత్యున్నతమైన వర్గ నిర్మాణ సంస్థ.

దీనినిబట్టి పార్టీ సంస్థలుకాని కార్మికసంఘాలు, సహకార సంస్థలు మొదలైనవన్నీ పార్టీ నాయకత్వానికి బద్ధులై పనిచేయాలని కాదు. ఈ సంస్థలలో పనిచేస్తూ పలుకుబడిగల పార్టీ సభ్యులందరూ పార్టీ సంస్థలు కానటువంటి ఈ సంస్థలన్నిటినీ పనిద్వారా క్రమేణా పార్టీవైపుకు తీసుకొనివచ్చి పార్టీయొక్క రాజకీయ పంథాను వాటంతట అవే అంగీకరించునట్లు చేయుటకు సర్వశక్తులా కృషిచేయాలి.

అందువల్లనే లెనిన్ పార్టీని, కార్మికసంస్థ లన్నిటిలోకి అత్యున్నతమైన వర్గసంస్థయని పిలిచాడు. అటువంటిపార్టీ యితర కార్మికసంస్థ లన్నిటిమీద రాజకీయ నాయకత్వమును వ్యాపింపచేయుటకు కృషిచేయాలి.

(లెనిన్ : సెలెక్టెడ్‌వర్క్సు— 10వ సంపుటం - 91 వ పేజీ)

పార్టీసంస్థలు కానటువంటి సంస్థలకు 'స్వతంత్రం' ఉండాలని, అవి తటస్థంగా ఉండుట అవసరమని వాదించే అవకాశవాద ద్రోహులయొక్క సిద్ధాంతాలకు, లెనినిష్టు సిద్ధాంతాలకు ఎక్కడా కుదురదు. ఆ ద్రోహుల సిద్ధాంతాల ననుసరిస్తే శాసనసభలలో 'స్వతంత్ర' సభ్యులు, పార్టీతో సంబంధంలేని పత్రికా విలేఖరులు, సంకుచిత భావాలుగల కార్మిక నాయకులు సహకార సంస్థలమీద పెత్తనం సాగించే అధికారులు, ఎందుకూ పనికిరాని చెత్తాఖాని వ్యక్తులు తయారవుతారు.

ప్రజలను ఒప్పించి ముందుకు తీసుకురావాలి

మన పార్టీ ప్రజలపార్టీ. అందుచేత మన కార్యక్రమం ఎలా సరియైనదో ప్రజలకు నచ్చజెప్పి, వారిని ముందుకు నడుపుతుంది. ప్రజలు ఎప్పుడైనా మన కార్యక్రమాన్ని అంగీకరించకపోతే, బూర్జువా పార్టీలవలె వారికి మోసపుమాటలు చెప్పి మాయపుచ్చడంగాని, వారిమీద మరేవిధమైన వత్తిడి తీసుకురావడంగాని, లేక బలప్రయోగం చేయడంగాని, చేయదు. మన కార్యక్రమాన్ని ప్రజలు అనుసరించడానికి ఎందుకు తటపటాయిస్తున్నారో తెలుసుకోడానికి, కార్యక్రమంలో ఏమైనా లోపాలు వున్నావేమోనని చూస్తుంది. అది సరిగానేవుంటే అవలంబించే ఎత్తుగడలలో ఏమైనా లోపమున్నదేమోచూస్తుంది. కార్యక్రమం ఎత్తుగడలు అన్నీ సరిగా వుంటే, ప్రజలకు ఇంకా ఓపికతో నచ్చజెప్పుతుంది. అంతేగాని వారిమీద విసుగు చెందదు.

ప్రజా సంస్థ - వివిధ రాజకీయ గ్రూపులు

ప్రజా సభలు ప్రజల దైనందిన యిబ్బందులను తీర్చడానికి ప్రధానంగా వుద్దేశించబడిన ఆర్థిక, రాజకీయ సంస్థలు. ప్రజలయొక్క దైనందిన యిబ్బందులను తీర్చడానికి కృషిచేసే దేశభక్త పాలసీని అనుసరించే రాజకీయ గ్రూపులన్నీ ఒక ప్రజాసంఘంలో వుండవచ్చు. ఏ రాజకీయ గ్రూపుతోకూడ సంబంధంలేని జీవకారుణ్యదృష్టితో పనిజేసేవారు (Humanitarians) కూడ ఉండవచ్చును. కాని జపాను పంచమాంగదళాన్ని అనుసరించే ఫార్వర్డు బ్లాకు, కాంగ్రెసు సోషలిస్టు, రంగాముఠాలు, బ్రిటిష ప్రభుత్వ యేజెంటుగా పనిచేస్తున్న రాయిస్టుముఠా, మొదలైన దేశద్రోహ పంథాలను అనుసరించే రాజకీయ గ్రూపులు మనతోకలిసి పనిచేయడానికి తయారుకావు. ఎందువల్లనంటే మన పాలసీ దేశభక్తపూరితమైన పాలసీ. ఆ గ్రూపులవలంబించేది దేశద్రోహ పాలసీలు. (జపానుదాడి ప్రమాదం తగ్గినప్పటినుంచీ, రంగాముఠా, కాంగ్రెసు సోషలిస్టులు తాముగూడ జపాను ప్రతికూలురమేనని చెపుతున్నారు. అయినా వారు అరాజకాన్ని ప్రోత్సహించే కార్యక్రమాన్ని అనుసరిస్తూనే వున్నారు. కమ్యూనిస్టులు చేసేపనికి విఘ్నం గల్గించడమే వారి ఉద్దేశ్యం. నిర్మాణయుక్తంగా ప్రజల కోర్కెలను తీర్చడానికి

వారు ముందుకురారు. నోటితో యేమిచెప్పినా, ఆచరణలో జపాను అనుకూల కార్యక్రమాన్నే అనుసరించుతున్నారు. అందుచే యింకనూ ఆ గ్రూపులు దేశద్రోహ గ్రూపులే అని అనాలిసివస్తుంది. ఫార్వర్డు బ్లాకు ఇంకనూ బహిరంగంగానే జపాను అనుకూల పాలసీని అనుసరిస్తోంది.) ఏ ప్రజా సమస్యనైనా, ఏ రాజకీయ గ్రూపు అయినా తన రాజకీయ పాలసీని అనుసరించియే దాన్ని పరిష్కరింప బూనుకొంటుంది. అందుచే రెండు పరస్పర విరుద్ధమైన రాజకీయ గ్రూపులు ఒక సమస్యను పరిష్కరింప బూనుకున్నపుడు, ఆచరణలో రెండూ పరస్పర విరుద్ధమైన మార్గాలకు పోతాయి. అయినా ప్రజలలో ప్రచారంచేసి, మెజారిటీ నిర్ణయంప్రకారం పనిచేయాలి. అప్పుడే ప్రజాసంస్థలు పనిచేస్తాయి. ఉదాహరణకు ఆహారసమస్యను తీసుకుందాం; మన పార్టీ పాలసీ ప్రజలనైక్యపరచి, స్వాతంత్ర్యాన్ని సంపాదించే పాలసీగనుక, యీ ఆహార సమస్యను పరిష్కరించడానికి కూడ ప్రజలనైక్యపరుస్తాం. అధికోత్పత్తికోసం రైతు-కూలీలను సమీకరించుతాం. రైతులచే ప్రభుత్వం నిర్ణయించిన కంట్రోలు ధరకు, వర్తకులు యెక్కువ ధర యిస్తానన్నా, ప్రభుత్వానికి యితర ప్రజా సంస్థలకు అమ్మించుతాం. ఆకలిగొన్న ప్రజలకు దోపిడీలు మార్గంగాదనీ, ఐక్యమై, చౌకడిపోలను సాధించాలనీ చెబుతాం.

కాని, ఫార్వర్డు బ్లాకు, కాంగ్రెసు సోషలిస్టులు, రంగాముఠా అవలంబించే పంథాలు దేశ వినాశకరమైన పంథాలు గనుకనూ, జపాను అనుకూల పంధాలు అగుటవల్లనూ, జపానువాళ్ళకు అనుకూలంగా ఉండే దేశంలో అరాజకాన్ని ప్రబలేటట్లు చేస్తారు. వారు రైతులలో అధికపంటలు పండించితే, మిలిటరీవాళ్ళు తీసుకుపోతారని ప్రచారం జేస్తారు. ఆకలిగొన్న ప్రజలను దోపిడీలు చేసి, పొట్ట నింపుకోమంటారు. వర్తకులను, ధనిక రైతులనూ ధాన్యాన్ని దాచివేసి, కంట్రోలు ధరలను భగ్నంచేయమని చెబుతారు.

పై విధంగా ప్రతిసమస్యలోనూ కమ్యూనిస్టులు అనుసరించే పద్ధతులకు విరుద్ధమైన పద్ధతులను పై కమ్యూనిస్టు వ్యతిరేకగ్రూపులు అనుసరిస్తున్నాయి. ప్రజలకు వ్యతిరేకపాలసీలను అవలంబించుటచే ప్రజలలో మెజారిటీ సంపాదించలేరు. అందుచేతనే వారు మనతో కలసి పనిచేయడానికి రారు.

కాంగ్రెసులోని మితవాదులు (గాంధీవాదులు వగైరా) మన పార్టీయొక్క రాజకీయపాలసీని పూర్తిగా అంగీకరించక పోయినప్పటికీ, కాంగ్రెసు సోషలిస్టుల అరాజక కార్యక్రమాన్ని అంగీకరించరు. కరువును తీర్చడానికి తోడ్పడుతారు. మన కార్యక్రమం ఆచరణలో పెట్టడానికి ముందుకు రాకపోయినా, కనీసం వ్యతిరేకంగానైనా రాకుండా ముభావంగా కూర్చుంటారు. ఏమీ చేయలేమని నిస్పృహ వెలిబుచ్చుతారు జపాను అనుకూలతగాని, దోపిడీలు రెచ్చగొట్టడంగాని చేయరు. వీరు కమ్యూనిస్టులు చెప్పిన జాతీయైక్యపంథాను పూర్తిగా అంగీకరించకపోయినా, హిందూముస్లిం ఐక్యతను కోరతారు. ప్రపంచయుద్ధంలో అభివృద్ధి పక్షంయొక్క విజయాన్ని కోరతారు. కనుక కమ్యూనిస్టులు వీరితోనూ, రాజకీయాలతో సంబంధంలేని జీవకారుణ్య వాదులతోనూ కలిసి ఒకే ప్రజాసంస్థలో పనిచేయడం సాధ్యమవుతుంది.

గత ఆగస్టుఘటనలనుంచి నేటివరకూజరిగిన ఘటనలన్నీ పైదానినేరుజువు చేస్తాయి. ఆంధ్రలో 1942 ఆగస్టు ఘటనలలో రంగాముఠా, కాంగ్రెసు సోషలిస్టులమని చెప్పుకొనే కొంతమంది కాంగ్రెసువాదులు, ఫార్వర్డుబ్లాకువారు తీవ్రంగా పాల్గొన్నారు. శాబటేజి కార్యక్రమం, అరాజకచర్యలను ఎడతెగకుండా నడిపారు. (కాంగ్రెసువాదులు మొదటి ఉద్రేకంలో అరాజకచర్యలలో పాల్గొన్నా, దీనివల్ల లాభం లేకపోగా ప్రజలకే హానిగల్గుతోందని గ్రహించి, కొద్దికాలానికే ఇవి మానివేసి, నిస్పృహతో మూలకూర్చున్నారు. కాని పై ముఠాలు ఒక ఉద్దేశ్యాన్ని మనస్సులో పెట్టుకొని, ప్రజలకు వీటివల్ల హాని జరుగుతోందని తెలిసి కూడా, ఎడతెగకుండా వాటిని ప్రోత్సహించుతున్నారు.) కమ్యూనిస్టుల కార్యక్రమానికి అడ్డుతగలడమే పనిగా పెట్టుకొన్నారు జపాను అనుకూల ప్రచారం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సాగించుతూనే ఉన్నారు. ఆగ్రూపులలోని వ్యక్తులు ఇంతకు పూర్వం దేశంకోసం త్యాగం చేసినవారైనా, బ్రిటిషు ప్రభుత్వంమీద ద్వేషంతో జపాను సామ్రాజ్యవాదుల చేతుల్లోకి పోయారు. కనుక ఇప్పుడు వారిని దేశభక్తులనుగా పరిగణింపజాలము. పై గ్రూపుల పాలసీలు దేశద్రోహకరంగా మారుటవలననే ఆగస్టు ఘటనలకు పూర్వం ఒకే ప్రజాసంఘాలతో, కమ్యూనిస్టులతో కలసి పనిచేసినప్పటికీ, ఆగస్టుఘటనల తర్వాత ప్రజాసంఘాలలో చీలిక వచ్చింది. రంగాముఠా ఆంధ్రరాష్ట్ర రైతుసంఘాన్ని రద్దుచేసి, ఏజంట్లను వేసింది.

ఇప్పుడు ఆ విధంగా రైతు ఉద్యమాన్ని చీల్చడం సాధ్యంగాదని పోటీ సంఘాలను పెడుతోంది. అఖిలభారత రైతుసంఘం నుండి చీలిపోయింది. అలాగే విద్యార్థిసంఘాలలోనూ, యువజనసంఘాలలోనూ చీలికల తెచ్చారు. పై గ్రూపులన్నీ కలిసి జాతీయ విద్యార్థి, యువజన సంఘాలను పేరిట, పోటీసంఘాలను పెట్టినవి. కమ్యూనిస్టు వ్యతిరేకతయే వీటి లక్ష్యం. పై గ్రూపులలో చిన్నచిన్న రాజకీయ భేదాలున్నా, వారి పాలసీలలోని ప్రధానహంశాలు ఒకటే అవడంవల్ల అవన్నీ కలిసి పనిచేయ గల్గుతున్నాయి.

పై గ్రూపులు ఎలా అయితే జపానుఏజంట్లుగా పనిచేస్తున్నాయో, ఆవిధంగానే రాయిస్టుగ్రూపు బ్రిటిషుసామ్రాజ్యవాదులఏజంటుగా పనిచేస్తోంది. ఇది ఫేసిస్టు వ్యతిరేక బురఖా వేసుకున్నా, నిజానికి ప్రజల హక్కులకొరకై పాటుబడదు. ప్రజా సంఘాలను సామ్రాజ్యవాదులకు అణిగి మణిగి ఉండేలా చేయడానికి ప్రయత్నించుతుంది. "ఫేసిస్టులువచ్చి భారతదేశాన్ని మ్రింగివేస్తున్నారు. ఇప్పుడు ఫేసిస్టు ప్రమాదం తగ్గినా, జాతీయ ప్రభుత్వం అనేపేరట భారత పెట్టుబడిదార్లు ఫేసిజాన్ని స్థాపింప జూస్తున్నారు. బ్రిటిషు ప్రభుత్వంమాట తర్వాత చూడవచ్చు. ముందు ఈ ఫేసిజాన్ని ఎదుర్కొండి" అని ప్రజలను మోసపుచ్చ జూస్తారు. దీని అర్థమేమిటి? జాతీయప్రభుత్వం భారత పెట్టుబడిదార్ల "ఫేసిస్టు" ప్రభుత్వంగా పనిచేస్తుందిగనుక, బ్రిటిషు సామ్రాజ్యవాదుల అడుగులకు మడుగులొత్తమని గాదా? పేరుకు ప్రజాప్రభుత్వం అని వాగుతున్నా, వారు కాంగ్రెసు-లీగు ఐక్యత ఫేసిజానికి దారితీస్తుంది గనుక, ఆ ఐక్యత అవుసరం లేదంటారు. దీని అర్థం స్వాతంత్ర్యాన్ని సాధించే జాతీయైక్యతకు అడ్డుతగిలి, బ్రిటిషు సామ్రాజ్యవాదుల పెత్తనాన్ని చిరస్థాయిగా ఉంచడానికి కృషిచేయడంగాదా? రాయిస్టులది కూడా దేశద్రోహ పంథాగనుక, వీరు జాతీయైక్యతకోసం కృషిజేస్తున్న కమ్యూనిస్టులను వ్యతిరేకించడంలో, పై గ్రూపులకేమీ తీసిపోరు. పైగా కొన్నికొన్ని పరిస్థితులలోరాయిస్టులు కమ్యూనిస్టుల కార్యక్రమానికి అడ్డుతగులడానికి, రంగా, కాంగ్రెసుసోషలిస్టు, ఫార్వర్డుబ్లాకు ముఠాలతోకూడా కలిసి పనిజేస్తున్నారు. కనుకనే రాయిస్టులు అఖిలభారత ట్రేడుయూనియను కాంగ్రెసులో ఉండి దాన్ని విచ్ఛిన్నం చేయడానికి సాధ్యం గాకపోవుటచే, దానినుండి చీలి "ఫేసిస్టు వ్యతిరేక" ట్రేడ్‌యూనియను ఫేడరేషను అను పేర నామమాత్రమైన సంస్థ నొక

దాన్ని ఏర్పరచారు. ఆ పర్చ్యూనిస్టు జమ్నాదాసు మెహతాను కలుపుకొని, అఖిల భారత రైల్వేమన్సు ఫెడరేషనునుండి, కమ్యూనిస్టుల ఆధ్వర్యంక్రింద దేశభక్తి కార్యక్రమాన్ని అనుసరించుతున్న యస్. ఐ. ఆర్., జి. ఐ. పి. రైల్వేలను తొలగించి వేశారు. ఈ విధంగా కార్మికోద్యమంలో చీలికలు కల్గించు తున్నారు. ట్రేడుయూనియను రంగంలో మన పార్టీయొక్క పాలసీని యస్. యం. జోషి ప్రభృతులు పూర్తిగా అంగీకరించకపోయినా, వారు ప్రపంచ యుద్ధంలో ప్రజా పక్ష విజయం గోరుతున్నారు గనుకనూ, కార్మికుల శ్రేయస్సునుకోరే వారగుట చేతనూ, వారూ కమ్యూనిస్టులు కలిసి పనిచేయ గల్గుతున్నారు.

ప్రజ లెక్కడవుంటే మనం అక్కడే వుంటాం

అంతమాత్రాన పైదాని అర్థం పై గ్రూపులచేతుల్లో బలమైన ప్రజాసంఘా లుంటే, వాటిల్లో మనం పనిచేయమనిగాదు. ప్రజలు యెక్కడవుంటే మనం కూడ అక్కడ వుంటాము. ఆ యా సంఘాల పరిస్థితులనుబట్టి, కమ్యూనిస్టు లుగా బహిరంగంగా చెప్పుకుంటూనో లేక కమ్యూనిస్టులుగా ప్రకటించకుండానో పనిచేస్తాం. ఆ సంఘాలలోవుండి ఆ నాయకత్వాన్ని ప్రతి ఘటనలోనూ బట్ట బయలుచేస్తూ, వారిని ప్రజలనుండి దూరంచేస్తాం.

ఎప్పుడూ ప్రజాసంఘాలలో వాటి ఐక్యత చెడకుండా ముందుకు పోయే రాజకీయ కార్యక్రమం ఇవ్వాలి.

మన ప్రజాసంస్థలలో ఉన్న వివిధ రాజకీయగ్రూపులు, వ్యక్తులు ప్రస్తుత ప్రపంచ యుద్ధంలో సోవియటు యూనియను, చైనా, బ్రిటను, అమెరికాలపక్షం అభివృద్ధికరమైనదనీ, యీ పక్షమే విజయంపొందాలనీ, మనం యీ పక్షంచేరి పోట్లాడాలనీ అంగీకరించుతారు. కాని ఈ పక్షానచేరి పోరాడాలంటే, మనకు బ్రిటిషు సామ్రాజ్యవాదులు కాంగ్రెసు నాయకులను తమంతటతామే వదలివేసి, జాతీయ ప్రభుత్వం ప్రసాదించాలంటారు. తాము ఆహారకరువును పరిష్కరిం చడంలో ముస్లిములీగువారిని కలుపుకోవాలనీ, వారు కోరే ముస్లిము జాతుల స్వయం నిర్ణయసూత్రాన్ని అంగీకరించి, ముస్లిములీగువారు కాంగ్రెసునాయకుల విడుదలకు ముందుకు వచ్చేలా చేయాలనీ, వీరు అంగీకరించరు. అందుచేత

మనయొక్క పూర్తి పాలసీని ఒక్కసారిగా అంగీకరించమని వారి నెత్తిన రుద్ద బోవడం సరియైనదిగాదు - అందువల్ల వీరిని దూరంజేసికొని, ప్రజా సంస్థలను చీల్చినవారమవుతాం. కనుక మనం ప్రజా సంస్థలలో ఇతర దేశభక్త రాజకీయ గ్రూపులు, వ్యక్తులు అంగీకరించిన కార్యక్రమాన్ని ఆచరణలోపెడుతూ, ఇంకా ముందుకుపోయి, మన కార్యక్రమాన్ని పూర్తిగా అంగీకరించాలిసిన అవుసరాన్ని వీరికి ఆచరణలో చూపుతాం. ముస్లింజాతుల స్వయంనిర్ణయసూత్రాన్ని అంగీకరిం చాలసిన అవుసరాన్ని వారికి చాటుతాం. హిందూ-ముస్లిం ఐక్యత సాధ్యమవుతుం దనిఆచరణలో చూపుతాం. హిందూ-ముస్లిం ఐక్యత వచ్చేకొలదీ నిరంకుశోద్యో గులు లొందకతప్పదని చూపుతాం. ఈవిధంగా వారికి జాతీయ ప్రభుత్వం సాధించేమార్గం వారి అనుభవాన్నుండే చూపుతాం, ఈవిధంగా ప్రజా సంస్థల లోని ఇతర రాజకీయగ్రూపులను వ్యక్తులను మనపార్టీ పాలసీవైపుకు ఆకర్షిస్తాం. ప్రజా సామాన్యానికి రాజకీయ చైతన్యం కలుగజేస్తాం. కనుక మనం ఒక ప్రజా సంస్థలో, పార్టీపాలసీ కార్యక్రమం యెంతవకు యితర రాజకీయ గ్రూపులచే అంగీకరింపజేసి, ప్రజాసంస్థలను ముందుకు తీసుకుపోవడానికి, దాన్ని బలపరచ డానికి వీలుంటుందో అంతవరకే మన రాజకీయపంథాను పెడతాం. అంటే, ఒక ప్రజాసంస్థలో దాన్ని ఐక్యపరచి, ముందుకు తీసుకుపోయేటంతవరకే, ఎప్పటి కప్పుడు మన రాజకీయపాలసీ కార్యక్రమం పెడతాం. దీని అర్థం, మిగతా రాజకీయ గ్రూపులు మన పాలసీని తమంతట తాము అంగీకరించేవరకు నోరు మూసుకు కూర్చుంటూ వారి తోకబుచ్చుకొని పోతామనిగాదు; మిగతా రాజకీయ గ్రూపులు మన పాలసీ యెలా సరియైనదో అర్థం చేసుకొనేటట్లు చేయడానికి, నిరంతరం కృషిచేస్తూనే ఉంటాం. వారికి ఎల్లప్పుడూ ముందుండి సరియైన మార్గం చూపుతాం.

ఉదాహరణకు అఖిలభారతరైతుసంఘం తీసుకోండి. స్వామీ సహజానంద వగైరాలు మన పాలసీని స్పష్టంగా అంగీకరించలేదు. ప్రపంచయుద్ధంలో సోవి యటు యూనియను పక్షమైన అభివృద్ధి పక్షం గెలవాలనీ, ఆహారకరువును బాప డానికి అధికోత్పత్తి అవుసరమని అంగీకరించారు. కాని ప్రభుత్వం జాతీయ ప్రభుత్వం ఇచ్చేవరకూ యుద్ధంలో పాల్గోలేమని చెబుతారు. ముస్లిం లీగు కోరు తున్న స్వయంనిర్ణయ హక్కును అంగీకరించరు. జాతీయైక్యత కావాలని

అస్పష్టంగా అంగీకరించుతారు. అందుచే మనం స్వామీజీగ్రూపును కలుపుకు పోవడానికి, మన పాలసీని పూర్తిగా అంగీకరించమని పట్టుబట్టుకు కూర్చొని, అఖిలభారత రైతుసంఘాన్ని చీల్చలేదు. జపాను దాడిని వ్యతిరేకించాలనీ, కరువును పోగొట్టడానికి అధికోత్పత్తిని సాగించాలనీ, జాతీయప్రభుత్వాన్ని సాధించడానికి కాంగ్రెసు-లీగు ఐక్యత అవుసరమని మాత్రమే రాజకీయ తీర్మానంలో పెట్టాం. స్వామీజీముఠా కాంగ్రెసు-లీగు ఐక్యతకు ముస్లిం జాతుల స్వయం నిర్ణయ హక్కును అంగీకరించాలనే విషయాన్ని నిరాకరించింది. దానిమీద కిసాను సభను చీల్చడాని కిష్టంలేక, మనం మనకు పూర్తి మెజారిటీ ఉన్నప్పటికి ఆ హంశాన్ని కూడ రాజకీయ తీర్మానంలో ఉంచలేదు.

ఇలాగే అఖిలభారత ట్రేడ్‌యూనియను కాంగ్రెసు విషయంలో కూడా. దీనిలో కమ్యూనిస్టులు, జాతీయవాదులు (కాలప్ప వగైరా), యన్. యం. జోషీ ఉన్నారు. వీరు స్వామీజీ ముఠావలెనే ముస్లిం జాతుల స్వయంనిర్ణయ సూత్రాన్ని అంగీకరించరు. అందుచేత ప్రతి అఖిలభారత ట్రేడ్‌యూనియన్‌లోనూ మన పాలసీని వివరించడం, ఈ సమస్యమీద ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసును చీల్చకుండా ఉండటం జరుగుతోంది. దీని నిబంధనావళి ప్రకారం రాజకీయ తీర్మానానికి 3/4 వంతులు మెజారిటీ ఉండాలి. కాని అనుబంధ సంఘాలు తమ యిష్టం వచ్చిన రాజకీయ తీర్మానాలు చేయడానికి హక్కుంది. క్రిందిటి సంవత్సరం జరిగిన నాగపూరు ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు మహాసభలో మనపార్టీ జాతుల స్వయం నిర్ణయహక్కుతో కూడిన రాజకీయ తీర్మానం పెట్టింది. కాని ఈ తీర్మానానికి చాల మెజారిటీ ఓట్లు వచ్చినా, 3/4 మెజారిటీ రాకపోవుటచే ఈ తీర్మానం ఓడిపోయింది. అందుచే కాలప్పయొక్క నేషనలిస్టు గ్రూపు జాతుల స్వయం నిర్ణయహక్కు సమస్యమీద చీలడమనే సమస్యరాలేదు.

ఎల్లప్పుడూ ప్రజాసంస్థలలో, వాటి ఐక్యత చెడకుండా ఉండేటంతవరకే, మన రాజకీయ పాలసీని, కార్యక్రమాన్ని పెడతాం.

ప్రజా సంస్థలలో డిసిప్లిన్

ప్రజా సంఘాలలో వివిధ రాజకీయ దృక్పధాలు కలిగిన గ్రూపులు, వ్యక్తులు ఉంటారు అంతేగాక రాజకీయ చైతన్యం వివిధ స్థాయిలలో ఉన్న

తరగతుల ప్రజలుకూడా ఉంటారు. అందువల్ల వివిధ రాజకీయ గ్రూపులను, ప్రజలను ఇముడ్చుకోవడానికి అవుసరమైన స్థాయిలోనే ప్రజా సంస్థల శిక్షణకూడా ఉంటుంది. ఒకే మార్క్సిస్టు సిద్ధాంతాన్ని అంగీకరించిన, ఒకే వర్గ పార్టీయైన మన పార్టీలోవలె కేంద్రీకృత ప్రజాస్వామ్యంమీద ఆధారపడిన కఠినమైన శిక్షణ ప్రజాసంస్థలలో ఉండదు, అటువంటి శిక్షణను ప్రజా సంస్థలలోకూడా అన్వయించ ప్రయత్నించడమంటే, వాటినికూడా కమ్యూనిస్టు పార్టీగా తయారుచేయడమన్న మాట. ఇతర రాజకీయ గ్రూపులను, ప్రజా సామాన్యాన్ని వాటినుండి వెళ్ళగొట్టడమన్న మాట. మన పార్టీసభ్యులు కమ్యూనిజమనే మహదాశయంకోసం సర్వ త్యాగంజేసి పాటుబడుతున్నారు గనుక, వారిలో రాజకీయ చైతన్యముంది. కఠినమైన పార్టీశిక్షణకు లోబడి ఉండగలుగుతున్నారు. అటువంటి మహదాశయంలేని, రాజకీయ చైతన్యంలేని ప్రజలు కఠినమైన మన పార్టీశిక్షణకు ఎట్లా కట్టుబడి ఉండగల్గుతారు ?

అయితే ప్రజా సంస్థలలో శిక్షణ ఎలావుండాలి ? సామాన్య సభ్యులు ప్రజా సంస్థ నిర్ణయాలకు వ్యతిరేకంగాబోతే, డిసిప్లినరీ చర్యను తీసుకోం. వారికి సరియైన మార్గం తెలుసుకోడానికి ఎన్నిసార్లయినా అవకాశమిస్తాం. ప్రజా సంఘం యొక్క తీర్మానాలు వారికి మార్గం చూపించడానికి మాత్రమే చేయబడుతాయి. కాని మన పార్టీలో సాధారణ సభ్యులు పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా పోవడమే గాక, పార్టీ నిర్ణయాలను అమలుజరపకపోవడం, చివరకు ప్రజల్లో పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా మాట్లాడటంకూడా శిక్షణకు వ్యతిరేకమే, అటువంటి వారిమీద డిసిప్లినరీ చర్య తీసుకోబడుతుంది.

ఇక ప్రజాసంఘాలలో జనరల్‌బాడీ, కార్యవర్గసభ్యులు ఇతర బాధ్యతగల స్థానాల్లో ఉన్నవారిసంగతి. గ్రామ, తాలూకా, జిల్లా, రాష్ట్రసంఘాలలో బాధ్యతగల వ్యక్తులు (జనరలుబాడీ సభ్యులు, కార్యవర్గ సభ్యులు) సంఘ తీర్మానాలకు వ్యతిరేకంగా నడిస్తే, పై వరసనుబట్టి వారితప్పు హెచ్చుతూ పోతూ ఉంటుంది. తీర్మానానికి విరుద్ధంగా నడిచినవ్యక్తి ప్రాముఖ్యతనుబట్టి, చేసిన తప్పునుబట్టి, అతనిని మందలించడం, బాధ్యతగల స్థానంనుండి తీసివేయడం మొదలైన డిసిప్లినరీ చర్య తీసుకోబడుతుంది. కాని సాధారణంగా బాధ్యతగల స్థానంనుంచి తొలగించడం వరకూ రాకూడదు. సాధ్యమయినంత వరకూ పై స్థితికి రాకుండా

చూడాలి. డిసిప్లిను ఆయుధాన్ని చాలజాగ్రత్తగా వాడాలి. సంఘంయొక్క అసలు ఆశయానికే విరుద్ధంగా నడుస్తున్నప్పుడు బాధ్యతగల స్థానాన్నుండి తొలగించవచ్చు. ఉదాహరణకు తాలూకా లేక జిల్లాసంఘంలోని ప్రముఖవ్యక్తి యుద్ధ ఫండులు ఇవ్వవద్దనీ, రైతులను కంట్రోలు ధరలకు ధాన్యం అమ్మవద్దనీ ప్రచారం చేస్తున్నాడనుకోండి లేక రైతులవద్దనుండి లంచాలు పుచ్చుకుంటున్నాడనుకోండి. ఇటువంటి పనులవల్ల సంఘం పూర్తిగా దెబ్బతింటుంది. అందుచే ఇటువంటి సందర్భాలలో ఆ వ్యక్తిని బాధ్యతగల స్థానంనుంచి తొలగించాలి.

సంఘ తీర్మానాలను ఆచరణలో పెట్టకుండా కూర్చున్నవారిని తాలూకా లేక జిల్లా అధ్యక్ష కార్యదర్శి స్థానాలకు క్రొత్తఎన్నికలలో ఎన్నుకోకూడదుగాని జనరల్ బాడీలనుంచిగాని కార్యవర్గాలనుంచిగాని తొలగించాలిసిన అవుసరంలేదు. గ్రామసంఘాలు చురుకుగా పనిచేయని చోట్లగూడ పనిచేయని వారిని అధ్యక్ష, కార్యదర్శి స్థానాలనుండి తొలగించాలిసిన అవుసరంలేదు. తాలూకా, జిల్లా సంఘాలు మాత్రమే ప్రస్తుతం చురుకుగా పనిచేస్తున్నాయి. ఇట్టి పరిస్థితులలో ఈ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు పనిచేయనివారైనచో సంఘాభివృద్ధికి ఆటంకంగా తయారు అవుతారు. కనుక వీరు పనిచేసేవారుగ ఉండాలి. మన పార్టీలోవలె పనిజేయకపోవడం, ప్రజాసంస్థలలో నేరంగాదు.

ప్రజా సంఘాలలో పార్టీసభ్యులు ఎలా మెలగాలి ?

కమ్యూనిస్టుపార్టీ సభ్యులు ఏ యితర సంస్థలోవున్నా ఒకే యూనిటుగా పనిచేస్తారు. జిల్లాసంఘ కార్యవర్గంలో ఉన్న పార్టీ సభ్యులంతా జిల్లాసంఘ ఫ్రాక్షనుగాను, జిల్లా జనరలుబాడీలో వున్న పార్టీ సభ్యులంతా జిల్లా జనరలుబాడీ ఫ్రాక్షనుగాను పనిచేస్తారు. ఈ విధంగానే తాలూకా సంఘాలకు కూడా.

ప్రతి ఫ్రాక్షనుకు ఫ్రాక్షనులీడరు వుంటాడు. ఇతడు అందరిలోనూ సమర్థుడు. ప్రజాసంస్థలోని పార్టీ సభ్యులను నడపగలిగినవాడు అయివుంటాడు. ప్రతిసారి కార్యవర్గ సమావేశాలు, జనరలుబాడీ సమావేశాలు జరగడానికి ముందు రోజున వాటిలోని పార్టీ సభ్యులంతా వస్తారు. ఇట్టి సమావేశాలు మనం మైనారిటీలో వున్నప్పుడుగాని, లేక మనం మెజారిటీలో ఉన్నా, ఇతరపక్షాలు ఒకే గట్టి మైనారిటీగా ఉన్నప్పుడుగాని జరుపుతాం. వారు సమావేశమయి, మరురోజున

జరగబోయే ప్రజాసంఘ సమావేశంలో ఏ యే తీర్మానాలు తీసుకురావలసి ఉంటుందో, ఎవరెవరు మాట్లాడాలిసి వుంటుందో నిర్ణయించుకుంటారు. ఈ నిర్ణయాలకు విరుద్ధంగా ప్రజాసంఘాల మీటింగులలో ఏ పార్టీ సభ్యుడు ప్రవర్తించరాదు. సామాన్యంగా ఈ నిర్ణయాలు ఆ ప్రజాసంస్థలోని ఇతర రాజకీయగ్రూపులను, వ్యక్తులను దృష్టిలోపెట్టుకొనే చేయబడతాయి. కాని ప్రజాసంఘ మీటింగు గూర్చున్నప్పుడు, పరిస్థితులను బట్టి ఈ తీర్మానాలను కొంత సవరణచేయాలిసి వస్తుంది. అటువంటి పరిస్థితులలో ఫ్రాక్షను లీడరు ఆ మీటింగులోనే ఫ్రాక్షనులోవి ఇతర ముఖ్యులను చకచకా సంప్రదించి, సవరణలు చేస్తాడు. అక్కడ అభిప్రాయభేదం వచ్చినప్పుడు ఫ్రాక్షనులీడరు, తన సొంతబాధ్యతమీద చేస్తాడు. తరువాత ఫ్రాక్షనులీడరు సమాధానం చెప్పుకుంటాడు. కాని పార్టీసభ్యులు, ఫ్రాక్షను లీడరు పార్టీకి చాల హానిజరిగే పెద్దతప్పు చేస్తున్నప్పుడు తప్ప, మిగతా చిన్న విషయాలలో ఫ్రాక్షను లీడరును అనుసరించాలి. తరువాత ఫ్రాక్షను మీటింగులో వాటిని చర్చించవచ్చును. ఫ్రాక్షనులీడరు పెద్దతప్పు చేస్తున్నప్పుడు మిగతా ముఖ్యులు చొరవచేసి, ఫ్రాక్షను లీడరుమ మందలించి, ఆ తప్పు జరగకుండా చూడాలి. ఇందుకు ఒక ఉదాహరణ తీసుకుందాం.

కృష్ణాజిల్లాలో 1941 లో రైతు సంఘంలోని ఫ్రాక్షనులీడరు (ఇతడు పార్టీనుంచి వెళ్ళగొట్టబడ్డాడు) అతనికి కార్యదర్శి స్థానమియ్యలేదని అసంతృప్తి చెందాడు. (జిల్లా రైతు జనరలుబాడీలో కార్యవర్గయెన్నికలు జరుగుతున్నప్పుడు) అతడు మన ప్రతికక్షులైన ఫార్వర్డు బ్లాకుతో రాజీపడి, మనకు ఎంతో మెజారిటీ వున్నప్పటికీ వారికి కార్యనిర్వాహకవర్గంలో యెక్కువ స్థానాలు కట్టబెట్టి, తాను కార్యదర్శి స్థానం సంపాదించుకున్నాడు. ఇంత ద్రోహం జరుగుతున్నా మిగతా పార్టీసభ్యులు ఊరుకున్నారు. మనకు యెంతో మెజారిటీ వుండటంవలన, తరువాత మరల జనరలుబాడీ మీటింగు జరిపి, కార్యదర్శిని తొలగించి, మన పార్టీ సభ్యుని ఆ స్థానానికి యెన్నుకొనేలా చేయాలిసి వచ్చింది. ఇంత అవస్థపడాల్సిన అవుసరం లేకుండానే, మొదటి జనరలుబాడీ మీటింగులోనే యెవరైనా ముఖ్య పార్టీసభ్యుడు చొరవజేసి, ఫ్రాక్షనులీడరును మందలించి, యెన్నికలు పార్టీ నిర్ణయంప్రకారం నడిపితే సరిపోయేది. మరొక ఉదాహరణ తీసుకుందాం. 1941 లో గుంటూరుజిల్లా రైతుసంఘ జనరలుబాడీ సమావేశం జరుగుతోంది. దానిలో

రంగా గ్రూపు ఎన్నికలలో చాలా అన్యాయాలు చేయడం మొదలుపెట్టారు. అందుకు మన బాధ్యతగల కామ్రేడ్సు రెచ్చిపోయి, 'వాకౌటు' చేసి జిల్లాసంఘాన్ని రంగాముఠాకు అప్పజెప్పి, పోటీ సంఘాన్ని పెట్టారు. ఇందువల్ల పని చాలా దెబ్బతింది. ఈ దెబ్బనుండి కోలుకోవడానికి చాల టైముబట్టింది. అటువంటి సమయంలో ఫ్రాక్షనులీడరు తప్పటడుగు వేస్తూవుంటే, మరొక బాధ్యతగల కామ్రేడు చొరవజేసుకొని, ఫ్రాక్షనులీడరును మందలించి, 'వాకౌటు' చేయకుండాను, పోటీ సంఘాన్ని పెట్టకుండాను ఆపి ఉండాలిసింది.

జనరలుబాడీ మీటింగులలోనూ, కార్యవర్గ మీటింగులలోనూ పార్టీసభ్యులు మిగతావారితో ఏదో వేరుగా ఉన్నారనే భావం కల్పించగూడదు. వారితో స్వేచ్ఛగా ఉండాలి. వారు అక్కడ ఉండగానే, సభ్యులంతా అవతలకుబోయి సంప్రదించడం కూడదు. ఇందువల్ల మిగతావాళ్ళలో 'రియాక్షన్' వస్తుంది. మీటింగులలో ఏవైనా మార్పులు చేయాలిసి వచ్చినప్పుడు, ఫ్రాక్షను లీడరు తన ప్రక్కన గూర్చున్న ముఖ్యులతో సామాన్యంగానే మాట్లాడి, వెంటనే 'లీడు' (lead) ఇవ్వాలి.

ప్రస్తుత ప్రజాసంఘ జనరలుబాడీలు, కార్యవర్గాలు

అగస్టు ఘటనలతర్వాత రంగాముఠా, ఫార్వర్డు బ్లాకు, కాంగ్రెసు సోషలిస్టులు ప్రజాసంఘాలను చీల్చి పోటీసంఘాలు పెట్టారు. కాంగ్రెసువాదులుకూడ వీటికే ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సహాయంజేస్తున్నారు. అందుచే మన ప్రజాసంఘాల కార్యవర్గాలు జనరలుబాడీలలోనూ చాల యెక్కువమంది పార్టీ సభ్యులు, కొంతమంది సానుభూతిపరులు మాత్రమే ఉన్నారు. పార్టీకి ప్రతికక్షులులేరు. అందుచే ప్రతి జనరలుబాడీ, కార్యవర్గ సమావేశంముందు ఫ్రాక్షను సమావేశమవ్వాలిసిన అవుసరం లేకుండాబోయింది. ఫ్రాక్షను మీటింగు జరిపి, అన్ని తీర్మానాలు చర్చించడం, మరల కార్యవర్గంలోనో, జనరలుబాడీలోనో చర్చించడమంటే రెట్టింపుపని చేయడమవుతుంది. అందుచే సామాన్యంగా కార్యవర్గం లేక జనరలుబాడీ మీటింగుముందు ఫ్రాక్షను సమావేశం అవుసరంలేదని తీర్మానాలు సరాసరి వాటిల్లోనే చర్చించవచ్చుననీ పార్టీ నిర్ణయించింది. (అత్యవసర సమయాలలో మాత్రం ఫ్రాక్షను మీటింగులను జరపాలి.)

ప్రజాసంస్థల జనరలుబాడీలు

ఇప్పుడు రైతుసంఘాలకు జనరలుబాడీ సమావేశాలున్నవి. మిగతా సంఘాలకు చాలవాటికి లేవు. మహాసభలలోని విషయనిర్ణయ సభలే తరువాత రైతుసంఘ జనరల్‌బాడీలుగా పనిచేస్తున్నవి. ఈ జనరలుబాడీ సమావేశాలు సామాన్యంగా కార్యనిర్వాహకవర్గం చేసిన తీర్మానాలకు, కొద్ది సవరణలతో ఆమోదం తెలపడం తప్ప అవిచేసే పని ఏమీలేదు. జనరలుబాడీలోని ప్రతిసభ్యుడు రిపోర్టు ఇవ్వడంగాని, ప్రతిసభ్యునికి పని ఇవ్వడంగాని సాధ్యంగాదు. లేక ఒక జనరలు బాడీలోని వివిధ తాలూకాలు గ్రూపులుగాచేసి, తాలూకా రిపోర్టులు ఇప్పించి తాలూకా మొత్తంమీద పని ఇద్దామంటే, తాలూకా కార్యనిర్వాహకవర్గాలు ఆ పనికి బాగుగా వినియోగపడతాయి. జిల్లా కార్యవర్గంలో ప్రతి తాలూకా యొక్క ముఖ్యులు ఉంటారు. జిల్లా కార్యవర్గంలో తాలూకా వారీగా పని ఇవ్వవచ్చును. కనుక జనరలు బాడీలు మహాసభకు-మహాసభకు మధ్యకాలంలో ఏవైనా పెద్ద సమస్యలలో, జనరలుతీర్మానం చేయడానికి మాత్రమే ఉపయోగించాలి. మిగతా సమయాలన్నిటిలోనూ కార్యనిర్వాహకవర్గాలు రెగ్యులరుగా సమావేశమవుతూ, పనిని నిర్వహిస్తూ ఉండాలి. అందువల్ల ఇప్పుడు జనరలుబాడీలు లేని సంఘాలకు, కొత్తగా వాటిని ఆర్గనైజుచెయ్యాలసిన అవుసరంలేదు. ఏదైనా అంత అవుసరం వస్తే తాలూకా కార్యనిర్వాహకవర్గా లన్నిటినీగాని లేక గ్రామసంఘాల డెలిగేట్లను గాని సమావేశపరచ వచ్చును.

సాంవత్సరిక మహాసభలలో సైతం రైతుసంఘానికి వలె విషయనిర్ణయ సభలు వేరుగాను, డెలిగేట్లసమావేశం వేరుగాను ఆర్గనైజు చేయాలిసిన అవుసరం లేదు. కార్యనిర్వాహకవర్గం తయారుచేసిన తీర్మానాలను, ఇతరులు ఇచ్చిన తీర్మానాలను, నేరుగా డెలిగేట్ల సమావేశంలోనే చర్చించవచ్చును. అటుతర్వాత బహిరంగసభలో డెలిగేట్ల సమావేశం ఆమోదించిన తీర్మానాలను గూర్చి, ప్రజలకర్థమయ్యే రీతిని [illegible] ఉపన్యాసం ఇవ్వవచ్చును.

కార్యనిర్వాహకవర్గ సమావేశాలు ఎలా జరగాలి

ఇప్పుడు జరిగే కార్యవర్గాలు సంఘాన్నెదుర్కొన్న సమస్యలమీద, జనరలుగా తీర్మానాలు చేస్తున్నాయి. సభ్యుల పనిని తనిఖీచేయడంగాని, ఒక్కొక్క సభ్యునికి వ్యక్తి బాధ్యతమీద పని ఇవ్వడంగాని జరగడంలేదు. "ఈ పని

చెయ్యాలి. ఆ పని చేయ్యాలి" అని జనరలు తీర్మానాలు చేయడం, ఎవరు చెయ్యాలి, ఎంతకాలంలో పూర్తిచెయ్యాలి, ఎలా చెయ్యాలి, అని వివరంగా చర్చించక పోవడంవల్ల, సామాన్యంగా తీర్మానాలు అమలుజరుగుటలేదు. కనుక ఇకముందునుంచీ, కార్యవర్గాలలో వ్యక్తి బాధ్యతమీద పనులు ఇవ్వాలి ; తనిఖీ చెయ్యాలి.

ప్రజాసంఘాలలోని పార్టీసభ్యులు పార్టీని ఎలా బలపర్చాలి ?

ఏ ప్రజారంగంలో ఉన్న పార్టీసభ్యుడు ఆ ప్రజారంగానికి సంబంధించిన వ్యవహార జ్ఞానాన్ని, సమస్యలను, ఆ ప్రజల జీవితాన్ని క్షుణ్ణంగా తెలుసుకొని వుండాలి; ఆ ప్రజారంగంలో ఆదర్శప్రాయుడుగా వుండాలి; అప్పుడే ఆ రంగ ప్రజలు అతనిని తమ నాయకునిగా చూస్తారు. ఉదాహరణ : రైతురంగంలోని కామ్రేడ్సు రైతులకు సంబంధించిన చట్టాలనూ, వాటిని రైతులకుపయుక్తంగా ఎలా ఉపయోగించాలనే విషయాన్ని తెలుసుకొనివుండాలి. వ్యవసాయ సంబంధమైన విషయాలనుగూడ తెలుసుకొని ఉండాలి. వ్యవసాయంచేస్తూ రైతుసంఘములో పనిజేస్తున్న కామ్రేడ్సు, ఆదర్శ వ్యవసాయకులుగా వుండాలి. అందరికన్నా యెక్కువ పంటలు పండించాలి.

అలాగే వ్యవసాయకూలీ సంఘాల్లో పనిజేసే కామ్రేడ్సు వ్యవసాయాన్ని గూర్చి పూర్తిగా తెలిసివుండాలి. లేబరు డిపార్టుమెంటు మొదలైన ప్రభుత్వ డిపార్టుమెంటులతో వ్యవహరించడం తెలుసుకొనివుండాలి.

యువజన కామ్రేడ్సు మంచి ఆటగాండ్రు, పాటగాండ్రు అయివుండాలి.

విద్యార్థి కామ్రేడ్సు మంచి విద్యావంతులు, మంచి వక్తలు అయివుండాలి. క్లాసులో ఫస్టుమార్కులు తెచ్చుకోడానికి ప్రయత్నించాలి. ఆటలు పాటల్లో ప్రవీణులయి వుండాలి. వివిధ దేశాల విద్యా విధానాలు, వాటిలోని లోపాలోపాలు తెలుసుకొని వుండాలి.

మహిళా కామ్రేడ్సు శిశుపోషణ, గర్భిణీస్త్రీల విషయాల్లోను, వంట మొదలైనవాటిలో ప్రవీణలయివుండాలి. ఇటివద్ద పనిచేసుకుంటూ, మహిళా సంఘపు పనిచూచే కామ్రేడ్సు పాడి (పశువులను పెంచుట) లో ఆదర్శంగా వుండాలి.

ఉపాధ్యాయ కామ్రేడ్సు తాము పనిజేసే స్కూళ్ళను మొదలుస్కూళ్లుగా తయారుచెయ్యాలి. పిల్లలు మా పంతులుగారిదగ్గరకు యెప్పుడు వెళతామా అని ఉవ్విళ్ళూరేటట్లు ఉండాలి. సెంటరుక్లాసుల్లో మొదలులెసన్ చెప్పడంలోనూ, వ్యాసం వ్రాయడంలోనూ ఫస్టుగా వుండాలి. ఉపాధ్యాయులకు సంబంధించిన జి. ఓ. లు, ఎడ్యుకేషనల్ డిపార్టుమెంటుకు సంబంధించిన విషయాలు క్షుణ్ణంగా తెలుసుకొని ఉండాలి. వివిధ దేశాల విద్యావిధానంలోని లోటుపాట్లు గూడ తెలుసుకొని ఉండాలి,

కార్మికసంఘాల్లో పనిజేసే కామ్రేడ్సు కార్మికులకు సంబంధించిన చట్టాలను, వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి. అంతేగాక, యే సంఘంలో పనిజేస్తున్నాడో ఆ సంఘానికి సంబంధించిన కార్మికులయొక్క యంత్రాలు ఉత్పత్తి విధానాన్నిగూర్చి తెలుసుకోవాలి. పార్టుటైము కామ్రేడ్సు తమవృత్తిని నిర్వహించడంలో ఆదర్శప్రాయులయివుండాలి.

పార్టీ పాలసీని ఎలా ప్రచారంచెయ్యాలి :— మన పార్టీ పాలసీని, కార్యక్రమాన్ని "ఇది కమ్యూనిస్టుపార్టీ పాలసీ కార్యక్రమం. ఇది చాల మంచిది. గనుక మీరంతా స్వీకరించాలి" అన్నట్లుగా ప్రచారం చేయకూడదు. ఇందువల్ల ఆ సంఘంలోని యితరులు యిది కమ్యూనిస్టు పార్టీకి అనుబంధ సంఘమని భావించి, మనకు దూరమవుతారు. ప్రతికక్షులు మనమీద దుష్ప్రచారం చేయడానికి, పోటీసంఘాలు పెట్టడానికి సాకులిచ్చినవార మవుతాము.

మన పార్టీ కార్యక్రమాన్ని పాలసీని ఆయా ప్రజారంగాలకు అన్వయించి ఆ యా ప్రజల జీవితానికి అన్వయించి, ఇవి యెలా మంచివో కమ్యూనిస్టుపార్టీ పేరు యెత్తకుండానే, వారికి నచ్చజెప్పాలి. ఈ పాలసీ వారికి లాభదాయకం గనుక స్వీకరించమని చెప్పాలి. ఈవిధంగా ఆ యా వర్గాల (రైతు, కూలీ, కార్మిక), సెక్షనుల ప్రజలను (యువకులు, మహిళా, విద్యార్థి) పార్టీ పాలసీ వైపుకు మొగ్గేలాచేయాలి. అయితే యిలా పనిచేస్తూ, తాము కమ్యూనిస్టులమనే విషయాన్ని యితరులకు బాగా తెలియజేయాలి. కమ్యూనిస్టు పార్టీకూడ ఇలాంటి కార్యక్రమంతో పనిచేస్తూవుందని ప్రజలు గ్రహించేటట్లు చేయాలి.

మిలిటెంట్లు :—పార్టీసభ్యులు ప్రజలమధ్య పనిచేస్తున్నపుడు, అనేకమంది మిలిటెంట్లు బయలుదేరుతారు. వీరికోసం ప్రతి పార్టీసభ్యుడు ఒక కన్నువెట్టుకు

చూస్తూ ఉండాలి. మిలిటెంటు కనబడగానే, అతనితో దగ్గరసంబంధం పెట్టుకోవాలి. రాజకీయాలనుగూర్చి అతనితో చర్చిస్తూ ఉండాలి. అతనికి పార్టీని, పార్టీ పాలసీనిగూర్చి చెబుతూ, పార్టీయడల విశ్వాసం అభిమానం గలుగజేయాలి. అతనికి పని ఇస్తూ, పనిచేసే విధం నేర్పుతూ, అతనిని పరీక్షించాలి. చివరకు అతనిని పార్టీలోకి తీసుకోవాలి.

ఈ విధంగా పార్టీని తాను పనిచేస్తున్న ప్రజారంగంలో అభివృద్ధిచేయాలి.

ప్రజాశక్తి:—ప్రజాశక్తి కమ్యూనిస్టు పార్టీ పత్రిక అయినప్పటికీ, వివిధ ప్రజారంగాల వార్తలను ఎక్కువగా ప్రకటించేది ఇదే గనుక, ప్రజాసంఘాలలో ప్రజాశక్తి కొనమని ప్రచారం చేయవచ్చును. కొంతమంది పార్టీకార్యేడ్సు ప్రతికక్షులు తమను కమ్యూనిస్టు ప్రచారం చేసుకుపోతున్నారని నిందించి పోతారేమో అనే భయంతో, తమ ప్రజాసంఘాల్లో ప్రజాశక్తి పేరు ఎత్తడంలేదు. ఇది పొరపాటు. వారి వార్తలను ప్రకటించుతున్నప్పుడు, ప్రజలు తప్పక మన పత్రికను అభిమానిస్తారు.

పార్టీఫండు :—ప్రజాసంఘాలలో పనిజేసే కార్యేడ్సు ప్రజల్లో వ్యక్తిగతంగా పార్టీఫండును ప్రోగుచెయ్యాలి. కమ్యూనిస్టునని చెప్పుకోడానికి ఏమీ జంకగూడదు. ఇప్పుడు ప్రజలకు సేవజేస్తోంది చాలవరకూ కమ్యూనిస్టులే. కాని ప్రజాసంఘాల ఫండులనుండి, కమ్యూనిస్టుపార్టీకి ఫండులు ఇవ్వగూడదు. దీనివల్ల కమ్యూనిస్టుపార్టీ అంటే అభిమానంలేని ప్రజల్లో మన ప్రతికక్షులు దుష్ప్రచారం చేయడానికి వీలు చిక్కుతుంది.

12 ప్రజారంగాలు

క్రిందటి అధ్యాయంలో పార్టీకి ప్రజాసంఘాలకు ఎటువంటి సంబంధముండాలో చర్చింపబడింది. దీనిలో ఒక్కొక్క ప్రజారంగం ప్రాముఖ్యత, దాని ప్రధానసమస్యలు, ఆరంగానికి సంబంధించిన స్థానికసంఘాన్ని ఎలా పనిచేయించాలి అనే విషయాలు చర్చించబడతాయి. వివిధ ప్రజారంగాల యెడల ఆర్గనైజర్లకు సరియైనదృక్పథం ఆర్గనైజర్లకు ఏర్పరచడం, గ్రామప్రజాసంఘాలను పనిచేయించే విధానాన్ని ఆర్గనైజర్లకు తెలియజేయడం. ఈ వ్యాసంయొక్క ఉద్దేశ్యం.

ఏ ప్రజాసంఘ మయినాసరే ప్రజలయొక్క ఇబ్బందులను ఎప్పటికప్పుడు తీసుకొని, వాటి నివారణోపాయాలు ఆలోచించాలంటే, గ్రామసంఘాలు చురుకుగా పనిచెయ్యాలి. ఎందువల్లనంటే గ్రామసంఘాలు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి, ప్రజలకు చాల అందుబాటులో ఉంటాయి. అవే ప్రజలయొక్క ఇబ్బందులను వెంటనే తెలుసుకోగలుగుతాయి. కాని ఇప్పుడు మన ప్రజాసంఘాలయొక్క గ్రామసంఘాలలో చాల కొద్దిసంఖ్య మాత్రమే రిపోర్టులు పంపడం, తమతమ గ్రామాల్లో ప్రజలకువచ్చిన ఇబ్బందులను ఎప్పటికప్పుడు తాలూకా జిల్లాసంఘాలకు తెలియపరచడం, చేస్తున్నాయి. ఈ పని అయినా మిగతాసంఘాలు చేయడంలేదు. కొన్ని సంఘాలకు నామమాత్రమైన ఎన్నికలు సైతం జరగడంలేదు. చురుకుగా పనిచేస్తున్న గ్రామసంఘాలు సైతం గ్రామంలో వచ్చిన ప్రతిసమస్యను తీసుకొని వాటికి పరిష్కారమార్గం చూపించి, ప్రజలకు మనయడల తమకు నాయకత్వం వహించగలరనే విశ్వాసాన్ని గల్గించలేకపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో మనపార్టీని ప్రజా పార్టీగా చేయాలేంటే, ప్రజాసంఘాలు నిజమైన ప్రజానాయకత్వం గల సంఘాలుగా సజీవంగా చేయాలంటే, ప్రజాసంఘాలు ఉన్నతస్థాయికి పోవాలంటే గ్రామ, పేట సంఘాలను చురుకుగా పనిచేయించాలి. ఇదే నేడు మనలను ప్రతి ప్రజారంగంలోనూ ఎదుర్కొంటున్న ప్రధాన బాధ్యత.

వివిధ ప్రజాసంఘాలను ఉన్నతస్థాయికి తీసుకుపోవాలంటే, ఆయా సంఘాల లోని మనకార్యేడ్సు ఆయా సంఘాల ప్రజాసమస్యలను క్షుణ్ణంగా తెలుసు

కోవాలి; వాటికి సంబంధించిన వ్యవహారజ్ఞానాన్ని సంపాదించాలి; ప్రతి సంఘంలోనూ ఉన్న కామ్రేడ్సు ఆ సంఘంలో అన్నివిషయాలలోనూ ఆదర్శప్రాయులుగా తయారు గావాలి.

ఆంధ్రదేశంలో పార్టీ ప్రస్తుతం పనిచేస్తున్న వివిధ ప్రజాసంఘాలన్నిటికీ, ఒకదానితో మరొకదానికి సంబంధముంది. ఒకదానియొక్క అభివృద్ధి, మరొకదానికి సహాయకారిగా వుంటుంది. ప్రస్తుతం దేశాన్నెదుర్కొన్న ఆహార సమస్యను పరిష్కరించడానికి, రాజకీయ ప్రతిష్టంభనను అంతమొందించి, జాతీయైక్యత సాధించి, జాతీయ ప్రభుత్వాన్ని సంపాదించడానికి అన్ని సంఘాలు ఐక్యంగా కృషిచెయ్యాలి. కాని పై జెప్పబడిన ఆహారసమస్య, రాజకీయ ప్రతిష్టంభన మొదలైన జనరలు సమస్యలేగాక, దైనందిన సమస్యలలోగూడ కొన్ని కొన్ని సంఘాలకు దగ్గర సంబంధముంది. ఒక సమస్యకు సంబంధమున్న సంఘాలన్నీకలిసి పనిజేస్తేనేగాని ఆ సమస్య తేలికగా పరిష్కారంగాదు. అందువల్ల దైనందిన సమస్యలలో దగ్గర సంబంధమున్న సంఘాలు ఒకదానితో మరొకటి రెగ్యులరు సంబంధాలు పెట్టుకుంటూ పనిజేస్తూవుండాలి. ఈ దృష్టితోజూస్తే వివిధ ప్రజాసంఘాలను మూడు గ్రూపులుగా విభజింపవచ్చును. (1) రైతు. కూలి సంఘాలు, (2) విద్యార్థి, యువజన, ప్రజారక్షణదళం, ఉపాధ్యాయ, మహిళా, బాల, అభ్యుదయ రచయిత రంగాలు. (3) మునిసిపలు, రైల్వే, చేనేతకార్మిక మొదలైన కార్మిక సంఘాలు.

రైతు - కూలీ సంఘాలు

ఈ రెండు సంఘాలయొక్క నేటి ప్రధాన దేశభక్తపూరిత కర్తవ్యం అధికాహారోత్పత్తి, ప్రభుత్వంయిచ్చిన ఎరువులను వుపయోగించుకోవడంలోను, మురుగు కాల్వలు, పంటకాల్వలు మరమ్మతు విషయంలోనూ, పంట చెరువుల మరమ్మతు విషయంలోనూ, బంజరు భూములను సాగుచేయు విషయంలోనూ పై రెండు సంఘాలుకలిసి పనిచెయ్యాలి. అధికాహారోత్పత్తికి కూలీల నుత్సాహపరచి, ముందుకు తీసుకురావాలంటే, కూలీలకు న్యాయమైన కూలిని రైతులచే రైతుసంఘ మిప్పించాలి. కూలిసంఘం కూలీలచే సక్రమంగా పనిచేయించాలి. వడ్లబస్తా యెన్ని రూపాయలు అమ్మితే అన్ని అణాలు రోజుకు కనీసకూలి అనీ,

దినానికి 7 గంటలు పని అనీ మనపార్టీ షుమారు 3 సం॥ క్రితం కూలిరేటు నిర్ణయించింది. ఈ సూత్రాన్నే ఆధారంగా జేసుకొని, ఆ యా ప్రాంత, గ్రామ పరిస్థితి ననుసరించి కూలీ రేటులు, పనిజేసే టైమును నిర్ణయించమనీ, కూలి కూలీల అవుసరాన్నిబట్టి డబ్బురూపంలోగానీ, ధాన్యరూపంలోగానీ లేక డబ్బు, ధాన్యం రెండూ కలిపిగాని యిప్పించమనీ సలహా యిచ్చింది. ఈ సూత్రాన్ననుసరించే కామ్రేడ్సు కూలిరేటు నిర్ణయించడానికి ప్రయత్నించారు. సాధారణంగా పై రేటును రైతులు పని వత్తిడిగా ఉన్న ఊడ్పులు, కోతల్లో అంగీకరించినా, పని వత్తిడి అంతగాలేని పెసరగాయ, మినపగాయ తీతల్లోనూ, జనపకోతల్లోనూ పై రేటునన్నుసరించి కూలిని యిచ్చుటలేదు. చాల తక్కువగా యిస్తున్నారు. అందుచే కూలీలకు నష్టం కలుగుతోంది. మన నినాదంమీద విశ్వాసంగూడ సన్నగిలుతోంది. ఇందుచే 1944 జనవరిలో సమావేశమయిన రాష్ట్రప్లీనం యీ క్రింది సూచననిచ్చింది. దీన్ని అనుసరించి కామ్రేడ్సు కూలీ రేటును యిక ముందు నిర్ణయించాలి.

(1) పనికాలం 7 గంటలు (కూలీలు యింటివద్దనుండి బయలుదేరి, సాయంత్రం చేలోనుంచి లేచేవరకూ, మధ్యాహ్నం కూలీలు భోజనానికి ఖర్చుపెట్టే టైముగాక, 7 గంటల నికరపు పని).

(2) ఊడ్పులు,కోతలు మొదలైన పని వత్తిడిరోజుల్లో 1రు.కి 0-1-0.

(3) జనపకోతలు, మినప, పెసర తీతలు, కలుపు వగైరా రోజుల్లో 1 రు. కి 0—0—9.

(4) ఇతర రోజుల్లో 1 రు. కి 0-0-6. ఈ 0-0-6 కు కూలి ఎప్పుడూ తగ్గకూడదు.

పై సూత్రాన్ననుసరించి కామ్రేడ్సు సంవత్సరానికంతకూ ఒకేమారు కూలి రేట్లు నిర్ణయించాలి. (ఇంకా వివరాలకు 2/44 నెం. పార్టీలెటరు చదవాలి).

కౌలుదార్ల సమస్య:— మనదేశంలో ఒకమూల భూమి కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరింపబడుతున్నా, ఆధునిక పద్ధతులమీద (ట్రాక్టర్లు, కంబైన్లు మొదలైన యంత్రాలు) వ్యవసాయం సాగించకపోవడం వల్ల, ధనికరైతులు తమ భూమినంతా సాగుచేయలేక కౌలుకు ఇస్తున్నారు. కొంతమంది సోమరు

లైన మధ్యతరగతి రైతులు, బీదరైతులు గూడ భూమిని కౌలుకు ఇస్తున్నారు. ఈభూమిని బీదరైతులు, వ్యవసాయ కూలీలు కౌలుకు తీసుకుంటున్నారు. అందుచేత గ్రామంలో కౌలుసమస్యగూడ పెద్ద సమస్యగానే పరిణమించింది.

కౌలురేటు చాల ఎక్కువగా ఉంటోంది. చాలచోట్ల పండిన ధాన్యమంతా కౌలుక్రింద ఇస్తున్నారు. రెండవపంట, గడ్డికి మాత్రమే కౌలుదార్లు ఆశపడుతున్నారు. పంట సరిగా పండని కొన్నిసంవత్సరాలలో రెండవపంట గడ్డిగూడ కౌలుక్రింద ఇచ్చివేయవలసి వస్తోంది. సంవత్సరమంతా పనిచేసి, పండించిన కౌలుదారును ఈవిధంగా దోచుకోవడం చాల అన్యాయం. గానకౌలుదారుకు మొదటి పంటలో సైతం కొంత మిగిలేలాగున, కౌలు తీసుకునేలా చెయ్యాలి. ఇందుకు రైతుసంఘాలు పూనుకోవాలి. కౌలుదార్లలో చైతన్యం కలుగజెయ్యాలి. రైతులలో న్యాయబుద్ధిని రేకెత్తించాలి. మన కామ్రేడ్సు ఇందుకు ఆదర్శంగా ముందుకు రావాలి. భూములను కౌలుకిస్తున్న కామ్రేడ్సు తక్కువ కౌలుకు ఇవ్వాలి.

రైతు-కూలీ సామరస్యానికి చేయవలసిన నిర్మాణ బాధ్యతలు

జిల్లా వ్యవసాయ కూలీసంఘాలను రాష్ట్ర రైతుసంఘానికి అనుబంధించాలని, రైతు-కూలీ ఐక్య ఉద్యమాన్ని రాష్ట్రంమీద నిర్మించాలనీ పార్టీయొక్క ఆశయం. రాష్ట్ర రైతుసంఘం ఈ విషయాన్ని అంగీకరించి, 1943 ప్రారంభంలో రైతు-కూలీ సామరస్యాన్నిగూర్చి వివరమైన తీర్మానం జేసింది. జిల్లా వ్యవసాయకూలీ సంఘాలను రాష్ట్రసంఘానికి అఫిలియేటు చేయాలంటే, రైతుసంఘాలకు-కూలీ సంఘాలకు దగ్గర సంబంధ మేర్పరచాలి. ఒక సంఘంయొక్క సమస్యలను మరొకసంఘం రెగ్యులరుగా తెలుసుకుంటూ ఉండాలి. అందుకు తాలూకా వ్యవసాయ కూలీసంఘ సమావేశాలకు తాలూకా రైతుసంఘ ప్రతినిధులను ఆహ్వానించడం, అలాగే తాలూకా రైతుసంఘ సమావేశాలకు తాలూకా వ్యవసాయకూలీ సంఘ ప్రతినిధులను ఆహ్వానించడం, చెయ్యాలి. ఇలాగే జిల్లా సంఘాలకు గూడ చెయ్యాలి. రాష్ట్రరైతుసంఘ సమావేశానికి వివిధజిల్లాల వ్యవసాయ కూలీ ప్రతినిధులను గూడ పిలవాలి. ఇలాగే గ్రామాల్లో గ్రామసమస్యలు వచ్చినప్పుడు, ప్రతి సమస్యమీద గ్రామ వ్యవసాయకూలీ నాయకులనుగూడ, గ్రామ సమావేశాలకు పిలుస్తూ ఉండాలి.

విద్యార్థి, యువజన, ప్రజారక్షణదళం వగైరా

ఈ రంగాలన్నీ దాదాపు యువకులకు చెందినవే. ప్రస్తుతం హిందూమహాసభ, ఆర్. యస్. యస్. లు హిందూ యువకులలో మత అహంకారాన్ని రెచ్చగొట్టి, అవి నాజీ పద్ధతులమీద ఆర్గనైజు చేయబూనుకున్నాయి. అంతేగాక చాలమంది యువకులు దురలవాట్లకు లోనై, తాగుబోతులు, జూదకోరులుగా తయారవుతున్నారు.

యువకులను మత అహంకార సంస్థలనుండీ, దురలవాట్లనుండీ రక్షించి, వారిలో సరియైన జాతీయ భావాలు ఉద్భవించేలాచేయడమే పైసంస్థల కర్తవ్యం.

ఆటలు, స్పోర్ట్సు, డ్రిల్లు మొదలైనవాటిద్వారా యువకులలో డిసిప్లినును ఆరోగ్యాన్ని గలుగజేస్తాయి.

యువకులయొక్క విద్యాభివృద్ధికి రాత్రి పాఠశాలలు మొదలైనవాటిద్వారా ప్రయత్నించుతాయి.

ప్రజల్లోవున్న మూఢ నమ్మకాలను, సాంఘిక దురాచారాలను పోగొట్టడానికి, ప్రజల్లో రాజకీయ ప్రబోధం చేయడానికి కృషిజేస్తాయి. అందుకు నాటకాలు, పాటలు, బుర్రకథలు, చర్చలు (Debates) మొదలైన వైజ్ఞానిక పద్ధతులనన్నిటినీ ఉపయోగించుతాయి.

ఆరోగ్యంగాను బలంగాను వుండుకునే పద్ధతులనుగూర్చి ప్రచారంచేస్తాయి.

జబ్బులు, అంటువ్యాధులు మొదలైనవి యెలా వస్తాయో, వాటినుండి యెలా కాపాడుకోవాలో ప్రజల్లో ప్రచారంజేస్తాయి. జబ్బులు, జాడ్యాలు వచ్చినప్పుడు ప్రజలకు సహాయం జేస్తాయి. ఈ విధమైన జీవకారుణ్య పనిని (Social service) చేస్తాయి. ఆటలు, పాటలు, వైజ్ఞానిక ప్రచారం జీవకారుణ్యపు పని మొదలైనవి పై సంఘాలన్నిటి కార్యక్రమంలో భాగాలే. అందుచే యీ సమస్యలు వచ్చినప్పుడు పై సంఘాలు సంప్రదించుకొని పనిచేస్తూవుండాలి.

కార్మిక సంఘాలు

పట్టణాలలో మన పార్టీకి పునాది కార్మికసంఘాలే. కమ్యూనిస్టు పార్టీని కార్మికులు తమ పార్టీగా భావించుతారు.

కార్మికులకు చౌకడిపోలు, అధికధరల అలవెన్సు మొదలైన సమస్యలు జనరలుగా ఉంటాయి. కనుక ప్రతి కార్మికసంఘంయొక్క కోర్కె వెనుక మిగతా కార్మికసంఘాల బలాన్నంతనూ సమీకరించుతూ, ఐక్య కార్మికశక్తితో ముందుకు పోవాలి.

రైతు సంఘం

ఆంధ్రరాష్ట్రంలో రైతులు రెండు సత్యాగ్రహోద్యమాలలో పాల్గొన్నారు. వారిలో మిగతావర్గాలన్నిటిలోకన్న ఎక్కువ రాజకీయచైతన్యముంది. ఆంధ్రలో మనపార్టీగూడ సత్యాగ్రహోద్యమంలో పాల్గొన్న రైతుయువకులనుండే పుట్టింది. నేటికీ పార్టీసభ్యులలో 2/3 మంది రైతులనుంచి వచ్చినవారే. పార్టీకి ధనసహాయంగూడ ఎక్కువగా రైతులనుండే వస్తూఉంది. గ్రామాల్లో మనపార్టీ కూలీ, మహిళా రంగాలను అభివృద్ధిచేయడానికి, రైతుసంఘ సహాయం ఎంతోఅవుసరం. ఒకగ్రామంలో రైతుసంఘం బలంగా ఉందంటే, కూలీసంఘాన్ని సునాయాసంగా నిర్మించవచ్చు. కూలీ-రైతు సామరస్యాన్ని తేలికగా సాధించవచ్చు. అలాగే మహిళాసంఘంగూడ పురుషులనుండి ఆటంకం లేకుండా అభివృద్ధి అవుతుంది. పైచారిత్రిక కారణాలవల్ల రైతురంగం పార్టీదృష్టిలో ప్రముఖరంగంగా ఉంది.

ముఖ్య సమస్యలు

(1) వడ్లబస్తా 11 రు. కంట్రోలుచేయడం కరువురాకుండా చేయడానికి అవుసరమని రైతులే ముందుకువచ్చి ఆందోళన చేసేటట్లు చేయాలి. పైధరకు ఆందోళనచేస్తూ, ప్రభుత్వం నిర్ణయించిన రేటుకు ధాన్యాన్ని ప్రభుత్వానికే అమ్మేటట్లు, తిండిదొంగలు హెచ్చుధర లిస్తామన్నా వారికి అమ్మకుండా ఉండేటట్లు చెయ్యాలి. ఆంధ్రదేశం బెంగాలుకాకుండా ఉండాలంటే పై నినాదం రైతులచే ఆచరణలో బెట్టించుట అవుసరం. ధనికరైతుల నినాదమైన "ధాన్యానికి కంట్రోలు అవుసరంలేదు" అనేదాన్ని, రామచంద్రారెడ్డి, రంగా గ్రూపులు ప్రచారం చేస్తున్నాయి. వీరి దేశవిధ్వంసక నినాదాన్ని బట్టబయలు చెయ్యాలి.

(2) న్యాయమైన కూలిని రైతులచే కూలీలకిప్పించడం, దీన్నిగూర్చి యింతకుముందే వివరంగా వ్రాయబడింది.

(3) మద్రాసు ప్రభుత్వం అధికాహారోత్పత్తికోసం (ఎరువులకు 75 లక్షలు, విత్తనాలకు 45 లక్షలు) యిచ్చిన 1 లక్ష, 20 వేల రూపాయల రుణాన్ని సక్రమంగా వినియోగించుకోవాలి. ఇంతవరకు కృష్ణా, గుంటూరు జిల్లాలుతప్ప మిగతా జిల్లాలు యీ రుణసౌకర్యాలను ఉపయోగించుకోవడంలేదు.

(4) డెల్టాప్రాంతాలలో ప్రజలను సమీకరించి చిన్నచిన్న పంటకాల్వలను, మురుగుకాల్వలను రైతులు స్వయంగా బాగుచేయించుకొనేలా చేయాలి. పెద్ద కాల్వలను బాగుచేయడానికి ప్రభుత్వంమీద ప్రజలను సమీకరించి వత్తిడితేవాలి.

(5) రాయలసీమ, పల్నాడు మొదలైన మెట్టప్రాంతాలలో ఈసంవత్సరం గూడ పంటలుపోయినాయి. అక్కడ ప్రభుత్వం కరువుపనులకు వెంటనే పూనుకునేలా చేయ్యాలి. ఈ కరువు పనులు రాళ్ళు కొట్టించడం, రోడ్లువేయడం మొదలైనవిగాక, ఆహారసమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి తోడ్పడే మైనరు ప్రాజెక్టులను నిర్మించుట, చెరువులు మరమ్మతు చేయించుటకు తోడ్పడేవిగా ఉండాలి.

ఈ ప్రాంతాలలో పండిన కాస్తపంటను దాచివేసిన తిండిదొంగల ధాన్యాన్ని బయటికి లాగడంలో ప్రభుత్వానికి తోడ్పడాలి. ఈ పనిచేస్తూ మిగులు ప్రాంతాల నుండి ధాన్యం తెప్పించుటకు ఆందోళన చెయ్యాలి. ఈ ధాన్యాన్ని సాధ్యమైనంత వరకూ ధాన్యం మాత్రం సప్లయిచేసే కోఆపరేటివు స్టోర్సుద్వారా, ప్రజలకు పంపిణీ చేయించాలి.

(6) రామచంద్రారెడ్డి సంఘం, గుంటూరుసీమ రైతుసంఘం, రంగా ముఠా రైతుసంఘాలు మొదలైన పోటీసంఘాల నాయకులను రైతులముందు బట్టబయలుజేసి, వారిని ప్రజలనుండి దూరంచెయ్యాలి.

(7) గ్రామ రైతుసంఘాన్ని చురుకుగా పనిచేయించాలి. అందుకు గ్రామ వర్కర్లకు వ్యవహారజ్ఞానం కల్గించాలి వారికి సర్వేచేయడం, నోట్లు, దస్తావేజులు వ్రాయడం నేర్పాలి. రైతులకు గావలసిన ఈ పనులను నేర్చుకొంటే రైతులు కరణాలు, పెత్తనదార్ల వద్దకు పోనవుసరంలేదు.

గ్రామరైతుసంఘ ఆఫీసు పెట్టాలి. ఈ ఆఫీసు గ్రామ పార్టీ ఆఫీసుతో కలిసి ఉండవచ్చును. ఈ ఆఫీసులో ఉండవలసిన వస్తువులు, ఫైళ్ళు—

(1) గ్రామ ఫీల్డుబుక్కు, గ్రామ ప్లాను, సర్వేసెటిలుమెంటు రిజిష్టరు. అవకాశముంటే శాష్టాబు, గొలుసు.

(2) గ్రామోద్యోగుల మాన్యుయల్. దీనిలో గ్రామ మున్సిపు, కరణం చేయవలసిన విధులుంటాయి.

(3) పైసంఘాల సర్క్యులర్ల ఫైలు, పైసంఘానికి పంపే రిపోర్టుల కాపీల ఫైలు, మినిట్సుబుక్కు, వీలుంటే ప్రజాశక్తి, దినపత్రికల ఫైళ్ళు. రైతు సమస్యల పుస్తకం.

(4) రైతుసంఘ ఫండు వసూలు :— (అ) అన్న తమ్ముల భాగాలు సర్వేచేసి పంచిపెట్టటం, రైతులు భూములను అమ్మినప్పుడు, కొన్నప్పుడు వాటిని కొలిచిపెట్టడం మొదలైన పనులద్వారా రైతుసంఘం ఫండును సంపాదించ వచ్చును.

నోట్లు దస్తావేజులు వ్రాసిపెట్టడంద్వారాగూడా రైతుసంఘఫండు వసూలు చేయవచ్చును. పై పనులకు కరణాలు చాల డబ్బు గుంజుతుంటారు. పైగా పేచీలుపెడతారు. పై పనులు చేసిపెడితే రైతులు మనసు సంతోషంగా ఫండు యిస్తారు.

(ఆ) పంటల సమయంలో కళ్ళాలవద్దకుపోయి ధాన్యం వసూలుచేస్తారు. ఈవిధంగా చాల ధాన్యం పోగుబడుతుంది.

(ఇ) కోత కట్టివేత ద్వారాగూడ డబ్బు సంపాదించవచ్చును.

వ్యవసాయ కూలీ సంఘం

ఆంధ్రలో ప్రజల్లో షుమారు 100 కి 50 మంది- వ్యవసాయ కూలీలు. వీరు రాజకీయంగానూ, ఆర్థికంగానూ, సాంఘికంగానూ చాల వెనుకబడివున్నారు. సామ్రాజ్యవాదులు మిషనరీలద్వారాను, ఆది-ఆంధ్ర నాయకులద్వారాను తమ పెత్తనం కాపాడుకోవడానికి, స్వాతంత్ర్యోద్యమానికి అడ్డు తగలడానికి ఉపయోగించుకోవాలని చూచారు. గ్రామ పెత్తనదార్లుగూడ గ్రామంలోని కులపెద్దల ద్వారా వ్యవసాయకూలీలను తమ పెత్తనం కాపాడుకోడానికి ఉపయోగించబూను కొంటున్నారు. కాని యుద్ధకాలంలో జీవిత పరిమాణం విపరీతంగా పెరగడం వలన వ్యవసాయ కూలీలలో సంచలనం కలిగింది. మన పార్టీ యీ సంచల

నాన్ని వ్యవసాయకూలీ సంఘాలలో ఆర్గనైజు చేసింది. ఆకలియాత్రలు నడిపింది. పనిలేని కార్తీకమాసంలో ధాన్యపుఫండులు వసూలుచేసి, దోపిడీలు అరాజకంరాకుండా కొంతవరకు కాపాడింది. కొన్నిచోట్ల కూలీలకు న్యాయమైన కూలిని యిప్పించింది. వ్యవసాయ కూలీలలో మన పార్టీ ఒక స్థానాన్ని సంపాదించింది. కాని యింకను వ్యవసాయకూలీ సామాన్యానికి అంతకూ నాయకత్వం వహించలేదు. కులతత్వవాదులు, మిషనరీలు యింకా వారిలో చాల పలుకుబడిని గలిగి ఉన్నారు. గ్రామ ప్రజలలో సగంగావున్న వ్యవసాయకూలీలలో ప్రస్తుతం కలిగిన సంచలనాన్ని నిర్మాణరూపంలో పెడితేనే, జాతీయైక్యతలో ముఖ్య భాగమైన గ్రామైక్యతను (రైతు-కూలీ సామరస్యాన్ని) నిర్మించగలుగుతాం. లేకపోతే కులతత్వవాదులు, మిషనరీలు గ్రామైక్యత రాకుండాచేసి, సామ్రాజ్యవాదులు జాతీయ ప్రభుత్వం యివ్వకుండా చేస్తున్న ప్రయత్నాలకు సహాయపడుతారు.

స మ స్య లు

(1) రైతుసంఘాల సహాయంతో న్యాయమైన కూలిని సంపాదించుట: రైతులవద్దనుండి ధాన్యపు ఫండులను వసూలుచేసి, గ్రామ వ్యవసాయ కూలీ సంఘ సమిష్టిబాధ్యతమీద వడ్డీలేకుండాగాని, స్వల్పవడ్డీమీదగాని ధాన్యం అప్పులు తీసుకోవడం. ఈవిధంగా సంఘాన్ని బలపర్చాలి. రైతులవద్దనుండి వ్యక్తిగతంగా గింజలు తెచ్చుకోవడంవల్ల, రైతులకు బానిసలుగా యెలా తయారుగావలసివస్తుందో, నాముపద్ధతివల్ల యెలా దోపిడీకి లోనుగావలసివస్తుందో వ్యవసాయ కూలీలు గుర్తించేలా చెయ్యాలి.

(2) న్యాయమైన కొలువిధానం అమలుజరిగేలా చేయడం. ఈ విషయం గూర్చి విపులంగా ముందే వ్రాయబడింది.

(3) రైతులయొక్క సహకారంతో బంజరుభూములను సాగుకు ఇప్పించుట, ఫీల్డులేబరు కోఆపరేటివు సొసయిటీలు వ్యవసాయకూలీలందరికి ఉపయోగపడేలా జేసి, ప్రభుత్వాధీనంలో ఉన్నభూములను కూలీల కిప్పించి పై కోఆపరేటివు సొసయిటీల ద్వారా వాటిని సాగుచేయించుట.

(4) లేబరు డిపార్టుమెంటు :—జిల్లా లేబరు తహసీల్దారు ద్వారా ఇండ్ల స్థలాల సౌకర్యాలు మొదలైనవి చేయించవచ్చును.

గ్రామంలోని పంచాయితీబోర్డు జిల్లా కలెక్టరుద్వారా నూతులు, రోడ్లు, లెట్రిన్ సౌకర్యాలు కలిగించవచ్చు.

(5) కులకట్టుబాట్లు చాల కఠినంగా అమలు జరుగుతున్నాయి. కుల పెత్తనదార్లు ఇంకనూ పలుకుబడిని కలిగి ఉన్నారు. వీరు పెండ్లిండ్లలో పందిని కోయకపోతేనూ, తాగబోయించకపోతేనూ, ఏదైనా వ్యభిచారంజరిగినప్పుడు, జరిమానాలను విధించుతారు. ఈ కులతప్పులవల్ల వచ్చినడబ్బును కాజేస్తారు.ఇందువల్ల కూలీలలో అనేకతగాదాలువచ్చి, కులపెత్తనదార్లక్రింద ముఠాలువడి కొట్టుకోవడం జరుగుతుంది. గ్రామాల్లో వ్యవసాయకూలీసంఘం అభివృద్ధిగావాలంటే, కులకట్టుబాట్లను, పురాతనపు కులాచారాలను బ్రద్దలుచెయ్యాలి. కులపెత్తనదార్ల పలుకుబడిని తీసివెయ్యాలి. ఇందుకు ముందు యువకులను సంఘటితపరచాలి. ఈదురాచారాలవల్ల కూలీలలో ఎలా చీలికలు వస్తున్నాయో, మోయలేని కులతప్పు లిచ్చుకోడానికి రైతులవద్ద అప్పులు తీసుకొని ఎలా బానిసలు గావలసివస్తుందో, ఈ తప్పులక్రింద వచ్చిన డబ్బు త్రాగుడు మొదలైన దురాచారాలు పెంపుజేయడానికి ఎలా ఉపయోగపడుతుందో, నచ్చజెప్పాలి. కులపెద్దలు ఎలా ఆర్థికంగా కూలీలను దోచుకుంటున్నారో, వారిలోట్లను తీసుకొని బట్టబయలు చెయ్యాలి. ఈ విధంగా వ్యవసాయకూలీ యువకులను సంఘటితపరచి, దురాచారాలను కులతప్పులను పోగొట్టాలి.

(6) వివిధ కులాల కూలీలమధ్య ఐక్యత. ఇంతవరకు వ్యవసాయకూలీ సంఘాలలోకి హరిజనులు మాత్రమేవస్తున్నారు ఇతరకులాల కూలీలు రావడం లేదు. వారినిగూడ ఆకర్షించాలి.

అంతేగాక మాల మాదిగ కులాలమధ్య తగాదాలు వున్నాయి తూర్పు గోదావరిలో యివి ఖూనీలవరకుగూడ పోయినాయి ఈ మాల మాదిగ తగాదావల్ల కూలీలలో చీలికలు యెలావస్తున్నాయో, ఇందువల్ల కూలీల ప్రయోజనాలకు యెలా హాని కలుగుతుందో, కూలీలకు నచ్చజెప్పి వారిని ఐక్యపరచాలి కుల ఆచారాలు గమిడిదాటి వీధిలోకి రాకుండా చెయ్యాలి.

(7) మన కూలీ సంఘాలకు పోటీగా, గుంటూరులో క్రిష్టియను ఫెడరేషను, కృష్ణా, తూర్పుగోదావరిజిల్లాలలో ఆదిమాంధ్ర సంఘం మొదలైనవాటిని కులతత్వవాదులు పెడుతున్నారు. వీటికి ప్రభుత్వం సహాయంచేస్తోంది. కుల మత

సంఘాలు యెలా వ్యవసాయ కూలీలలో చీలికలు తీసుకువచ్చి, కూలీల ప్రయోజనాలకు యెలా హానికరంగా పరిణమిస్తాయో, కూలీలకు నచ్చజెప్పాలి. అన్ని కులాల కూలీలు ఐక్యంగా ఉంటేనే వారి దైనందిన కష్టాలను పోగొట్టుకోవడం యెలా సాధ్యమవుతుందో చెప్పాలి. పోటీ సంఘాల నాయకుల యెత్తుగడలను సమయందొరికినపుడల్లా బట్టబయలుచేస్తూ, వారిని ప్రజలనుండి దూరంచెయ్యాలి. గాని వారిని వ్యక్తిగతంగా దూషించరాదు.

(8) వ్యవసాయ కూలీలలోని విద్యావంతులంతా హరిజన హాస్టల్సు, క్రిష్టియను బోర్డింగులనుండి తయారయి వచ్చినవారే. వ్యవసాయ కూలీలమీద యీ విద్యావంతుల పలుకుబడి చాల ఉంటుంది వీరిని మనవైపుకు తిప్పుకోకపోతే, మన ప్రతికక్షులు మనకు వ్యతిరేకంగా వీరిని ఉపయోగిస్తారు. కనుక హరిజనహాస్టలు, క్రిష్టియను బోర్డింగులమీద మనం కేంద్రీకరించి పనిజేయాలి. వీటితో వ్యవసాయ కూలీ కామ్రేడ్సు, విద్యార్థిసంఘం కామ్రేడ్సు రెగ్యులరుగా సంబంధం పెట్టుకోవాలి.

(9) వ్యవసాయకూలీ మిలిటెంట్లకు చదువుట, వ్రాయుటగూడ చాల మందికి తెలియదు వీరిని శ్రద్ధగా అభివృద్ధిచెయ్యాలి. అభివృద్ధిచేసే పద్ధతిని గూర్చి యింతకుముందే వివరంగా చర్చించబడింది.

(10) స్థానిక వ్యవసాయకూలీ సంఘాన్ని ఆ గ్రామంలోని రైతువర్కర్లే సమావేశపరుస్తూ వుండవచ్చును. ఈ సంఘానికి మినిట్సు పుస్తకం తప్పకుండా వుండాలి. పై సంఘ సర్క్యులర్ల ఫైలు, పై సంఘానికి పంపే రిపోర్టుల కాపీ ఫైలుగూడ ఉంచాలి.

(11) వ్యవసాయ కూలీలచే ఒకరోజు కోత గోయించిగాని, కట్టివేత వేయించిగాని వ్యవసాయకూలీ సంఘ ఫండు సంపాదించవచ్చును.

కోతలు, ఊడ్పులు మొదలైన కూలీలలో డబ్బుమెదిలే సమయాలలో సంఘ ఫండు వసూలు చేయవచ్చును.

ప్రజారక్షణ దళాలు

ఏ ప్రజాసంఘంలోనైనా ఉన్న పార్టీసభ్యులు మాత్రమే, ఆ ప్రజాసంఘానికి సంబంధించిన ప్రజలనందరినీ అవుసరం వచ్చినప్పుడు సమీకరించడానికి చాలరు. పార్టీ, ప్రజలను కదపడానికి వాలంటీరుదళం అవుసరం. సమ్మె లేక

ఇతర ప్రజా పోరాటం వచ్చినప్పుడు, లేక మహాసభల సమయంలోనూ ప్రజలను శిక్షణగా ఉంచడానికి వాలంటీరుదళాల ఆవశ్యకత మనకు స్పష్టంగా కనిపిస్తుంది. కాని ప్రజల్లో ఎల్లప్పుడూ దైనందిన సమస్యలమీద పనిచేసేటప్పుడు, వాలంటీరు దళం పర్మనెంటుగా ఉండటం అవుసరం. కనుక వాలంటీరుదళం లేనిది ఏప్రజా సంఘమూ తనకార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించలేదు. పార్టీ-వాలంటీరుదళం-ప్రజాసంఘం ఈ మూడు పైవరుసలో ఉండి పనిచెయ్యాలి. అనగా ప్రజలను కదపడానికి వాలంటీరుదళం ఒక 'లివరు' (సాధనం) అన్నమాట.

ఈ రోజుల్లో వాలంటీరుదళాలకు మరొక బాధ్యతగూడ ఉంది. పార్టీ ప్రతి కక్షులు పార్టీ రాజకీయనినాదాలను రాజకీయంగా ఎదిరించలేక, రౌడీలను సైతం ఉపయోగించి దెబ్బలాటలకు తయారవుతున్నారు. మీటింగులు చెదరగొట్ట ప్రయత్నిస్తున్నారు. ఇటువంటి పరిస్థితులలో ప్రతికక్షుల దౌర్జన్యాన్నుంచి, ప్రజా ఉద్యమాన్ని కాపాడటానికి, వాలంటీరుదళాలు అవుసరం.

(1) వాలంటీర్లంటే పార్టీసభ్యులక్రింద నౌకర్లుగాదు. పార్టీసభ్యులు వాలంటీర్లను కలుపుకొని పనిచెయ్యాలి. కనుక పార్టీసభ్యులంతా (తాలూకా సంఘాల, జిల్లాసంఘాల యొక్క అధ్యక్ష కార్యదర్శులు, పార్టీకమిటీల సభ్యులుతప్ప) ప్రజారక్షణ దళాలలో సభ్యులుగా చేరాలి.

(2) నిర్మాణం :—

(అ) గ్రామంలోనూ, పట్టణంలోనూ ఏదైనా పనిచేయడానికి సిద్ధపడే వారి నందరినీ ప్రజారక్షణదళాల్లో చేర్చుకోవాలి.

(ఆ) రైతు, కూలీ, కార్మిక, యువజన, విద్యార్థి, మహిళా స్థానిక దళాలను ఏర్పరచాలి. అందరినీ కలుపుకొనిపోయే ఓర్పుగలవానిని వీటికి కమాండరుగా ఎన్నుకొనేలా చేయాలి. ఈ కమాండర్లు సెల్లు కార్యదర్శులుగా గూడ ఉండవచ్చును. ఈ దళా లన్నిటిమీద తర్ఫీదుపొందిన గ్రామ కమాండరు లేక పట్టణ కమాండరు ఒకరు ఉంటారు. ఇతడు స్థానిక యువజనసంఘ బాధ్యుడు అయి ఉండవచ్చును.

పార్టీ బలంగా ఉన్నచోట్ల పైవిధంగా వేరువేరుగా దళాలను ఆర్గనైజు చెయ్యాలి. కాని పార్టీ బలహీనంగా ఉండి తక్కువ వాలంటీర్లు ఉన్నచోట్ల,

అవుసరాన్నిబట్టీ కొన్నిదళాలను కలిపివేయవచ్చును. కానీ మహిళాదళం మాత్రం ప్రత్యేకంగా ఉండాలి. ఘోషా మొదలైన జమీందారీ కట్టుబాట్లు ఉన్న మన దేశంలో మగవాలంటీర్లు స్త్రీ జనసామాన్యంలో పనిచేయడం చాలకష్టం.

(3) దళాలను పనిచేయించే విధం :—

(అ) రైతు, కూలీ, కార్మిక, మహిళా మొదలైన దళాలు ఆయాసంఘాల దైనందిన పనులుచేస్తూవుంటాయి.

(ఆ) నవంబరు వారం, స్వాతంత్ర్య దినోత్సవం, మొదలైన జనరలు కార్యక్రమం సాగించడానికి, పార్టీ సెల్లు కార్యక్రమం నిర్ణయించుతుంది. అటు తర్వాత వివిధ వాలంటీరుదళాలను కలిపిగాని, వేరువేరుగాగాని సమావేశపర్చాలి. వారికి ఆ సమస్యయొక్క ప్రాముఖ్యత, పనిజేసేవిధం చెప్పాలి. ఆ యా రంగాలలో పనిజేసే సభ్యులు ఆ యా దళాలను వెంటబెట్టుకొని ఆయా వర్గాల ప్రజల్లో పనిచెయ్యాలి.

(ఇ) ఏ పని చేయించినా, యిదివరకు యేర్పరుపబడిన దళాలవారీగా చేయించాలి. మహాసభలకు పిలిపించినప్పుడు దళాలవారీగానే పిలిపించాలి. మహాసభలలో పనిగూడ దళాలవారీగా యివ్వాలి. ఏ పని యిచ్చినా దళం కమాండరు ద్వారా యివ్వాలి. ఈవిధంగా చేస్తే సభ్యులలో దళ శిక్షణ యేర్పడుతుంది.

(4) దళాల శిక్షణ :—

(అ) ఆటలు, డ్రిల్లు, కర్రసాము మొదలైన వాటిలో తర్ఫీదుపొందిన స్థానిక కమాండర్లు, పైవాటిలో వాలంటీర్లకు అవకాశమున్నప్పుడు తర్ఫీదు యివ్వాలి.

(ఆ) అప్పుడప్పుడు కొండలకు, ఇతరచోట్లకు వినోదయాత్రలకు తీసుకువెళ్ళి వాలంటీర్లను శరీర శ్రమకు ఓర్చేలా దిట్టపరచాలి.

(ఇ) కడవలు వాస్తాలతో వరుసలుగా నిలబడి శిక్షణగా మంటల నార్పే విధానం అందరికీ నేర్పాలి. స్టిరపు పంపును వుపయోగించే పద్ధతిగూడ నేర్పాలి. జపానుదాడి జరిగే యీ రోజుల్లోనేగాక, ఎండాకాలంలో సామాన్యంగా చాలా ఊళ్ళు తగలబడుతూవుంటాయి. గనుక యీ పద్ధతి యెప్పుడూ అవసరమవుతుంది. మనం ప్రజలకు యిటువంటివాటిలో సహాయంచేస్తే, ప్రజారక్షణదళం ఆవుసరం ప్రత్యక్షంగా గ్రహించుతారు.

(ఈ) ప్రతి గ్రామంలోనూ ఒక ప్రాథమిక చికిత్స దళంవుండాలి. ఈ దళంలోనివారికి శారీరక శాస్త్రం, కాళ్ళుచేతులు విరిగినప్పుడు, వళ్లు కాలినప్పుడు, పాము, తేలు కరచినప్పుడు, కలరా మశూచికం మొదలైన అంటుజాడ్యాలు వచ్చినప్పుడు, మొదలైనవాటిలో చేయవలసిన ప్రాథమిక చికిత్సలో తర్ఫీదు యివ్వాలి.

(ఉ) వాలంటీర్లకు రాజకీయ శిక్షణగూడ యివ్వాలి. వారు ప్రజాశక్తి రీడింగు గ్రూపులకు, రాత్రి పాఠశాలలకు హాజరై రాజకీయ పరిజ్ఞానం సంపాదించేలా చెయ్యాలి. పనికివచ్చేవారిని పార్టీలోకి తీసుకుంటూ వుండాలి.

(5) ప్రజారక్షణ దళాల కార్యక్రమం :—

(అ) తాము తమ ప్రజాసంఘాల పనిని చేయుట. ఇతర జనరలు సమస్యలలో ప్రజల్లో పనిచేయుట.

(ఆ) ప్రజాసంఘ మీటింగులను,మహాసభలను దుర్మార్గులనుండి కాపాడుట.

(ఇ) అంటుజాడ్యాలలో ప్రజలకు తగిన సహాయంచేయుట.

(ఈ) ఎండాకాలంలో ప్రజలకు తెలియజెప్పి, గ్రామాలు తగులబడకుండా జాగ్రత్తలు తీసుకొనుట. అగ్ని ప్రమాదాలలో మంటలనార్పి ప్రజలకు తోడ్పడుట.

(ఉ) ప్రజలకు చేతనైన యితర అన్నివిధాల తోడ్పడి, ప్రజల మన్ననలకు పాత్రులగుట.

(6) జిల్లా, తాలూకా, ఫిర్కా ప్రజారక్షణ దళ కమాండర్లు యేదో ఒక ప్రజాసంఘ జనరలుబాడీలోనో, కార్యవర్గంలోనో వుండాలి. అందువల్ల కమాండర్లకు ప్రజా సంస్థలతోనూ, ప్రజా వుద్యమంతోనూ సంబంధముంటుంది. లేకపోతే వాలంటీర్లను ప్రాక్టికలు పనిలో నడపడం సాధ్యంగాదు.

యువజనసంఘాల ప్రాముఖ్యత

యుద్ధం, యుద్ధఫలితాలు దేశాన్ని తారుమారు చేస్తున్నాయి. ఆకలిబాధ, అత్యవసరవస్తువుల కరువు ప్రతిమనిషిని ముఖ్యంగా భావోత్సాహము, కార్యశక్తి గల యువకులను తీవ్రముగా ప్రస్తుతపరస్థితులను గూర్చి ఆలోచించేటట్లు స్వీయానుభవమే చేస్తుంది. తమకు సంభవించిన కష్టాలను, పరిష్కరించుకోడానికి,

రాజకీయాలలో పాల్గొనవలసి వస్తూవుంది. ఇట్టి కార్యశక్తి భావోత్సాహము గలిగి రాజకీయచైతన్యం పొందుతున్న యువకులను నేటి అశాంతి అలజడి పరిస్థితులలో, విచ్ఛిన్నశక్తులు ఉపయోగపరచుకోవడానికి పూర్తిగా ప్రయత్నం చేస్తాయి. విచ్ఛిన్న కార్యక్రమానికి సంఘటితపర్చడానికి ప్రయత్నిస్తాయి. ఇప్పటికే హిందూ మహాసభ రాష్ట్రీయ స్వయంసేవక సంఘం పేరుతో, అనేక ప్రాంతాలలో యువకులను ఆకర్షిస్తూ వున్నది. ఇట్టి పరిస్థితులలో యువజనులను మనప్రజల శత్రువుల కప్పజెప్పినవార మవుతాం. జర్మనీలో కమ్యూనిస్టులు 1929–32 కాలములో యువకులను తమవైపుకు మరల్చుకోజాలక పోవుటచే యువకులలో యెక్కువమంది నాజీ నిరంకుశత్వానికి యేరీతిగా పునాదైనది, యెంత వున్మాదంగా నాజీ తత్వంకోసం పోరాడుతున్నది మనం చూచినదే. పట్టణ మధ్యతరగతి యువకులలోనూ, ఆకలిబాధకు లోనైన కార్మిక యువకులలోను ఫాసిస్టు విచ్ఛిన్నశక్తులు ప్రవేశించడం సులభం. ఇంతేగాకుండా పట్టణాలలోను, గ్రామాలలోను చాలమంది యువకులు రిఫ్రాఫ్‌గా (పైలాపచ్చీస్) తయారవుతున్నారు. వీరుకూడా సంఘానికి చీడపురుగులుగా తయారవుతారు. ఈరెండు ప్రమాదాలనుండి రక్షించాలంటే యువజనులందరిని ఆకర్షించేటువంటి, యువజనులందరి ప్రత్యేక కష్టాలను పోగొట్టేటటువంటి కార్యక్రమంమీద యువజనోద్యమమును పెంపొందించాలి. నేడు యీ యువజనోద్యమాన్ని ప్రధానంగా ఆహారసమస్య ప్రజాసంరక్షణ కార్యక్రమంమీద నడపాలసి వుంటుంది. దానితోపాటు వారిమామూలు ఆటలు, డ్రిల్లు, పాటలు, నాటకాలను నిర్లక్షించరాదు. ప్రజారక్షణదళాలలో చేరినను రైతులకు రైతుసంఘా లెంత అవశ్యకతో రైతుసంఘ నిర్మాణం యెట్లు నష్టప దో అలాగే యువజనసంఘ నిర్మాణంకూడా నష్టపడ నవసరంలేదు. ప్రతిపార్టీ ఆర్గనైజరు పై ప్రాముఖ్యాన్ని గుర్తించి యీ రంగంలో శ్రద్ధతీసుకోవాలి. అందుకు అవసరమైన సూచనలు యీ క్రింద పొందుపరుస్తున్నాం.

నేటి యువజనసంఘాల స్థితి

రాష్ట్రంలో దాదాపు అన్నిజిల్లాలలోను యువజనసంఘాలు యేర్పడ్డాయి. యువజన కార్యక్రమంలో కూడా రాష్ట్రమంతటా ఐక్యత యేర్పడినది. యువజన సంఘ ప్రణాళిక నినాదాలు యువజనసామాన్యాన్ని ఆకర్షించాయి. కాని ప్రాథమిక

సంఘాలు యెక్కువగా కదల్చబడకపోవుటచే యువజనసంఘ ప్రధాన నినాదాలకు యింతవరకు వొక వుద్యమస్వరూపం యేర్పడలేదు. ప్రాథమిక సంఘాలకు యెప్పటికప్పుడు కార్యక్రమమిస్తూ కదల్చిననాడే రాష్ట్రమంతటిలోను జరిగే పనిలో ఐక్యత యేర్పడి దానికి వొకవుద్యమస్వరూపం యేర్పడుతుంది. ప్రతి పార్టీ ఆర్గనైజరు, సెల్లు కార్యదర్శి యీ రంగంయొక్క ప్రాముఖ్యతతోపాటు సమస్యలను, బాధ్యతలను గుర్తించి అర్థం చేసుకొన్నప్పుడు తప్ప ఇది సాధ్యం కాదు.

యువజనరంగంలో నేటి సమస్యలు

ఆహారసమస్య :— ఆహారసమస్య నేడు దేశాన్నంతా ఆవరించివున్న సమస్య. ఇందువల్ల యువజనసంఘం ఆహారసమస్యలో ప్రధానబాధ్యత వహించాల్సి వుంటుంది. బెంగాలులో యేర్పడ్డ కరువు, విపరీతమైన మరణాలు ఆంధ్రలో కూడ సంభవించకుండా వుండాలంటే యువకులపైన చాలబాధ్యతవుంది. ఆహారసమస్యకు కారణభూతులైన తిండిదొంగలను పట్టడంలోను, తిండిదొంగలకు ధాన్యంచేరకుండా ప్రభుత్వ లైసన్సుపొందిన వ్యాపారుంకే ధాన్యం అమ్మేలా చూడడంలోను, యువకులు తీవ్రకృషి చేయాలి. బస్తా రు 11-0-0 కంట్రోలు చేయవలసిందిగా ప్రభుత్వం పైనను; రు 11-0-0 కే అమ్మవలసిందిగా తల్లిదండ్రుల పైనను ఆందోళన చేయాలి. పట్టణాలలో రేషన్‌కార్డు లిప్పించడానికి, డిపోలవద్ద సక్రమంగా బియ్యం అందేలా చూడడానికి, కిరోసిన్ పంచడానికి యితర సంఘాలతో కలసి పనిచేయాలి. ఈ బాధ్యత ప్రతియువకునిపైన వున్నదని నచ్చజెప్పి తిండిదొంగలకు వ్యతిరేకంగా పైప్రచారం ప్రారంభించాలి.

స్పోర్ట్సు :— యువజన సంఘాలు యింతవరకు చేసిన కృషిఫలితంగా ప్రధానంగా మూడుజిల్లాలలో ఆటలకార్యక్రమం సర్వసాధారణం అయింది. చాలమంది యువకులు ఆటల కార్యక్రమంపైపుకు ఆకర్షింపబడ్డారు. కాని స్పోర్ట్సు టెక్నిక్‌మాత్రం అభివృద్ధికాలేదు. ఒక్క చెడుగుడుతప్ప మిగిలిన స్పోర్ట్సుఅన్నీ నామమాత్రంగానే జరుగుతున్నాయి. ఇందువల్లనే మనం ప్రొఫెషనల్ స్పోర్ట్సుమన్‌ను(ఆటలే వృత్తిగాగలవారు) యెక్కువగా ఆకర్షించలేకపోయినాము. జిల్లా స్పోర్ట్సు జరిగేప్పుడు ఆఖరిసమయంలో హడావుడిగా యేవో కొన్ని ఆటలు ప్రాక్టీసుచేస్తారు, కొన్నిచోట్ల అదీకూడా వుండదు. పార్టీ సర్క్యులరు ప్రకారం యేదో టీమును పంపి మొక్కు చెల్లించుకుంటారు. అందువల్ల ఆటలలో పాల్గొనేవారి సంఖ్యకు సమానంగా టెక్నిక్ అభివృద్ధికావడంలేదు. ప్రతిగ్రామంలోను స్పోర్ట్సు ప్రాక్టీసు చేయించినప్పుడే యీ సమస్య పరిష్కారం అవుతుంది. టెక్నిక్ అభివృద్ధిచెందకపోతే ప్రొఫెషనల్ స్పోర్ట్సుమన్‌ను ఆకర్షించలేకపోవడమటుంచి, నేడు పాల్గొనే యువకులలోకూడ నానాటికి నిరుత్సాహం జనిస్తుంది. అందువల్ల నేడు ప్రతి గ్రామంలోను, ప్రతి పేటలోను నిత్యము ఆటలను, స్పోర్ట్సును ప్రాక్టీసు చేయించుటద్వారా టెక్నిక్‌ను అభివృద్ధిచేసి యువజనోద్యమాన్ని ముందుకు తీసుకొని పోవడమనేది నేటి ప్రధాన సమస్యలలో ఒకటి. ప్రతి గ్రామంలోను శాశ్వతంగావుండే ఆట స్థలాన్ని యేర్పరచినప్పుడే పై పని సాధ్యమవుతుంది. గ్రామంలోవుండే యువకులందరూ పాల్గొనలేదని నిరుత్సాహపడి విరమించుకొనకుండా వున్న కొద్దిమందితోనే రెగ్యులరుగా కార్యక్రమం సాగించాలి. కొంతకాలంలో ఆటలు, ఇతర వ్యాయామ పద్ధతులద్వారా శారీరకస్థితిని పెంపొందింప జేసికొనవచ్చునని అనుభవంలో గ్రహించడంద్వారా యెక్కువమంది పాల్గొనే అవకాశం కల్గుతుంది. సంవత్సరానికి రెండు మూడు పర్యాయాలు ఆ గ్రామంలో పోటీలు పెట్టడంద్వారా యువకులలో వుత్సాహం మరింత అభివృద్ధి అవుతుంది. ప్రతి గ్రామంలోను యేర్పరచే యీ శాశ్వత ఆట స్థలాలలో శిక్షణ యివ్వడానికిగాను కొంతమందికి యిదివరకే శిక్షణ యివ్వబడింది. మరికొంతమందికి శిక్షణ యివ్వడం జరుగుతుంది. పార్టీ ఆర్గనైజర్లు యీ శిక్షణ పొందిన అధ్యాపకులను యితర రంగాలకు పంపకుండా శ్రద్ధ తీసుకోవాలి. లేకుంటే కార్యక్రమమంతా నాశనమైపోతుంది. స్పోర్ట్సు కార్యక్రమంలో యీ క్రింది వాటిని ప్రధాన నినాదాలుగా ప్రతి పార్టీ ఆర్గనైజరు గమనించాలి.

(1) శాశ్వత ఆట స్థలాలను ప్రతిచోట యేర్పరచాలి.

(2) ఆటల టీచర్లను యితర రంగాలకు మార్చరాదు,

(3) ప్రొఫెషనల్‌గా ఆడేవాండ్లను ఆకర్షించాలి.

(బి) ఒక్క ఆటలు, స్పోర్ట్సు మాత్రమే గాక, అవకాశమున్నచోట్ల పేరలల్‌బార్, ఛస్టు ఎక్స్పాండర్ (Chest expander) మొదలగు సాధనా

లపై వ్యాయామాన్నికూడ సాగించాలి. మన పార్టీ గ్రామాల్లోనే కొన్నిచోట్ల పై పరికరాలేగాకుండా యింకా అదనంగా కూడ వున్నాయి. వాటిద్వారా యువకు లందరికి శిక్షణ యివ్వడానికి పూనుకోవాలి.

ఆర్. యస్. యస్. :— రాష్ట్రకమిటీ ఆర్. యస్. యస్. పై వేసిన కరపత్రాన్ని, ఆర్. యస్. యస్. నిజస్వరూపం అనే పుస్తకాన్ని వుపయోగించుకొని. ఆర్. యస్. యస్. ని యువకులలో బహిరంగపర్చాలి. ఆర్.ఎస్ ఎస్. పంజానుండి యువకులను తప్పించి కాపాడాలి. అంటే ఆర్. యస్. యస్. లో చేరినవారితో చర్చలు పెట్టుటతో సంతృప్తిపడి నిరుత్సాహపడరాదు. ఆర్.యస్. యస్. లో చేరినవారితో చర్చించడం కనీసం వారిచుట్టూవున్న హిందువులు రోజు రోజూ పడుతుండే ఆర్థికబాధలను నివారించే ప్రయత్నాలలోకైనా లాగ ప్రయత్నించడం మనం నిర్వర్తించవలసిన కార్యక్రమంలో ఒక భాగం మాత్రమే. ఇంతవరకు కొంతమంది మధ్యతరగతి యువకులే ఆర్. ఎస్. ఎస్. లో చేరారు. ఇంకా నిర్లక్ష్యంచేస్తే కార్మిక యువకులుకూడా ఆకర్షింపబడతారు. పట్టణాలలో యింతవరకు యేది మనకు ఆధారమనుకుంటున్నామో ఆ కార్మిక యువకులుకూడ ఆర్.ఎస్ ఎస్. విషపుకౌగిలిలోకిపోతే మనస్థితి, కార్మికవర్గం స్థితి, అంతేగాదు. దేశ సౌభాగ్యమే మరింత అధ్వాన్నమౌతుంది. అందువల్ల పైన యివ్వబడిన సాధారణ కార్యక్రమా న్ననుసరించి మనకు పలుకుబడికల వర్గాలలోని, పేటల లోని యువకులను ఒక శక్తిగా తయారుచేయాలి. మనం నిర్మించిన ప్రతి శక్తి అనుసరిస్తున్న పంథాను హిందూ మహమ్మదీయ ఐక్యతతో హిందువుల ఆర్థిక బాధలుకూడ యేవిధంగా పరిష్కారంచేయగలమో ఆచరణలో చూడడంద్వారానే ఆర్ ఎస్.ఎస్.లోవున్న సద్భావంగల యువకులు తప్పక నిజాన్ని గుర్తిస్తారు.

అందువల్ల ఆర్. యస్. యస్. విషకౌగిలినుండి యువకులను కాపాడాలి అనే నినాదాన్ని యీ విధంగా అర్థంచేసుకొని టౌన్సులో ముఖ్యంగా ఈ కార్యక్రమం పైననే కేంద్రీకరించాలి. ప్రతిపేటలోను ఆటల కార్యక్రమం, తాలింఖానాలు తెరవడం ద్వారా మనం యువకులను కేంద్రీకరించాలి.

సాంఘికసేవ :—తిరునాళ్ళకుగాని, వుత్సవాలకుగాని జనసమ్మర్దం కూడినప్పుడు ప్రజలకు యిబ్బంది కల్గకుండా యువజనసంఘ సభ్యులు వలంటీర్లుగా వెళ్ళి కాపాడాలి. వుత్సవాలలో ప్రజలు అనేకరకాలుగా బాధపడతారు. జేబుదొంగలు, రౌడీలు యిష్టంవచ్చినట్లు విహరిస్తారు. వీరినుండి ప్రజలను కాపాడవలసి వుంటుంది. అంతేగాకుండా జనసమ్మర్దం వుండి ఆరోగ్యసూత్రాలను పాటించక పోవడంవల్ల కలరా మొదలగువ్యాధులు సులభంగా వ్యాపిస్తాయి. అటువంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవలసి వుంటుంది. యిలాంటిచోట్ల ప్రజలను కాపాడడం ద్వారా యువజనోద్యమానికి ప్రజల సానుభూతి వస్తుంది.

పట్టణాలలో రౌడీల దుష్కృత్యాలనుండి స్త్రీలను, నిస్సహాయులను కాపాడాలి.

కలరా మొదలగు అంటువ్యాధులు వున్నప్పుడు; వాటినుండి ప్రజలను కాపాడడానికి పూర్తి ప్రయత్నాలను చేయాలి. ప్రభుత్వ ఆరోగ్యశాఖ సహాయాన్ని పొందాలి. గ్రామ పారిశుధ్యాన్నిగూర్చి ఆ దినాలలో చాలజాగ్రత్త వహించాలి. మూఢనమ్మకాలతో జరిగే జాతరలద్వారా జబ్బులు మరింత పెరిగిపోకుండా చూడాలి. ఆరోగ్యశాఖవారి ప్రదర్శనాల ద్వారా ప్రజలకు ఆ అంటువ్యాధులపట్ల స్పష్టమైనభావాలు యేర్పడేలా చూచి తిరిగి ఆ అంటువ్యాధులు రాకుండా చూడాలి.

దురాచారాలు, పండగలు :—సంఘంలో జరిగే దురాచారాలను ఎదుర్కోవాలి. జాతరలు, కొలుపులు మొదలగు మూఢనమ్మకాలను ఎదుర్కొని ప్రజలకు విజ్ఞానాన్ని కల్గించాలి. పండగల పేరుతో జరిగే దురాచారాలను కూడా ఎదుర్కోవాలి. ఆ పండగల నన్నిటిని ముఖ్యంగా దీపావళి, దసరా, సంక్రాంతి పండగలను మన యువజనసంఘాలే ప్రజలనందరిని ఆకర్షించే కార్యక్రమంతో జరపడం ద్వారా యితర దుర్వ్యసనాలకు తావులేకుండా చేయాలి. యీ విధంగా చేయడం ద్వారా (1) పండగలపట్ల మూఢనమ్మకాలు పోతాయి, (2) ప్రజలు దుర్వ్యసనాలకు లోనుకాకుండా వుంటారు, (3) ఎంతోధనం దుర్వ్యయం కాకుండా కాపాడబడుతుంది. ముఖ్యంగా సంక్రాంతి పండగ సమయంలో అన్నివర్గాల ప్రజలవద్ద డబ్బు మెదులుతూ వుంటుంది. పంటలు చేతికందాయనే సంతోషచిహ్నంగా సంక్రాంతి జరుగుతుంది. కాని నేడు ఆ రోజున జూదాలు, త్రాగుడు విపరీతంగా సాగుతున్నాయి. ఎంతోధనం వృధాగా ఖర్చవుతుంది. దీన్ని మనం తప్పక అరికట్టాలి. అందువల్ల సంక్రాంతినాడు ప్రతిగ్రామంలోను యువజనసంఘ వార్షికోత్సవం జరపాలి. ఆటల పోటీలు, రాత్రి కల్చరల్ కార్యక్రమంజరిపి ప్రజలకు

ఆ మూడుదినాలు జూదాలదరికి పోవడానికి ఖాళీలేకుండా కార్యక్రమ మిచ్చి ప్రజలను దుర్వ్యసనాలనుండి కాపాడాలి. గ్రామంలో ఏ ఒక్కరిని జూదానికి వెళ్ళనివ్వకుండా చూడాలి అనేది ప్రధానంగా నిర్ణయించుకోవాలి. దీపావళి, దసరాలలో కల్చరల్ కార్యక్రమం ద్వారా ప్రజలను సమీకరించి ఆ పండగల స్వభావాన్నే మార్చాలి.

కల్చరల్ కార్యక్రమము

(1) ప్రతి యువజనసంఘము కల్చరల్ కార్యక్రమాన్ని తీసుకోవాలి. బుర్రకథలు, వేషాలు నాటకాలద్వారా యువకులను కేంద్రీకరించాలి. కేవలం పార్టీ నాటకాలే కావాలని ఎదురుచూడకుండా వున్న అభివృద్ధికరమైన సామాజిక నాటకాలనే ఆడుతూవుండాలి. సమిష్టి గానాన్ని సర్వసాధారణం చేయాలి.

(2) గ్రంధాలయాలు వున్నచోట్ల యెక్కువమంది ప్రజలు ఆ గ్రంధాలయాన్ని వుపయోగించుకొనేలా చేయాలి. పుస్తకాలు యింటింటికి తిరిగి పంచి చదివించడంద్వారా చదువుయందు శ్రద్ధకలిగించాలి. లేనిచోట్ల చందాలువేసి కొద్ది మొత్తాలతోనైనా గ్రంథాలయాన్ని స్థాపించాలి. చదువరుల సంఖ్య పెంచడానికి యెన్ని వుపాయాలుంటే అన్నిటిని ఆచరణలోకి తేవాలి.

(3) కొండలు, సముద్రరేవులకు, ఇతర చారిత్రాత్మక స్థలాలకు వినోద యాత్రలు తీసికొని వెళుతూవుండాలి.

(4) అధ్యయన తరగతులు, వాగ్వివాద పోటీలద్వారాను, పుస్తకాలు చదివించుటద్వారాను యువకులలో రాజకీయ విజ్ఞానాన్ని పెంపొందింప జేయాలి.

విద్యాభివృద్ధి :— నిరక్షరాస్యతను నిర్మూలించడంకూడ యువజనసంఘం నిర్వర్తించవలసిన బాధ్యతలలో ఒకటి. మనదేశంలో నూటికి 9 మందిమాత్రమే చదువు వచ్చినవారున్నారు. మిగిలిన ప్రజల నందరిని విజ్ఞానవంతులుగా చేయవలసిన బాధ్యత యువకుల భుజస్కంధాలపైననే వుంది. కనుక ప్రతి గ్రామంలోను, రాత్రి పాఠశాలలు పెట్టాలి. ఈ స్కూల్సు ఎంతో వుపయోగపడతాయి. నిరక్షరాస్యతను నిర్మూలింపజేయడమేగాక కొంతకాలము మనవద్ద నేర్చుకునే అవకాశము వుండుటవల్ల వారి మనస్సులలోనే, ఆలోచనా విధానంలోనే మార్పు వస్తుంది. తప్పకుండా హేతువాద దృష్టి యేర్పడుతుంది. మూఢ నమ్మకాలు

పోయి హేతువాదదృష్టి అలవడ్డ యీ యువకులు యువజనోద్యమాభివృద్ధికి పెద్ద అండగా తయారౌతారు.

(2) యుద్ధం వచ్చినతర్వాత తీసివేయబడ్డ గ్రాంటు స్కూళ్ళను, ఎలిమెంటరీ స్కూళ్ళను తిరిగి స్థాపించడానికి పౌరులందరి సహకారంతో ఆందోళన చెయ్యాలి.

(3) సంవత్సరానికి ఒకటి రెండు పర్యాయాలు ఆ గ్రామంలోవుండే అన్నిపాఠశాలలలోని విద్యార్థి, విద్యార్థినులకు క్లాసులవారీగా చదువుట, వ్రాయుట, లెక్కలు, కాంపోజిషన్‌లలో పోటీలుపెట్టి బహుమతులివ్వాలి.

(4) గ్రామంలోని అన్ని పాఠశాలలలోని విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల సంఘ సహకారంతో తీవ్రకృషి చేయాలి. (స్కూలుబిల్డింగు లేనిచోట్ల కట్టించుకొనే ప్రయత్నాలలోను, అదనంగా టీచర్లు కావలసిన ప్రయత్నాలలోను, చదువును పరీక్షజేసే ప్రయత్నాలలోను. పేరెంట్సు ఎసోసియేషన్లుపెట్టి వాటి సహకారంతో తీవ్ర కృషిచేయాలి.)

(5) గొట్టాలద్వారా ప్రజలకు యెత్తైన ప్రదేశాలలో నిలబడి ప్రతిదినం వార్తాపత్రిక విశేషాలు చెప్పాలి. రేడియోలు లేని మన గ్రామాలలో యిది తప్పదు. అచ్చటచ్చట గోడలపైన ప్రతిదినం వార్తలు వ్రాస్తూవుండాలి. వీటిని చాలమంది చదువుకున్నవాళ్లు చదివి గ్రహిస్తారు.

(6) సాయంకాలం గ్రామంలోను, పల్లెలలోను ప్రజలు సెంటర్లలో గుంపులుగా కూర్చుంటారు. వారికి పత్రిక చదివి వినిపించాలి.

స్థానిక సంఘం :— (1) ప్రతి గ్రామసంఘానికి ఆఫీసు వుండాలి. ఆ ఆఫీసులో వీరులచిత్రాలు, దేశనాయకుల చిత్రాలు, వ్యాయామ ఛార్టులు వుండాలి. ప్రతి 15 దినాలకు కార్యనిర్వాహకవర్గ సమావేశం జరపాలి. ప్రధాన సమస్యలైన స్పోర్ట్సు, వయోజనవిద్య, కల్చరల్ కార్యక్రమాలకు ఒక్కొక్కరికి బాధ్యత యివ్వాలి. ఆహారసమస్యలో అందరూ కలసి ప్రయత్నం చేయాలి.

(2) ఆఫీసులో 4 ఫైళ్ళు వుండాలి. (1) పై సంఘాలకు పంపే రిపోర్టులకు, (2) పైనుండి వచ్చే సర్క్యులర్లకు, (3) పేపరుకట్టింగులకు, (4) ప్రజాశక్తి.

(3) ప్రతి ఆఫీసు ఎకౌంట్సుబుక్కు వుంచాలి.

(4) ప్రతిగ్రామంలోను శాశ్వతఆటలస్థలం పెట్టాలి. అందులో వాలీబాల్‌కు అవసరమైన పరికరాలు, హైజంపు, లాంగ్‌జంపు పోల్సు, హర్డిల్సుకు అవసరమయిన కర్రలు (వాసపు బద్దలతో చేయవచ్చు) టగ్‌ఆఫ్‌వార్‌కు అవసరమైన జనపనారమోకు వుండాలి.

(5) రాత్రిపాఠశాలకు మ్యాపులుకూడా సేకరించాలి. వీలున్నచోట్ల చిన్న గ్లోబుకూడా కొనాలి, (రు. 10-0-0 కు బెజవాడ, వెంకట్రామ్ అండ్ కో లో దొరుకుతుంది).

ప్రతిసంఘం సంక్రాంతినాడు వార్షికోత్సవం చేయాలి. వార్షికోత్సవంనాడు ఆటల పోటీలు పెట్టాలి.

ఆర్థికం :— పై కార్యక్రమాన్ని అమలుపరచడానికి అయ్యే ఖర్చును సులభంగా ప్రజలవద్దనుండి ప్రోగుచేయవచ్చు. యువజన సంఘాలకు తేలికగా డబ్బు వసూలవుతుంది. ప్రజా సముదాయాన్ని కూర్చే ప్రతి కార్యక్రమం లోను పైసా ఫండు ప్రోగుచేయాలి. యువకులు పూనుకుంటే ప్రతిపని సులభంగా సాధ్యమవుతుంది పండుగల కార్యక్రమంలోను, కోతల సమయంలోను డబ్బు ప్రోగుచేసుకోవాలి.

ఉదాహరణకు సంక్రాంతి నెలరోజులు యింటింటికి చిన్నచిన్న బుట్టలు పెట్టి రోజూ గుప్పెడుబియ్యం వెయ్యవలసిందిగా స్త్రీలను కోరి వారానికి ఒక పర్యాయం ప్రోగుచేసుకుంటే సంవత్సరానికి ఆ సంఘానికి సరిపోవు డబ్బు వస్తుంది. బాలసంఘ సభ్యులున్న ప్రతియింట్లోను పోట్లాడి బియ్యం వేయిస్తారు. రోజుకు గుప్పెడుబియ్యం వేయడానికి యెవ్వరూ వెనుదీయరు.

బాల సంఘాలు :— యుద్ధంవల్ల యేర్పడ్డ సంచలన ప్రభావం బాలకుల పైనకూడ పడింది. వీరినందరిని సక్రమ పద్ధతులలో పెంచకపోతే భావి పౌరులుగా తయారుకావలసిన బాలకులు తప్పుమార్గాన బడడం అసంభవంకాదు. 14, 15 సంవత్సరాలు వచ్చేవరకే దురలవాట్లకు అలవాటుపడి, చాలమంది యువకులు చెడిపోతున్నారు. అందువల్ల యువజనసంఘాలు అట్టి యువకులను బాగుచేయడమటుంచి వారితో సంబంధం పెట్టుకోవడమే కష్టతరమౌతుంది. యువజన

సంఘాలు యువజన సామాన్యాన్నంతటినీ ఆకర్షించాలంటే 14 సంవత్సరాలు నిండేసరికే ఒకరకమైన కట్టుబాటు, మంచిఅలవాట్లు ఆ యువకునికిరావాలి. బాల సంఘాలు యేర్పడి పనిజేసినప్పుడే అది సాధ్యమవుతుంది. అంతేకాదు. యింత వరకు పార్టీచేసిన తీవ్ర కృషిమూలంగా కొన్నికొన్ని గ్రామాలు పార్టీకి అండగా తయారయినాయి. ఆ గ్రామాల్లో ప్రజా జీవిత విధానమే మారిపోయింది. ఈ నూతన జీవిత ప్రభావం బాలకులపైన పూర్తిగాపడింది. వీరినందరిని సక్రమ పద్ధతుల్లో పెంచాల్సిన బాధ్యత పార్టీపైవుంది. అందువల్ల నేడు బాలసంఘాల నిర్మాణంయొక్క ఆవశ్యకత చాలవుంది. ఈ ప్రాముఖ్యతను ప్రతి పార్టీ ఆర్గనైజరు ముఖ్యంగా గుర్తించాలి. ఇంతవరకు రాష్ట్రంలో అన్ని జిల్లాలలోను బాలసంఘాలు యేర్పడ్డాయి. ప్రధమదశలో కొంతకాలం పనిచేశాయి. కాని యిప్పుడు ప్రతిచోట నిస్తబ్ధంగా వున్నాయి. బాలకుల చిత్తప్రవృత్తిని గమనించి నడుపగల సమర్థులైన ఆర్గనైజర్లు లేకపోవడమే ఇందుకు ప్రధానకారణం. క్షణక్షణం సహజంగా మారుతుండే బాలకుల మనస్తత్వాన్ని గమనించి క్రొత్తక్రొత్త ఆటలు, పాటలు నేర్పలేకపోయినాము. కనుకనే దినదినాభివృద్ధినొందిన బాల సంఘాలలో నేడు ప్రతిచోట నిస్తబ్ధత వచ్చింది.

కార్యక్రమం :— (1) ప్రతి స్థానిక యువజనసంఘం, ఓపికగల బాలురతో మెలుగుటలో అనుభశాలి అయిన ఒకనిని బాలసంఘం కోసం ప్రత్యేకించాలి. ఇందుకు ఎలిమెంటరీ స్కూలు టీచర్లు దొరికితే చాలమంచిది.

(2) హుషారుగాఉండే ఆటలను, ఒకటితర్వాత ఒకటి త్వరగామార్చుతూ ఆడించాలి. (త్వరలోనే బాలసంఘాలఆటలనుగూర్చి పుస్తకంప్రకటించబడుతుంది)

(3) మనదేశ పరిస్థితులను, చరిత్రను, సైన్సు మొదలైనవాటిని గూర్చిన ఆకర్షణీయమైన కథలద్వారా, బాలురకు విజ్ఞానం, జాతీయభావాలు కల్పించాలి.

(4) బాలుర చదువు, ఆరోగ్యం మొదలైనవాటిని గూర్చి శ్రద్ధవహించాలి. బాలురు దుర్వ్యసనాలకు లోనుగాకుండా కాపాడాలి. ఈ పనులవల్ల తలిదండ్రుల సానుభూతిని సహాయాన్ని సంపాదించ గలుగుతాం.

విద్యార్థి రంగం

విద్యార్థి ఉద్యమ ప్రాధాన్యత :— విద్యార్థి ఉద్యమం జాతీయోద్యమంలో ఒక భాగంగానే అభివృద్ధి చెందుతూ వచ్చింది. 1920 - 30. కాంగ్రెసు ఉద్య

మాలలో విద్యార్థులు ఒక ప్రధానపాత్ర వహించారు. జాతీయ బూర్జువా నాయకత్వం పిలుపు ఇవ్వగానే విద్యార్థులు కాలేజీలు వదలి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. కాని బూర్జువా నాయకత్వం ఎప్పుడూ ప్రజలమీద అస్పష్టమైన పలుకుబడిని మాత్రమే అట్టిపెట్టుకుంటుందిగాని వారిని వారివారి వర్గసంఘములలో ఆర్గనైజు చేసి ముందుకు తీసుకుపోదు. అదేవిధంగా విద్యార్థులను కూడా. రెండు పోరాటాలలో చైతన్యం పొందినా ఒక సంఘం ఏర్పర్చుటకు పూనుకోలేదు. కాని ఈ రెండు ఉద్యమాలు అపజయం పొందడంతో విద్యార్థులకు బూర్జువా నాయకత్వంమీద అసంతృప్తి జనించింది. దీనితోపాటు సోవియటురష్యా విప్లవం సాధించి, 1939 నాటికి పంచవర్ష ప్రణాళికలతో ముందుకు పోతోంది. మన దేశంలో అప్పుడప్పుడే ముందుకువస్తున్న కార్మిక కర్షకోద్యమాలు బూర్జువా నాయకత్వంతో అసంతృప్తిచెందిన విద్యార్థులకు మార్గదర్శకములుగా కనబడ్డాయి. సోషలిష్టు సిద్ధాంతాలవైపుకు ఆకర్షించబడ్డారు. కమ్యూనిస్టుపార్టీ అన్నివర్గ ప్రజలను తమతమ వర్గసంస్థలలో ఆర్గనైజుచేసి వారి కోర్కెలకొరకు పోరాటం సల్పుటద్వారా స్వాతంత్ర్య పోరాటంలోనికి తీసుకురావాలని కార్యక్రమ మిచ్చింది. అదేవిధంగా విద్యార్థులకుకూడా విద్యార్థిసంఘాలు ఆర్గనైజుచేసి వారి కోర్కెల కొరకు పోరాడుటద్వారా వారిని స్వాతంత్ర్యోద్యమంలోనికి తీసుకురావడమే కార్యక్రమంగా పెట్టుకుంది. బూర్జువా నాయకత్వంతో అసంతృప్తిచెందిన విద్యార్థులు కమ్యూనిస్టుపార్టీఇచ్చిన ఈ కార్యక్రమంవైపుకు మొగ్గారు. అప్పుడున్న కమ్యూనిస్టు విద్యార్థులు సంఘాలను ఆర్గనైజుచేయడం ప్రారంభించారు. ఈవిధంగా విద్యార్థి ఉద్యమం విప్లవపార్టీ నాయకత్వాన విప్లవ కార్యక్రమంతో ప్రారంభమయింది.

కాని విద్యార్థులు ఎక్కువగా పెటీబూర్జువా వర్గంనుండి వచ్చినవారు. బూర్జువా నాయకత్వంమీద అసంతృప్తిచెందినా బూర్జువా పలుకుబడినుండి బయట పడలేదు. ఆగష్టునుంచి విధ్వంసకచర్యలలో ఎక్కువగా విద్యార్థులు పాల్గొనడం ఈ విషయాన్నే రుజువుపర్చుతుంది.

విద్యార్థులను వారి వారి సంఘాలలో ఆర్గనైజుచేసి వారిని పార్టీ రాజకీయ పలుకుబడి క్రిందకు తీసుకురావలసిన అవసరంవుంది. పెటీబూర్జువా వర్గాన్నంతటిని మనవైపు మొగ్గునట్లు చేయాలంటే విద్యార్థులను మన పలుకుబడి క్రిందకు తీసుకొని వచ్చుటద్వారా చేయగల్గుతాం. ఇంతేగాక ఈనాడు విద్యార్థులను మన పార్టీ పలుకుబడిక్రిందకు తీసుకురావడమంటే అర్థం జాతీయబూర్జువాలకు ముందు కొడరులేకుండా జేయడం. అంతేగాక బూర్జువా విజ్ఞానం గలిగిన ఈ విద్యార్థులు పార్టీలో చేరి పనిచేస్తూ పార్టీలో ఇమిడి వారి విజ్ఞానాన్ని మార్క్సిస్టు అచ్చులో పోస్తే వారు పార్టీ అభివృద్ధికి ఎంతేని తోడ్పడగలరు. కామ్రేడ్స్ జోషి. అధికారి మొదలైనవారే ఇందుకు నిదర్శనం.

ఇదేకాదు. విద్యార్థి ఉద్యమాన్ని సోషలిస్టు అనుకూలంగా తయారుజేస్తే, భారతదేశంలో సోషలిస్టుసమాజ నిర్మాణానికి ఈ మేధావులు ఎంతో ఉపయోగపడతారు. మేధావులు మొదట సోవియటు యూనియన్‌లో, సోవియటు ప్రభుత్వానికి అనుకూలంగా లేకపోవుటవలననే, చాల అవస్థలు పడాలిసివచ్చింది. జర్మనీ కమ్యూనిస్టుపార్టీ విద్యార్థులను వారిసంఘాలద్వారా పార్టీ పలుకుబడిక్రిందకు తీసుకురానందువలననే విద్యార్థులందరు, హిట్లరుయొక్క జాత్యహంకార సిద్ధాంతములో బడిపోయి, పిచ్చియంత్రాలలాగా ఈనాడు ప్రపంచాన్ని బానిసత్వంలో ముంచుటకు పోరాడుతున్నారు. (ఇప్పుడు ఆర్. యస్. యస్. విద్యార్థులలో ఒకబలమైన స్థానాన్ని నిర్మించుకొని, జర్మనీలో నాజీపార్టీవలె దేశవినాశకరపంథా వైపుకు విద్యార్థిలోకాన్ని తీసుకుపోవడానికి చూస్తోంది.) చైనాలో పార్టీ పలుకుబడిక్రింద వున్న విద్యార్థులు చైనా జాతీయైక్యసంఘటనకు ఎంతో కృషిచేశారు. కాన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించడం మనపార్టీ విప్లవకార్యక్రమంలో ఒక ప్రధాన భాగం.

(1) విద్యార్థుల దైనందిన కష్టాలు :— (అ) కఠిన శిక్షలు. తిట్టడం, కొట్టడం, సంఘాలలో పనిచేసేవారిమీద చర్యలు తీసుకోవడం. (ఆ) టిఫిన్ షెడ్డులు, సైకిల్ షెడ్డులు కట్టించకపోవుట. (ఇ) గ్రంథాలయాలకొరకు రుసుం వసూలుచేస్తున్నాగాని ఆధునిక గ్రంథములు సప్లయి చేయకపోవుట, పత్రికలు తెప్పించకపోవుట, ఆటలకు రుసుం తీసుకొని ఆటగ్రౌండు, పరికరములు యివ్వకపోవుట, ఆటల కమిటీలోనికి విద్యార్థులను తీసుకొనక పోవుట. (ఈ) విద్యార్థిసంఘాలలో చేరవద్దని అధికారులు అడ్డంకులు పెట్టుటమానాలి. స్కూళ్ళలో రాజకీయ విషయాలపై చర్చలు జరపడానికి అవకాశాలు యివ్వాలి. (ఉ) కులమునుబట్టి గాక పేదరికాన్నిబట్టి సగం జీతాలు అంగీకరించాలి. (ఊ) స్కూలుకు కావలసిన పరికరములన్నింటిని సప్లయిచేయాలి. ప్రతి స్కూలుకు కావలసిన లేబరేటరీ, మ్యాపులు సప్లయిచేయాలి. ప్రతిచోట ఒక రీడింగు రూము కట్టించాలి. ప్రతి స్కూలుకు ఒక హాస్టలును నిర్మించాలి.

(ఎ) 9వ నెల జీతం రద్దుచేయాలి.

(2) యూనివర్సిటీ విద్యార్థులు :— (అ) డిటెన్షను పరీక్షలను రద్దు కావించాలి, నూటికి యింతమందికన్నా యెక్కువ వుత్తీర్ణులను చేయకూడదనే హద్దును తొలగించి, కనీసం 75% వుత్తీర్ణులయ్యేటట్లు చూడాలి.

(ఆ) ఇంటర్మీడియట్, బి. ఏ., క్లాసులలోకూడా గ్రూపు సబ్జెక్టులు తెలుగులోనే చెప్పాలి. (ఇ) టెక్స్టుబుక్ కమిటీలోను, సెనేటు, సిండికేటులలోను విద్యార్థులకు ఒక స్థానం ప్రత్యేకించాలి. (ఈ) పబ్లిక్ పరీక్షలు రోజుకు ఒకటి కన్నా యెక్కువ పెట్టగూడదు. ప్రతి హైస్కూలులోను యస్.యస్.యల్.సి. పరీక్షకు కేంద్రము ఇవ్వాలి. (ఉ) టెక్నికల్ విద్యను ఆంధ్రదేశంలో అభివృద్ధి పరచడానికి ఆంధ్రదేశంలో టెక్నికల్ కాలేజీలను పెట్టాలి. (ఊ) రాయలసీమలో మన్న కాలేజీలనుకూడా ఆంధ్రయూనివర్సిటీకి అనుబంధింపచేయాలి. (ఎ) స్కూలు ఫైనలుతప్పి ప్రయివేటుగా పరీక్షకు కూర్చొని ఉత్తీర్ణులైనవారికి ఇంటర్మీడియటు చదివే అవకాశాలు యివ్వాలి. క్రిందిక్లాసులు యేమి చదువకుండా తిన్నగా ఆంధ్ర మెట్రిక్ పరీక్షకు కూర్చునే అవకాశాలు ఇవ్వాలి. (ఏ) అన్నామలై విశ్వ విద్యాలయంలోవలె సెప్టెంబరులో ప్యాసయిన విద్యార్థులకు ప్రత్యేక Session ఆంధ్ర యూనివర్సిటీలోకూడా ప్రవేశపెట్టాలి. (ఐ) University training corp ఏర్పరచి కనీసమిలిటరీశిక్షణ ఇవ్వాలి. మిగతా యూనివర్సిటీలన్నిటిలో యిది వుంది. మనవిద్యార్థులు ఇదొక ప్రధానకోర్కెగా తీసికొని, తీవ్రాందోళనచెయ్యాలి.

(3) వైజ్ఞానిక కార్యక్రమం :— ప్రస్తుత విద్యావిధానం విద్యార్థులలో మన్న సహజమైన అభిరుచులను అభివృద్ధిపరచుటకు తగిన సౌకర్యాలు కలుగ చేయుటలేదు. కాన మనం వారిలోనున్న వివిధ అభిరుచులను అభివృద్ధిపరచుటకు తగిన కార్యక్రమం యిచ్చిననాడే విద్యార్థి ఉద్యమం ముందుకుపోతుంది.

(అ) సంఘంతరపున ప్రతి 15 రోజులకొకసారి వాగ్వాద, వ్యాసరచన, సంగీత, పోటీలు పెట్టాలి. (ఆ) నాటకకళాశాఖను ఏర్పరచి నాటక కళయందు అభిరుచిగలవారందరినీ ఆకర్షించి, అభివృద్ధికర నాటకములను తయారుచేయాలి. (ఇ) సంఘంతరపున వ్రాత పత్రిక నొకదానిని నడుపాలి. ఆ పత్రికకు విద్యార్థులనుండి వ్యాసములు తీస్కుకోవాలి. (ఈ) నెలకొకసారియైనా ఆటలు, స్పోర్ట్సులో పోటీలుపెట్టాలి. (ఉ) అప్పుడప్పుడు వైజ్ఞానిక మహాసభలు జరిపి, ఇతర దేశములలో విద్యావిధానం, కవిత్వం, చిత్రకళ మొదలగు విషయాలపై ఉపన్యాసములు ఏర్పాటుచేయాలి. (ఊ) చిత్రకళయందు అభిరుచిగల వారినందరినీ ప్రోత్సహించి ప్రజోపయోగకరమైన చిత్రములను తయారుచేయునట్లు సంఘములోనికి ఆకర్షించాలి. (ఎ) సంఘంతరపున చారిత్రిక ప్రాధాన్యంగల ప్రదేశములకు వినోదయాత్రలు నడపాలి (ఏ) వివిధరకములైన విద్యార్థులతో సంఘవర్కర్లు సంబంధం ఏర్పరచుకొనుటకు అప్పుడప్పుడు విందులు (Tea-parties) ఏర్పాటు చేయాలి. ఆ సమయములో ఫాసిస్టు వ్యతిరేక గీతములు, మొదలగునవి పాడి, కాలేజీ, దేశ విషయములగూర్చి చర్చలు జరపాలి.

వేసవికార్యక్రమం :—వేసవి సెలవులలో విద్యార్థులు మూడు నెలలపాటు ఖాళీగావుంటారు. ఆ మూడునెలలు వారిని ఖాళీగా వదలివేస్తే రాజకీయాలతో సంబంధంలేకుండా పోతారు. గాన అప్పటి రాజకీయసరిస్థితుల కనుగుణ్యమైన కార్యక్రమాన్ని ప్రతివేసవిలోను నడపాలి. వయోజనవిద్యా ప్రచారానికి కార్యక్రమం వేసుకోవాలి.

(4) యుద్ధకాలపు కోర్కెలు :—యుద్ధంవల్ల విద్యార్థుల కవసరమైన కాగితం, కిరసనాయిలు ధరలు విపరీతంగా పెరిగిపోయినాయి. కంట్రోలువున్నా వ్యాపారస్తులు లెక్కించక విపరీతలాభాలు గడించుతున్నారు. కంట్రోలు ధరలకు విద్యార్థులకు కాగితం, కిరసనాయిలు సప్లయిచేయుటకు విద్యార్థులనంతా ఐక్యపర్చాలి. కాగితం, కిరసనాయిల్, స్టేషనరీ సామానులు తేలికధరలకు అందజేయడానికి స్కూలు తరపున కోఆపరేటివ్ స్టోర్సు ఆర్గనైజు చేయాలి. స్టోర్సువున్న ప్రదేశాలలో అవి పనిచేసేటట్లు చేయాలి.

(5) సంఘనిర్మాణం :—నిర్మాణం కాలేజీప్రదేశాలలో ఒకవిధంగాను, హైస్కూలు ప్రదేశాలలో ఒకవిధంగాను వుండాలి.

కాలేజీలు :—సాధారణంగా కాలేజీలున్నచోట్ల మరికొన్ని హైస్కూళ్ళు కూడా వుంటాయి. అందుచేత అన్నిస్కూళ్ళకు ప్రాతినిధ్యం వున్న ఒకకార్య నిర్వాహకవర్గాన్ని ఎన్నుకోవాలి. ఈ కార్యనిర్వాహకవర్గం మొత్తం పట్టణంలో నున్న విద్యార్థులందరి సమస్యలను తీసుకుని, వారి నైక్యపర్చుటకు పనిచేయాలి. ఒకస్కూలుకు మరొకదానికి సమస్యలు వేరుగా వుంటాయి. అందుచేత ప్రతి స్కూలులో సమస్యలను తెలుసుకుని వాటిపై విద్యార్థులకు నాయకత్వం వహించుటకు స్కూలు కమిటీలను ఎన్నుకోవాలి. ఈ కమిటీని ఆ స్కూలులోనున్న

విద్యార్థిసంఘ సభ్యులనుండి ఎన్నుకోవాలి. ఇలా స్కూలుకమిటీలను ఎన్నుకున్న తరువాత స్కూలు కమిటీకి తోడ్పడుటకుగాను క్లాసుకమిటీలను, వాటికితోడుగా డివిజన్ కమిటీలను ఎన్నుకోవాలి. మనసంఘ నిర్మాణాన్ని డివిజను కమిటీల వరకు తీసుకునివెళ్ళితే విద్యార్థుల నెదుర్కొనే ప్రతిచిన్న సమస్యను మనం పరిష్కరించగల్గుతాం. అప్పుడు సంఘనిర్మాణం పరిపూర్ణత చెందుతుంది. కాని ఈనాడు స్కూలుకమిటీలు కూడా సరిగా పనిచేయడంలేదు. ఈ వివిధకమిటీలను ఏర్పరచి పని ప్రారంభించితే సంఘం చాల ముందుకు పోతుంది.

కాలేజీ, స్కూలు అఫీషియల్ యూనియన్లు :—కమిటీ స్కూళ్ళలో అధికార విద్యార్థిసంఘాలు వుంటాయి. కాలేజీలలో యూనివర్సిటీకి అనుబంధించిన విద్యార్థిసంఘా లుంటాయి. సాధారణంగా అధికారులు తమ కనుకూలంగానున్న వారిని కార్యనిర్వాహకవర్గంగా తీసుకురావడానికి ప్రయత్నిస్తారు. ఆ సంఘాలకున్న నిధులను అవసరమైనవాటికి ఖర్చుపెట్టరు. అందుచేత ఈ సంఘాల కార్యనిర్వాహకవర్గ స్థానాలకు కూడా సంఘం తరపున నిలబడి ప్రచారంచేసి గెలుపొందాలి. సంఘం తరపునవున్న నిధులను అవసరమైనవాటి కన్నింటికి వినియోగించి విద్యార్థులలో నాయకత్వం వహించాలి.

అసోసియేషన్లు :— ఇదిగాక, కాలేజీలలో, Liberary, Science. History, Economic మొదలైన Associations వుంటాయి. వీటికి కూడా యెన్నికలు జరుగుతాయి. ప్రతివారం వీటి ఆధ్వర్యాన డిబేట్లు, ఇతరులచే వుపన్యాసాలు యేర్పాటు చేయబడతాయి. వీటికికూడ సంఘంతరపున పోటీచేయాలి. వీటిని మన ఆధ్వర్యంక్రిందకు తీసుకుంటే, మన దృక్పధానికి, పాలసీకి సంబంధించిన చర్చలు సాగించవచ్చు. వీటిద్వారా సంఘ పాలసీని ప్రచారం చేయవచ్చు క్లాసు విద్యార్థులలో నాయకత్వం సంపాదించవచ్చు.

స్కూలు లేక కాలేజీలలోని ఆటల కమిటీలను మనం పూర్తిగా వుపయోగించుకోవాలి. స్కూలు అధికారులు ఇంకా ఆటలసామగ్రి ఇచ్చేటట్లుచేసి ఆటలు బాగా ఆడించుతూ వారిలో నాయకత్వం సంపాదించాలి.

ఒక వుద్యమాన్ని ఎలా నడపాలి ? :— పై నిర్మాణంద్వారానే రాజకీయ వుద్యమాన్నిగాని, విద్యార్థి సమస్యలమీద వుద్యమాన్నిగాని నడుపుట కష్టం. స్కూలుకు పెందలకడ వెళ్ళి, క్లాసులలోను, లైబ్రిరీలోను ప్రచారంచేయాలి.

సాయంత్రం ఆటల సమయంలోకూడా ప్రచారంచేయాలి స్కూలు అనంతరం విద్యార్థులు ఇండ్లకుపోతారు; అందుచేత ప్రతి పేటలో నున్న విద్యార్థి వర్కర్లను దళములుగా యేర్పరచి, పేటలవారీగా ప్రచారంచేయాలి. రాత్రి పది గంటల వరకు, ఉదయం 8 నుంచి 9 గంటలవరకు ప్రచారం జేయవచ్చు. పై విధంగా స్కూలులో ప్రచారం చేయుటకు వున్న అవకాశాలన్ని వుపయోగించుకొని, తరువాత దళములద్వారా ప్రచారంచేసిన, విద్యార్థులనందరినీ కలుసుకొనవచ్చు. బహిరంగ సభలున్నపుడుకూడా ఈ ప్రచారంలోనే మీటింగుకు రమ్మనిచెప్పాలి. బహిరంగ సభలు పెట్టుకోడానికి అవకాశాలు లేకపోతే పేటలోనున్న లాడ్జీలలో లాడ్జి మీటింగులు పెట్టాలి. లేకపోతే కొన్ని లాడ్జీలకు కలిపి ఒక హాలుమీటింగు పెట్టాలి. ఈ పద్ధతులద్వారా విద్యార్థులందరిలోను ప్రచారం చేయగల్గుతాం.

హైస్కూలు :—పల్లెటూళ్ళలోను, చిన్న పట్టణములలోనున్న హైస్కూళ్ళకు చుట్టుపట్ల గ్రామాలనుండి విద్యార్థులు వస్తారు. స్థానికంగానుండే విద్యార్థులు చాల తక్కువమంది. ఇచ్చటకూడా సంఘ నిర్మాణమును పైవిధంగానే సంఘ కార్యనిర్వాహకవర్గం, క్లాసు, డివిజను కమిటీలను యేర్పరచాలి. వాటిద్వారానే కార్యక్రమాన్ని నడపాలి. కాని ప్రచారం చేసేటప్పుడు యితర పద్ధతులను వుపయోగించాలి.

స్కూలుకు వచ్చే విద్యార్థులు ఒకదిక్కున నున్నవారంతా సాధారణంగా ఒక రోడ్డువెంటగాని లేకపోతే ఒక దారివెంటగాని వస్తారు. ఏదైనా ప్రచారం చేయదలచుకున్నప్పుడు సాయంత్రం విద్యార్థులు వెళ్ళేటప్పుడు ఆ రోడ్డుమీద వారిని సమావేశపరచాలి. వర్కర్లుంటే యే గ్రామంలోనున్న విద్యార్థులకు ఆ గ్రామంలోనే మీటింగులు పెట్టాలి.

ఆఫీసులు :— స్కూలుకు దగ్గరగా ఒక గదిని తీసుకొని ప్రతి విద్యార్థి సంఘం ఆఫీసును నెలకొల్పాలి. స్కూలుకు దగ్గరలో ఆఫీసువుంటే విద్యార్థులు వచ్చి వెళ్లుటకు అవకాశాలు వుంటాయి. ఆఫీసులో "ది స్టూడెంటు" ఇంగ్లీషు, తెలుగు దినపత్రికలు తెప్పించాలి. ఆఫీసుబాధ్యులు ఆఫీసుకు వచ్చినవారందరితో సంబంధాలు యేర్పరచుకొని మాట్లాడాలి. ఆఫీసుకు వచ్చు ఉత్తర ప్రత్యుత్తరాలకు వేరువేరుగా ఫైల్సుపెట్టాలి. సంఘ ఎకౌంట్లు జాగ్రత్తగా వ్రాయాలి.

(6) విద్యార్థిసంఘాలకు బాలసంఘాలకు సంబంధం :—ఈనాటి బాలురు భవిష్యద్విద్యార్థులన్న విషయాన్ని గుర్తించాలి. ఈనాడు ఎలిమెంటరీ స్కూళ్ళలో నున్న విద్యార్థులు కొద్ది సంవత్సరాలలో స్కూళ్ళకు, కాలేజీలకువస్తారు. అలాగే హైస్కూళ్ళలోనున్న 12 ఏండ్లకులోపు వయస్సుగలవారు మిడిల్ స్కూళ్ళలో నున్న విద్యార్థులు కొద్దికాలంలో పై తరగతులకు వస్తారు. వీరే భవిష్యత్తులో మన సంఘాలలోచేరి నాయకత్వం వహించవలసియుంటుంది. కాన మనం ఇప్పటి నుంచీ వారితో మన సంఘాన్నిగురించి చెప్పాలి. మన సంఘం సాధించిన విజయాలు కథలరూపంలో చెప్పాలి. దీనికిగాను మనం పట్టణాలలో ఒకవిధంగాను, పల్లెటూళ్ళలో ఒకవిధంగాను నిర్మాణ పద్ధతులు అవలంబించాల్సివుంటుంది.

పట్టణాలలో :—స్కూళ్లలో సంఘంలో చేరడానికి అర్హతలేని 12 ఏండ్ల లోపు విద్యార్థులుంటారు. వీరు ఈనాడు విద్యార్థిసంఘంతో సంబంధంలేకుండా వున్నారు. పైగా రాష్ట్రీయ స్వయంసేవక సంఘం వీరిని ఆటల కార్యక్రమంతో ఆకర్షించి విషపూరితం చేస్తోంది. వీరినందరినీ బాలసంఘాల్లలో ఆర్గనైజు చేయడానికి పట్టణవిద్యార్థిసంఘాలు కృషిచేయాలి. ఆపట్టణంలో బాలసంఘం ఆర్గనైజు చేసివుంటే ఆయాపేటల బాలసంఘబ్రాంచీలతో వీరినిగూడాకలపాలి. ప్రతిపేటలోని బాలవిద్యార్థులను ఆయాపేటల బాలసంఘాలలో ఆర్గనైజు చేయాలి. ప్రతిరోజు సాయంత్రం కార్యక్రమం నడపడానికి, ఆటలు, డ్రిల్లు చెప్పడానికి పేట కేంద్రాలు తెరువాలి. ఆటలు, డ్రిల్లు చెప్పడానికి ఒకవిద్యార్థి వర్కరును నియమించాలి.

పల్లెటూళ్ళలోనున్న హైస్కూళ్ళలో :—ఈ హైస్కూలుకు విద్యార్థులు ఎక్కువమంది, చుట్టుపట్ల గ్రామాలనుండి వస్తారు. స్థానికంగా వుండేవారు చాలతక్కువ. అందువల్ల ఆ బాలవిద్యార్థులను ఆయా గ్రామ బాలసంఘాలలో చేర్పించే బాధ్యత విద్యార్థిసంఘ వర్కర్లు తీసుకోవాలి. విద్యార్థులు వచ్చే ప్రతి గ్రామంలోను, బాలసంఘాన్ని నడుపుటకు ఒకవర్కరును నియమించాలి. ఈ విధంగా చేస్తే బాలవిద్యార్థులందరినీ కూడా సంఘ పతాకంక్రిందకు ఆకర్షించ గల్గుతాం. వారిలో ఇప్పటినుంచి సంఘచైతన్యం తీసుకొనివస్తూ, భవిష్యత్తుకు కూడా ఇప్పుడే పునాదులు వేయగల్గుతాం.

(7) విద్యార్థిసంఘాలు : ఉపాధ్యాయులు :— విద్యార్థులు ఉపాధ్యాయులను శత్రువులుగా పరిగణించడం జరుగుతోంది. కాని వుపాధ్యాయులు కూడా

విద్యార్థులతోపాటు బానిస విద్యావిధానంలో పడియుంటున్నారన్న విషయాన్ని గుర్తించాలి. ఉపాధ్యాయులుకూడా అనేకకష్టాలకు గురియగుచున్నారు. వారిలో కూడా జాతీయభావాలున్నాయి. అందుచేత విద్యార్థి సమస్యలమీద మనం పోరాటం సాగించేటప్పుడు ఉపాధ్యాయుల సహకారాన్ని పొందాలి. మన పోరాటంలో ఉపాధ్యాయుల సహకారాన్నిగూడా పొందితే తప్పక జయం పొందుతాం. కాన మనం ఉపాధ్యాయుల పట్లనున్న శత్రుభావాన్ని వదలి వారి సమస్యలను కూడా తీసుకుని ఆందోళనచేస్తూ ఉపాధ్యాయుల, విద్యార్థుల ఐక్యతను నిర్మించాలి. సంఘవర్కర్లు క్లాసులలో ఆదర్శవిద్యార్థులుగా నుంటే ఉపాధ్యాయుల సానుభూతిని సంపాదించగల్గుతాం. కల్చరల్ కార్యక్రమం నడిపేటప్పుడు ఉపాధ్యాయుల సహకారాన్ని పొందాలి. విద్యార్థులను అన్నివిధాలా అభివృద్ధిపరచే కల్చరల్ కార్యక్రమాన్ని అభివృద్ధినికోరే ఏ ఉపాధ్యాయుడు వ్యతిరేకించడు. వ్యతిరేకించే వారిని మిగినవారినుండి వేరుపరుస్తూ ఉపాధ్యాయుల సహకారాన్ని పొందాలి. స్థానికప్రజల ఇబ్బందులను తొలగించుటకు, ప్రజలకు సేవచేసే విషయాలమీద విద్యార్థుల ఉపాధ్యాయుల ఐక్యకమిటీలను ఏర్పరచి పనిచేయాలి. పై పనులు చేస్తూ ఉపాధ్యాయుల కోర్కెలకొరకు గూడా మనం పోరాడాలి. 50 రూ. తక్కువ జీతమున్న ఉపాధ్యాయులకు యుద్ధ అలవెన్సులు యివ్వాలి. తెలుగు పండితులకు కూడా బి. ఏ. యల్. టిల స్కేలుప్రకారం జీతాలు ఇవ్వాలి. తరచుగాను, సంవత్సరముమధ్య ట్రాన్సుఫర్లు చేయకూడదు. ఇవిగాక ఇంకా ఉపాధ్యాయుల న్యాయమైన కోర్కెలను తెలుసుకుని వాటికొరకు పోరాడాలి. అప్పుడే మనం ఉపాధ్యాయుల విద్యార్థుల మధ్య ఐక్యతను నిర్మించగల్గుతాం. ఈ ఐక్యత నిర్మించితే, డిటెన్షన్లు చేయాలని రూల్సువున్నా చాలవరకు లేకుండా చేయగల్గుతాం. విద్యార్థులయొక్క ఇతర స్థానికసమస్యలనుకూడా పరిష్కరించి సంఘాన్ని చాలముందుకు తీసుకు పోగల్గుతాం.

(8) 'బాగా చదవాలి' డిటెన్షన్లు :—క్లాసు పుస్తకములను చదువకపోవడం సంఘ వర్కర్లకు ఒక జబ్బుగా తయారయింది. క్లాసులలో మార్కులురాకుండా వుంటే సంఘంలో పనిచేసేవారికి విద్యార్థులలోగాని, ఉపాధ్యాయులలోగాని విలువ యుండదు. కాన క్లాసులో ఆదర్శ విద్యార్థిగా నున్నపుడే ఆదర్శసంఘవర్కరుగా తయారవుతాడు. సంఘవర్కర్లు చదవడమేగాక విద్యార్థులనందరినీ చదువ

సభ్యత్వం యెక్కువగానున్న ప్రదేశాలలోను తప్పక Whole timers ను నియమించాలి. (4) పార్టీ ఆర్గనైజర్లు విద్యార్థి సమస్యలను తెలుసుకొనుటకుగాను "ది స్టూడెంటు", ఇతర విద్యార్థి సంఘ ప్రచురణలను చదవాలి.

విద్యార్థిసంఘ ఆర్గనైజర్ల విధులు :— విద్యార్థిసంఘ ఆర్గనైజర్లు స్థానిక సంఘాలకు వెళ్ళినప్పుడు యేదో యిన్‌స్పెక్టర్లలాగా తనిఖీచేసి రావడంగాక అక్కడ కనీసం మూడురోజులపాటుండి అచ్చట సమస్యలను తెలుసుకొని కార్యక్రమం యివ్వాలి. స్థానికసంఘ వర్కింగుకమిటీని సమావేశపర్చడంతో సంతృప్తిపడక విద్యార్థుల జనరలుబాడీ మీటింగులుకూడా పెట్టాలి. అప్పుడే విద్యార్థులందరిలో నాయకత్వం సర్వవిదితం అవుతుంది. స్థానిక సంఘానికి వెళ్ళినపుడు అచట సెల్లునుకూడా సమావేశపరచి సెల్లును అభివృద్ధిపరచడానికి, సంఘాన్ని ముందుకు తీసుకుపోడానికి తగిన సలహాలు యిచ్చిరావాలి. విద్యార్థులలో పార్టీని అభివృద్ధిపరచితేనే విద్యార్థి వుద్యమం ముందుముందుకుపోతుందన్న విషయాన్ని గుర్తించాలి. విద్యార్థిసంఘ ఆర్గనైజరంటే ఆ రంగంలో పార్టీ ఆర్గనైజరన్న మాట.

విద్యార్థి పార్టీసభ్యుల రాజకీయ శిక్షణ :— మనం ప్రజలకెప్పుడూ వారి స్థాయినిబట్టి, వారి జీవితానికి అన్వయించి రాజకీయాలు చెపుతాం. కాన విద్యార్థులకు, ఇతర దేశాల విద్యావిధానాలగురించి చెపుతూ, ఆ యా దేశాల పాలసీలను కూడా చెప్పవచ్చు. విద్యావిధానంలో సోవియటు యూనియన్ సాధించిన విజయాలు చెప్పడమంటే ఆ విధానాన్ని తీసుకునివచ్చిన కమ్యూనిస్టుపార్టీని ప్రచారం చేయడం. అందుచేత విద్యార్థి పార్టీసభ్యులు సోవియటు, అమెరికా, బ్రిటను విద్యావిధానాలమీద పుస్తకాలు చదవాలి. మన దేశంలోనున్న విద్యావిధానాన్ని గురించి తెలుసుకొని వీటికి తారతమ్యం చూపించాలి.

మన కామ్రేడ్సు విద్యార్థి నాయకులుగా తయారుకావాలంటే ఏమిచేయాలి :—

క్లాసు పాఠములు జాగ్రత్తగా చదువుతూ ఆదర్శ విద్యార్థిగానుండాలి. స్కూలుతరఫున నడుపబడు ఆటలలో మన కామ్రేడ్సు తప్పకుండా పాల్గొని ఆటలాడువారిలో నాయకత్వం సంపాదించాలి. ఉపాధ్యాయులలో సత్ప్రవర్తనతో మెలగాలి. అన్ని విషయాలలోను విద్యార్థులకు ఆదర్శులుగా నుండాలి.

ఎలిమెంటరిస్కూళ్ళ ఉపాధ్యాయులు

సమాజంయొక్క విజ్ఞానాన్ని భద్రపరచి, భావిపౌరులైన విద్యార్థులకు ఆ విజ్ఞానాన్ని అందజేస్తూ వారికి తర్ఫీదు ఇచ్చేవారు ఉపాధ్యాయులు. సమాజంలో ఉపాధ్యాయులకు ఇంత ఉన్నతమైన స్థానమున్నా, నేడు మన దేశంలోఉన్న బీదతనంవల్ల ప్రజలు విద్యయొక్క అవుసరాన్ని గుర్తించలేకుండా ఉన్నారు. అందుచేత ఉపాధ్యాయులు గూడ తమ వృత్తియొక్క గొప్పదనాన్ని గ్రహించలేకుండా ఉన్నారు. మన దేశానికి స్వాతంత్ర్యం రావడంతో నిర్బంధప్రాథమికవిద్య ప్రవేశపెట్టబడుతుంది. అప్పుడు ఉపాధ్యాయులకు అర్హస్థానం లభించుతుంది. వారి కష్టాలు చాలవరకు గట్టెక్కుతాయి.

యువజనసంఘాలు, విద్యార్థిసంఘాల ఆధ్వర్యంక్రింద బాలసంఘాలను నిర్మించాం. కాని అవి వాటిని సరిగానడపడానికి శిక్షణబొందినవారు లేకపోవుటచే, అభివృద్ధిగావడంలేదు. యువజనవర్కర్లు బాలుర మనోప్రవృత్తిని కనిపెట్టి, వారిని ఉత్సాహపరచి, వారిచే ఆటలు ఆడించడం పాటలు పాడించడం చేయలేకపోతున్నారు. బాలురతో మెలగగల వోపిక, వారిని అభివృద్ధిచేయగలిగిన పద్ధతులు ఎలిమెంటరీస్కూలు ఉపాధ్యాయులకు తెలుసు, అందుచే బాలసంఘాలు అభివృద్ధికావాలంటే, ఉపాధ్యాయరంగాన్ని నిర్మించాలి. ఉపాధ్యాయులలో చాలమంది పార్టీసభ్యులున్నప్పటికీ, వారికి అసంఖ్యాకమైన కష్టాలున్నప్పటికీ, పార్టీ ఇంతవరకు ఉపాధ్యాయరంగాన్ని నిర్మించలేదు. మన పార్టీలో బలహీనమైన రంగం ఉపాధ్యాయరంగమే. అందుచేత ఆర్. యస్. యస్., హిందూమహాసభలు తమ అభివృద్ధినిరోధకమైన సిద్ధాంతాలను బాలురలోనూ, విద్యార్థులలోనూ ప్రవేశపెట్టడానికి ఉపాధ్యాయులను ఉపయోగించుకో జూస్తున్నాయి. అప్పుడే కొంతమంది ఉపాధ్యాయులను ఆకర్షించిందిగూడా. మనం త్వరపడి ఉపాధ్యాయసంఘాలను అభివృద్ధి రాజకీయపంథా మీద ఆర్గనైజు చేయకపోతే, పై అభివృద్ధినిరోధక సంస్థలు ఉపాధ్యాయులలో బలమైన స్థానాన్ని సంపాదించి, వారిద్వారా విద్యార్థులను తమ దేశవినాశన పద్ధతులకు బలిజేస్తాయి.

ఇప్పుడు మనపార్టీలోకి అనేకమంది చదువురానివారు వచ్చారు. మనపార్టీ ప్రజాపార్టీ అయ్యేకొలదీ, ఇంక ఎంతోమందివస్తారు. వీరందరికీ చదువుట వ్రాయుట నేర్పాలిసి ఉంది. వీరికి ప్రాథమిక రాజకీయ భూగోళిక పరిజ్ఞానం కల్పించాలి. ఇందుకు ఉపాధ్యాయులు ఎంతేని అవుసరం.

పార్టీదృష్టిలో ఉపాధ్యాయరంగం ఇంత ప్రాముఖ్యమైన స్థానం వహిస్తోంది. కనుక ఇకముందైనా జిల్లాకమిటీలు శ్రద్ధవహించాలి.

సమస్యలు

(1) అధికధరల అలవెన్సు :—సామాన్య ఉపాధ్యాయ కుటుంబానికి నెలకు కనీసం రు 60—0—0 ఖర్చవుతుంది. కాని బోర్డుస్కూలు ఉపాధ్యాయులకు నెలకు రు 18, గ్రాంటుస్కూలు ఉపాధ్యాయులకు రు. 14 జీతం వస్తుంది. యుద్ధంపూర్వం రోజుల్లో

నెలకు కుటుంబానికి షుమారు రు. 25 ఉండేది. ఆరోజుల్లో ఏదోవిధంగా ఉపాధ్యాయులు జీవితం గడిపేవారు. కాని ఇప్పుడు ఆదాయానికి ఖర్చుకు ఎక్కడా అందికలేదు. అందుచే ఉపాధ్యాయులు, స్కూలుపని సరిగా చేయకుండా, ఉపవృత్తులు చేస్తున్నారు. ఇందువల్ల విద్యావిధానం దెబ్బతింటోంది.

ప్రభుత్వంప్రకటించిన స్కేళ్లప్రకారం పెద్దపట్టణాలలో రు11-8-0, చిన్నపట్టణాలలో రు 8-0-0, గ్రామాలలో రు 6-8-0 అధికధరల అలవెన్సుకోసం ఆందోళన చెయ్యాలి.

అంతేగాక గ్రామాల్లో ఉపాధ్యాయులు శ్రద్ధగా చదువుచెపుతూ, తమకు గ్రామస్థులు ఆర్థికంగా సహాయం చేయకపోతే వేరేవృత్తులు ఎలాచూచుకోవాలిసి వస్తుందో, అందువల్ల విద్యావిధానం ఎలా దెబ్బతింటోందో, గ్రామస్థులకు నచ్చజెప్పాలి. గ్రామస్థులనుండి చందాలు వసూలుచేసి, నెలవారీగా డబ్బుసహాయంగూడ చేస్తూఉండాలి.

(2) ఉపాధ్యాయులు - స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్లు :— ఇన్‌స్పెక్టర్లు ప్రొబేషనరీ ఉపాధ్యాయుల వద్దనుండి ప్రాక్టికలు పరీక్షకు లంచాలు పుచ్చుకొంటారు. ఉపాధ్యాయులు నోరుమెదిపితే సర్టిఫికట్టు తీసుకుపోయి ఈ సర్టిఫికట్టు రద్దుచేస్తామని బెదరించుతారు. స్కూలులో అన్నిక్లాసులలో పిల్లలసంఖ్య నిష్పత్తి (Ratio) రూలుప్రకారంలేదనీ స్కూలు రికగ్నిషను రద్దుచేస్తామని బెదరించుతారు. స్కూలులో అవుసరమైనప్పుడే విద్యార్థులకు అర్ధసంవత్సరం ప్రమోషనులు ఇవ్వవచ్చుననిఉన్నా, అర్ధసంవత్సరం ప్రమోషనులు ఎందుకు చేయలేదని నిర్బంధించుతారు. ఈవిధంగా ఉపాధ్యాయులమీద ఎన్నో నిర్బంధాలుపెట్టి, వారివద్దనుంచి లంచాలు పుచ్చుకుంటారు.

ఈవిధంగానే జిల్లా ఎడ్యుకేషనలు ఆఫీసులోని గుమాస్తాలుగూడ లంచాలకోసం ఎన్నోబాధలు పెడుతూఉంటారు.

ఉపాధ్యాయులు స్కూలును ఆదర్శంగా నడిపి ప్రజల సానుభూతిని సంపాదించుటద్వారాను, తమవిధిని తాము నెరవేర్చుతూ ఇన్‌స్పెక్టర్లకు తప్పులు వెతకడానికి అవకాశం ఇవ్వకుండా ఉండుటద్వారాను, ఇన్‌స్పెక్టర్ల లంచగొండితనాన్ని ఎదుర్కోవాలి.

(3) ఎయిడెడ్ స్కూలు ఉపాధ్యాయులు :— ఎయిడెడ్ స్కూళ్ళలో కొన్ని ప్రత్యేక మానేజర్లక్రిందను, కొన్ని టీచరు మానేజర్లక్రిందనూ ఉన్నవి. ఎయిడెడ్ స్కూళ్ళ మానేజర్లు ఇతరులైనా టీచర్లుఅయినా, ఇతర టీచర్లకువచ్చే రు. 14 లో కొంత మినహాయించుకొని పూర్తిగా ఇచ్చినట్లుగా సంతకం పెట్టించుకుంటారు. స్కూళ్ళు తమ సొంత ఆస్థిగా చూచుకుంటారు. టీచర్లను తమకు ఇష్టంవచ్చినప్పుడు తీసివేస్తూఉంటారు.

మానేజర్లు టీచర్లను ఇలా అవస్థపెడుతున్నా, టీచర్లకూ మానేజర్లకు ప్రభుత్వ ఎడ్యుకేషనలు డిపార్టుమెంటువల్ల అనేక బాధలున్నాయి. ఇన్‌స్పెక్టర్లు ఏదో సాకుబెట్టి స్కూళ్ళగ్రాంటులు తగ్గిస్తూఉంటారు. ఎయిడెడ్‌స్కూళ్ళ సంఖ్య ఎక్కువ అయినప్పుడు,

పాతస్కూళ్ళకు 'కోత' పెట్టి, ఉన్నగ్రాంటునే సర్దుతూఉంటారు. ఏదోసాకుబెట్టి గ్రాంటు స్కూళ్ళను ఎత్తివేయ జూస్తూఉంటారు. జిల్లాబోర్డు టీచర్లకు కనీసజీతం రు 18 అయితే ఈ టీచర్లకు రు. 14. అదీగాక జిల్లాబోర్డు టీచర్లకువలె వీరికి ప్రతినెలారాదు. అంతేగాక ఎయిడెడ్ స్కూలు టీచర్లకు జీతంతో శలవులులేవు. టీచర్లకు, టీచరు మానేజర్లకు ఇద్దరికీఉన్న ఈ కష్టాలమీద, వీరిద్దరినీ ఐక్యం చేయవచ్చు. ఈఐక్యతను సాధించుటద్వారానే ఎయిడెడ్‌స్కూలు టీచర్ల కష్టాలను పోగొట్టగలుగుతాం. అంతేగాక ఈటీచర్లు తాము విద్య సక్రమంగాచెబుతూ, గ్రామప్రజల సానుభూతిని సంపాదించి, టీచరు మానేజరు యొక్క అక్రమచర్యలను అరికట్టవచ్చును.

వెంకటరామ అండు కో, ఓరియంటలు బుక్కు పబ్లిషింగుకంపెనీ అనే రెండు పుస్తక కంపెనీలున్నవి. ఎయిడెడ్‌స్కూళ్ళలో తమతమ పుస్తకాలు పెట్టించుకోడానికి, ఈ రెండు కంపెనీలు రెండు రాష్ట్రటీచరు మానేజర్ల సంఘాలను ఏర్పరచి, రెండు పత్రికలుబెట్టి, ఎయిడెడ్‌స్కూలు టీచర్లలో చీలికలు కల్పించినవి. స్వలాభంకోసం ఏర్పడిన ఈ సంఘాలలోకిటీచర్లు పోకుండాచేయాలి. ఉపాధ్యాయ సంఘాలమీద రాష్ట్రసర్క్యులరులో సూచించిన పుస్తకాలనే టెక్స్టుబుక్కులుగా పెట్టాలి. ఈ ఉపాధ్యాయులలో ఐక్యత తీసుకురావాలి. టీచరు మానేజర్లను తాలూకా ఎయిడెడ్‌స్కూలు టీచర్లసంఘాలలో చేర్చాలి.

(4) బోర్డు ఎలిమెంటరీస్కూలు ఉపాధ్యాయులు :— వీరిని బోర్డు ఉద్యోగులు తరచుగా ట్రాన్స్ఫర్లు చేయడం, "On request" "Punishment" మీద ట్రాన్స్ఫరు చేశామని వ్రాసి ట్రావెలింగు అలవెన్సులు ఎగవేయడం, బోర్డు గుమాస్తాలు చీటికిమాటికి లంచాలు పుచ్చుకోవడం, మొదలైన ఎన్నో కష్టాలు ఉన్నవి. ధైర్యంగా ఎదుర్కొని ఆందోళనచేస్తే, నర్సాపురం తాలూకా బోర్డు ఎలిమెంటరీ టీచర్సు యూనియనువలె, వీటిని అరికట్టవచ్చును.

(5) మిషనుస్కూలు ఉపాధ్యాయులు :— వీరికి ఇచ్చే రు 14 లు జీతంలోనూ దాదాపు రు 4 లు మతపు ఫండులక్రిందనే మినహాయించబడుతుంది. అంతేగాక మిషనరీలు ఇష్టంవచ్చినప్పుడు తీసివేస్తూఉంటారు. వీరికి ఎట్టి పౌరసత్వహక్కులులేవు.

ఈ ఉపాధ్యాయులు తమ డ్యూటీని సక్రమంగాచేస్తూ, వ్యవసాయకూలీలకు వారి బాధలలో తోడ్పడుతూ వారి సానుభూతిని సంపాదించితే, మిషనరీలమీద ప్రజావత్తిడి తీసుకువచ్చి మిషనరీల బాధలను చాలవరకు తొలగించుకోవచ్చును.

(6) నూతన బోధనాపద్ధతులను ప్రవేశపెట్టుట :—టీచర్లకు అక్షరాలుదిద్దించే ఖండపద్ధతి మంచిదిగాదనీ, నూతన బోధనాపద్ధతులు (బొమ్మలు, ఆటవస్తువులద్వారా విద్య నేర్పుట) ద్వారా విద్య చెప్పాలనీ, ట్రెయినింగులో చెప్పబడుతుంది. కాని టీచర్లు, ఎక్కువ

మంది పిల్లలకు చెప్పాలిసివచ్చుటచేతనూ, ఒకే టీచరు 4 లేక 5 క్లాసులకుగూడ చదువు చెప్పాలిసివచ్చుటచేతనూ, చివరకు విసుగుచెంది పాత బండపద్ధతినే అనుసరించుతున్నారు.

పై క్లాసుల విద్యార్థులను క్రిందిక్లాసుల కుపయోగించియూ, చదువుట, వ్రాత, లెఖ్ఖలు ఈమూడు సబ్జెక్టులమీద కేంద్రీకరించియూ, నూతన బోధనాపద్ధతులనే ఉపాధ్యాయులు అనుసరించేలా చేయాలి. మన కామ్రేడ్సు తమ స్కూళ్ళలో ఈ పద్ధతులను ప్రవేశపెట్టి, మిగతా ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయంగా ఉండాలి.

(7) సెంటరుక్లాసులు :— కార్మికులకు ఫ్యాక్టరీ ఎలాగో ఉపాధ్యాయులకు సెంటరుక్లాసు అంతే. బోర్డుస్కూలు, ఎయిడెడ్, మిషనరీ మొదలైన ఒకసెంటరులోని అన్ని స్కూళ్ళ ఉపాధ్యాయులు నెలకు ఒకరోజున కలుసుకుంటారు. ఆ సెంటరుక్లాసుకు ఒక ఎన్నుకోబడిన సెక్రటరీ ఉంటాడు. ఈ సెంటరుక్లాసులో ప్రభుత్వపు జి. ఓ. లు చదవబడతాయి. ఉపాధ్యాయుల కష్టాలనుగూర్చి తీర్మానాలను జేయవచ్చును. డిబేటు, వ్యాసం వ్రాియడం గూడ ఉంటాయి.

ఈ సెంటరుక్లాసులను ఉపాధ్యాయుల కష్టాలను చర్చించి ఆందోళన చేయుడానికి, నూతన బోధనాపద్ధతులను ఉపాధ్యాయులలో ప్రవేశపెట్టడానికి, బోధనాపద్ధతులలో వచ్చిన అనుభవాన్ని అందరూ ఉపాధాయులకు అందజేయడానికి, ఉపాధ్యాయులలో రాజకీయాలు చొరబెట్టడానికి, మన కామ్రేడ్సు ఉపయోగించాలి. ఈ సెంటరుక్లాసులను ఐక్యఉపాధ్యాయ ఉద్యమం నిర్మించడానికి పునాదిగా చేసుకోవాలి.

(8) మన కామ్రేడ్సు ప్రస్తుతం స్కూళ్ళలో పాఠాలు సరిగా చెప్పక ఇతర పార్టీపని చేయుటచేతనూ, ఉపాధ్యాయుల జీవితానికి రాజకీయాలను అన్వయించి వారిలోప్రచారం చేయడానికి బదులు ఉపాధ్యాయుల కందనిస్థాయిలో రాజకీయాలు వారితో మాట్లాడుటచేతనూ, మన కామ్రేడ్సు ఉపాధ్యాయ సామాన్యానికి దూరమయ్యారు.

మన కామ్రేడ్సు తమస్కూళ్ళను అన్నివిధాల ఆదర్శ పాఠశాలలుగాచేసియూ, ఉపాధ్యాయులకు సంబంధించిన జి. వో. లు సరిగాచదివి వారికి సలహాలిచ్చియూ, ఉపాధ్యాయుల కష్టాల నివారణకు ముందుండి ఆందోళనచేసియూ, సెంటరుక్లాసులలో రెగ్యులరుగా పాల్గొంటూ ప్రతివిషయంలోనూ మిగతా ఉపాధ్యాయులకు ఆదర్శంగా ఉండియూ, ఉపాధ్యాయ సామాన్యంయొక్క నాయకులుగా తయారుగావాలి.

(9) ఉపాధ్యాయసంఘాలు :— బోర్డు ఎలిమెంటరీస్కూలు ఉపాధ్యాయులకు, ఎయిడెడ్‌స్కూలు ఉపాధ్యాయులకు, టీచరుమానేజర్లకు ప్రత్యేకంగా తాలూకాసంఘాలున్నవి. ఒక్క నర్సాపురం తాలూకాసంఘంతప్ప, మిగతా తాలూకా సంఘాలన్నీ సంవత్సరానికొకసారి ఇన్‌స్పెక్టర్ల అజమాయిషీక్రింద సమావేశాలు జరపడం, సంవత్సరమంతా మూలగూర్చోడం చేస్తూఉన్నవి. మనం ప్రస్తుతమున్న ఈ తాలూకా సంఘాలనే

సజీవంగా చెయ్యాలి. టీచరుమానేజర్లనుగూడ ఎయిడెడ్‌స్కూలు టీచర్లసంఘంలో చేర్చాలి. ఈ తాలూకాసంఘాలన్నిటిని కలిపి ఒకే సంఘంగా ఆర్గనైజుచేయడానికి జి. ఓ. లో అవకాశంలేదు. కాన ప్రస్తుతం మనం ఈవిధంగానే వేరువేరుగానే తాలూకా సంఘాలను సజీవంగా చెయ్యాలి.

సంవత్సరానికొకసారి జరిగే తాలూకా మహాసభల సమయంలో, అన్నిరకాల టీచర్లు సమావేశమయి ఎడ్యుకేషనలు డిపార్టుమెంటుకు సంబంధించిన తీర్మానాలను సమిష్టిగా చేయవచ్చును. కాని వీటిని అమలు జరుపడానికి ఒక ఐక్యకమిటీని ఎన్నుకోడానికి ఇన్‌స్పెక్టర్లు అభ్యంతరపెడుతున్నారు. కమిటీ ఎన్నుకోడానికి వీలులేకపోయినా, తాలూకాలోని టీచర్లందరియొక్క సమావేశాలు జరిపి తీర్మానాలు చేస్తూఉండాలి. ఉపాధ్యాయ ఉద్యమం బలపడిన తర్వాత, ఐక్యసంఘాన్ని నిర్మించవచ్చును.

(10) హైస్కూలు టీచర్లకు జిల్లాటీచర్సు గిల్డు అని ఒక జిల్లాసంఘంముంటుంది. ఇదిగూడ సంవత్సర సభను జరపడం తప్ప మరేమీ చేయడంలేదు. దీనినిగూడ వీలున్నచోట్ల సజీవంగాచెయ్యాలి.

(11) పార్టీనిర్మాణం :— (అ) సెంటరు క్లాసులు, తక్కువగా ఉన్నచోట్ల తాలూకాల పునాదిమీద, ఉపాధ్యాయ కామ్రేడ్సుకు ప్రత్యేకసెల్లులను నిర్మించాలి.

(ఆ) ఉపాధ్యాయుల సమస్యలు ప్రతిసెల్లు కార్యదర్శిగాని, ఆర్గనైజరుగాని క్షుణ్ణంగా తెలుసుకొని, ఆసెల్లులను నడపడం అసంభవం కనుక తాలూకాలో ఒక ఆర్గనైజరు సమస్యలను రెగ్యులరుగా తెలుసుకొంటూ ఉండాలి. అతడే ఈ సెల్లులను సమావేశపరుస్తూ, వాటిని నడుపుతూఉండాలి.

మహిళాసంఘం

జనాభాలో 100 కి 50 మంది స్త్రీలు. మనదేశంలో ఇంకనూ జమీందారీ విధానపు కట్టుబాట్లు (ఘోషా, బాల్యవివాహాలు, విడాకులు లేకపోవుట మొదలైనవి) ఎన్నో ఉండుటవల్ల, స్త్రీలు చాల వెనుకబడిఉన్నారు. కాంగ్రెసు ఉద్యమం కొద్దిమంది రైతు మధ్యతరగతి స్త్రీలను కదిపి, రాజకీయాల్లోకి తీసుకువచ్చిందిగాని, స్త్రీసామాన్యంలో మార్పు తీసుకురాలేదు. ప్రస్తుత యుద్ధంవల్ల స్త్రీలలో సంచలనం గలిగింది. ప్రపంచ విషయాలు తాముగూడ తెలుసుకోవాలనే ఆసక్తి గలిగింది. మనపార్టీ స్త్రీలలో ఉద్భవించిన ఈఉత్సాహాన్ని పురస్కరించుకొని కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలలో నామమాత్రంగాఉన్న మహిళాసంఘాలను సజీవంగాజేసి, ప్రజాసంఘాలుగాచేసింది. గుంటూరుజిల్లాలో మహిళాసంఘాన్ని నిర్మించింది. ఇంకా చాల ఇతరచోట్ల స్థానికమహిళాసంఘాలను ఏర్పరచింది.

స్త్రీలందరు ఏదో ఒకవిధంగా జమీందారీయుగపునాటి సాంఘిక దురాచారాలవల్ల బాధపడుచుండుటచేతనూ, పురుషులతోపాటు సమాన ప్రజాస్వామికహక్కులు (ఓటింగు

హక్కు, ఆస్తిహక్కు) లేకపోవుటచేతనూ, ముఖ్యంగా ఆంధ్రదేశంలో మహిళాఉద్యమం జమీందారీయుగపు కట్టుబాట్లకు వ్యతిరేకంగా పాటుబడే ప్రజాస్వామికోద్యమంగా ఉంటుంది. అంతేగాక ప్రస్తుత క్లిష్టపరిస్థితుల్లో మహిళాఉద్యమం జాతీయైక్యతా ఉద్యమంలో ఒక ముఖ్యమైనభాగం గూడాను. జనాభాలో 100 కి 50 మందిగాఉన్న స్త్రీలు జాతీయైక్య కార్యక్రమంలోనికి రానిదే, జాతీయైక్యత రానేరదు. రైతుస్త్రీలను రైతుసంఘాలకు, వ్యవసాయకూలీ స్త్రీలను కూలీసంఘాలకు, కార్మికస్త్రీలను కార్మికసంఘాలకు, సహాయకశక్తి (auxiliary force)గా ముందుకు తీసుకువస్తే, ఆయా సంఘాలు తమ దేశభక్త కార్యక్రమం నిర్వహించుటలో ఎంతో ముందుకు పోగలుగుతాయి.

కామ్రేడ్సు ఒక విషయం గుర్తుంచుకోవాలి. ప్రస్తుతం మహిళలు సాంఘికంగా చాల అణగద్రొక్కబడి ఉన్నారు. పురుషుల సహాయంలేనిదే వారు ముందుకు రాలేరు. కనుక రైతుసంఘం, కార్మికసంఘం, యువజనసంఘం మొదలైన సంఘాలు బలంగాలేక పురుషులలో కొంత రాజకీయ చైతన్యంలేనిచోట్ల, మహిళాసంఘాలకు పురుషులు అడ్డు తగులుతారు. అట్టిచోట్ల ఏయితర సంఘం సహాయంలేకుండా మహిళాసంఘం పనిచేయడం కష్టం. కనుక ఇతర సంఘాలు బలంగాఉన్నచోట్ల, ముందుగా మహిళాసంఘాలను ఆర్గనైజుచేయడం సులభం.

మనదేశాన్ని రక్షించుకోవాలంటే, ప్రస్తుత క్లిష్టపరిస్థితివల్ల స్త్రీ సామాన్యంలో గలిగిన సంచలనాన్ని నిర్మాణరూపంలో పెట్టి, 100 కి 50 మందిగా ఉన్న మహిళలను జాతీయైక్య కార్యక్రమంలోకి తీసుకురావాలి.

సమస్యలు

(1) ఆరోగ్యకరమైన పద్ధతులమీద ఆహారం వండించుట. తవుడుఉన్న బియ్యం అత్తెసరుపెట్టి అన్నంవండించుట, సాధ్యమైనంతవరకూ కూరలు చెక్కుతీయకుండాను, ఉడకబెట్టి సారం పారబోయకుండాను వండించుట, చింతపండు, కారం చాల తగ్గించుట. నిమ్మకాయలు పండే నర్సాపురం, తణుకు తాలూకాలలో, చింతపండు బదులు నిమ్మకాయలు వాడేలాచేయుట. ఈ పద్ధతులను ముందు మన మహిళావర్కర్లు ఆచరణలోపెట్టి మిగతా స్త్రీ సామాన్యానికి ఆదర్శప్రాయంగా ఉండాలి.

(2) పశుసంపదను అభివృద్ధిచేయుట. మహిళాసంఘం బలంగా ఉన్న ప్రతిగ్రామంలోనూ ఒక మాళీదున్నపోతును తెప్పించాలి. దీనిద్వారా మన నాటుగేదెలసంతతిని మార్చివేసి, మాళీసంతతిగా తయారుచెయ్యాలి. ఆధునికపద్ధతులమీద పశువులను మేపించి, ఎక్కువ పాలుఇచ్చేలా చెయ్యాలి.

ఖర్చులేకుండా కొంత ఆదాయం కోళ్ళవల్ల ఇప్పుడు వస్తూంది. కాని రోజూ గుడ్లుపెట్టే లెగ్‌హారన్, రోడ్ఐలండురెడ్సు మొదలైన జాతులను పెంచితే, ఆదాయం చాల

వస్తుంది. కానీ వీటిని జాగ్రత్తగా పెంచాలి. కోళ్ళు సామాన్యంగా జబ్బులు వచ్చి వందలాదిగా చచ్చిపోతూ ఉంటాయి. కోళ్ళకు వచ్చేజబ్బులు ఎందుకొస్తాయి. వాటిని రాకుండా చేయడానికి మార్గాలేమిటి, ఆ జబ్బులను పోగొట్టడానికి ఉపాయాలు, మొదలైనవాటిని గూర్చి మహిళావర్కర్లు తెలుసుకోవాలి. ఆ విజ్ఞానాన్ని సామాన్య స్త్రీలకు అందజెయ్యాలి.

తేనెటీగల పెంపకం సంగతిచూదాం. తోటలు పువ్వులచెట్లు ఎక్కువగాఉన్నచోట్ల, తేనె పెట్టెలను పెట్టవచ్చును. రోజూ కొంత శ్రమజేస్తే సరిపోతుంది.

పై పనులన్నిటిలోనూ మన స్థానిక మహిళావర్కర్లు ముందు ఆరితేరాలి. వారు సామాన్య స్త్రీలలో ఈ నూతన పరిశ్రమలను ప్రవేశపెట్టాలి : వీటికి వ్యవసాయ డిపార్టుమెంటు, వెటర్నరీ డిపార్టుమెంటుయొక్క సహాయంగూడ తీసుకోవాలి.

(3) లెట్రిన్సు :— పట్టణాలలోనూ, మాగాని గ్రామాలలోనూ స్త్రీలు పాకీదొడ్లు లేక చాల అవస్థపడుతూఉంటారు. పట్టణాలలో బీదస్త్రీలు నివశించేస్థలాలలో పాకీదొడ్డికోసం ఆందోళనచేసి, మున్సిపాలిటీలచే కట్టించాలి. గ్రామాలలో పంచాయితీ బోర్డులు, గ్రామాల ఉమ్మడి సొమ్ము, స్త్రీలవద్దనుంచి చందాలు ప్రోగుజేసి, గ్రామసమిష్టి స్థలాలకు చుట్టూ ప్రహరీ గోడకట్టించాలి. గ్రామసమిష్టిస్థలాలు లేక కొనాలిసివచ్చినప్పుడు, భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవుటవలన డబ్బులేకపోతే, పట్టణాలలోవలె పాకీదొడ్లు కట్టించి, పాకీవాళ్ళను పెట్టాలి.

(4) గర్భిణీస్త్రీలు, శిశుపోషణ, మంత్రసాని :— మనదేశంలో సరియైన ప్రసవసౌకర్యాలు లేకపోవుటవలన, విజ్ఞానంలేని పల్లెటూరి మంత్రసానులనే చాల ఎక్కువగా ఉపయోగించుతూన్నారు. అందుల్ల కొంతమందిస్త్రీలు ప్రసవించలేక చనిపోవడం, ప్రసవించిన తర్వాత సరియైన చికిత్సలేక చనిపోవడం, శిశువులు చాలమంది చనిపోవడం, జరుగుతూఉంది.

పట్టణలలో మున్సిపాలిటీలు కొంతమంది ట్రెయిను మంత్రసానులను పెట్టినవి. వారిని ఉపయోగించుకోవాలి. ఇంకా ఎక్కువమంది కోసం ఆందోళనచెయ్యాలి. గ్రామాల్లో గూడ కొన్ని ముఖ్య గ్రామాల్లో జిల్లాబోర్డు మంత్రసానులున్నారు. వీరినిగూడ ఉపయోగించుకోవాలి. పెద్దపెద్ద గ్రామాల్లో కనీసం ఒక మంత్రసానిని పంచాయితీబోర్డులు ఉంచేలా చెయ్యాలి.

మహిళావర్కర్లు గర్భిణీస్త్రీలు శిశుపోషణకు సంబంధించిన విజ్ఞానాన్ని సామాన్యస్త్రీలలో వెదజల్లాలి. అవకాశమున్నప్పుడెల్ల శిశుప్రదర్శనాలు జరపాలి.

(5) గ్రామాలలో మధ్యాహ్నసమయాలలో రైతుస్త్రీలు విశ్రాంతిగా ఉంటారు. అట్టిసమయాలలో స్త్రీలు కబుర్లుచెప్పుకోడానికి కూడే కేంద్రాలలో, కబుర్లద్వారా రాజకీయ ప్రచారంచెయ్యాలి. టాన్యా, ఝాన్సీ లక్ష్మీబాయి మొదలైన వీరనారీమణుల జీవితచరిత్ర

లను, సాంఘికాభివృద్ధినికోరే పదలు నాటకాలను. ప్రజాశక్తిని చదివి వినిపించాలి. ఈవిధంగా స్త్రీల రాజకీయ విజ్ఞానాన్ని అభివృద్ధిచెయ్యాలి.

వ్యవసాయకూలీ స్త్రీలలోనూ. కార్మికస్త్రీలలోనూ అవకాశమున్నప్పుడు, పఠన కేంద్రాలుపెట్టి రాజకీయ విజ్ఞానాన్ని కల్గించాలి.

(6) ప్రస్తుత మహిళాసంఘాలు గ్రామాలలో రైతు స్త్రీలలోనూ, పట్టణాలలో కార్మికస్త్రీలలోనూ బలంగాఉన్నవి. కాని గ్రామాల్లో వ్యవసాయకూలీ స్త్రీలు, పట్టణాలలో మధ్యతరగతి స్త్రీలు మహిళాసంఘాలలో అంతగా జేరుటలేదు. వీరినిగూడ మన మహిళా సంఘాలలోకి ఆకర్షించాలి. వ్యవసాయకూలీ స్త్రీలలో గర్భిణీస్త్రీలు శిశుపోషణ, లెట్రిను సమస్యలతోపాటు, ఒకేపనికి పురుషులతో సమాన కూలికోసంగూడ ఆందోళనచెయ్యాలి. ఈవిధంగా వారిని ఆకర్షించవచ్చు.

పట్టణాలలోని మధ్యతరగతి స్త్రీలను సాంఘిక దురాచారాలమీద, చర్చలు ఉపన్యాసాలద్వారా ఆకర్షించాలి.

(7) పట్టణాలలోని బీదస్త్రీలకు మంచినీళ్లు, ధాన్యం కరువుగూడ ఉంది. మంచినీళ్ళ సౌకర్యాలకోసం చౌకడిపోలకోసంగూడ పాటుబడాలి.

(8) గ్రామసంఘం సామాన్యస్త్రీలను ఆకర్షించడానికి ఈక్రిందిపనులు చెయ్యాలి.

(అ) లెట్రిన్ సౌకర్యాలు

(ఆ) మంత్రసాని సౌకర్యం

(ఇ) గ్రామవార్షికోత్సవం జరిపి, దానిలో శిశుప్రదర్శనంపెట్టి, బహుమతులివ్వాలి. శిశుపోషణమీద ఉపన్యాసాలిప్పించాలి.

(ఈ) పఠనకేంద్రాలు ఏర్పరచి పుస్తకాలు పత్రికలు చదువుట

గ్రామఆఫీసులో ఉండాలిసిన ఫైళ్ళు :

(1) జిల్లాసంఘ సర్క్యులర్ల ఫైలు

(2) పైసంఘానికి పంపే రిపోర్టుల కాపీలఫైలు

(3) మినిట్సు పుస్తకం

(4) జమా-ఖర్చు పుస్తకం

మున్సిపల్ కార్మికులు

భారతదేశం ఈనాడు అత్యంత క్లిష్టపరిస్థితిలోఉంది. ఒకవైపున తిండిదొంగలు ప్రజల జీవితావసరవస్తువులను దాచివేసి, అధికలాభాలకు అమ్ముకొంటూ, ప్రజలను కరువురాక్షసికి బలిచేస్తున్నారు. తిండిలేక బలహీనపడి ఉన్న ప్రజలమీద కలరా, మశూచికం, మలేరియా మొదలైన జబ్బులు విజృంభించాయి. మనదేశం కరువు అంటు జాడ్యా

లకు బలి అయిపోవడమా లేక ప్రతి భారతీయుడు దేశరక్షణకు పూనుకొని దేశాన్ని ఈ ప్రమాదం నుంచి రక్షించడమా అనేదే నేటిప్రశ్న. రైతులు, వ్యవసాయకూలీలు ఎక్కువ పంటలు పండించాలి, బట్టలకార్మికులు ఎక్కువ బట్టలు ఉత్పత్తిచెయ్యాలి. రైల్వేకార్మికులు సరుకులను అవుసరమైన చోట్లకు త్వరత్వరగా రవాణా అయ్యేటట్లు చూడాలి. మున్సిపలు కార్మికుల కర్తవ్యం ఏమిటి? ప్రజల జీవితావసరాలను ఉత్పత్తిచేసే కార్మికుల యొక్క, ఇతర ప్రజలయొక్క ఆరోగ్యాన్ని కాపాడి, వారికి అధికోత్పత్తిని సాగించడానికి అవుసరమయిన శక్తిని ఇవ్వడమే! పట్టణ పారిశుద్ధ్యానికి బాధ్యత వహించి, పట్టణ ప్రజలందరి ఆరోగ్యాన్ని కాపాడటమే వారి దేశభక్తిపూరిత కర్తవ్యం.

తమ పైకర్తవ్యాన్ని నెరవేర్చుటద్వారానే, వారు ప్రజలయొక్క అభిమానానికి పాత్రులవుతారు. ప్రజలందరి సహాయం పొంది, తమ కష్టాలను పోగొట్టుకోగల్గుతారు. మిగతా కార్మికులకన్న మున్సిపలు కార్మికులకు ప్రజలతో ప్రత్యక్ష సంబంధం ఉంది. అందువల్ల సమ్మెల అవుసరం లేకుండానే ప్రజా సహాయంతో వారు తేలికగా తమ కోర్కెలను సాధించవచ్చు.

అంతేగాదు. మనపార్టీ ఈనాడు పట్టణ మధ్యతరగతి ప్రజల్లో బలహీనంగా ఉంది. వారు మన పాలసీలోని దేశభక్తిని గ్రహించడంలేదు. 1942 అగస్టు సంఘటనల తర్వాత నిస్పృహజెంది, హిందూమహాసభవారి మహమ్మదీయ వ్యతిరేక ప్రచారానికి మోసపోతున్నారు. మన పార్టీకి పట్టణాలన్నిటిలోనూ మునిసిపలు కార్మికులలో పలుకుబడి ఉంది. మున్సిపలు కార్మికుల నందరినీ పట్టణ పారిశుద్ధ్యాన్ని కాపాడటానికి సమీకరించితే, పార్టీ పంథా అంటే ప్రజలఆరోగ్యం కాపాడే పంథా అని గ్రహించుతారు. ప్రజలతోబాటు రాజకీయ పార్టీల నాయకులుగూడ మన పార్టీతో కలిసి రావలసివస్తుంది. ఆహారసమస్య మీద వివిధ రాజకీయపార్టీలు ఐక్యమవడానికి అవకాశ మేర్పడుతుంది. పట్టణాలలో మన పార్టీ ప్రజాఐక్యత సాధించ్గాలంటే, ముందు మున్సిపలు కార్మికులకు పట్టణ పారిశుద్ధ్యాన్ని కాపాడటానికి సమీకరించాలి. పార్టీదృష్టిలో మున్సిపలు కార్మికులు ఇటువంటి ప్రధాన స్థానంలో ఉన్నారు.

(1) సమస్యలు :—కాని తమ దేశభక్త కర్తవ్యాన్ని నెరవేర్చడానికి పార్టీ మున్సిపలు కార్మికులను ఎంతవరకు సమీకరించగలిగింది? పట్టణ పారిశుధ్యం కాపాడటం తమ దేశభక్త కర్తవ్యమని ఇంతవరకూ మున్సిపలు కార్మికులచే గుర్తింపచేయకపోగా, వారు 7 గంటల పని అయినా చేస్తేటట్లు చేయలేకపోయింది. చాలమంది కార్మికులు మస్తరువేయించుకొని, ఇంటికి పోవడం జరుగుతోంది. మున్సిపలు కార్మికులలోని పార్టీ సభ్యులలో సైతం పార్టీ చైతన్యంలేదు. కొందరు పార్టీసభ్యులుగూడ పని సరిగా చేయడం లేదు. కార్మికులలోని ఈ లోపాన్ని ఆధారంగా చేసుకొని, మున్సిపలు అధికార్లు కార్మికులను ప్రజలనుండి దూరం చేస్తున్నారు. పట్టణానికి కావలసినంతమంది కార్మికులను పెట్ట

కుండానే, పట్టణం పరిశుభ్రంగా ఉండకపోవడానికి కారణం కార్మికులని చెబుతున్నారు. కార్మికులు తమ 7 గంటల పనిని సక్రమంగా చేసి, ఇంక ఎంతమంది కార్మికులు అవసరమో ప్రజలకు ప్రత్యక్షంగా చూపడంద్వారానే, మున్సిపలు అధికార్ల దుష్ప్రచారాన్ని బట్టబయలు చేయగలుగుతారు. మున్సిపలు అధికార్లు ప్రస్తుతం తమమీద ప్రారంభించిన దాడిని త్రిప్పి కొట్టివేయగల్గుతారు.

(2) అధికార్ల ఈ దాడికి తోడుగా, మున్సిపలు కార్మికులలోనే విచ్ఛిన్నశక్తులు తల ఎత్తుతున్నాయి. నోరున్న పెత్తనదార్లు కొన్ని స్థానిక యూనియన్లను స్వాధీనపరచుకొని, తమ స్వార్థంకోసం ఉపయోగించుకొని, కార్మికులలో చీలికలు తెస్తున్నారు. కొన్ని యూనియన్లలో డబ్బు సొంతానికి ఉపయోగించుకోవడం, కార్మికులు త్రాగడానికి ఉపయోగించడం మొదలైన ఎన్నో పనులు జరుగుతున్నాయి. రాష్ట్ర మున్సిపలు కార్మికోద్యమం అధికార్లయొక్క బయటిదాడి కార్మికులలోని విచ్ఛిన్నశక్తులు లోపలనుంచి సాగించుతున్న చర్యలవల్ల నాశనమయ్యేస్థితికి వచ్చింది. అంటే పట్టణాలలో పార్టీయొక్క కార్మికపునాదే కూలిపోయే స్థితికివచ్చింది. కనుక జిల్లాకమిటీలు వెంటనే మేలుకోవాలి.

(2) డివిజనుకు వివరమైన ప్లాను :—మున్సిపలు కార్మికులలో శానిటరీ డిపార్టుమెంటులో (1) పాకిదొడ్లు ఊడ్చేవారు, పాకీబండ్లుతోలేవారు, (2) వీధులు ఊడ్చేవారు, చెత్తబండ్లు తోలేవారు, (3) కాలువలు తుడిచేవారు అని మూడురకాలు ఉన్నారు. ప్రతి డివిజనులోనూ యీ క్రింది ప్లాను తయారుచెయ్యాలి.

1. ఎంతమంది దొడ్లు ఊడ్చేవారున్నారు? వారు రోజుకు 7 గం॥ పనిచేస్తే ఎన్ని దొడ్లు అవుతాయి? ఇంక ఎన్ని మిగిలిపోతాయి? వీటిని శుభ్రపరచడానికి యెంతమంది అదనంగా కావాలి? యెన్ని పాకీబండ్లు (Night-soil carts) ఉన్నవి? ఇంకా ఎన్ని కావాలి?

2. వీధుల వైశాల్యం యెంత? (కొన్ని రోడ్లు వెడల్పుగాను, కొన్ని ఇరుకుగాను ఉంటాయి గనుక, వీధులపొడుగు తీసుకుంటే సరిపోదు) వీధులు ఊడ్చేవారు యెందరు. వీరు 7 గం॥ పనిజేస్తే యెంతపని అవుతుంది? యెంత మిగిలిపోతుంది: యీపని పూర్తి చేయడానికి యింకా యెంతమంది అదనంగా కావాలి? యెన్ని చెత్తబళ్ళు వున్నాయి? యింకా యెన్ని కావాలి?

3. కాలువలు యెంత పొడుగువున్నాయి? యెంతమంది కార్మికులు వున్నారు? వీరు 7 గం॥ పనిజేస్తే యెంతపని అవుతుంది? మిగిలిపోయిన కాలువల పొడుగుయెంత? ఇంకా యెంతమంది కార్మికులు అదనంగా కావలిసివస్తారు?

పై వివరాలతోబాటు, యింకా మరికొన్నిగూడ సేకరించాలి (1) ప్రత్యేకదొడ్లు కట్టించుకోలేని బీదప్రజలు నివసించుతున్నచోట్ల వారు వీధుల్లో బయలుకు కూర్చుంటారు.

దీన్ని ఆపడానికి పబ్లికుదొడ్లు కట్టించాలి. ఆ డివిజనులో యివి యెక్కడెక్కడఅవసరమో వీటిని కట్టించడానికి ఖాళీస్థలం యెక్కడవుందో గూడ వివరాలు సేకరించాలి. (2) సామాన్యంగా చెత్త వీధుల్లోవేస్తారు అలా వేయకుండా చేయడానికి, డస్టుబిన్నులు యెక్కడెక్కడ అవసరమో గూడ వ్రాయాలి. (3) మురుగుకాలువలు సిమ్మెంటుతో యెక్కడెక్కడ కట్టించాలో, మురుగు సాఫీగా పోవడానికి ఎక్కడెక్కడ మరమ్మతులు చేయించాలో వివరంగా వ్రాయాలి. ఇవిగాక పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి, ఇతర సూచనలుగూడ ఉండాలి. ఈ సూచనలు ఆచరణయోగ్యమైనవిగాను, ప్రజలను సమీకరించడానికి వీలైనవిగాను ఉండాలి.

పైపనులు నెరవేర్చడానికి కార్మికుల కవసరమైన పనిముట్లు, వారి యితర కష్టాలు, అధికధరల అలవెన్సు మొదలైన కార్మికకోర్కెలనుగూడ తయారుచెయ్యాలి. ఈవిధంగా ప్రతి డివిజనుకు వివరమైన ప్లానును తయారుచెయ్యాలి. మనం ఈప్లానును తయారుచేసేటప్పుడు, ఆ డివిజనులోని పెద్దమనుష్యులను, కౌన్సిలర్లను ఆహ్వానించాలి. అటుతర్వాత యీ ప్లాను సహాయంతో మహిళా, యువజన ఇతర సంఘాలతో కలసి ఆందోళన చెయ్యాలి. ఈ విధంగా ప్రజల ప్రతినిధులు కార్మికులతో గూడిన డివిజను కమిటీలను యేర్పరచవచ్చును.

(4) ఇతర మున్సిపలు కార్మికులు :—

1. నీటిసరఫరా కార్మికులు :—వీరు, ప్రజలు పంపులను చెడగొట్టకుండా చూస్తూ వుండాలి. ఎక్కడైనా చెడిపోతే వెంటనే మున్సిపలు అధికార్లకు తెలియపర్చి మరమ్మతు చేయించేలా చూడాలి.

2 ఎలెక్ట్రిక్ కార్మికులు :—వీరు ఎలెక్ట్రిక్‌లైట్లు ఏ ఇంట్లోనైనా చెడిపోతే వెంటనే బాగుచేయడం, బజారులైట్లు చెడిపోతే మున్సిపల్ అధికారులకు తెలియజేసి, అవుసరమైన మరమ్మతులు చేయడం చేయించాలి

3. రోడ్లకూలీలు 7 గం॥ పని సక్రమంగా చెయ్యాలి. వారానికి 1 రోజు శలవు వీరికుండాలి. పై మూడుతరగతుల కార్మికులు తమ తమ బాధ్యతలను నెరవేర్చుతూ, ప్రజల అభిమానాన్ని చూరగొనాలి. వారి కోర్కెల సాధనకు ప్రజాబలాన్ని సంపాదించాలి.

(5) కులపెద్దలు, కులాచారాలు:— మున్సిపలు కార్మికులలో రెల్లికులంలో యువతీ, యువకులు ప్రేమించుకొన్నా కులపెద్దలను లంచాలరూపకంగా సంతృప్తిపరచనిదే ఆ పెండ్లి కానేకాదు. యిక వారి వారి తలిదండ్రులకు చెప్పకుండా వుభయులు కలసి బయటివూరికి వెళ్ళిపోతారు. అది వారి కులంలో నేరంగా పరిగణించి రు 30, కులతప్పు తప్పకుండా కట్టాలని నిర్బంధిస్తారు. అధవా యీ తప్పు చెల్లించకపోయినచో, కులంలో

నుండి వెలివేస్తారు. పెండ్లిసందర్భంలో కనీసం 150–200 రూ. లేకపోతే అసాధ్యం. యిక భర్త చనిపోయిన స్త్రీ పెళ్ళి చేసుకోవాలంటే కులరీత్యాతప్పు. ఎవరినయినా ప్రేమించి వుంటే కులరీత్యా చర్యతీసుకుంటారు. దీనికి 60 రూ. తప్పువేస్తారు. ఇంతకుముందు చనిపోయిన భర్తతాలూకు కుటుంబానికి 50 రూ. యిప్పిస్తారు. లేకపోతే కులంనుండి బహిష్కరిస్తారు.

ఇంకా అనేకరూపాలుగా వచ్చే స్వల్పకేసులకు కూడా కులపెద్దలు లంచాలు తీసుకుంటారు. ఇలాటి పరిస్థితిలో మన యూనియను వాటికి సంబంధించిన ప్రతివిషయంలోను వర్కర్సు రిపోర్టులను బట్టి కలుగజేసుకొని పరిష్కారానికి పూనుకోవాలి. వుదాహరణకు ఒక వర్కరు మరొక వర్కరును కొట్టితే దెబ్బతిన్న వర్కరు 1-4-0 కట్టి యీ కేసు కులపంచాయితీలో పెడతాడు, దానిమీద కనీసం సంఘపెద్దలు అట్టికేసులో వుభయుల నుండి 30 రు. ఖర్చుపెట్టిస్తారు. పైగా పక్షపాతమే జరుగుతుంది. ఇవన్నీ గ్రహించి అట్టివారు ముఖ్యంగా యూనియన్‌లకే రిపోర్టుచేయు పద్ధతి అవలంబించినారు. కాబట్టి ఆ కేసులలో పెద్దల జోక్యంలేకుండానే మనమే పరిష్కరించాలి.

ఇక పెండ్లిండ్ల విషయంలో మనం కులపెద్దలను ఒక్కసారిగా ఎదుర్కోకుండా, వారికి నచ్చచెప్పడం, యువకులను, యువతులను సమీకరించి వారికి పూర్తిగా నచ్చచెప్పడం, ఆ పెండ్లిచేయు కుటుంబాలు ఖర్చులు తగ్గించుకోకపోతే, నేటి కరువుపరిస్థితులలో ఆర్థికంగా ఎట్లు క్రుంగిపోయేది వివరించడం, చెయ్యాలి. ఆవిధంగా చెప్పి క్రమంగా మార్పులు తీసుకొని రావడానికి ప్రయత్నించాలి. కులపెద్దలు తప్పులవల్ల అక్రమంగా వసూలుచేయు ధనంలో సంఘాలకు కొంతభాగం ఇచ్చేపద్ధతిని ప్రవేశపెట్టబడింది. ఇది కులపెద్దల ప్రాబల్యాన్ని నిలబెట్టుటకు పూర్తిగా తోడ్పడింది. ఒకప్రక్క కుల దురాచారాలను పోగొట్టాలని చెప్పుతూ, తిరిగి మరొకప్రక్క పరోక్షంగా బలపర్చడం జరిగింది. ఈ అనుభవాన్ని ప్రతి యూనియన్ గుర్తించి వెంటనే యీ పద్ధతిని మానివెయ్యాలి.

(6) యే బ్రాంచి యూనియన్లలోనూ జమాఖర్చుల ఎకౌంట్లు సక్రమంగాలేవు. ఏరోజు లెఖ్ఖలు ఆరోజు వ్రాయడంలేదు. కొన్నిచోట్ల త్రాగుడుకు ఖర్చుపెట్టిన డబ్బుకూడ యూనియను ఖర్చుల్లో వ్రాయడం జరుగుతోంది. సభ్యులనుండి చందాలు రెగ్యులరుగా వసూలు చేయడంలేదు. ఇచ్చినవారి వద్దనుండి వసూలుచేయడం, ఇవ్వనివారిని వదలివేయడం జరుగుతోంది. కొన్నిచోట్ల పెత్తనదార్లకు అప్పులు పెట్టడంగూడ జరుగుతోంది. ఎకౌంట్లలో ఈ అరాజకాన్ని పోగొట్టాలి. యూనియను ఎకౌంట్లు సక్రమంగా ఉంచాలి. .

(7) మున్సిపలు కార్మికులలోని పార్టీసభ్యులు రాజకీయంగాను, వైజ్ఞానికంగాను, సాంఘికంగాను చాల వెనుకబడిఉన్నారు. వారి సెల్లుమీటింగులు రెగ్యులరుగా జరపాలి,

వారికి వ్రాయడం చదవడంనేర్పాలి. వారిలో త్రాగడం, జూదమాడటం మొదలైన దురలవాట్లను పోగొట్టి మిగతా కార్మికులకు ఆదర్శప్రాయులనుగా చెయ్యాలి.

ఇతర కార్మిక సంఘాలు

(1) ప్రస్తుతం కార్మికసంఘాల ఆఫీసులు సక్రమంగాలేవు. వాటిలో ఫైళ్లుగూడ సరిగా ఉండవు. ఆఫీసులను సరిగా ఆర్గనైజుచేయడం ముందుచెయ్యాలిసినపని. ఆఫీసులో ఉండాలిసిన ఫైళ్ళు (అ) మినిట్సుపుస్తకం (ఆ) జమాఖర్చుల పుస్తకం (రోజు, ఆవర్జా) (ఇ) ఓచర్లఫైలు (ఈ) పై సంఘంనుంచి వచ్చిన సర్క్యులర్లు, కరపత్రాల ఫైలు (ఉ) పైసంఘానికి పంపిన రిపోర్టులకాపీలు, వేసిన కరపత్రాలఫైలు (ఊ) యజమాని, ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాల ఫైలు (ఎ) యూనియను సభ్యత్వ రిజిస్టరు. దీనిలో సభ్యులందరిపేర్లు ఉంటాయి. ఆపేర్లకు తిన్నగా ఏనెలకు సభ్యత్వచందా ఇచ్చిందీ. మార్కు చేస్తారు. (ఏ) ప్రజాశక్తి లేక ఇతరపత్రికల ఫైళ్ళు.

(2) సంఘనిర్మాణం. ఒకొక పరిశ్రమకు ఒకొక యూనియను ఉండాలి. ఆ పరిశ్రమలో సైతం ఒకొక ఫ్యాక్టరీకి ఒకొక కమిటీఉండాలి. ఆకమిటీ ఆఫ్యాకరీలోవచ్చే దైనందిన సమస్యలను పరిష్కరించాలి. ఫ్యాక్టరీ పెద్దదిఅయితే డిపార్టుమెంటు కమిటీలుగూడ పెట్టి పని చేయించాలి.

పైవిధంగా రెగ్యులరుగా ఫ్యాక్టరీకమిటీలు, డిపార్టుమెంటుకమిటీలు పనిజేసినప్పుడే, కార్మికుల కోర్కెలు త్వరగా తీర్చడం, అవుసరం వచ్చినవెంటనే కార్మిలను సమీకరించే శక్తి రావడం, జరుగుతుంది.

ఎక్కువ కార్మికసంఘాలుఉండి చురుకుగా పనిచేస్తున్నచోట్ల, ఒక పట్టణంలోని ట్రేడుయూనియను పనినంతా 'కోఆర్డినేటు' చేసి పనిచేయడానికి. వివిధ కార్మికసంఘ ప్రతినిధులతోగూడిన పట్టణ ట్రేడుయూనియన్ కౌన్సిలును ఆర్గనైజుచెయ్యాలి.

(3) యూనియనుయొక్క జమాఖర్చులు చక్కాగా ఉంచాలి. మన ప్రతిపక్షులకు. ఆకౌంట్లు అరాజకంగాఉంచి, దుష్ప్రచారానికి అవకాశం గలుగజేయరాదు.

4) టౌనుకమిటీ కార్యదర్శులు, తాలూకాకమిటీల కార్యదర్శులు కార్మిక యూనియను ఆఫీసులు సరిగా ఉంటున్నాయో లేదో అప్పుడప్పుడూ సరిచూస్తూ ఉండాలి.

రైల్వేరంగం

ఆంధ్రలో ఆధునిక పరిశ్రమ, చాల ఎక్కువమంది కార్మికులుగలది, కీలకమైన పరిశ్రమ రైల్వే. దీనిలో మనం గత 6 లేక 7 సం॥నుండీ పనిచేస్తున్నాం. ఒక గమనించదగిన స్థానాన్నికూడ సంపాదించాంగూడ. కాని ఈ సంఘంలో మనమే ఇంకా ప్రధాన శక్తిగా తయారుగాలేదు. కొంతమంది ముస్లిము మత తత్వవాదులు, గురుస్వామిముఠా

మితవాదులు అంతాగలిసి. మనమీద దాడిచేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మనపార్టీ రైల్వే కార్మికసంఘాన్ని ప్రతికక్షుల కుయుక్తులనుండి కాపాడాలి.

రైల్వే కార్మికసంఘాన్ని రైల్వేలో పనిజేసే పార్టీఆర్గనైజరు ఒక్కడే పనిచేయించలేడు. ప్రతిబ్రాంచిని, ప్రతిసెక్షను కమిటీని రెగ్యులరుగా కలుసుకోలేడు. కనుక ఏజిల్లాలోని బ్రాంచీ సంఘాలను సెక్షను స్టేషనుకమిటీలను ఆజిల్లాలోని జిల్లాపార్టీకమిటీ బాధ్యత వహించి పనిచేయించాలి. జిల్లా పార్టీకార్యదర్శులు ఇందుకు బాధ్యత వహించాలి.

జిల్లాకమిటీల బాధ్యతలు :

(1) బ్రాంచి ఆఫీసులుఉన్న జిల్లాలలో జిల్లాకమిటీ కార్యదర్శిగాని, మరొక జిల్లా ముఖ్యుడుగాని, అచటి పార్టీసెల్లును రెగ్యులరుగా సమావేశపరుస్తూ కార్యక్రమమిచ్చి నడపాలి. కేంద్ర ఆఫీసుకు రిపోర్టులు, కోటాలు రెగ్యులరుగా పంపేలా చెయ్యాలి.

(2) జిల్లాలోని సెక్షనుకమిటీలు (లైనుమీద గ్యాంగులు చిన్నస్టేషను కార్మికుల యొక్క కమిటీలు, స్టేషనుకమిటీలు (పెద్దస్టేషనులకు మాత్రమే) పనిజేయించడానికి, ఆయాప్రాంత ఆర్గనైజర్లకు బాధ్యతఇవ్వాలి. ఈ ఆర్గనైజర్లు ఆయా కమిటీలను రెగ్యులరుగా సమావేశపరుస్తూ, వారిచే కార్మికుల దైనందిన కష్టాలనుగూర్చిన దరఖాస్తులు పెట్టించేలా చెయ్యాలి.

(3) రైల్వే రంగంలోని పార్టీసభ్యులు యూనియను పనిచేసేటట్లుచెయ్యాలి. వారిని ఆయాప్రాంత పార్టీ జనరలుబాడీ మీటింగులకు వచ్చేలాచెయ్యాలి. వారు ప్రజాశక్తి, ప్రజాశక్తి ప్రచురణలు చదివేలాచెయ్యాలి. రైల్వేకార్మికులను ఇతర కార్మికమీటింగులకు, రాజకీయ మీటింగులకు తీసుకువచ్చి, వారికి రాజకీయచైతన్యం గలిగేలాచెయ్యాలి.

(4) రైల్వేపనితో సంబంధమున్న పార్టీ ఆర్గనైజర్లు 'రైల్వేసమస్యలు' అనే పుస్తకాన్ని చదవాలి, రైల్వేకార్మికులకు సంబంధించిన సమస్యలను తెలుసుకొంటూ ఉండాలి.

13. పార్టీ పత్రిక

పార్టీపత్రికల ప్రాముఖ్యాన్ని చాలమంది కామ్రేడ్సు సరిగా గుర్తించలేదు. పత్రికను ప్రచారం చేయడంలోనూ, ఉపయోగించుకోవడంలోనూ, పోషించుకోవడంలోనూ చూపవలసినశ్రద్ధ చూపడంలేదు. పార్టీ జీవితంలో పత్రికస్థానమేమిటో, పాత్రఏమిటో గ్రహించాలంటే ఈ క్రింద లెనిన్‌చే చెప్పబడ్డ విషయాలు జాగ్రత్తగా అర్థంచేసికోవాలి.

"ఒక బలీయమైన రాజకీయ సంస్థకు చక్కని రాజకీయ శిక్షణ గరపాలంటే విరివిగా వెలువడే, నిర్మాణయుక్తంగా పంచబడే మంచి పత్రికద్వారాతప్ప వేరుమార్గంలేదు."

"అనుక్షణం పోరాటాన్ని నడపసిద్ధంగాఉండే విప్లవపార్టీని ఒడుదుడుకులు లేకుండా అభివృద్ధిచేయాలన్నా, పునాదులు గట్టిపర్చాలన్నా, విస్తృతం చేయాలన్నా దేశవ్యాపిత రాజకీయ పత్రిక మనకు మార్గదర్శకుడుగా ఉండితీరాలి."

"వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పెక్కు సంఘటనలను కేంద్రీకరించి మన ప్రజలకందరకూ ఒకే విప్లవమార్గాన్ని చూపించుటకు, ఉత్సాహాన్నిచ్చుటకు, ఒక ప్రాంతానికి మరో ప్రాంతానికి నిజమైన సన్నిహిత సంబంధం ఏర్పర్చుటకు, దేశవ్యాపిత పత్రిక తప్ప మరోసాధనం లేదు."

"ఒక ప్రాంతంలో జరిగే విప్లవ కార్యక్రమంజూచి మరో ప్రాంతంవారు పోల్చి చక్క పోటీతో పనిచేయడానికి, దేశ ఆర్థిక రాజకీయ విషయాలపై వ్రాసే విమర్శలతో మన విప్లవకారుల సిద్ధాంతజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి, అన్ని దశల్లోనూ పత్రిక ఒక్కటే ముఖ్యాయుధం" లెనిన్.

పత్రికను వెలువరించడం, పంపకం చేయడం అనే కార్యక్రమంతోనే, సంపాదకులు, విలేఖరులు, అచ్చువేసేవారు, ఏజంట్లు, చందాదార్లను చేర్చేవారు, వార్తలను చర్చించేవారు మొదలైనవారితో గూడిన సంఘంగాతయారై, అన్ని పరిస్థితుల్లోనూ అవసరమైన ఒక అస్థిపంజర నిర్మాణం ఏర్పడుతుంది. అదొక శ్రామికుల పోరాటసంస్థగా పనిచేస్తుంది. సంఘటితమైన, సర్వతోముఖమైన విప్లవ ప్రచారపోరాటం నడపాలంటే కేంద్రకమిటీ అన్నిచోట్లకు ఏజంట్లను నియమించ సాధ్యంగాదు; అందుకు పత్రికయే ముఖ్యాయుధం.

1. ఆందోళన - ప్రచారం - పత్రికా ప్రాముఖ్యం.

కమ్యూనిస్టు ప్రచారం ఈ క్రింది ప్రధానరూపాల్లో ఉంటుందని అంతర్జాతీయ కమ్యూనిస్టు ప్రణాళిక చెప్తోంది. (1) వ్యక్తులకుమధ్య సంభాషణద్వారా (2) కార్మికుల, కర్షకుల ఆర్థిక, రాజకీయ పోరాటాల్లో పాల్గొనుటద్వారా (3) పత్రిక, కరపత్రాల పంపకంద్వారా.

1. పత్రిక ప్రజాసైనికుడు.

బూర్జువావర్గ పత్రికలూ, ప్రభుత్వాలు, కార్మికవర్గంమీద, విప్లవోద్యమంమీద నిరంతర దండయాత్రలు చేస్తుంటాయి. మనల్ని సంపూర్ణంగా అణచివేయ సర్వప్రయత్నాలు చేస్తాయి వాటినన్నిటిని అరికట్టి తిరుగుదాడులు చేసేటందుకు మన పత్రికయే ప్రథమశ్రేణిలోని సైనికునిలా పనిచేస్తుంది కార్మికవర్గంమీద, కమ్యూనిస్టుపార్టీమీద అసత్య ప్రచారాలు చేయడం, ప్రజాపోరాటాల వివరాలను పబ్లిష్ చెయ్యకపోవడం, మన రిపోర్టులు, కార్మికనాయకుల స్టేటుమెంట్లు ప్రకటించకపోవడమూ, బూర్జువా పత్రికలకు మామూలు. అధికారంలో తన్ని పెట్టుకొని కూర్చుని, ప్రజలలోని అమాయకత్వాన్ని ఎక్కువచేసి మోసంచేయడానికి వేసే ఎత్తులన్నిటినీ ప్రతిఘటించేది మన పత్రికయే. మన బానిసదేశంలో చదువుకొన్నవారే నూటికి 10 మంది. వీరందరిని ముఖ్యంగా మధ్యతరగతివారి నందరిని బూర్జువా పత్రికా ప్రభావంలోనుండి బయటకు లాగాలన్నా మన వైపుకు త్రిప్పుకోవాలన్నా మన పత్రికయే ప్రధాన సాధనం. కార్మికవర్గాన్ని, పార్టీని, విప్లవశక్తులను కంటిపాపవలె కాపాడుకొంటూ విప్లవ వ్యతిరేక శక్తులమీద దాడిసల్పే ప్రజాసైనికుని కర్తవ్యం మన పత్రికయే నిర్వహిస్తోంది.

కాని ప్రస్తుతం ఆచరణలో జరుగుచున్నదిచూస్తే పార్టీపత్రికల అమ్మకం విధానం చాల లోపాలతో కూడివుంది. మొట్టమొదటిది చాలమంది కామ్రేడ్స్ పార్టీపత్రికను అమ్మడం అనేది ఏజెంటుగావుండే ఏ ఒక కామ్రేడ్ చేయవలసినపనో అనే భావంతోవున్నారు. ప్రతి సెంటరులోను కామ్రేడ్స్ స్క్వాడ్స్‌గా ఏర్పడడం, ఒక్కొక్క స్క్వాడ్‌కు ఒక లీడరును ఎన్నుకోవడం, ప్రతివారం పత్రికరాగానే ఆ లీడర్సు తమకోటా ప్రకారం పత్రికలను తీసికొని ఆ స్క్వాడుతోవెళ్లి తమ ఏరియాలో పత్రికలను అమ్మడంఅనేది జరగడం లేదు.

రెండవది, అలా అమ్మేచోట్లగూడ రొఖ్ఖానికి అమ్మడంగాని. అడ్వాన్సులు తీసుకోవడంగాని జరగడంలేదు. వూరికే ప్రతివారం పత్రికను తీసుకొనివెళ్ళి పంచడం. ఆతరువాత బాకీలు వసూలుచేయడానికి వారిచుట్టూ తిరగడంతో సరిపోతోంది. కొన్నిచోట్ల ఎవరెవరికి పత్రిక యిచ్చినదీకూడ మరచిపోయిన సందర్భాలుకూడ వున్నాయి. చివరకు పత్రికా కార్యాలయానికి బకాయిపడటం, ఏజెంటు కామ్రేడ్ తనకువచ్చే కమిషను వదలుకోవడం, అదీ చాలకపోతే జేబులో డబ్బుకట్టడం, అదీ వీలులేనప్పుడు కాళ్లచాచుకొని కూర్చోవడం జరుగుతోంది. రొఖ్ఖానికి అమ్మకపోవడంవల్ల ఈఒక్క పనికోసం బోలెడంత కాలం వృధాఅవుతోందనేది పార్టీసభ్యులు బాగా గుర్తించాలి. రొఖ్ఖానికి, అడ్వాన్సులు తీసికొని పత్రికను అమ్మడంవల్ల ఈపనికి వారానికి ఒకటి రెండు రోజులకంటె ఎక్కువ అవసరంలేదు. మిగిలిన రోజులన్నీ ఇతర పార్టీపనులకు, ప్రచారంగాల పను

అనగా మొదటి రెండుపనులు సమర్థతతో నిర్వహించాలంటే పత్రికలేకుండా సాధ్యంగాదు. కాబట్టి పత్రిక మన విప్లవ ప్రచారానికంతకూ ఎలా జీవగర్రలాంటిదో గుర్తించాలి. "జాతీయైక్యత" "ఆహార సమస్య" "రాజకీయ ఖైదీలవిడుదల" "ప్రభుత్వ నిర్బంధవిధానము" మున్నగు సమస్యలపై మన ప్రజాశక్తి, పీపుల్సువార్ చేసిన ఆందోళనా ప్రచారం ఇందుకు నిదర్శనం. ఒకమాటలో చెప్పాలంటే పత్రిక లేకపోతే మన ఆందోళనాప్రచారం సన్నగిలిస్తే.

2. పత్రిక విప్లవనాయకుడు, అందులోనూ ప్రత్యక్షనాయకుడు; ఆర్గనైజరు.

నేటి విప్లవదశలో రోజురోజు జరిగే మార్పుకనుగుణ్యంగా రాజకీయ, ఆర్థిక సమస్యలపై ప్రజలను, పార్టీని లీడ్‌చేస్తుంది. అంతర్జాతీయ, జాతీయ సంఘటనలను విప్లవ దృక్పథంతో పరిశీలించి ఎప్పటికప్పుడు అవసరమైన నినాదాలిచ్చి ప్రజా పోరాటాన్ని నడుపుతుంది. ప్రజా సంస్థలను, పార్టీని నిర్మించుతుంది. పోరాట అనుభవాన్ని సేకరించి ముందుండి నడిపే నాయకుడుగా పనిచేస్తుంది.

ప్రత్యక్షనాయకుడు :— అంటే అర్థమేమిటి? జోషి, అధికారి, సర్దేశాయి, రణదివే, సుందరయ్య మున్నగు అనుభవజ్ఞులైన పార్టీ నాయకులు ప్రతి సమస్యపై నిత్యపోరాటంలో మనల్ని పత్రికలద్వారా ప్రత్యక్షంగా నడిపిస్తుంటారు. పత్రికద్వారా మన నాయకులకు-ప్రజలకు ప్రత్యక్షసంబంధమేర్పడుతుంది. ఎంత సామాన్యసామర్థ్యాలు గల్గిన కామ్రేడయినా పత్రిక సహాయంతో ప్రజల్లోకి చొచ్చుకుపోవడం సులభం. అంటే నాయకులను తోడుతీసికొని ప్రజల్లోకి వెళ్ళడమన్నమాట. పత్రికయొక్క యిలాంటి అమూల్య ఉపయోగాన్ని గుర్తించకపోవడం పార్టీ నాయకత్వాన్ని నిరుపయోగం చేసుకోవడం తప్ప మరేమీలేదు.

3. పత్రిక - ఉపాధ్యాయుడు.

ప్రతి సమస్యపైన మనకొక పద్ధతి ఉంటుంది. ఆ పద్ధతిని అర్థం చేసికోవడానికి, అందరూ ఒకేరకంగా అర్థంచేసికోవడానికి తోడ్పడుతుంది. మాటల్లోనేకాక ఆచరణయొక్క అనుభవాన్ని సేకరించి మనకిచ్చి చేతల్లోగూడ ఐక్యతను వృద్ధిచేస్తుంది. వివిధ విషయాలపై విమర్శలుచేసి, వ్యాసాలువ్రాసిసిద్ధాంత అభివృద్ధికి, చైతన్యాభివృద్ధికి, తోడ్పడుతుంది. ప్రజలకు, పార్టీ సభ్యులకు నిత్యం విజ్ఞానాన్నిస్తూ ఉండేది మన పత్రికలే. మన తప్పొప్పులు సరిచేసేది మన పత్రికలే.

లకు వినియోగించుకోవచ్చును రొఖ్ఖం, అడ్వాన్సులు ఇవ్వడంవల్ల ఆర్థికంగానేగాక, మిగతా రోజులలో ఇతరపనులను చేసుకోడానికి నీకు తోడ్పడినవారవడమేగాక ప్రజా ఉద్యమానికి, పార్టీకిగూడ ఎలా సహాయం చేసినవాడవుతాడో పత్రిక కొనేవారికి తెలియ జెప్పాలి. కొనేవారుగూడ తమ ఇబ్బందులను చెబుతారు. నెలాఖరున జీతంరాగానే యిస్తామనో, ఇంకా ఏవేవో వారిచిక్కులు వారు చూపుతారు. కాని వారికి పైవన్నీ నచ్చచెబితే తప్పక అడ్వాన్సులు యివ్వడంగాని, రొఖ్ఖానికి కొనడంగాని చేస్తారు. ఆచరణలోకూడ కొన్నిచోట్ల ఇది రుజువైంది. ఇదివరలో అరువుకుతీసికొని... నెల రెండునెలలకుకూడా డబ్బు యివ్వనివారు సహితం ఇవన్నీ చెప్పినమీదట అడ్వాన్సులు యిచ్చారు. అందుచేత అది ఎక్కువగా మనలోపమేగాని కొనేవారి లోపంగాదు. మనం ఇవన్నీ వారికి తెలియ జెప్పకపోవడంవల్లనే, వారు మామూలు పత్రికలకు యిచ్చేటట్లే మెల్లగా ఇవ్వవచ్చునులే అని వూరుకుంటున్నారు.

కొన్నిచోట్ల స్క్వాడ్లుగా విభజింపబడి పనిచేస్తున్నప్పటికీ, వారంపొడుగునా పత్రికను అమ్మడం, చందాదార్లకు పత్రికను అందజేయడం జరుగుతోంది. పత్రిక అమ్మడం ద్వారా ఎక్కువ కాంటాక్టులను సంపాదించడం, సానుభూతిపరులతో దగ్గర సంబంధం పెట్టుకోవచ్చుననే విషయాన్ని వారలా అర్థంచేసుకుంటున్నారు. పత్రికద్వారా కాంటాక్టులు అభివృద్ధి చేయడమంటే వారంపొడుగునా పత్రికలు పుచ్చుకొని తిరగడమేతప్ప ఇంకోపని అక్కరలేదనుకుంటున్నారు. పత్రిక అమ్మడంద్వారా వచ్చే కాంటాక్టులను, స్థానికసమస్యలపై వెళ్ళి కలుసుకుంటూ, వాటితో వారు మనతో కలసి పనిచేసేటట్లు, లేదా తోడ్పడేటట్లు చేయడంద్వారా వారిని అభివృద్ధిచేయడం క్రమంగా పార్టీవైపుకు తీసుకురావడం చేయాలిగాని రోజూ పత్రికలు పుచ్చుకొని తిరగడంవల్లకాదు.

ఇక ఏజెంట్లను నియమించడం విషయంలోకూడ సక్రమపద్ధతిలేదు. కొన్నిచోట్ల స్థానిక కమిటీలు, పార్టీపత్రికలు, సారస్వతం అమ్మేబాధ్యత వహించడానికి ఏజెంటుగా ఒక కామ్రేడ్‌ను ప్రత్యేకించి నియమించడంలేదు. ఏవారాని కావారం ఆ సమయానికి ఎవరుంటే వారు పత్రికను తీసుకోవడం, ఇతర కామ్రేడ్స్‌కు అమ్మమని పంచిపెట్టడం చివరకు ఎవరూ బాధ్యత వహించకుండా పోవడం జరుగుతోంది. ఒకవేళ ఏజెంటు అని పేరుకు ఎవరినైనా నియమించినా, ఆ కామ్రేడ్‌కు ఇంకా ఇతరపనులుకూడా అప్పజెబుతూ వుండడం, దానివలనకూడా పత్రిక అమ్మకం సక్రమంగా లేకపోవడం తటస్థిస్తోంది.

ఇవన్నీగాక, ఏజెంటుగా నియమింపబడిన కామ్రేడ్స్ (ప్రత్యేకంగా నియమింపబడినప్పటికీకూడ) సరియైన రికార్డులు, అంటే సేల్సురిజిస్టరులు, ఎకౌంట్లు, ఉత్తర ప్రత్యుత్తరాల ఫైలు సరిగావుంచడంలేదు. ఏవారం ఎన్నిపత్రికలు వచ్చినది, స్క్వాడ్లకు ఎవరిద్వారా ఎన్నిపత్రికలు యిచ్చినది, ఎన్ని అమ్ముడుపోయినది, ఎన్నిమిగిలినదీ, ఎన్ని అడ్వాన్సులు వచ్చినదీ, ఆస్క్వాడ్స్ పత్రికలను ఏవిధంగా అమ్ముతున్నదీ తెలిసే సేల్సు

రిజిస్టరు వుండాలి. తనకువచ్చిన పత్రికలఖరీదు ఎంత, తాను పత్రికా కార్యాలయానికి ఎంత పంపినది, ఎంత బాకీవున్నది, తనకువచ్చిన కమిషను మొదలైన వివరాలుతెలిపే ఎకౌంట్సును రెగ్యులరుగా వ్రాస్తూవుండాలి. పత్రికా కార్యాలయంనుంచివచ్చే ఉత్తరాలు బిల్లులు, రశీదులు, తాను పత్రికకు వ్రాసే ఉత్తరాలు, మనియార్డరు రశీదులువగైరా అన్నిటిని ఫైలుచేయాలి.

ఏజెంట్లుగావుండే కామ్రేడ్స్ చేయవలసిన ఇంకొక ముఖ్యమైన పనిఏమంటే, తమ సెంటరులో పత్రికల చందాదార్ల లిస్టు, ప్రతివారం పత్రిక కొనేవారి లిస్టు తమవద్ద ఒక కాపీ వుంచుకోవాలి. ఇప్పుడు ఆచరణలో జరిగేదేమంటే ప్రతివారం రిగ్యులరుగా పత్రికలు కొనేవారి పేర్లు ఆయాస్క్వాడ్సు లీడర్సుకు లేక వారికి పంచే ఒక కామ్రేడ్‌కు మాత్రమే తెలుసుగాని, ఏజెంటువద్ద ఆలిస్టు వుండటంలేదు. ఏదైనా ఒక స్క్వాడ్ పని చేయకుండా పోయినా; లేక పత్రికలు పంచే ఒక కామ్రేడ్ లేకుండాపోయినా, ఆవారం పత్రికలు ఎవరికి ఇవ్వాలో తెలియడంలేదు. అందుచేత ప్రతి ఏజెంటు తన సెంటరులో చందాదార్లలిస్టు, ప్రతివారం రెగ్యులరుగా కొనేవారిపేర్లు అడ్రసులు, కూడా ఒక ఫైలు పెట్టి ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటూ వుండాలి.

ఇలా సరియైన రికార్డులు వుంచకపోవడంవల్ల అసలానికి ఒక ఏజెంటు మారి, ఇంకో కామ్రేడ్ ఏజెంటుగా వచ్చినప్పుడుగాని, ఒక స్క్వాడ్ స్థానే ఆ ఏరియాలో ఇంకొకరు పత్రికను పంచవలసి వచ్చినప్పుడు వారికి తుదామొదలు తెలియకుండా, అంతా "రెడ్డివచ్చె మొదలాడండి" అనే స్థితికివస్తోంది.

చందాదార్లకు పత్రికలను అందజేయడంలో కూడ ఏజెంట్సు ఇంకో పొరపాటు చేస్తున్నారు. ఏస్క్వాడ్ పనిచేసే ఏరియాలోవుండే చందాదార్లకు ప్రతివారం పత్రికను అందజేసేపని ఆయా స్క్వాడ్సుకు ఇచ్చి వూరుకుంటున్నారు. ఈ స్క్వాడ్స్, పత్రికను పంచడం ఆలస్యం చేయడం, ఒకవారం ఇస్తే ఇంకో వారం ఇవ్వకపోవడం ఇలాంటివి జరుగుతూ వుండడంవల్ల పత్రిక సరిగా అందడంలేదని, ఆలస్యంగా అందుతోందని చందాదార్లలో అసంతృప్తి కలుగుతోంది. మన స్క్వాడ్ వారికి పత్రిక ఇచ్చేలోగా వారు ఇంకెక్కడో ఈపత్రికను చదివివేయడం అయిపోతోంది. చందాకట్టినా ప్రయోజనం ఏమిటిలే అనేభావం వారిలో కలిగి చందా అయిపోతే తిరిగి కట్టడానికి ఉత్సాహం చూపడం లేదు. అంచేత ఏజెంట్లుగా వుంటే కామ్రేడ్స్, చందాదార్లకు పత్రికలను పంచడానికి ఒక ప్రత్యేక కామ్రేడ్‌కు బాధ్యతయిచ్చి చేయించడంగాని, లేకుంటే తామే చేయడంగాని చేస్తూ వుండాలి. పత్రికరాగానే ముందు చందాదార్లకు అందజేయాలి. ఆతరువాత స్క్వాడ్సుకు విడి అమ్మకాలకు ఇవ్వాలి. చందాదార్లకు పత్రికను అందజేసేపని స్క్వాడ్సుకు వుండకూడదు.

వీటి అన్నిటికంటె ప్రధానమైన లోపం ఇంకొటివుంది. పార్టీ అగ్రనాయకులుగాని, స్థానిక పార్టీ కార్యదర్శులుగాని ఏజెంట్లను, పత్రికల అమ్మకాలను చెకప్ చేయడంలోను,

అయిపోయిన చందాలను తిరిగి కట్టించడంలోను శ్రద్ధవహించడంలేదు. ఏజెంట్లను చెకప్ చేసే చోట్లకూడ వివరాలలోకి వెళ్ళకుండా వూరికే "బిల్లులు సక్రమంగా చెల్లిస్తున్నావా? అమ్మకం ఎలావుంది?" అని అడగడం, ఆ కామ్రేడ్ "అంతా బాగానేవుంది." అంటే సంతృప్తిపడటం మాత్రమే జరుగుతోంది. ఇలా జరిగితే ఏమీ లాభంలేదు. ఈ చెకప్ చేయడం విషయంలో ఎక్కడికక్కడ స్థానిక పార్టీకమిటీల కార్యదర్శులు ఇది ఒక ప్రధానమైన కర్తవ్యంగా ఎంచాలి. పత్రికల అమ్మకం విధానంలోను, చందాదార్లకు పత్రికలను రెగ్యులరుగా అందజేయడంలోను పైన చెప్పిన ప్రకారం అన్నిఅమలుజరుగుతున్నదీ లేనిదీ ప్రతివిషయం తీసికొని చూడాలి; జిల్లా కమిటీ ఆఫీసున్న సెంటర్లలో జిల్లా కార్యదర్శి, తాలూకా కమిటీవున్న సెంటరులో తాలూకా కార్యదర్శి, కడకు సెల్లువున్న సెంటరులో ఆ సెల్లుకార్యదర్శి స్వయంగా ఈ చెకప్ చేసే బాధ్యత తీసుకోవాలి. ఇంతేగాక ప్రతి పార్టీ కమిటీ మీటింగులోను, జనరల్‌బాడీ సమావేశంలోను, పత్రికల అమ్మకం, చందాదార్ల విషయం ఎజెండాలో వుండాలి. ఈ రంగంలో జరుగుతున్నపని, వున్నలోపాలు అన్నీ చర్చించి వాటిని సక్రమంగా జరిగేటట్లు, కార్యక్రమం వేసుకుంటూ వుండాలి.

అయిపోయిన చందాలను తిరిగి కట్టించడం విషయంలో ఒక ప్లాను లేకుండా పని చేస్తున్నారు. ఏదో జ్ఞాపకంవున్న చందాదార్లనో, బాగా తెలిసివున్న చందాదార్లనో లేక పై కమిటీలనుంచి నోటువచ్చినప్పుడో వెళ్ళి కలుసుకుని మీ చందాలు తిరిగి కట్టాలని చెప్పడమేగాని దానిలో ఒక పద్ధతిలేదు. ఇలాకాకుండా ప్రతి స్థానిక పార్టీ కమిటీ, సెల్లు సహా తన ప్రాంతంలోని చందాదార్ల లిస్టులను, వారి చందాలు అయిపోయే తేదీలతో సహా తమ ఆఫీసులో వుంచుకోవాలి. వీటికోసం ప్రజాశక్తి కార్యాలయంనుంచిగాని, జిల్లాకమిటీల నుంచిగాని వస్తాయని కూర్చోవడం అనవసరం. పోస్టులో పత్రిక పంపబడే చందాదార్ల పత్రికలన్నిటికి, ఆ అడ్రసు కాగితంమీదనే వారి చందా ఆఖరుఅయేతేదీ ముద్రింపబడివుంటుంది. ఏగ్రామంలో వుండే కామ్రేడ్స్, ఆ గ్రామంలో పత్రిక వచ్చేవారి అడ్రసులను బట్టిగాని, లేక ఒకవారం తమ పోస్టాఫీసులో ప్రతికవచ్చేరోజునకూర్చుని వాటిని వ్రాసుకోవడం వల్లగాని ఆలిస్టులు సంపాదించవచ్చు. అలా సంపాదించి ఆ లిస్టులు తమ ఆఫీసులో పెట్టుకొని, ఎవరి చందా ఎప్పుడు ఆఖరవుతుందో చూచుకుంటూ, ముందుగానే వారిని కలుసుకొని, చందాను తిరిగి కట్టించుతూ వుండాలి.

కాబట్టి పార్టీ పత్రికవిషయంలో కామ్రేడ్స్ తమ కర్తవ్యాన్ని సరిగా నెరవేర్చాలంటే ఈ క్రింది పద్ధతులను అనుసరించాలి.

1. పత్రికను రొఖ్ఖానికే అమ్మాలి. వీలైనంతవరకు అడ్వాన్సులు తీసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోను అరువు అమ్మకంఅనేది వుండకూడదు.

2. పార్టీపత్రిక, సారస్వతం వీటి అమ్మకంబాధ్యత వహించేటందుకు ఒక కామ్రేడును ప్రత్యేకంగా నియమించాలి. అతనికి మరోపని ఏదీవుండకూడదు. మాటిమాటికి

ఏజెంట్లను మార్చకుండా ముందే జాగ్రత్తగా ఆలోచించి తగిన కామ్రేడ్‌ను ఏజెంటుగా నియమించాలి.

3. వారంలో ఒకటి రెండు రోజులకంటె పత్రికలను అమ్మడం అనే పని వుండకూడదు. ఏజెంటుగా నియమింపబడిన కామ్రేడ్‌తప్ప, స్క్వాడ్సుగా పత్రికలను అమ్మే కామ్రేడ్స్ వారంలో మిగతా రోజులలో ఇంకో పార్టీపనిచేయాలి. గాని, వారంపొడుగునా పత్రికలను అమ్మడమే పనిగా పెట్టుకోగూడదు.

4. ప్రతి స్క్వాడ్‌కు ఒక లీడరును ఎన్నుకోవాలి. ఏజెంటు కామ్రేడ్‌వద్దనుండి తన స్క్వాడ్‌కు ఎన్నికాపీలు కావాలో, వాటిని తీసుకోవడం, అమ్మినవెంటనే వాటిపైకం మిగిలినకాపీలు, అడ్వాన్సులు తీసుకుంటే ఆపైకం, ప్రతివారం తాము పత్రికలనిచ్చేవారి లిస్టు అడ్రసులు, అడ్వాన్సులు యిచ్చినవారిపేర్లు వారి అడ్రసులు అన్నీ ఏజెంటుకు అప్పజెప్పే బాధ్యత ఆ లీడరు వహించాలి. పత్రికలడబ్బు ఒక్క పైసాకూడ స్క్వాడ్‌వద్ద నిలవవుంచుకోకూడదు. అమ్మకమేగాని చందాదార్లకు పత్రికలను అందజేసేబాధ్యత స్క్వాడ్సుకు వుండకూడదు.

5. అయిపోయిన చందాలను తిరిగి కట్టించాలి. ప్రతిఏజెంటు, ప్రతి స్థానికకమిటీ తమతమ ప్రాంతంలోని చందాదార్ల లిస్టులు, వారివారి చందాలు అయిపోయే తేదీలతోసహా తమవద్దపెట్టుకొని చందా అయిపోకముందే వారినికలుసుకొని తిరిగి కట్టించుతూవుండాలి.

6. ఏజెంటుగా నియమింపబడే కామ్రేడ్ ఈ క్రింది కర్తవ్యాలను రెగ్యులరుగా నెరవేర్చాలి.

(a) ఎవరికీ అరువుఅమ్మకం చేయనీయగూడదు.

(b) సేల్సు రిజిస్టరు, అడ్వాన్సుల రిజిస్టరు, స్క్వాడుల అమ్మకం రిజిస్టరు, ప్రతివారం పత్రికకొనేవారి అడ్రసులలిస్టు, చందాదార్లలిస్టు, ఎకౌంట్లు, ఉత్తర ప్రత్యుత్తరాల ఫైల్సు రెగ్యులరుగా వుంచాలి. తాను పత్రికా కార్యాలయానికి వ్రాసే ఉత్తరాలకాపీలు వుంచుకోవాలి. మనియార్డరు రశీదులు, ఆఫీసునుంచివచ్చే రశీదులు జాగ్రత్తగా ఫైలు చేయాలి.

(c) పత్రికలడబ్బు, సారస్వతం అమ్మకం డబ్బు సాధ్యమైనంతవరకు ప్రతి 15 రోజులకు, లేదా కనీసం ప్రతి నెలాఖరుకు పూర్తిగా పత్రికా కార్యాలయానికి పంపుతూ వుండాలి. పత్రికా కార్యాలయంనుంచి వచ్చే బిల్సును, సేల్సు రిజిస్టరుతో ఏనెల కానెల సరిజూచుకుంటూ వుండాలి. నెలాఖరుకు దమ్మిడీ బాకీలేకుండా పంపుతూవుండాలి.

(d) ఏ వారాని కావారం సేల్సు రిజిస్టరు చూచుకుంటూ తక్కువకాపీలు కావలసినా, ఎక్కువకాపీలు కావలసినా ఒకవారం ముందుగానే ఆఫీసుకు తెలియజేస్తూవుండాలి.

(ఆ) చందాదార్లకు పత్రికలను అందజేసేపని ప్యాక్యర్స్‌కు ఇవ్వకూడదు. దానికి ఒక ప్రత్యేక కామ్రేడ్‌ను నియమించాలి. ప్రతివారం పత్రికరాగానే ప్రప్రథమంగా చందాదార్లకు పత్రిక వెంటనే అందజేయాలి.

7. పార్టీ ఆర్గనైజర్లు. ముఖ్యంగా ఆయా ప్రాంతాల సెల్లుకార్యదర్శి. తాలూకా కార్యదర్శి. జిల్లా కార్యదర్శి తామున్నచోట్ల ఏజెంట్లను. పత్రిక అమ్మకం విధానాన్ని రెగ్యులరుగా చెకప్‌చేస్తూవుండాలి. చెకప్‌అంటే ఏదో లాంఛనం చెల్లించినట్లుగా కాకుండా ఈ పై కార్యక్రమంఅంతా అమలు జరుగుతున్నదీ లేనిదీ వివరాలతోసహా తెలుసుకుంటూ, వాటి లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దుతూ వుండాలి. ప్రతిపార్టీ కమిటీ మీటింగులోను, జనరల్‌బాడీ సమావేశంలోను, ఎజెండాలో ఇది ఒక విషయంగా వుండాలి.

14 పార్టీఫండు

పార్టీనిర్మాణంలో, పార్టీయొక్క ఆర్థికవిషయాన్ని కూడ ఆర్గనైజుచేసుకొని ఒక ప్లానుప్రకారం ఆర్థికపరిస్థితిని స్థిరపర్చుకోవడం ఒక ముఖ్యమైన కర్తవ్యం. నిర్మాణరీత్యా పార్టీబలపడుతూ, అభివృద్ధి అవుతున్నకొద్దీ దానికి తగినట్లుగా పార్టీ ఆర్థికవిధానం కూడ సౌష్ఠవమొనర్చబడుతూవుండాలి. లేకపోతే పార్టీ కుంటుపడుతుంది. మొన్న జనవరి నెలలో జరిగిన రాష్ట్రకమిటీ విస్తృతసమావేశంలో, పార్టీ ఆర్థికపరిస్థితిని పర్యాలోకనం చేసినప్పుడు 1944 వ సంవత్సరానికి రాష్ట్రకమిటీకి, జిల్లాకమిటీలకు, తాలూకాకమిటీలకు కలిపి, ప్రచారంగాలు కాకుండానే 2.25.000 లు కావలసి వుంటుందని అంచనా వేయబడింది. దీనిలో సెల్లుల ఖర్చులు చేర్చబడలేదు. అందుచేత అంతా కలుపుకుని లెక్కవేస్తే ఇంకాఎక్కువ మొత్తమే మనం వసూలుచేయవలసి వుంటుంది. పార్టీ అభివృద్ధి అయ్యేకొలదీ, ప్రతిసంవత్సరం ఎక్కువమొత్తం వసూలుచేస్తూపోతూ, ఉండాలసిఉంటుంది. పార్టీ, ఈడబ్బులో చాలభాగం ప్రజలనుండి వసూలుచేయగలిగిన పలుకుబడిని గలిగిఉంది. ఎందువల్లనంటే ఆంధ్రలో 4500 మంది పార్టీసభ్యులు నిత్యం ప్రజాసేవలో నిమగ్నులయి ఉన్నారు. ఇందులో 700 మంది తమ సర్వకాలాన్ని ప్రజాసేవలోనే గడిపే, ప్రొఫెషనల్ విప్లవకారులున్నారు. పార్టీఎన్నో ప్రజల దైనందిన ఇబ్బందులను తీర్చుతోంది. అందుచేత రైతులు, కూలీలు, కార్మికులు, యువకులు, బాలురు, స్త్రీలు అందరిలోనూ ప్రాతిపదికను సంపాదించింది. మనపార్టీయెడల అభిమానమున్నవారందరినీ, పార్టీసభ్యులుధైర్యంగా పోయి అడగాలి. డబ్బు అడగడం నామోషీగా భావించే పెట్టీబూర్జువా తత్వం పోవాలి.

"ప్రజలకోసం ఇంతమంది పార్టీసభ్యులు కృషిచేస్తున్నారు. అట్టి పార్టీనిపోషించుకోవడం ప్రజలకర్తవ్యం." అని ప్రజలతో చెప్పాలి.

ఎటూ మనం మనరాష్ట్రంలో పార్టీకోసం ఇంత వసూలుచేయాలి అంటే, ఇదికేవలం ఏ కొద్దిమంది అభిమానులవద్దనుండిగాని, పార్టీకి ఆస్తులను అమ్మియిచ్చే పార్టీసభ్యులవల్లగాని, వస్తుందనుకోవడంపొరపాటు. దీనికిఎక్కువగా ప్రజాసామాన్యం వద్దనుండే వసూలు చేయాలి. అలా చేయగలిగిననాడే మన పార్టీ రాజకీయాలు ప్రజలలో ఎక్కువగా నాటుకొని మనది నిజమైన ప్రజాపార్టీగా తయారవుతుంది. ప్రజలే తమ పార్టీని పోషించుకో గలుగుతారు. బూర్జువా పార్టీలకు, బోల్షివిక్‌పార్టీకివున్న వ్యత్యాసం ఇక్కడే కనబడుతుంది. బూర్జువాపార్టీలు, ప్రజలపై ఆధారపడవు. ప్రజలవద్దకుపోవు. ఏ కొద్దిమంది ధనవంతుల సహాయంతోనో తమపార్టీ ఖర్చులన్నీ గడుపుతారు. బోల్షివిక్‌పార్టీ అలా కాదు. అది ప్రజలపార్టీ. ప్రజలే దానికి వెన్నెముక. ప్రజలతో ఎల్లప్పుడు సన్నిహిత

సంబంధం కలిగివుంటుంది. ప్రజలపైనే ఆధారపడివుంటుంది. అందుచేత మనం ప్రజా సామాన్యంనుండి పార్టీఫండు వసూలుచేయడమంటే వూరికే పార్టీకి విరాళాలిమ్మని ధర్మం అడగడంకాదు. ప్రజల రోజురోజు సమస్యలను తీసుకొని పనిచేయడంద్వారా రాజకీయాలను ప్రజలవద్దకు తీసుకుపోతాము. వారిలో రాజకీయచైతన్యాన్ని అభివృద్ధిచేస్తాము. తద్వారా కమ్యూనిస్టుపార్టీ తమపార్టీగా వారు గుర్తించేటట్లు చేస్తాము. ఆర్థికంగా తమ పార్టీని తాము పోషించుకొని, దిట్టపరుచుకోవాలనే చైతన్యం వారిలో కలిగిస్తాము. ఆవిధముగా మనం ప్రతిసంవత్సరం పార్టీకి కావలసిన ధనాన్ని ప్రజలనుండి వసూలుచేస్తాము. ఇదంతా ఒక్కనాడే జరిగిపోతుందనికాదు. పార్టీకి కావలసిన ధనమంతా ప్రజలనుండే వసూలు కావడానికి ఇంకా కొంతకాలం పట్టవచ్చును. కాని దానిని మనధ్యేయంగా పెట్టుకొని పనిచేయాలి. పనిచేస్తే తప్పక మనధ్యేయాన్ని చేరగల్గుతాము. దీనికితోడు, చైతన్యం గలిగిన పార్టీసభ్యులు తమ ఆస్తులను. సర్వస్వాన్ని పార్టీకి ఇవ్వడంఅనేది - ఎప్పుడూ వుంటుంది.

వసూలుచేసే పద్ధతులు

పార్టీ ఫండు వసూలుచేసేటప్పుడు ప్రధానంగా ఒక విషయాన్ని పార్టీసభ్యులు గుర్తుంచుకోవాలి. పార్టీఫండు అనేది ఒక దయా ధర్మభిక్షవంటిదికాదు. అది ఒక రాజకీయ కర్తవ్యాన్ని నెరవేర్చడమే. అందుచేత మనం పార్టీఫండు వసూలుచేసేటప్పుడు ఇట్టి వాతావరణాన్నే కలుగజేయాలిగాని ధర్మభిక్ష అడిగినట్లుమాత్రంకాదు. పార్టీయొక్క పాలసీ రాజకీయాలను, పార్టీ ప్రజలకు చేసినసేవను ప్రజల్లోచెబుతూ, పార్టీఫండు వసూలు చెయ్యాలి. పార్టీఫండు వసూలు ఉద్యమంగూడా రాజకీయోద్యమంగా సాగించాలి. ఎక్కడ వసూలుచేసేటప్పుడు అక్కడ ప్రజలకు పార్టీచేసిన సేవనుగూర్చి చెప్పాలి. అప్పుడు ప్రజలకు పార్టీ అంటే స్పష్టంగా తెలుస్తుంది.

సామాన్యంగా మనం వసూలుచేసే పార్టీఫండు ఈ క్రింది విధాలుగా వుంటుంది. (1) గ్రామాలలో రైతులు, వ్యవసాయకూలీలనుండి (2) కంట్రాక్టుపనులద్వారా (3) పట్టణాలలో కార్మికులు మధ్యతరగతి ఉద్యోగులు, వీరినుండి (4) బుర్రకథలు నాటకాలు మొదలైన వైజ్ఞానిక ప్రదర్శనాలద్వారాను (5) దినోత్సవాలు వూరేగింపులు, బహిరంగ సభలు మొదలైన సందర్భాలలోను వసూలుచేయడం.

ఈ పద్ధతులను ఒక్కొక్కటే తీసుకుని ఎలా పార్టీఫండును వసూలు చేయాలో చూద్దాం.

(1) మనది ఎక్కువగా వ్యవసాయకరాష్ట్రం. మనపార్టీ ఎక్కువగా గ్రామాలలోనే పలుకుబడి కలిగి వుంది గనుక మనకు కావలసిన పార్టీఫండులో ఎక్కువభాగం రైతుల నుండి, వ్యవసాయకూలీలనుండి వసూలు కావలసివుంటుంది. కాని రైతులవద్ద ఎల్లప్పుడూ డబ్బుగాని ధాన్యంగాని వుండదు. అందుచేత సంవత్సరం పొడుగునా గ్రామాలలో పార్టీ

ఫండు వసూళ్లు సాధ్యపడవు. ప్రతి సంవత్సరం పంటలువచ్చేకాలంలో అంటే, డిసెంబరు, మే నెలలమధ్యనే రైతులవద్దగాని, వ్యవసాయకూలీలవద్దగాని ఎక్కువ పార్టీఫండు వసూలు చేయడానికి వీలౌతుంది. ఆ తరువాత వారివద్ద వసూలుచేయడం కష్టం. అంటే సామాన్యంగా, నవంబరులో మనం ప్రారంభించే జాతీయైక్యతావారం మొదలు మేదే వరకూ, —ఆమధ్యకాలంలోనే - పార్టీఫండు వసూళ్లు జరిగిపోవాలి. ఈ కాలంలో మన కామ్రేడ్స్ ప్రతిరైతును కలిసికొని, ప్రతిఇంటికి, ప్రతికళ్ళం వద్దకువెళ్ళి ధనరూపంలోను, ధాన్యరూపంలోను పార్టీఫండును వసూలు చేయాలి. వ్యవసాయకూలీలవద్ద గూడ ఈ రోజుల్లోనే డబ్బు మెసులుతుంటుంది. వారి చైతన్యాన్నిబట్టి ఎంత ఇవ్వడానికి సిద్ధపడితే, అంత పార్టీఫండుకు వసూలు చేయాలి. ఇలా ప్రతి సంవత్సరం ఆసైములో - 6 నెలల లోను - రెగ్యులరుగా పార్టీఫండు వసూలుచేయాలి. మెట్టప్రాంతాలలోను, మాగాణి ప్రాంతాలలో కొన్నిచోట్ల (తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలు) రెండేసి పంటలుకూడ వుంటాయి. అటువంటప్పుడు ఏదో ఒక పంటరోజుల్లోనే - సామాన్యంగా మొదటిపంట రోజుల్లోనే - పార్టీఫండు వసూలు చేయాలిగాని రెండు పంటలకూ వారివద్దకు వెళ్ళకూడదు.

రైతుసంఘానికికూడ గ్రామాలలో రైతులవద్దనుండి విరాళాలు వసూలుచేస్తాము. అటువంటప్పుడు, పార్టీఫండు వసూళ్ళకి, రైతుసంఘనిధి వసూళ్ళకి ఘర్షణరాకూడదు. అందుచేత పూర్తిగా పార్టీ పలుకుబడిలోవుండే గ్రామాలలో (Red Villages) పార్టీకి విరాళాలిచ్చినవారిని తిరిగి రైతుసంఘాలకి విరాళాలిమ్మని అడగకూడదు. అట్టిచోట్ల వారెంత ఎక్కువమొత్తాన్ని ఇవ్వగలిగితే అంతా పార్టీకేరావాలి. పార్టీకి ఇవ్వనివారినుండి మాత్రం రైతుసంఘం వసూలు చేయవచ్చు. రైతుసంఘాలకు ఎక్కువగా ఇతరగ్రామాల నుండి విరాళాలు వసూలు చేయాలి.

పోతే యువజనసంఘాల కార్యక్రమానికికూడ డబ్బు అవసరం వుంటుందికదా దానిసంగతి ఏమిటనే ప్రశ్నరావచ్చును. యువజనసంఘాలు తమకు కావలసినడబ్బును జాతీయ పండగలలోనే (సంక్రాంతి, దీపావళి మొదలైనవి) తమ ఆటల కార్యక్రమం సమయంలో వసూలు చేసుకోవాలిగాని పార్టీఫండులాగగాని, రైతుసంఘనిధిలాగగాని రెగ్యులరుగా, వసూలు చేయకూడదు.

(2) ఇంతేగాక గ్రామాల్లో కోతలు, కట్టివేత, వేరుశనగ పీకుడు మొదలైనపనులను కంట్రాక్టుపుచ్చుకుని, పార్టీ సభ్యులు, సానుభూతిపరులైన ప్రజలు అంతాగలిసి ఆపనిని పూర్తిచేసి, ఆడబ్బును పార్టీఫండుగా ఇవ్వడంగూడ ఒకపద్ధతిగూడ అమలులోకి వచ్చింది. ఈ పద్ధతిని ఇంకా మనం ప్రోత్సహించాలి. దీనివల్ల పార్టీయొక్క ప్రచారంగూడ ఎక్కువగా జరుగుతుంది. పార్టీకోసం కలిసి పనిచేసే వారిలో సౌహార్ద్రభావం హెచ్చుతుంది.

(3) పట్టణాలలో. పార్టీఫండు ఇచ్చేవారు ముఖ్యంగా కార్మికులు, మధ్యతరగతి ఉద్యోగులు. వారికి ప్రతివారం గాని, ప్రతినెలగాని జీతాలుగా ఆదాయం వస్తుంది గనుక

వారినుండి రెగ్యులరుగా ప్రతినెలా ఇంత అని నిర్ణయించి వసూలుచేయాలి. ఈ విధంగా నెలవారీగా రెగ్యులరుగా ఇచ్చేవారి రిజిష్టరును ప్రతిసెల్లూ ఉంచాలి.

(4) పోతే నాల్గవపద్ధతి బుర్రకథలు, వైజ్ఞానికప్రదర్శనాల ద్వారా వసూలుచేయడం. ఇవి ప్రజలను–రాజకీయ చైతన్యము లేనివారిని సహితం – బాగా ఆకర్షిస్తాయి. అందుచేత వీటిద్వారా ప్రజలలో రాజకీయప్రచారం చేయడం చాల సులభం. ఇట్టి ప్రదర్శనాలు ఏర్పాటుచేసి ప్రజాసామాన్యాన్ని ఆకర్షించి, వారికి రాజకీయాలు అతిసులభంగా తెలియజెప్పినప్పుడు, వారు పార్టీఫండును, కొద్దో గొప్పో తప్పక యిస్తారు. అందుచేత ఈప్రదర్శనాలు జరిపినప్పుడు పార్టీఫండు తప్పక వసూలుచేస్తూ వుండాలి. పార్టీఫండు వసూళ్ళలో దీనిని ఒక రెగ్యులరు పద్ధతిగా అనుసరించాలి.

(5) ఐదవది, దినోత్సవాలు, వూరేగింపులు, బహిరంగసభలు మొదలైన సందర్భాలలో పార్టీఫండు వసూలుచేయడం. మనం జరిపే ప్రతిరాజకీయ దినోత్సవంలోను వూరేగింపులు, బహిరంగసభల సమయంలో మన రాజకీయ ఉపన్యాసాలతోనే సరిపెట్టకుండా పార్టీ పాలసీని, కార్యక్రమాన్ని చెప్పినతరువాత పార్టీఫండుకు విరాళాలిమ్మని కోరుతూ ఆదినోత్సవాలలో పాల్గొన్నవారి వద్దనుండి ఫండు పోగుచేయాలి. దినోత్సవాలంటే రాజకీయ దినోత్సవాలేగాని సంక్రాంతి, దీపావళి మొదలైన జాతీయపండగలుకాదు. అట్టిపండగలలో యువజనసంఘాలు ఆటలు వగైరా కార్యక్రమంద్వారా పండుగలను జరిపి యువజనులను ఆకర్షించి యువజనసంఘాలకు కావలసిన ఫండును వసూలుచేసుకుంటాయి. అందుచేత అట్టి పండగలను మాత్రం వారికి వదలివేయాలి.

ఈ పద్ధతులద్వారా ఎక్కువగా ప్రజాసామాన్యంవద్ద నుండే పార్టీఫండు వసూలు చేయాలి. ప్రజలు కమ్యూనిస్టుపార్టీ తమదిగా భావించి, తమ పార్టీని పోషించుకోవాలనే చైతన్యం వారిలో పెంపొందింపజేయాలి. పార్టీఫండు వసూళ్ళలో దానితోపాటు ఇదిగూడ ప్రధానకర్తవ్యంగా పెట్టుకోవాలి.

పార్టీఫండు వసూళ్ళలో ఒక విషయంలో మాత్రం పార్టీసభ్యులు చాల జాగ్రత్త వహించాలి. అది ఏమంటే వేలంపాటలు పాడటం. ఈ వేలంపాటలనేవి ఒక ప్రమాదకరమైన వేలంవెర్రిగా తయారవుతున్నాయి. పార్టీఫండుకోసం ఏదో ఒక వస్తువును వేలానికి పెట్టడం. అప్పుడు ఆవేశంలో తమకు తాహతులేకపోయినా – ఒళ్ళుతెలియక ఎక్కువ మొత్తానికి పాడటం. తీరా ఇచ్చుకోవలసివచ్చేటప్పటికి తలప్రాణం తోకకువచ్చి అవస్థపడటం, కొన్నిచోట్ల పూర్తిగా ఇచ్చుకోలేకపోవడం సంభవిస్తుంది. అందుచేత ఈ పద్ధతిని కామ్రేడ్స్ ఎక్కడా అనుసరించకూడదు. మనం పార్టీఫండును వసూలుచేయడమంటే వారి వారి రాజకీయచైతన్యాన్ని బట్టి, తాహతునుబట్టి ఎంతఎక్కువ రాబట్టగలిగితే అంత రాబట్టాలిగాని, వేలంపాటలవంటి తాత్కాలికోద్రేకాలతో కూడిన పందెపు వాతావరణాన్ని కలుగజేసే పద్ధతులవల్ల కాదు.

15. పార్టీ ఎకౌంట్లు

కామ్రేడ్స్!

మనపార్టీ జమాఖర్చులను వ్రాయడం విషయంలో చాల పార్టీకమిటీలు క్రమమైన పద్ధతిని అవలంబించడంలేదు. స్థానిక కమిటీలు ఎవరికితోచిన విధంగా వారు తమ జమాఖర్చులను వ్రాస్తున్నారు. పైకమిటీలకు ప్రతినెలా తమ ఆదాయ వ్యయాలను ఒకపట్టీగా తయారుచేసి పంపే స్థానికకమిటీలు చాలతక్కువ. దీనిఫలితంగా జిల్లాకమిటీలు ప్రతినెలా తమజిల్లాలో మనపార్టీ ఎంత సొమ్మును వసూలుచేస్తోందో, ఎంత ఖర్చుపెడుతోందో వివరాలు రాష్ట్రకమిటీకి తెలియజేయలేక పోతున్నాయి. అందువల్ల రాష్ట్రం మొత్తంమీద మన పార్టీ ఆర్థికస్థితిని సమగ్రంగా తెలుసుకోడానికి వీలులేకపోతోంది. ఏ కమిటీయొక్క ఆర్థిక సౌష్టవం ఏమిటో, ఏకమిటీకి ఎంతశక్తి సామర్థ్యంవుందో, ఏకమిటీకి ఎంత ఖర్చుఅవుతోందో, ఎంత వసూలు చేయగలుగుతోందో మొదలైన వివరాలు తెలియకపోవడం. పార్టీ ఫండు-విషయం వచ్చినప్పుడు ఇవేమీ చూడక ఏదోకోటాలు తీసుకోవడం. అవి పూర్తి చేయలేకపోవడం జరుగుతోంది. అంతేకాదు. అసలు తమ నిత్యఖర్చులకు కావలసిన ధనాన్నికూడ వసూలు చేసుకోలేకపోవడం, ఒకప్లాను వేసుకొని ఆ ప్రకారం తమ ఆర్థిక పరిస్థితిని చక్కబరుచుకోవడం లేక ఎప్పటికప్పుడు ఏదో అడ్డువేసుకుని దాటుకుపోవడమే జరుగుతోంది.

మన పార్టీ రోజురోజుకు బలపడి ప్రజాపార్టీగా అభివృద్ధి చెందుతోంది. మనపార్టీ నిర్మాణంతోపాటు మనపార్టీ ఆర్థిక పరిస్థితిగూడ నిర్మాణయుక్తంగా వుండాలి. అంతేగాదు. ప్రజాపార్టీగా మనం ప్రజలయెడల ఒక పవిత్రమైన బాధ్యతను నెరవేర్చవలసి వుంది కూడాను. ప్రజలనుండి వసూలుచేసే ప్రజాద్రవ్యానికి సరియైన జమాఖర్చులను వ్రాయాలి. బోల్షివిక్కులమైన మనం ఈ పవిత్రకర్తవ్యాన్ని నెరవేర్చాలి. ఈ కర్తవ్య నిర్వహణంలో ఏ ఒక్క పార్టీసభ్యునిలోను, పార్టీ కమిటీలోను అణుమాత్రంకూడ అశ్రద్ధ, నిర్లక్ష్యం వుండగూడదు. దీనికి ప్రతి స్థానిక కమిటీగూడ తన ఆదాయ వ్యయాలను, అంటే, తాను తన ప్రాంతంలో ప్రజల వద్దనుండి ఏవిధంగా ఎంత వసూలుచేసినదీ, ఏవిధంగా ఖర్చు పెట్టినదీ, తనవద్దనున్న నిల్వగాని, రిజర్వుఫండుగాని, ఎంతవున్నదీ విపులంగా తెలియజేస్తూ ప్రతినెలా ఆర్థిక రిపోర్టును, ఆదాయవ్యయ పట్టీని, పైకమిటీకి పంపడం అలవర్చుకోవాలి. ఇదేవిధంగా ప్రజారంగాలలో పనిచేసే కామ్రేడ్స్ తాము పనిచేసే ప్రజాసంఘానికి ఎంత వసూలుచేస్తున్నారో, ఎంత ఖర్చు అవుతోందో తమ పైసంఘాలకు ప్రతినెలా పంపాలి. ఈ రిపోర్టులనుబట్టి జిల్లాపార్టీ కమిటీలు, ప్రజారంగాలు తమ జిల్లా మొత్తంమీద

తమ రంగంయొక్క ఆర్థిక పరిస్థితిని, ఆదాయవ్యయాలను తయారుచేసి రాష్ట్రకమిటీకి, ప్రతినెలా పంపుతూవుండాలి. ఇలా జరుగుతూన్ననాడు స్థానికంగాను, జిల్లా మొత్తంమీద, రాష్ట్రం మొత్తంమీదకూడ మనపార్టీ ఆర్థిక పరిస్థితి చక్కగా తెలుస్తూవుంటుంది. ఎక్కడ ఏవిధంగా చక్కబరచుకోవాలో ఒక సమగ్రమైన ప్లాను వేసుకోడానికి, మనపార్టీ ఆర్థిక స్థితిని నిర్మాణయుక్తంగా దిట్టపరచుకోడానికి వీలౌతుంది.

కాని ఈవిధంగా జరగాలంటే ప్రప్రథమంగా ప్రతి స్థానికపార్టీ కమిటీ, ప్రజా రంగాలు తమ ఎకౌంట్లను సరియైన పద్ధతిలో వుంచడం నేర్చుకోవాలి. ఇది సాధ్యమైనంతవరకు రాష్ట్రమంతటికి ఒకే పద్ధతిగా వుండాలి. ఈ పద్ధతికూడ సాధ్యమైనంత సులభమైనదిగాను, సమగ్రమైనదిగాను వుండాలి. అందుచేత ప్రతి పార్టీకమిటీ (సెల్లుసహా) ప్రజారంగాల్లో పనిచేసే కార్యకర్తలు తమ సంఘ ఎకౌంట్లను ఎలావుంచాలో, ఆదాయ వ్యయ పట్టీలను, రిపోర్టులను ఎలా తయారుచేయాలో ఈ క్రింద తెలియజేస్తున్నాం.

చిఠా — అవర్జా

ప్రతి ఎకౌంటుకు చిఠా, అవర్జాఅని రెండు పుస్తకాలుండాలి. చిఠాఅంటే రోజువారీగావచ్చే జమలుగానీ, అయ్యేఖర్చులుగాని ఎందునిమిత్తమో వివరాలతో వ్రాసేపుస్తకం. దీనిని రోజువారీ వరుసగా వ్రాసుకుపోతాం. ఇలా వ్రాసిన జమలను ఖర్చులను, ఏఖాతాకు (అంటే ఎందునిమిత్తం అయిందో తెలియజేసేది) ఆ ఖాతాకు విడదీసి ఖాతాలవారీగా అవర్జాలో ఎత్తి వ్రాస్తాము. అంటే అవర్జాలో చిఠాలో మాదిరిగా అన్నీకలిపి వరుసగా ఖర్చుగాని, జమగాని వ్రాయకుండా ఒక్కొక్కఖాతాకు అవసరాన్నిబట్టి కొన్ని పేజీలచొప్పున ప్రత్యేకించి చిఠాలో వ్రాసిన పద్దులను ఏఖాతాకు నియమించిన పేజీలలో ఆఖాతాకు ఎత్తి వ్రాస్తూ వస్తాము. దీనివలన లాభం ఏమిటంటే ఏఖాతాకు అంటే ఎందునిమిత్తం ఎంత మొత్తం ఖర్చు అయిందనిగాని, ఎంత ఆదాయం వచ్చిందనిగాని వివరంగా ఎప్పటికప్పుడు తెలుసుకోడానికి వీలుగా వుంటుంది.

చిఠా, అవర్జాలు వ్రాసేపద్ధతి

ఎకౌంట్లు పుస్తకంలో వ్రాయడం ఆరంభించడానికి ముందు, మనకు సాధారణంగా ఏయేవిధంగా జమలుగాని, ఖర్చులుగాని వుంటాయో వాటిని e కలిసు వ్రాసుకోవాలి. వీటినే ఆయా ఖాతాలని పిలుస్తాం. ఉదాహరణకు తీసుకుంటే మన పార్టీకమిటీలకు, ప్రజారంగాలకు వుండే జమాఖర్చులకు ఈ క్రిందివిధంగా ఖాతాలు పెట్టవలసివుంటుంది.

జమలువచ్చే ఖాతాలు

1. సభ్యత్వరుసుము. 2. లెవీలు (లెవీలంటే మనకువచ్చే ఆదాయం సరిపోనప్పుడుగాని, మరియేయితర అవసరం వచ్చినప్పుడుగాని, మనలో ఇచ్చుకోగలిగిన పార్టీసభ్యుల మీద అదనంగా కొంతభారం వేసి ఆవిధంగా వసూలుచేసేది) 3. విరాళాలు. 4. సారస్వతం అమ్మకంవల్ల వచ్చే ఆదాయం (ఖర్చులుపోను వచ్చే కమీషన్ వగైరా)

ఖర్చు ఖాతాలు

1. అద్దె-లైటింగు, 2. స్టేషనరీ (ఆఫీసుకు కావలసిన తెల్లకాగితాలు, పెన్సిళ్ళు కలాలు, సిరా మొదలైనవి) 3. ఫర్నిచరువగైరా ఆఫీసుసామగ్రి, 4. పత్రికలు, 5. సాదరు (ఆఫీసుకు సంబంధించిన ఇతర చిల్లరఖర్చులు వగైరా) 6. ప్రచారం (కరపత్రాలు, నోటీసులు వగైరా ఏది ప్రింటుచేసినా వాటికయ్యేఖర్చులు) 7. పోస్టేజి, టెలిగ్రాములు, 8. అలవెన్సులు, (పార్టీహోల్ టైమర్లకిచ్చే అలవెన్సులు, అత్యవసర సమయాల్లో వైద్యసహాయానికి మొదలైనవాటి కిచ్చే అదనపు అలవెన్సులు) 9. ప్రయాణాలు. 10. ట్రైనింగు. (పార్టీసభ్యులకు, శిక్షణాశిబిరాలు, ట్రైనింగుస్కూల్సు మొదలైనవి నడిపితే వాటికయ్యే ఖర్చులు) 11. లైబ్రరీ (పార్టీఆఫీసులైబ్రరీకి కొనేపుస్తకాలకయ్యే ఖర్చు) 12. సబ్సిడీలు, (క్రిందికమిటీలకు యిచ్చే సబ్సిడీలు) చిఠాలో ఖాతాలు ఇదేవరుసలో వుండాలి. లేకపోతే కనీసం జమాఖర్చులపట్టీలోనైనా ఈవరుస వుండాలి.

ఇవిగాక ఇంకో రెండు ఖాతాలుకూడ అవసరమవుతాయి అవి ఏవంటే పైకమిటీ పేరుతోవుండే ఖాతా ఒకటి. రెండోది అప్పులఖాతా. వీటిలో పైకమిటీకి మనం ఏదైనా యిచ్చినా పుచ్చుకున్నా అది వివరంగా వుండడానికి పైకమిటీ అకౌంటుకు ఆ పద్దులు సరిపోయేటట్లు అందులో వుండాలి. అప్పులు అనేది న్యాయతః వుండవలసిన ఖాతాకాదు. అయినప్పటికి ఒక్కొక్క సమయంలో అవసరంకొద్దీ అప్పులు తేవలసి వుంటుంది. అందుచేత ఎంత అప్పుచేసేది, అందులో ఎంత తీర్చినది మొదలయిన వివరాలకోసం ఆ ఖాతాకూడా వుండడం అవసరం. కాని అప్పులఖాతా పెట్టినప్పుడు మనం ఇతరులవద్ద తెచ్చేఅప్పులు, ఒకవేళ మనం ఇతరులకు ఇస్తే ఆ అప్పులు అన్నీకలిపి ఒక ఖాతాలోనే వ్రాయకూడదు. మనం ఇతరులవద్ద తెచ్చే అప్పులకొక ఖాతా మనం ఇతరులకు అప్పులిస్తే వాటికి ప్రత్యేకంగా ఇంకొక ఖాతా విడివిడిగా వుండాలి. లేకపోతే అవీ ఇవీ కలిసిపోయి, మనం తెచ్చిన అప్పులలో ఎంత తీర్చినదీ, ఇంకా ఎంత తీర్చవలసినదీ తెలుసుకోవాలన్నా, ఇతరులకు ఇచ్చిన అప్పులలో ఎంత వసూలయినది, ఎంత రావలసివున్నదీ చూసుకోవాలన్నా కష్టమైపోతుంది. అందుచేత ఆ రెండూ వేరు వేరుగా వుండాలి. బ్యాంకిలో ఎకౌంటువున్న కమిటీలకు ఆ బ్యాంకుపేర ఒక ఖాతాకూడ అవసరమౌతుంది.

బ్యాంకిలో ఎప్పుడు ఎంతవేస్తే అది ఆ ఖాతాను ఖర్చువ్రాసుకోవడం, తీసినది జమ వ్రాసుకోవడం చేస్తూవుండాలి.

ఇలా విభజించుకున్న తరువాత ఇంక చిఠా అవర్జాలలో వ్రాసేవిధానం చూద్దాం. సాధారణంగా ఎక్కౌంటు పుస్తకాలన్నిటిలోను, ఈ క్రిందివిధంగా రూళ్లు గీయబడి వుంటాయి.

1	2	3	4	5			6		
తేదీ	పేజీ నెం.	వివరాలు	వోచరు నెం.	జమలు			ఖర్చులు		
				రు.	అ.	పై.	రు.	అ.	పై.
		జమ, ఖాతాపేరు వివరం		★	★	★			
		ఖర్చు, ఖాతాపేరు వివరం					★	★	★

1 వ కాలంలో తేదీవేయాలి. 2 వ కాలంలో అవర్జాలో దీనిని ఎత్తి వ్రాసినపుడు ఈ ఖాతా, అవర్జాలో ఏపేజీలో వ్రాయబడిందో ఆపేజీ నంబరు వేయాలి. ఇదేవిధంగా అవర్జాలో 2 వ కాలంలో చిఠాలో ఏపేజీనుంచి ఆ పద్దును ఎత్తి వ్రాశామో ఆ చిఠా పేజీ నెంబరు వేయాలి. 3 వ కాలంలో వివరాలు వ్రాయాలి. ఈ వివరాలు వ్రాసేవిధానం ఇది. జమ పద్దుఅయితే ముందు జమ అని వ్రాసి ఏ ఖాతాక్రింద జమవచ్చిందో ఆ ఖాతాపేరు వ్రాసి, ఎవరివల్లవచ్చిందో వివరంవ్రాసి ఆమొత్తాన్ని 5 వ కాలంలో రు అ. పై వేయాలి. ఖర్చు పద్దుఅయితే ముందు ఖర్చు అని వ్రాసి ఖాతాపేరు, వివరంవ్రాసి 6 వ కాలంలో రు. అ. పై. వేయాలి. అంటే 3 వ కాలంలో వివరాలు వ్రాసినతరువాత జమ మొత్తాలన్నీ 5 వ కాలంలోను, ఖర్చు మొత్తాలన్నీ 6 వ కాలంలోను వ్రాయాలి. 4 వ కాలంలో వోచరు నెంబరువేయాలి.

అవర్జా పుస్తకంలో ముందు ఒక విషయసూచికను (ఇండెక్సు) వ్రాసుకోవాలి. దానిలో ఖాతాపేరు వ్రాసి ఆపేరుకు తిన్నగా అది ఏపేజీలో ప్రారంభమౌతుందో ఆపేజీ నెంబరువేయాలి. దీనివలన ఏఖాతా ఏపేజీలోవుందో సులభంగా తెలుసుకోవచ్చును.

పాటించవలసిన నియమాలు

చిఠా, అవర్జాలు వ్రాయడం తెలిసినంతమాత్రాన మన ఎక్కౌంట్లు సక్రమంగా వుంటాయనుకోకూడదు. మన ఎక్కౌంట్లు ఏతేడాలు, చిక్కు లేకుండా అణాపైసలతో సరిగా ఎప్పటికప్పుడు సరిపోయేలాగ వుండాలంటే కాగ్రేడ్సు ఈ క్రింది నియమాలను తప్పక పాటించాలి.

1. జమగాని, ఖర్చుగాని ముందుగా పుస్తకంలో వ్రాసుకోకుండా డబ్బు పుచ్చుకోవడం, ఇవ్వడం చేయకూడదు.

2. సాధ్యమైనంతవరకు మనం ఖర్చుపెట్టిన ప్రతిదానికి వోచర్లు వుండాలి. ఆ వోచర్లకు (తేదీవారీగా) వరుసనెంబర్లువేసి వాటిని ప్రత్యేకంగా ఒక ఫైలులో వుంచాలి. సాధ్యమైనంతవరకు వోచర్లు లేకుండా ఖర్చు వుండకూడదు.

3. అదేవిధంగా మనకు జమవచ్చిన ప్రతిమొత్తానికి మనం రశీదు ఇవ్వాలి. ఇలా ఇచ్చే రశీదులకు డూప్లికేటు (మన ఆఫీసులో మనవద్ద వుండేనకలు) వుంచుకోవాలి. అలా డూప్లికేటు రశీదులు లేకుండా మన చిఠాలో ఏమీ జమవుండకూడదు.

4. చిఠాను ప్రతిరోజూ తనిఖీచేసుకుని ఎంత నిల్వవుండాలో లెక్కతీసి ఆప్రకారం వుండవలసిన మొత్తం మనవద్దవున్నదో, లేదో సరిచూచుకుంటూ వుండాలి. ఇది ప్రతి రోజు విధిగాచేయాలి. ఏ సమయములోనైనా పైకమిటీల కాగ్రేడ్స్, అర్గనైజర్సువచ్చి ఎక్కౌంట్సు తనిఖీచేస్తే ఎట్టిలోపం కనపడకుండా వుండాలి.

5. కనీసం రెండు మూడు రోజులకొకసారైనా చిఠా పద్దులను అవర్జాలోకి ఆయా ఖాతాలలోకి ఎక్కించుతూ ఉండాలి.

6. నెలాఖరు అవగానే అవర్జాలోని అన్నికాతాలను కూడి మొత్తం వేయాలి. దీని వలన ఏ ఖాతాక్రింద (అంటే ఎందునిమిత్తం) ఆనెలలో ఎంతఖర్చు అయిందీ, ఎంత జమ వచ్చిందీ తెలుస్తుంది. చిఠాలోకూడా నెలాఖరు అవగానే ఆ నెలాఖరుకు ఎంత నిల్వవుందో స్పష్టంగా చూపుతూవుండాలి.

7. అలా అవర్జాను కూడినతరువాత ఆ నెలకు జమా ఖర్చుల పట్టీని (బ్యాలెన్సు షీటును) తయారుచేయాలి. అలా తయారుచేసిన బ్యాలెన్సుషీటులోని బ్యాలెన్సు (నిల్వ) నెలాఖరుకు చిఠాప్రకారం వుండే నిల్వతో సరిపోవాలి. అలా తయారుచేసిన జమా ఖర్చుల పట్టీని ప్రతినెల 5 వ తేదీలోపల పైకమిటీలకు పంపాలి.

8. చిఠాలోగాని, అవర్జాలోగాని ఒకపేజీ పూర్తిఅవగానే (ఆరోజు, ఆనెల పూర్తి కాకపోయినాకూడ) జమలను, ఖర్చులను కూడి వాటినే ప్రక్కపేజీలో ఆయా స్థలాలలో వేసుకోవాలి.

9. సాధారణంగా కూడికలు తీసివేతలలోవచ్చే పొరపాట్లేగాకుండా, ఒక పేజీ చివర అంకెలను తిరిగి రెండోపేజీ ఆరంభంలో వేసుకునేటప్పుడుకూడ పొరపాట్లు రావచ్చును. అదేగాక జమపద్దులు ఖర్చుకాలంలోను, ఖర్చుపద్దులు జమకాలంలోను పడే పొరపాట్లుకూడ సంభవిస్తాయి. ఈ పొరపాటు చిఠా వ్రాయడంలోనే గాకుండా, చిఠాలోని పద్దులను ఎత్తి ఆవర్జాలో వ్రాసేటప్పుడుకూడ దొర్లుతూ వుంటుంది. ఒక్కొక్కప్పుడు చిఠాలోని పద్దులు ఆవర్జాలో ఎక్కించడములో మధ్య ఒక్కొక్కపద్దు మర్చిపోవచ్చును. అందుచేత ప్రతినెలాఖరున చిఠాలోని పద్దులన్నీ సక్రమంగా ఆవర్జాలో ఎక్కినదీ లేనిదీ సరిచూచుకుంటూ (Compare చేస్తూ) వుండాలి. దానితోపాటు పైన ఉదహరించిన పొరపాట్లు వున్నవేమోకూడ చూచుకుంటూ వుండాలి.

10. రాష్ట్రకమిటీ నియమించిన కామ్రేడ్స్‌వచ్చి ఏ సమయంలో తనిఖీచేసినాసరే, చిఠా ప్రకారం వుండవలసిన మొత్తం మీవద్ద కనబడాలి. బ్యాంకిలోవేస్తే ప్యాస్‌బుక్కు కూడా చూపవలసి వుంటుంది.

ఈ నియమాలను తప్పకుండా పాటించాలి. అలా పాటించితే ఎక్కౌంట్లలో తప్పులుండవు. మన ఆర్థికస్థితి ఎలావున్నదీ మనకు, పైకమిటీలకు కూడా ప్రతినెలా స్పష్టంగా తెలుస్తూవుంటుంది.

జమాఖర్చులపట్టీ తయారుచేసే పద్ధతి

పైనియమాలలో నెం. 7వ నియమంలో ప్రతినెలా జమా ఖర్చుల పట్టీని తయారు చేయాలని చెప్పాము. దానిని తయారుచేసే విధానంకూడ వివరిస్తాము.

నెల పూర్తికాగానే ఆవర్జాలోని కాతాలను దేనికదికూడి, ఆమొత్తాలను ఏఖాతాక్రింద ఎంత జమ వచ్చినదీ, ఏ కాతాక్రింద ఎంత ఖర్చుఅయినదీ వరుసగా ఒకపట్టీగా వ్రాయాలి. ఈ జమా ఖర్చుల పట్టీని తయారుచేసేటప్పుడు ఈ క్రింది నియమాలు పాటించాలి.

1. మొట్టమొదట క్రిందటినెల నిలవను వేయాలి.

2. జమ పద్దులన్నీ ముందువ్రాసి వాటితరువాత ఖర్చు పద్దులువ్రాయాలి. ఇలా వ్రాసేటప్పుడు కొందరు ఒక పొరపాటుచేస్తున్నారు. మనం రోజూ జమాఖర్చులు వ్రాసేటప్పుడు ప్రతి కాతాలోనూ జమలు, ఖర్చులూ వుండవచ్చును, అంటే ఒక్కొక్కప్పుడు ఇచ్చి పుచ్చుకోవడాలలో కేవలం ఖర్చు కాతాలుగా వుండే వాటిలోకూడ కొన్ని జమలు, జమ కాతాలలోకూడ కొన్ని ఖర్చులు రావచ్చును. ఇది కేవలం ఆ పద్దును (పోటీపద్దును) సరిపెట్టడానికి (Adjustment) అవసరమై చేసేవని. జమాఖర్చుల పట్టీని తయారుచేసేటప్పుడు జమ కాతాలలో అట్టి ఖర్చులు తీసివేసి మిగిలిన జమ మొత్తాన్నే ఆ నెలలో ఆ కాతాక్రింద వచ్చిన జమగా చూపాలి. అంతేగాని ఆ కాతా పేరువ్రాసి జమను, ఖర్చును కూడా పట్టీలో చూపనక్కరలేదు. ఇలాగే కొన్ని ఖర్చు కాతాలలో వచ్చే జమలను ఆ ఖర్చులలో తీసివేసి మిగతా ఖర్చునే ఆ నెలలో అయిన ఖర్చుమొత్తంగా పట్టీలో వ్రాయాలి. అంతేగాని ఖర్చు కాతాలో జమ కొంత, ఖర్చు కొంత చూపకూడదు.

3. అలా జమలు ఖర్చులు వ్రాసి ఇంకా నిలవ ఎంతవున్నదీ తేల్చి పట్టీలో చూపాలి.

4. ఇలా జమాఖర్చుల పట్టీని పూర్తిచేసినతరువాత మనకున్న ఆస్తిని (Assets) అంటే మనవద్దనున్న నిల్వ, ఇంకావుంటే రిజర్వుఫండు, బ్యాంకిలోవుంటే ఆ మొత్తం, అదిగాక పేపరుస్టాకుగాని, పోస్టల్‌స్టాంపులు, కవర్లు, కార్డులుగాని నిల్వవుంటే వాటివిలువ మొదలైనవి. మనం ఇవ్వవలసిన బాకీలుంటే అవికూడ చివర ఒకప్రక్కన ఇవ్వాలి. ఇలా ఇవ్వడంవల్ల మన ఆర్థిక పరిస్థితి ఏమిటో స్పష్టంగా కనబడుతూ వుంటుంది.

తాలూకాయొక్క జిల్లాయొక్క మొత్తం ఆర్థిక పరిస్థితిని తెలిపే స్టేటుమెంట్లు

ఇంతవరకు చెప్పినదంతా సెల్లు, లేక స్థానికకమిటీ, లేక జిల్లాకమిటీ ఎవరికి సంబంధించినంతవరకు వారు వ్రాసే జమా ఖర్చులను గురించి మాత్రమే. కాని ఒక తాలూకా మొత్తంమీద, జిల్లా మొత్తంమీద, అలాగే రాష్ట్రం మొత్తంమీద మనపార్టీ యొక్క ఆర్థిక పరిస్థితిని తెలుసుకోవాలంటే తాలూకా కమిటీలు, (తాలూకాకమిటీలు లేనిచోట తాలూకా ఆర్గనైజర్లు) జిల్లాకమిటీలు ప్రతినెలా తమతాలూకాలోగాని, జిల్లాలోగాని మొత్తం ఎంత వసూలు చేయబడిందో, ఎంతఖర్చుచేయబడిందో తెలియజేసే సమగ్రమైన స్టేటుమెంటును తయారుచేసి పై కమిటీలకు పంపుతూఉండాలి. వాటిని తయారుచేసే విధానం ఇది. తాలూకాకమిటీ అయితే తన కమిటీ ఆఫీసులోవుండే చిఠా ఆవర్జాలుగాకుండా వేరే ఒక నోటుపుస్తకం పెట్టాలి. అందులో ప్రతిసెల్లుకి ఒకటిగాని, రెండుగాని పేజీలు ప్రత్యేకించి ఈ క్రిందివిధంగా టేబుల్సువేసి ప్రతినెలా వారి జమా ఖర్చుల పట్టీరాగానే వాటి ప్రకారం ఆ టేబుల్సు పూర్తిచేసుకుంటూ వుండాలి.

ఆదేవిధంగా జిల్లాకమిటీలు కూడా ఒక ప్రత్యేక నోటుపుస్తకం పెట్టి అందులో తాలూకాలనుండి ప్రతినెలా జమా ఖర్చుల పట్టీలు రాగానే ఆ వివరాలను పూర్తిచేసుకుంటూ వుండాలి.

కమిటీ పేరు...

నెల	జమలు				ఖర్చులు						
	సభ్యత్వ రుసుం	లెవీలు	విరాళాలు	సారస్వత కమిషను	ఆఫీసు * వగైరా	ప్రచారం ప్రింటింగు	పోస్టేజీ	అల వెన్సులు	ప్రయాణాలు	ట్రైనింగు	లైబ్రరీ

ఆఫీసు వగైరా అన్నప్పుడు పై ఖర్చుకాతాలలో 1 నుండి 5 వరకు కాతాల ఖర్చులన్నీ కలిపి దీనిలోవేయాలి.

ఇలా చేసినతరువాత తమ కమిటీ జమాఖర్చు పట్టిని, క్రింది కమిటీల లెక్కలను తీసుకొని వాటినన్నిటిని కలిపి జిల్లా లేక తాలూకా అంతటిలోను ఎంత వసూలు చేసినదీ, ఎంత ఖర్చుచేసినదీ తెలిపే సమగ్రమైన ఆదాయవ్యయపట్టిని తయారుచేసి పై కమిటీకి పంపాలి.

ప్రజా సంఘాలుకూడా ఇదేవిధంగా చేయాలి.

బుక్ డిపోల ఎక్కౌంట్లు

ఇంతవరకు పార్టీకమిటీల ఎక్కౌంట్లు ఎలావ్రాయాలో, నెలాఖరుకు జమాఖర్చుల పట్టీలు ఎలా తయారుచేయాలో మొదలైన వివరాలు యిచ్చాం. ఇక, పార్టీ సారస్వతాన్ని అమ్మే మనపార్టీ పుస్తకాల షాపులు (పీపుల్సు బుక్ డిపోలు) ఎక్కౌంట్లు, స్టాక్ రిజిస్టర్లు, లాభనష్టాల పట్టీలు ఎలా తయారుచేయాలోకూడా వివరిస్తాం.

చిఠా, అవర్జాలు పైన చెప్పినవిధంగానే వ్రాయాలి. కాతాలు మట్టుకు ఈ విధంగా వుండాలి.

జమ కాతాలు

1. అమ్మకం కాతా, ఇందులో పుస్తకాల అమ్మకంవల్లవచ్చే ఆదాయాన్ని జమ వేసుకోవాలి. క్రెడిట్ అమ్మకం వుండకూడదు. ఒకవేళ తప్పనిసరిగా క్రింది కమిటీల బుక్‌స్టాల్సుకు క్రెడిట్ యిచ్చినట్లయితే దాన్నికూడా అమ్మకం కాతాలోనే జమ వ్రాసుకొని, ఆ కమిటీ కాతాలో ఖర్చు వ్రాసుకోవాలి. రొక్కానికి అమ్మినా, క్రెడిట్‌కు అమ్మినా ఆయా బిల్లు నెంబరును అక్కడ ఉదహరిస్తూ వుండాలి. క్రెడిట్ అమ్మకాన్ని ఆకమిటీపేర ఖర్చు వ్రాసినపుడుకూడా బిల్లునెంబరును ఉదహరించాలి, ఆకమిటీనుంచివచ్చే జమలుకూడా ఆ కమిటీ కాతాలో వ్రాయాలి.

ఖర్చు కాతాలు

1. ప్రజాశక్తి ప్రచురణల కాతా 2. పీపుల్సు పబ్లిషింగ్‌హౌస్ కాతా 3. ఇతర పుస్తకాల కాతా 4. ప్రింటింగు 5. అద్దెలు, లైటింగుకి. ఆఫీసు ఎస్టాబ్లిష్‌మెంటు 7. స్టేషనరీ 8. సాదరు 9. పోస్టేజి 10. పార్సెల్సు, క్రింద కమిటీల బుక్‌స్టాల్సుకు ఒక్కొక్క కాతా చొప్పున పెట్టాలి.

అప్పుల కాతాకూడ అవసరమైతే వుండవచ్చును.

ఎక్కౌంట్లు వ్రాయడంలో పైనచెప్పిన నియమాలన్నీ వీరుకూడా పాటించాలి. నెలాఖరుకు జమా ఖర్చుల పట్టీనికూడ పైన చెప్పిన విధంగానే తయారుచేయాలి.

పోతే ఇక స్టాకు రిజిస్టరు. ఈ స్టాకు రిజిస్టరు సక్రమంగా లేకపోతే లాభనష్టాలు సరిగా తెలియవు. స్టాకు రిజిస్టరులో ఈ క్రింది విధంగా వుండాలి.

1	2	3	4	5			6		
తేదీ	వున్న పుస్తకాలసంఖ్య	అమ్మినపుస్తకాల సంఖ్య	వివరాలు	జమలు			ఖర్చులు		
				రు.	అ.	పై.	రు.	అ.	పై
	౦								
							౦	౦	౦
		౦		౦	౦	౦			

స్టాకు రిజిస్టరును ఈ క్రిందివిధంగా వ్రాయాలి. 1 వ కాలంలో తేదీవేయాలి. 2 వ కాలంలో మనం కొన్న పుస్తకాలసంఖ్య వేయాలి. ఈ పుస్తకాలకు అయిన ఖర్చును మాత్రం 6 వ కాలంలో వేయాలి. 3 వ కాలంలో మనం అమ్మిన పుస్తకాలసంఖ్య వేసి వాటికి వచ్చిన డబ్బు (కమీషను యిచ్చివుంటే దానిని మినహాయించి) 5 వ కాలంలో వేయాలి. 4 వ కాలంలో వివరాలు బిల్లునెంబర్లు సహా వ్రాయాలి. ఈవిధంగా ఒక్కొక్క పుస్తకానికి ఒక్కొక్క-కాతా చొప్పున పెట్టాలి. ఆపుస్తకం మనం కొన్నపుస్తకాలన్నీ అమ్ముడు అయిపోయినవెంటనే ఆ పుస్తకంమీద ఎంత లాభంవచ్చినదీ 5-6 కాలాల వ్యత్యాసాలనుబట్టి తెలుస్తుంది. సహజంగా పుస్తకం అమ్ముడు అయిపోగానే మనం దానిని కొన్న ఖరీదుకంటె అమ్మినందువల్ల వచ్చేది కొంచెం ఎక్కువే వుంటుంది. అదే మనకు దానిమీద వచ్చే కమీషను.

ఏరోజు అమ్మిన పుస్తకాలు ఆరోజు సాయంకాలమే స్టాకు రిజిస్టరులో ఆయా పుస్తకాల కాతాల్లో ఖర్చు వ్రాయాలి. జమవచ్చిన పుస్తకాలుకూడ వెంటనే రిజిస్టరులో జమ వేసుకోవాలి.

అదేవిధంగా 2,3 కాలాలలో ఎప్పటికప్పుడు ఎన్ని కాపీలు వున్నదీకూడ స్టాకు లెక్క తెలుస్తూవుంటుంది. దీనినిబట్టి స్టాకు సరిజూచుకుంటూ వుండాలి. ఈవిధంగా పుస్తకాలమీద వచ్చే కమీషనులో మన షాపు అద్దె, అందులో పనిచేసే కామ్రేడ్ అలవెన్సు, పోస్టేజీ, వగైరా ఖర్చులన్నీ పోను మిగిలినది మనకు షాపుమీదవచ్చే నికరాదాయమన్నమాట.

అవర్జామాదిరిగానే స్టాకు రిజిస్టరుకూడా. ప్రతి పుస్తకానికి ప్రతి నెలాఖరున అన్ని కాలాల మొత్తాలు కూడాలి. ఆమొత్తాలు వచ్చేనెల పేరువ్రాసి ఆయా కాలాలక్రింద వేయాలి. దీనివలన ఏనెల ఎంత స్టాకున్నదీ వగైరా తెలుస్తాయి.

రాష్ట్రకమిటీ నియమించిన కామ్రేడ్సు ఏ సమయంలోవచ్చి తనిఖీచేసినా చిఠా ప్రకారం వుండవలసిన డబ్బు కనబడాలి. వారింతబాకీవున్నారు. వీరింత బదులు తీసుకున్నారు. అనే వ్యవహారాలేమీ వుండకూడదు.

ప్రజాశక్తి ఏజంట్లు

ప్రజాశక్తి ఏజెంట్లుగూడ మామూలు ఎకౌంట్లతో పాటు ప్రజాశక్తి సేల్సు రిజిష్టరు కూడ ఒకటి ప్రత్యేకంగా పెట్టాలి. అందులో పైన చూపిన స్టాకు రిజిష్టరు మాదిరిగానే రూళ్ళువేసుకొని ఏవారం వచ్చిన కాపీలు ఆవారం, జమ వేసుకుని, అమ్ముడు అయిన కాపీలు ఖర్చు వ్రాసుకుంటూ వుండాలి. ఆవిధంగా ఏవారానికావారం ఎన్ని కాపీలు అమ్ముడుపోతున్నాయో ఎన్ని కావలసివస్తాయో స్పష్టంగా తెలిసిపోతూవుంటుంది. వాటిమీద వచ్చే కమీషనుకూడ తెలుస్తూవుంటుంది.

ప్రజాశక్తి ఒక్క కాపీకూడ అరువు అమ్మకూడదనేది మరచిపోకూడదు. ఏ సమయంలోనైనా రాష్ట్రకమిటీ నియమించిన కామ్రేడ్సు తనిఖీకివచ్చినా అమ్మిన పత్రికల డబ్బు చూపాలి.

ఆర్గనైజర్ల బాధ్యత

ఇవన్నీ సరిగా అమలు-జరిగేటట్లు చూసే బాధ్యతంతా ఆర్గనైజర్లమీద వుంటుంది. అందరికంటె ఆర్గనైజర్లు వీటిని ఎక్కువ శ్రద్ధగావధిని అవగాహనం చేసుకుని కామ్రేడ్సుకి అర్థమయేటట్లు చెప్పాలి. వారిచేత ఆవిధంగా ఎకౌంట్లు వ్రాయించి ఎప్పటికప్పుడు తనిఖీచేస్తూ, వారి సందేహాలను తీరుస్తూ, పొరపాట్లను సవరించుతూ ప్రతిపార్టీకమిటీ, ప్రతి ప్రజాసంఘం వీటిని సరిగా అమలు జరిపేటట్లుచూస్తూవుండా

చేయాలి. ప్రతినెలా తమతమ జమాఖర్చుల పట్టీలను, ఆదాయ వ్యయరిపోర్టులను కమిటీలకు పంపేటట్లుచేయాలి. రాష్ట్ర కమిటీ నియమించిన కామ్రేడ్ ఎప్పుడో ఒకప్పు వచ్చి చూడగలదేగాని ఎల్లప్పుడూ వారు సరిగా ఈ సూచనలు అమలు జరుపుతున్నా లేదో చూడలేడు. వారేదైనా సరిగా అర్ధంచేసుకొనక సందేహంతోవున్నా, పొరపా చేసినా తిరిగి రాష్ట్ర కమిటీ నియమించిన కామ్రేడ్స్ వచ్చేటంతవరకు అది అలా వుంటుంది. అలాగాకుండా వారితో నిత్యమూ సంబంధం పెట్టుకునేది ఆర్గనైజర్లేగను వారు ఎకౌంట్లను పరిశీలించుతూ, తప్పులను సరిదిద్దుతూ సక్రమంగా జరిగేలాగ చే గలరు. పార్టీ ఆర్గనైజేషనులో ఎకౌంట్లను సరిగా వుంచడంకూడ ఒక ముఖ్యమై పనిగా ఆర్గనైజర్లు భావించాలి. లేకపోతే పార్టీ ఎకౌంట్లు అరాజకంగానే వుంటాం బోల్షివిక్ పార్టీలో అరాజకం అనేది ఏకోశానా కనబడకూడదు. అలా చేసే బాధ ఆర్గనైజర్లదే.

ఆర్గనైజర్ల విధులు

1. (అ) ఆర్గనైజర్లు పార్టీపత్రికలు, సర్క్యులర్లు, పార్టీలెటర్లు, రిపోర్టులు, ముఖ్యమైన ప్రజాశక్తి, పీపుల్సు పబ్లిషింగుహౌసు ప్రచురణలు క్షుణ్ణంగా చదువుతూఉండాలి. అలాచేస్తేనేగాని పార్టీసభ్యులకు రాజకీయ అనుమానాలను తీర్చుట, వారి రాజకీయ పరి జ్ఞానం అభివృద్ధిజేసే శక్తిని పార్టీ ఆర్గనైజరు సంపాదించలేడు.

(ఆ) వివిధ రంగాల సమస్యలను గూర్చిన ప్రాక్టికలు పరిజ్ఞానం, తన రంగాన్ని గూర్చి పూర్తియైన పరిజ్ఞానం సంపాదించాలి. వాటినిగూర్చిన వ్యవహారజ్ఞానం సంపా దించాలి. అందుకు వాటికి సంబంధించిన పుస్తకాలను చదవాలి. అప్పుడుగాని పార్టీ సభ్యులకు ప్రాక్టికలుగా వచ్చేసమస్యలలో, సరియైనమార్గం చూపించలేడు.

(ఇ, పార్టీ పద్ధతులలో పనిచేయడం, పార్టీశిక్షణ మొదలైన విషయాలలో ఆదర్శంగాఉండాలి.

(ఈ) ఆరోగ్యం కాపాడుకోవడం (సిగిరెట్లు, బీడీలు టీ ఎక్కువగా వాడకుండా వుండటం, వ్యాయామం చెయ్యడం, భోజనం రెగ్యులరుగా తినడం, అవకాశమున్నంత వరకూ రెగ్యులరుగా నిద్రపోవడం), కుటుంబ వ్యవహారాలు (భార్యాపిల్లలు తలిదండ్రులు వర్కర్లు మొదలైన వారితో చక్కగా మెలగడం), మొదలైన వ్యక్తివ్యవహాలలో ఆదర్శంగా ఉండాలి.

పై మూడువిషయాలలోనూ ఆదర్శంగా ఉన్నప్పుడే, పార్టీసభ్యుల యొక్క విశ్వా సాన్ని చూరగొనగలుగుతాడు. నాయకుడుగా తన బాధ్యతలను నిర్వహించగలుగుతాడు.

(2) (అ) పార్టీ సభ్యులతో ఓపికగాఉండాలి. వారు చెప్పేవన్నీ ఓపికతోవిని, వారికి సలహాలివ్వాలిగాని, [illegible] "ఇదెందుకు చేశావు, అదెందుకు చేయలేదు" అని బూర్జువాపార్టీలలోవలె [illegible] త్తనం [illegible].

(ఆ) పార్టీసభ్యులయొక్క వ్యక్తివిషయాలను (ఆరోగ్య [illegible] కుటుంబ సమస్యలను) తెలుసుకొంటూ వా[illegible] సూచనలివ్వాలి. అవి ఎంతవరకూ అమ[illegible] జరుగుతున్నాయో తనిఖీ చేస్తూఉండా[illegible]

3. (అ) పా[illegible]సును ([illegible], ఎకౌంటుబుక్కు) [illegible] చెయ్యాలి.

(ఆ) గోడవార్తా ప[illegible] వడిపేలా చూడాలి.

(ఇ) ప్రజాసంస్థల ఆఫీసులు, వాటికార్యక్రమాన్ని తనిఖీ చెయ్యాలి.

4. (అ) ఆర్గనైజరు గ్రామవ్యవహారాలనుగూర్చి తెలుసుకుంటూ ఉండాలి. అప్పుడుగాని, పార్టీ నినాదాలను కార్యక్రమాన్ని ఆగ్రామంలేక పేటయొక్క ప్రత్యేక పరిస్థితులకు అన్వయించే కార్యక్రమం వేసుకోడానికి సెల్లుకు తోడ్పడలేదు. పార్టీసభ్యులను ప్రాక్టికలు సమస్యలలో నడపలేదు.

(ఆ) పార్టీసభ్యులకు కార్యక్రమం నిర్ణయించడంలో తోడ్పడటమేకాక, అవసరమైతే అక్కడఉండి సమస్యను పరిష్కరించడానికి పార్టీసభ్యులకు ప్రాక్టికలుగా నాయకత్వం వహించి వారిని నడపాలి.

(ఇ) పార్టీసభ్యులలో తనమీదగాని, పైకమిటీమీదగాని ఏమైనా అనుమానాలు ఉన్నవేమో తెలుసుకోవాలి. పార్టీసభ్యులలో ఏమైనా తగవులున్నవేమో తెలుసుకోవాలి. వాటిని పోగొట్టేమార్గాలు ఆలోచించాలి. ఈ విధంగా ఈ అపోహలు ఎప్పటికప్పుడు పోగొట్టుతూ ఉంటే, అవి పెరిగి ఫాక్షనలిజంగా తయారవడానికి అవకాశముండదు.

(ఈ) ప్రతి పార్టీసభ్యుడు పార్టీలెటర్లు, పత్రికలు, ప్రచురణలు వగైరాలన్నీ సరిగా చదువుతున్నాడో లేదో తెలుసుకోవాలి. ప్రతిపార్టీసభ్యుడు రాజకీయంగాను, ప్రాక్టికలుగాను అభివృద్ధి అవుతున్నాడో లేదో తెలుసుకోవాలి.

5. ఆర్గనైజరు పార్టీసభ్యులతోనేగాక, గ్రామాలకు వెళ్ళినప్పుడు ప్రజలతోగూడ ప్రత్యక్ష సంబంధంపెట్టుకోవాలి. ఉపన్యాసాలు ఇవ్వాలి. ప్రజాసమస్యలలో పార్టీసభ్యులతో కలిసి పాల్గోవాలి. ఈవిధంగా ప్రజానాయకులుగాగూడ తయారుగావాలి.

చదవండి

- స్వాతంత్ర్య సంగ్రామం
- సామ్రాజ్యవాదం
- జాతులసమస్య
- భారతకమ్యూనిస్టుపార్టీ నిర్మాణచరిత్ర
- నిర్మాణసమస్యలు
- లెనిన్ పల్లెటూరి పేదలకు
- మన లెనిన్
- ప్రజానాయకుడు స్టాలిన్

END OF
TITLE